సాధన గ్రంథ మండలి - 89.

# సాధన సామగ్రి

## నాలుగవ మూట

(సప్తశతి) దేవీమాహాత్మ్యమందలి చరిత్రత్రయమందు
బ్రహ్మాదికృతస్తుతులు నాలుగిటి మూలమంత్రసహిత
సమగ్ర వ్యాఖ్య.

★

వ్యాఖ్యాత:
శ్రీ శ్రియానందసాధకుడు
ఈశ్వర సత్యనారాయణశర్మ
శ్రీ కాశీవాసి.

1531 201

ప్రకాశకులు:
సాధన గ్రంథ మండలి, తెనాలి.

కాపీరైటు]

***

[వెల: రు. 4—00

సాధన గ్రంథ మండలి - ౪౫.

# సాధన సామగ్రి

## నాలుగవ మూట

(సప్తశతి) దేవీమాహాత్మ్యమందలి చరిత్రత్రయమందు
బ్రహ్మాదికృతస్తుతులు నాలుగిటి మూలమంత్రసహిత
సమగ్ర వ్యాఖ్య.

★

వ్యాఖ్యాత:
శ్రీ శ్రీయానందనాథుడు
ఈశ్వర సత్యనారాయణశర్మ
శ్రీకాకుళవాసి.

ప్రకాశకులు:
సాధన గ్రంథ మండలి, తెనాలి.

కాపీరైటు] *** [వెల: రు. 4=00

తొలిముద్రణ
1964

Acc. No: 8042

*
* *

జానకిరాం ప్రెస్,
తెనాలి.

'సరసకవి' 'సాహిత్యరత్న'
శ్రీ మోచర్ల రామకృష్ణయ్యగారు
అధివక్త.
"కవితా నికేతనము" అత్తిత్తోట అగ్రహారము, నెల్లూరు.
19-12-1964

# పూజాపుష్పము.

జగన్మాత యనుగ్రహమునకుఁ బాత్రుల మగుటకు దేనిని మనము చేకూర్చుకొనవలయునో, ఆ సాధన సామగ్రి నంతయు నాల్గుమూటలుగాఁ గట్టి మన కందించిన శ్రీశ్రీ శ్రీయానంద నాథులు మహానుభావులు. అమ్మతో ముచ్చటలాడఁగలిగిన పరదేవతా ప్రసాద సంపన్నులు. వారి గ్రంథములఁ జదివి, యందలి రహస్యములను గుర్తించు శక్తియుఁ బరమార్థలాభము వడయు భాగధేయమును ఇప్పుడు కాకపోయినను రానున్న జన్మమునందైనను లభింపకుండునా యని వేచియున్న మాదృశులు శ్రీవారి రచనములంగూర్చి యభిప్రాయ మీయఁబూనుకొనుట అపచారమగును. నా యందలి శ్రీయానందనాథుల వాత్సల్యమో యన 'సాధన సామగ్రి' సంపుటములు నాచేరువకు రాఁగా, నే నా యుద్గ్రంథములఁ జదివినప్పుడు నా కొదవిన యానందమే యీ యక్షరాకృతి నొందినది.

'సాధన సామగ్రి' నాలుగవమూట నెత్తికొని చూడ సాగినతోడనే, దాని యెనిమిదవ పుటలో నాకు యోగనిద్రాదేవి సాక్షాత్కరించినది.

"తుష్టావ యోగనిద్రాం తా మేకాగ్ర హృదయస్థితః
విబోధనార్థాయ హరే ర్హరినేత్రకృతాలయామ్ ।
విశ్వేశ్వరీం జగద్ధాత్రీం స్థితిసంహారకారిణీం
నిద్రాం భగవతీం విష్ణో రతులాం తేజసః ప్రభుః॥

నాకీమె చూపట్టిన వెనువెంటనే శ్రీమత్పరమహంస పరిపూర్ణానందనాథుల "లక్ష్మీశృంగార కుసుమమంజరి" లోని ఆద్యశ్లోకము నా స్మృతిపథమునకు వచ్చినది. ఆ శ్లోకమునకు మా సాహిత్యగురువర్యులు కీర్తిశేషులు బ్రహ్మశ్రీ దుర్భా సుబ్రహ్మణ్యశర్మగారు వెలయించిన హృద్య పద్యానువాదమును స్మరించితిని. దానిని ఈ దిగువ పొందుపఱచుచున్నాను.

"అమృత సరస్వదంతరవటాగపలాశపుటమ్మునన్ జగ
త్క్రమ రచనాదిచే నలసి కమ్మఁ బరున్నవిభున్ విలోచనాం
తమ్ముల స్పృశించుచున్ స్వలలితమ్ముల సెవ్వతె ప్రీతుఁజేయు న
య్యమలిన యోగనిద్ర భవహారివినిద్ర సమాశ్రయించెదన్."

'హరినేత్ర కృతాలయాం' అని వర్ణింపఁబడిన యోగనిద్రను గూర్చిన వివరణము, ప్రాణశక్తిరూప విష్ణుప్రస్తావము, మధుకైటభ వినాశ వివేకము — ఇవి యిట్లు ప్రపంచింపఁ జేసిన శ్రీయానందనాథస్వాముల యార్షప్రజ్ఞకు అంజలి వట్టితిని. త్రిమాత్రా స్వరూపముతో జగద్రూపగా, అర్ధమాత్రా రూపముతో పరాజననిగా వెలయు దేవియొక్క తత్త్వమును ఆవిష్కరించిన శ్రీవారి మహిమకు అబ్బురపడితిని. ఆగమసూక్తులతో శాక్తాద్వైతమును సమన్వయింపఁ జేసి భక్తులగు చదువరులకు జ్ఞాననిధులు నెఱచూఱలిచ్చిన వారి యగణ్యకారుణ్యమునకు జోహారులర్పించితిని. ఒకనికి భగవద్ధర్మమం దధికారము కల్గుటకు

అతఁడు రసికుఁడును భావుకుఁడును గావలయు నను భాగవత ప్రమాణమును బయల్పఱచి సాధకులకుఁ గనువిప్పు కల్పించిన యా మంత్రమూర్తికిఁ బ్రణమిల్లితిని.

ఈ 'సాధన సామగ్రిని' తమ సొమ్ముగాఁ జేసికొన్నవారు అమర్త్యులగుదురు; సంశయము లేదు. నిర్భయులగుదురు; ఆనంద సముద్ర తరంగములలో నుయ్యాల లూగుదురు.

మఱి యిప్పు డీ పూజాపుష్పము సమర్పించుటకు నా కవకాశము కలిగించిన మహనీయులకు నమస్కరించి విరమించుట తప్ప నేఁ జేయఁగల్గినది ఏమున్నది?

ఓం తత్సత్.

| | |
|---|---|
| నెల్లూరు | సాధకుఁడు |
| క్రోధి-మార్గశీర్ష-శుక్లపూర్ణిమ. | మోచర్ల రామకృష్ణయ్య |

శ్రీమాత్రే నమః.

ఓం నమశ్చండికాయై.

# పాఠకులకు నా మనవి.

అమ్మ వ్రాయించిన "సాధన సామగ్రి" మూటల వరుసను నాలవమూట యిది. ఇందలి సరకులు న్యాయముగా నమ్మూడు మూటల తుదలను జేరియుండవలసినదే, కాని పూర్ణసప్తశతకి మూలమంత్ర సమగ్రవ్యాఖ్యలతో యథాస్థితముగా నచ్చున వేయఁజాలమికిఁ గారణములను దొలుమూట మొదటనే విన్నవించి కొంటిని.

ఈ స్తుతులు బ్రహ్మాదులు చేసినవి నాలుగు. ఉత్తమ చరిత్ర మనెడి శుంభాసుర వధాంతమున (అస్మితా నాశము తర్వాత) దేవగణము చేసిన నారాయణీస్తుత్యంతము వాక్యములు – స్నేహమయి, అమ్మగారు ముద్దుబిడ్డలయెడనైన విశిష్ట స్నేహముతోఁ దన మధుమయాననాబ్జమునుండి వినిచిన యభయ వరదానవాక్యములు ముప్పది శ్లోకమంత్రములుగా నుగ్గడించినది. అవి చదివికొన్నప్పుడే శ్రీమాత యవ్యాజకరుణ, ప్రేమమయత, స్నేహమయత, మధుమయత తేఁటపడును.

"నా చరిత్రములను శాస్త్రోక్త నియమబద్ధులై పారాయణము చేయ నశక్తులైన నా భక్తులు నా చరిత్రత్రయమందు బ్రహ్మశక్రాదులు చేసిన స్తుతి పాఠశ్రవణములతో నన్ను సంతోషపెట్టునపుడు, వారి నన్ని విధముల సంరక్షింతు"ననిన యా ఫలశ్రుతివాక్యములు చదివికొన్నంతనే యెట్టి సాధకుఁడును ప్రాణపణము పెట్టి నిత్యము చదువుటో, చదివించి వినుటో

వ్రతముగాఁ గొనకుండఁజాలఁడు. వాని సమగ్రవివరణము జదివి కొన్నపుడు శ్రీమాతృ (ఆత్మ) తత్త్వబోధమునకై యెవ్వరి గుంబముకడను జేసాఁపనక్కఱలేదు. ఎంత తృప్తి, ఎంత యాశ సాధకహృదయమున నిండునో నేను వ్రాయుటకంటెఁ జదువరులు చదివి గ్రహించి సమాధాన పడవలసినదే!

మూఁడవ మాటగా వెలువడవలసిన యుత్తమచరిత్ర మండలి సాధన సామగ్రిని, ఎత్తి వ్రాసి గ్రంథప్రకాశకులకుఁ జేర్చుపనికి, ఆరోగ్యస్థితి యప్పటి కొప్పకుండుటచేతను, వ్యాఖ్యా సహిత స్తుతులమాట సంసిద్ధముగా నుండుటచేతను, ఈ నాలవ మాట వెల్వరింత యవశ్యమైనది.

ఇమ్మాట ననుశీలించి యవ్యాజస్నేహముతో పూజా పుష్పము నంపిన సాధకపండితోత్తములు "సరసకవి, సాహిత్య రత్న, కవిశేఖర" బ్రహ్మశ్రీ మోచర్ల రామకృష్ణయ్యగారికిఁ గృతజ్ఞతాపూర్వక నతిశతములు. ఈ నాలవమాట వెలువరించు నా పూన్కి నెఱింగి యయాచితముగా నిష్కపటభక్తితో ధనమునిచ్చిన ప్రియశిష్యులు —

1. చి॥ పోతా సియారామ్, డి. మేరాపూర్ నివాసి. యిచ్చిన రు. 300/-

2. చి॥ అరిపిరాల వెంకట సోమాచార్యులుగారు, (అసిస్టెంట్ ఇంజనీరు, పార్వతీపురం) ఇచ్చిన రు. 100/-

శ్రీమాత్రాజ్ఞగా నందుకొని, అమ్మా! యజ్ఞేశ్వరివి, నీ ప్రీతి నార్జించుటకై యీ ద్రవ్యయజ్ఞముతో నిన్ను సేవించు

వీరినిఁ గరుణాసాగరస్నాతుల నొనర్చి పరిపూతులనుజేసి నీ పవిత్రాంకమునఁజేర్చి యుంచుకొమ్మని యమ్మను వేడికొం చుందును.

సాధన గ్రంథ మండలి పక్షమునఁ బ్రకటింపఁ గోరి మండలివృద్ధి నుద్దేశించియే యథాశక్తి ముద్రణావ్యయములతో నా పంపిన గ్రంథములను బ్రకాశింపఁజేయుట తమ పనిగా నెంచి శ్రమఁగొని నన్ను ధన్యునిఁజేయుచున్న మండలి వ్యవస్థాపకులు, విద్వాన్, శ్రీ. చి॥ బులుసు సూర్యప్రకాశశాస్త్రిలు నిరంత రము శ్రీమాతృకృపావీక్షతో వర్ధిల్లుచు, గ్రంథమండలి నామ మును సార్థకము జేయఁగల యథార్థ సాధన గ్రంథజాలమును బ్రకటించు నైశ్వర్యమును మహామాయానుభావమున నొందు చుందురు గాతమని యాశాసించుచున్నాను.

ఇఁక నింతలోనే వెలువడు మూడవ మూటయందుఁ బ్రాణప్రతిష్ఠా సాధనము - విష్ణుగ్రంథి భేదము - ప్రారబ్ధ క్షయము అనువానికైన సాధనోపాయములు ప్రధాన విష యము. అది యనతికాలములోనే వెలువడ సాధక పండితా శీర్వాదము నపేక్షించుచున్న —

| | |
|---|---|
| శ్రీకాకుళము, | శాక్తబంధుఁడు |
| క్రోధి సం. మార్గశిరము | శ్రీ శ్రియానందనాథుఁడు, బుధవిధేయుఁడు, |
| 17-12-1964 | ఈశ్వర సత్యనారాయణశర్మ |

# కృతజ్ఞతాంజలి.

పురమథన పుణ్యకోటీ పుంజితకవిలోకసూక్తి రసధాటీ !
మనసి మమ కామకోటీ విహరతు కరుణావిపాకపరిపాటీ !

అమ్మవిషయమై యొకమాట – ఆ యమ్మ ప్రేరేపించిన బుద్ధియం దూహించి, అమ్మ పాదములయందే పూజాసక్తమై యుండు హస్తముతో వ్రాయఁగా నా మాట రతనాలమాట యేలకాదు ? ఇట్టి మాటలు రెండైనవి. ఇది నాలగవది (ప్రకటన వరుసలో). ఈ నాలగవమాట 1, 2, 3 మాటలకు తలమానికము వంటిది. ఈ మాటలు సాధన గ్రంథములఁ బ్రచురించు మా మండలికి వెలుఁగుబాటలైనవి. అడుగిడఁజాలని బడుగుపై నమృతంపు జల్లులైనవి. మా మండలి నేడు పుష్టమైనది. సాధకపవిత్రలోకము తుష్టమైనది. ఇట్టి గ్రంథములు తనయందు వెలువడుటచే నాంధ్రభాషామతల్లి విశిష్టయైనది. పూజ్యులు, సద్గురువర్యులు, బ్రహ్మశ్రీ శ్రీ శ్రీయానందనాథులు విశేషాదరముతో నీ రత్నమంజూషలను శక్తికొలది ముద్రణవ్యయముతో మా మండలి కొసఁగినారు.

శ్రీవారి యాదరమునఁ దోఁగి మండలి ఆలోకవీథులఁ బయనింపఁగల్గినందులకు మండలి, మండలి వ్యవస్థాపకుఁడుగా నేను – వారి శ్రీచరణరాజీవములకుఁ బునః పునః ప్రణామము లాచరించుటదక్క – యన్య మాచరింపఁజాలను.

క్రోధి మార్గశిరము
తెనాలి
1964

బులుసు సూర్యప్రకాశశాస్త్రి
వ్యవస్థాపకుఁడు :
సాధన గ్రంథ మండలి,

# శ్రీమాత కిది యంకితము.

ఈం కారవాచ్య! ఐం హ్రీం
క్లీం కమనీయాంగి! ఇత్తుఁ గృతి నీకే; కొ
మ్మోంకృతితో; నీ యమృత మ
యాంకమ్మునఁ జోటు నుంచుమా! చాముండా!

శ్రీకర శ్రీకరమ్మునఁ ద్రిపుటి బోధ
మును సడల్చు త్రిశూలముఁ బూని, మహిష
నామక రజోగుణప్రవినాశిని వగు
నమ్మ, విమ్మాటలెల్ల నీ కచ్చుకొందు.

ఏయమ, అబ్బి! వ్రాయుమని యీ పరమార్థ రహస్యబోధముల్
వ్రాయఁగ నెన్మిదేండ్లు పనిపట్టఁగఁ గట్టడచేసె, నమ్మహా
మాయవు, నాత్మవున్, సకలమాతవు; నీ కృతులెల్ల నిత్తు నీ
కే; యవి యందుకోఁదగు మహేశ్వరి! యష్వాలు లాఁతులెవ్వరే?

తిరముగ నాత్మదృష్టులు త్వదీయముఖమ్మున నిల్పు సాధనన్
బొరపడనట్టి నీ ప్రియతనూజులు నాకవరుల్ పవిత్రు లీ
సరకుల దారిబత్తెముగ, జన్మరుజాపహ శర్మదౌషధో
త్కరముల పైఁడిసంచికలుగాఁగని సద్గతిగాంత్రు, చండికా!

తల్లితనమ్ముఁ జూపి, యిడి ధన్యునిఁ జేసితి; చూచి యిచ్చితిన్
ముల్లెలు మళ్లి నీకె; ప్రియపుత్త్రిల కంటను బెట్టు బర్వు, నా
వల్లనుగాదు మోయను; సదుపాయము చూడుము నీవె; యాఢ్యులౌ
పిల్లలు కొల్లగాఁ గలరు; పేదఱికమ్మెటు నీకు? శ్రీమతీ!

— శ్రీ శ్రీయానందనాథుఁడు.

# వి ష య సూ చి క

పేజీ


1. ప్రథమఖండమందు బ్రహ్మకృత దేవీస్తుతి 1

2. మహిషాసుర వధానంతరము శక్రాదికృతస్తుతి 60

3. శుంభాసుర నిధనమునుగోరిన దేవతలు చేసిన స్తుతి 169

4. శుంభవధానంతరము దేవకృత దేవీస్తుతి 254
(నారాయణీ స్తుతి)

5. దేవీమాహాత్మ్యము - రుద్రగ్రంథి భేదము - ఫలశ్రుతి 333

6. నాలుగు స్తుతుల మూలము. 370


* *
*

జయ దుర్గే! అపవర్గదాయిని!

శ్లో॥ దుర్గే స్మృతా హరసి భీతి మశేష జంతోః
స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి,
దారిద్ర్యదుఃఖ భయహారిణి కా త్వదన్యా
సర్వోపకారకరణాయ సదార్ద్రచిత్తా॥

గ్రంథకర్త:

శ్రీ శ్రియానంద నాథుఁడు

**ఈశ్వర సత్యనారాయణ శర్మ**

శ్రీమాత్రే నమః

# సాధన సామగ్రి

## నాలుగవ మూట.

### ప్రథమఖండమందు బ్రహ్మకృత దేవీస్తుతి.

ప్రలయకాలమందు జగత్తు ఏకార్ణవీకృత మైనపుడు, ప్రభువు భగవంతుఁడు నైన విష్ణుఁడు శేషశయ్యపై యోగ నిద్రను సేవించుచుండెను. అపుడు మధువు, కైటభుఁడు అనెడి పేళ్లతో నిరువురు ఘోరాసురులు, విష్ణుని చెవి గులిమివలనఁ బుట్టినవారు బ్రహ్మను జంపఁగడఁగిరి.

దీని వెనుకటిమంత్రమందు మేధసమహర్షి, మహామాయ నిత్యయయ్యును దేవకార్యసిద్ధికై విశిష్టరూపముతో నావిర్భ వించునపుడు 'ఉత్పన్నా' యని ప్రసిద్ధ, యని చెప్పెను. ఇపు డామె దేవకార్యసిద్ధికైన విశిష్టావిర్భావమును వర్ణించు చున్నాఁడు.

ఇక్కడనుండియే దేవీమాహాత్మ్యవర్ణనము మొదలు.

కల్పాంత మనఁగాఁ బ్రలయకాలము. సృష్టిబీజములు బ్రహ్మమందు లీనమైపోయినపుడు జగత్తుండదు. ఏకార్ణవీకృత మగును. జగత్తనెడి కార్యసమష్టి పరమకారణమందు లీన మగుట - అనఁగా నిది కారణీభావము నొందుటపేరే యేకా ర్ణవము. ఋగ్వేదమందుఁ జెప్పఁబడిన సృష్టితత్త్వమందు 'సముద్రము, అర్ణవము' అను రెండిటి సృష్టులమాట కలదు. ఈ రెండును నొక్క యర్థము నిచ్చు మాటలేయైనను ఒకటి

కార్యమును, రెండవది కారణమును దెల్పును. మఱ్ఱి విత్తు, కాఁబోవు మఱ్ఱిచెట్టుయొక్క పూర్వావస్థ యైనటులే, జగత్తనెడి యశ్వత్థవృక్షపు బీజము – కర్మసంస్కారసమూహము, బ్రహ్మ మనెడి పరమకారణమందు నిల్చియుండును. అపుడే కల్పాన్త కాలమనుపేరఁ బ్రసిద్ధమగును. ఇట్టివేళ శుద్ధచైతన్యము తక్క మఱేమియు ననుభవమునకు రాదు. కనుక దీనినే యేకార్ణవ మని, కారణసముద్రమని యందురు.

ఇక్కల్పాన్తకాలమందు విష్ణువు యోగనిద్రారాధన చేయును. విష్ణువనఁగా జగద్వ్యాపక చిచ్ఛక్తియే. దేనియందు జగత్తు నిల్చియున్నదో, ఏ చైతన్యము జగత్తనెడి ప్రతీతితో విశిష్టమో దాని పేరే విష్ణువు. సాధనక్షేత్రమం దిది ప్రాణ మను పేరితోఁ జెప్పఁబడును. శ్రుతియు – "ఈ సమస్తజగత్తును బ్రాణమే ధరించినది. అదే భగవంతుఁడు" అనెను. "ఉత్పత్తిం ప్రలయంచైవ భూతానా మాగతిం గతిం । వేత్తి విద్యా మవి ద్యాం చ స వాచ్యో భగవానితి॥" "ప్రాణుల యుత్పత్తియు, ఆగమమును, నిర్గమమును, విద్యయు, అవిద్యయు నను నీ విష యము లెవ్వనికి బాగుగాఁ దెలియునో యతఁడే భగవంతుఁడు;" విష్ణుని మఱియొక పేరు. ప్రభువు – అనఁగా స్వాధీనుఁడు; స్వతం త్రముగాఁ దన యిచ్ఛాశక్తిని నడుపఁగలవాఁడు. "కర్తు మకర్తు మన్యథా కర్తుం వా సమర్థః ప్రభుః" అమ్మ యితనికి యిచ్ఛా మాత్రమున సర్వసంకల్పములు సిద్ధింపగలంత యధికార మిచ్చి నది. కనుక నితఁడు ప్రభువు. సరే; అతఁడేమి కానీ; జగత్తుండ నపుడు జగద్వ్యాపకచైతన్యము (ప్రాణము) ఏవిధముగా నిల్చి యుండును? అనుదానికి సమాధానముగానే "శేషమాస్తీర్య"

అపుడు ప్రాణము అవశేషామృతము నాస్తరణముగాఁ జేసికొని - అనఁగా మున్ముందు కాఁబోవు జగత్తుయొక్క బీజములను శయ్యారూపమునఁ గల్పించుకొని (అధఃకృత మొనర్చుకొని) అనఁగా దనలోనే ప్రలీనముచేసికొని యోగనిద్రను సేవించును.

యోగమనఁగా నిచటఁ బరమాత్మమిలనభావము. అట్టి వేళ జగద్భావము సుప్తమైయుండును. జగద్వ్యవహారపక్షమున నిది నిద్రవంటిది. జగద్వ్యాపకుఁడుగా,సదా యుండెడి యా విష్ణుఁడు, జగత్తు లేకుంటచేఁ దన వ్యాపకత్వము, ప్రభుత్వము, భగవత్త్వము మున్నగువానిని విస్మృతిగర్భమందు ముంచివేసి తామసీ నిద్రారూపిణి మహామాయ యొడియందు నిద్రించును. ఇదెట్లు కాఁగలదు ? — ఒక్క యోగమువల్లనే సంభవము. పరమాత్మభావమునందుఁ దన విశిష్టభావమును జేర్చివేయుటే యోగము. ఈ యోగము సుసిద్ధమైనపుడే జగద్వ్యవహారము నందు నిద్ర (సుప్తభావము) యగును. ఇది యొక యపూర్వ మధుమయావస్థ. ప్రలయకాలమందు భగవంతుఁడు విష్ణుఁడు, ఈ యోగనిద్రారూపిణియైన మహామాయను భజించును. ఎవ్వఁ డెవ్వరిని భజించునో, వాఁడు వారి సారూప్యము నొందును. ఇది సర్వవిజ్ఞానసమ్మత తత్త్వము; కనుక నీయవస్థయందు విష్ణునకు మఱి స్వతంత్రత యుండదు. "నేను విష్ణుఁడ" ననెడి ప్రతీతి యుండదు. అట్టియపుడు యోగనిద్రారూపిణియైన యమ్మ సత్తయే తోఁచును.

విష్ణుకర్ణ శబ్దార్థము - వ్యాపకచిదాకాశము. శబ్దగుణాత్మ కాకాశమును దెలుపుటకే కర్ణశబ్దమును, వ్యాపకత్వమును

దెలుపుటకే విష్ణుశబ్దమును బ్రయోగింపఁబడినవి. మల శబ్దార్థము ఆవరకము. నిర్మల శుద్ధచిదాకాశమునకు ఆవరణ స్వరూపమని, మధుకైటభులను విష్ణుకర్ణమలోద్భూతు లనెను. మధు శబ్దార్థము ఆనందము; కైటభ శబ్దార్థము బహుత్వము. "కీటవద్భాతీతి కీటభః తస్యభావః కైటభః" చిన్న చిన్న కీటము లొక్కచోటఁ జేరుకొని తమ తమ శక్తికొలఁది స్పందనధర్మమును జూపుచు, నొకచోట బహుత్వమును దెలుపునటులే, సంచితకర్మ బీజ సమూహము, ఒక్కసారి యనేక భావముల పరిజ్ఞాపనము చేయును; గనుక బహుత్వ బీజములే కైటభనామముతోఁ బ్రసిద్ధము. మొత్తపుమాట యేమనఁగా "ఏకోఽహం బహుస్యామ్" అను నీ రెండు సంస్కారముల పేరే మధు కైటభులు.

ఇపుడు మనము యథార్థసాధన యుద్ధక్షేత్రమందుఁ జేరికొంటిమి. ఇక్కడనుండియే దేవీమాహాత్మ్యము, దేవి యావిర్భావము, దేవకార్యసిద్ధి, అసుర నిధనము మున్నగు లోకాతీత ఘటనముల వైచిత్ర్యమునందుఁ బడుదుము. సాధకా! రమ్మ; నెమ్మదిగా ముందడుగు వేయుము. అతి గహనమైన రహస్యము. అమ్మా! బుద్ధిబలము నిమ్మ. నీవు మాయెదుట విజ్ఞానమయమూర్తితో నిల్వుము. అతి గంభీరరహస్యములతోఁ గూడిన యీ సాధన తత్త్వములను వెల్లడింపుము. మేము ధన్యుల మగుదుము గాక. నీ జగత్తు, నీప్రియతమ సంతానము, ఈ సమస్యయందు మఱుఁగుపడియున్న యమృతపాత్రమును గైకొని యమరమగుఁ గాక, ఈ బ్రహ్మర్షి దేశమందు మఱల నింటింటను బ్రహ్మర్షులు విరాజిల్లుదురు గాక.

జీవాత్ముఁడు సమాధి సహాయముతో శుద్ధబోధమ నెడి గురుసన్నిధిని మహామాయా స్వరూపస్వభావముల నెఱింగికొని, యామె విశిష్టావిర్భావమును గార్యములను బ్రత్యక్షము చేసి కొనుటకై వ్యాకులుఁడై యపేక్షించుచున్నాఁడు. సమాధిస్థుడైనచో నీ సర్వతత్త్వములును దెలిసిపోవును. సాధకా! మఱువకుమా – ఇది సవికల్పసమాధి. కీలకవ్యాఖ్యయందుఁ జెప్పఁబడినది – కృష్ణాష్టమి – మనస్సుయొక్క, అర్థభాగలయావస్థతోఁ గృష్ణచతుర్దశి – ఒక్క కళ మిగులువఱకు నగు సమాహితావస్థ యందు, ఈ సర్వతత్త్వములును వికసించుచుండును. సాధకుఁ డీ విధముగా సమాధిస్థుఁడై కాతరప్రాణముతో వ్యాకుల హృదయమందు మాత్రావిర్భావమును, మాయావిశిష్ట కార్యములను విశిష్టస్నేహమును బ్రత్యక్షము చేసికొనుటకై యపేక్షించుచుండునపుడు, రేవగళ్లు తనను జంచలునిఁగాఁ జేయుచున్న జగద్భావములు, అమ్మ కృపచే మఱి తల యెత్తకుండుటను గనుగొనును. జగద్బీజము – సంసారముయొక్క అస్తిత్వము (ఉన్నదనుమాట) ఇంచుకంత ప్రతీతమగుచుండును గాని, దాని విశిష్టస్వరూపానుభవము కాదు. ఎదుట అతిఘనమును, అతిశుభ్రమును, స్వప్రకాశమైన మహావ్యోమమే ప్రత్యక్షమగుచుండును. దీనిపేరే కల్పాన్తకాలము; జగత్తుయొక్క యేకార్ణవీ భావము. శేషశయ్యపై విష్ణుని యోగనిద్ర. ఈ యవస్థయందుఁ జేరుకొన్నపై నగునట్టి హద్దులేని యానందసంభోగము నెడ, సాధకుఁడు కొన్నాళ్లు ముగ్ధుఁడగును. ఏవిధమైన విశిష్టేచ్ఛయు రేకెత్తఁజాలదు. అట్టి యవస్థయందు క్షణముండి జాఱిపోవును. మఱల జగద్భావమునందు దిగిపోవును. అపుడు కడు

దుఃఖమగును. ఆ యానందస్థితిని దలంచుకొని బాధపడునపుడు మఱింత దీనుండై, అమ్మా! అమ్మా! యని యఱచుచుండును. శ్రీగురుచరణములను మఱింత గట్టిగాఁ బట్టుకొనును. దాని ఫలముగా సౌభాగ్యవంతుఁడైన జీవుఁడు, అమ్మ కృపచే మును జెప్పిన యానందావస్థయందు మఱికొంతసేపు నిల్వఁగల్గు సామర్థ్యము నొందును. అపుడతఁడు "మధుమయక్షేత్రమైన అమ్మయొడినుండి నేనేల జాఱిపోయితి" నని తెలిసికొనఁ గోరును. మఱియు, "అమ్మా! నన్నెవ్వ రిచ్చటినుండి లాఁగివేసి, మఱల జగద్భావమందు ముగ్ధునొనర్చిరో, చెప్పి చూపవా?" యని వేడుకొనును. అప్పు డమ్మ కృపచే, ఆ నిర్మల శుభ్ర చిదాకాశ క్షేత్రమందు, మల - ఆవరక స్వరూపములైన రెండు సంస్కారములు తల సూపుట కనుగొనును. ఒకటి విశిష్టానందము, రెండవది బహుభావేచ్ఛ. ఇవే విష్ణుకర్ణ మలోద్భూతులైన (విష్ణుని చెవి గులిమివలనఁ బుట్టిన) మధుకైటభులు. ఇవే బహుభావేచ్ఛామూలకమైన యానందము పరమాత్మయొక్క స్వరూపానందము. కనుక నిది విశిష్టానంద మనఁబడును. అగుఁగాక; అహంబోధాత్మకానందమును, బహుభావేచ్ఛయు ననెడి యీ రెండును విడవేయరాని సంస్కారములు. అవే సాధక కైవల్యమునకు విరోధులు; కావున నివి ఘోరాసురు లనఁబడెను. వీరు బ్రహ్మను జయింపఁగడఁగిరి. ఏమన వీరి దర్శనమైన యవస్థయందు, బ్రహ్మ (సృష్టిశక్తి - మనస్సు) విష్ణుని (ప్రాణశక్తి యొడిలో నిశ్చలముగా నుండెను. అనఁగా, నించుమించు

నిష్క్రియావస్థయందుండెను. పరమాత్మతోఁ గూడి యుండుటే బ్రతుకు. దానినుండి విముఖుఁడగుటే చావు. ఆ సమయమును బట్టి మనస్సు నిష్క్రియమైయున్నను, అప్పుడును మనస్సు, నాభి – మణిపురచక్ర సంబంధమును బూర్తిగా విడువఁజాలదయ్యెఁ గనుక నా రెండుసంస్కారములును మనస్సును మఱలఁ గ్రియాశీలమునుగాఁ జేయుటచే జగదాకారముగా నాకారితమగుటకై యులుకుచుండును. ఇదే మధుకైటభులు బ్రహ్మను జంపఁగడఁగుట.

అమ్మ కృపచే సాధకుఁ డీ మూలసంస్కారములను సాక్షాత్కరించుకొనును (అనుభవించును). నోరితో నెన్ని సారులన్నను వాని యనుభవము కాదు. మాయాకేంద్ర మెచటనున్నదో, యది యీ స్థానమందు మధుకైటభుల దర్శనముచే, దెలియఁగలరు. మున్ను "బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి" అని చెప్పఁబడెను. ఆ బలపూర్వకాకర్షణము, ఈ కేంద్రమునుండియే మొదలగును. ఇచ్చటనే యజేయులైన యసురు లున్నారు. మన యమ్మ యొడిలో నిత్యము నుండకుండఁ జేయు ప్రధాన విఘ్నములు. 'నేను' అనేకమగుదునని, అనేకవిధముల నానందోపభోగము చేయుదునని కోరితిని. ఆ కోరిక పరమేశ్వరభావముదే; గాన నది యమోఘము. ఆ యిచ్ఛను హృదయమున ధరించి, యమ్మ తన స్వాధీనేచ్ఛతో స్వాధీనానందముతో నసంఖ్యయోని భ్రమణము చేసినది. బహుకాల మిటు లనేక జన్మములందిరిగి యొక్కసారి, యమ్మ యొడిజాఁడ నెఱింగినచో – నిర్మల పరమాత్మ స్వరూపాభాసము నొందినచో, ఆ బహుత్వమును,

ఎప్పటికప్పుడు నశించు నానందమును ప్రీతినిగలిగింపవు; సరిగదా, బహుకటువులుగాఁ దోఁచును. అపుడే మధుకైటభ వధమునకు సూత్రపాత మగును.

"స నాభికమలే విష్ణోః స్థితో బ్రహ్మా ప్రజాపతిః ।
దృష్ట్వా తావసురౌ చోగ్రౌ ప్రసుప్తంచ జనార్దనమ్॥

తుష్టావ యోగనిద్రాం తామేకాగ్రహృదయస్థితః ।
విబోధనార్థాయ హరే ర్హరినేత్రకృతాలయామ్॥

విశ్వేశ్వరీం జగద్ధాత్రీం స్థితిసంహారకారిణీం ।
నిద్రాం భగవతీం విష్ణో రతులాం తేజసః ప్రభుః॥"

విష్ణుని బొడ్డుతామరయం దున్నట్టియు, ప్రజాపతి యైనట్టియు, తేజఃపతి యైనట్టియు బ్రహ్మ అత్యుగ్రులైన యయ్యుభయుర నసురులను, నిద్రితుఁడైన జనార్దనునిం జూచి, హరి నిద్రాభంగ మొనర్చుటకై, హరినేత్రకృతాలయయు, విశ్వేశ్వరియు, జగద్ధాత్రియు, స్థితిసంహారకారిణియు, భగవతియు, అతులనీయయు, విష్ణు నిద్రారూపిణియు నైన యా యోగనిద్రను, ఏకాగ్రచిత్తముతో స్తుతించెను.

వివరణము:- మధుకైటభులు విష్ణుని నాభికమలమందున్న బ్రహ్మను జయింపఁగడఁగిరి. అనఁగా మును జెప్పిన ప్రధానసంస్కారములు రెండును, ప్రాణశక్తి యొడియందు నిరోధించిన మనస్సును మఱల జగద్వ్యాపారమం దున్ముఖము చేయఁగడఁగెను. మనస్సు, ఆ రెండు వ్యాపారములను నుచ్ఛేదించు కోరికతోఁ ప్రాణశక్తికి శరణు చొచ్చి, ప్రాణము

యోగనిద్రచేఁ గ్రస్తుఁబడుటఁగాంచెను. జగద్వ్యాపారమునుండి బహిర్ముఖమయ్యెను. అప్పు డా యవస్థయందు మఱల మేలుఁ గించుటకై యోగనిద్రకు శరణాగతుఁడయ్యెను. యోగనిద్రా రూపిణియైన యే మహామాయ ప్రాణశక్తిని జగద్వ్యాపారము నుండి విముఖ మొనర్చినదో, సృష్టిస్థితి సంహారకారిణియైన యా మహామాయయొక్క విశిష్టావిర్భావమును గోరి దీనముగా ప్రార్థించెను. ఇది యిందలి యాధ్యాత్మిక రహస్యము.

ఈ మంత్రమందు యోగనిద్ర కొక విశేషణ మున్నది. "హరినేత్రకృతాలయా" హరి అనఁగా విష్ణువు – ప్రాణశక్తి. సర్వభావములను హరించునది గాన, దీని పేరు హరి. ఛాందోగ్యోపనిషత్తునందు, ప్రాణోపాసన ప్రస్తావమున, ప్రాణమే సర్వ భావ విలయకారి – జగద్గ్రాసకారి యని చెప్పబడెను. వాస్తవ ముగా నిది ప్రత్యక్షమే. జ్ఞానేంద్రియప్రవాహమేకానీ, కర్మేం ద్రియప్రవాహమేకానీ, ప్రాణాది పంచవాయుప్రవాహమేకానీ, జననమరణాది పరివర్తనప్రవాహమేకానీ, సర్వమును ప్రాణ శక్తి నాశ్రయించియే వెలయును; ప్రలీన మగును; గానఁ ప్రాణమే హరి. జీవుఁ డీ ప్రాణశక్తిసంధానము నొందనంత దాఁకఁ – ప్రాణమునే హరి యని, హరినే ప్రాణమని తెలియ నంతదాఁక, తాను ప్రాణప్రతిష్ఠితుఁడు కాఁజాలనంతదాఁక, గురుని ప్రాణమునందుఁ దన ప్రాణమును జేర్పనంతదాఁక, ఆకాశము బ్రద్దలగునట్లు హరినామము నుచ్చరించినను, వాని కమరత్వము, అమరపదసంధానము లభింపదు. మహాప్రభు గౌరాంగదేవుఁడు ఈ సర్వాశ్రయ ప్రాణసంధానము నొందియే, హరినామముతోఁ దన్నుఁ దా మఱచెను. ప్రాణహీననామము

మృతశబ్దమాత్రమే. కాని ప్రాణమయనామము నామికంటెను గొప్పది. ఏ నామము నుచ్చరించుచు సాధకుఁడు ప్రాణానుభూతితోఁ దన్నుఁ దా మఱచునో, యా నామ మిప్పుడు కోటి కంఠములతో నుచ్చరింపఁబడు చున్నది; గాని యెందఱు యథార్థ ప్రాణసంధానము నొంది యమరత్వమునొంది సఫలు లగుచున్నారు? నామము నుచ్చరించుచుఁ గన్నీరు విడుచుట, నేలపైఁ బొరలుట, సంస్కారఘటితమై ప్రాణహీనమైన యొక దేవమూర్తిని జూచుట, మున్నగున వన్నియు మనుష్యుని విషయమునఁ గొంత మీఁది యవస్థలేకాని, యథార్థముగాఁ గృతార్థుఁడైనట్లు రుజువుచేయఁదగినవి కావు. దాని కేమిలే.

"హరినేత్రకృతాలయా" శబ్దముచేఁ బ్రాణముయొక్క బహిర్ముఖప్రకాశత్వము తెలియఁబడును. నేత్రము ప్రాణము యొక్క బాహిరప్రకాశస్థానము. సజీవ నిర్జీవుల విశిష్టత నేత్రములవల్లనే తెలియఁబడును. ఏ ప్రాణమయి యొడియందు నిత్యమున్నామో, యా మె ప్రధానరూపముతోఁ గన్నులయందే ప్రకాశించును. ఈ యక్షిగతపురుషుని గూర్చిన సాధన విషయము, ఉపనిషత్తులందును విశేషముగా వర్ణింపఁబడినది. ప్రతిమా పూజాదులందు 'చక్షుర్దాన' మనుచు నొక క్రియ యున్నది. అది ప్రాణముయొక్క బహిర్ముఖప్రకాశమునుగూర్చి చేయు క్రియయే. ప్రాణప్రతిష్ఠుఁడైన సాధకుఁడు మాత్రమే, ఏ యుపాయముచే మృణ్మయ జడచక్షువునుండి చైతన్య వికాసము ప్రకటమగునో తెలియఁగలఁడు. ఇక్కాలమం దింటింటఁ బ్రతిమాపూజ యగుచున్నది. కాని యకటా! "తచ్చక్షుర్దేవహితమ్" మున్నగు చక్షుర్దానమంత్రములు పఠనమాత్ర సమా

ష్టము లగుచున్నవి. ఎందువలన? ఏయుపాయముచే మృణ్మయ నేత్రము చిన్మయబహిర్వికాసముతోఁ బ్రకాశించునో యనునది తెలిసినవారు కొలదిమంది.

మన సర్వవిధములైన విధ్యుక్త క్రియారంభములలో ఆచమనమంత్రమందు "దివీవ చక్షురాతతమ్" అని విశ్వవ్యాపి ప్రకాశశక్తియొక్క ఆంశికానుభవ విధాన మున్నది. అందఱు ఆచమనము చేయుదురు, గాని యీ జగద్వ్యాపి విష్ణుని పరమ పదమును, ఆకాశమునందు విస్తృతచక్షువువలెఁ బ్రకాశించు దానిని, ఆ సర్వతోభేదివిద్యుచ్ఛక్తిని ప్రత్యక్షము చేసికొన్నవా రెందఱు? అమ్మచక్షువుతోఁ జక్షువును జేర్చి చక్షుష్మంతు లైనవా రెందఱు? సరే; అది వేఱే విషయము.

చక్షువునందే మన యమ్మ విశేషించి ప్రకాశించును. నేత్రముదారినే చైతన్యముయొక్క బహిర్ముఖవికాసము కానఁబడును. ఈ ప్రాణశక్తు లంతర్ముఖములై జగద్వ్యాపారము నుండి విరమించునప్పుడే, చక్షువునుండి వాని ప్రథమప్రకాశ మగును. (తొల్త నవి కన్నులదారినే కానఁబడును.) కావున మన యమ్మ "హరినేత్రకృతాలయా" యైనది. యోగనిద్రా రూపిణి మహామాయ, ప్రాణముయొక్క జగన్ముఖవికాసమును నిరోధించినది. ఆ సమయమందుఁ బ్రాణము, మాతృయోగము వల్లనైన యానందముచేఁ దన్నుఁదా మఱచినది. ఈ యవస్థయే విష్ణుని యోగనిద్ర. మహామాయ - అమ్మ, ప్రాణమును జగ త్సంబంధమైన మంచిచెడ్డ లేమియులేని యొక యవస్థకుఁ దెచ్చి యుంచినది; గాని యమ్మ దానినిట్టి యవస్థయందును నుంచ నొల్లదు. దానిచేతనే (ప్రాణశక్తిరూప విష్ణునిచేతనే) జగ

ముద్రావ్రతము పట్టించును. కనుక విష్ణుని నిద్రాభంగమునకై యీ యోజనము. ఇందుచేత బ్రహ్మ (మనస్సు) మాతృచరణములందుపడి స్తుతింపఁగడఁగెను.

ఈ యోగనిద్రారూపిణియైన మహామాయయే విశ్వేశ్వరి; జగద్ధాత్రి, స్థితిసంహారకారిణి. కనుక నే అతులనీయ (సాటిలేనిది). అచింత్యమైన యైశ్వర్యముకలది; భగవతి; మహామాయ యొక్క సృష్టిస్థితిప్రలయశక్తులను దెలుపుమాటలెన్నో మును జెప్పితిమి. ఇంకను జెప్పఁబడును. దేవీమాహాత్మ్యమునం దిటులు చెప్పుట పునరుక్తిదోషము కాదు. ఏమనఁగా, అదే సాధనకు బీజము. వేదాన్తదర్శనమందలి "జన్మాద్యస్య యతః" అనునీ బ్రహ్మనిరూపణసూత్రము సైతము ఆ యొక్క యర్థమును బోధించునదియే. "దేనివలన నీ జగత్తుయొక్క జన్మస్థితి భంగములగుచున్నవో, యదే బ్రహ్మము." దాని నెఱుంగుము. దాని సాధనచేయుము. యోగము, తపస్సు, మఱేదేని సాంప్రదాయికానుష్ఠానము మున్నగు నన్నిటి యుద్దేశ్య మిదే. ఇంతే. ఈ 'జన్మాద్యస్య యతః' యనుదాని యనుభవము చేయఁగల్గుట చేతనే జీవత్వము తుదముట్టును. మనము జీవులము. నాలుగు దిక్కులును జీవత్వపుటెల్లలు. వానినడుమ నివసించి మనము దీనులము, హీనులమునై కూరుచున్నాము. దేనివలన నీ జగత్తు రచింపఁబడినదో, దేనియందు నిల్చియున్నదో, మఱిదేనియందు విలీనమగునో, యేదే నొకవిధముగాఁ దెలియఁగల్గుటచేతనే జీవత్వ మంతమగును. కారణమేమనఁగా, అదే జీవుని యథార్థస్వరూపము. ఈ సృష్టి స్థితి ప్రలయ రచనమనెడి మహత్త్వము మాట, యొకటి రెండుసార్లు విన్నంతనే మన యాత్మస్వరూపము

తేఁటపడదు. కనుకనే సాధకవరేణ్యులు పూజ్యపాదులు ఋషులు మాటిమాటికి, నాత్మయొక్క యీ మూఁడుగుణము లను, ఈ యీశ్వరత్వమును దలపింపఁ జేయుటకే, గంభీరధ్వనితో — 'గంభీరవేది'యైన యేన్గునకు నిద్రాభంగమొనర్పఁ బ్రయాస పడిరి.

(చర్మమునుజీల్చి, మాంసమునుదఱిగి, రక్తపాతముచేసి నను నిద్రవదలని యేనుఁగును "గంభీరవేది" యందురు. "నీవు బ్రహ్మమవే" యని వేయిసారులు వేవిధముల బోధించినను, జీవుఁడు దాని యనుభవము చేయలేఁడు. కనుక జీవునకు గం భీరవేది గజమును సాటి చెప్పిరి.)

మనము గంభీరవేది గజములము. ఏవిధముగాను మన జీవత్వనిద్రాభంగము కాదు, కనుక సాధన జగద్విషయమున, అమ్మ మహత్త్వము, ఎంత పునరుక్తిదోషయుక్తమైన నంత మేలు. మాతృమహత్త్వ విషయమున నధికముగాఁ బునరుక్తులు పలుకువారే మన కధిక కృపావంతులు. మనము పునరుక్తి దోషములనే చూతుము, మలినత చూచుటే మన స్వభావము; కాని మనము చేయు నీ యవజ్ఞ నుపేక్షతో సహించియు, మాటిమాటికి మన కన్నులయెదుట మాతృ మహత్త్వమును జిత్రించువారి యవ్యాజకృప ధన్యము.

వినుము, మఱికొంత వివరణము. నాభికమల మనఁగా మణిపురచక్రము. తేజస్తత్త్వ కేంద్రము. మంత్రమందును "తేజసః ప్రభుః" అను మాట బ్రహ్మకు విశేషణముగా నున్నది. ఈ నాభిచక్రము నుండియే, జాగతికమైన సర్వభావములు విక

సించు చుండును. తేజస్తత్త్వము నుండియే రూపజగత్తు మొదలు, జగత్సంస్కార బీజము లుండునంతదాఁక మనస్సు—సృష్టిశక్తి యీ నాభికమల సంబంధమును విడువదు. విడువలేదు. రెండవవైపు హరినేత్రకృతాలయ యొక్క — ఆజ్ఞాచక్రస్థిత చిత్ప్రతిబింబము యొక్క మోహినీశక్తియెడ మిగుల ముగ్ధమై యుండును. ఈ యవస్థయందు మఱల ననేక భావములుగా స్పందితమగుటకై యుబికినను, మనస్సు మఱల నా శాంతావస్థను విడువనొల్లదు. అపుడు, యోగనిద్రా రూపిణియైన యే చిచ్ఛక్తి యొడిలోఁ (ప్రాణము నిష్క్రి) యావస్థయందుండునో, యా శక్తికే శరణాగతమగును. అభిప్రాయ మేమనఁగా — ప్రాణము క్రియాసహితమగునపుడే, ఆగామికర్మ బీజస్వరూపములైన మూలసంస్కారముల — మధుకైటభుల — వినాశమగును. మఱల నది యనేక భావములుగా స్పందితము కానక్కఱలేదు.

—♦—

# బ్రహ్మకృత స్తుతి

ఓం బ్రహ్మోవాచ ఓం.

ఓం. త్వం స్వాహా త్వం స్వధా త్వం హి
వషట్కారః స్వరాత్మికా ।
సుధా త్వమక్షరే నిత్యే
త్రిధా మాత్రాత్మికా స్థితా॥ ఓం. 1

బ్రహ్మ స్తుతించుచున్నాఁడు.

ఓ యమ్మా! నీవు స్వాహావు; నీవు స్వధవు; నీవే వష ట్కారాది మంత్రమవు; ఉదాత్తాది స్వరములు; నీవే సుధవు; ఓ యక్షరా! ఓ నిత్యా! నీవే త్రిమాత్రా స్వరూపమవు.

వివరణము:— 'నీవు' అనుమాట యెదురనున్న వ్యక్తిని గూర్చి ప్రయోగింపఁబడును. ఎదుర లేని వ్యక్తినిగూర్చి 'నీవు' అనుట యుండదు. ఇచట బ్రహ్మ (మనస్సు) హరినేత్రకృతా లయయు, యోగనిద్రాస్వరూపిణియు నైన మహామాయను బ్రత్యక్షము చేసికొనుచున్నాఁడు కనుక, త్వం=నీవు, అన్నాఁడు. సాధకుఁడే యిట్లు చేయును. స్తుతి, ఆవేదనము, నివేదించుట, దీనప్రార్థనము, జాలియేడ్పు; ఏదయినను అమ్మను అప్రత్యక్షముగా నుంచి చేయకు.

అమ్మ యెక్కడనున్నది? – అలక్ష్యస్థానమందు – (కాన రాని చోట) నున్నది యని, నీవామె నుద్దేశించి కల్పనా సహాయముతో నిచటఁ గూర్చుండి స్తుతిపాఠమో సాధనమో చేయు

దువు; అట్టి భావ ముండునంతదాఁక సాధనమార్గమందు వడిగా ముందడుగు వేయఁజాలవు. సాధనరాజ్యమందుఁ గల్పనకుఁగాని, అనుమానమునకుఁగాని తావు లేదు. అప్రత్యక్షము నుద్దేశించి యెట్టి సాధనయు సాగదు. సాధనమం దడుగడుగునఁ బ్రత్యక్షతానుభవము కావలయును. సాధనకుఁ బ్రత్యక్షతయే ప్రాణము; కనుక మన మిచట, బ్రహ్మ చేసిన స్తుతికి వ్యాఖ్య వ్రాయక మున్ను, ఒక్కసారి మంత్రచైతన్యవిషయమును సంక్షేపముగా నాలోచింతము. ఏమన మంత్రచైతన్యమువల్లనే దేవత ప్రత్యక్షయగును. చైతన్యహీనముగా మంత్రాదుల నుచ్చరించుటచే - అనఁగా దేవత యప్రత్యక్షముగా నుండుటచేఁ బెక్కేండ్లు కఠిన సాధన చేసినను నిష్ఫలమే; ఇదే ఋషుల యాదేశము.

మంత్రము శబ్దవిశేషము; దేనిని మననము చేయుటచేఁ బరిత్రాణము కల్గునో యదే మంత్రము. మంత్రమునందుఁ బ్రతిపాదింపఁబడిన శ్రేష్ఠమైన యర్థమే గురువు. ఇట్టి యర్థమువల్ల నగు ననుభవము పేరే చైతన్యము. అదే యిష్టదేవత; ఈ విధముగా మంత్రము, గురువు, దేవత యను మూఁడిటిని, ఏకము చేయుటచేతనే మంత్రచైతన్య మగును. ఒక దృష్టాంతముచేత నీ విషయమును సులభముగాఁ దెలుపుదును. "చింతపండు" అని యొకమాట యున్నది. ఇదే మంత్రమనుకో. చింతపండు అను శబ్దము నర్థము తెలియనంతసేపు, చింతపం డేమిటో తెలియదు. అంతదాఁక నది మృతశబ్ద మాత్రమే. నోటితో లక్షసారులు 'చింతపండు' అనుచున్నను, దాని విషయమైన తెలివి గలుగదు. తరువాత నొకఁడు వచ్చి, చింతపండు రూపము, రుచి మున్నగువానిని జక్కఁగాఁ దెలియఁజెప్పినపుడు,

'చింతపండు' అనుదాని యర్థజ్ఞానము కలిగినది. ఈ యర్థము పేరే గురువు. మఱల 'చింతపండు' అనుమాట యుచ్చరించినంతనే కోలగా వంకరగానుండు దాని రూపము, దాని పులుపురసము, మున్నగువాని జ్ఞానము బుబుకును. మఱల నెన్నఁడేని 'చింతపండు' అనఁగానే, దానిని జూడఁగానే దాని రుచి మున్నగువాని జ్ఞానము నీ యనుభవపర్యంతము వికసించి నీ నోరూరును, అది చైతన్యమయమైనదని తెలిసికొందువు. ఇటులే యంతట ననుకో. 'అమ్మ దయామయి' యనుము. అపుడు దయానుభవముతో నీ హృదయము నిండిపోఁగా, దయామయీపదము, యథార్థముగాఁ బలుకఁబడినదని తెలిసికొమ్ము. నీవు 'అమ్మ' యనుచున్నావు కాని, అమ్మ యెవరో యెఱుఁగవు. 'అమ్మ' అనుమాటకు అర్థమును నీకుఁ దెలియదు. ఇట్టి యవస్థలో నీవు 'అమ్మ' యనుచున్నను అది మతృశబ్దమే. మఱెవ్వరేని, 'అమ్మ' యనఁగాఁ బరిపూర్ణస్నేహమున కాధారమయిన జగద్వ్యాపి చైతన్యము; ఆమెయే ఆత్మ యని తెలియఁజెప్పుదురు. గురుకృపచేత నేనాఁడీమాట తెలిసికొందువో, 'అమ్మ' యనఁగానే, యొక స్నేహఘనమును, జైతన్యమయము నైన యాత్మానుభవము, నీలో నేనాఁడుబుకునో యానాఁడే నీమాతృమంత్రము (అమ్మ యను నీ యుచ్చరించినది) చైతన్యమయమైనదని తెలిసికొందువు. అర్థము నెఱుంగక, అర్థము ననుసరించు రసముతోను, భావముతోను, రసికుఁడును భావుకుఁడునుగాక; మంత్రస్తుతి వాక్యాదుల నుచ్చరించుటచే మనుజునకు యథార్థఫలము చేకూఱదు. ఇదిగో మంత్రచైతన్యమనెడి, వస్తువాక్యకూటి లేక

పోవుటచేతనే సాధనమార్గము దుర్గమమును, అంధకారబంధుర మునుగాఁ దోఁచును. కావున నేదేని స్తోత్రపాఠమో, విశిష్ట మంత్రజపమో, నామసంకీర్తనమో చేయువేళ నీ యాధ్యాత్మిక ప్రగతికి సాయపడు సదర్థము నెఱింగికొని యర్థానురూప భావముతో స్వయం సంవేదితుఁడ వగుటకుఁ బ్రయత్నింపుము. అప్పుడే దాని యథార్థఫలము వడిగా నొందఁగలవు.

బ్రహ్మ (మనస్సు) ఆగామికర్మబీజ స్వరూపమైన మధుకైటభులను సమూలముగా నశింపఁజేయ మహాశక్తికి శరణాగతుఁడయ్యెను. ఏలన — అతఁడు, శక్తి యొక్క తత్త్వమే యనియు, శక్తియే సాధ్యమనియు, శక్తియే సర్వకారణ కారణమనియు, అవాఙ్మానసగోచర పరమాత్మయనియుఁ దెలిసికొనెను. ఆమె కృపేచ్ఛ లేనిచో, నియ్యసుర నిధనము కాదనియు నెంచెను; గాన మహామాయను స్తుతింపఁగడఁగెను. సమాధ్యవస్థయం దే సర్వవ్యాపారములు నెట్లు సిద్ధమగు నందురేని, వారు పుస్తకాలు చదివి సమాధి శబ్దమును ముఖస్థము చేసికొన్నవారు. ఏ సమాధియందు సర్వభావములును బూర్తిగా విలయమగునో, యా దిన మొక్కసారియే వచ్చును. ఆ సమాధి యగునప్పుడు మఱి వ్యక్తితుఁడు కాఁడు. కనుకనే గీతయందు "యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ" అనఁబడినది. మఱి యిదియో, ఆ సమాధియందుఁ జేరికొనుటకు ముందుగా నగు నవస్థామాత్రమే. అయిన నిదియు సమాధియే. ఏమన నీ యవస్థయందు జాగతికవ్యాపారములు, ఇంద్రియవృత్తిప్రవాహము, ప్రాణవాయుస్పందనము, దేహబోధము మున్నగునవి యించుమించుగా లోపించిపోవును. కళామాత్రము మిగులుగా,

మనస్సు ఆత్మబోధమయ చిదాకాశక్షేత్రమందు నిల్చి, జీవ భావము నొందిన కార్యకారణ శృంఖలాదికమును ప్రత్యక్షము చేయుచుండును. అంతేగాక, విశిష్టప్రార్థనము మున్నగు నేదే నొక యుపాయము సాయముతో, విశుద్ధాత్మబోధమందు - అసంప్రజ్ఞాతావస్థయం దగ్రసరుఁడగుటకుఁ బ్రయత్నించును. ఆ యవస్థయందు స్తుతి ప్రార్థనాది ప్రక్రియలు స్థూలమందు మఱి బయలుపడవు. శబ్దహీనమైనను బూర్ణశబ్దమయము; క్రియాహీనమైనను బూర్ణక్రియామయము. ఆ ధ్వనిలేని ధ్వని, ఆ క్రియలేని సక్రియావస్థ, యించుకంతయు ననుభవముచేయని వారి కిది సులువుగాఁ దెలియుట యసంభవము. దానికేమి గాని - స్థూలముగా, సమాధియొక్క ప్రాథమికావస్థయందు మనో బుద్ధి చిత్తాహంకారాదులైన సూక్ష్మకరణ సమూహము ప్రత్యక్షమగుచుండుననియు, వాని విశిష్టకార్యప్రణాళి కాన వచ్చుననియుఁ దెలిసికొనుటగును. (సోఽహంసమాధి గ్రంథమును చూచునది.)

ఇపుడు మనము 'స్తవము' దాని యర్థము నెఱుఁగ ప్రయత్నింతము.

బ్రహ్మ, 'అమ్మా! నీవు స్వాహావు' అనెను. స్వాహా యనునది దేవహవిర్దాన మంత్రము. అయిన నిచట సర్వదేవ కృత్యములకు నుపలక్షణము, నీవు స్వధవు. ఇది పితృ (నివాపాంజలి) దానమంత్రము. కాని యిచటఁ బితృకృత్యములకును, అటులే వషట్కారము సర్వమంత్రములకును నుపలక్షణము. మనము అమ్మనుగూర్చిన విచారణము చేయఁగాఁ దొల్త కర్మ కాండము కంటఁబడుచున్నది. ఏమన - నంతయు మాత్రా

విర్భావమునకుఁ బూర్వసూచనము. కర్మకాండము దేవపితృ భేదముచే రెండుగా విభజింపఁబడినది. ఈ రెండును మంత్ర సాధ్యానుష్ఠానములే.

అమ్మా! నీవు స్వాహావు, స్వధవు, వషట్కారవు; పూజా హోమ వ్రత జప పురశ్చరణాది దేవకార్యములు, శ్రాద్ధ తర్పణాది పితృకార్యములు అను రెండు విధములందును వ్యవహరింపఁబడు మంత్రములును నీవే. ఆ మంత్రములు చదువునపుడు మూఁడు స్వరము లుచ్చరింపఁబడును. అవి - ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము. ఆ స్వరముల యుచ్చారణ తారతమ్యమువలనఁ గామ్యకర్మముల ఫలతారతమ్యము నగును. ఆ స్వరస్వరూపము నీవే; కనుక నీవు స్వరాత్మికవు. ఇంద్రుని నిధన కామనవలన, వృత్రాసురుని యుత్పత్తికై ఋషులు, ఉచ్చస్వరముతో మంత్రపాఠము చేయుచు నాహుతులిడునపుడు, అమ్మా! నీవే యా సత్యదర్శిఋషుల కంఠములనుండి వెలసి "ఇంద్రశత్రు" పదము నుచ్చరించునపుడు, అనుదాత్తస్వరూపమునకు బదులు, ఉదాత్తస్వరరూపముతో వెడలితివి. దానిఫలముగానే యింద్రునిచే వృత్రాసురుఁడు చంపఁబడెను. కనుక నీవే స్వరాత్మికవు. ఇదిగాక, జీవుల కంఠమందు నాదరూపమున వెడలు స్వరములు, పరా పశ్యన్తీ మధ్యమా వైఖరీ నామములతోఁ బ్రసిద్ధమైన వాగ్రూపమున నీవే యున్నావు.

మును చెప్పిన దేవ పితృ కర్మములవల్ల నగు, నపూర్వ కర్మఫలముగా - అదృష్టరూపముగాను నీవే యున్నావు. కర్మఫలమే యమృతము గనుక నీవు సుధాస్వరూపిణివి. ఉపనిషత్తు

నందు "అన్నాత్ప్రాణో మనః సత్యం లోకాః కర్మసు చామృతమ్" అని యున్నది. శ్రీ శంకరాచార్యులును, అమృతశబ్దార్థము కర్మఫలమనిరి. దేవ పితృకార్యములను కేవల కర్మములుగాను, వైధకార్యములయం దుచ్చరింపఁబడు శబ్దములను కేవల మంత్రములుగాను, విధ్యుక్తకార్యములవలనఁ గలుగు ఫలములను కేవల కర్మఫలములుగాను గనునంతదాఁక నవి క్షరధర్మము కలవియే; గాని యక్షరయు నిత్యయు నైన మన యమ్మ దేవ పితృ కార్యరూపమున వెలయునని కనుగొనునపుడు, ఉదాత్తాది స్వరభేదముతో, మంత్రరూపముతో అమ్మా! నీవే యుచ్చరింపఁబడుదానవు; అనునపుడు మఱి కర్మఫలములను సుధా (అమృత) యనక నీవెట్లు క్షరధర్మ లనఁగలవు?

కర్మముల కొక్కటే సాధారణఫలము. దాని పేరే జ్ఞానము. జ్ఞానప్రకాశమును జేయుటే కర్మరూపిణియైన అమ్మ ప్రధానోద్దేశ్యము. జ్ఞానము నిత్యము, కనుక నమృతము; కావుననే కర్మఫలము సుధ (అమృతము) అనఁబడెను.

తరువాత, సర్వమంత్రసారము త్రిధామాత్రా – ఓంకారము. దానివలననే జగత్తు; దానివలననే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు; అదే, అకార ఉకార మకార రూపముతో జగదాకారమున వెలసిన యా 'త్రిమాత్ర'యు నీవే.

ఇచట – త్రిమాత్రాస్వరూప సంబంధమున రవ్వంత యాలోచింతము. మాత్రాశబ్దార్థము స్పందనము. స్పందనము శక్తిప్రవాహమాత్రమే. చిన్మయి మహాశక్తి జగదాకారమున వెలసి జడశక్తియను పేరఁ బరఁగును. "జడశక్తి ర్జడాత్మికా"

(నామస్మృతి.) ఆ శక్తిప్రవాహము త్రివిధక్రియను ప్రకాశింపఁ జేయును. మొదటిది - ఉత్పత్తి - నామరూపవిశిష్టమైన యొక ఘనీభూత శక్తికేంద్రము, ఇదే సృష్టి; అకారమాత్ర. ఇఁక రెండవది స్థితి. ఆ విశిష్టరూపముతో నావిర్భవించిన శక్తి కేంద్రము, లయశక్తితోఁ బ్రతిఘటించి, తన స్వరూపమును స్థిరముగా నుంచుకొనుటకు సమర్థమగునంతదాఁక, ఆ స్థితి ఉకార మాత్రానామముతోఁ బ్రసిద్ధము. మఱి మూఁడవది లయము. ఈ చెప్పఁబడిన శక్తికేంద్రము మఱల మహాశక్తి యొడియందు అదృశ్యమగునపుడే లయము; మకార మాత్ర యను పేరఁ బ్రసిద్ధము.

ఏదేనొక పండు చేతఁబట్టుకొని చూడుము. ఒక శక్తి యదృశ్య పరమాణువులను జక్కఁగాఁ జేర్చి ఫలరూపమునఁ బ్రకాశితమైనదని తెలియును. అదే మొదటి స్పందనము. అకారమాత్ర. సాధనభాషయం దదే బ్రహ్మ. యోగులు దానిని మనోరూపముగాఁ జూతురు. మఱలఁ జూడుము. ఆ ఫలరూపముతో స్థూలముగాఁ బ్రకటితమైన శక్తిప్రవాహము, లయము - విరోధశక్తితో విరోధించి తన రూపమును విశిష్టముగా వెలయించుకొనునంతదాఁక, నది ద్వితీయస్పందనము, ఉకారమాత్ర. సాధనభాషయం దదే విష్ణు వనఁబడును. యోగులు దీనిని బ్రాణరూపమునఁ జూతురు. కొన్నాళ్ల తర్వాత, పండు వాఁడిపోయి, క్రుళ్ల నారంభించును. అదే నాశము. ప్రలయము. అదే తృతీయస్పందనము. సాధనభాషయం దది శివుఁడనఁబడును. యోగులు దానిని జ్ఞానరూపముగా దర్శింతురు. ఈ ప్రలయ మొక యాకస్మికముగానైన పరివర్తనము

కాదు. ప్రత్యేక పరమాణువుయొక్క, ప్రతి క్షణమందున్నైన పరివర్తనము ఫలమే. ప్రతి ముహూర్తమందును, ప్రతి పరమాణువు నందును, మును జెప్పిన "జాయతే అస్తి, వర్ధతే" మున్నగు నాఱుమార్పులు, నీ మూడువిధములైన స్పందనముల లోనే సాగుచున్నవి. జీవుఁడు భూమిపైఁ బడిన క్షణము మొదలు మృత్యువు వంకకే ముందడుగు వేయుచున్నాఁడు. ఒక్కనాఁడే మృత్యువు రాదు. జన్మము, అనఁగా మృత్యువు యొక్క మొదలు. అయినను, తృతీయ స్పందనము – మకార మాత్రను బట్టి యెంతదాక ద్వితీయ స్పందనము – ఉకార మాత్ర ప్రబలముగా నుండునో, యంతదాఁక, మరణమను నొక విశిష్టఘటనము తెలియఁబడదు.

జగత్తునందలి ప్రత్యేకపదార్థమందును, ప్రత్యేకముహూర్తమందును నీ మూడు విధములైన స్పందనములు – త్రిశక్తి ప్రవాహము సాగును. అపుడు, ఏ స్పందనము ప్రబలముగాఁ బనిచేయునో, అప్పుడదే కానవచ్చుచుండును. యోగదృష్టి కల వాఁడు, ఈ జగత్తును మూడు విధములైన శక్తిప్రవాహము తక్క మఱేమియు గాదని చూచును. ఇదే శ్యామాపూజయందలి త్రికోణమంత్రము. అయిదు త్రికోణములు గీసి, వానియందు శ్యామాపూజ చేయువిధానము తంత్రములందుఁ గానఁబడును. పంచభూతములు నీ మూడువిధములైన శక్తిప్రవాహమాత్రమే. కర్పూరాదిస్తవమందు త్రిపంచారశబ్దమునకును దాత్పర్య మిదే. తంత్రములందలి సకలయంత్రపూజ, యీ మహాశక్తిప్రవాహాను భవముచేయు యోగ్యతను గలిగించును.

ఓం. అర్ధమాత్రా స్థితా నిత్యా యానుచ్చార్యా విశేషతః ।
త్వమేవ సా త్వం సావిత్రీ త్వం దేవి జననీ పరా॥ఓం. 2

అమ్మా! విశేషరూపముతో నుచ్చరింపఁదగనిది నిత్యమైన యర్ధమాత్రయు నీవే. నీవే సావిత్రివి. దేవీ! నీవే పరా జననివి.

వివరణము:— అమ్మా! ఇంతవఱకు నీ త్రిమాత్రా స్వరూపము కొంత తెలిసినది. ఉపనిషత్తులందుఁ జెప్పఁబడిన జాగ్రదభిమానిపురుషుఁడు విశ్వుఁడును, స్వప్నాభిమానిపురుషుఁడు తైజసుఁడును, సుషుప్త్యభిమానిపురుషుఁడు ప్రాజ్ఞుఁడు ననువారు, ఆ త్రిమాత్రాస్వరూపులే. పలునాళ్లకు నీ యీ త్రివిధస్వరూపదర్శనము చేసినపైని, నీవే యీ జగద్రూపముతో వెలసితివను తెలివి కలిగినది. అమ్మా! నీయీస్వరూపమతి మనోహరమైనను, నంతకంటె గొప్పది నీ స్వరూప మొకటి కలదు. అది విశేషరూపముతో నుచ్చరింపఁబడనిది. అదే నీ నిత్యస్వరూపము. దానినే 'అర్ధమాత్ర' యందురు. దానిని మాటలతో వెల్లడించుట కాదు. అమ్మా! త్రిమాత్రాస్వరూపము వలన, విశేషణమునుజూడ విశేష్యము తోఁచునటులే, జగత్తును జూచిన, శక్తి యనుమానింపఁబడును; గాని అయ్యర్ధమాత్రా స్వరూపముతోఁ దురీయావస్థయందు నీవు, అచింత్యవు, అనిర్దేశ్యవు, సర్వేంద్రియాగమ్యవు, సత్యవునై యున్నావు. అనఁగా నొక్కమాట — నీయందుఁ ద్రిమాత్రపూర్ణముగా లయ మొందినపుడే నీ వనుచ్చార్యరూపమున బిందురూపముతో వెలయుదువు.

తృతీయమాత్ర మకారము వ్యంజనము (హల్లు). అది యర్ధమాత్ర; ఉకారము శిరసున నీ యర్ధమాత్రయే నాదబిందు రూపములతోఁ బ్రకాశించును. దానికి ఉనికి కలదు. కాని విస్తారము కాదు. బిందువు దాని కొక స్థానము నియతమైనను దానికి విస్తృతి (పొడవు వెడల్పు) లేదు. ఇది జ్యామిత్ర రేఖా గణిత (Meridian) ప్రమాణము. ఆ యున్న యంశము నిర్గుణ పరబ్రహ్మ ద్యోతకము. విస్తారాంశము సగుణబ్రహ్మ (శక్తి) ప్రకాశము. నిర్గుణమునకు గుణము (శక్తి) నొప్పుకొననివారే బ్రహ్మముకంటె మాయను వేఱుగాఁ గాంతురు. ఉనికి యున్న దాని కింతో యంతో విస్తారము తప్పదు. ఏమన బిందు సమష్టియే పదార్థము. బిందువును కేవల చైతన్యముగాను, నాదమును కేవల శక్తిగాను గైకొనుటచే బిందువునకు శక్తి హీనత వచ్చిపడును. ఈ మతముచే, శక్తిహీనునకు శక్తిపరిచాల కత యసంభవము గనుక, బ్రహ్మమును శక్తిహీన మందురు. ఇది వేదమునకును యుక్తికిని విరుద్ధము.

కాని, మా బుద్ధిచేత, నీవు బిందురూపముతో నిర్గుణ వును, నాదరూపముతో సగుణవునునై త్రిమాత్రాస్వరూప ముతో జగద్రూపముగా వ్యాపించియున్నావు. అయినను నీ యీ యర్ధమాత్రా స్వరూపము నిత్యపరివర్తనహీనమును, అనుచ్చార్యము నయి వాగగోచరము. కనుక నే దేవీ! ప్రకాశ శీలా! అమ్మా! నీవే సావిత్రివి. జగత్తును బ్రసవించుదానవు. ప్రాణులను గన్నతల్లివి. పరాజననివి. త్రిమాత్రారూపముతో జగజ్జననివియు, అర్ధమాత్రారూపముతో నీవే పరాజననివియు నైయున్నావు.

త్రిమాత్రా, అర్థమాత్రా శబ్దములకుఁ గ్రమముగా, స్వరములు వ్యంజనములు నని యర్థము చేయువారితోను మాకేమియు నాపత్తిలేదు. ఏమన, స్వరసహాయముతోనే వ్యంజనములు (హల్లులు) ఉచ్చరింపఁబడును. స్వరమును (శక్తిని) ఆశ్రయించియే నిర్గుణబ్రహ్మము సగుణరూపమున వెలయుచున్నది.

ఓం. త్వయైవ ధార్యతే విశ్వం త్వయైతత్ సృజ్యతే జగత్ ।
త్వయైతత్పాల్యతే దేవి త్వమత్స్యంతే చ సర్వదా॥ ఓం. 3

అమ్మా! ఈ విశ్వము నీ చేతనే ధరింపఁబడుచున్నది. నీవే యీ జగత్సృష్టిపరిపాలనములను జేయుచున్నావు. మఱల నంతకాలమందు నీవే దీనిని గ్రసించు (భక్షించు) చున్నావు.

వివరణము:— అమ్మా! సృజించుటకుమున్ను బీజరూపముతో నీ విశ్వము నీ గర్భమందే ధరింపఁబడును. మఱి నీవే యా బీజమును పరివర్తనశీలమైన (మారుచుండు స్వభావము గల) జగద్రూపముతోఁ బ్రసవించుచున్నావు. మఱి నీవే దీనిని బాలించి, యంతకాలమందు భక్షింతువు (లోనికీడ్చుకొందువు). ఇదే నీ మాతృత్వము. గర్భమున ధరించుట, ప్రసవించుట, హృదయమందు ధరించి జ్ఞానస్తన్యముచేఁ బరిపోషించుట, అంతమందు - (పూర్ణజ్ఞానావస్థయందు) నీకంటె వేఱుకానటులుం నీలోఁ జేర్చివేసికొనుట, యను నిదే నీ మహామాతృత్వము.

'నేను' జగద్భోగయోగ్యత నొందనంతదాఁక ('నేను' జగత్తును భోగయోగ్యముగాఁ జేయనంతదాఁక) బీజరూపముగా నా గర్భమందు ధరించి, నీ రక్త (ఉపరంజన) శక్తి చేతనే

భోగయోగ్యతను గూర్చితిని. కావుననే ప్రసవించి (సృష్టించి) నా యొడిలోనికే తీసికొంటిని. నా స్తన్యముతో (అమృతముతో) నన్నుఁ బోషించుకొందును. ఒక్కొక్క-బొట్టుగా జ్ఞానసంచయమునుగూర్చి, అమరత్వమునొందు యోగ్యతను గల్గించుటకై, యసంఖ్య జననమరణాది పరివర్తనములందుఁ గొనిపోదును. నేను మాతృస్నేహముతో ముద్దునై, అమ్మనని తన్మయత్వము నొంది, అఖండజ్ఞానమునొంది, పూర్ణజ్ఞానమయావస్థకు వచ్చియున్నపుడే 'నేను' నీ యమృతమును – నీ యన్నము నగుదును. అపుడు నన్నును భక్షించి, నీవు నీ యన్నపూర్ణనామమును సార్థకము చేసికొందువు.

నీ యన్నముగా నున్న మేము "సర్వగ్రాసిని యమ్మ యేనాడో మమ్ముల్లను దినివేయును" అని తెలిసికొనలేనంత దాఁక, నీవే మా యన్నమవు. మేము నీస్తన్యము త్రాగియే పెరుగుచున్నాము. అమ్మా! నిన్నెన్ని విధములుగా భోగించుచున్నామో, యది విచారించినపుడు, చకితులమై పోదుము. ఎవఁడెట్టి భావముతోఁ జూచునో, యపుడు నీవట్టి భావముతోనే రూపమును ధరింతువు. నీవే విషయాకారమున వచ్చి మా యింద్రియములను భోగపూర్ణములుగాఁ జేయుదువు. మా యిచ్ఛనుబట్టి మా లాలస కాహారము వేయుచుందువు. ఈ విధముగా నొకనాఁడు కాదు; రెన్నాళ్లు కాదు; అనేక జన్మ జన్మాంతరముల నుండియు నిట్టి యడ్డులేని వాసనలను హృదయమునుండి విడిపించుచున్నావు. మఱి నీవు మా భోగ వాసనలను జరితార్థము చేయుటకు, వాసనానురూపముగా, క్షుద్ర క్షుద్ర విషయముల వేషముతో మాయెదుట వెలయు

నంత స్నేహవిమూఢ వగుచున్నావు. నా గొప్ప 'నేను తనము నకు' బిందుమాత్రమును, అసమ్మానము కాదు. కనుక నింతచేసియు నా సత్తను నేనే దాచియుంచుకొన్నాను. నీవే మా వాసనవు; నీవే మా భోగమవు; నీవే మా యన్నమవు; నీవే మా తృప్తివి; అని మాకుఁ దెలియనీయవు. ఇంత స్నేహము, ఇంత ప్రేమము, నీ హృదయమందున్నది కదా! రోగము, శోకము, దారిద్ర్యము, దుర్గతి, ఆశాభంగము, మున్నగు సర్వావస్థలందును నీ యలౌకిక పుత్త్రస్నేహము ప్రవహించుచున్నది కదా! ఈ నీ స్నేహము నెప్పుడు మేము స్మరించుకొనఁగలమో! అమ్మా! ఇన్నాళ్లదాఁక నిన్నుఁ దిని వేసితిమి – అజ్ఞానముతో నిన్ను భోగించితిమి. ఇపుడు మమ్ము నీవు తినివేయుము. ఇపుడొక వేఱయిన 'నేను తనపు' హద్దు పెట్టి, మమ్ములను నీతో వేఱుచేసి పెట్టితివేల? నీవును నేనును ఒక్కటి కాదా? మఱి సర్వరూపములతోనున్న యమ్మ యెవరు? సర్వగ్రాసినీరూపముతో నిల్చితివే! ఆకుల నేత్రములతో నొక్కసారి నిన్ను నీవు మఱచి, నీ బిడ్డల మొగము చూచి నీ దివ్యనేత్రములందు, మా జ్యోతిర్హీన నేత్రములను నిల్పి, అమ్మా! అమ్మా! యనుచు మమ్ము మేము మఱచెదము. మఱి నీవును, రారా! కొడుకా! రారా! వత్స! యంచు మమ్ము మ్రింగివేయుము. మేము చచ్చి యమరుల మగుదుము.

ఏమందువమ్మా! ఏమనుచున్నావు? నీవే సుధవా? అమృతమే నీ యాహారమా? ఏదే, ఇంకను మే మమరత్వ మొందలేదే. సుధ సిద్ధముకాలేదే. కనుక నీవాహారింపలేకున్నావేమో? ఎవరిది దోషము? నీదా? మాదా? ఎందుచేత

మేమింకను అయోగ్యసంతానముగానే యున్నాము ? అమ్మా! నీవు విజ్ఞానేశ్వరివైన తల్లివి. మేము - అజ్ఞానాంధులమైన బిడ్డలము. నీవు అమృతమవు. మేము మృత్యువునకు గ్రాసముగా నున్నాము. అమ్మా! ఎవరి దీ దోషము ? ఏమిది - కోరికలుగాను, వాసనలుగాను మా లోపల నెవ్వ రుబుకుచున్నారు ? లీల ! లీల !! అమ్మా! యిపుడు మేము నీ కక్కఱలేదు. మమ్ముఁ గోరవు. నీ యానందమయజగల్లీల నీవు చేయుదువు. మేమును బూర్ణముగా మా 'నేనును' నీతోఁ జేర్చి వేయుదుము. మఱి వేఱుపాటేదీ ? ఎట్లగును ? అమ్మా ! అమ్మా ! అమ్మా !

ఈ మంత్రమందలి - "ధార్యతే, సృజ్యతే, పాల్యతే, అత్సి" అను నీ నాలుగు క్రియాపదములచే సగుణబ్రహ్మము యొక్క మహామాయాత్వము - మాతృత్వము లెస్సగా వ్యక్తమైనది (వెల్లడింపఁబడినది).

ఓం. విసృష్టౌ సృష్టిరూపా త్వం స్థితిరూపా చ పాలనే ।
తథా సంహృతిరూపాంతే జగతోఽస్య జగన్మయే॥ ఓం.4

ఓ జగన్మయీ ! నీవే సృష్టికాలమందు సృష్టిరూపవు, పాలనమందు స్థితిరూపవు, మఱి ప్రలయకాలమందు సంహృతిరూపవు నై యున్నావు.

వివరణము:—అమ్మా! నీవే యీ జగత్తు నుత్పాదించి పరిపాలించి మఱల సంహరింతువని మున్నంటిమి. కాని యది యథార్థముగా సరిగాఁ జెప్పఁబడలేదు. ఏమనఁగా నిటులనుటచే

జగత్తు నీకంటె వేఱనుచుఁ దోఁచును. వాస్తవముగా నీవే జగన్మయివి. నీవు తక్క నెక్కడను నేమియు లేదు. సాధారణముగాఁ బ్రత్యేక కార్యమునందును మూఁడువస్తువులే తప్పక యున్నవని మాకుఁ దెలియఁబడను. 1. నిమిత్తకారణము (కర్త). 2. ఉపాదాన కారణము (కార్యమునకైన యుపకరణములు). 3. కార్యము (విశిష్టఫలము). కాని, అమ్మా! నీ యీ జగద్వ్యాపారమందు నీవే నిమిత్తము, నీవే యుపాదానము, నీవే కార్యము. నీరు గడ్డకట్టి మంచగును. గాని దానియందుఁ జల్లదనమనెడి యొక హేతువు క్రొత్తగా నుండును. అయినను, నీ యీ జగద్వ్యాపారమందు, అట్టిది మఱేమియు లేదు. నీవే కార్యము; నీవే యుపకరణము; నీవే కర్త.

నేనొక పండును గోరితిని. ఈ కోరుట యనెడి వాసనయే పండుయొక్క బీజము. అవ్యక్తముగానున్న యమ్మ, వాసనారూపముతో ఫలబీజాకారమునఁ బ్రకాశించినది. మఱి యీ వాసన ఘనీభూతమై ఫలరూపముతో వెలికి బయల్పడినది. కారణమేమనఁగా, వాసనయొక్క ఘనీభూతావస్థయే ఫలము. ఆ పండు నే ననుభవింపఁగానే మఱల నవ్యక్తమందుఁ జేరిపోవును. ఎల్లప్పుడు నిట్టి ఘటనమే యగుచుండును. ఏదో యొక యవ్యక్తక్షేత్రమునుండి యొక్కొక్కవాసన యుబుకుచుండును. మాటిమాటికి నా వాసనలు లేఁగి కోరిన విషయరూపమున నింద్రియభోగ్యములుగా సిద్ధమగుచుండును. భోగాంతమందు మఱల నా యవ్యక్తక్షేత్రమందుఁ జేరిపోవును. ఈ మూఁడు విధములైన ప్రకాశమే సృష్టి స్థితి సంహారములనెడి పేరఁ బ్రసిద్ధములు. సదా ప్రత్యేకజీవునందును జక్కఁగా నిమ్మూఁడు శక్తు

లును వెలయుచుండును. తల్లీ! జగన్మాయీ! నీకొక్క క్షణ మైనను విశ్రాంతిలేదుకదా. నీవు మాకొఱకే యజ్ఞేయవయ్యు జ్ఞానరూపవు, శక్తిత్రయాతీతవయ్యును శక్తిరూపవు, క్రియాతీతవయ్యును గ్రియాశీలవు. కావున సృష్టికాలమందు నీవే సృష్టిరూపవును, పాలనకాలమందు నీవే స్థితిరూపవును, ప్రలయ కాలమందు నీవే సంహారరూపవును నగుదువు. ఈ మూడు విధములైన క్రియాశక్తిరూపముతో నిన్ను నీవే వెలయించు కొనుచున్నావు.

ఓం. మహావిద్యా మహామాయా మహామేధా మహాస్మృతిః ।
మహామోహా చ భవతీ మహాదేవీ మహాసురీ॥ ఓం. 5

అమ్మా! నీవు మహావిద్యవు; మహామాయవు; మహా మేధవు; మహా+అస్మృతివి; కావున నీవే మహామోహరూపిణివి. కనుక నీవే మహాదేవివి. మహా+అసురివి.

వివరణము:— అమ్మా! అసంభవవ్యాపారములన్నియు నీయందే సంభవములు. వెలుఁగుం జీఁకటియు రెండును నొండొంటికి విరోధులైనను ఈ యవి చేరియేయుండును. మహా దైవీప్రకృతిగాను, మహాసురీప్రకృతిగాను, నీవే వెలయు చున్నావు. కనుకనే నీవు మహాదేవివయ్యును మహాసురివి. ఏమన, నీవు మహావిద్యవయ్యును మహామాయవు. బ్రహ్మవిద్యారూప ముతో నిత్యము ప్రకాశించుచున్నను జీవజగద్రూపముతో మహామాయామూర్తితో విరాజిల్లుదువు. మఱి, మహామేధ వయ్యు మహా - అస్మృతివి. ఆత్మజ్ఞానధారణోపయోగియైన

మహా ధీయనెడి మహామేధవు. మఱి నిన్ను మఱచిపోవుట, నీ యస్తిత్వమును మఱచిపోవుట, యనునదియు నీ ప్రభావమే. నీవే మహావిస్మృతిరూపముతో జీవుల హృదయమందు వెలయుదువు, కనుక మహామోహరూపిణివియు నీవే; నీ సర్వవిధములైన కార్యములును, జగత్తునకు సంబంధించిన కార్యకారణ శృంఖలాజ్ఞానమును మీఱినవి. మానవబుద్ధి నిన్నెఱుఁగఁజాలదు. మానవులు వెలుఁగు చీఁకటు లొక్కచోట నుండవనుకొందురు. జ్ఞానము అజ్ఞానము, మేధ విస్మృతి, యొకచోట నుండఁజాలవు గాని, అమ్మా! నీయం దిదియంతయు సంభవమే. దైవీప్రకృతియు అసురీప్రకృతియు నత్యంత విరుద్ధములైనను, సదా నీయందున్నవి. ఓ యమ్మా! కాంతియొక్క యల్పత్వమే చీఁకటి యనియు, జ్ఞానముయొక్క యల్పత్వమే యజ్ఞానమనియు, నీవేకదా మాకుఁ దెలియఁజెప్పితివి. కనుక, అమ్మా! నీ రచించిన జీవజగత్తునందును నీ యీ రెండువిధములైన విరుద్ధమూర్తులు నొక్కసారియే యపూర్వముగాఁ జేరియుంట కనుచున్నాము.

(మనము చిన్ననాఁటినుండియు జ్ఞానము అజ్ఞానము, విద్య అవిద్య, సత్ అసత్ అను నివి పరస్పరము నత్యంత విరుద్ధములని వినుచున్నాము; గాని యిది నిజమా కాదా? పరస్పర విరోధులైన రెండు వస్తువు లొక్కచోటఁ గలిసియుండుట, మానవబుద్ధికతీతమేయైనను బరమేశ్వరునం దంతయు సంభవమే యనుచు నొక యుక్తివిరుద్ధమైన మాటను స్వీకరించుచున్నాము. అనుభవమునందును జ్ఞానోదయము కాఁగానే యజ్ఞానముండదనియు, అజ్ఞానముండుదాఁక జ్ఞానము ప్రకాశింపదనియుఁ దెలియుచున్నది. అయినను, ఆ యజ్ఞానము జ్ఞానమందే నిల్చి

యున్నప్పుడు, అజ్ఞానమును జ్ఞానమునకు విరోధియనక, ఈషద్ జ్ఞానమన్నచో నెట్టి యుక్తివిరోధమునుంగాదు. ఏమనఁగా - అఖండజ్ఞానమును, ఈషద్జ్ఞానమును నొక్కచోట నుండుట యసంభవముకాదు. ఇటులే అసత్ అవిద్యా మున్నగు శబ్దము లందును నఞ్ కు ఈషదర్థమునే గ్రైకొన్నచో సర్వవిధముల తర్కములును సమాప్తములై పోవును. విరోధ, ఈషత్ అను రెండర్థములును లాక్షణికములే యైనపుడు, ఈషదర్థమును గ్రైకొన్న నాపత్తి యేమి ? )

మహామాయాశబ్దముచే, కాళీతారాది దశమహావిద్యలని యర్థము చేసినవారితోఁ బూర్తిగా నైకమత్యము కుదురదు. ఏమనఁగా నిమ్మంత్రమందు, అమ్మయొక్క రెండు మహాప్రకృతుల వర్ణనము చేయఁబడినది. ఒకటి దైవీప్రకృతి; రెండవది యాసురీప్రకృతి. ఈ రెండుప్రకృతుల స్వరూపమును ప్రకటించుటకే, "మహావిద్యా, మహామాయా, మహామేధా, మహా అస్మృతి" యనెడి యొండొంటికి మిగుల విరుద్ధములైన రెండు స్వరూపములు చెప్పఁబడినవి. కావున మహావిద్యాశబ్దార్థము బ్రహ్మవిద్య యని చెప్పుటయే సంగతము.

ఓం. ప్రకృతిస్త్వంచ సర్వస్య గుణత్రయ విభావినీ ।
కాలరాత్రి ర్మహారాత్రి ర్మోహరాత్రిశ్చ దారుణా॥ఓం. 6

అమ్మా! నీ వన్నిటియొక్క ప్రకృతివి. సత్త్వము, రజస్సు, తమస్సు ననెడి మూఁడు గుణములచే (అవస్థలచే) నీ ప్రకృతి స్వరూపము తెలియఁబడును. మఱియు నీ త్రిగుణాలయమునకై

నీవే దారుణ (భయంకర) కాలరాత్రివి, మహారాత్రివి, మోహ రాత్రివి గాను వెలయుదువు.

వివరణము:— అమ్మా! నీవు కేవలము సమష్టిరూప మైన మహాప్రకృతివే కావు. సరిగదా, వ్యష్టిప్రకృతిరూపవును నీవే. ప్రత్యేకజీవుని స్వతంత్రప్రకృతిరూపముతో నీవున్నావు. అనఁగా, జీవప్రకృతి కధిష్ఠానము నీవే. ప్రకృతి యనఁగా స్వభావ మని స్థూలార్థము. ఏ జీవుని దెట్టి స్వభావమో, యదియే వాని ప్రకృతి. అమ్మా! సమష్టియందు నీ మహాదైవీ మహాసురీ ప్రకృతులు రెండును గానవచ్చును. మఱియు నీ వ్యష్టియందును నవియే కానవచ్చును. ఒకనిది దైవీప్రకృతి; ఒకనిది యాసురీ ప్రకృతి. ఒకఁడు సాధువు; ఒకఁ డసాధువు. అమ్మ అమ్మ యని తమ్ముఁ దాము మఱచి, ముక్తిమార్గమునందు సాగు సాధకులలో సాధనరూపముగా నుబుకుచుండు దైవీప్రకృతి నీవే. మఱి పాపపు టడుగుమెట్లులకు దిగిపోయి నరకమార్గమును దెఱచుకొని, నిందాపాత్రులగుచుఁ బోవువారి నిందితాసురీప్రకృతివి నీవే. నీవు ఎప్పుడే జీవుని నేమూర్తితో నీ యొడిలోనికిఁ దీసికొని కూర్చుందువో, యప్పు డా విధమైన స్వభావమునే పరిచయము చేయుచుందువు ఎవ్వనిదే యనుము; ఎట్టి ప్రకృతియే యనుము; అదే వాని యమ్మ.

అమ్మా! మున్ను నీ మహామూర్తిని జూచి యాతంకితులమైతిమి (భయపడితిమి). మా డగ్గుత్తుకలనుండి వెడలు మా జాలిపిలుపులు, కైలాసమందలి కనకసింహాసనము వఱకుఁ జేరవని తోఁచినపుడు, నీ వీ నిత్యసన్నిహితమైన యభయమూర్తిని జూపితివి. నీవు బ్రహ్మాండ జననివి. బ్రహ్మ విష్ణు

మహేశ్వరులను గన్నదానవయ్యు మా ప్రకృతిరూపముతో మా యమ్మవు నీవొక్కతెవే, మాకుఁ బ్రీతిసాధన మైనావు. మా భోగాపవర్గసాధనకొఱకే మమ్ములను నీగుండె కల్పించు కొంటివి. మా లేములు తీర్చుటకే, మా దరఖాస్తులు మన్నించి మా క్షుద్రవాసనలను సైతము పూర్ణము లొనర్చుటకే ప్రకృతి రూపముతోనున్న మా యమ్మవు నీవు. ఈవిధముగాఁ జిన్న పురుగు మొదలుకొని బ్రహ్మాదుల పర్యంతము ప్రతి జీవుని భిన్న భిన్న ప్రకృతిగా నొప్పుదానవు నీవే. కనుకనే "ప్రకృతి స్త్వంచ సర్వస్య" నీవు సమష్టిచే సర్వమునకుఁ దల్లివి. మఱి వ్యష్టిచేఁ బ్రత్యేకమునకుఁ దల్లివి. నీవు చింకిగుడ్డలదానవేకానీ, బిరుసుజుత్తుదానవే కానీ, మకిలిమేని దానవే కానీ, తెగులు గొంటివేకానీ; నీవు మా యమ్మవే. మాకేనా ? ఎవరికిఁగావు?

అమ్మా ! జీవులు తమ తమ ప్రకృతిరూపిణివైన నిన్నవ మానించుటచేతనే, యనేకవిధముల దుర్దశలు, సాధనజగత్తుసం దసంభవ విపర్యయములు, సాంప్రదాయిక దుష్టభావములుఁ గలుగుచున్నవి. అకటా ! ఇంటనున్న యమ్మ కవజ్ఞచేసి, యెక్క డనో యెవతెనో 'అమ్మ' యను జీవుఁడెంతమూఢుఁడు ! తన తల్లిని విడిచి మఱియొకరి గుమ్మముకడ నెయ్యము నడుగుకొను చున్నను, విధిరహితముగా నీ కృపనే యడిగికొనుచున్నాఁడు. ఈ విషయమే గీతయందలి రాజగుహ్యయోగమందు నీవే విశే షించి చెప్పితివి. అమ్మా ! 'నేనును' నిన్నొక్కనాఁడును గుర్తింపలేని కారణముననే నీ దీనమలినవేషమునుజూచి, యవ జ్ఞతోఁ దొలఁగించుటకే చూచితిని. అభిమానపూర్ణమును, అశ్రుభరాక్రాంతమునైన, నాఁటి నీ మోము తలఁపునకు వచ్చు

టచే నిపుడును గుండె బ్రద్దలగుచున్నది. నీవే రాజరాజేశ్వరివి; మా యమ్మవు; అనంతజగదధీశ్వరివి; అను మాటను, నాఁడే నే నెఱింగియున్న చో, ఎంత యవజ్ఞ చేసితిని ! ఇప్పుడును, ఇంకను జేయుచున్నాను. నీవో, ప్రతిక్షణమందును అభిమానపూర్వకముగా, "అవజానన్తి మాం మూఢా, మానుషీం తనుమాశ్రితమ్" (గీత. 9-11) అనుచునే యున్నావు. నిజమమ్మా! నిజము. మనుజులము మేము నీకెంతో యవజ్ఞ చేయుచున్నాము. నీ తిర్యక్సంతానము నిన్నెఱుంగదు. వానికిఁ గృతజ్ఞతావృత్తి వికాసమే లేదు. కనుక వానికి అవజ్ఞ సంభవముకాదు. ఇఁక నీ ప్రియసంతానము దేవతలు; వారు నీ యందు నిత్యాయుక్తులు. నిత్యము తమ ప్రకృతిరూపమున నున్న మహామాయను బూజింతురు. కాని మనుష్యులము మేము; మనుష్యశరీరము నాశ్రయించిన ప్రకృతిరూపిణిని నిన్ను, అడుగడుగున నవమానించుచునే యున్నాము. అమ్మా! నీవు లేక మా యేపనియు సాగదు. ఊపిరితీయుట మొదలు మోక్షము వఱకు నేట్టిపనియు నిన్ను విడిచి సాగుట యసంభవము. అమ్మా ! భోగరూపముతో నీవు, అపవర్గరూపముతో నీవు, సుఖరూపముతో నీవు, అసుఖరూపముతో నీవు, నవ్వురూపముతో నీవు, జననమరణ రూపముతో నీవు; బంధనముక్తిరూపమున నీవు; నీ వొక్కతెవే భిన్నభిన్నాకారములుగా భిన్నభిన్నానుష్ఠానములుగా మూర్తిబయి వెలయుదువు.

అమ్మా ! ఇంతేనా ? నేను బహుత్వప్రియుఁడను. ఎప్పుడును క్రొత్తక్రొత్త ముస్తాబులనే కోరుచుందును. ఇటులు నా కొఱకు నిత్యము క్రొత్తవేషములను వేసికొని నీ వొక్కతెవే

భిన్నమూర్తులతో వెలయుదువు. ఎప్పుడేని సాధువు నైపోఁ జూతునేని, నీ వపుడే సాధువేషముతో నన్నాడిలో నుంచుకొందువు. ఎపుడేని దొంగబుద్ధి పుట్టెనా – అపుడే నీవు తస్కర మలినవేషముతో మున్నాబయి నన్నాడిలోనికిఁ దీసికొందువు. ఈ విధముగా స్వర్గమందేమి, నరకమందేమి, నన్నొక్క క్షణమైనను నీ యొడినుండి దిగనీయలేదు. నా తల్లివై నా ప్రత్యేక ప్రతిజ్ఞను జెల్లించుటకు నమ్మిన బంటువలె, నెయ్యపు సకునివలె, నాతోనే యుందువే. అమ్మా! ఏనాఁడు నీ మహతీమూర్తి యొక్క అమృతమయాంకమందుండి బహుతోల్లాస ముబికెనో, యానాఁటినుండి, నీవు నా యొక్కనికే తల్లివైతివి. నాఁటినుండి నీవు నాతోనే యుందువు. ఎంత స్నేహము! ఎంత యాదరము! ఎంత వాత్సల్యము! కాని నే నొక్కనాఁడును దీనిని ధ్యానపూర్వకముగాఁ గనలేదు. నీవు నాకై యింత చేసితివి; చేయుచున్నావు. కాని రవ్వంతైనను ప్రతిఫలము నాశింపవు. కృతజ్ఞత లేనేలేదు; సరిగదా, అవజ్ఞయే చేయుచున్నాను. అయినను నీవు స్నేహశీలవు; పుత్రవాత్సల్యము నీ కన్ను గప్పివేసినది. నీది, నా నేరముల నెన్ను కన్నుగాదు. నా చేయు నవజ్ఞలను గాంచు నవసరము నీకు లేదు. నీ విట్టి తల్లివికదా; నిన్నెప్పుడైన 'అమ్మా!' యందునో? ఎక్కువవద్దు; ఒక్కసారి అమ్మా! యందునో? యని యెదురుచూచుచు ఱెప్పపాటులేని కంటితో రేవగల్లు నావంకనే చూచుచుందువు. అదిగో, నా నోర యథార్థ మాతృనామము వెడలుటయే, నీ మేరలేని నెయ్యమునకు బదులని యెదురుసూచుచుందువు. రాజరాజేశ్వరీ మూర్తితో నావిర్భవించు నీ యడుగులయందుఁ బూదోయిలి

నిడఁగల్గునప్పు డేమో. ఇంక మఱొకటి – నిన్నుఁ బంచలు జాఱిపోవుచున్న పాడుకొంపలో, నుపేక్షితసేవకురాలివలెఁ జేసి యుంచితిని. అమ్మా! నీ కడుపుముద్దుబిడ్డలకు, "నాయనా! మీమీ ప్రకృతియే మీ యమ్మ" అని చెప్పివేయుము. చూడుమమ్మా! అమ్మ యన నెవ్వరో యెఱుఁగనివారికిఁగూడ, "అబ్బాయి! మీ మీ ప్రకృతియే అమ్మ" అని చెప్పివేయుము. సాధన చేసియు హతాశులైనవారికిని, "మీ మీ ప్రకృతియే సాధన కాధారము" అని చెప్పివేయుము. గురుసంధానము చేయఁ జాలనివారికిని, "మీ మీ ప్రకృతియే మీ గురువు" అని చెప్పి వేయుము.

అమ్మా! నీవు త్రిగుణప్రకాశికవు. సత్త్వ రజ స్తమస్సు లనెడి మూడు గుణములచేత నీ వ్యష్టి సమష్టి ప్రకృతి వెల్లడి యగుచున్నది. అమ్మా! నిర్గుణా! నీవు తొలుదొల్త ఏకత్వ బోధముతో సంబుద్ధవగునపుడు, ఏకగుణిత వైతివి – అదే సత్త్వగుణము; మఱి నీవు, అనేక మగుటకుఁ గ్రియాశక్తిని వెలయించినపుడు, ద్విగుణిత వైతివి – అదే రజోగుణము; మఱి నీవు అనేకము కాఁగోరుటే కాక, నీ చైతన్యమయస్వరూపమును జడాకారమునఁ బరిణమింపఁజేసినపుడు మూఁడవసారి గుణితవైతివి – అదే తమోగుణము. సత్త్వగుణముగా నీ సత్, రజోగుణముగా నీ చిత్, తమోగుణముగా నీ యానందముఁ బ్రకాశించును. సచ్చిదానందమయీ! అమ్మా! నీవు నీ విశిష్ట భావములతోఁ ద్రిధా విభజించుకొని, మూఁడు గుణములతో గుణితవై, సమష్టిచే మహతివై, దైవీ ఆసురీ ప్రకృతి రూపముతోను, వ్యష్టిచే జీవప్రకృతిరూపముతోను బ్రకాశింతువు.

ఇట్టిదనరాని యవ్యక్తస్వరూపవయ్యును బుత్రస్నేహ ప్రేరణమున గుణత్రయమును బ్రకాశింపఁజేయు ప్రకృతివి. దర్శనకారులు - మూఁడుగుణముల సామ్యావస్థయే ప్రకృతి యందురు. అది యవ్యక్తము కావున నసాధ్యము. నిన్ను మేము స్థూలేంద్రియములతో భోగింపఁగోరుదుము. స్థూలులమైపోతిమి. కనుక నీ స్థూలభావమును సేవించి తనివి నొందుచున్నాము. కనుకఁ ద్రిగుణాత్మికమైన నీ వ్యష్టిమూర్తియే మా కారాధ్యము. ఇఁక సమష్టిజాడ నెఱింగినవారు - హిరణ్యగర్భులు. వారు ఉన్నతాధికారులు; వారు నీ సమష్టిప్రకృతి మహాదేవమూర్తిని బూజింతురు. మేము క్షుద్రులము; తెలివిలేని శిశువులము. ఆటబొమ్మలను బ్రేమింతుము; కనుక సర్వభావమయమును సర్వేంద్రియయుక్తము నైన నీవ్యష్టిప్రకృతిమూర్తియే మాకుఁ బ్రియము. కావున నీవు మా యెదుర గుణత్రయప్రకాశినివే యగుము. నీ యీ మూర్తిని బూజింపఁగల్గునపుడే నీ మహామూర్తిజాడ దొరుకునని మేమెఱుఁగుదుము. ఏమన, నిమ్మూఁడుగుణములను బూర్ణముగా లయమొనర్చుటకే నీవు కాలరాత్రి, మహారాత్రి, మోహరాత్రి రూపములతో వెలయుదువు.

ఎచ్చటఁ గాలము సైతము ప్రకాశింపదో యదే కాలరాత్రి; సత్త్వగుణము లయించుచోటినే కాలరాత్రి యందురు; ఇటులే రజోగుణ లయస్థానము మహారాత్రి; తమోగుణ లయస్థానమును మోహరాత్రి యని పేర్కొందురు. మోహము తమోగుణముయొక్క బహిర్వికాసము. దాని రాత్రి, యనఁగా అప్రకాశము - లయస్థానము.

గుణత్రయప్రకాశినీ! తల్లీ! వ్యష్టి ప్రకృతిరూపముతో నీవు మా తల్లి వే; మఱెవ్వరి తల్లివి కావు; మా తల్లి వే; యని యిటులు మా యమ్మను (నిన్ను) బూజింపఁగా, నీ మూడు స్వరూపములుఁ గనుగొందుము. ఇచ్చోటనే నీ యీ మూడింటి పూర్ణాభాసము చేసితివి. అందే నీ యీ మూడు రూపములు నాభాసించినవి. నీవు కాలరాత్రి రూపముతో వెలసి మా కాలజ్ఞానమును దొలఁగింపుము. భూత భవిష్యద్వర్తమానము లనెడి, మూడువిధముల కాలప్రతీతి, గంభీరమును అంధకారము నగు క్షేత్రమందు – అప్రకాశయోగ్య స్థానమందు విలీనమగుఁ గాక. సర్వమును వర్తమానముగానే ప్రతీతమగును. అపుడు నేను గాలాతీతుఁడనై మృత్యుంజయుఁడ నగుదును. నీ యరుణ చరణములను హృదయమందుంచుకొని శివుఁడ నగుదును. జీవత్వము పూర్తిగాఁ దొలఁగును. ఇదే సత్త్వగుణ ప్రలయము. మఱి మహారాత్రి రూపముతో నావిర్భవించి, నీవు మా మహత్తత్త్వపర్యన్తము విలయ మొనర్పుము. అపుడు నా క్రియాశీలత – రజోగుణముచేఁ గలిగిన చాంచల్యము లోపించి పోవును, నాకు నైష్కర్మ్యము లభించును. అపుడు నేను గేవల చైతన్యమయమైన యాత్మబోధమందే మెలఁగుచుందును. మఱి మోహరాత్రి రూపముతో వెలసి, నా జగన్మోహము, సంసార మోహమును బూర్తిగా విలుప్తము చేయుము. అపుడు నేను జయింపరాని మోహమును జయించి నిత్య చిన్మయమూర్తి యందే యెల్లపుడును మోహితుఁడ నగుచుందును.

అమ్మా! నీ యీ మూడు మూర్తులు దారుణములు బహుభయంకరములు. అచటఁ గాలశక్తి రుద్ధము. జగత్ప్రకాశము

సుప్తము. మోహశక్తి విముగ్ధము. నీ కాల (కృష్ణ) రాత్రి మూర్తిని స్మరించినంతనే జీవుఁడు భయంపడును. అమావాస్య నాఁటిరాత్రి ఘోరకృష్ణ మేఘాక్రాన్తరాత్రి సూచీభేద్యాంధకారమునందును నొక్కింత వెలుఁగుండును; గాని, అమ్మా! నీ యా కృష్ణమూర్తియం దదియు నుండదు. సర్వవిధముల వికాసమును లుప్తమైపోవును. "న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకమ్। నేమా విద్యుతో భాన్తి కుతోయ మగ్నిః॥" అదెట్టి దారుణమూర్తియో! అయిన నది స్వయంప్రకాశము; అనంత శాన్తిమయము, అహంకార శరీరము నంటియున్న సర్వవిధ జంజాలములను దొలఁగించి, మనో బుద్ధి చిత్తాహంకారముల రాజత్వమును విడిపించి, కేవలాత్మబోధమునకుఁ గొనిపోయి యచ్చట నిలుపును. రాత్రిరూపిణీ ! తల్లీ ! నీ యీ మధుమయాంక మెంత లోభనీయము! దానిని మాటలతో వర్ణించుటెట్లు? అది దేవీపురాణమం దొక శ్లోకమునఁ గానఁబడును :— "బ్రహ్మమాయాత్మికా రాత్రిః పరమేశలయాత్మికా" జీవునిమాట లెక్కయేమి? పరమేశ్వర పర్యన్తము విలీనమై పోవును. ఆ బ్రహ్మమాయ యొక్కటే నీ స్వరూపము. ఈ బ్రహ్మమాయాత్మిక రాత్రిరూపిణివి నీవు, త్రిగుణలయమునకై, జీవభావపక్షమున నత్యంత భయప్రదములగు కాలరాత్రి మహారాత్రి మోహరాత్రి రూపములతో వెలయుదువు.

ఓం. త్వం శ్రీస్త్వమీశ్వరీ త్వం హ్రీ స్త్వం బుద్ధిర్బోధలక్షణా।
లజ్జా పుష్టి స్తథా తుష్టి స్త్వం శాన్తిః క్షాన్తిరేవచ॥ ఓం. 7

అమ్మవు నీవే శ్రీవి; నీవే యీశ్వరివి; నీవే యసత్కర్మ జుగుప్సారూపిణివైన హ్రీవి; నీవే బుద్ధివి; నీవే శుద్ధ బోధ స్వరూపవు; నీవే లజ్జవు; పుష్టివి, తుష్టివి, శాన్తివి, క్షమవు.

వివరణము:— అమ్మా! నీవు సర్వజీవులందును వ్యష్టి ప్రకృతిరూపముతో విరాజిల్లు విషయమే, యీ బ్రహ్మకృత స్తోత్రమందు విశేషించి వర్ణింపఁబడినది. త్వం శ్రీః – అమ్మా! నీవే జీవుల సౌభాగ్యరూపమున నుందువు. ఎవ్వఁడేని సౌందర్యము, ఐశ్వర్యము, యశస్సు, అభ్యుదయము మున్నగు పలువిధముల సౌభాగ్యము గల్గియున్నచో, శ్రీరూపిణివైన నీవు వానిని నీ యొడిలోఁ బెట్టుకొంటివనవలసినదే.

ఈశ్వరత్వ = ప్రభుత్వము. అనఁగా వేలకొలఁది జనములపై నెవ్వనికే నాధిపత్యములభించినచో నీయీశ్వరీమూర్తితో వాని నొడిలోఁబెట్టుకొంటివని యెన్నవలసినదే.

హ్రీ – ఎవఁడేని దెలియకో తెలిసియో యసత్కర్మ మొనర్చి, నిందాభయముచే దాని దాఁచిపుచ్చఁ బ్రయత్నించునపుడు, వాఁడు హ్రీరూపవైన నీ యొడినున్నాఁడని తలంతురు.

మా నిశ్చయాత్మికవృత్తి (బుద్ధి) ప్రకాశించినపుడు, ఏది లేకున్న జగత్సత్త యుండదో, యట్టి బుద్ధిరూపముతో నీవే విరాజిల్లుమవని యెఱుంగఁదగును. జగద్బోధము లోపించి శుద్ధ బోధరూపమున నాత్మసత్త వెలసినపుడు, కేవల బోధముతక్క నితరలక్షణము లేని నీవే యీ బోధలక్షణవని చెప్పవలసినదే.

లజ్జా – నింద్యకార్యము లొనర్చుటకు నెవ్వఁడేని స్వాభావికమైన సంకోచము నొందుచో, నచట నీవే లజ్జారూపమున నా జీవునందున్నావనవలసినదే.

పుష్టి – ఎవ్వఁడేని శారీరకపుష్టిలాభమునొంది జనసమాజమునందు సాటిలేని బలవంతుఁడని వాసిగన్నచోఁ, బుష్టిరూపిణివైన నీవే వాని నొడిలో నుంచికొంటివనవలసినదే.

తుష్టి – ఎవ్వఁడేని యానందముతో నవ్వుచు దినములు గడుపుచుండునో, వానిని సంతుష్టిరూపిణివి నీవే యొడి నుంచుకొంటివని యెన్నవలసినదే.

శాన్తి – ఎవ్వఁడేని ఆత్మజ్ఞానమునొంది జాగతికములైన సుఖదుఃఖముల కతీతమైన శాన్తిమయావస్థలోనున్నచో శాంతిరూపిణివైన తల్లివి నీవే వానిని నీ గుండె కత్తించుకొంటివనవలసినదే.

క్షాన్తి – ఎవ్వఁడేని ప్రతీకారము (అపకారమునకు బదులుసేఁత) చేయు సామర్థ్యమున్నను, నితరుల యపకారమును ప్రసన్నముఖముతో నోర్చికొనుచో, క్షమారూపిణివైన నీ యంకమందు వాఁడున్నాఁడనవలసినదే.

అమ్మా! ఈ మూర్తులుగా సర్వజీవుల ప్రకృతిరూపముతో నీవు సదా వెలయుదువు; గాని మూఢులు, దానిని మానసికవృత్తి యనుచు నుపేక్షింతురు. అకటా! వారు వారి భోగవాసనలను జరితార్థములనుగాఁ జేయుటకై, వారి కూఁత యిచ్చుటకై నీవే యిటులు పలుమూర్తులతో వచ్చి యాదరించుచున్నావని యెఱుఁగరు. అమ్మా! నీ యీ నిత్యప్రత్యక్ష

మూర్తిని – అంతట నెల్లప్పుడుఁ బ్రకటమగు నీ యీ స్వరూప మును విడిచిపెట్టి, యెవ్వఁడే నెక్కడనేని, సప్తస్వర్గముల కావలనైనను, సర్వతత్త్వముల కతీతమైన క్షేత్రమునందైనను, నిన్ను వెదకికొనఁ బోఁగలఁడా? నీవు కన్నువిచ్చిన వారు మాత్రము, సర్వభావముల నీ కౌఁగిటనే కట్టువడి సదా బ్రహ్మా నందము ననుభవింతురు.

ఓం. ఖడ్గినీ శూలినీ ఘోరా గదినీ చక్రిణీ తథా ।
శంఖినీ చాపినీ బాణ భుశుండీ పరిఘాయుధా॥ ఓం. 8

అమ్మా! నీవు ఖడ్గశూలధారిణివి. నీవు ఘోరవు (నీయొకచేత నరముండముగలదు). నీవే గద, శంఖము, చక్రము, ధనుర్బాణములు, భుశుండి (ఒక తదను ముండ్లుగలయినుపదుడ్డు), పరిఘము (లోహముద్గరము) అనెడి యాయుధములను దాల్చిన దానవు.

వివరణము:—అమ్మా! వెనుకటి మంత్రమందు నీవు జీవజగత్తున (శ్రీ), ఈశ్వరీ, మున్నగు పదివిధముల స్వరూపము లతో నాత్మప్రకాశము చేసికొనుట వర్ణింపఁబడినది. అది మాతృభావముతో – బ్రహ్మభావముతో నుపాసింపఁబడనిచోట, అనఁగా, "మనో బ్రహ్మేత్యుపాసీత" యనెడి శ్రుతి ప్రతిపాదిత సాధనకు విముఖులైనవారియెడ, నీ యీ మూర్తులు, ఉత్పీడన మొనర్చు దశ ప్రహరణములను దాల్చిన మూర్తులతో నావిర్భవించును. వాస్తవముగా నిది యుత్పీడనము కాదు. శాసనాకారమున మాతృస్నేహత్వముయొక్క బహిర్వికాసమే. తెలివిలేని శిశుసంతానమును దళించుగా శాసనరూప స్నేహ

వికాసముతో, ఉజ్జ్వల జ్ఞానక్షేత్రమునకుఁ దెచ్చుచుందువు. కావున నీవు ఖడ్గ శూల గదాదులగు నాయుధములతో నలంకృతవై యావిర్భవింతువు.

శ్రీరూపిణి ప్రకృతియొడియం దుండియు – అనఁగా సర్వవిధ సౌభాగ్యములతో ధన్యుఁడయ్యును జ్ఞానహీన శిశువు వలె, నా సౌభాగ్యములను భోగించుచునేని – నీవే వాని యభ్యుదయ రూపముతో వెలయుచున్నావని కనుగొనఁడేని, అభ్యుదయరూపిణీ! అమ్మా! యని నీ యడుగులందుఁ గృతజ్ఞతతోఁ బుష్పాంజలి నిడఁడేని, శ్రీరూపిణివయ్యు వానియెడ నీవు ఖడ్గినీ మూర్తితోఁ బ్రకటిత వగుదువు. అనఁగా వెంటనే యా సౌభాగ్యసుఖమును ఖడ్గముతో నఱికినట్లుగా విచ్ఛిన్నము చేయుదువు. శ్రీరూపముతో నీవు వచ్చితివని తెలుపుటకై – నిన్నుఁగానక తానే సౌభాగ్యకర్తనని కూర్చున్న యా యహంకారము తలను తెగఁగొట్టుటకై నీ శ్రీమూర్తిని ఖడ్గధారిణీ స్వరూపముతోఁ బ్రకటింతువు.

ఇటులే ప్రభుత్వలాభము నొందియు, నీ యైశ్వరీ మూర్తిని లెక్కింపక నిందించువానియెదుట నీవు శూలధారిణీ మూర్తితోఁ బ్రకటిత వగుదువు. ప్రభుత్వమునుండి పతనమనెడి శూలాఘాతముతో వానిని వేధింతువు. కావున నీ యైశ్వరీ మూర్తి శూలధారిణి.

అసత్కర్మములను జేసి నిందాభయమున గోపనముచేయువాఁడు, హ్రీంమూర్తిరూపిణివైన నీ యంకమందున్న జీవుఁడు, నిన్నుద్దేశింపక నిన్ను స్మరింపకున్నచో, వెంటనే నీవు నరముండము నొక చేతఁ దాల్చి ఘోరరూపముతోఁ బ్రకటవై, వాని

యీ యసత్కార్యమును జనసమాజమునందు వెల్లడించి, నీకు శరణాగతుఁడగు శిక్ష వేయుదువు.

ఇటులే బుద్ధివృత్తిని నీస్వరూపముగానే కానక బుద్ధి మాత్రముగానే తలంచువాఁడు, మాటిమాటికి దైవప్రతికూలత యనెడి గదాఘాతములచేఁ గొట్టఁబడి తన బుద్ధిని భ్రమసంకుల మని తలంచి వ్యథనొందుచుండును, గావున బుద్ధిరూపిణివైన తల్లివి, ఆ చోట గదాధారిణీమూర్తిగాఁ బ్రకాశింతువు.

నీ కృపచే శుద్ధబోధ సంధానము నొందియు దానిని తత్త్వమాత్ర జ్ఞానముగాఁ దలంచి యుపేక్షించుచు నొక యాకాశీయ భావమాత్రముగా నెన్నువాని సంసారచక్ర పరిభ్రమణము నివృత్తముకాదు గాన, నీ బోధలక్షణమూర్తి, యజ్ఞానిజీవులయెడఁ జక్రధారిణీమూర్తితోఁ బ్రకటితమగును.

అసత్కార్యములవలన సంకోచమనెడి లజ్జను నీ విశిష్ట భావముగాఁ జూడనివాని, యీ నిందితకర్మములు శంఖధ్వనిచే వలె సర్వలోకములందు విదితములై పోవును; గావున నీవు లజ్జారూపముతో శంఖిని వగుదువు.

తన శారీరకపుష్టిని, ఆహారము ఔషధము వ్యాయామము మున్నగువాని ఫలముగానే యెంచి పుష్టి (పోషణశక్తి) రూపిణివైన నిన్నునాదరించువాని యాపుష్టి కురోగరూపముగాఁ బరిణమించి నీ చాపినీ (ధనుర్ధారిణీ) మూర్తియొక్క యావిర్భావము ఘోషించును.

మానసికతుష్టిని నీ మూర్తిగాఁ జూడక విషయభోగ సంధానమునే చేయువాఁడు, ఆకస్మికముగా గొడవలలోఁ బడి

పోవుట యనెడి బాణవేధ యగుటచే వాని మర్మస్థానములు, సదా వ్యథితములే యైపోవును, గాన నీ తుష్టిమూర్తి బాణ ధారిణి.

శాన్తినొందియు, నీ శాన్తిరూపిణీమూర్తి నిజూడక, జ్ఞాన సంపన్నుఁడయ్యు జీవుఁడు సాంసారిక దుర్ఘటనముల నెడి లోహ దండముచేనైన యాతనను సహించును; గావున నీవు శాంతి రూపముతో భుశుండీధారిణివి.

ఇతరులను క్షమించి నీ క్షమామయమూర్తిని జూడ కుండువారు పరులచే ననుచితపీడలనొంది నీ పరిఘధారిణిరూపము వికసించుట కాంతురు.

ఈ విధముగా సర్వభావములతో నిన్నే చూడనివాఁడు, నిన్నుఁ జూడకున్నంతదాఁక, నీ వాయా భావములతో నేదే నొక పీడకలిగించి వానికి బుద్ధికఱపుచుందువు. నీ బిడ్డల యజ్ఞాన మును దొలఁగించుటకే నీ యీ శాసనమూర్తుల వికాసము. ఒక్కసారి శాసనమును దెలిసికొనలేనియెడల నీవు బాధ్యవై మాటిమాటికి నిట్టి విభిన్నాయుధములు దాల్చిన మూర్తులతో నావిర్భవింతువు. ఇది నీ సంతానవాత్సల్యమున కపూర్వనిదర్శ నము. సంతానము నపూర్ణముగాఁ (లోపముగల వానిగా) గను గొని పూర్ణవైన నీవు తృప్తినొందఁగలవా ? కావున సంతా నము కోరికనుబట్టియే సంతానము నభిలాషములను బూరించు టకై, అంతఃస్థలమునుండి నీ శుభమయమహేచ్ఛ గుప్తముగా నడుచుచుండును. జీవుఁడు సర్వభావములతో నిన్ను గానలే నన్నాళ్లును నీ యీ యిచ్ఛ శాసనాకారముగానే వెలయుచుం డును. ఇఁక నిన్నుఁ జూడఁగలవారియెడ నీ వాయామూర్తులతో వెల

యక సౌమ్యమూర్తులతోనే యావిర్భవింతువు. ఇదే యీ పై రాఁబోవు మంత్రమందుఁ జెప్పఁబడినది.

ఓం. సౌమ్యా సౌమ్యతరాశేష సౌమ్యేభ్య_స్త్వతి సుందరీ ।
పరా పరాణాం పరమా త్వమేవ పరమేశ్వరీ ॥ ఓం. 9

అమ్మా! నీవు సౌమ్యవు; సౌమ్యతరవు; సౌమ్యతమవు. నీ వతిశయ సౌందర్యవిశిష్టవు. నీవే పరా, అపరా యను రెండిటికి నాశ్రయమవు; పూజనీయవు; కావున నీవే పరమేశ్వరివి.

వివరణము:— అమ్మా! సర్వభావములతో నిన్నుఁ జూచు నలవాటులేని జ్ఞానహీన శిశువుల జ్ఞాననేత్రమును దెఱచుటకై, నీ వనేక శస్త్రధారిణీమూర్తులతో నావిర్భవింతువు. ఇఁకఁ దమ తమ ప్రకృతిని 'దల్లి' యనుచుఁ దెలిసికొని సర్వత్ర సర్వభావములతో, అమ్మదే కర్తృత్వ మనియుఁ, దాము యంత్రస్వరూపులే యనియు నెంచి "ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి । భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" (గీత 18_61) యనెడి గీతోక్తమంత్రమును సాధించి సిద్ధులైనవారి యెదుట నీవు సౌమ్యమూర్తితోనే వెలయుదువు.

సర్వభావములతో, నీవొక్కతెవే విరాజిల్లుదువని తెలివితో నెన్నువారియెడ - అనఁగా బుద్ధియోగమునకుఁ బ్రథమాధికారులైన వారియెడ, నీవు సౌమ్యవు. నీకుఁ బ్రాణసమర్పణము చేసి, తమ ప్రాణమును బ్రవాహ విశేషమాత్రముగాఁ గనువారి యెదుట, అమ్మా! నీవు సౌమ్యతరవు.

మఱి సర్వభావములతో నీకు మనస్సు నర్పింపఁగలవారియెడ, అనఁగాఁ బూర్తిగా మనస్సును నీయందే చేర్చివేయఁగలవారియెడ నీవు, "అశేష సౌమ్యేభ్యస్త్వతిసుందరీ" అనఁగా సౌమ్యతమమూర్తితో వెలయుదువు. బుద్ధియోగులయెడ నీవు సౌమ్యవు; ప్రాణదర్పులైనవారియెడ నీవు సౌమ్యతరవు; మఱి మనోవిలయము నొనర్చువారియెడ నీవు సౌమ్యతమవు. అమ్మా! సంపూర్ణముగా మనస్సును నీ కర్పింపఁగల సౌభాగ్యము నొందిన సంతానము సర్వభావముల మాతృమయమేయై పోవును. వారి స్థూలేంద్రియములపర్యంతము మాతృధర్మమును మాతృ మహిమమును ననుభవించుచుండును. వారు లోను వెలిని సర్వత్ర, అమ్మ సౌమ్యతమమూర్తి వెలయుటే చూచి ముగ్ధులగుచుందురు. అమ్మా! నీ సౌందర్యము కంటఁబడినవారు మఱెన్నఁడైన నీ జాగతిక విశిష్ట సౌందర్యముచే నాకర్షింపఁ బడుదురా? తన ప్రహ్లాదినీశక్తి వికాసమును జూపి, జీవులను ముగ్ధులను జేయునట్టియుఁ, జంద్రునందును, గమలమందును, గామినీ కమనీయ ముఖమండలమందును దోఁచు సౌందర్యము, నీ సౌందర్యరాశియొక్క కోటిపాలునకైనను సాటికాదు. జగత్తునందెక్కడ నెంత సౌందర్యమున్నను, అది నీ సౌందర్య సముద్రమందలి యొక చిన్న చినుకుమాత్రమే. సకల బ్రహ్మాండములందును గల సౌందర్య కణములను నొక్కచోటఁ జేర్చుటచేఁ గల్పింపఁబడు సౌందర్యరాశి, నీ సౌమ్యతమమూర్తియొక్క యాభాసమే.

అమ్మా! నీవు "పరా పరాణాం పరమా" పర - బ్రహ్మాదులు, అపరా - దేవ మనుష్యాదులు ఈ యిరుతెగలకును నీవు

ఆశ్రయమవు (పూజ్యవు). కనుక నీవే పరమవు. సర్వశ్రేష్ఠవు. నీవే పరమేశ్వరివి. మును జెప్పిన నీ త్రివిధసౌమ్యమూర్తులను జూచి ధన్యులై బుద్ధి ప్రాణ మనస్సులను లెస్సగా మాతృయుక్త మొనర్చినవారు మాత్రమే, బ్రహ్మ మొదలు కీటాణు పర్యంతము, ననంతకోటిబ్రహ్మాండములును నీ సత్తచేతనే సత్తావంతములని కనుఁగొనగలరు. ఈ బ్రహ్మాండ యజ్ఞాగారమునకు ముందువెనుకలఁ, గ్రిందుమీఁదుల నున్నదంతయుఁ దెలిసియో తెలియకో నీ పూజయందే నిరతమైయున్నది. వాని యెదుర నీవీ పరమేశ్వరమూర్తితోనే ప్రత్యక్షమగుదువు.

'ఇచట నింకను జెప్పఁదగినది — తమ తమ ప్రకృతిని, 'అమ్మ' యని తలంపఁగలుగుటచే సర్వభావముల మాతృయోగమందే యలవాటుపడుటచే నా ప్రకృతి జగద్ధాత్రియైన దైవీ మహతీ ప్రకృతిరూపమునే యనుభవింపఁబడును. అపుడు దానిని దీనయు మలినయునైన యమ్మగాఁ దలంపరు. ఆ యవస్థయందు సాధకులు — ఇన్నాళ్లును దేనిని కేవలము అమ్మ యని తలంచిరో, యదే పరాపరపూజ్యయు, పరమయు, పరమేశ్వరియు నని కనఁగల్గుదురు. మా యమ్మయే సర్వజగత్తునకు అమ్మ, యను నీ యనుభవము సాధకునకుఁ గల్గునపుడు, అతఁడు తల్లిని సౌమ్యతమగాను, అతిసుందరిగాను జూడక, మఱల మలిన వికారమూర్తిగాఁ జూడఁగలఁడా?

ఈ సూర్యుఁడు లెక్కలేని గ్రహములచేతను, ఉపగ్రహములచేతను జుట్టుకొనఁబడి, మన యమ్మ యంగమందుఁ గిరణముల వెదఁజల్లుచున్నాఁడని కనఁగల్గునపుడు, ఈ వాయువు పూదావి సిరిని మోచి తెచ్చి మన యమ్మకుఁ దనివిఁ గూర్చు

చున్నాఁడని కనఁగల్గునపుడు, మేఘమాల పవిత్రజలమును గురిసి యమ్మ యంగమును స్నిగ్ధముచేయుచున్నదని కనఁగల్గునపుడు, ఎత్తైన పర్వతపంక్తి తలయెత్తి మన యమ్మను దర్శించుటకే ధీరముగా నిల్చినదని కనఁగల్గునపుడు, పూచిన చెట్లగుమి మన యమ్మ యడుగులందుఁ బూదోయిళ్ల నిడుచున్నదని కనఁగల్గునపుడు, పలుతెగల పక్షులు అవ్యక్త మధురస్వరముతో మాతృవందనగీతములే పాడుచున్నవని కనఁగల్గునపుడు — ఈ విధముగా సర్వవిధముల సర్వత్ర మన యమ్మ సేవాపూజలే సాగుచుండుట కనఁగలుగునపుడు, మఱి 'నేను' యేమైపోవునో వర్ణింపఁగలమా? అపుడు మఱి 'నేను' ఉండదు. ఉండునది యమ్మయే. అమ్మ వాసుదేవమూర్తియే. ఇట్టి యవస్థయందు సాధకుఁ డొక యద్వితీయ బ్రహ్మమూర్తిసంవేదనముతోఁ బూర్తిగాఁ దన్నుఁ దా మఱచిపోవును. ఇదే మన యమ్మగారి యతిసుందర సౌమ్యతమ పరమేశ్వరీమూర్తి.

ఓం. యచ్చ కించి త్క్వచిద్వస్తు
సదసద్వాఖిలాత్మికే ।
తస్య సర్వస్య యా శక్తిః
సాత్వం కిం స్తూయసే తదా ॥ ఓం. 10

అఖిలాత్మికా! జననీ! సద్వస్తువేమైన, నసద్వస్తువేమైన, నంతయు నీవే. సర్వవిధముల విరాజిల్లు శక్తియు నీవే. కాఁగా మఱి నీ స్తవమన నెట్టిది? (నిన్నేమని స్తుతించుట?)

వివరణము:— తమ ప్రకృతినే అమ్మ యని సాధనక్షేత్రమందు ముందంజవేయువారు, ఏ విధముగా మెట్టుమెట్టున భేద

జ్ఞాన రహితమైన యద్వైతతత్త్వమును జేరుదురో, అదియే యీ బ్రహ్మకృత స్తోత్రమందు, ఒక్కొక్కటిగాఁ జూపఁబడినది. అమ్మా ! నీవు పరమాత్మరూపమున నతికష్టముచేఁగాని యనుభవమునకురావు. కాని, ప్రకృతిరూపమున మనుష్యమాత్రుల యనుభవమునకు వత్తువు. ప్రకృతిరూపిణివైన నీ సేవ చేయుట చేతనే నీ పరమేశ్వరీమూర్తి తెలియఁబడును. అపుడు సత్ అసత్ అనుట కెట్టిభేదము నుండదు. సర్వమయమును జగన్మయమును నైన యాత్మవికాసమునుజూచి, సర్వరూపములుగాఁ బ్రతీతమగు బహుత్వము ఆత్మయొక్క శక్తిమాత్రమే యని తెలియుటచేతనే జీవుల సర్వసంశయములు తొలఁగును.

సర్వము నా ప్రకృతియే; నా యమ్మ; నా యాత్మ నేను, స్తుత్యము, స్తోత, స్తుతి యను సర్వము నేను, అమ్మయైనపుడు, మఱి యెవ్వరెవ్వరిని స్తుతించుట ? "యదా సర్వమాత్మైవాభూత్తదా కేన కం పశ్యేత్" అను నీయనుభవము కలుగు క్షణమందే యన్నివిధముల క్రియలును ఆగిపోవును. పూజింపఁబడునది, పూజించువాఁడు నను భేదముండదు. ఒకటే యైపోవును. అహంత్వమహాప్రసారమందు – (సర్వము 'నేను' అను తెలివి వ్యాపించునపుడు) జీవభావము (క్షుద్రాహంత) మునిఁగిపోవును. "సర్వస్య ప్రకృతిః" అన్నదే మహాదేవి యైపోవును. చిత్తవిక్షేపము, వాక్కు, నిశ్శ్వాసము హృదయపిండక్రియయుఁ దమంతనాఁగిపోవును. ఏకమును ఘనమును ఆనందమయమునైన సత్తమాత్రమే నిల్చియుండును. దేనియందుపస్థితుఁడైనపుడు, ఉన్నది "అస్తి" యని తోఁచునో, ఆ మాటయే యిచటఁ జెప్పఁ

బడుచున్నది. జగత్తుయొక్క అస్తిత్వము వీని యెఘటఁ జెప్పఁ బడదు – అనఁగా జగత్తున్నదని వీనికి దోఁచదు. అది యుండనీ.

ఓం. యయా త్వయా జగత్స్రష్టా
జగత్పాతాత్తియో జగత్ ।
సోఽపి నిద్రావశం నీతః
కస్త్వాం స్తోతు మిహేశ్వరః॥ ఓం. 11

జగదుత్పత్తి స్థితి లయ కర్తయైన యా విష్ణుఁడే నీ ప్రభావముచే యోగనిద్రాచ్ఛన్నుఁడైనపుడు, మఱి నిన్ను స్తుతింపఁ జాలువాఁ డెవఁడు ?

వివరణము:— ఏ ప్రాణమువలన సర్వజగత్తు పుట్టినదో, ఏ ప్రాణమందే నిల్చియున్నదో, ఏ ప్రాణమందే యది లయ మొందునో (సృష్టి స్థితి ప్రలయకారి యగు) యా ప్రాణమే (విష్ణుశక్తియే) యోగనిద్రచేఁ గ్రమ్మబడినది. ఆ విష్ణువే జగద్బీజ పర్యంతము (జనన మరణ మూలసంస్కార పర్యంతము) దొలఁగింప విముఖుఁడైనపుడు, మఱి నీ స్తుతి యెవఁడొనర్చును? నేను (బ్రహ్మ) ప్రాణము నొడియందున్న మనస్సును. విష్ణుని (ప్రాణ) సహాయత లేక నిన్ను స్తుతించు శక్తి నాకేదీ ?

ఓం. విష్ణుః శరీర గ్రహణ
మహ మీశన ఏవ చ ।
కారితాస్తే యతోఽతస్త్వాం
కః స్తోతుం శక్తిమా న్భవేత్॥ ఓం. 12

విష్ణుఁడు, నేను, ఈశానుఁడు నను మువ్వురము నీవల్ల నే జన్మ మొందితిమి (మా శక్తి నీశక్తియే యయ్యె). అపుడు నిన్ను స్తుతింప నెవఁడు సమర్థుఁడు ?

వివరణము:— అమ్మా! నీవే జ్ఞానప్రాణ మనోరూపము లతో వెలసి, శివ విష్ణు బ్రహ్మ నామములతో వాసి కెక్కుదువు. నీవు జీవభావము నొందు సంస్కారరూపముతో నిన్ను వెలయించుకొన్నపుడే, నీపేరు మనస్సు ఇటులు ప్రత్యేక జీవుని హృదయమందు ననుభవింపఁబడు వ్యష్టిచైతన్యమే ప్రాణము. ఇటులే ప్రతి జీవునియందు సదా ప్రకాశించు బుద్ధియే, జ్ఞానమను పేరఁ బ్రసిద్ధము. ప్రత్యేకజీవునందు ననుభవింపఁబడు వ్యష్టి మనః ప్రాణ జ్ఞానములు, ఒక సమష్టి విరాణ్మనః ప్రాణ జ్ఞానముల యొక్క చిన్న చిన్న బుడగలే. ప్రత్యేక జీవునియందు మనస్సు ప్రాణము జ్ఞానము, అను పేళ్లతోఁ బ్రసిద్ధములైనవే, సమష్టియందు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల నెడి పేళ్లతోఁ జెల్లును. ఈ సర్వమును మహామాయవు, అమ్మవు నైన నీవికాసమే యైనపుడు, మేము నీవుగాక యితర మేమియుం గానపుడు, మఱి నిన్ను స్తుతింప మాకు సామర్థ్యమెక్కడిదీ ?

ఇచట సాధనరహస్యము కొంచెము చూపఁబడినది— ఈ విరాణ్మనః ప్రాణ జ్ఞానముల – అనఁగా బ్రహ్మ విష్ణు మహేశ్వరుల సాక్షాత్కారము నొందుటకై తమ జీవభావీయ మనః ప్రాణ జ్ఞానములను సంధానింతురు. వానిని బ్రహ్మ విష్ణు మహేశ్వరులని పూజలు చేయుదురు. భూమిలోపల దాగియున్న జలప్రవాహమును దాకుటకై తమ పెరటిలో నొక నూయి త్రవ్వుటచేఁ గోర్కె నెఱవేఱునటులే, విరాట్ – సమష్టి –

సంధానము చేయుటకై, తమ లోపలనే యెల్లప్పుడు ననుభ వింపఁబడుచున్న వ్యష్టిసత్తా నాశ్రయించుటకును. నీలోనే ప్రకాశించు మహామాయా బిందువునే, నీ యధికారమందున్న ఆ యింత యంశమునే బ్రహ్మ విష్ణు మహేశ్వర జననియని తెలియఁ బ్రయత్నింపుము. ఆమె చరణములకే, నీ సుఖ దుఃఖములను నివేదించుకొమ్ము. ఆమెయే మహాశక్తి రూపముతోఁ బ్రకటిత కాఁగలదు. నీ దౌర్బల్యములఁ దొలఁ గింపఁ గలదు.

ఇచ్చట బ్రహ్మ స్తుతించి స్తుతించి, యెచట సర్వమయ మాతృకర్తృత్వమును దర్శించి, సర్వవిధముల మాతృస్వరూ పము ననుభవించి, సర్వత్ర మాతృశక్తి ననుభవించి, క్రమ స్తుతిచేయ విరమించెనో, యట్టి క్షేత్రమునకు వచ్చి నిల్చెను. (అనఁగా నట్టి యవస్థకు వచ్చెను.) సాధనక్షేత్రమందు సైతము సరిగా నిట్టులే యగును. ప్రారంభమందు ద్వైతజ్ఞానము నూఁత చేసికొని, జీవేశ్వరభావములను రెంటిని నాశ్రయించి యగ్ర సరుల మగుదుము. క్రమముగా ద్వైతప్రతీతి లోపించి యాత్మాను భూతి వెలయుచుండును. జీవయాత్రాసాధనచేతనే యనుము; ప్రతిదిన సంధ్యావందనాద్యనుష్ఠానములచేతనే యనుము; ఇట్టి యనుభవమునే చేయుదురు. సాధకులు ప్రతిదినముచేయు నుపా సనచేత, నిట్టి యవస్థాభాసము నొందనంతదాఁక, సాధన సరిగాఁ గాకున్నదని తెలిసికొనవలసినదే. ప్రతిదిన సాధనమందును నింత వఱకు నొక్కసారి సాలోక్యాది చతుర్విధముక్తులలో, మొదటి మూఁడింటి యాస్వాద మగుచుండును. కావలయును. అది మున్ముందు చెప్పఁబడును.

ఓం. సా త్వమిత్థం ప్రభావైః స్వైః రుదారైర్దేవి సంస్తుతా ।
మోహయైతౌ దురాధర్షా వసురౌ మధుకైటభౌ॥ఓం. 13

ఓం. ప్రబోధంచ జగత్స్వామీ నీయతా మచ్యుతో లఘు,
బోధశ్చ క్రియతామస్య హంతుమేతౌ మహాసురౌ॥ఓం.14

ఓ దేవీ ! నీ యత్యుదారప్రభావముచే స్తుతింపఁబడితివి. (నిత్యతృప్తవు నీవు విశేషించి ప్రసన్న వగుదువని ప్రార్థించుచున్నాము.) దుర్దమనీయులైన మధుకైటభాసురులను ముగ్ధులను జేయుము. జగన్నాథుఁడైన విష్ణుని మేల్కొల్పుము. అమ్మహాసురులను నీవు చంపవలయునని తెలుపుము.

వివరణము:— అమ్మా! ఇన్నాళ్లకు నీ స్తుతి నీ సాధన నీవే చేసికొనుచున్నావని తెలిసినది. అత్యుదారమైన నీ ప్రభావము, నీ యలౌకికమహత్త్వరచనము, మహాశక్తివైన నీ యనిర్వచనీయ కథలు, నీ స్నేహముయొక్క యనంత నిర్భర రహస్యము నీవయి వర్ణింపక, తమంత వెల్లడిగాక, నీవు కోరి పట్టువడనీయనిచో, నిన్నెఱింగి పట్టుకొనుట యెవరికి శక్యము? "నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన" ఎన్ని శాస్త్రములు చదువనీ, ఎన్ని వేదములు చదువనీ, ఎంత తపస్సు చేయనీ, నీవే దయఁదలఁచి నిన్నుఁ దెలుపక పోయినచో, నిన్నెవఁడును దెలిసికొనఁజాలఁడు. నిన్ను స్తుతించి, నీ విశిష్టప్రభావమును గనుగొని ముగ్ధుఁడనైతిని; గాని విశేషించి యీ నోర వెడలు స్తుతి వ్యాఖ్యల రూపమున నీవే యావిర్భవించితివని తెలియఁగల్గితిని. నీ స్తుతి నీవే చేసికొని, దాని ఫల

ముగా నిత్యతృప్తవైన నీవు విశేషప్రసన్నురాల వగుదువు; కావుననే — అమ్మా! నీ పరమకరుణ వెలయించి, స్వప్రకాశ పరమేశ్వరీమూర్తితో నావిర్భవించి యీ మధుకైటభాసురులను మోహితులను జేయుమని వేడుకొనుచున్నాము. నీ యీ బహుత్వవాంఛ, నీ యీ బహుత్వక్రీడయు మమ్ములను బాధించుచున్నవి. ఇది పూర్తిగా స్థిరపడి, నీ సౌమ్యమూర్తిని, నీ జగదతీత సౌందర్యమును అనుభవింపనీయకున్నవి. ఈ సురవిరోధులిరువురును దమ యాసురీభావములను విడిచి, నీ యేకరసానంద ఘనమూర్తిచే ముగ్ధములై పోవునట్లు చేయుము.

వీరిని ముగ్ధుల నొనర్చినంతమాత్రానఁ బని కాదు. ఏ ప్రాణశక్తియొడినుండి వీరు బయలుదేరిరో; ఎవ్వఁడొక్క క్షణమైనను నెవ్వరి హృదయబృందావనమునుండి విచ్యుతుఁడు కాఁడో, యట్టి యచ్యుతుని విష్ణు నెటులో మేల్కొల్పుపనియు నీదే; ఏమన, నాతఁడు యోగనిద్రాచ్ఛన్నుఁడై నాఁడు; కావుననే యీ యసురు లత్యాచారము జరుపుచున్నారు. క్షణికమైన యాత్మమిలనమోహముచేఁ బ్రాణము, జగద్వ్యాపార సమూలనాశమువలన విముఖమైయున్నది. ఇయ్యిరువుర నసురులను జంపుటచే నానందము చిరస్థాయియగును. ఇది తెలిసియుఁ దలఁపకున్నాఁడు. కనుక నే యసురవధము నెడ విముఖుఁడైనాఁడు.

"ఇప్పుడు మాకు సంసార మక్కఱలేదు. విషయము లక్కఱలేదు; దేహేంద్రియ మనోబుద్ధిప్రకాశ మక్కఱలేదు. కేవలము నిత్యసనాతనమాతృచరణములనే కోరుదుము." అని నోరితో నందుము గాని, ప్రాణమువంకఁ జూచినచో నిది వట్టి

మాటయే యని తోఁచును. ప్రాణము యథార్థముగాఁ బూర్ణ భావముతో, అమ్మను గోరదు. ఎంత కోరిన నంత లభించును. ప్రాణమింకను బూర్తిగా జగత్తేలనమును దొలఁగింప నొల్లదు. కావున యోగమన్నను నిద్రయే. ఈ నిద్ర తొలఁగవలయును.

యోగులు మాటిమాటికి సమాధివదలి లేచి కూర్చుం దురు. దానికిఁగారణము మఱేమియుంగాదు. ఈ యోగనిద్ర – మధు కైటభులు = అమ్మ, జగత్తు, ఈ రెండును నుండుదాఁక యని కోరుదురు. వారు రెండిటితోను నేస్తము చేయుచునే ముందడుగు వేయఁ గోరుదురు. కాని, అమ్మా ! నీవు సర్వ గ్రాసినివి. ఏకముగా నన్నిఁటిని మ్రింగివేయక నీవు తనివి నొందవు. కనుక నీ యసురపీడ ప్రాణమునందే వికసింపఁ జేసి ప్రాణముచేతనే యీ యసురులను జంపింపుము. పూర్తిగా నీలోఁ జేర్చివేసికొనుము. ఇదే నీ మధుకైటభవధ రహస్యము.

ఇచట బ్రహ్మ అమ్మను మూడు వరముల నడిగికొనుట కానవచ్చును. 1. మధుకైటభుల మోహము; 2. విష్ణుని మేలు కొలుపుట, 3. విష్ణువునం దసురవధ బుద్ధిని రేఁగఁగొట్టుట. ఇమ్మూడును గాకున్న దుర్జయాసుర వినాశముకాదు. ఏమన – అసురరూపమున నున్నదియు అమ్మయే. అమ్మయొక్క యీ యాసురీప్రకృతి, తానయి యీ యసురవధమును గోరకున్నచో వారినిజంపు సామర్థ్య మెవరికిని లేదు. రెండవది, విష్ణువు – ప్రాణ శక్తి, చక్కఁగా జాగరితము గాకయున్న, మాతృలాభము

కాదు. మూడవది, మాతృమిలనాభిలాషము పూర్ణముగా రేఁగినప్పుడే, ప్రాణము జగద్ధ్యానమును మథింపఁగడఁగును. ఇదే విష్ణుని కసురనిధన బుద్ధిని రేఁగఁగొట్టుట.

ఇది శ్రీ మార్కండేయ పురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
ప్రథమచరిత్రమున, మధు కైటభ వధమును జేయింప
విష్ణుని మేల్కొల్ప, యోగనిద్రారూపిణిని
దేవి నుద్దేశించి బ్రహ్మ చేసిన స్తుతికి
శ్రీకామశివాని, శ్రీ శ్రియానందనాథుఁడు
ఈశ్వర సత్యనారాయణశర్మ
వ్రాసిన వ్యాఖ్య.
శ్రీపరదేవతార్పణము.

శ్రీమాత్రే నమః

ఓం నమ శ్చండికాయై.

# సాధన సామగ్రి

## మహిషాసుర వధానంతరము

## శక్రాది కృత స్తుతి.

[ ప్రార్థనము — సంకటములను విడిపింపఁగోరుట.
స్తవము — సంకటములు తొలఁగినపైని గుణానువాదము.]

ఓం ఋషిరువాచ ఓం.

ఓం. శక్రాదయః సురగణా నిహతేఽతివీర్యే
తస్మిన్ దురాత్మని సురారిబలే చ దేవ్యా।
తాం తుష్టువుః ప్రణతినమ్రశిరోధరాం సా
వాగ్భిః ప్రహర్షపులకోద్గమ చారుదేహాః॥ ఓం. 1

ఋషి చెప్పుచున్నాఁడు:—

దేవిచేత - నయ్యతిబలశాలి, దురాత్ముఁడు మహిషాసురుఁడును వాని సేనయు జంపఁబడినది. ఇంద్రాది దేవతావర్గము మెడలను మూఁపులను వంచి ప్రణమిల్లుచు వాక్కులతో నామెను స్తుతింపఁగడగెను. ఆనందవశమున నొడలు గగుర్పొడుచుటచేత దేవతల శరీరములు మనోహరములయ్యెను.

వివరణము:— ఈ యధ్యాయమందు దేవతల స్తుతి వర్ణింపఁబడినది.

మహిషాసురుఁడు దురాత్ముఁడు - అసత్ప్రకృతి. ఎవని ప్రకృతి యసత్ప్రియమై, పరిచ్ఛిన్నతయెడ ముగ్ధమై ఖండఖండ జ్ఞానముతోనే తనియునో, వానిని అసత్స్వభావుఁడు దురాత్ముఁడు ననవలయును. అమితవీర్యుఁడైన అసత్స్వభావుఁడైన మహిషాసురుఁడు తన సేనలతోసైతము చంపఁబడెను. బహిర్ముఖ వృత్తిప్రవాహముతోఁ గూడిన రజోగుణము పూర్తిగా బాధింపఁబడినది. కనుకనే సత్త్వగుణప్రకాశమనెడి దేవతా బృందము, ఇపుడు స్థిరముగా మాతృస్వరూపదర్శనము ననుభవింపగలదు. అమ్మయొక్క యీవిశ్వమోహనరూపము ప్రత్యక్షమైనపు డెవ్వఁడును మిన్నకుండఁజాలఁడు. వెలి లక్షణములు - జ్ఞానము భక్తి కర్మములు అను మూఁడును ఒక్కసారి బయల్పడును. కావున నింద్రాదిదేవతలు, ఆనందముతో మాతృమహాత్వ కీర్తనమనెడి స్తుతి చేసిరి.

ఈ స్తవమందు మూఁడు విషయములు ముఖ్యముగా గుర్తింపఁదగినవి. 1. ప్రణతి నమ్రశిరోధరాం సా. 2. చారు దేహాః. 3. వాగ్భిః, అనునవి. కాయిక మానసిక వాచికము లనెడి మూఁడు విధముల స్తుతులను లక్షించియే, యీ మూఁడు పదములు ప్రయోగింపఁబడినవి. మనము వరుసగా వీనిని దెలియఁ బ్రయత్నింతము. దేవత లీ విధముగాఁ బ్రణతులైరి. వారి మెడలు మూపులుఁ బూర్తిగా వంగిపోయినవి. ఇదే కాయిక స్తుతి. సాష్టాంగప్రణామము. అమ్మను స్మరించుచునే యీ విధముగా సర్వాంగములు నామె చరణములందు నమ్రములు కావలయును. అనంత జననమరణములందు సారథియైన యే యమ్మ నొక్కసారి దర్శించుటకై లక్ష జననమరణములనెడి

తియ్యగటి చిప్పలలో నలిగి పిండియైరో, ఆ యమ్మ నేఁడు ఎదుర నిల్చినది. ఆమె స్నేహము, ఆమె విరాట్కార్త్వత్వము, ఆమె మహాతీశక్తి తలంపునకు వచ్చునపుడు, బిడ్డలదేహము తప్పక వంగిపోవును. ఆనందముతోఁ బులకించుచు. కన్నీరు, వణఁకు మున్నగు సాత్త్వికలక్షణములు బయలగును. ఇదే మానసిక స్తుతిలక్షణము. ఈ రెండిటితోనే, అమ్మమహత్త్వము వాక్కులతో నప్రయత్నముగా స్తుతింపఁబడును. ఇదే వాక్యస్తుతి. అమ్మా! నీవు అనిర్వచనీయవు. మనసునకు మాటలకు నందవు. అయినను మేము వాక్కులతో నిన్ను స్తుతించుచున్నాము. దీని ఫలముగా మా వాక్కు శుద్ధినొందును. నాలుక నంటిన జడిమ తొలఁగిపోవును. సదా కల్లలాడుటచేతఁ జెడిపోయిన నాలుక పవిత్రమగును. ఉచ్చైఃస్వరముతో జపము చేయుట, మనస్సులోనే స్తుతించుట శాస్త్రముచే నిషేధింపఁబడినవి. మనస్సునందే స్తుతించుట, నిష్ఫలప్రాయమే కనుక "వాగ్భి స్తుష్టువుః" సాధకుఁడా! నీవును సత్యప్రతిష్ఠా ప్రాణప్రతిష్ఠాభ్యాస ఫలముగా, అమ్మకు సమ్ముఖివైనపుడు, ఈ మూఁడు విషయము లందును విశేషలక్ష్య ముంచుమా. స్తుతి మొదలిడునపుడే, అమ్మ యడుగులందు నీ స్థూలదేహమును బూర్తిగా వంచి పడవేయుము. అమ్మ యడ్డు లంటునపుడు మేను గగుర్పొడు చును. ఉచ్చైఃస్వరముతో స్తవపాఠము చేయుము. దానివలన వెలుపలిధ్వనులు వినరావు. చిత్తవిక్షేపము కాదు. చిత్తవిక్షే పము కాకుండ నిమ్మాటలల యర్థమునెడ లక్ష్య ముంచుమా! కాళిదాసుఁడు – సాధకచక్రవర్తి "స్తుతిభి రర్థ్యాభిః" అనెను. దానితోనే, యర్థానుసారభావము – అనుభవము, చిత్తక్షేత్ర

మందు జాగృత మగుచుండును. ఇదిగో, దీనినే మంత్రచైతన్య మందురు. (మంత్రచైతన్యము ప్రథమఖండమందు వ్యాఖ్యానింపఁబడినది.) మంత్రములను జైతన్యమయములొనర్చి పఠించుటచే నగు బాహ్యలక్షణములే యిచట సంక్షేపముగా "పులకోద్గమ చారుదేహాః" అను మాటచే వెల్లడింపఁబడినవి. కేవల స్తోత్రమే యననేల ? మంత్రసాధ్యకార్యములైన జపమో, పూజాహోమాది కార్యమో చేయునపుడును మంత్రచైతన్యమనెడి యర్థయుక్తివైపు లక్ష్యముంచుట యావశ్యకము. చైతన్యమయ మంత్రముతోఁ గూడిన విధ్యుక్త కర్మానుష్ఠానముచేఁ బ్రసాదము – చిత్తప్రసాదమను ధనము – మాతృమహాత్మ్యానుభూతియు, భోజనము – పంచకోశపుష్టివిధానమును శ్రమలేక సిద్ధించును. (ప్రసాద ధన భోజనము లననేమో ప్రథమఖండమునందు వ్యాఖ్యానించితిమి.)

శ్రీమద్భాగవతకారుఁడును – రసికుఁడును, భావుకుఁడును గాక భగవద్ధర్మమం దధికార మబ్బదనియెను. సాధకా ! నీ వెప్పు డేమేనిఁ జేయుము. నీసామర్థ్యముకొలఁది నపుడా భావమందు, రసికుఁడవును భావుకుఁడవు నగుటకుఁ బ్రయత్నింపుము. అటు చేయఁగల్గునపుడే సర్వకర్మలును సఫలములగును. నాయనా ! ఉపాసనము భావమునకే యగును. భావముతో సంబంధించినదే; భావాతీత స్వరూపము నుపాసించుటన నేమి ? కాదు. తొలుత జగద్భావములను – విషయరసములను భగవద్భావముతో భావించి, రసమయము లొనర్చిన పైని మెల్ల మెల్లఁగా నాతని కృపచే భావాతీతస్వరూపమందుఁ బ్రవేశించు యోగ్యత లభించును.

మన తొల్లింటి యాచార్యులును సామాది వేదములను బఠించుచుండిరి. అగ్ని, జలము, వాయువు, ఆకాశము, సూర్యుఁడు చంద్రుఁడు, పర్వతములు, నదులు మున్నగువాని స్తుతి గానము చేసిరి. అది వారి సరళచిత్తముల స్వాభావికోచ్ఛ్వాసము. దాని యందెట్టి కపటమును లేదు. సర్వత్ర ప్రాణమయసత్తను దర్శించుచు, సర్వత్ర బ్రహ్మసత్తానుభవము చేయుటచే వారి జడత్వ జ్ఞానము తొలఁగిపోయినది. కావుననే సర్వజడవస్తువులతో సైతము నిప్పటికిని ఈ దేశజనులు, తులసీదళచయనము చేయు వేళ సరళప్రాణముతో, "అమ్మా! ఓ తులసీ! నీ వమరవు. విష్ణుప్రియవు, విష్ణుపూజకొఱకే నీ దళములను ద్రుంచుచున్నాను. నీ వింతయు విచారింపకు. నన్ను క్షమింపుము" అను నర్థముగల శ్లోకములను జదువుదురు. కేవల తులసీదళములను దీయునపుడే కాదు, దైవికకార్యములందుఁ బెక్కింటను సాధారణ దృష్టికి జడములుగాఁ గనవచ్చు వస్తువులతో సైతము, సచేతనములతోనువలె వ్యవహారము కానవచ్చును. ఆహా! స్నానవేళ మృత్తికాలేపనము చేసికొనుచు నోరితో "మృత్తికే హర మే పాపం యన్మయా దుష్కృతం కృతం" అనఁగల్గిన యా దేశప్రజనులు రావిచెట్టునకు నీరోయుచు "అశ్వత్థరూపీ భగవాన్ ప్రీయతాం మే జనార్దనః" అనుచుండెడి యా దేశపు జనులు, సాలగ్రామశిలను బ్రత్యక్ష భగవంతుఁడుగాఁ జూచి పూజించు నా దేశప్రజనులు, ఎంత ధన్యులు! సరే, అది యుండనిండు.

స్తవాది సంబంధమున మఱొక్కమాట:— ఆధునికులు కూర్చిన స్తవాదులనుబట్టి చూడ, ఋషులు ప్రవర్తింపఁజేసిన

మంత్ర స్తవాదుల శక్తి మిగుల గొప్పది. చిరకాలమునుండి గురుపరంపరాక్రమమున మహాపురుషశ్రేణి, యే మంత్రస్తోత్ర పాఠములను జేయుచు వచ్చెనో, వాని శక్తి యధికమని చెప్ప వలయును. ఆధునికులు రచియించిన స్తవ సంగీతాదులును ఉండఁదగినవే, కాని ఋషిప్రవర్తితములవలె నివి భావరసముల నుద్దీపింపఁజేయఁజాలవు. ఋషిప్రవర్తితశబ్దశక్తి పీనికంటె గొప్ప దగుటకుఁ గారణములు రెండు. స్వరప్రధానములు బీజాక్షర బంధప్రధానములు నగుటయేకాక, తపోబలప్రధానములు నై యుండుటే. ఇది పలుతావులందుఁ బరీక్షితవిషయము. శ్రీమ ద్వాల్మీకిరామాయణము కావ్యమాత్రమే కాదు; మంత్రనిధి. (ఈ విషయము సక్రమ సాంగమంత్రశాస్త్రపరిశ్రమ చేసినవారు, సుందరకాండమం దధికముగాఁ బ్రత్యక్షము చేసికొనఁగలరు.) కాళిదాస శంకరాచార్యకృత స్తవములు బీజాక్షర బద్ధములే. వానియందలి తత్త్వము నాస్వాదించినపుడుగాని యది తేఁట పడదు. ఇఁక వైదికశబ్దములు స్వరప్రధానములై ప్రాణఘటిత ములు. వాని నుచ్చరించుటచే శరీరమందలి ప్రత్యేకాణు పర మాణువునందును, నొక పవిత్రతా సాత్త్వికతల స్పందనము అనుభవింపఁబడుచుండును. సరే; అది యుండనీ – స్తోత్రపాఠము చేయునప్పుడో, మంత్రసాధ్యమగు నేదేనిఁ జేయఁబడునపుడో, యెల్లపుడును మును జెప్పిన కాయ మనోవాక్యములయందు విశేషలక్ష్యముంచుట యావశ్యకము. మూడు నొక్క స్వర ముతో ప్రయోగవలయును. వైధకర్మలు, ఏవో శబ్దముల నుచ్చ రించుటతోనే సమాప్తములు కారాదు. అర్థహీన భావహీన మంత్రోచ్చారణమును, ఏదో బహుదూరమందున్న సత్తనుద్దే

శించి చేయఁబడుకర్మములును దఱుచుగా నిష్ఫలములే యగును. కనుక నీ విషయమున సాధకులు ధ్యానముంచవలయును.

ఇంతేకాక యీ ప్రణతి, ఆగగుర్పు, ఆ స్తుతిపాఠము నను నిమ్మాఁడును లక్ష్యమందున్నపుడే, జ్ఞాన భక్తి కర్మము లొక్కసారిగా ననుశీలింపఁబడుచుండును. మున్ను జ్ఞానమనఁగా దానిని దెలియుట యనియు, కర్మమనఁగా దాని నుద్దేశించి యేదేని జేయుటనియుఁ జెప్పితిమి. ఎఱుఁగనిదానిని బ్రేమింపఁ జాలము. సాధకసోదరా! అమ్మ స్వరూపము నెంతగాఁ దెలియుదువో, అమ్మ మహత్త్వము నెంతగా ననుభవింతువో అంతగా నీ జీవభావ మణఁగిపోవును. ఇదే జ్ఞానఫలము. దాని బాహిర లక్షణము ప్రణతి. కాని పరమప్రేమమయియైన యమ్మ స్వరూపమును దెలియఁగల్గుటచేఁ జిత్తమందొక ప్రేమభావము తనంతనే చేరుకొనును. ఇదే భక్తి. దాని బాహిరలక్షణమే గగుర్పొడుపు. కన్నీరు, వణఁకు మున్నగునవి మఱి భక్తిభావ మెంతగాఁ బోషింపఁబడుచుండునో, అంతగా నామె నుద్దేశించి, యామెను బ్రసన్నను జేసికొనుటకై వైధ కర్మానుష్ఠానమారంభమగును. అదే జపము, పూజ, స్తోత్రము, పరోపకారము, విశ్వహితకార్యములు మున్నగువాని రూపమున నగుచుండును.

ఓం. దేవ్యా యయా తత మిదం జగదాత్మ శక్త్యా
నిఃశేష దేవగణ శక్తిసమూహ మూర్త్యా।
తా మంబికా మఖిల దేవమహర్షి పూజ్యాం
భక్త్యా నతాఃస్మ విదధాతు శుభాని సా నః॥ ఓం. 2

సర్వదేవశక్తిసంభవమైన యే దేవి తన శక్తిచే నంతట వ్యాపించి యున్నదో, యే దేవి సర్వదేవతలకును మహర్షుల కును బూజనీయయో, ఆ యమ్మకు భక్తితో మ్రొక్కు చున్నాము.

వ్యాఖ్య:— అమ్మా! నీవు ద్యోతనశీలవు - నిత్యప్రకాశ మయివి; జగత్తునందలి సర్వవస్తువులను బ్రకాశింపఁజేయుటకై మఱి యేదో ప్రకాశవస్తువు నావశ్యకత కలదు, గాని నీవు స్వయంప్రకాశరూపవు. నిన్నుఁ బ్రకాశింపఁజేయ, మఱియొక యెట్టిప్రకాశము నక్కఱయు లేదు. కొందఱు "అజ్ఞానసహాయ ముతోనే జ్ఞానము ప్రకాశించునందురు. అనఁగా - అజ్ఞానము - మాయ, యనెడి ప్రకాశ్యవస్తు వుండుటచేతనే బ్రహ్మము - జ్ఞానము ప్రకాశించుచున్నది. ఎటులన నీ పృథివియే లేకున్న, సూర్యుని ప్రకాశస్వరూప ముండనేయుండదు; అటులే ప్రకాశ్య వస్తువు - అజ్ఞానము, సమీపమందు లేకున్నచో జ్ఞానము యొక్క ప్రకాశస్వరూపము ననుభవమే కాదు'' అందురు. ఇంత యుక్తితో నీ ప్రకాశస్వరూపమును నిరాకరింపఁగోరువారు, ప్రమాణమనెడి త్రాటితో నడుము కట్టుకొని, ప్రమాణాతీత వైన నిన్ను దాఁకఁగోరుచున్నారు. యుక్తిసహాయమువల్లను, అనుమానసహాయమువల్లను నిన్నుఁ బట్టుకొనుట కాదు. ప్రకా శ్యములైన వస్తువులనన్నిటిని జక్కఁగా సంహరించి, కేవలము నీవే స్వప్రకాశస్వరూపముతో నిత్యము వెలయుదువను మాటను వారెఱుఁగరు. లేదా, యింతదాఁక నీవు వారిలోఁ బ్రకాశింప లేదో? కనుకనే ప్రమాణాతీతవైన నిన్నుఁ బట్టుకొనలేకున్నారు. అమ్మా! యెప్పుడో యొకనాఁడు, నీవే గురురూపముతో

నావిర్భవించి, ఆ నీ శిష్యమూర్తుల చూపు సారింపఁజేసినపుడే, వారు "తమేవ భాన్త మనుభాతి సర్వమ్ । తస్య భాసా సర్వ మిదం విభాతి" అను శ్రుతితోఁ స్వరముఁ గలుపుదురు.

"తత మిదం జగదాత్మశక్త్యా" అమ్మా! నీ శక్తి చేతనే జగత్తు వ్యాప్తమైయున్నది. ఆత్మవు నీవు, శక్తిరూపమున వెలయునపుడే, యీ జగత్తు ప్రకటమగును.

అమ్మా! నీ యీ "ఆత్మ - శక్తి" శబ్దములను బట్టుకొని యీ జగత్తునం దెన్ని మతభేదములు నడుచుచున్నవో చెప్పవే మమ్మా! ఆత్మయు శక్తియు, ఆత్మయొక్క శక్తి, ఆత్మతో శక్తి (ఆత్మసన్నిధి శక్తి), ఇది యాత్మ అది శక్తి అని యీ విధముగా ననేక భిన్నభిన్న మతములు, భిన్నభిన్న వాదములు సిద్ధమగుచునే యున్నవి. ఒకరి మతమును ఖండించుటకును తన మతమును స్థాపించుకొనుటకు నైన ప్రయత్నమునందు, ఎన్ని యుక్తుల, ఎన్ని తర్కముల పనిపడుచున్నదో! నిన్నుఁ గానసంత దాఁక, నిన్ను దూరముగానున్నట్లు తలఁచుచుండునంతదాఁక, "ఆత్మ, శక్తి" అనువానిపై వాదములు, వితండములు, విచారము సాగుచునేయుండును. అమ్మా! నీ లీల ధన్యము! నిన్ను నీవు వ్యక్తపఱచుకొనుటకై, యీ హాస్యనాటక లీల లెన్ని చేయుచున్నావమ్మా! ఇచట మఱల మఱియొకలీల యారంభించితివి. దీని పరిణామ మెట్టిదో నీకే తెలియవలయును. సరే, ఒక్కసారి నీవైపు దృష్టిపడినచో, ఆత్మ - శక్తి, అనెడి మాటలకే భేదముగాని; వాస్తవముగా నించుకంతయు భేదము లేదని కనుగొందురు.

అమ్మా! నీ వాత్మవు; నీవే యథార్థముగా "నేను" యొక్క స్వరూపమవు. ఆ "నేను" ఒక్కటే ప్రతిజీవుని యందును ప్రతిపరమాణువునందును ప్రతిధ్వనించుచున్నది. ఆ 'నేను' ఒక్కటే జీవరూపిణియై యనేకాధారములతో ననేకమైన 'నేనుల' వేషము వేయుచున్నది. ఆ ఒక్క 'నేను' పేరే ఆత్మ. మఱి యనేకము లోపల వెలయుటే శక్తి. ఈ యాత్మ – శక్తి, ఒక్కటి యైనను, రెండైనను మఱి యేమైనను, విశిష్టమైన యొకటే యైనను, వచ్చిపోయెడి దేమియు లేదు. ఇట్లు విచారము చేయఁగాఁ జేయఁగా, నెప్పుడో తన యథార్థస్వరూపము జీవున కొకనాఁడు అనుభవమునకు వచ్చును. అనేకజన్మసంచితాజ్ఞానము తొలఁగును.

సరే, ఒక్కసారి యీ యాత్మశక్తి స్వరూపముల నెఱింగినచో హానిలేదు — "మనము చూచుచున్నాము" "నేను చూచుచున్నాను" దీనిలో రెండు వస్తువులు తోఁచుచున్నవి. 1 నేను, 2 చూచు శక్తి. ఇవి యొక్కటో, రెండో యనెడి మీమాంస, తమ బుద్ధి ననుసరించి ప్రత్యేకముగాఁ జేయఁగలరు. కాని, ఒక్కమాట—బ్రహ్మమాయలు, పురుష ప్రకృతులు, శివదుర్గలు, కృష్ణరాధలు మున్నగు శబ్దములచే, శక్తి శక్తిమంతులకు (వాస్తవముచే వేఱుగాకున్నను) భేద మారోపింపఁ బడుటగును. సాధన మున్నంతవఱకు, దేహ మున్నంతవఱకు, జగత్తున్నంతవఱకు, ఈ చిలుక గోర్వంకల వాదము సాగుచునే యుండును. చిలుక "మా కృష్ణుఁడు గిరివరము నెత్తెను" అనును. గోర్వంక "మా రాధ శక్తిసంచాలనము చేయకున్న నెటు లెత్తఁగలఁడు?" అనును. మనయమ్మ

లీలామయి, లీలామయిగా నుండునంతదాఁక, లీల జరుపుచుండు నంతదాఁక, అభేదమందు భేదోపచారము కల్పింపఁబడుచునే యుండును.

అది యుండనీ — నీ యాత్మశక్తిచేతనే సర్వజగత్తు వ్యాప్తమగు చున్నది. "తతమిదం జగదాత్మశక్త్యా" ఒక్క-నేను — మఱి యనేక భావములతో దాని ప్రకాశము నంతటఁ గనుచున్నాము. ప్రత్యేక జీవముగా, ప్రత్యేక పరమాణువుగా, ఆ యాత్మశక్తి, ఆ హరగౌరీమూర్తి. అదే రాధాకృష్ణుల యుగళమూర్తి. ఇదే నీ జగద్వ్యాపిని యాత్మశక్తి. అమ్మా! నీ యిన్ని మూర్తులుగానున్న జీవసంతానముతో "ఓరి జీవుఁడా! నీవు నీయందు, ఏ"నేను" కూర్చుండుట ననుభవించుచున్నావో - ఆ యనుభవమే "ఆత్మ - అమ్మ" యనియు, ఆ నేను యొక్క, ఎన్ని విధములైన కార్యములను (ప్రకాశములను) గనుచున్నావో, అవే 'శక్తి' యనియుఁ జెప్పివేయుము." ఈ విధముగా నేకాగ్రమనస్సుతోఁ జూడ నారంభించునపుడు, జన్మ జీవనము సార్థకమగును. భయ మృత్యు విషాదము లెన్నటికిం దొలఁగును.

"నిఃశేష దేవగణ శక్తి సమూహమూర్త్యా" ఆత్మ శక్తి రూపముతో నీవు జగన్మయివై వ్యాపించియున్నావు. ఇది నీ సాధారణమూర్తి. ఆ మూర్తిని మేము చూచియును జూడలేకున్నాము. తెలిసియుఁ దెలియలేకున్నాము. కనుకనే నీవు సంతానస్నేహముచే విహ్వలవై, యప్పుడప్పుడు, అసాధారణమూర్తితో, వారి యిష్టమూర్తితో నావిర్భవింప బాధ్యవగుచున్నావు. అది, సర్వదేవ శక్తులును జేరుకొనినదైన

మూర్తి. మహిషాసుర నిధనము నుద్దేశించి, యిట్టి విశిష్ట మూర్తితో నిన్ను వెలయించుకొన్నావు.

అమ్మా! జీవశక్తిబోధ ముండునంతదాఁక నజ్ఞానముం డును. ఆ వెనుక దేవశక్తిబోధ మగును. అదే, దాని పేరే జ్ఞానము. ఇఁక, ఆత్మశక్తిబోధమే వెలయునపుడు, ఆ జ్ఞానా జ్ఞానములకుఁ బరమైన యనిర్వచనీయమే – ఈ మూఁడు విధము లుగా బోధము విచరించును. మొదట జీవశక్తిబోధమే యుం డును. ఆర్జనము, సంగ్రహము, రక్షణము, వ్యయము, భోగము, పాపము, పుణ్యము. ఖ్యాతి, ప్రతిష్ఠ అను నవన్నియు "నేను చేసితిని" అనెడి జీవభావీయాభిమానము, సర్వశక్తులను దనవే యనిపింపఁ జూచుచుండును. పలుసారులు మాటిమాటికి నగు దైవప్రతికూలతవలన, నయ్యహంకారాభిమానములు పిండియై పోవుచుండును. అపుడు మెల్లమెల్లగా దేవశక్తియెడ విశ్వాస మారంభించును. క్రమముగా శక్తిమాత్రమే దేవత; దేవతలు శక్తిమాత్రములే యని తోఁచును. దీనిపేరే జ్ఞానము. ఇది బోధముయొక్క రెండవ మెట్టు. తుట్టతుదకు ఆ దేవశక్తులు సమష్టిభావము నొంది యఖండముగాఁ దోఁచునపుడు, జీవుఁడు దానియందుఁ బూర్తిగా నాత్మదర్శనము చేసి (అనఁగా నీ దేవ శక్తులన్నియు నాత్మస్వరూపమే యని యెఱింగి) ఆత్మశక్తిజాడఁ దెలియఁగల్గును. ఓహో! ఇది యెంత యానందము! ఎంత తృప్తి! ఆ స్థితికి వచ్చి యమ్మయెడ మతిపోయినపుడు, సాధ కుఁడు "జగద్రూపముతో నేనే వెలయుచున్నాను" అని కను గొనును. ఈ సూర్యుఁడు, ఈ చంద్రుఁడు, ఈ జ్యోతిష్కమండ లము, నిత్యము నాకే యారతిచ్చుచున్నవి. నావలని భయము

చేతనే గ్రహములు బిందుమాత్రమైనను హద్దుమీఱక యనాది కాలమునుండి విచరించుచున్నవి. ఈ వాయువు నావలని భయము చేతనే యెల్లప్పుడు వీచును. ఈ నదులు నా మేనినే ప్రతిదినము కడిగివేయుచున్నవి. ఈ పూవులు నా పూజకొఱకే వికసించుచున్నవి. ఇంకెంత చెప్పెదను? అంతయు నేను. నేను దక్క నెక్కడను నేమియు లేదు. అంతయు ఆత్మయే; అంతయు శక్తియే; అంతయు అమ్మయే. ఆ నా 'నేనే' సర్వదేవతలకు, సర్వమహర్షులకుఁ బూజనీయమైన మా యమ్మ. ఆ 'మా' నీవు; ఆ మాది అనుదానికి. నీకు – నేనునకు "భక్త్యా నతాఽస్మి" భక్తితోఁ బ్రణమిల్లుచున్నాము. భక్తి యెక్కడ లభించునమ్మా! అదియు నీవే. ఇదిగో, నిన్నాత్మగా నెన్నకపోవుటచే, నీ కాత్మదానము చేయకపోవుటచేఁ, బ్రాణముగా నాదరింపకుండుటచే, నీవు భక్తిరూపమున మా లోపల వెలయవు. అమ్మా! "భక్త్యా నతాఽస్మి" కాఁగలవారే బలముతో సాహసించి నీయొడి నెక్కి కూర్చుండఁగల్గుదురు. కాని, అమ్మా! "అభక్త్యా నతాః" అయినవారు భక్తియన నెట్టిదో యెఱుఁగనే యెఱుఁగరు. దేనిని భక్తియందురో, వారికిఁ దెలియనే తెలియదు. వారెటులు ప్రేమింతురు? నీ యడుగులయందుఁ దమ ప్రాణము నెటు లర్పించుటో వారేమెఱుఁగుదురు? అమ్మా! మమ్ముల నొడి లోనికిఁ దీసికోవా? అమ్మా! మా యాశ! మా విశ్వాసము! అమ్మా! కేవలము నీమొగమువైపే చూచుచు, ననేక జనన మరణ ప్రతిఘాతముల నోర్చుకొనుచు వచ్చుచున్నాము. అమ్మా! పాషాణములవంటి మా హృదయములందు నీవు భక్తిరూపముతో వెలయునపుడు, మేమును "భక్త్యా నతాఽస్మి" అనుచు

జీవత్వపు టావలియొడ్డు చేరిపోవుదుము. ప్రభువు, తల్లి, తండ్రి, సఖుఁడు, సుహృత్తు, స్వామి, చుట్టము, సర్వము నీవే. గీతా గురువేషముతో నీవేకదా యిమ్మాట యంటివి. ఒక యాధారమునుండి మా సర్వప్రేమమును సర్వాకర్షణములను నీవే హరించి కూర్చున్నావు. జగత్తునందలి మా వారు, మా ముఖములవంకనే చూచుచు మమ్ముఁ బ్రేమించుచున్నారు. మేము వారి యిచ్ఛానుసారము పోఁగలిగినపుడే మా వారి ప్రేమకుఁ బాత్రులమగుదుము. కాని, నీవో – మా ప్రాణమునే నీయెడకు లాగికొని మాయెడ నెయ్యము నెఱపుదువు. నీ వాత్మవు; నీవు ప్రాణశక్తివి; నీ యీ యలౌకికస్నేహము నెపుడెఱుంగఁగలము? అమ్మా! భక్తిరూపిణీ! మేము నీ యావిర్భావము నెపుడు చూచి ధన్యులమగుదుమో? అమ్మా! భక్తి లేకున్నను నీకుఁ బ్రణమిల్లుచున్నాము. 'అభక్త్యా నతాఃస్మ' "నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే" (గీత11–37) "నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ" (గీత. 11 – 40) అమ్మా! అందుకో; ఈ భక్తిహీన మలిన సంతానమ్ము మ్రొక్కు లందుకో.

"విదధాతు శుభాని సా నః" మంగళములను మాకుఁ గలిగింపుము. మాకు శుభములనిమ్ము. కేవలము మాకే కాదు, ఈ విశ్వమందలివారి కెల్లరకును మంగళములను గూర్పుము. విశ్వమయమైన సర్వము నీ మంగళాశీర్వాదముల నొందుఁగాక. విశ్వమున నమంగళములుతొలఁగుఁగాక. విశ్వము నుత్పాదించు. తల్లీ! దీవింపుము. వరములిమ్ము. నీ సంతానమంతయు సత్య

ప్రేమములనెడి యథార్థమంగళముల నొంది యమంగళకరము నుండి విడువఁబడుఁగాక. అమ్మా!

ఓం. యస్యాః ప్రభావ మతులం భగవా ననంతో
బ్రహ్మాహరశ్చ నహి వక్తు మలం బలం చ।
సా చండికాఖిల జగత్పరిపాలనాయ
నాశాయ చాశుభభయస్య మతిం కరోతు॥ ఓం. 3

సాటిలేని యేమె ప్రభావమును బలమును వర్ణింప భగవంతుఁ డనంతుఁడు, బ్రహ్మ, మహేశ్వరుఁడునుం జాలరో, ఆ దేవి చండిక, సర్వజగత్పరిపాలనమునకును అశుభ భయ వినాశమునకును దలపెట్టును గాక.

"అతీతాను స్మృతిర్మేధా తత్కాలగ్రాహిణీ మతిః।
శుభాశుభ విచారజ్ఞా ప్రజ్ఞా ధీరై రుదాహృతా॥"

అమ్మా! వేయినోళ్లవాఁ డనంతుఁడు, నాలుగు నోళ్లవాఁడు (నలువ) బ్రహ్మ; అయిదునోళ్లవాఁడు హరుఁడు – అను వీరలును, నీ సాటిలేని ప్రభావమును బలమును గొండాడలేరైరి; నోళ్లేచాలవో? మాటలేచాలవో? వారు సర్వశక్తిమంతులైన పరమేశ్వరులేయైనను నీ ప్రభావము నుగ్గడింపఁజాలరైరేల? అమ్మా! నీ ప్రభావమును బలమును బూర్తిగాఁ దెలిసికొనుటకై నీలోనే చేరిపోవలయును. చేరలేనంతదాఁక నెట్లును నీ మహాత్మ్యానుభవముకాదు. వాక్కు మనస్సు నుండుసంతకును నీలోఁ జేరుటయుఁగాదు. పోనీ; నిన్నుఁజేరుచో వాక్కులతో మనసు మఱలిపోవును. "యతో వాచో నివర్తన్తే అప్రాప్య

మనసా సహ” ఇంకెట్లు ? వాఙ్మనోరాజ్యమునకు మఱలి వచ్చునపుడు, నీ మహత్త్వమునకు బహుదూరమై పోదురు. కనుక నెవ్వఁడును నీ ప్రభావము నెఱుంగఁజాలఁడు. నీ స్వరూప నిర్ణయము చేయఁజాలఁడు. అమ్మా! నీవు మనోవాక్కుల కగోచరవు.

అమ్మా! బ్రహ్మవిష్ణు మహేశ్వరులు నీ పెద్దకొడుకులు. (జ్యేష్ఠపుత్త్రులు) అగుటచేత నీ ప్రభావమును నీ మహత్త్వము ననుభవింప యోగ్యపాత్రములు. కావున నీ యచింతనీయ మహత్త్వము ననుభవించి, వర్ణించుచోట మౌనము వహించిరి; గాని, మేమో – కేవలము నిన్న మొన్నటివారము. నీ కడగొట్టు సంతాన మిది. మా క్షుద్ర బుద్ధులందు నీ మహత్త్వమెంత (ఎన్నవవంతు) ప్రతిబింబించెనో తెలియఁగల్గితిమా? లేదా? అది విచారింపకే గానము చేయుచున్నాము. శిశుపుత్త్రులు (చిన్నబిడ్డలు) తల్లి గొప్పతనము నింతయు నెఱుంగకున్నను “అందఱికంటె మా యమ్మ గొప్పది” అని కథలు చెప్పుచుఁ దిరుగుదురు. మేమును వారివలెనే, నీ ప్రభావకథలను రేవు రేవులఁ బాడుచుఁ దిరుగుచుందుము. పోనీ; మఱేమియుఁగాదు అసద్వాక్యములు పల్కుటచే నపవిత్రమైన నాలుక పవిత్ర మగును.

సాధకా! వినుము, మన యమ్మ ప్రభావము. ఈ కానవచ్చు సూర్యుఁడు మనమున్న భూమికంటెఁ బదునాలుగు లక్షల రెట్లు పెద్ద. ఈ భూమివలెనే దీనికిఁ జిన్నలు పెద్దలునైన మఱికొన్ని (కుజ బుధ శుక్రాది) గ్రహములు, ఆ సూర్యుని యాకర్షణమువలన నాకర్షింపఁబడి, యతని నలువైపులఁ బరిక్రమించుచున్నవి. గ్రహములతో మఱికొన్ని యుపగ్రహము

లున్నవి. ఈ గ్రహోపగ్రహములతోఁ గూడిన సూర్యునిపేరే సౌరజగత్తు. రాత్రివేళ మింట లెక్కలేని చుక్కలు గనఁబడును. వానిలో నొక్కొక్కచుక్క సైతము, చిన్నో పెద్దో, యొక్కొక్క సౌరజగత్తే. ఈ లెక్కలేని సౌరజగత్తులు, ఏ యనాదికాలమునుండి, ఏ యలక్ష్య కేంద్రమును లక్షించి నిరతము వడిగాఁబరుగెత్తుచున్నవో, యా మహాశూన్యము, ఈ లెక్కలేని సౌరజగత్తుల కీ ద్రుతగతి నిరంతరము సిద్ధమైనదో యా మహాశూన్యము, ఇన్ని విరాడ్బ్రహ్మాండములను గుండెపై ధరించిన దేదో, యదే మన యమ్మ. ఇదే మన యమ్మ. మన యమ్మ గుండెపైనే, యీ యనంతకోటి బ్రహ్మాండములు, ననాదికాలమునుండి నిరంతరము కడువడి పరుగునఁ దిరుగుచున్నవి. చూడు, సాధకా! మీ యమ్మను జూడుము.

మఱి యీ రీతిగా నచింతనీయమై సాటిలేని ప్రభావముతోఁ గూడినదయ్యు - ఈ పృథివియందలి యేదో యొక దూరప్రాంతమున నున్న యొక క్షుద్రతమ పరమాణువు, ఏ భావమందు నిల్చుటచేఁ గడువడిగా, అమ్మ యంగమందుఁ జేరిపోఁగలదో, ఆ వ్యవస్థ చేయఁగలదే మన యమ్మ. ఎక్కడనో యొక క్షుద్రతమ కీటాణువు హృదయమందు రవ్వంత మాత్ర సంవేదనము వికసించుటచే, ఎక్కడనో యొక కీటాణు వింత నిట్టూర్పు విడుచుటచే, వాని నెవ్వరు స్థిరదృష్టితోఁ జూతురో, తాత్పర్యముతోఁ దానే యథోచితవిధానము చేయునో, అదే మన యమ్మ.

మఱి, యేమె యిచ్ఛగించినపుడు సరిగాఁ దత్‌క్షణమందే; యింత గొప్ప యచింతనీయ (ఊహింపరాని) వ్యాపా

రమును, ఇంద్రజాలమువలె నెక్కడనో యొక యవ్యక్త క్షేత్రమం దదృశ్యమై పోవునో, ఇన్ని మహాబ్రహ్మాండముల సృష్టి స్థితి ప్రలయము లెవ్వరి తెప్పపాటులో సిద్ధమగుచుండునో, ఆమెయే మన యమ్మ. ఇంతేకాక, అమ్మగారి మఱియొక యచింతనీయప్రభావము - కానవచ్చును. నేడు కడు దురాచారులు మూఢులు నైనవారు, కొలఁదినాళ్లు కాఁగానే పుణ్యవంతులు జ్ఞానవంతులు నైపోవుదురు. ఇటులు చేయువారికి సృష్టి స్థితి ప్రలయములు చేయుట, యొక చిన్నపనియే కాదా?

అగుఁగాక — "సా చండికా" అమ్మా! ఆ చండికవు నీవే. ఎవ్వరిప్రభావముచే బ్రహ్మత్వ విష్ణుత్వ శివత్వములదాఁక తెప్పపాటులోఁ బ్రలయ మనెడి యతలగహ్వరము నందు మునిఁగిపోవునో, ఆ చండికవు, అమ్మవు నీవు. ఒక్కసారి "అఖిల జగత్పరిపాలనాయ, అశుభ భయస్య వినాశాయ చ మతిం కరోతు" ఈ సర్వజగత్పరిపాలనమునకును, అశుభ భయ వినాశమునకును నుపయోగించు అఖిల జగత్పరిపాలనమునకై, యశుభ భయ వినాశము చేయుదువు. అశుభ మనఁగా మృత్యువు. దానివల్లనగు భయమునే, అశుభ భయ మందురు. అమ్మా! విచారించి చూడఁగా, నీ జగ మెల్లప్పుడును మృత్యుభయభీతమే. అమ్మా! చూడుము; ప్రత్యేక ప్రాణిహృదయ మందును మృత్యుభయ మేరీతిగా నాధిపత్యము చేయుచున్నదో! మృత్యుభయమనెడి మహాపిశాచము, జీవుని హృదయమందు రక్తబలము నేవిధముగా నింకించివేయుచున్నదో చూడు. జగత్తున వినవచ్చు నా కోలాహల మంతయు, నా

మహాపిశాచము పెట్టించు మొట్టయే. అది చెవినిఁ బడనివారే, సంగ్రహము, రక్ష, నిద్ర, భోగవిలాసములు అను వానిలో మునిఁగి, మీసాలమీది తేనెలు నాకుచు వెడ పోడి నవ్వు నవ్వువారు. జగత్తుపైని బడిన యీ మృత్యుకరాళచ్ఛాయను దొలఁగింపఁజాలు బుద్ధిని ప్రేరేపింపుము. జగత్తునంటిన మృత్యు భయమును దొలఁగింపుము. అమృతమయీ! మృత్యు భయమును బోఁగొట్టుము. అమ్మా! నీవు అభయవు; అమృత మవు; సత్యవు, పరమాత్మవు. మృత్యువు, అమృతము అను రెండును నీచేతి యాటబొమ్మలు, కనుకనే నీవు సత్యవు, నభయవునైతివి. అమ్మా! జగమునందొక్కసారి యీ యభయ సత్యమూర్తితో వెలయుము. జగత్పరిపాలనము చేయుము. అమృతధార వలన మృత్యుభయము తొలఁగిపోవును. జీవ జగత్తు నీ సత్యమూర్తిని జూచి యభయమగును. జ్ఞానామృత పానము చేసి యమర మగును.

అమ్మా! మృత్యువనెడి పేరితో నొక వస్తు వున్నదన్న మాటను, జగత్తునందలి పరిశుద్ధులు మఱచిపోయిరి. అమ్మా! నీవే యెల్లరకుం జెకు నాటునట్లు, "జీవుఁడా! మృత్యువనుచు నేమియులేదు. నీవు అమృతసంతానమవు. నీ నివాసము అమృత మయినైన యమ్మ వక్షమందుఁ గదా. అజ్ఞానకల్పితము నీయీ మృత్యుబోధము. మిథ్య. నేను నీ కభయమిచ్చు తల్లిని. నీవును సత్యము, నిర్భయము, స్వతంత్రము నైన సంతానమవు." అని యిమ్మాటలు సర్వజీవుల హృదయములందును, రోమరోమ కూపములందును ప్రతిధ్వనించునట్లు చేసివేయుమమ్మా! "మేము అమృతులము; అభయులము" అని యెల్లరకుఁ దెలియుఁగాక.

అమ్మా! ఇంక నీ జాగతిక శోక దుఃఖ హాహాకారములు, కాతర సీత్కారములు, మఱి వినరానీయకు. మా బుద్ధి యెల్లప్పుడును బహుత్వముతోనే నడుచుచున్నది, కనుక నే మే మెప్పుడును మృత్యుభయమునే శంకించుచు శోకదుఃఖములచే నలిగిపోవు చున్నాము. మా బుద్ధియందు నానాత్వము కానఁబడుటచేతనే, మేము మృత్యువువల్లనే మృత్యువునకు గ్రాసముగా మమ్ముల నాహుతి చేయుచున్నాము. అమ్మా! మా బుద్ధియందు నీవొక్కతెవే ప్రతిబింబించుచుందువని తెలియక, మేము నీవైపు చూడక, బహుత్వము వెంటఁ బరుగెత్తుచున్నాము. కనుక మాటిమాటికి మృత్యుయాతన ననుభవించుచున్నాము. కాని, యిప్పుడు నీవు మమ్ము నీయెడనే ముగ్ధులమగునట్లు చేసివేయుము.

ఓం. యా శ్రీః స్వయం సుకృతినాం భవనే ష్వలక్ష్మీః
పాపాత్మనాం, కృతధియాం హృదయేషు బుద్ధిః ।
శ్రద్ధా సతాం కులజనప్రభవస్య లజ్జా
తాం త్వాం నతాఃస్మ పరిపాలయ దేవి విశ్వమ్॥ఓం. 4

సుకృతిశాలురైనవారియిండ్ల శ్రీ (లక్ష్మి) గాను, పాపుల యిండ్లయందు అలక్ష్మిగాను, వివేకుల హృదయములయందు బుద్ధిగాను, సజ్జనుల హృదయములందు శ్రద్ధగాను, కులీనుల హృదయములయందు లజ్జగాను విరాజిల్లు నీకు మా ప్రణామములు ఓ దేవీ! నీ వీ విశ్వమును బరిపాలింపుము.

వ్యాఖ్య:- సుకృతులైనవారియిండ్ల నీవు శ్రీ - ఐశ్వర్యరూపమున వెలయుదువు. కేవల ధనధాన్యరత్నాదులే యైశ్వ

ర్యము కాదు. కోరిక యమోఘముగా నెఱవేఱుటే యైశ్వ ర్యము. ఇది బుద్ధిసత్త్వనిర్మలతకు వెలిగుఱుతు. మనదేశమునఁ దాంత్రికపూజలందు ఐశ్వర్యము అనైశ్వర్యము, వైరాగ్యము అవైరాగ్యము, ధర్మము అధర్మము, జ్ఞానము అజ్ఞానము అను నీ యెనిమిది పీఠదేవతలుగాఁ బూజించు విధానము కనవచ్చు చున్నది. ఈ యెనిమిదియు బుద్ధిధర్మములు. బుద్ధియే అమ్మ యథార్థపీఠము. బుద్ధితత్త్వమందే అమ్మ యధిష్ఠానము. పూజ, అర్చనము, ఆరాధనము, ఉపాసనము మున్నగునవన్నియు బుద్ధి వఱకే. వెనుకటి మంత్రమందు "మతిం కరోతు" బుద్ధినిర్మలత వల్లనే జీవుఁడు సుకృతిశాలి యగును. అపుడే శ్రీ – యైశ్వర్యము; కోరికలు నెఱవేఱుపట్టున బాధ గలుగదు. దాని ఫలముగా వైరాగ్యము, ధర్మము, జ్ఞానము ప్రాప్తించును. జీవుఁడు మోక్ష పదవి నొందును. ఈ విధమైన నీ శ్రీమూర్తి సుకృతిజనుల యిండ్లఁ గానఁబడును.

మఱియు శ్రీ శబ్దమునకు బ్రహ్మవిద్యారూప సరస్వతి యనియు నర్థము. చైత్రశుద్ధపంచమి శ్రీపంచమి. అది మొదలు పూర్ణిమాంతముగాఁ బదిదినములు పూజింపఁబడును. శరన్నవ రాత్రములందుఁ బూజింపఁబడునది, పుస్తకరూపిణీ సరస్వతి. కనుక సుకృతులయందు, అమ్మ బ్రహ్మవిద్యాస్వరూపమున వెలయునని భావము. ఎవరియందు బ్రహ్మవిద్య ప్రకాశించునో వారే సుకృతులు.

అమ్మా! ఇఁకఁ బాపాత్ముల యిండ్ల – పాపాత్ములు పాపబుద్ధులు. వారియిండ్ల నీవే యలక్ష్మిరూపమున నుందువు. అలక్ష్మి – అనైశ్వర్యము. అనఁగాఁ గోరిక నెఱవేఱకపోవుటే.

జీవుని వాసనలు, అపూర్ణములుగా నుండునంతదాఁక, వానిబుద్ధి యందుఁ బాపమున్నది యనవలసినదే. పాపమనఁగా సంకోచ మని యర్థము. బుద్ధి కేవలము రూపరసాది విషయములను వెలయించుటే పనిగాఁగొని యుండునంతదాఁక, అది రజస్తమో గుణములచే మలినమగుటచే సంకుచితమయి యుండును. గాన నది పాపము. బుద్ధిమాలిన్యముచేతనే, అలక్ష్మి - అనైశ్వ ర్యము రాజ్యమేలుచుండును. దానియందు అధర్మము, అవై రాగ్యము, అజ్ఞానము వచ్చిపడును. పాప పుణ్యము లనునవి బుద్ధివఱకే. బుద్ధికిఁబైని మఱి పాప పుణ్యములు లేవు. ధర్మా ధర్మములు, జ్ఞానాజ్ఞానములు, వైరాగ్యభోగములు, సిద్ధ్యసిద్ధులు అనునవెల్ల నీ బుద్ధిపర్యంతమే. జగత్తునందుఁ బాపపుణ్యము లనునవి, ఒకదాని యపేక్ష రెండవదానికిఁ గలవియే. ఒక నికిఁ బాపమైనది, వేఱొకనికిఁ బుణ్యమగును. కనుక జగత్తు నందలి పాపపుణ్యవిచారమందు, స్వాస్థ్యము, సమాజస్థితి యను వానిపైపే ప్రధానముగా లక్ష్యము పడును. ఆధ్యాత్మికమార్గ మందలి ముండ్లు తొలఁగించుటకే పాపపుణ్యవిచారము యొక్క ప్రధానోద్దేశ్యము. సరే; అగుఁగాక; ఇట్టి విచారము చేయఁగాఁ జేయఁగా నొకనాఁడు, జీవుఁడు బుద్ధిసత్త్వమందుఁ జేరుకొనును. అపుడు పాపపుణ్యసంబంధమునఁ గలుగు జ్ఞానము ఆపేక్షికము కాదు. సర్వత్ర, సర్వదా, సర్వావస్థలందుఁ బ్రయోగింపఁదగినదే.

బుద్ధియందు రెండు విధముల ప్రకాశము సిద్ధము. ఒకటి యింద్రియములచేఁ దేఁబడిన విషయములను గూర్చిన ప్రకా శము (అదే అలక్ష్మి). రెండవది పరమాత్మను గూర్చిన ప్రకా శము. వీనిలో మొదటిది పాపము ( అలక్ష్మి ). రెండవది

పుణ్యము (శ్రీ). వైషయిక ప్రకాశమువలన బుద్ధియందు సంకోచమగును. పరమాత్మప్రకాశముచే దాని ప్రసారమగును. కనుకఁ బాపము సంకోచము; పుణ్యము ప్రసారము. పూవును బూవుగానే గ్రహించుటచే బుద్ధికి సంకోచమగును. గాని దానిని అమ్మగా నెంచి, ప్రాణముగా నెంచి గ్రహించుటనే బుద్ధి ప్రసారమగును. వ్యావహారిక పాపపుణ్యములు సైతము, బుద్ధియొక్క సంకోచప్రసారములపైనే చాలభాగము నిర్భరంపడి యున్నవి. బుద్ధిసంకోచము పేరే యజ్ఞానము. అజ్ఞానముచేత, అనైశ్వర్యము గలుగును. కామనలు, అపూర్ణముగా నుండిపోవును. కామనలు నెఱవేఱకున్న వైరాగ్యము రాఁజాలదు. కనుకనే బుద్ధియొక్క యొకవైపున శ్రీ; రెండవ వైపున నలక్ష్మి యున్నవి. ఒకవంక జ్ఞానము, ధర్మము, ఐశ్వర్యము, వైరాగ్యము; రెండవవంక అజ్ఞానము, అధర్మము, అనైశ్వర్యము, అవైరాగ్యము .నున్నవి.

అమ్మా! ఈ రెండు రూపములతో నీవే విరాజిల్లుదువని యెఱుంగఁగల్గువాఁడే సుకృతి, కృతధీ యనఁబడును; కనుకనే నీవు "కృతధియాం హృదయేషు బుద్ధిః" కనుక బ్రాహ్మణులు "ధియోయోనః ప్రచోదయాత్" అనుచు విశుద్ధ బుద్ధి రూపముతోఁ బ్రకాశించుటకై దీనప్రాణముతోఁ బ్రార్థింతురు. అమ్మా! బుద్ధియందుఁ జేరఁగల్గునపుడే, జీవునకు సర్వము ప్రాపించును. లేములు పూర్తిగాఁ దొలగిపోవును. కనుకనే జీవజగత్తుయొక్క బుద్ధిసత్త్వమును వెలయించుటకే నీ రక్తచరణములందుఁబడి, యీ ప్రార్థనము. (ధియోయోనః ప్రచోదయాత్)

"శ్రద్ధా సతాం" సద్వస్తువు నెఱింగినవారి హృదయము లందు శ్రద్ధారూపముతో – గురువేదాన్తవాక్యములందు దృఢ విశ్వాసరూపముతో – అమ్మా! నీవే నిత్యము వెలయుదువు. ఎల్లప్పుడును బరివర్తనమే స్వభావముగానుండు నీ వినాశి వస్తువులందు సైతము, అఖండము అపరిణామియునైన నిత్య సత్తను గాంచుచుండువారే యథార్థ సజ్జనులు. పైని జెప్పినట్లు 'కృతధీ' యగుటవల్లనే జీవుఁడు సత్సంధానము నొందెను. ఏ యుపాయముచేత నది యయ్యెనో యదే శ్రద్ధ; అనఁగా గురువాక్య శాస్త్రవాక్యములందును గొండవంటి నిశ్చల విశ్వాసము. అమ్మా! నీ వెవనిని 'సత్'గాఁ జేయుదువో, వాని హృదయమందే శ్రద్ధారూపముతో నిల్చి, అసత్సారమును జేర్చివేయుము. ఇదే నీ మాతృత్వము.

"కులజన ప్రభవస్య లజ్జా" మంచికులమందుఁ బుట్టినవారి హృదయమందు నీవు లజ్జారూపముతో నుందువు. అకర్మము నుండి విముఖుఁడగుటయే లజ్జ. నిందితకర్మములు చేయ నొల్లకుండుట యనెడి చిత్తసంకోచమే లజ్జ. మఱియొకపక్షమున – సత్తుజాడ నెఱింగినట్టియు, విషయముల నెడి కులమందుఁ దిరుగుచున్నను, అకులసంధానము నొందినట్టియు, అనఁగా అఖండసత్తననుభవించినట్టియు జనులు, నిన్ను సర్వకర్మముల కతీతనుగా నెఱుఁగఁగలరు, గాన దేనినంటని నీయందు నెట్టి కర్తృత్వము నర్పించుటకును సంకోచింతురు. ఇదే వారి యకర్మవిముఖత్వమనెడి లజ్జ.

"తాం త్వాం నతాఃస్మ" అట్టినీకుఁ బ్రణమిల్లుచున్నాము. అమ్మా! నీవు మా హృదయములందు శ్రీ, అమలబుద్ధి, లజ్జా

రూపములతో నిన్ను వెలయించుకొనుచుందువు. నీవు అదృశ్యవు, అస్పృశ్యవు, అగ్రాహ్యవు నయ్యు నీ రూపములతో నెల్లప్పుడు మా హృదయములం దావిర్భవించుచుందువు. అట్టి నీకుఁ బ్రణమిల్లుచున్నాము.

"పరిపాలయ దేవి విశ్వమ్" నీ వీ విశ్వమును బరిపాలింపుము. అమ్మా! నీవు యథార్థముగా నీ విశ్వముఁ బాలించుచున్నావు. విశ్వవాసిజీవులు నీ నెయ్యపుటొడియందే యున్నారనెడి విశ్వాసమును, ధ్రువజ్ఞానమును, ఈ మా జీవుల హృదయములం దుద్దీపింపఁజేయుము. నీ నెయ్యపుబిడ్డలు త్రితాపాగ్నిచే మాడిపోవుచున్నారు. దుర్భిక్షము, మహామారి, అకాలమృత్యువు ననెడి తిరుగలిగానుగలందు నలిగి ఛిన్నమర్మ లగుచున్నారు. వారు నిత్యానందమయివైన నీయొడియందే పాలింపఁబడుచున్నను విషాదముతోను భయముతోను జచ్చిపోవుచున్నారు. నీవు వానిని దొలఁగింపుము. గురురూపముతోఁ బ్రత్యేకజీవుని హృదయమందును నీవావిర్భవించి (జీవుల) యజ్ఞానమును బాఱఁద్రోలుము. ఇదే నీ యథార్థ జగత్పరిపాలనము. కానిచో జగత్పరిపాలనముచేయు సార్థకత యేమున్నది? నీవే జగదాకారమున రూపొందినదానవు. మఱి నీవే జగత్సృష్టి స్థితి ప్రలయములు చేయుదానవు. కనుక నీవు జగత్తును బాలించుచున్నావు. పాలింతువు. ఈ మాట చాలు.

అమ్మా! మేము నిజముగా నిరాశ్రయులము కాము, అని మాకుఁ దెలియఁజెప్పుము. మేము దుఃఖముచేతను, భయముచేతను ప్రబలుల యత్యాచారములచేతను బీడితులమై, మమ్ము మేము పూర్తిగా నిరాశ్రయుల మనుకొని మిగుల నీరసించి

పోవుచున్నాము. ఈ మా దుర్బలభావమును బాఱద్రోలుము. అమ్మా! నిజముగా నీవు విశ్వపాలినీరూపముతో నెల్లపుడును మమ్ము నీ గుండెపైనే పెట్టి యుంచుకొన్నావనెడి మాటను మా మర్మమర్మములయందు ననుభవించు సామర్థ్యము నిమ్ము.

ఓం. కిం వర్ణయామ తవ రూప మచింత్య మేతత్
కించాతి వీర్య మసురక్షయకారి భూరి ।
కిం చాహవేషు చరితాని తవాద్భుతాని
సర్వేషు దేవ్యసుర దేవగణాదికేషు॥ ఓం. 5

ఓ దేవీ! అచింతనీయమైన నీ రూపము నేమని వర్ణించుట? అసంఖ్యాసురుల వినాశమొనర్చు నీ ప్రచురవీర్యమును, యుద్ధభూమియందుఁ బ్రకటితములైన నీ యలౌకికచరిత్రములు నను నవి, యసురులను దేవతలను మీఱినవి.

(ఇచట 'తవాద్భుతాని' అను పాఠమునకు – నీవు రణక్షేత్రమం దసురులయెడను, దేవతలయెడను బ్రకటించిన నీ చరిత్రములు వింతలు – అని చెప్పఁదగును.)

వివరణము:—అమ్మా! అవర్ణనీయము, అచింతనీయము నైన నీరూపము, మనోవాక్కులకు విషయముకాదు. కానవచ్చు పదార్థములకే యొక రూపము, అని మే మెఱుఁగుదుము కాని, ఆ రూపవస్తు వేమిటో మాటలతో వెల్లడింపఁ జాలము. మేము దేనిని రూప మనుకొనుచుందుమో, అనుచుందుమో, అది వాస్తవముగా రూపము కాదు. ఆకృతి మాత్రమే.

వట్రువ, చదరము, ముక్కోణము, ఎఱుపు, తెలుపు, నలుపు, మెత్తన, గట్టి, పొడుగు, పొట్టి, మున్నగు నెన్నో పదములతో, మేము రూపవస్తువుల నెఱుంగుటకుఁ జెప్పుటకుఁ బ్రయాస పడుట తప్పదు. కాని వాస్తవముగా వానిచే రూపము కొంచెము మాత్రమే తేఁటపడును. ఆకార ఘటనముల కొంత భాగము మాత్రమే వ్యక్తమగును. "రూప"మను మాటను దెలియుటకై మేము, సుందరము కుత్సితము అను రెండు మాటలను బ్రయోగింతుము. ఇవి యాకారమును జూచియే బ్రయోగింపఁబడును. వాస్తవముగా రూపము రూపమే. దానియందు సుందరము కుత్సితము నేమియు లేదు. రూప మొక్కటే కాక రెండు కాదు. ఈ విశ్వము రూపసాగరమందే భాసించుచున్నది. ఈ రూపముయొక్క స్వరూపమేమో, అది యేవిధముగాఁ బ్రకాశించునో మాటలతో వెల్లడింపఁ బడదు. ఊహకును అతీతమైనది. అయినను రూపము లేదని తోఁచు టకును వీలులేదు. ఎప్పుడును రూపమునే చూచుచున్నాము. కాని, ఆ చూచుచున్నది రూపము కాదు. ఆకారము. ఒక యఖండరూప సాగరమందు ఎన్ని నామములు, ఎన్ని యాకా రములు నుబుకుచున్నవో తెలియదు. ఆకారము రూపము తక్క మఱేమియుఁ గాదనుట తెలిసియుఁ దెలియ లేకున్నాము. ఈ యాకారమే వేదాన్త ప్రతిపాద్యమైన నామరూపములు. వాస్తవముగా మనము రూపమువైపు లక్షించునపుడే, సర్వేం ద్రియములకును అగమ్యమైన మహాసత్యక్షేత్రమందుఁ జేరు కొందుము, అనఁగా ఆ క్షేత్రమునకుఁ గొనిపోఁబడుదుము. అదే యథార్థముగా మనోవాక్కులను మీఱినది.

అమ్మా! మేము దేనిని సౌందర్య మనుకొనుచున్నామో, అదే నీ రూపముగా నెన్నుచున్నాము గాని, అదియు నూహా మున కందనిదే – చంద్రునందుఁ గమలమందుఁ గామినీ కమనీయాస్యమండలమందుఁ, జిన్నబిడ్డల వచ్చియురాని తొక్కు పల్కు లందు బిందుమాత్ర సౌందర్యమును జూచి ముగ్ధుల మగుచున్నాము. ఏ సౌందర్యసింధువునందలి యొక బిందువే మమ్మింతగా మోహితులను జేయుచున్నదో, యా సౌందర్యసింధువే యైన నీవు, ఎంత ప్రాణసుఖదాయినివో తెలియఁగలమా? అమ్మా! ఈ వ్యష్టిరూపములే, యీ వినశ్వరరూపములే మా కనులు గప్పివేయుచు నీవంకఁ జూపుపడనీకున్నవికదా. సమష్టి రూపమయినవైన నీయెడ ముగ్ధులైనవారు, జగద్రూపమును దుచ్ఛముగా నెంచి విడుతురనుచోట వింత యేమున్నది? అమ్మా! నీవు సాక్షాన్మన్మథమన్మథవు. నీ యీ రూపసాగరమందు మునుఁగఁగల్గి తన్మయులగువారలే, కుత్సితము నిందితము ననుట కేమియు లేదనియు, సర్వము రూపమయమే, సర్వము సుందరమే యని యెఱుఁగఁగలరు. అమ్మా! అదెంతటి శోభ నీయావస్థ!

అమ్మా! నీ యీ రూపాతీత రూపసాగరమం దేవిధముగా మునుఁగఁగలడో, నాకుఁదోఁచినంత చెప్పనా? – రూపమునకు అయిదవస్థలు. 1. స్థూలరూపము, అనఁగా ఆకారము. 2. చక్షువు, అనఁగాఁ జూచుశక్తి. చక్షువువల్లనే రూపజగత్తు యొక్క సూక్ష్మప్రకాశము. 3. రూపతన్మాత్ర. ఇది రూపము యొక్క సూక్ష్మతరప్రకాశము. ఇక్కడఁ జేసుకొన్నపైని రూపమన్నది, బోధముతక్క మఱేమియుం గాదని యనుభవ

మగును. ఇంతేగాక, రూపమునకు మఱియొక్క యవస్థ యున్నది. 4. అది పురుషార్థము. పురుష – విశుద్ధబోధస్వరూప పరమాత్మయొక్క భోగసంపాదనము (అనుభవము) చేయుట చేతనే, దీనిపేరు పురుషార్థము. ఇదే రూపముయొక్క అయిదవ యవస్థ. ఇది అతిసూక్ష్మతమ స్వరూపము.

తొలుత సత్యబోధముతో (ఆత్మసాక్షాత్కారముతో) స్థూలరూపము – అనఁగా నేదేని పదార్థముయొక్క యాకారమును, అమ్మరూపముగానే యెంచి, పట్టుకొన్నపైని, రూపముయొక్క రెండవస్వరూపము – దర్శనశక్తి – భాసింపఁజొచ్చును. విశ్వమందొక్క దర్శనశక్తియే, యథార్థముగా రూపముయొక్క స్వరూపము, అనెడి బోధము (జ్ఞానము) కలుగుచుండును. తరువాత దీనియందు సత్యబోధముంచి అమ్మా! అమ్మా! యనుచునే కేంద్రమువంక ముందడుగు వేయుటచే, రూప తన్మాత్రను జేరుకొందురు. అది యతిసూక్ష్మము. జ్ఞానమయరూపము. ఆకాశీయభావము. అయినను, అతిలోభనీయము. అతిశయ ప్రాణారామము. ఇఁక అమ్మా! అమ్మా! యనుచు ముందంజ వేసినచో, అమ్మ, నా 'నేనే' యనెడి రూపమయజ్ఞాన మగుచుండు చోటికిఁ జేర్చివేయును. అహంబోధము – అస్మిత, రూపముతక్క మఱేమియుం గాదనునట్టి యనుభవము వచ్చును. అపుడు "నేను" ఏమయిపోయెనో యనునది మాటలతో నెటులు వ్యక్తమగును? అరూపముయొక్క రూపమయస్వరూపము నుండి మఱల, అమ్మా! అమ్మా! యనుచు నేడ్వ నారంభించినచో, ఈ రూపమయమైన 'నేను'న కేది ద్రష్టయో, దేని కరుణ దృష్టిచే, నేను రూపము వికసించునో, ఆ స్వరూపముయొక్క

యాభాసము లభించును. ఆ తర్వాత మఱల స్థూలరూపమునకు దిగివచ్చిన సాధకునకు, ఏమగును? ఆ రూపమునకైన పిపాస, సౌందర్యమునకైన యాకాంక్ష, యెన్నటికిని దొలఁగిపోవును. మఱల "రూపం దేహి" యనుచు నమ్మతో దీనముగా మొఱ్ఱ పెట్ట నక్కఱ లేదు. అర్గలా స్తుతియందలి "రూపం దేహి" యను మంత్రముయొక్క సిద్ధావస్థ యిదియే.

అమ్మా! నీ ప్రియతమసంతానముతో, "అబ్బాయీ! కేవలము "రూపం దేహి" యనుచు స్థూలరూపమును బట్టుకొని, సత్యప్రతిష్ఠామార్గమున ముందడుగు వేసినచో, ఎంత సులభముగా, నెంత యనాయాసముగా రూపసముద్రమందు అవగాహనము చేయుదువో, రూపాతీతస్వరూపమును గనుగొందువో, నీకే తెలియును" అని చెప్పివేయుము.

"కించాతివీర్యమ్" అమ్మా! అసురక్షయకారిణ్యైన సాటి లేని నీ వీర్యము సైతము మా ధ్యానమును మీఱినదే. అమ్మా! అసుర వీర్యరూపముతోను నీవే, మఱి యసుర వీర్య క్షయకారి రూపముతోను నీవే యున్నావు. క్షయ శబ్దమునకు రెండర్థములు. వినాశము, నివాసము; క్షి ధాతువునకు నివాసార్థమందును ప్రయోగము కలదు. కనుక, అసుర క్షయ కారి వీర్యము అని రెండర్థములును దోఁచును. ఏ వీర్యము అసురరూపముతోఁ దన్ను వెలయించుకొన్నదో, అదియు నీవే. ఒక్కచోటనే యొండొంటికి విరుద్ధములైన భావము లిటులుండుట, నీ యందే తగును. అసురుల యందును, సురల యందును నీవు సమానముగానే వెలయుదువు. (రెండు రూపములు నీవేయని యర్థము,) ఎచ్చటను హెచ్చుఁదగ్గులు లేవు;

కనుకనే మంత్రమందు "అసురదేవ గణాదికేషు" అని కాన వచ్చుచున్నది.

అమ్మా! బ్రహ్మాండ సృష్టి స్థితి ప్రలయము లొనర్చుట యనెడి, నీ మహావీర్యము వెలయుట కాంచిన మాకింతకు మున్నే, నీ యసురవీర్యము తేటపడినది. మేము నీ యీ సాటిలేని వీర్యమును జూచి వింతపడి కొయ్యవాఱి పోతిమి. నీవు కామ క్రోధ లోభ మోహాసురులైన యసురరూపముతో వెలయునపుడు, నిష్కామ, నిష్క్రోధ, నిర్లోభాది దేవవీర్యమున కెంతయో పరాజయమైనది. మఱల దేవవీర్యము ప్రబల మైనపుడు, అసురవీర్య మోడిపోయినది. అమ్మా! ఈ విధముగా దివారాత్రములు మా హృదయక్షేత్రమందు, నీ వీర్య ప్రభావమే యనుభూతమగుచున్నది. మఱి యీ విధముగాఁ బరస్పర విరుద్ధవీర్యము వెలయువేళ నగు నా యుద్ధమందు, అభూతపూర్వమైన, లోకోత్తరమైన నీ వీర్య మెంతగా వెలయును! అమ్మా! అసురవీర్యపీడ యారంభమగునపుడు, చిత్తక్షేత్రమందు లోకనిందిత లీలాభినయ మెంతయో యగు చుండును. మఱొక్కగడియ తర్వాత (ఉత్తరక్షణమందే) అసురవీర్య ప్రాబల్య మణఁగిపోయి, దేవతావీర్యము ప్రబలమై చిత్తక్షేత్రమందు స్వర్గీయశాన్తిని నిర్మలముగాఁ బ్రవహింపఁ జేయుచుండును.

అమ్మా! ఇంతేగాక, నీ వీర్యమందు మఱొక్క ప్రభావము కనవచ్చును. అది సురాసురులను మీఱినది. అమ్మా! సర్వవీర్యములు నెచ్చటఁ బరాభూతములగునో, అది యభయామృతమయ వీర్యము. దానివలని భయముచేతనే వేళకు

సూర్యుఁ డుదయించుట, అదను పదను జెడనట్లు గాలివీచుట, మేఘము కురియుట, మృత్యువు భీతిని బరుగెత్తుట యగుచున్నది. ఆ వీర్యమే యిది. అమ్మా! నీవు సర్వవీర్యాతీత వీర్యమయివి. నీ చరణములకుఁ గోటి ప్రణామములు.

ఓం. హేతుః సమస్తజగతాం త్రిగుణాపి దోషై
ర్నజ్ఞాయసే హరిహరాదిభి రప్యపారా।
సర్వాశ్రయాఖిల మిదం జగదంశభూత
మవ్యాకృతా హి పరమా ప్రకృతి స్త్వమాద్యా॥ఓం. 6

నీవు సర్వజగత్కారణవు. త్రిగుణస్వరూపవయ్యు, దోష కారణముచే నజ్ఞేయవు; కనుకనే హరిహరాదులకును ధ్యాన గమ్యవు కావు. నీవు సర్వాశ్రయవు. ఈ యఖిలజగత్తు నీ యంశమే. నీవే యవ్యాకృతము నాద్యమునైన పరమప్రకృతివి.

వివరణము:— మాయమ్మా! నీవే సర్వజగత్కారణమవు. ఇపుడు మేమున్న యీ జగత్తొక్కటే జగత్తు కాదు. సమస్తజగత్తులు – అనంతకోటి బ్రహ్మాండములు, ఈ యనాది సృష్టిచక్రమునకు సంబంధించిన పరివర్తనశీలపదార్థముల కన్నిటికి నీవొక్కతెవే కారణమవు. కారణము రెండు విధములు – నిమిత్తము, ఉపాదానము. ఈ రెండు నీవే. మేము స్వప్న దృష్టాంతముచే నిది యించుక తెలియఁగలము. స్వప్నమందుఁ గానవచ్చు పదార్థములకు నిమిత్తము, అనఁగాఁ గర్తయు, ఉపాదానము అను రెండును, మనస్సుకంటె వేఱేమియుఁ గా నట్టులే యీ జాగ్రదవస్థయందుఁ గానవచ్చు (అనుభవింపఁబడు'

జగత్ప్రపంచమునకు నిమిత్తోపాదానములు రెండును నీవే. ఆత్మవు, మా యమ్మవు నీవే. నిన్నుఁ గొన్నివంతులుగాఁ జేసి కొని ద్రష్టగాను దృశ్యముగాను వెలయుచున్నావు.

అమ్మా! ఒకప్పుడు జ్ఞానవృద్ధులైన నీ బిడ్డలు కొందఱు, "ఆత్మ జగత్కారణముకాదు. ఆత్మ నిర్గుణము. నిష్క్రియము. దానియందెట్టి కారణత్వ ముండఁజాలదు. జగత్తున కుపాదాన కారణము జడప్రకృతి. చైతన్యస్వరూపాత్మకు సమీపముగా నుండుటవల్ల, నీ జడప్రకృతియందగు పరిణామమే యీ జగత్తు. మఱి నిమిత్తకారణత్వమును నీ యాత్మయందు లేదు. ఏలన - ప్రకృతికగు జగద్రూపపరిణామమును దర్శించుటయు నాత్మ ధర్మముకాదు. దానియందెట్టికోరికయు లేదు. స్వప్రకాశస్వరూప మైన యాత్మయొక్క సమీపతావశమునఁ బ్రకృతియందుఁ జైతన్యధర్మము భాసింపఁజొచ్చును. దాని పరిణామమే యీ జగత్తు" అందురు. ఇటులనెడివారితో మా కెట్టి విరోధమును లేదు. మేము వారి ధిక్కారములనుసైతము సత్యజ్ఞానముతో స్వీకరింతుము. గాని, అమ్మా! నీవు మా యెదుటఁ గేవలము, ఇట్టిభావముతో నిన్ను వెలయించుకొనలేదు. గురురూపముతోఁ నావిర్భవించి విశిష్టభావముతోఁ గానవత్తువు. ఆ జడప్రకృతియు నీవే. ఆత్మా! మా యమ్మా! ఆత్మయే మా యమ్మ. కను కనే, మంత్రమందు "త్రిగుణా" - త్రిగుణాత్మికా ప్రకృతిరూప ముతో జగదుపాదానమును నీవే, కాని మఱేదియుఁ గాదు.

పరమాత్మా! మా యమ్మా! నీవు చైతన్యస్వరూపవు. చిచ్ఛక్తివికదా. నీ ప్రకృతి జడము - అచేతనము నగునని

యెటులంగీకరింతుము? ఎటులు నమ్మెదుము? చేతనమైన యాత్మయొక్క ప్రకృతి, అచేతనము కాఁజాలదు. సరికదా, అచేతనాకారమునఁ జేతనయొక్క ప్రత్యక్షజ్ఞానమును గలిగింపఁ గలది. త్రిగుణప్రకృతి ఆత్మకంటె వేఱుగా నుండఁజాలదని కను గొనుచున్నపుడే జడసత్తాభాసముకాదు. (జడసత్త ప్రకాశింపదు.) (సూర్యునకును గిరణములకుం బోలి) ప్రకృతికి ఆత్మకును అవినా భావ వ్యాప్తి కలదు. అపుడు మఱి దానిని జడమెటులందుము? అమ్మా! నీ యాలోచన ముండునంతదాఁక నే, 'నేను' ఉండు నంతదాఁకనే నీవు త్రిగుణప్రకృతివి. 'నా ప్రకృతి' యని నోర నందురే కాని, వాస్తవముగా 'నేనే' ప్రకృతి. 'రాహువు శిరస్సు' అనఁగానే, రాహువుకంటె శిరస్సు వేఱనుకొనునట్లే యిమ్మాటయు నున్నది. పురుషప్రకృతులు, బ్రహ్మమాయలు, ఆత్మశక్తులు మున్నగు యుగ్మవాచక శబ్దములు (జంటలను దెలుపు మాటలు) ప్రయోగింపఁబడినను, వాస్తవముగా నవి కేవల మభిన్నములు. ఆత్మ ప్రకృతిరూపముతో, మాయా రూపముతో - శక్తిరూపముతో వెలయునపుడే యది ప్రకృతి, మాయ, శక్తి యనఁబడును.

ఒక శంక కలుగవచ్చును — "విశుద్ధబోధ 'జ్ఞ' స్వరూ పాత్మ, జడప్రకృతిరూపమున అనఁగా - త్రిగుణాకారమున నాకారితమగునా?" యని, దీనికి సమాధానమేమనఁగా - ఆ 'జ్ఞ' వస్తువునందు జ్ఞాతృ జ్ఞేయ జ్ఞానములనెడి మూడు విశిష్టభావ ములు వెలయును. నిర్గుణావస్థయందది యవ్యక్తముగా నుం డును. గనుకనే ప్రకృతికి మఱియొకపేరు 'అవ్యక్తము'. 'జ్ఞ నుండియే జ్ఞాతృ జ్ఞేయాది ధర్మములు వెలయును. అవే త్రిగుణ

ములు. జ్ఞానము - సత్త్వగుణము; జ్ఞాత - రజోగుణము; జ్ఞేయము - తమోగుణము. ఈ మూడువస్తువులును ఎక్కడనో మఱియొకచోటినుండి రావు. ఆ 'జ్ఞ' వస్తువునుండియే ప్రకాశితము లగును. మూడవస్థలుగాను 'జ్ఞ' ఆత్మవస్తువు సరిగా, అటులే యుండును. ఇఁక, ఆత్మయందే జ్ఞాతృ జ్ఞేయాది ధర్మములు ప్రకాశించి నామరూపాత్మక జగత్తు ప్రత్యక్షమగును. కనుక, అమ్మా! ఏవైపు చూచిన నావైపే, ఎచ్చటఁ జూచిన నచ్చటనే నీ విచిత్రవికాసమును గాంచి ముగ్ధులమగుచున్నాము. కనుకనె, యెచట నమ్మా! యని మేము పిలిచినను, అచటనే 'ఓ - ఆఁ' యనెడి నీ బదులుమాట విని, నీ స్నేహాదరముల గర్వము ననుభవించుచున్నాము. కనుకనే దేవతలు నిన్ను స్తుతించునపుడు, "హేతుః సమస్తజగతాం త్రిగుణా" యని ప్రకృతిరూపిణివైన నీ యరుణచరణములందు ప్రాలిరి.

అమ్మా! నీవు త్రిగుణమూర్తితో జగద్రూపమునఁ బ్రత్యక్షవగుట యింత సత్యమైనపుడు మేమును దేవతలవలె నిన్ను జగద్రూపనుగా నెందులకుఁ జూడము? కుండ, కూజా చూచుటతోనే మన్ను గానవచ్చునుగదా. కుండలములు చూచుటతోనే బంగారు కానవచ్చునుగదా. అటులే యీ జగత్తునుగాంచినంతనే నీ దర్శన మెందులకు గాదు? చిన్మయీ! నీవే జగత్తయినచో, నీవే నామరూపములయినచో, నిన్నెందులకుఁ గనలేరు?

"దోషైర్నజ్ఞాయసే" దోషములు కారణముగా నిన్నెఱుంగరు. దోషము లేవి? మొట్టమొదటిదోషము సంశయము. రెండవది అవిశ్వాసము. మేము కేవల నామరూపములనే

చూడఁగోరుదుము. మే మెల్లప్పుడును బరివర్తనరూపమైన జడ జగద్రూపముగానే దీనిఁజూచు నభిలాషముగలవారము; కనుక నే నిన్నుఁ గానలేము. మఱి, యెప్పుడేని మెఱుపు మెఱసినట్లు క్షణస్థాయియైన అమ్మదర్శనముచేయు నిచ్ఛ రవ్వంత పొడమినను, ఎంత సందేహము ! ఎంత యవిశ్వాసము ! కన్నుల దుమ్ముకొట్టి యెదుర నిల్చి, ఏమైనది ? ఈ జడమృత్తిక అమ్మయా ? యనుచుందును. అయ్యో! ఈ జడజలము చిన్మయి, అమ్మ కాఁగలదా? అనుచుందును. ఈ విధముఁగా, మమ్ముల నా రెండును (దౌర్బల్యములు) మోసపుచ్చుచున్నవి. అవే నీ యీ ప్రకట విశ్వమూర్తి విషయమున జడత్వమనెడి దట్టమైన తెఱను వ్రాల్చుచున్నవి. కనుక రవ్వంత కోరిక కలిగినను, వింతలో నంతరించి పోవుచున్నది.

అమ్మా! ఇంకెంతవఱకు నీత్రితాపదగ్ధ జీవకులమును మోసపుత్తువు? నీవే దోషములను సృష్టింతువా? నీవే నీ యవయవములను దోషములతో నడ్డుపెట్టి యుంతువా? సరే, దీనివల్లనే నీవు మాకుఁ బట్టువడవు. నిన్ను దోషమయినిగాఁ జూచుటే మా కన్నులకుఁ జిరకాలమునుండి యలవాటయినది. కనుక గుణమయినిగాఁ గనలేకున్నాము. దోషములనుగూడ, అమ్మ రూపముగానే తలంపఁగల్గుదుమేని, మాయనుగూడ, అమ్మ రూపముగానే యంగీకరింతుమేని, ప్రకృతినిగూడ పురుషుఁడనియే గ్రహింతుమేని, మనసునుగూడ ప్రాణమనియే యాదరింతుమేని, విషయములనుగూడ భోక్తృరూపమున భోగింతుమేని, దృశ్యమునుగూడ ద్రష్టృస్వరూపముగా దర్శింతుమేని, జడమునుగూడ చేతనమునుగా ననుభవింతుమేని,

తప్పక అమ్మా! నీ దోషావరణము దూరమై పోవును. తల్లీ! నీవు తక్క మిగిలినదంతయు దోషమే. సర్వరూపములతో నీ వొక్క తెవే యున్నావని తెలియఁగల్గినపైని దోషమెక్కడిది? దోషము నీకంటె నేదో వేఱుగా నుండునంతవఱకే, నీవు "నజ్ఞాయసే". ఇదిగో, అమ్మా! ఈ దోషములను మిథ్యయని, భ్రాన్తియని, అధ్యాసమని, కల్పనామాత్రమని తలంచి కేవలము నీ వైపునకే చూపు సారించువారియందు సైతము, ఇంతో అంతో దోషము నిల్చిపోయినది. మిథ్యయే యనుము; భ్రాంతియే యనుము; దోషదర్శనమే యగును. కనుక దోషములను నీకంటె వేఱుగా – అనఁగా నీ కావరణముగాఁ గన్నంత దాఁక నే నీవు "నజ్ఞాయసే". అంతవఱకే నీవావృతవై యుందువు. అమ్మా! గీతయందు "నిప్పేకదా పొగచే నగ్ని క్రమ్మఁబడినటులు, ధూళి తెఱచే దర్పణము క్రమ్మఁబడినట్లు మావిచే గర్భము చుట్టఁబడియున్నటులు, అజ్ఞానముచే జ్ఞాన మావరింపఁ బడి యుండు"నని చెప్పితివి. అజ్ఞానమే దోషము. అజ్ఞాన ముండునంతదాఁక జ్ఞానము ప్రకాశింపదు. ఇది సత్యమే. కాని, పొగ యగ్నితోనే పుట్టిన (సహజాత) దోషమైనటులే, ధూళి తెఱ యద్దమునకుఁ దప్పకంటు నాగంతుక దోషమైనటులే, మావి గర్భమునుసంరక్షించు సహజగర్భావరణ దోషమైనటులే, యజ్ఞానము జ్ఞానమునకుఁ దప్పకగు సహజాతదోషము. అజ్ఞానముకూడ జ్ఞానమేయని తెలిసికొనుటతోనే దోషము దూరమైపోవును. జ్ఞానముదయించును. అపుడు మఱి నీవు "నజ్ఞాయసే" కావు, "జ్ఞాయసే" యగుదువు. అనఁగా అపుడు నీవు జ్ఞానరూపముతోనే నిన్ను వెలయించుకొందువు.

"హరిహరాదిభి రప్యపారా" అమ్మా! మేము నిన్నుఁ దెలియుటెట్లు? నీవు మాకే యజ్ఞేయవు కావు. శివ విష్ణు బ్రహ్మల ధ్యానమునకును నీ వగమ్యవు. "ధ్యాత, ధ్యేయము, ధ్యానము" (త్రిపుటి) ఉండునంతదాఁక నీ యథార్థస్వరూపము వెల్లడికాదు. హరియని, హరుఁడని విశిష్టబోధముండునంతదాఁక నీ పరమాత్మస్వరూప మెటులు ప్రకాశించును? అమ్మా! 'నేను' ఉండునంతదాఁక నీవురావు. 'నేను' వెళ్లిపోయిన తర్వాత నపుడు నీవు వత్తువు. అపారచిత్సముద్రమందు విశిష్టమైన యీ 'నేనును' బూర్తిగా నొక్కసారి ముంచివేయు నంతదాఁక, నే విధముగాను నీ వాత్మరూపముతోఁ బ్రకటవుకావు. కనుక నే నీవు "హరిహరాదిభి రప్యపారా" అయితివి.

"సర్వాశ్రయా" అమ్మా! ఇంత తెలియరానిదాన వైనను మేము హతాశులముకాము. అగుహేతువులేదు. ఏలన, నీవు సర్వాశ్రయవు. నీవు సర్వమునకు నాశ్రయమై యున్నావు. మేము నీ యాశ్రితులము. సాధారణసంభాషణమందు "నీవు మమ్ముల నొడినుంచికొన్నావు" అందుము. మేము నిన్నెఱుంగ లేకున్నను సర్వవిధముల నీ యాశ్రితులమే. నీ యొడియందే కూర్చున్నాము అని తెలిసికొన్నం జాలును. మాకు గావలసి నంత లాభమైనదే. మేము నిరాశ్రయులమును, అనాథులమును గాము. మేము నీ యందే యున్నాము. జన్మము, మృత్యువు, శోకము, దుఃఖము, అభావము, ఉత్పీడనము, ఏమికానీ, అవస్థల విపర్యయ మెంతగాఁగానీ; సర్వాశ్రయవు; అమ్మవు. సర్వావస్థలందును సర్వవిధముల ధరించి యుంచితివి. మమ్ములను క్షణమైనను నీవు విడువలేదు. ఇంతకంటె నధికాశ్వాసన

వాక్యములు మఱేముండును? అమ్మా! ధన్యులము. మేము నీ సంతానము. నీ యొడియందే నిబ్బరముగాఁ గూర్చున్న నగ్నశిశువులము. అమ్మా! అమ్మా!

"అఖిలమిదం జగదంశభూతమ్" అమ్మా! నీవు సర్వాశ్రయవని మేమెటులు తెలిసికొనుట? ఈ సమస్త జగత్తు నీ యంశమునుండియే పుట్టినది. తన యంగప్రత్యంగములను సర్వవిధములఁ దానెఱుంగఁగల యవయవి, అవయవములకు ఆశ్రయమైనటులే, యీ యఖిలజగత్తు నీ యంశమే యగుటచే నీవు సర్వాశ్రయవు. ఒక నీ యంశము జగదాకారముతో వెలయును. శ్రుతి "పాదోఽస్య విశ్వాభూతాని" యనుచున్నది. నీ నాల్గవపాలుగా నీ జగత్తున్నది. తక్కు మూఁడు పాళ్లు స్వయంప్రకాశముగా, అమృతస్వరూపమై యున్నది. అక్కడ జగత్తులేదు. కల్యాణి శ్రుతి, యల్పజ్ఞజీవులమైన మాకు సులభముగాఁ దెలియుటకై అపరిచ్ఛిన్నవు, అనంశవు, పూర్ణస్వరూపవునైన నీకు, అంశకల్పనము చేసినది. నీవు సర్వాశ్రయవను విషయమున నెవ్వరేని — ఈ బ్రహ్మాండమున కాశ్రయ మిచ్చునపుడు, ఎంత పరిమాణ మావశ్యకమో, అంతేకాఁబోలు నీ సీమ యనుకొని శంకింతురు. అట్టి వారి శంకా నివృత్తికయియే, ఈ విశాలబ్రహ్మాండము నీ యత్యల్పాంశముగానే ప్రకాశించుచున్నదనియు, నీ యధికాంశము స్వయంప్రకాశము, నిత్యపూర్ణము, అపరిచ్ఛిన్న స్వరూపమనియుఁ జెప్పఁబడినది. అమ్మా! నీవే స్వయముగా నంటివి కాదా. "విష్టభ్యాహ మిదంకృత్స్న మేకాంశేన స్థితంజగత్" (గీత10_42)

అని; ఈ జగత్తు నీ యంశమే యైనపుడు నీవు 'అంశివి' అని చెప్పనేల? కనుకనే నీవు సర్వాశ్రయవు.

"అవ్యాకృతా హి పరమా ప్రకృతి స్త్వమాద్యా" ఈ ప్రత్యక్షజగత్తు నంటిన చంచలతను నియతపరిణామమును జూచి మన మనస్సునందు "ఈ జగదంశముగా నీవును జంచలవు, పరిణామశీలవు" అని శంక కలుగును. కనుకనే దేవతలు నిన్ను స్తుతించునపుడు "అవ్యాకృతా, పరమా, ఆద్యాప్రకృతిః" అనిరి. అమ్మా! నీ వనేక నామములతో, అనేక రూపములతో వ్యాకృతవయ్యును (విశిష్టాకారములను బొందియును) నీ యవ్యాకృతత్వము నఖండముగా నుంచితివి. మంచుగడ్డగా నైనను జల పరమాణువులయందు వికార మించుకయు లేదు. బోధ వస్తు వెంత వ్యాకృతము కానిమ్ము. ఎట్టి యవస్థయందును దాని బోధత్వమందు బిందుమాత్రమైనను వికారము కాదు. కనుక నీవు జగద్రూపముతో వ్యాకృతవైనను స్వరూపమందు అవ్యాకృతవుగానే యుందువు. కనుక నీవు నిర్వికారవు, నిత్యవు, స్థిరవు; ఏ విధమైన చాంచల్యము గాని, పరిణామము గాని, నీయందు లేదు. "జాయతే, అస్తి, వర్ధతే" మున్నగు షడ్భావ వికారములు నీ మీదినుండియే వెళ్లిపోవును; నీవు మాత్ర మెల్లపుడు నవ్యాకృతవే. కేవల చిచ్ఛక్తిరూపిణి వగుట చేతనే, యీ యత్యంత విరుద్ధ ఘటనములు, నీయందు గాంచాలును. కనుకనే పరమవు, ఆద్యవు, ప్రకృతివి. సాంఖ్యులు దేనిని బురుషుఁడందురో, వేదాన్తులు దేనిని బ్రహ్మమందురో, ఉపనిషత్తులు దేని నాత్మయనునో, భక్తిశాస్త్రము దేనిని భగవంతుఁడనునో, ఆ యిదే ఆద్యా, పరమా, ప్రకృతి. మఱి

జగద్రూపముతోఁ బరిణామము నొందిన త్రిగుణాత్మక ప్రకృతి యనునది అనాద్య. అమ్మా! విశుద్ధబోధస్వరూప పరమ ప్రకృతివైన నీవు, జ్ఞాతృ జ్ఞేయ జ్ఞానరూపముతో సత్త్వ రజస్తమోగుణరూపముతో, అనాద్య ప్రకృతిరూపముతోఁ బ్రకాశించునపుడును, నీ వవ్యాకృతవుగానే యుండిపోదువు. కనుకనే నీ ప్రభావము యథార్థముగా నచింతనీయమే. యథార్థముగా నీవే, అఘటనఘటన పటీయసియుఁ జిన్మయియునైన జననివి.

ఓం. యస్యాః సమస్తసురతా సముదీరణేన
తృప్తిం ప్రయాతి సకలేషు మఖేషు దేవి।
స్వాహాసి వై పితృగణస్య చ తృప్తిహేతు
రుచ్చార్యసే త్వమత ఏవ జనైః స్వధాచ॥ ఓం. 7

ఓ దేవీ! సర్వవిధముల యజ్ఞములయందు దేవతాగణము దేని యుచ్చారణమువలనఁ దృప్తి నొందునో, ఆ 'స్వాహా' మంత్రము నీవు. మఱి పితృదేవ తృప్తికై నీవే 'స్వధా' మంత్రరూపమున లోకులచేత నుచ్చరింపఁబడుదువు.

వివరణము:- ప్రథమఖండమందు "త్వం స్వాహా, త్వం స్వధా" అను మంత్రముక్రింద దీని వ్యాఖ్య చూచునది. అమ్మా! జగత్తునందు యథాశాస్త్రముగా దేవ పితృ కార్యములను జరుపువారు, దుఃఖ సంసారారణ్యమం దుండియు సుఖశాంతులతో దినములు గడుపుచుఁ బరమ శ్రేయోలాభ మొందఁగలరు; కావుననే, గీతయందు నీవే "జీవుఁడా! నీవు యజ్ఞాదులచే దేవతలకుఁ దుష్టి పుష్టులు కలిగింపుము. ఆ దేవతలును, అన్నాదుల రూపముతో నీకుఁ బుష్టిఁ గలిగింతురు.

ఇట్టులు మీలో మీరు పరస్పర శుభచింతలయందు నియుక్తులై యుండి పరమ శ్రేయముల నొందుచుండఁగలరు. దేవతలకు యజ్ఞభాగముల నర్పింపక తామే భోగించువారు దొంగలు; పాపాన్నభోజులు" నని చెప్పివేసితివి.

సత్యమే. అమ్మా! మా యింద్రియములవలనఁ దేఁబడిన రూపరసాది విషయసామగ్రిని, ఇంద్రియాధిష్ఠిత చైతన్యవర్గమనెడి దేవతల నుద్దేశించి యర్పింపనిచో, హవిర్భాగములు దొరకకపోవుటచే, అనఁగా (సరియైన యభ్యాసము లేమిచే) దేవతలు దుర్బలులై పోదురు. ఆయా చైతన్యముల వికాసశక్తి క్షీణించును. మఱి దానిఫలముగా రోగము, శోకము, అకాలమృత్యువు మున్నగువాని సంఘటన మగును. విశేషమేమనఁగా, అజ్ఞానావరణము తొలఁగదు. దైవ పితృకార్యములందింత రహస్యము దాగియున్నది. దాని నాధునిక వైజ్ఞానికులును అంగీకరించుచున్నారు. అమ్మా! ఇంతగా నీ మహత్త్వ సమాలోచనలు చేసియు నిన్నెఱుంగఁజాలకుండుటకు హేతువు – ఆ దేవతల శక్తులు క్షీణించుటే. ఎల్లప్పుడు నింద్రియముల దారిని విషయాహరణము చేయుచున్నారు; అంతఃకరణ సహాయముచే వానిని భోగించుచున్నారు. ఏ దేవశక్తి సహాయమువలన నీ భోగములు సిద్ధమగుచున్నవో, యా దేవతల నుద్దేశించి యెవ్వరు నెన్నఁడును విషయముల నెడి హవిస్సుల నర్పింపరు. కనుకనే మన యింద్రియశక్తి శిథిలమై మనో బుద్ధి చిత్తాదుల సామర్థ్యము తఱిగిపోవుచున్నది. సూక్ష్మ విషయ చింతాధారణములందు సామర్థ్యమింతయు లేకున్నది. అతీంద్రియవస్తువును గూర్చిన చింతయందును, దాని ధరించుట

యందును మన బుద్ధి, తన యసమర్థతనే ప్రకటించుచున్నది. దీనికి ముఖ్యహేతువు – మనము వానిని సరిగాఁ బోషింప కుండుటయే.

'స్వాహా' అనఁగా దేవకార్యములచేతను, మఱియు 'స్వధా' అనఁగా శ్రాద్ధ తర్పణాది కార్యములచేతను, మన యంతఃకరణములకును బాహ్యకరణములకును అధిష్ఠాతలైన దేవతలు తుష్టినొంది ప్రసన్నులగుదురు. దాని ఫలముగా దుర్విజ్ఞేయవైన అమ్మా! నీవే విజ్ఞాత వగుదువు. ఇదిగాక మఱియొక తత్త్వమున్నది – ప్రత్యేక దేవతను వేర్వేఱువిధమునఁ దృప్తి నొందింపఁ బ్రయత్నింపక కేవల ప్రాణరూపిణివైన యమ్మను నిన్నుద్దేశించి స్వాహా స్వధార్పణము చేసినచో, ఇంద్రియముల దారిని దేఁబడిన విషయములనెడి హవిఃసంభారమును, మహా ప్రాణరూపిణియైన మాత్రగ్ని (బ్రహ్మాగ్ని) యందే యాహుతు లిడినచో, దేవతల కపారతృప్తి యగును. దాని ఫలముగా నింద్రియాధిష్ఠిత చేతనవర్గము పరిపుష్టమగును. చెట్టుమొదల నీరు పోసినచో రసప్రవాహముచే శాఖా పత్ర పుష్ప ఫలాదు లన్నియుఁ బోషింపఁబడును. ఉత్తమాంగమైన శిరస్సునకు శీతల స్నిగ్ధోపచారములు చేయుటచే సర్వావయవములును స్నిగ్ధ శీతలము లగును. అమ్మా! నీకుఁ దృప్తియయ్యెనా – సర్వము నకుఁ దృప్తియగును. "తస్మింస్తుష్టే జగత్తుష్టం ప్రాణితే ప్రాణితం జగత్" నీవు తృప్తినొందితివేని, త్రిజగత్తులు, దేవలోకము, పితృలోకము, సర్వము తృప్తమైపోవును.

అమ్మా! నీవు నిత్యతృప్తవుకదా. నిన్నింకను దృప్తినొం దించుట యెట్టిది? మేమెప్పుడును అతృప్తినే యనుభవింతుము,

కనుక నీయందును దృప్తిలేమినే (వెల్తినే) కల్పించి నీ తృప్తి విధానములకై పూనుకొనుచుందుము. మఱి నీవును నిజముగా నతృప్తవైనట్టులే, మా గుమ్మములకడకు వచ్చి "పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి। తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః" అనుచుందువు. నీవు మేమిచ్చు పండ్లు, పూలు, పత్రములను యాచించుదానవా? అవి యందుకొనక నీకుఁ దృప్తికాదు కాఁబోలు. అందులకా — "ఓ ముగ్ధ సంతానమా! అర్పించండి; ఏదో యీయండి; ఏమి లేకున్నను ఇంత జలము (జీవనము) ఈయండి; నేను దానినే ఆదరముతోఁ గైకొందును. వస్తువును జూడవలదు. అది ఇంత అంత యని చూడవలదు. కేవల భక్తిపూర్వకముగా నీయఁజూడుడు. దానివల్లనే నాకుఁ బూర్ణతృప్తి యగును" అంటివి. ఔరా! తలంచుకొన్నంతనే హృదయము కంపించును. అమ్మా! ఒకనాఁడు నీవు, నీకే చిత్తమునర్పించిన ద్రౌపదివలన నొక్కకణము శాకాన్నము నడిగికొని పరితృప్తవైతివి. అమ్మా! నీదయకు మేర లేదే. మా మనసుల నిండియున్న యతృప్తిని దొలఁగించుటకై నీవును, అతృప్తవు కావలసివచ్చుచున్నది. అన్నపూర్ణవు; నిత్యతృప్తవు; మా యమ్మవు. నీవు మా యతృప్తిని దొలగించుటకై స్వయముగా, అతృప్తిమూర్తితో వెలసి, జీవుల గుమ్మములకడ భిక్షమెత్తుదువే. ధన్యులా జీవులు.

మనుజులు చేయు విధ్యుక్తకార్యములందు నీవే నియోగింపఁబడుచున్నావు. నిన్ను నీవే నియోగించుకొనుచున్నావు. ఉద్దేశమేమి? కొన్నాళ్ళీవిధముగా, స్వాహా స్వధానుష్ఠానము వలనఁ నీకుఁ దృప్తిఁగలిగించు విధానములు జరుపఁగల్గుటచేతనే

మనుష్యుఁ డేదోయొకనాఁడు శుభముహూర్తమందు నీముఖము వంక దృష్టిఁ బఱపును. అపుడు నీవు నిత్యతృప్తవు, నిత్యస్థిరవు, నిర్వికల్పవు నైన యమ్మవని తెలియఁగలడు. అపుడు మెల్ల మెల్లగాఁ గర్మసన్న్యాసాధికారము వచ్చును. జీవుఁడు నైష్కర్మ్యము నొందును. అమ్మా! యిదే నీ దేవ పితృకార్యముల యథార్థస్వరూపము.

ఓం. యా ముక్తిహేతు రవిచింత్య మహావ్రతాచ
అభ్యస్యసే సునియతేంద్రియ తత్త్వసారైః।
మోక్షార్థిభి ర్మునిభి రస్త సమస్తదోషై
ర్విద్యాసి సా భగవతీ పరమా హి దేవి॥ ఓం. 8

ఇంద్రియములను సుసంయతముల నొనర్చినవారును, పరమతత్త్వమునే సారముగా గ్రహించినవారు నైన మోక్షార్థి మునులకు ముక్తిహేతువవు, అచింతనీయవు, మహావ్రత స్వరూపవు నైన నిన్నే ధ్యానింతురు. దేవీ! ఆ భగవతివి, పరమా విద్యవు నీవే.

వ్యాఖ్య:— మును జెప్పిన దైవ పితృ కార్యానుష్ఠానము చేయఁగాఁ జేయఁగా నాత్మతృప్తి కలుగును. ఆత్మ తృప్తితోఁ బరిచయ మొందును. అపుడు జీవుని యింద్రియములు సుసంయతములగును. మఱి విషయలోభముతోఁ బరుగెత్తవు. ఆ యవస్థయందు ఆత్మయే పరమతత్త్వమనెడి బోధము కలుగుచుండును. అందువల్లనే జీవుఁడు, ఆత్మనొందుటకు – మోక్షాశ యందు జాగృతుఁడగును. దీనిపేరే ముముక్షు – అవస్థ. అపుడు

కేవలము ఆత్మనే స్థిరముగా లక్షించుచుండుటచేత, వాగ్యంత్రము నడ్డగించి – మౌనము నవలంబించును – ముని యగును. ఇటులు ముని యగుటచే మల విక్షేపావరణాది దోషములు క్షీణించిపోవుచుండును. అట్టి యపుడు, ఆ మననశీల మునిజనులు చేయు నభ్యాసము – నిదిధ్యాసము – అదే నీవు.

Acc No 80412

ఈ యభ్యాసముయొక్క స్వరూప మేమి? అభి + అస్యసే = అభ్యస్యసే. అస్ విక్షేపే, అను ధాత్వర్థము విక్షేపము. ఉపనిషత్తు – "ప్రణవధనుస్సుపైని జీవాత్ముఁడు బోధమనెడి బాణము నెక్కించి, బ్రహ్మము నుద్దేశించి, అప్రమత్తతతో మాటిమాటికి బాణమును విడుచును" అనుచున్నది – ఇదే 'అభ్యస్యసే' అనుదాని యథార్థతాత్పర్యము. ఏదేనొక పనిని దఱుచుగాఁ జేయుటపేరే అభ్యాసము. ఇచ్చటను బ్రహ్మము నుద్దేశించి జీవాత్మ శరమును మాటిమాటికి విడుచుటే అభ్యాసమందురు. దీనిని నిదిధ్యాసమన్నను దప్పులేదు.

294.5
4-20 SAT

అమ్మా! జీవుఁ డీవిధముగా నభ్యాసతత్పరుఁడగునప్పుడే, అచింతనీయ మహావ్రతస్వరూపమున నిన్ను నీవు వెలయించుకొందువు. ఏలన, అభ్యాసమనెడి మహావ్రతము యథార్థముగా నచింతనీయమే. జీవుఁడు బుద్ధిపరపారమందుండి అవాఙ్మానసగోచర పరమాత్మాభాసము నొందుచుండునపుడే, యతని (దాని) నుద్దేశించి జీవాత్ముఁడు బోధమనెడి శరమును విడువఁగలఁడు. కనుకనే యీ వ్రతస్వరూప మిట్టిదని మాటలతో వివరింపఁ బూనినను, అది వాస్తవముగా నచింతనీయమే. "అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ సిధ్యతి" (గీత.) దాని యథార్థ

స్వరూపము వ్రాయుటవలనఁ, జెప్పుటవలన, విచారముచేయుట వలన ననుభవమునకు రాదు. ఏలనఁగా — దేని నుద్దేశించి బాణము విడువఁబడునో, యది భావాతీతము, నిరంజనము. ఇట్టి యభ్యాసమే మహావ్రతము. అదే స్థిరసిద్ధాన్తము. శ్రీకృష్ణుఁడీ యభ్యాస మహావ్రతముచేతనే సిద్ధి గలుగునని పార్థున కుపదేశించెను. ఇదే చరమానుష్ఠానము. దీనితరువాత మఱెట్టి వ్రతములు అనుష్ఠానములు నుండవు. అదే ముక్తిహేతువు.

(ఈ సాధనమందు దేశ జాత్యాయురాదుల విచారముండదు, గనుక యోగశాస్త్రము దీనిని "సార్వభౌమ మహావ్రత" మన్నది.)

అమ్మా! ముక్తిహేతుభూతవును, అచింత్యమహావ్రత స్వరూపవును నీవే. నీ మఱియొక పేరు "విద్యా". "యయా తదక్షర మధిగమ్యతే సా విద్యా" దేనిచేత అక్షర — పరమాత్మ స్వరూపము పొందఁబడునో, యదే విద్య. సర్వకర్మములును, అనుష్ఠానములును గౌణభావముచేఁ బరమాత్మ నొందుటకైన హేతువులే. కావున వానిని అవిద్యా — విద్యయొక్క స్వల్ప ప్రకాశము లనిరి. కాని, యీ యభ్యాసమనెడి మహావ్రతము సాక్షాన్ముక్తిహేతువగుటచే నిది 'పరమాత్మికా విద్యా' యనఁబడును. ఓ దేవీ! మాయమ్మా! నీవే భగవతీ (భగవచ్ఛక్తి) స్వరూప పరమాత్మవిద్యారూపముతో నిన్ను వెలయించుకొని, జీవుని యజ్ఞానకల్పిత బంధనభయమునుఁ బూర్తిగాఁ దొలఁగింతువు — అమ్మా! విద్యవు నీవే; అవిద్యవు నీవే; బంధనము నీవే; ముక్తివి నీవే; మఱి బంధనముక్తుల కతీతవు నీవే.

అమ్మా! ఇంకెన్నాళ్లకీ దీనసంతానము హృదయము నందు, ఈ భగవతీ విద్యాస్వరూపముతో నావిర్భవించి యజ్ఞానాంధకారమును దొలఁగింతువో! అమ్మా! ఇంకెన్నాళ్లకు నీవు విద్యామూర్తితో మమ్ము నీ యొడికిఁ దీసికొని నిరంతర జ్ఞానామృతధారలను ద్రాగింతువో! ఇంకను మేమెంతకాలము నీ యవిద్యామూర్తియొడిలోఁ గూర్చుండియే, నిన్నుఁ గానక, విషయములవంకనే చూచుచుందుమో! మేము నీ యవిద్యామూర్తియొడిలోనే యున్నాము. మా యింద్రియములు సంయతములు కావు; కనుక నీయీ మహావ్రతస్వరూపమూర్తి మాకింతయు నాభాసింపకున్నది. అమ్మా! ఇంకెన్నాళ్లకు మా జాలి పిలుపు నీ చెవులఁ దాకునో? అమ్మా!

ఓం. శబ్దాత్మికా సువిమల ర్గ్యజుషాం నిధాన
ముద్గీథ రమ్యపదపాఠవతాం చ సామ్నామ్ ।
దేవీ త్రయీ భగవతీ భవ భావనాయ
వార్తా చ సర్వజగతాం పరమార్తిహంత్రీ॥ ఓం. 9

అమ్మా! నీవు శబ్దరూపవు. కనుక నీవే యత్యంత నిర్మలమైన ఋగ్యజుస్సులకును, ఉచ్చైస్స్వరముతో గానము చేయఁబడు రమణీయ పదపాఠముతోఁ గూడిన సామవేదమునకును నిధానమవు. ఈ సంసారస్థితికై నీవే భగవతీ త్రయీమూర్తితో విరాజిల్లుదువు. మఱి వార్తా – అనఁగా జీవికారూపముగాను నీవే సర్వజగత్తుల యార్తిని బోఁగొట్టుదువు. కనుక నీవు పరమవు. శ్రేష్ఠవు.

వ్యాఖ్య:— అమ్మా! దేవతలు నిన్ను స్తుతించుటకు మున్ను, ముక్తిహేతుభూతమైన పరా విద్యా రూపముతో నిన్ను దర్శించిరి. ఇపుడు, ఆ పరావిద్యకు సాధనభూతమైన యపరావిద్యయు నీవే - అనఁగా ఋగాది వేదవిద్యారూపము తోను, నీవే వెలయుదువని ప్రకటించువారై ముందుగా "శబ్దాత్మికా" యనిరి. అమ్మా! పరా పశ్యన్తీ మధ్యమా వైఖరీ రూపముతో నీవే ప్రతి జీవునియందు వెలయుచున్నావు. ప్రణవమే ఆదిమవాణి - అనఁగా మూలనాదము. విభిన్న దేశ కాల పాత్ర సంయోగముచే, ఆయొక్క నాదమే విభిన్న రూపములతో వినఁబడుచున్నది. వేదములు ఆ ప్రణవము యొక్క విశేష విశేషములను వెల్లడించునవియే; జైమిని మహర్షియు - వేని యర్థబోధము సులభముగా నగునో, యట్టి పదవ్యవస్థగలది ఋక్ అనియు, సంగీతరూపముతో రమణీయ స్వరతాన సహితమై యుచ్చైఃస్వరముతో గానము చేయఁబడు దాని పేరు ఉద్గీథ సామమనియుఁ జెప్పి, ఇంక మిగిలినది - గానము గాని, పదవ్యవస్థగాని లేనివి - అనఁగాఁ దఱచుగా గద్యము వలెనే యుచ్చరింపఁబడునది యజుస్సనియు, వేదముల నిట్లు నిర్వచించెను. అమ్మా! ఈ త్రయి నీ మూర్తియే. అథర్వణ వేదమును, శిక్షాకల్ప వ్యాకరణాదులు, వేదాంగములును, ఆ త్రయికి అంతర్గతములే. వేదము త్రిగుణాత్మకముగనుక దాని పేరు త్రయి. జ్ఞాన భక్తి కర్మములనెడి మూటిని వెల్లడించునది యగుటచే, అపరా విద్యను 'త్రయి' యనిరి. భగవంతుఁడును "త్రైగుణ్య విషయా వేదాః" అనెను. ఉపనిషద్ - అనఁగా వేదాన్తములందు, గుణాతీత స్వరూపము నుపదేశమున్నను,

అవి 'త్రయి'యం దంతర్గతములే. ఏలన బ్రహ్మవిద్యోపదేశము, ఆత్మమహాత్మ్య వర్ణనము, ఆత్మస్వరూప నిర్ణయము నుండు నంత కవి, యీ నిర్గుణమున కంతర్గతములే.

అది యుండనీ – "భవ భావనాయ" అనఁగా లోకస్థితి కొఱకే, అమ్మా! నీ యీ త్రయీమూర్తి వికాసము. జీవులు, ఉన్మార్గగాములు కాకుండుటకే, కట్టుబాటు లేక ప్రవర్తించి, హద్దు మీఱకుండుటకే నీవు శాస్త్రోపదేశ రూపమునను, వేదవిధి రూపమునను త్రయీమూర్తితో విరా జిల్లుదువు. అమ్మా! నీ మహిమ మచింతనీయము. నీ యీ త్రయీమూర్తియు భగవతియే. అనంతైశ్వర్యమయి. కేవల శాస్త్రోపదేశ రూపముతో, సర్వబ్రహ్మాండముల గతిని నియ మింపఁగల యీశ్వరశక్తిని భగవతి యనక మఱేమనవలయును?

మఱి, యాధ్యాత్మికదృష్టితోఁ జూతము — ఏదేనొక మంత్రము (శబ్దము) సహాయముతో, ఆత్మానుభూతి నొందు చున్నంతదాఁక దాని పేరు ఋక్కు. శ్రుతియు "వాగేవ ఋక్" అన్నది. క్రమముగా నా యనుభూతి కొంత విశేషభావముతోఁ బ్రకాశించునపుడు, సర్వశరీరవ్యాపియైన యొక యానంద మయ బోధము రేగి సాగుచుండును. అపుడు, ఆ ఋక్కే యజూరూపమునఁ బరిణమించును. ఆ యవస్థయందు మఱి మంత్రాదికము ఛందోబద్ధముగా నుచ్చరించుట కాదు. అనఁగా ఛందస్సు మున్నగు వానియెడ విశేషలక్ష్య ముండదు; స్వర హీనములు తానహీనములు నగు నేవో శబ్దము లుచ్చరింపఁ బడుచుండును. ఆ యవస్థ పేరు యజుస్సు. క్రమముగా భావ రాజ్యమం దధికారము గలుగును. ఉచ్ఛ్వాసము తగ్గిపోవును.

ప్రశాంతభావముతో ననుభూతి వెలయుచుండును. అపుడు మెల్లగా శాంతముగా స్వరతాన సహాయముతో శబ్దము లుచ్చరింపఁబడును. దీని పేరే సామము. ఒక్కింత ధీరముగా లక్షింపఁబడినపుడు, ప్రతిదినము చేయు నుపాసనయందును నిట్టి త్రయీమూర్తి వికాసము కానఁబడును. కీర్తనాదిక మందును బలుతావుల నీ త్రయీమూర్తి వికాసము కానఁబడును. కేవల కీర్తన మనుటేల? సర్వదేశములందును, సర్వ సంప్రదాయముల యుపాసనమందును నాదమయ మహాశక్తి యొక్క యీ త్రయీమూర్తివికాసము చక్షుష్మంతులైనవారికి (దివ్యదృష్టివికాసము గలవారికి) దెలియఁబడుచుండును.

ఋగ్యజుస్సామము లను నివి వేదములు. వేదము— అనుభూతి పేరే వేదము. లోపల నైన యాత్మానుభూతి శబ్దాకారమున వెలిని వెలయునపుడే దానిని వేదమందురు. అది సత్య స్వరూపాత్మ సంవేదనముతో వచ్చునపుడు దాని పేరే వేదము. అది కొందఱు మనుష్యుల మస్తిష్కధర్మమువలనఁ బుట్టిన కొన్ని శబ్దముల విన్యాసముకాదు. ఈ సత్యానుభూతులు, భ్రాంతిలేని వేదనమువలన నావిర్భవించినవి. కనుకనే వేదము లపౌరుషేయము లనిరి. ఇది కొలఁదియో గొప్పయో సర్వదేశ ములందు నున్నది.

అమ్మా! త్రయీమూర్తితోనే - శాస్త్ర విధాన రూపముతోనే, జ్ఞాన విజ్ఞాన రూపముతోనే, యీ సంసార విధానము నిల్పుచున్నావా? — అది కాదు, సరికదా, వార్తా రూపముతోను జగత్తుల యార్తిని - సర్వ దుఃఖములను దొలఁగించుచున్నావు. వార్తా - జీవికా (బ్రతుకు నుపాయము -

అనఁగా స్థూలదేహ రక్షణమున కగు వెరవు) రూపముతో, ఆహార రూపముతో సర్వదేశములందును సర్వజీవులయందును సర్వకాలములందును నీవు వెలయుచున్నావు. అమ్మా! నీవే మా వార్తవు, నీవే మా జీవికవ నెడి సత్యజ్ఞానమునుండి జాఱిపోయిన కారణముననే, మాకీ బ్రతుకు గడవని సంకట కాలము వచ్చి పడినది. భారతదేశవాసులు, బ్రతు కెట్లు నెఱవేఱునవెడి చింతతో వ్యాకులం పడుచున్నారు. అమ్మా! తమ జీవికారూపముతోను నీ యవ్యయమూర్తిని దర్శించు వారికి, ఎన్నఁడును జీవికాకష్టము (లేమి) కలుగదు. ఈ మాట యీ దేశవాసులు మర్మమర్మముఁలం దెప్పు డనుభవింతురో! ఈ దేశవాసులు జీవికకై కల్లలాడుట, మోసగించుట, లంచ ములు మేయుట, పరుల పాదములు ముద్దాడుట మున్నగు నీచకర్మములు మాని, జీవికారూపిణివైన నిన్ను అమ్మగా నెఱిఁగి యెపుడాదరింతురో! అన్న చింత యెపుడు తొలఁగునో!

మహాభారతమందు వార్తాపదమున కర్థము మఱియొక విధముగాఁ గానవచ్చుచున్నది. ఒకనాఁడు ధర్ముఁడు మాఱు వేషముతో వచ్చి, మహారాజ యుధిష్ఠిరునితో "వార్త యేమి?" అని ప్రశ్నించెను. దానికి బదులుగా నతఁడు—

"మాసర్తు దర్వీ పరివర్తనేన
సూర్యాగ్నినా రాత్రి దివేంధనేన।
తస్మిన్మహామోహమయే కటాహే
భూతాని కాలః పచతీతి వార్తా॥"

"మాసములు, ఋతువులు – అనఁగా – కాలమందుఁ గల్పింపఁబడిన పరిచ్ఛేదము నెడి – తెడ్డుత్రిప్పుచు, సూర్యుఁడ నెడి యగ్నిసంయోగముచే, రేవగళ్ళ నెడి కట్టెల సాయముతో, ఈ మహామోహమయ సంసారమ నెడి బానలియందు, భూతము లను కాలుఁడు స్వయముగా వండుచున్నాఁడు. ఇదే వార్త" యనెను. అమ్మా! నీవు కాలరూపముతో నీ భూతములను సదా పాకము చేయుచున్నావు. జన్మ స్థితి లయములు — (జాయతే, అస్తి, వర్థతే) మున్నగు షడ్భావవికారపరిణామముల యాకారమునఁ బ్రతిజీవునియందు నీవే వార్తగా వెలయు చున్నావు. జీవిక (మనుగడ) యీ షడ్భావవికారములలో నిమిడి యున్నదే. అమ్మా! సదా వెలయు నీయీ వార్తామూర్తి యెడ లక్ష్యముంచి భక్తితోఁ బూదోయిలి నర్పించువారు, సదా పరివర్తనశీలమైన నీయీ మూర్తి యెడ నెన్నఁడును ముగ్ధులు కారు. మఱి వారికి జీవికకైన యెట్టిచింతయు నుండదు. అపుడు నీవు స్వయముగా వారి యోగక్షేమములను వహించు స్నేహ మయ మాతృమూర్తితోనే వెలయుచు వారిని నీ యొడియం దుంచుకొని కూరుచుందువు. అపుడు వారి దృష్టి ముఖ్యముగాఁ బరమస్నేహమయమైన నీ యా యఖండసత్త్వపైనే తగిలియుం డును. కనుకఁ దప్పక కాఁదగిన పరివర్తనము లెల్ల వారికి దెలియ కయే వారిపైనుండి కడచిపోవును.

అమ్మా! ధన్యము నీ నైపుణ్యము. మేము సంసారస్థితినే పరమ పురుషార్థముగాఁ దలంచుచుండునంతదాఁక, నీ యా యస్మదీయ స్వరూపమును గుప్తముగానే యుంచి, మాయెడ వార్తారూపముతోనే వెలయుదువు. అంతదాఁక మేమును జీవిక

కొఱకు విషయముల గుమ్మముకడఁ భిక్షుకులవలెఁ బడియుం దుము. మఱల నీ సంసారస్థితినే యథార్థముగాఁ గష్టకరమని తలంచినపుడు, వార్తారూపముగానైతము నీవు తప్ప మఱేమి యుం గాదని యనుభవమునకు వచ్చును. అపుడే మా జీవికా విషయమైన చింత పూర్తిగాఁ దొలఁగిపోవును. అపుడు మఱల నీవే సర్వనాశినీమూర్తితో నావిర్భవించి, మా సర్వభావము లను నశింపఁజేసి, ఏకమును అద్వితీయము నైన మూర్తితో, ఆర్తిహరస్వరూపముతో వెలయుదువు. అమ్మా! అపుడే నీ 'పరమా' నామము సార్థకమగును. నీవు యథార్థముగా శ్రేష్ఠవే. నీవు నిజముగా సర్వశ్రేష్ఠులైన బ్రహ్మాదులకును దల్లివే యని యపుడే తెలియఁగలము. అమ్మా! నీవీ విధమైన యార్తిహంత్రీమూర్తితో నిలువనంతదాఁక, మేమెట్టి యుపా యముతోను ఆర్తిపట్టువలన విడివడఁజాలము. కనుక, అమ్మా! దీనులమై యడిగికొనుచున్నాము. ఒక్కసారి దుఃఖహంత్రీ మూర్తితో నీ బిడ్డలహృదయమందు ఆవిర్భవింపుము. దుఃఖ ముతో నుడికిపోవుచున్న యీ గుండెలు చల్లబడును. అమ్మా! నీవు తల్లివి; ఆర్తిహంత్రివి; పరమవు; నీవు పరమార్తిహంత్రివి. పరమదుఃఖనాశినివి.

ఓం. మేధాసి దేవి విదితాఖిల శాస్త్రసారా
దుర్గాసి దుర్గ భవసాగర నౌరసంగా।
శ్రీః కైటభారి హృదయైకకృతాధివాసా
గౌరీ త్వమేవ శశిమౌళి కృతప్రతిష్ఠా॥ ఓం. 10

ఓ దేవీ! సర్వశాస్త్రార్థములను ధరించు మేధవు నీవు. నీవు దుర్గవు; నీవే దుస్తర భవసాగరము దాటించు, అసంగ నౌకవు. కైటభారి (విష్ణుని) హృదయమందు నివసించు లక్ష్మివి. నీవే చంద్రశేఖరుని (శివుని) యంకమందు విహరించు గౌరివి.

వ్యాఖ్య:— నీవే వేదరూపిణివని చెప్పితిమి. ఇపుడు వేదార్థమును ధరించు ధీ - మేధగాను నీవే యనుచున్నాము. నీవే మేధారూపిణివై సర్వశాస్త్రార్థజ్ఞానమును ధరించియుంటువు. కనుక నేదో యొకనాఁడు మేము నిన్నుఁ దప్పక తెలియఁగల్గుదుమని యాశ. మే మేమేమి నేర్చికొంటిమో, యింద్రియసహాయముతో నేమేమి గ్రహించితిమో, యది యంతయు నొక్కొక్క మృత్యువుతో నే. మఱచిపోవుచున్నచో మఱి యీమా బంధన మేనాఁటికిం దొలఁగదు కాని, అమ్మా! నీవు మేధారూపమున, ఆమా బిందుబిందుజ్ఞానమును ధరించి యుంచుచున్నావు. కనుకఁ బ్రతిజన్మమందును మా జ్ఞానముకూడ నధికమగుచున్నది. ఒక జీవనమందు మేము కూడఁబెట్టుకొన్న జ్ఞానమునే మఱల రాఁబోవుజన్మమందుఁ గూడఁబెట్టుకొను నక్కఱ యుండదు. ఏ శక్తిప్రభావముచే మా పలుపుట్టువులం దార్జించిన జ్ఞానము ప్రోగగుచున్నదో అదే మేధ.

ఈ మేధవల్ల నగు చరమావస్థ - మేధాశ్రేష్ఠ స్వరూపమే - "అహం బ్రహ్మాస్మి" 'నేను బ్రహ్మమను' అనెడి స్మృతియే. ఆచార్యశంకరులును "బ్రహ్మాహమస్మీతి స్మృతి రేవ మేధా" యనిరి. ఏనాఁడు నీ వీ మేధాస్వరూపముతో మా హృదయమునందు వికసింతువో, యపుడు మేము "నేను బ్రహ్మమను" అనెడి స్మృతి గలిగి, జీవత్వమనెడి దృఢబంధనమును ద్రెంచి

పాఱవైచి, యాత్మస్వరూపమందుఁ బ్రతిష్ఠితుల మగుదుము. నీవు మేధారూపముతో నిన్ను వెలయించుకొనునప్పుడే, మేము నిన్నెఱుంగఁగలము; మమ్ము మేమెఱుంగఁగలము. ఇదే యఖిల శాస్త్ర సారము. శాస్త్రసార మర్మము. ఆత్మస్వరూపజ్ఞానమే. "నేనెవరు ?" అనుదాని నెఱుంగఁగల్గునపుడే, సర్వశాస్త్రముల యావశ్యకత తొలఁగిపోవును. అమ్మా ! అదే నీ "విదితా" స్వరూపము – జీవుఁడు తన స్వరూపము నెఱుంగఁగల్గునపుడే, నీవు 'విదితా'మూర్తితో నావిర్భవింతువు. నీ యీ విదితా స్వరూపము లక్ష్యము చేసియే సర్వశాస్త్రార్థ రహస్యములు వ్యాఖ్యానింపఁబడినవి. ఆపాతదృష్టిచే (పయి పయి చూపుచే) శాస్త్రవాక్యములం దొండొంటికి విరోధము ప్రతీతమగును. గాని, అమ్మా ! నీవు విదితాస్వరూపముతో జీవుని హృదయ మందు వెలయునపుడు, మఱి శాస్త్రవాక్యములకుఁ బరస్పర విరోధ మింతయు నుండదు. ఆ యొక్క విషయమునే సర్వ శాస్త్రములు ప్రతిధ్వనించుచున్నవని స్పష్టముగాఁ దెలియ వచ్చును.

మహాభారతమందు — "వేదా విభిన్నాః స్మృతయో విభిన్నా । నాసౌ మునిర్యస్య మతం న భిన్నమ్ । ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం । మహాజనో యేన గతః సపంథాః॥" అని చెప్పఁబడియున్న యీశ్లోకము, శాస్త్రభేద మతభేద పక్షమునఁ బరిపోషకప్రమాణముగాఁ జేకొనఁబడుచున్నను, దానిని మే మర్థము చేసికొన్నవిధము నిచట వ్రాయుట అప్రాసంగికము కాదు. ఈ శ్లోకపు రెండవపాదము మొదటనున్న 'న' అను దానిని మొదటిపాదముతో సమన్వయించుకొన్నచో, దానికి

మఱియొక యర్థమగును. ఎటులనఁగా — "వేదములు విభిన్నములు కావు; స్మృతులు విభిన్నములు కావు; అనఁగా నన్నియు నొక్కయర్థమును లక్షించి యభివ్యక్తములైనవే. ఎవ్వరి మతములు విభిన్నములు కావో, వారే యథార్థమైన మునులు." "మంతారో వేదతత్త్వార్థం గంతారో మునయః" అనఁగా భేదధర్మలు కానివారే మునిపదవాచ్యులు. ధర్మముయొక్క తత్త్వము గుహాయందు - హృదయమం దుంచఁబడినది. (ఉపనిషత్తులయందుఁ బలుతావుల గుహాశబ్దముచే హృదయమే లక్షింపఁబడుట యెల్లరు నెఱుఁగుదురు.) మహాజనులు - సాధు మహాపురుషులు, ఏదారిని బోయిరో, ఏ హృదయగుహామార్గమునఁ బోయి యాత్మజ్ఞానము నొందిరో "సపంథాః" అదియే యథార్థమార్గము. ఈమార్గమునఁ బోఁగల్గినపుడే ధర్మతత్త్వము తెలియును.

అది యుండనీ; దేవత లింకేమనిరి? నీ యా 'విదితా' స్వరూపమే సర్వశాస్త్రసారము. నిన్నెఱుంగుటకే సర్వశాస్త్రములు నవతరించినవి. కాని, అమ్మా! నీవు దయచేసి స్వయముగా 'విదితా' రూపముతో వెలయునంతదాఁక, నెట్టి శాస్త్రమును నిన్నుఁ దెలియఁజెప్పఁజాలదు. మఱి నీవు 'విదితా' యైనపుడు, బియ్యము కావలసినవానికి, ఊఁకతోఁ బ్రయోజనము లేనటులు, సాధకునకు శాస్త్రముల యక్కఱయే యుండదు. అమ్మా! నీవా 'విదితా' స్వరూపముతో, బోధస్వరూపముతోనే, సర్వదా ప్రకాశమాన వగుచున్నను, నెవ్వఁడును నిన్ను వేగముగా వెంటనే తెలిసికొనఁజాలఁడు. కనుకనే నీవు దుర్గవు - దుర్జ్ఞేయవు. దురధిగమ్యవు.

మఱియొకవైపు చూచిన - నీవు మేధారూపముతో మా యనేక జన్మసంచిత జ్ఞానరాశిని ధరించి యుంచఁగల్గుట చేతనే, యీ దుస్తర భవసాగరమందు నీవే తరణి (నావ) వగు చున్నావు. జీవులు మేధ యనెడి పడవ నెక్కి "బ్రహ్మాహమస్మి" యని తెలిసికొని (అనుకొంచు) ననాయాసముగా నీ దుర్గమ భవసాగర పారముం జేసుకొందురు. పార్థివములైన (పృథివియందు నిర్మింపఁబడు) పడవలకుఁ గర్ణధారుఁడు (చుక్కాణి పట్టి నడుపువాఁడు) తప్పక యుండవలయును. కర్ణధారుఁడు లేకున్న నీ జాగతికములైన పడవలు పోఁజాలవు. గాని, అమ్మా! నీవు మా 'అసంగతరణివి'; వేఱొకరి సాయ మక్కఱలేదు. నావవు నీవే; నావ నడుపుదానవు నీవే; మేధారూపిణివి, మా యమ్మవు, నిజముగా నీవు అసంగవు, సంగరహితవు; నిర్లిప్తవు; నీవు మా బింబబింబ జ్ఞానరాశిని మేధారూపమున ధరించియుంచినను, మఱి యీ పరిచ్ఛిన్న మలిన జ్ఞానరాశి ననాదికాలమునుండియు ధరించి యుంచినను, మంచి చెడ్డ సంస్కారములెల్ల మేధారూపిణివైన నీ యంగమందు అంటుకొనియున్నను, వాని సంస్పర్శమున నీవు పరిచ్ఛిన్నవును మలినవును గావు. మా యమ్మవు నీవు, నిత్య బుద్ధ ముక్త స్వరూపవుగా నెటులుంటివో యటులే యుందువు. ఇన్ని బహుభావములను గుండెపైఁ దాల్చియు నిన్ను బహుత్వలేప మింతయు నంటదు. కావుననే దేవతలు నిన్ను "దుర్గ భవసాగర నౌ రసంగా" యని స్తుతించిరి.

అమ్మా! నీవు కైటభారి (బహుత్వవినాశకారి) విష్ణుని హృదయమందు విహరించు శ్రీవి. మఱియు శశిమౌళి - చంద్ర

శేఖరుఁడైన - మహేశ్వరుని యర్థాంగమువైన గౌరివి. విష్ణుత్వమును శివత్వమును నీ విభిన్నప్రకాశములే, కావున, ఒక వైపు నీవు హరిహరాదులను గన్న దానవయ్యు, నొకవైపు వైష్ణవీ శివానీ రూపములతో నీవే వెలయుచున్నావు. ఈ జగద్భావము, ఈ బహుత్వము, ఈ మా జీవత్వము ననెడి వీని నే శక్తి, యే మేధ ధరించియుంచుచున్నదో యదియే వైష్ణవీ శక్తి (శ్రీ). మఱియు నీ శక్తియే, ఈ మేధయే, 'అసంగా' రూపముతోఁ దాను వెలయునపుడు - మఱి యట్టి భావములను ధరించు రూపముతో వెలయనపుడే, సర్వభావములను సంహరించు రూపముతోఁ బరిచితయగును గనుకనే, అమ్మా! నీ 'మేధా, విదితా' స్వరూపములే మాయెదుట "(శ్రీ), గౌరీ" రూపములతోఁ బ్రకటములగును.

ఓం. ఈషత్సహాస మమలం పరిపూర్ణచంద్ర
బింబానుకారి కనకోత్తమ కాంతికాంతమ్ ।
అత్యద్భుతం ప్రహృతమాత్తరుషా తథాపి
వక్త్రం విలోక్య సహసా మహిషాసురేణ॥ ఓం. 11

అమ్మా! చిర్నగవుతోఁ గూడినట్టియు, నిర్మల పూర్ణ చంద్రునిఁ బోలినట్టియు, మేలిమి బంగారువన్నెచే మనోహర మైనట్టియు, నీ మొగమును జూచియు మహిషాసురుఁడు కోప వశుఁడై నిన్నుఁ బ్రహరించెనఁట. ఎంతో వింత.

వ్యాఖ్య:— ఏమె (శ్రీ)ముఖమండలకాంతిచే ముల్లో కములును ముగ్ధములగునో, యామె లోకాతీతసౌందర్యము

ప్రత్యక్షమైనను, రజోగుణముయొక్క బహిర్ముఖ చాంచల్యము మిగుల నకించిత్కరమైన రూపరసాదికమును బరిగ్రహించు వాసన మిగిలియుండుటను నదే గొప్పవింత. అమ్మా! "యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః" దేని నొందినపై మఱి యెట్టి వస్తువు నొందుటకును నిచ్ఛ పొడమదో, దానిని బ్రత్యక్షము చేసికొని చిత్తము మళ్లి, యేవిధముగా విషయ లోలుపమగునో యది సరిగా విచారమున కందకున్న, వాస్తముగ నిది కడు వింతకాదా !

అమ్మా! జాగతికమైన చక్కదనమంతయు నొక్క చోటఁ జేరినను నీ యీ లోకాతీత సౌందర్యసింధువునందలి బిందువున కైనను సాటికాదు. అయినను మేము దానివైపు చూడక జాగతికదుఃఖములతోఁ గూడిన విషయముల చక్కఁ దనముచేతనే యాకర్షింపఁబడుచున్నారము. నీయీ యలౌకిక శోభమాటయే మఱచితిమి. క్షణస్థాయియు, అకించిత్కరము నైన సౌందర్యము ననుభవించు లాలస, నీ యుత్కృష్టశోభను గప్పివేసినది. ఇంతకంటె నధికాశ్చర్యవిషయ మేమున్నదమ్మా!

సాధకా! ఆత్మస్వరూప మప్పుడప్పుడు, అనుభవయోగ్య మైనను రజఃక్రియాశీలత రవ్వంతయు నణఁగకున్నది. కావున మాటిమాటికి నా సాటిలేని శోభామయ పరమాత్మ స్వరూ పమును గప్పిపుచ్చి విషయచాంచల్యమే చెలరేగుచున్నది. ఇదే, అమ్మవారి సాటిలేని చక్కఁదనమును జూచియు, మహిషా సురుఁడు, అమ్మపై నస్త్రప్రహారము చేయుట. కదలుచున్న నీట నగు చంద్ర ప్రతిబింబము స్పష్టముగాఁ గానరానట్టులే, వాయువేగమున నడుచు నీలిమబ్బులచాటునఁ బడిన సూర్య

బింబము స్పష్టముగాఁ గానరానటులే, రజోగుణ చాంచల్యముచే నగు చిత్తచాంచల్యము, అమ్మయొక్క యీ సాటిలేని చక్కఁదనము ననుభవించువేళ విఘ్నస్వరూపమగుచున్నది. ఈ విఘ్నముపేరే మహిషాసురుని ప్రహారము.

అమ్మా! ఏ విషయ సౌందర్యము నెడ ముగ్ధులమై మేము నీ లోకాతీతసౌందర్యము నుపేక్షించుచున్నామో, ఆ విషయశోభగాను నిత్యము నీవే వెలయుదువనెడి మాట, మేమెన్నాళ్లకు మర్మమర్మములందు ననుభవింపఁగల్గుదుము? అమ్మా! ఈ జగత్తునందలి సర్వమును నీ సౌందర్యముచేతనే కప్పఁబడినది. నీ రూపమే ప్రత్యేకపదార్థముయొక్క ప్రత్యవయవమందును వెలయుచున్నదనెడి సత్యజ్ఞానముతో, ఈ సరళానుభవము మామనస్సున నిండిపోకున్నంతదాఁక, అమ్మా! యథార్థముగా, నీ యీ సాటిలేని చక్కఁదనపుజాడఁ గానఁ గలమా?

ఓం. దృష్ట్వా తు దేవి కుపితం భ్రుకుటీకరాళ
ముద్యచ్ఛశాంక సదృశచ్ఛవి యన్నసద్యః ।
ప్రాణాన్ముమోచ మహిష స్తదతీవ చిత్రం
కైర్జీవ్యతే హి కుపితాంతకదర్శనేన॥ ఓం. 12

ఓ దేవీ! కోపించినట్టియు, బొమముడిచే భయంకరమయ్యు ఉదయచంద్రునిఁబోలిన కాంతి గలట్టియు, నీ ముఖమండలమును జూచి, యీ మహిషాసురుఁడు వెంటనే ప్రాణములను విడువకుండుట వింతయే. కోపించిన యమరాజును జూచి యెవఁడు బ్రతికియుండఁగలఁడు?

వ్యాఖ్య:— అమ్మా! భామముడితోఁ గోపించి యెట్టి దైన నీ ముఖచ్ఛవిని జూచియు మహిషాసురుఁడు చావకుండు టే వింత. నీ కోపము వెల్లడియగునపుడు - నీవు ప్రలయంకరీ మూర్తితో నిల్చినపుడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరుల వలెఁ గనఁబడవు. అప్పుడీ మహిషాసురుఁ డతితుచ్ఛుఁడు; వీఁడెంత ? అమ్మా! దేవతలు నీ భ్రుకుటీకరాళముఖమండలమును వర్ణించునపుడు - "ఉద్యచ్ఛశాంక సదృశచ్ఛవి" యనిరి. పూర్ణచంద్రుఁడుదయించునపుడు చీకటి యదృశ్యమైపోవునటులే, నీ ప్రలయకరాళముఖచ్ఛవిని గాంచి యజ్ఞానాంధకారమును, ద్వైతభావమును బొత్తిగా లయించిపోవును. ఇది యబాధిత నియమము. కాని, మేమీ క్షేత్రమునుగూర్చి వానికి విపరీతముగాఁ దలంచుచున్నాము. మహిషాసురుఁడు ని కరాళముఖచ్ఛవిని గాంచియు బ్రతికి నీతో యుద్ధముచేసి, సింహము, ఏనుఁగు అర్ధనిష్క్రాన్త పురుషుఁడు (సగము వెలికివచ్చిన పురుషుఁడు) మున్నగు రూపములతో నిన్నాక్రమింపఁజూచెను. ఇది మిగుల వింత. ఎందుచేత నిటులయ్యెను ?

అమ్మా! నీవు అంబికామూర్తితోఁ గోపము చూపితివి. "కోపం చకార తతోఽంబికా" అంబికామూర్తి - మాతృమూర్తి. అమ్మ భ్రుకుటీభీషణముఖము సంతానమును బెదరింపఁగలదు గాని, వినష్టము చేయఁజాలదు. అది చూచి వారు పాఱిపోరు. అమ్మా! నీవు మధుపానముచేయుటకై యని, మహిషాసురుఁడు గర్జించుట కవకాశమిచ్చితివి. కనుక వాఁడు వెంటనే చావలేదు. యుద్ధముచేసి చచ్చెను. అమ్మా! మేము దేనిని కేవల మసంభవమనుకొందుమో, అది యఘటనఘటనపటీయసియైన నీయిచ్ఛచే

సులభముగా సంఘటితమై పోవుచుండును. ఇది మేము కొంచెము విచారించినపుడు ప్రతిదిన జీవనమందే కానవచ్చును. అయినను నీ సర్వశక్తిమత్తను, నీసర్వమయాఖండకర్తృత్వమును బూర్తిగా విశ్వసించి, ఆత్మసమర్పణము చేయఁజాలకున్నాము. అహం కర్తృత్వముచే నైన మిథ్యాభిమానమును నీ చరణములం దర్పించి చింతాభారమును దించుకొనలేకున్నాము. ఇదే మా దుర్భాగ్యము.

అమ్మా! మహిషాసురవధకార్యమందు నీ యీ స్వాభావిక నియమమునకంటె నన్యథా చూచి, దేవతలు "కైర్జీవ్యతే హి కుపితాంతకదర్శనేన" "కోపించిన యమరాజును జూచియు నెవఁడు జీవించియుండఁగలఁడు ?" అనిరి. అమ్మా! నిజముగాఁ గుపితయముని దృష్టిని బడినవాఁ డెవ్వఁడును బ్రతుకఁజాలఁడు; గాని కోపించిన యమ్మను జూచిన సంతానము బ్రతుకదా ? నీవే యంతకారిణీరూపముతో వెలయునంతదాఁక, నీ భ్రుకుటీకరాళకుపితముఖమండలమునుండి సైతము మాతృత్వగౌరవముతోను స్నేహముతోను నిండిన కరుణదృష్టియే పరఁగుచుండును. ఉదయచంద్రుని బోలు ముఖకాంతియే వికసించుచుండును; కావుననే మహిషాసురుఁడు వెంటనే మృత్యువుపాలుగాక యుద్ధముచేసి నీకు మధుపానసుయోగమును గూర్చెను. అమ్మా! నీ యనిర్వచనీయలీల ధన్యము. నీవు మానోర, అమ్మా! యను మాట వినఁగోరినపుడెల్ల, విని నిజముగా నీ హృదయము మాతృత్వగౌరవముతో నుబ్బిపోవుచుండును. అపుడు మా దుఃఖ దీనహృదయములుకూడఁ బుత్రత్వగౌరవముతో నుబ్బి

పోవుచుండును. అమ్మా! మే మీ గౌరవము ననుభవించు భాగ్యము నిమ్మా.

ఓం. దేవి ప్రసీద పరమా భవతీ భవాయ
సద్యో వినాశయసి కోపవతీ కులాని।
విజ్ఞాత మేతదధునైవ యదస్త మేత
న్నీతం బలం సువిపులం మహిషాసురస్య॥ ఓం. 13

దేవీ! ప్రసన్నవగుము. నీవు శ్రేష్ఠవు. పూజనీయవు. నీ ప్రసన్నతనుబట్టియే మా శుభము లుండును. నీవు కోపింతు వేని, కులవినాశమే యగును. మహిషాసురుని యీ విపుల సేనలన్నియు నొక్కసారి విధ్వంస మొందుటచేతనే యీ మాట మాకుఁ దెలిసినది.

వ్యాఖ్య:— అమ్మా! నీవు పరమవు - శ్రేష్ఠవు. నీవు పరునకును - పరమేశ్వరునకును దల్లివి. బ్రహ్మ విష్ణు మహేశ్వరులను పరమేశ్వరు లందురు. వారును నీవల్లనే కలిగిరి. నీయందే యున్నారు. కావుననే నీవు పరమవు. నీవు ప్రసన్నవగునపుడే మేము మంగలముల నొందఁగల్గుదుము. అంతేకాదు, నీప్రసన్నతయు నీక్రోధము రెండును జీవులకుఁ బరమహితకరములు. నీవు ప్రసన్నవగుటచే జీవులు లౌకిక పారలౌకికములైన సర్వవిధ మంగళముల నొందుదురు. నీవు కోపింతువేని జీవుల కులములే వినాశ మొందును. ఇదియును జీవపక్షమునఁ బరమమంగళమే. కులము నశింపక, అకులముజాడ నెఱుంగలేఁడు. అమ్మా! ఎన్ని జన్మజన్మాంతరములనుండియో కుల కులములందు విచరించి రూపరసాది విషయములను భోగించియే యీ జీవుఁడు,

జీవన వ్యతీతుఁడగును; మే మేవిధముగాను గులమును విడువ లేకున్నాము. ఒక కులమును విడుచుచున్నాము. మఱియొక కులమును బట్టుకొనుచున్నాము. ఒకనాఁడా? రెన్నాళ్లా? ఏ యనాదికాలమునుండి కులమందు విచరించు టారంభమైనదో యెఱుంగము. అదెవరు చెప్పఁగలరు? అమ్మా! నీవు కోపించినచో, ఆ మా కులము ధ్వంసమైపోవును. అపుడు మేము, అకుల సముద్రమం దవగాహనము చేసి, మ మ్మకులమందుఁ జేర్చి వేయుదుము. ఈ దుఃఖమిలితమైన పరిచ్ఛిన్న సుఖము చేతినుండి యెన్నటికిం దప్పుకొందుము. మా కులవిచరణము మఱి కాదు. కనుకనే, అమ్మా! నీ ప్రసన్నతయుఁ గ్రోధమును మాకు మంగళ కరములే.

అమ్మా! నీ ప్రసన్నతనే కోరువారును, నీ నగుమోము సిరినే చూడఁగోరువారును, ఇంకను దల్లి యసలురూపమును గుర్తించినట్లు తోఁచదు. నీవు అమ్మవు. మేము నీ బిడ్డలము, అని తలంచువారు, నీ భ్రుకుటీ కరాళ కుటిలముఖ శోభను జూచియు రవ్వంత భయపడరు. అమ్మ సంతానము, అమ్మ కోపమందును అమ్మ ప్రసన్నతయందును నొక్క తీరుగానే, అమ్మ నెయ్యమునే దర్శించుచుందురు. అమ్మ నెయ్యము నెడ ముగ్ధులైనవారు, సాంసారికమైన లెక్కలేని విఘ్నములందును అమంగళములందును రవ్వంతయు నమంగళ చిహ్నమును గానరు. కనుక వారు భయ మెఱుఁగనివారివలె నగ్నశిశువుల వలె, నీ ప్రలయంకరమూర్తి యెదుర నిల్చి, గొం తెత్తి, అమ్మా! అమ్మా! యనుచునే నీ యొడిలో దూకి కూర్చుందురు.

ఇఁక, నిన్ను విడిచి, మాకు మఱియొక ప్రాపున్నదను కొనువారు, నీ కోపమయమూర్తిని గాంచి యడలిపోయి, నిన్ను విడిచిపెట్టి వేఱొక్క యాశ్రయమువైపు సాగుదురు. కాని నీవొక్కతెవే సర్వమున కాశ్రయమని తెలిసికొన్నప్పుడు, జనన మరణములు, హాస రోదనములు, సుఖ దుఃఖములు, కోప ప్రసన్నతలు మున్నగు సర్వావస్థలందును, నీ వొక్కతవే మా యేకాంతాశ్రయమని బోధపడినప్పుడు, మఱి నీ క్రోధ మయమూర్తిని గాంచి, శంకతోను భయముతోను వెనుకకుఁ దగ్గిపోవువా రెవరమ్మా! నీవు కోపింతువేని, యనేక కర్మ ఫలములు మేము భోగించుటగును. రోగము, శోకము, అవ మానము, అత్యాచారము, అభావము, ఉపద్రవము నాలుగు వైపుల ముట్టడించినను, వానియందు నీ స్నేహ కరుణామయ ముఖమే తలంపునకు వచ్చుచుండును. అపుడు, ఓ చండీ! ఒక్క గడియలో మా దుర్భాగ్యము దూరమైపోవును. మమ్ము మేము సౌభాగ్యవంతులనుగా నెంచుకొని ధన్యులమగుదుము.

అమ్మా! నీ వీ విధమైన కుపితమూర్తితోఁ బ్రతిజీవుని హృదయమందు నావిర్భవించి, మహిషాసురుని విశాలవాహినిని వినాశమొనర్పుము. ఇంద్రియగ్రాహ్యములై తుచ్ఛమైన రూప రసాది విషయముల నెడి కులముయొక్క మూలముఁ బెల్లగించి వేయుము. మేము విషయముల నెడి కులమును విడిచి, ఓ యకుల తరణీ! మా యమ్మా! రమ్ము; నీ స్నేహమయాంకమందుఁ జనవున నెగిరి దూకి కూర్చుందుము. నీ వొకనాఁడు, యమునా నది యొడ్డున కదంబవృక్షచ్ఛాయను నిల్చి, మోహనమురళీ ధ్వనితో గోపికలకులమును విడఁదీసి నీవంక కాకర్షించుకొని

కృష్ణనామమును సార్థము చేసితివి. మఱియొకసారి యటులే, యీ యుగసంధియొక్క మహాక్షణమందు స్వస్వరూపముతో నావిర్భవించి, నీ యీ మధుమయ సత్యమహాకర్షణ ధ్వనితో మా యజ్ఞానమును విడఁగొట్టుము. కులమును విడిపింపుము. మేమును అకులమందుఁ దేలియాడుదుము. అమ్మా! ఎన్నాళ్లనుండియో కులమందే యుండి పలు కెరటముల దెబ్బలు తిని యోర్చికొంటిమి. ఆ దెబ్బలతో గుండె గూడు విడిపోయినది. మర్మములు పట్టుతప్పినవి. అమ్మా! మఱి యోర్వలేము. ఇపుడింకొక్క యడుగైనను వేయఁజాలని నీ సంతానమునకు ఒక్కసారి నీ యకులస్నేహమయవక్షమందుఁ జోటిమ్మా.

ఓం. తే సమ్మతా జనపదేషు ధనాని తేషాం
తేషాం యశాంసి న చ సీదతి ధర్మవర్గః ।
ధన్యా స్తఏవ నిభృతాత్మజ భృత్యదారాః
యేషాం సదాభ్యుదయదా భవతీ ప్రసన్నా॥ ఓం. 14

అమ్మా! నీవు ప్రసన్నవై యభ్యుదయ మిచ్చువారికి జనపదములం దాదరము కలుగును. వారి ధనము, యశస్సు, ధర్మము చెడవు. వారి పుత్త్రి దార భృత్యు లడఁకువతో మెలఁగుదురు. కనుకనే వారు ధన్యులు.

వ్యాఖ్య:— అమ్మా! నీవు ప్రసన్నమూర్తితో నెవ్వరి నొడిని దాల్తువో, ఎవ్వరు నిన్ను నిత్యతృప్తగాను, నిత్యప్రసన్న జననిగాను నెంతురో, వారే యీ లోకమున దేవోచిత సమ్మానము నొందుదురు. వారే జాగతికములైన సుఖసమృద్ధి భోగై

శ్వర్య సమ్మానయశస్సులను లెక్కింపకున్నను, అమ్మా ! వారి యెడల నీ విట్టి యభ్యుదయదాయినీ మూర్తితోనే యావిర్భవించుచుందువు. సర్వమందు నిన్నుంజూచు నలవాటు లేనివారు, పార్థివాభ్యుదయరూపంగానే నిన్ను గౌరవింతురు. దీనిని నమ్మకమన్నింపనివారు, గాడవలయందుంబడి నీ క్రోధమయమూర్తినే కాంతురు. నీ సౌమ్యప్రసన్నమూర్తి యెట్టిదో వారెఱుంగంజాలరు. కనుక నే పార్థివాభ్యుదయము నొందియు, వారు యథార్థసుఖవంతులు కాంజాలరు.

మఱి సుఖదుఃఖములందును, అభ్యుదయాధఃపతనములందును, సర్వావస్థలందును, "మే మమ్మయొడియందే యున్నా" మని యనుభవింపంగల్గువారి ధర్మార్థ కామ మోక్ష చతుర్వర్గమేనాఁడును దుర్బలముకాదు. వారీ జగత్తునందుండియే యథాక్రమముగా నా చతుర్వర్గఫలము నొందుదురు. అమ్మా! నీ ధర్మమయమూర్తిని సేవింపక, అర్థకామములనుమాత్రము సేవించువారే దుఃఖతాపములచే మాటిమాటికిం బీకిపోవుచుందురు. అమ్మా ! చూడు – నీ గొప్పతోడుగల మానవసంతానమం దెంతయో యిక్కాలమున ధర్మహీనమై, యర్థకామముల సేవయే చేయుచు నెట్టి శోచనీయ దుర్దశను జేరుకొన్నదో ! నాలుగువైపుల లేమిచిచ్చు రేఁగి మండుచున్నది. దుర్భిక్షము, మహామారి, అకాలమరణము, రోగము, శోకము మున్నగువానిచే నీ జగత్తునందు శాన్తి–ఆనందమనెడి పేర నొక వస్తువు కలదన్నమాటయే మఱచిపోవునంతగాఁ బీడిత మగుచున్నది. త్రివిధ దుఃఖములచే జర్జరీభూతమై యానందమయజగత్తును దుఃఖమయమని ఘోషించుచున్నది.

అమ్మా! నీవు వారితో - "ఓ ప్రియసంతానమా! ధర్మమును విడిచినచో సుఖము లభింపదని మర్మమర్మములందు నాటునటులు చెప్పివేయుము. ఈ జగత్తు ఆనందఘనమని తెలుపుటకే, ఆ యానందము ననుభవించుటకే, అన్నిటికంటెఁ దొల్త ధర్మమునే సేవింపవలయును. జీవుఁ డెంతగా ధర్మపరాయణుఁ డగునో, యంతగాఁ జిత్తమందుఁ బ్రసన్నత కల్గును. చిత్తము ప్రసన్నమయ్యెనేని, అభావబోధము (లేమి యనెడి జ్ఞానము) తొలఁగిపోవును. లేమి (యనెడిది) తొలఁచకపోఁగానే, అర్థాభావమే యుండదు. ధర్మానుమోదితములైన కామనలు, నిర్విఘ్నముగా సిద్ధించును. కామనలు పూర్ణమగుటచేతనే జీవుఁడు నిష్కాముఁడగును. అపుడు మోక్షరూపిణివైన యమ్మవు నీవే వచ్చి కల్పితబంధములను దెగఁగోసి జీవసంతానముచేత నమృతాస్వాదము చేయింతువు.

ఇట్టి సులభమైన సరళమైన విశాలమైన దారి కానవచ్చుచున్నను, జీవులు పలువురు దారి తప్పి తమకు నచ్చిన దారినే త్రొక్కి యపారకష్టముల నెందులకుఁ బొందుచున్నారో, భ్రాన్తిరూపిణివైన తల్లీ! నీవే యెఱుఁగుదువు. అమ్మా! ఒక్కసారి భ్రాన్తిహరమూర్తితోఁ బ్రత్యక్షమగుదువేని, అనాది కాలమునుండియు గల మా భ్రాన్తి తొలఁగిపోవును. భ్రాన్తిరూపముతోను నీవే వెలయుదువని తెలిసికొందుమేని, మేము మా భ్రాన్తిని దాటిపోవుదుము.

అమ్మా! ఎవ్వరిని నీ వభ్యుదయదాయినీమూర్తితో నాదరింతువో, వారి సేవకులు, పుత్త్రులు, భార్యలు, పరిజనములు, వారి కనుకూలురును, శిష్టులును, సుస్థులును, సదా

చారులు నగుదురు. కనుకనే ధర్మమునొందు నాశతో, లేదా ముక్తినొందు నాసతో వారికి గృహస్థాశ్రమమును విడిచి, నిర్జనారణ్యములకును, గొండగుహలకును బోవు నావశ్యకత యుండదు. వారిహాపరముల రెంటిని జయింపఁగల్గుదురు. గీత లందును "ఇహైవ తైర్జితః స్వర్గో యేషాం సామ్యే స్థితం మనః" (5-19). అనఁగా నెవరి చిత్తము సమత్వమందు నిల్చునో - అనఁగా సమస్వరూపమున నంతటనున్న మాత్మసత్తయందుఁ బ్రతిష్ఠితమగునో, వారే జగత్తునందే యుండియు స్వర్గలోకమును సైతము జయింతురు; కనుక వారే ధన్యులు. దీనిచేత, అమ్మా! దేవతలును నిన్ను స్తుతించుచు "ధన్యాస్త ఏవ" యని నీ ప్రియ తమ సంతానమునకు ధన్యవాదములర్పించుచున్నారు. ఆధ్యాత్మిక పక్షమున - ఆత్మజ - భృత్య - దార పదములకు వరుసగా వివేకము, విజితేంద్రియములు, ఆత్మాభిముఖప్రవృత్తి యని యర్థము చేసికొన్నచో, నీ మంత్రార్థము సరళముగాఁ దెలిసిపోవును.

ఓం. ధర్మ్యాణి దేవి సకలాని సదైవ కర్మా
ణ్యత్యాదృతః ప్రతిదినం సుకృతీ కరోతి ।
స్వర్గం ప్రయాతి చ తతో భవతీప్రసాదా
ల్లోకత్రయేఽపి ఫలదా నను దేవి తేన॥ ఓం. 15

దేవీ! నీ ప్రసాదమువల్లనే సుకృతిశాలురు నిత్యము నత్యంత శ్రద్ధాపూర్వకముగఁ గర్మములను ధర్మమయములుగా నొనర్చి చక్కగా ననుష్ఠింతురు. దానిఫలముగా స్వర్గ మోక్షముల నొందుదురు. కనుకనే దేవీ! ఇటులు నీవు ముల్లోకముల ఫలము నిత్తువు.

వ్యాఖ్య:— వెనుకటి మంత్రమందు "న చ సీదతి ధర్మవర్గః" అని చెప్పఁబడినది. ఒక్క ధర్మసేవచేతనే, క్రమముగా, అర్థ కామ మోక్ష ఫలముల కధికారి యగును. ఏవిధముగా నా ధర్మసేవ చేయుదురో యీ మంత్రమువల్లఁ దెలుపఁబడినది. "ప్రతిదినం సకలాని కర్మాణి, అత్యాదృతో ధర్మ్యాణి కరోతి; ఏవం చ సుకృతీ భవతి" ప్రతిదినము నఖిలకర్మములను మిగుల నాదరముతో ధర్మమయములుగా ననుష్ఠింతురు; ఇటులు చేయఁగల్గుటచేతనే మనుష్యుఁడు సుకృతిశాలి యగును. తత్ఫలముగ స్వర్గమోక్షముల నొందును, అనెడి మాట నింకను స్పష్టపఱుపవలసి యున్నది.

సాధారణముగా లోకులు కర్మములను మూఁడు విధములుగా నెంతురు. కొన్ని ధర్మకర్మములు – సంధ్యావందనము, వ్రతనియమములు, ఉపవాసములు మున్నగు శాస్త్రవిహిత కర్మములు; కొన్ని యధర్మకర్మములు – హింస, పగ, కల్ల లాడుట, ఒరు సొత్తు దొంగిలించుట మున్నగు నిందితకర్మములు; మఱికొన్ని సాధారణకర్మములు – తినుట, తిరుగుట, పరుండుట, ద్రవ్యార్జనము మున్నగునవి. వానియందు ధర్మమును లేదు, అధర్మమును లేదు. కర్మశ్రేణీవిభాగ మిటులున్నను, మనము కర్మము నొక్కవిధముగానే కనుచున్నాము. విషయములతో నింద్రియసంయోగమగుటచేతనే కర్మములగును. గీతలందు – కర్మము, అకర్మము, వికర్మము అని కర్మశ్రేణీవిభాగ మిటులున్నది. అవియును విషయేంద్రియసంయోగమనెడి కర్మము యొక్క ప్రకారభేదము మాత్రమే. ఈ మంత్రమునం దామూలభూతకర్మమే లక్షింపఁబడినది. మంత్రమందలి "సకలాని" అను

మాటయెడ లక్ష్యముంచుటచేఁ దెలియఁగలదు. సరే; సర్వ కర్మములను ధర్మమనెడి శ్రద్ధతోఁ గూర్చియే చేయవలయును. అశ్రద్ధతోఁ జేయరాదు. "అత్యాదృతః" మిగుల నాదరముతోఁ జేయుము. ఏమిచేసిన నీ కర్మములు ధర్మ్యములు కాఁగలవు? ప్రతికర్మమునందును మాతృకర్తృత్వమునే కాంచుటచే మాతృయుక్తములైన కర్మముల ననుష్ఠించుట పేరే ధర్మ్యకర్మము. ఇది గీతయందలి "తత్కురుష్వ మదర్పణమ్" (9-27) అనెడి మంత్రముయొక్క సాధనమయావస్థ. అహంబుద్ధితోఁ జేసి, యప్పు డీశ్వరార్పణము చేయుట కనిష్ఠాధికారి కార్యము. అనుష్ఠానకాలమందే, యెంతదాఁకఁ జేయఁగల్గినను మాతృయుక్తములుగానే చేయవలయును. కనుక మంత్రమందు "కరోతి" యని వర్తమానబోధక క్రియాపదము వాడఁబడినది. ప్రారంభ - పరిసమాప్తి పేరే వర్తమానము. ఏ కార్యము నేని మొదలిడి ముగించునంతదాఁక మాతృకర్తృత్వ దర్శనమే యథార్థ ధర్మ్యకర్మము.

విశ్వమయమైన యొక విరాట్కర్తృత్వము కలదు. ఆ కర్తృత్వము – క్రియాశక్తి, మన విషయేంద్రియ సంయోగము వలన వెలయుననెడి యీ జ్ఞానము కొన్నాళ్లలవాటుపడినచో నది స్వాభావికమై పోవును. అపుడు మఱి ప్రయత్నించి ప్రతి కార్యమందును మాతృకర్తృత్వమును గాంచుటకై ప్రయాసపడు నక్కఱ యుండదు. ఈ విధముగా నంతటను మాతృకర్తృత్వ దర్శనమందు సిద్ధుఁడైన సాధకుని కార్యములెల్ల ధర్మమయములే యగును. పక్షాంతరమున – మాతృయోగరహిత = మాతృకర్తృత్వ దర్శన శూన్యములైన వ్రత నియమోపవాసాది

కర్మములు, వెలికి ధర్మ్యకర్మములుగాఁ గానఁబడినను వాస్తవముగా ధర్మ్యకర్మములు కావు. మఱి యాహారవిహారాదులైన దైనిక వ్యావహారిక కర్మములుకూడ మాతృయుక్తభావముతోఁ జేయఁబడుచో నవియు ధర్మ్యకర్మములుగానే పరిణమించును. ప్రతిదినము సర్వకర్మముల నీవిధముగాఁ (ధర్మమయములుగా) జేయువారే యథార్థసుకృతులు. వారి కృతులన్నియు సుఫలదాయకములే. పక్షాంతరమున — స్వర్గాది ఫలములను గోరి కామ్యకర్మములను జేయువారు, పరలోకమైన స్వర్గమందు, అనఁగా సుఖమయక్షేత్రమందుఁ జేరుదురు. ఇఁక నిష్కామబుద్ధితో, అమ్మ ప్రసన్నతనే యుద్దేశించి కర్మములను జేయువారు ముక్తి నొందుదురు. వారెల్లరు "భవతీప్రసాదాత్" నీ ప్రసాదము నొందినవారేకదమ్మా! నీవే జీవుల నీలోకమున సుకృతులను జేయుదువు. నీవే జీవులను బరలోకమునందు స్వర్గ భోగాధికారులను జేయుదువు. మఱి నీవే సర్వలోకముల కతీతమైన మోక్షఫలము నిచ్చి జీవులను ధన్యులను జేయుదువు. కనుకనే దేవీ! "లోకత్రయేఽపి ఫలదా" ముల్లోకములందును త్రివిధకర్మఫలవిధాన మొసర్తువు.

'ఫలదా' అను మాట కింకొక గూఢార్థమున్నది. ఖండనార్థకమైన 'దా' ధాతువు వలనఁగూడ 'ఫలదా' పదము సిద్ధమగును. దానివలన ఫలవినాశినీయనియు నర్థమగును. అనఁగా సర్వకర్మఫలములను ఖండించునది 'ఫలదా' యనుట.

అమ్మా! ఒక విధమున సుఖము, దుఃఖము, జన్మము, మరణము, స్వర్గము, నరకము అనెడి ఫలము నిచ్చుటచేత నీవు ఫలదవగుదువు. మఱొకవిధమున జీవుల సర్వకర్మఫలములను

జ్ఞానాగ్ని ప్రభావముచే సమూలముగా భస్మమైపోవును. కావున నీవే ఫలదవగుదువు. అమ్మా! ఇటులు నీవు ఫలదాయిని వయ్యు ఫలవినాశినివి. ఈ ఫలనాశినీమూర్తితో నీవు వెలయుచేని మాకేదోయొకనాఁడు నీ యమృతమయ వక్షమునందుఁ జోటు దొరుకునని యాశ. సర్వకర్మఫలముల దాటిపోవుదుము.

జీవుఁడు, అహం బుద్ధితో సాధారణ భావముతోఁ గర్మము లాచరించునంతవఱకే నీవు ఫలదాయినీమూర్తితో నావిర్భవించి వానికి సుఖదుఃఖాది ఫలముల నిచ్చుచుందువు. మఱి జీవుఁడు తన యహంబుద్ధిని నీ రక్తచరణములందు సమర్పించి విశ్వమయీ! విరాట్కర్తృత్వమయీ! మహాశక్తిస్వరూపిణీ! అమ్మా! నీ కర్మయంత్రరూపముననే గర్మము లాచరించునపుడు నీవే ఫలనాశినీమూర్తితో వెలసి సర్వకర్మఫలములను ఖండించి జీవుని మోక్షఫలాధికారినిగాఁ జేయుదువు.

ఓం. దుర్గే స్మృతా హరసి భీతి మశేషజన్తోః
స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి।
దారిద్ర్యదుఃఖ భయహారిణి కా త్వదన్యా
సర్వోపకారకరణాయ సదార్ద్రచిత్తా॥ ఓం. 16

దుర్గములందుఁ బడినపుడు నిన్ను స్మరించుటచే నీవు సర్వప్రాణుల భయమును హరింతువు. మఱి స్వస్థావస్థయందు స్మరించుటచే నత్యంత శుభమతి నిత్తువు. ఓ దారిద్ర్యదుఃఖభయహారిణీ! సర్వజీవులకు నిట్టు లుపకారముచేయు సదార్ద్రచిత్తవు నీవుగాక మఱెవ్వరమ్మా!

వ్యాఖ్య:— అమ్మా! నీ ప్రియసంతానమైన జీవులు దుర్గములందు - దుఃఖసంకటమందుఁ బడిపోయి తమ్ము రక్షించుకొన వేఱొక్క వెరవు గానక, సర్వవిధముల పురుషప్రయత్నములును వ్యర్థమైపోయినపుడు ఆపదలనెడి నల్లమబ్బులు నలువైపులఁ గ్రమ్మి జీవుల దృష్టిశక్తి నరికట్టువేళ, భయసంత్రాసములతో మిగుల వ్యాకులంపడునపుడు, అట్టి యవస్థయందు, ఆ దుఃఖదినములందు జీవుఁడొక్కసారి యేదో యొక యజ్ఞేయ మహాశక్తివైపు జాలిచూపుతోఁ జూచును. అట్టి గొప్ప కుసమయమందుఁ దనకు రవ్వంత తోడుపడఁగలవారు మఱెవ్వరును గానరారు. అట్టి దుర్దినమందు జీవుఁడు 'నీవే దిక్కు' అనుటకు బాధ్యుఁడగును. నిన్నే స్మరించును. కనుకనే మంత్రమందు "దుర్గే స్మృతా" యనఁబడెను.

అమ్మా! జాగతికదృష్టియందలి కుసమయమే కానీ, జీవుని పక్షమం దదియే సుసమయము. బహుపుణ్యఫలముగా జీవుఁడు నిన్ను స్మరించు శుభావసరము నొందును. నిన్ను స్మరించుటచే - యథార్థస్మరణము చేయఁగల్గుటచే, వడిగా గొడవ లెడమగును. కొడుకు, అమ్మా! యని దీనముగా నఱచునపుడు నీవు నిశ్చింతముగా నుండఁగలవా? పుత్త్రుని జాలిపిలుపు విన్నంతనే నీవు పిచ్చియెత్తినట్లు సత్యలోకమునుండి పరుగిడిరా బాధ్యవగుదువుకదమ్మా! నీ యా మూర్తిని స్మరించి విహ్వలులమై పోదుము. ఆ చెదరిన ముంగురులు, విరిసిన జుత్తు, జాఱెడి యా చీర, అడ్డులేని వడినడక గల మా వెఱ్ఱితల్లి, మమ్ము గుండె కత్తుకొని స్నేహాదరములు నెఱపునని గంతులిడమా! అమ్మా! అమ్మా! అమ్మా!

సరే; జీవుఁ డాపదలందుఁ బడియే, నిన్నుఁ దలంచు నభ్యాసము చేయును. ఆ యలవాటు ఫలముగా, స్వస్థావస్థ యందుగూఁడ నిన్ను స్మరింపఁగల్గును. క్రమముగా నీ యస్తిత్వ మందు విశ్వాసవంతుఁడగును. సర్వావస్థలయందును శుభము లనే మాకుఁ గూర్చు స్నేహమయి మా యమ్మ, మాయెడఁ జెదరని జూపు నిల్పునవేడి నమ్మకముతో హృదయము నిండి పోవునపుడు, అమ్మ యస్తిత్వమం దణుమాత్రమును సంశయము లేనపుడే జీవుఁడు స్వస్థుఁడగును. అపుడు మఱి యాపద యను నదే యుండదు. దుఃఖసంకటమనెడి యొకవస్తు వున్నదనుమాటే మనసున నుబుకదు. అమ్మ యస్తిత్వమందు విశ్వాసి కాలేనంత దాఁక జీవుఁడెట్టులును స్వస్థుఁడుకాఁజాలఁడు. స్వస్థుఁడుకాకున్న స్వస్తి ననుభవింపలేఁడు. ఔరా! 'స్వ'జాడ నెఱుఁగనివాఁడు స్వస్థుఁడెటులు కాఁగలఁడు?

అమ్మా! ఆపదలందుఁ జిక్కి జీవుఁడు నిన్ను స్మరించుట నేర్చుకొనును. క్రమముగా స్మరణ మభ్యాసమగును. ఆపదలు తొలఁగి నీ సత్తయందు విశ్వాసవంతుఁడై స్వస్థుఁడగును. ఆ యవస్థయందుసైతము నిన్నుఁ దలంచును. ఆపద లేదు. వేఱొక్క కామన, వాసన లేదు. ఐనను ప్రాణతాడనముచే స్మరించును. అపుడు నీవేమి చేయుదువో?

"స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి" స్వస్థావస్థచే నీ వత్యంత శుభమతి నిత్తువు. బుద్ధిసత్త్వముయొక్క నిర్మలతయే శుభమతి. మనము తెలిసుగా జగత్తునం దేబుద్ధినిబట్టి విచరించుచున్నామో, వ్యావహారికజీవనము గడుపుచున్నామో

అది రజస్తమోగుణములచే మలినముచేయఁబడిన బుద్ధి. కనుక నది అవిశుద్ధమతి - అశుభమతి; కాని, అమ్మా! కామనాహీన సంతానము నిన్ను మాటిమాటికి స్మరించునపుడు, నీకృపచేతనే వారి బుద్ధిమాలిన్యము తొలఁగి బుద్ధిసత్త్వము నిర్మలమగును. ఈవిధముగా అతీవ శుభమతి లభించుటచే దానియందు అమ్మా! చిదానందమయీ! నీ ప్రతిబింబము కనఁబడ నారంభించును. అపుడు జీవుఁడు నీ స్వరూపాభాసము నొంది ధన్యుఁడగును. జననమరణ మోహాదు లెన్నటికిం దూరమైపోవును. ఈ విధముగా సర్వావస్థలందును సంతానమునెడ సదా దయార్ద్రచిత్తులు నీవుగాక మఱెవ్వరున్నారు? నీవే మా దారిద్ర్య దుఃఖ భయములను హరించు తల్లివి. ఈవిధముగాఁ బ్రతిజీవునందును నీ స్వరూపమును బ్రకటించి యపారదయాపరిచయము గల్గించి జీవుల దారిద్ర్యము నెన్నటికిని దొలఁగింపుము.

"దారిద్ర్యదుఃఖ భయహారిణి" యను మాటను మఱింత పరిష్కారభావముతోఁ దెలియఁ బ్రయత్నింతము. అభావ బోధము (లేమి యనుకొనుట) పేరే దారిద్ర్యము. అభావబోధ ముండుటవల్లనే తప్పక దుఃఖము గల్గును. దుఃఖముచేతనే భయము గల్గును. కనుక దారిద్ర్య దుఃఖ భయముల నెడి మూడు నొండొంటితోఁ గూడియుండును. ఈ దారిద్ర్యమనునది చిత్త ధర్మము. చిత్తమందెల్లప్పుడు నేదోయొక భావ ముండనే యుండును. ఆ యభావబోధమును - దారిద్ర్యమును దొలఁగించుట కయియే, జగత్తునం దీ కోలాహలము, పరుగులెత్తుట; ఎంత కూడఁబెట్టనీ; ఎంత భోగింపనీ; చిత్తక్షేత్రమం దింకను గ్రొత్త లేములు తలసూపుచునేయుండును. ఈ దారిద్ర్యము తొలఁగక

దుఃఖభయము లెన్నఁడును దొలఁగిపోవు. ఇక్కాలమున దేశ మందంతటను వ్యాపించి భయానక దరిద్రతా మూర్తి స్వరూపము కానవచ్చుటకు, ఈ యభావబోధమే కారణము. అభావబోధ మెంత యధికముగా నున్నదో, యంతగా సామగ్రిసంచయము. భోగము ననువాని యభావము లేదు. ఏ వస్తువు లభించుటచే నీ యభావము తొలఁగునో, చెప్పనా? అదే 'బుద్ధి'. "తత్త్వ జ్ఞాన లక్షణా బుద్ధిః" ఆ బుద్ధి యశుభముగా (మలినముగా) నుండునంతదాఁక, సర్వవిధముల యభావములను (ఎట్టి యభావమునైనను) నశింపఁజేయఁగల వస్తువుయొక్క స్వరూపమే కానఁబడదు. కనుకనే యభావబోధ మేవిధముగాను తొలఁగదు, గాన శుభమతి యావశ్యకము. అది యమ్మ స్మరణము వల్లనే కలుగును.

ఏది లభించినచో మఱి యెద్దాని లాభమును గొప్పగఁ దలంపించదో, దేనియందు నిల్వఁగల్గుటచే దుస్సహదుఃఖములు వచ్చిపడినను జెదరుపాటుండదో, ఆ పరమానందమయ నిత్య వస్తువేదో, ఏది లభించుటచే దారిద్ర్య దుఃఖ భయములు కడుం దొలఁగిపోవునోఁ దానిజాడ నెవ్వరు చూపుదురు? దాని యాచూకి యెవరిత్తురు? శుభమతి – నిర్మల బుద్ధిసత్త్వమే. ఉపనిషద్భాష యందు, దీనిని ప్రజ్ఞా – "అపరోక్షానుభవపర్యంత విచారిణీ బుద్ధిః" అనిరి. ప్రజ్ఞ ప్రకాశించునపుడే జీవుఁడు పర మాత్మ స్వరూపానుభవము చేయఁగలఁడు. అపుడు లేములు, గొడవలు, భీతులు నన్నియుఁ దొలఁగిపోవును.

రా! సాధకా! రమ్ము. మనమును వేల్పులసారముతో సారము కలిపి భక్తివినమ్రచిత్తముతో "దుర్గే స్మృతా హరసి

భీతి మశేషజన్తోః। స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి।
దారిద్ర్య దుఃఖ భయహారిణి కా త్వదన్యా । సర్వోపకారకర
ణాయ సదార్ద్రచిత్తా॥" అని యమ్మను గొండాడఁగడఁగుదము.

అమ్మా! జీవులకెల్లరకు నెల్లవిధముల మేలుచేయుటకై యెల్లప్పుడు దయార్ద్రచిత్తముతో నెయ్యముచే మెత్తగిలిన చిత్తము గలవారు నీవుగాక మఱి యెవ్వరు? సర్వవిధముల దయామయివైన యమ్మవు నీవు కావా? దయతో, స్నేహముతో, మాతృత్వముతో, నీ హృదయము కరఁగిపోవుచుండును గాదా? కాని అమ్మా! మేమింకెన్నాళ్లకు నీ యా సాటిలేని మాతృత్వము ననుభవించి, యథార్థ పుత్రత్వము (తనుజత్వము) నొంది ధన్యులమగుదుమో?

ఓం. ఏభిర్హతై ర్జగదుపైతి సుఖం తథైతే
కుర్వంతు నామ నరకాయ చిరాయ పాపమ్।
సంగ్రామ మృత్యు మధిగమ్య దివం ప్రయాంతు
మత్వేతి నూనమహితాన్ వినిహంసి దేవి॥ ఓం. 17

దేవీ! ఈ యసురులు చంపఁబడుటచేతనే జగత్తు యథార్థముగా సుఖింపఁగలదు. అసురులును మఱి చిరకాల నరకజనక పాపములను జేయఁజాలరు. మఱియొకటి — సమ్ముఖ సమరమందుఁ జచ్చి స్వర్గము నొందెదరు; అను నివియన్నియు విచారించియే యసురులను జంపితివి.

వ్యాఖ్య:— అమ్మా! నీవెల్లరకు నుపకారముచేయుదానవయ్యు ఎల్లరయెడ నీ చిత్తము దయార్ద్రమేయైనను, శత్రుఁడు,

మిత్రుఁడు, పాపి, పుణ్యుఁడు, జ్ఞాని, అజ్ఞాని యనెడి విచారము నీకు లేకున్నను, ఈ యసురకులము నెందులకు నిహతమొనర్చితివి ? ఈ విషయమందు నీ వనెడివి మూఁడు మాటలు. మొదటిది - వీరు చచ్చిన జగత్తు శాన్తినొందును. రెండవది - అసురులకును నింక నరకవాస దినపరిమాణము పెఱుఁగదు. మూఁడవది - సమ్ముఖసంగరమందుఁ జచ్చుటచే వీరు స్వర్గమునకుఁ బోఁగలరు, అను నీ మూఁడు నుద్దేశించియే నీ వసురులఁ గసిమసంగితివి. యథార్థముగా మరణమనుచు, అనుపకారమనుచు, నిష్ఠురతయనుచు నొకటి యున్నచో, నీయందు ఉపకారము, అనుపకారము, దయ, నిష్ఠురత యనెడి రెండుధర్మములు గాఁబడును. ప్రత్యేకము నీ యిచ్ఛ మంగళప్రదమే యైయుండ నమంగళము నిష్ఠురత యనెడి దించుకయు నుండఁజాలవనెడి మాటను, మా గుండెను జక్కఁగా నాటించుకొనలేనంతవఱకే, జాగతికదృష్టితో నీయందు సైతము, ఉపకారానుపకారములు, దయానిష్ఠురతలు ననెడి రెండువస్తువులు కానఁబడును. స్థూలదర్శి — భేదజ్ఞానసంపన్నమగు దృష్టివలన నిట్టి ద్వైతదర్శనమే యగును; గాని అమ్మా ! నీవు దయతో నెవ్వరి భేదజ్ఞానమును దొలఁగింప నెంతువో వారు, నీవు తప్ప నింకెక్కఁడను నింకేమియు లేదని తెలియఁగల్గుదురు. అమ్మా ! వినాశము, సృష్టి యనెడి రెండును, సమానమైన నీ యానందలీలయే యని యెంచినవారు నీ వొకరియెడ దయను, వేఱొకరియెడ నిష్ఠురతను వెలయించుదానవని యెట్లనఁగలరు ? అనలేరు.

మఱియు నీ భేదదర్శనమునుబట్టి నిన్నుఁజూచినను జీవులు నీ బిడ్డలు; నీవు జీవులఁగన్న తల్లివి. తల్లికిఁ బిడ్డలయెడ నెన్నఁ

డును నిష్ఠురత యుండఁజాలదు. అప్పుడు మఱి దేనిని నిష్ఠురత యనుచున్నామో – రోగము, దారిద్ర్యము, శోకము, దుఃఖము, మరణము మున్నగు వేనిని మేము యథార్థముగా ననుపకారము లనుకొనుచున్నామో అవియును వాస్తవముగా మాతృస్నేహమే కాక, మఱేమియుంగావని తెలుపుటకే, వానియందును మునుఁ జెప్పిన నీ యీ మూఁడుద్దేశ్యములును లక్షింపఁబడుచున్నవి.

మొదటి యుద్దేశ్యము – "జగదుపైతి సుఖమ్" అసురులు సహాతులైనచో జగత్తు శాంతి నొందును. అసురులు సచ్చిరేని జగత్తునందత్యాచారము లడఁగునని స్థూలముగా నెల్లరెఱుఁగుదురు. ఇఁక సూక్ష్మభావముతో – వాసనలు పైకొనుట కవసరమీయక ప్రలయమువంక మఱలింపగలైనేని జీవుఁడు యథార్థశాంతి నొందును. ఏలనఁ గామనాపూర్తివల్లనగు సుఖముకంటెఁ గామనలు తలసూపకుంటవల్ల నగు సుఖము వేయింత లధికము. విశుద్ధచిత్తముతో విషయములను భోగించుటచే నగు సుఖముకంటెఁ బ్రశాంతచిత్తముతో, విషయభోగాభిలాషము లేకుంటచేతనే యధికసుఖ మగును. చిత్తవిక్షేప భావమే దుఃఖము; చిత్తప్రశాంతతయే సుఖము. ఇపుడు చూడు – జగత్తునకు (నీకు) యథార్థసుఖమే కావలసినచోఁ దప్పక యసురకులము (దుర్వాసనలు) ధ్వస్తము కావలయును.

రెండవ యుద్దేశ్యము — "నరకాయ చిరాయ పాపం న కుర్వంతు" ఆసుర(వాసనామయ) చిత్తము సదా వాసనలను బూరించుచు నెల్లప్పుడును నరకమును భోగించును. నరుఁడు, అతిసంకీర్ణుఁడును, అపవిత్రుఁడు నయి యుండుచో నే నరక

మందురు. చిన్న చిన్న విషయములను, జిన్న చిన్న కామనలను బట్టుకొని మనుజుఁడు, యథార్థసుఖమన నేమో యెఱుఁగ లేనంత మూఢుఁడై యుండును. కనుకనే వానిని సమ్ముఖ సంగ్రామమందుఁ జంపుట కడునావశ్యకము. ఇదే యసురనిధన మనెడి మూడవ యుద్దేశ్యము. యథార్థసుఖము నెదుర నుంచుకొని, చిన్నచిన్న పెక్కువాసనలను సమష్టీభూతము చేసి, దాని వైపు పరువెత్తఁగల్గినచో నారకీయవృత్తుల విలయమైపోవును. సమ్ముఖసమరమం దసురుల గసిమసంగు రహస్య మిదే. భూమ సుఖాభాసము నెదురఁ గానఁగల్గుటచేతనే జీవులు దుఃఖమిశ్రిత మును క్షణభంగురము నైన సుఖమందలి కామన నశ్రమముగా వీడఁగల్గుదురు. మన యమ్మ, యానందమయ – పరమసుఖమయ మూర్తితో నెదుర నిల్చినపుడే సర్వాసురభావముల విలయమై పోవును; గనుక దేవతలు "అహితాన్ వినిహంసి" యనిరి. అహితులు మనకు హితకరులు కారనెడి భావము నణంచివేసి, మన పరమమంగళ మార్గమును దెఱచివేయుటకే, అమ్మగారి యీ సమరవిడంబనము.

ఓం. దృష్ట్వైవ కిన్న భవతీ ప్రకరోతి భస్మ
సర్వాసురా నరిషు ప్రహిణోషి శస్త్రమ్।
లోకాన్ ప్రయాన్తు రిపవోఽపి హి శస్త్రపూతా
ఇత్థం మతి ర్భవతి తేష్వపి తేఽతి సాధ్వీ॥ ఓం. 18

అమ్మా! నీ నిగా పడినంతమాత్రనే, యసురులు నుసియై పోవుదురు; అయిన నటులు చేయక పరులపై నస్త్రములు

పఱపుటకుఁ గారణము — శత్రుగణము సైతము నీ యస్త్ర ఘాతముచేఁ బవిత్రమై యున్నతలోకములకుఁ బోవుననియే. అవురా! పగతురయెడ సైతము నీ కిట్టి సాధుమతియే కదా!

వ్యాఖ్య:— అమ్మా! నీవు సృష్టిస్థితిప్రలయంకరీ మహాశక్తివి. నీవు తలంచినంతనే యాసురికభావములు ఱెప్పపాటులో విలయమొందఁగలవు. అటులైనను నర్పక యరులపై నస్త్రశస్త్రములఁ బఱపుటయు నీ సమరవిడంబనము నెందుకమ్మా! ఆఁ, దీనియందును నీ సాధుమతియు మంగళమయేచ్ఛయు నిమిడియున్నవి. నీ చేతితోఁ బఱపఁబడిన యస్త్రములచే వేధింపఁబడి పవిత్రులగుదురు; నిష్పాపులగుదురు. ఉన్నతలోకములకుఁ బోవుదురు. నీ వరవపువునఁ జేరిపోదురనెడి యత్యుదార సాధుమతిని బట్టియే నీ యీ సంగ్రామలీల. ఆహా! పగవారియెడఁ గూడ నెంత పరమపదము! ఇది తలఁచిన నెంత వింత! మేము నిష్ఠురత యనుకొనునది వాస్తవముగా నిష్ఠురత కాదు. కరుణా కపట రూపము మాత్రమే.

అమ్మా! యెపుడు నీవు జీవుల యాసురీవృత్తులను శస్త్రములచేఁ బవిత్రము చేయుదువో, ఎపుడు చిన్న చిన్న వాసనలను గొంచెకొంచెముగా నీవంక కాకర్షించుకొందువో, ఎపుడు జడత్వమోహమును దెగఁగొట్టి మెల్లమెల్లగాఁ జిత్తవృత్తులకు బోధమయసత్తా సంధానము నొందింతువో, యపుడే వారు స్వర్గీయసుఖము ననుభవింతురు. ఇదే దేవతలు వినమ్ర కంఠములతో 'లోకాన్ ప్రయాన్తు రిపవోఽపి హి శస్త్రపూతాః' అనిరి. అమ్మా! మా బహిర్ముఖవృత్తుల నిటులే రవ్వరవ్వంతగా నానందరసభోగము చేయించి, క్రమముగా నీలోఁ జేర్చివేసి

కొమ్ము. అపుడు మఱి నీవు "ఏకమేవా ద్వితీయమ్" రూపముతో విరాజిల్లుము. అమ్మా! నీ కార్యప్రణాళికయొక్క అపురూపమయిన క్రమ మెంత ధన్యము!

ఓం. ఖడ్గప్రభానికరవిస్ఫురణై స్తథోగ్రైః
శూలాగ్రకాంతి నివహేన దృశోఽసురాణామ్ ।
యన్నాగతా విలయ మంశుమదిందుఖండ
యోగ్యానసం తవ విలోకయతాం తదేతత్॥ ఓం. 19

అమ్మా! నీ ఖడ్గకాంతి సముదాయపుఁ దళుకులును, నీ శూలపు మొన మెఱపులును, ఆ యసురుల చూపుబల్మిని బోఁగొట్టలేకుంటకుఁ గారణము, వారు జ్యోతిర్మయ చంద్రకలా విభూషితమైన సాటిలేని నీ యీ మోమును జూచుటయే.

వ్యాఖ్య:— స్థూలదృష్టిచేత - ఈ మహిషాసుర యుద్ధమందు నీ ఖడ్గప్రభల తళతళలును, నీ శూలాగ్రకాంతులును, అసురుల దర్శనశక్తిని విలయమొందింపలేకపోయినవని తెలియుచున్నాము. ఇఁక, సూక్ష్మభావముతోఁగూడ - నీ విజ్ఞాన ఖడ్గప్రభలును, జ్ఞానమయశూలద్యుతులును ఆసురీదృష్టిని నశింపఁజేయఁజాలలేదని తెలియుచున్నది. ఎందుల కిట్లయ్యెను? ఏ విశుద్ధబోధమనెడి శాణితాస్త్రప్రభావముచే సర్వద్వైతభావములనెడి దైత్యగణము నశించెనో, దాని యాభాసమునొందియు నాసురిక దృష్టి యేల నశింపలేదు? - "అంశుమదిందుఖండయోగ్యాననం తవ విలోకయతాం" అమ్మా! నీ సముజ్జ్వల ముఖచంద్రుని జూచుటచేతనే యాసురదృష్టి చెడలేదు. అవును. అమ్మ నగవు

నెయ్యము వెలయు నాసన పరమశోభను దేఱిచూడఁగల్గునపుడు మఱి దృష్టివిలయశంక యుండునా? ఆసురికసత్తయును జిదానందమయ మాతృసత్తయే, కాని వేఱేమియుం గాదనెడి రహస్యముఁ జక్కఁగా ననుభవింపఁగల్గునపుడే పూర్వోక్తసంశయము తొలఁగిపోవును. సర్వవిధముల యాసురభావములను విలయమొనర్చి విశుద్ధబోధస్వరూపయైన నీ సత్తను బట్టుకొనఁ నెంచువారు, బహుశః యీ రహస్యము నుపేక్షాదృష్టితోనే చూతురు. దానికై ప్రయత్నించుచుందురు కాని, యించుక ధీరముగాఁ జూచినచో వారును, "అమ్మ మోముఁ గాంచిన తర్వాతఁ గూడ, ఆసురీదృష్టి యుండు"నని గొంతెత్తి ఘోషింతురు. క్రమముగా సమయము వచ్చినపుడు, అది పూర్తిగా విలయమొందుననియు ఘోషింతురు. అమ్మా! నీ ప్రియతమ మానవ సంతానమునకు, "ఆసురీదృష్టి యున్నను నీ స్నేహ కరుణామయ ముఖసౌందర్యమును జూచు సౌభాగ్య మబ్బఁగల" దని నీవు తెలియఁజెప్పుము. అతి దురాచారులును నిన్ననన్య చిత్తముతో భజింపఁగలరు. నిన్నుఁజూడక యనన్యచిత్తముతో నీ భజనము కాఁగలదా? అది యటుండనీ.

అమ్మా! చంద్రదృష్టాంతముచేనైతము మేమీ సత్యము నెఱుంగఁగలము. సాధారణదృష్టికి "అంశుమదిందు" – కాంతిగల చంద్రుఁడు – చంద్రుని కిరణములే యని కాఁబడును, గాని తత్త్వదృష్టిచేఁ గిరణములు చంద్రునివి కావు. అవి సూర్యునివే. చంద్రునందుఁ బ్రతిబింబితములైన సూర్యకిరణములే చంద్ర కిరణములుగా దృష్టిగోచరము లగును. ఈవిధముగానే వేసిని మేము, ఆసురిక దృష్టులు – ఆసురిక భావములు – అనుకొను

చుందుమో, అవియును అమ్మా! నీ సత్తచేతనే సత్తావంతము లగుచున్నవి. నీ ప్రకాశముచేతనే ప్రకాశించును. ఇంతకుఁదక్క వానికి వేఱొకసత్త లేనేలేదనెడి రహస్యమును యథార్థముగా ననుభవించువారి యాసురీదృష్టి, విలయమగుటయుఁ గాకుం టయు సమానమే. కేవల ప్రాణరూపిణివయిన నీవే సురాసురుల యాకారమునఁ బ్రకాశింతువు. మేము నిన్నుఁజూడక, ఆ యాకా రముల యెడ ముగ్ధుల మగుటచేతనే మోసపడుచున్నాము. కల్యాణమయీ! అమ్మా! నీవు మా యీ మోహమును నెట్టివేయుము. కల్యాణదృష్టిని విప్పుము. ప్రాణప్రతిష్ఠితులను జేయుము.

ఓం. దుర్వృత్త వృత్తశమనం తవ దేవి శీలం
రూపం తథైత దవిచింత్య మతుల్య మన్యైః ।
వీర్యంచ హంతృహృత దేవ పరాక్రమాణాం
వైరిష్వపి ప్రకటితైవ దయా త్వయేత్థమ్॥ ఓం. 20

ఓ దేవీ! దుర్వృత్తుల వృత్తముల నణఁచు నీ స్వభా వమును అచింతనీయమైన నీ రూపము, దేవపరాక్రమముల నశింపఁజేయు నసురులను జంపు నీ వీర్యమును, వైరులయెడనైత మిట్టి దయయు ననువానికి సాటి నీయందే కలదు. మఱెక్క డను లేదు.

వ్యాఖ్య:— అమ్మా! చిత్తవృత్తులు అసద్వస్తువునం దాసక్తములై యుండునంతవఱకే యవి దుర్వృత్తులు. కేవల సత్స్వరూపమైన నిన్ను విడచి చిత్తక్షేత్రమందు విషయ

స్పందనములు వెలయునంతవఱకే వృత్తులు దుర్వృత్తములు; కాని, యీ దుర్వృత్తులను బూర్తిగా నణఁచివేయుట నీ స్వభావము. అమ్మా! "వినాశాయ చ దుష్కృతాం" దుష్కృతుల నణంచివేయుట నీ పనియే. ఇదెట్లు సిద్ధమగును? నీ రూపమును జూచినంతనే దుర్వృత్తులు శమించిపోవును. "రూపం తద్ధైత దవిచింత్యమ్" ఈ నీరూప మచింతనీయము. చింత చిత్తధర్మము. నీరూపము ప్రకాశించునపుడు చిత్తమనుట కేమియు నుండదు. ఉండఁజాలదు. కనుకఁ జింతయు నుండదు గాన, అమ్మా! దుర్వృత్తులు శమించుట అనాయాసముగా నైపోవును. ఇదే నీ స్వభావము.

సాధకా! నీ వా యరూపముయొక్క రూపము నెన్నఁడేనిఁ జూచితివా? పరిచ్ఛిన్నసీమగల, యేదోయొక రూపముఁ జూచుటచేఁ దలఁచు మోహితుఁడవు కాఁజాలవు. గాని, ఆ రూపహీన రూపసాగరమందు మునుఁగుదువేని, దప్పక ముగ్ధుఁడ వగుదువు. ఒక తుచ్ఛమైన పార్థివరూపమునెడ ముగ్ధుఁడై మనుజుఁడు కులశీల మానముల కన్నిటికి జలాంజలి యీఁగలఁడు గాని, యపరిచ్ఛిన్నము, మధుమయము, ప్రాణమయము, ప్రేమ మయము నైన రూపమునెదుట నిల్చి జీవుఁడు మతిపోకుండఁ గలఁడా? అయ్యా! రండు; అందఱము కూడి, అమ్మగారి యా యచింతనీయ రూపసాగరమందు దూఁకుదము. దానిచే మన దప్పి పూర్తిగాఁ దీఱిపోవును. సర్వ దుర్వృత్తులు శాంతించును.

అమ్మా! నీ రూపమును గాంచినంతనే చిత్తవృత్తులు తమంతనే యణఁగుననుటయందు నమ్మకములేక, నిన్ను విడిచి నేర్పుతోఁ (ప్రాణాయామాది కౌశలముతో) జిత్తనిరోధము

చేయఁగోరువారికి ఈరహస్యమును జక్కఁగా దెలియఁజెప్పుము. అమ్మయన్నను, సత్యమన్నను, ప్రాణమన్నను, ఆత్మయని తెలిసి పిల్చుటచేతనే నీ యచింత్య రూపరాశి యెదుట వెలయును. అది యెంత మధుమయము! ఎంత యపారము! చెప్ప నలవి కాని రూప మది. అది ప్రకాశించెనా — చిత్తము తనంతనే ముగ్ధమైపోవును. దుర్వృత్తము - అసత్ప్రియత్వము పూర్తిగా నెడమగును. నిర్వికల్పవు, నిరంజనవు, భావాతీతవు నైన మా యమ్మా! నీ ప్రకాశముచే సర్వభావములును, సర్వవిధముల వైషయికస్పందనములును విలుప్తములై పోవును.

అమ్మా! కేవల రూపమే కాదు. నీ వీర్యముసైతము దుర్వృత్తుల వృత్తముల నణఁచివేయఁగలదే. దేవభావముల నిర్వీర్యమొనర్పఁగల యాసురీశక్తులను విలయమొనర్ప వలఁతివి నీవే. అమ్మా! జగత్ సృష్టి స్థితి ప్రలయముల ననాయాసముగాఁ జలుపు నీ వీర్యము - మహాశక్తియెడ లక్ష్యముంచు నపుడు, చిత్తవృత్తుల ప్రయత్నముగానే యడ్డగింపఁబడ కేమి చేయును?

అమ్మా! నీ రూపహీనరూపము నెఱుంగఁజాలనివాఁడు, ఎఱింగియు ధరింపఁజాలనివారికి - అనఁగా "సత్యం జ్ఞాన మానందం బ్రహ్మ" యనెడి యీ స్వరూపమును బట్టుకొని నీ యెదుర నిల్వలేనివారికై, నీ యీ యమితవీర్య - (మహాశక్తి) ధారణోపదేశము విహితమైనది. "జన్మాద్యస్య యతః" అను నీ తటస్థలక్షణసహాయముతో (దేనివలన జగదుత్పత్తి స్థితి లయములగునో) వారు, ఆ లీలామయశక్తి యెదుర నిల్తురు. దీనిచేఁ గూడఁ జిత్తవృత్తి యశ్రమముగా నిరుద్ధమగును. అందులకును

నసమర్థులగువారికయి యే, ఈ "వైరిష్వపి ప్రకటితైవ దయా త్వయేత్థం" నీ సాటిలేని దయమాట తలపింపఁజేసితివి. పగతుర యెడ సైతము దయచూప లోభపడనిదానవు - నీవు మా యమ్మవు; మేము నీ సంతు. కనుక నీ దయనొందు విషయము నందెన్నఁడును వంచితులము కాము. అమ్మా! జగమునం దంతట వ్యాపించి హద్దులేక సదా ప్రత్యక్షమగుచు నత్యంత ప్రకటమగు నీ దయయెనుట సరళబుద్ధితో, సత్యజ్ఞానముతో, నొక్కసారి, అమ్మా! యనుచు నిల్వఁగల్గునంతనే చిత్తవృత్తి నిరోధమైపోవును. అసురకుల విలయమైపోవును.

అమ్మా! ఇట్టి నీ రూపము, నీ శక్తి, నీ దయ అను నిమూ్మడిట నేదోయొకదాని నాశ్రయించుటచేఁ జంచలచిత్తము నిరుద్ధమగును. దుర్వృత్తవృత్త మనాయాసముగా శాంతించును. కనుకనే దేవతలు, అమ్మా! దుర్వృత్తవృత్తమును శమింపఁ జేయుటే నీ స్వభావమనిరి. ఈ మూడే సాటిలేనివి. అనఁగా మోక్షసాధనముగాని, యుపాయముగాని వానికి సాటి చెప్పఁ దగి లేవు. కనుక మంత్రమందు "అతుల్యా మన్యైః" అని చెప్పఁబడినది.

అమ్మా! మేము నీ చిన్నబిడ్డలము; మా విషయమున నీ మూఁడవ యుపదేశమే యత్యంతోపయోగి. మేము నీ కృపను యాచించువారము. విశ్వమయమై వెలయు నీ దయామయ మూర్తియెడ ముగ్ధులమగుటకే ప్రయత్నింతుము. అమ్మా! యనుచునే నీ మొగమువంకఁ జూచుచునే కూర్చుందుము. ఏదో యొకనాఁడు నీవు దర్శనమిత్తువు. ఏదోయొకనాఁడు తప్పక నీ దయానుభవము చేయఁగలము. ఆనాఁడు మా దుర్వృత్త

ములు శాంతించును. మఱి ప్రయత్నములేకయే నీ వీర్యము యొక్క తటస్థలక్షణమును జేరికొందుము. నీవే యరూప రూపమును గొని, మా యాత్మరూపమున - సత్యజ్ఞానానందరూపమున - బ్రహ్మస్వరూపమున వెలయుదువు. అమ్మా! అమ్మా! యనెడి మా పిల్పులు సార్థకములై పోవును. ఆనందముతో "జయ మాతా!" యనుచు జననమరణ సుఖదుఃఖముల దాటి పోదుము. అమ్మా! ఆ దిన మింకెంతదూరమున్నదో చెప్పెదమా; చెప్పవా ?

ఓం కేనోపమా భవతు తేఽస్యపరాక్రమస్య
రూపంచ శత్రుభయకార్యతిహారి కుత్ర ।
చిత్తే కృపా సమరనిష్ఠురతా చ దృష్ట్వా
త్వయ్యేవ దేవి వరదే భువనత్రయేఽపి॥ ఓం. 21

ఓ దేవీ! ఓ వరదా! నీ యీ పరాక్రమమునకు సాటి యేదీ ? శత్రువులకు భయముగొల్పునది యయ్యును, నతి మనోహరమైన యిట్టి రూప మెక్కడ నున్నది ? చిత్తమందుఁ గృప యున్నను, సమరమందు నిష్ఠురత - యీ ముల్లోకములందు నొక్క నీయందే కానఁబడును.

వ్యాఖ్య:-అమ్మా! అనంతకోటిబ్రహ్మాండముల సృష్టి స్థితి ప్రలయములు చేయు మహాశక్తివి నీవు. కనుకనే నీ పరాక్రమమునకు సాటిలేదు. ఇఁక జెప్పెడిదేమున్నది ? పక్షాంతరమున - జగత్తునందుఁ బరాక్రమ ప్రభావశాలుర నెడి వారి పరాక్రమము, దీనులు దుర్బలులు నైనవారి యెడనే ప్రయోగింపఁబడును.

దుర్బలుల కన్నీరు నేలఁబడకున్నచో వారి పరాక్రమము సార్థకము కాదు. కాని, అమ్మా! నీ పరాక్రమము పూర్తిగా దీనికి విపరీతము. శత్రువులపై సైతము, అపారకరుణఁ గురియుటే నీ పరాక్రమఫలము. కనుకనే, జాగతికపరాక్రమముతో నీ పరాక్రమము సాటి చేయుట కేవల మసంభవము.

దీని తర్వాత నీ రూపము:- అదియు సాటిలేనిదే. భయజనకత్వము, మనోహరత్వము ననెడి విరుద్ధధర్మములు రెండును కేవలము నీయందే యున్నవి. జగమునం దెచ్చటను నిట్టి పరస్పర విరుద్ధధర్మములు కలిసియుండుట యసంభవము. ఒక్కసారిగా శత్రులకు భయదాయకమును, పుత్త్రిల కానందదాయకము నైన రూపము నీయందే సంభవము. నీకే చెల్లును.

రజోగుణమువల్ల నగు చిత్తవిక్షేపమనెడి శత్రుసమూహము నీ యీ రూపహీన రూపసాగరమందు మున్గిపోయి, భయముతోనువలె నందుఁ జేరిపోవును. మఱియొకవంక - ఆ యచింతనీయ రూపప్రకాశముచే, సాధకులప్రాణమం దూహింపరాని యానంద ముబుకును. అమ్మా! నీ చిత్తమందు మహాకృప యున్నను, వెలిని సమరనిష్ఠురత - శత్రుసంహారమునకై శాణితాస్త్రములను బఱపుట యను నీ విరుద్ధధర్మములు నీ యొక్కతెయందే కనఁబడును. జగత్తునఁ గానవచ్చు రోగము, శోకము, అత్యాచారము, పీడ, దుఃఖము, దారిద్ర్యము మున్నగునవి, నీ కనిష్ఠసంతానమునకు నీ నిష్ఠురతగానే కానఁబడును గాని, నీ స్తన్యపానముచేఁ బరిపుష్టులైనవారు, తోడ్తోనే యుండు నీ చిత్తమందలి కృపను, నీ సమరనిష్ఠురతను గాంచి ధన్యులగుదురు. సమరనిష్ఠురత యనెడి చిక్కని ముసుఁగులో నీవు గుప్త

ముగా నుంచి, జీవసంతానముపై నీ యపార కరుణాధారలు కురియించుటను వారనుభవింతురు. మఱి సర్వావస్థలయందును నీ కృప యనెడి నిర్మలానందరసమునే పానముచేసి, ప్రఫుల్లులై యుందురు.

ఓం. త్రైలోక్యమేతదఖిలం రిపునాశనేన
త్రాతం త్వయా సమరమూర్ధని తేఽపి హత్వా ।
నీతా దివం రిపుగణా భయమప్యపాస్త
మస్మాక మున్మద సురారిభవం నమస్తే॥ ఓం. 22

అమ్మా! నీవు శత్రుసంహారముచేసి ముల్లోకములను రక్షించితివి. సమరక్షేత్రమందుఁ జంపి శత్రువులకు స్వర్గమిచ్చితివి. మత్తేక్కిన దుష్టాసురులవలని భయమును మా కెడలించితివి. అమ్మా! నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య:— ప్రతి జీవునియెడ నిమ్మాడు కార్యములు పూర్ణములొనరించి, నీ దయామయీ నామమును సార్థము చేసితివి. ముల్లోకములకును శాంతి, అసురులకు స్వర్గప్రదానము, అసురపీడవలన మాకు విడుపు, అను నిమ్మూడే నీ కార్యములు. నీ దయ కివి వెలికిఁ గానఁబడు ఫలములు. పలుజన్మముల నుండి మమ్ము బాధించుచున్న కామక్రోధాదుల యత్యాచారములను, సంచితసంస్కారముల నెడి యసురులపీడను సైఁప లేకుంటిమి. కనుక నీవు స్వయముగాఁ గత్తిపట్టి మా హృదయమనెడి రణరంగమున నవతరించి, యా యసురకులమును నిర్మూలించితివి. మా చిత్తక్షేత్రమందు అసురభయమనెడి ప్రబల

సంస్కారము గట్టిగా నాటుకొన్నది. దానిచే సంకుచితులమై నిన్ను మనసార అమ్మా! యని పిలువలేకపోతిమి. చిత్తమందుఁ గామక్రోధాది మాలిన్యములును, గృహస్థాశ్రమమును నుండు నంతదాఁక నిన్ను స్మరింపఁజాల మనుకొంటిమి; గాని నేఁడు నీవు సంతానస్నేహముచే బాధ్యవయి, యీ మా శంకను దొలఁగించితివి. మా చిత్తసంకీర్ణత యెడమైపోయినది. సంచిత కామనలవలని విక్షోభమునకైన యాసురిక చాంచల్యము మఱిపుడు లేదు. మాతృమిలనముపట్ల మున్ను మాకుండిన బాధలయెడ మాలోఁ బెరిగిపోయిన వైరబుద్ధియును నేఁడు నీ స్నేహముచే బవిత్రమై, సజీవమై, నీ పవిత్రాంగమందే చేరి పోవుట కనుగొనుచున్నాము. నీ యపారకృపా ప్రభావముచే నవియు నేఁడు "దివం నీతాః" అయిపోయినవి. భూరాది త్రిలోకములందును నత్యాచారములు చేసి కడు నశాంతిని గల్గించి నవియు నేఁడు నీ యంగమునకు భూషణములే యైపోవుటచేత మా యశాంతియు నేఁడు తొలఁగుటను గ్రహించితిమి. నీవు జగద్రక్షకే సిద్ధముగా నుందువు. నలుదిక్కులఁ గ్రమముగా దాని యాయోజన మగుచునేయున్నది. అమ్మా! నీవు వాఙ్మనస్సుల కతీతవు. అపరిచ్ఛిన్నవు. అయిన నిటులు ప్రతిజీవుని హృదయమందు నీ వింతటి క్షుద్రభావముతో నిన్ను వెలయించు కొందువో! ఔరా! నీ దయ! మాటకును మనసునకు నందదు కదా! మాది - యనుచు మఱేమున్నదమ్మా! కేవల ప్రణామమే. నమస్తే, నమస్తే, నమస్తే.

ఓం. శూలేన పాహి నోదేవి పాహి ఖడ్గేన చాంబికే।
ఘంటాస్వనేన నః పాహి చాపజ్యా నిఃస్వనేన చ॥ఓం. 23

ఓం. ప్రాచ్యాం రక్ష ప్రతీచ్యాం చ చండికే రక్ష దక్షిణే।
భ్రామణే నాత్మ శూలస్య ఉత్తరస్యాం తథేశ్వరి॥ఓం. 24

ఓ దేవీ! శూలము, ఖడ్గము, ఘంటాధ్వని, ధనుష్టంకారము అనువానిచే మమ్ము రక్షింపుము. ఓ చండికా! ఈశ్వరీ! నీవు శూలమును త్రిప్పుచు ప్రాగాది చతుర్దిక్కులందును మా రక్ష యొనర్పుము. (శూల ఖడ్గాదుల యాధ్యాత్మిక రహస్యము మున్ను జెప్పఁబడినది.)

వ్యాఖ్య:— సాధకా! నీ నలువైపుల నంతటను మాతృశక్తి - మాత్రాహ్వానము నున్నది. విశిష్ట విశిష్టజ్ఞానము - నాదశక్తియే సర్వత్ర విషయాకారమున వెలయుచున్నది. రమ్మ; మనమును శక్రాదిదేవతలవలెనే సరళప్రాణముతో, జాలితోఁ బ్రార్థింతము. అమ్మా! శూలము, ఖడ్గము, ఘంటాధ్వని, అల్లెటంకారము మున్నగు నీ యన్నియస్త్రములతోను మమ్ము రక్షింపుము. ఎటుచూచిన నటే ఘనీభూతమైన జడత్వమూర్తి కానఁబడుచున్నది. ఈ జడత్వమనెడి మహాసురుని పట్టునుండి మమ్ముఁ దప్పించి రక్షింపుము. ప్రాణస్వరూపవైన నీవే మా నలువైపుల నిండి వెలయుచున్నావనెడి మాటను మేము వేయియాలోచనలచే సైతము మఱచుచున్నాము. జడత్వముచేఁ గడుఁ బీడింపఁబడుచున్నాము. దాని ఫలితముగానే లక్షలకొలఁది జననమరణములనెడి తిరుగటిఱాళ్లలోఁ బడి నలిగిపోవు

చున్నాము. అమ్మా! మమ్మీ యాపదలవలన రక్షింపుము. ఎటుచూచిన నబే, ప్రాణస్వరూపిణి మాతృమూర్తి కాన వచ్చుట యగునో, విషయజ్ఞానముతోనే విషయములనుభోగించి తాపత్రయాగ్ని చేఁ గాలిపోవుట దేనివలన మాకుఁగాదో యట్టి జడత్వప్రతీతి తొలఁగుటకై నీ యెన్ని విధముల శక్తులను బ్రయోగింపవలయునో, యన్నియుఁ బ్రయోగింపుము.

ఓం. సౌమ్యాని యాని రూపాణి త్రైలోక్యే విచరంతి తే।
యాని చాత్యర్థఘోరాణి తైరక్షాస్మాం స్తథా భువమ్॥ ఓం.25

అమ్మా! ముల్లోకములందును అతిసౌమ్యములు, అతి భయానకములు నైన నీ రూపము లెన్ని సిద్ధముగా నున్ననో యన్నిటితోను, మమ్ములను ఈ విశ్వమును రక్షింపుము. అంబికా! ఖడ్గ శూల గదాదులైన యస్త్రములు నీ చేతులం దెన్ని యొప్పునో, ఆ యన్నిటితోను మమ్మెల్లవిధముల రక్షింపుము.

వ్యాఖ్య:— అమ్మా! ఈ జగత్తునందు నీమూర్తి రెండు విధములఁ గానఁబడును. ఒకటి సౌమ్యము; ఒకటి ఘోరము. పార్థివములు, నపార్థివములు నైన సర్వవిధ సుఖసామగ్రిని గొని, నీవు సౌమ్యమూర్తితో మమ్ముల నొడిని వేసికొని, కూరుచున్నపుడు, మేము, సుఖమోహముచే నీ స్నేహస్పర్శమును మఱువనీయకుము. పార్థివభోగమైన యైశ్వర్యము, అపార్థివములైన సిద్ధిశక్తులు, లేదా స్వర్గాదిసుఖము, మమ్ము ముగ్ధులను జేయనీయకుము. అమ్మా! ఈ ముగ్ధతచేతఁ జిక్కకుండ నీ సౌమ్యమూర్తితో మమ్ములను గాపాడుము. సర్వవిధ సుఖరూపముతోను నీవే సిద్ధముగా నుందువనెడి మాట,

ఎప్పుడును మాలోనుండి జాఱిపోకుండఁ జూడుము. మఱి దుఃఖదుర్దశ యనెడి యమావాస్యా కాలరాత్రి క్రమ్మినపుడు, రోగ శోక దారిద్ర్య మృత్యు భయములచేఁ బీడింపఁబడినపుడు, నీవే ఘోరమూర్తితో వచ్చి మమ్ముల నోడినుంచుకొంటివని తలపింపుము. అపుడు మఱి నీ భయానకమూర్తిని జూచి మేము భయపడము. దుర్బలులము కాము. దానిచే నీ యస్తిత్వమందును, నీ మాతృత్వమందును మఱి సంశయము రవ్వంతయు నుండదు. ఎన్ని ఘోరమూర్తులతో నీవు ఆవిర్భవించినను సరే, ప్రకృతి యెంత ప్రతికూలవేదనముతో సిద్ధమైనను సరే, "నీవే నిజముగా మా యమ్మ" వనుచోట అపనమ్మకము గలుగదు. అమ్మా! ఈ జీవనచక్రము సదా పరివర్తనశీలము. సుఖ దుఃఖ పరివర్తన మెల్లప్పుడు నగుచునే యుండును. వానిలోనే నీ సౌమ్య ఘోర మూర్తుల ప్రకాశము. ఈ రెండు మూర్తుల తోను మమ్ము రక్షింపుము. కేవలము మమ్ములనే కాదు, "తథా భువమ్" ఈ విశ్వమంతట వ్యాపించియున్న జీవుల నందఱిని రక్షింపుము. అమ్మా! నీవే సుఖదుఃఖాకారమున వత్తువనెడి మాట ప్రతిజీవుని మర్మమర్మమం దంకితము చేసి వేయుము. దీనిపేరే రక్ష. ఎట్టి యవస్థయందును జీవుఁడు తనను నిరాశ్రయునిఁగాను, అనాథునిఁగాను దలంపకుండునట్లు చేయుటకై యెన్ని విధముల యస్త్రములు పఱచుటావశ్యకమో, యన్నియుఁ బఱపుము. సర్వాయుధధారిణీ! మా యమ్మా! నీ సర్వాయుధములను ప్రయోగించి మమ్ములను రక్షింపుము. "రక్ష సర్వతః" ఈ సర్వభావములవలన, బహుభావములవలన మమ్ము రక్షింపుము. సచ్చిదానందమయివి నీవొక్కతెవే

సర్వభావములతోఁ బ్రకాశింతువు. నీవు తక్క సర్వ — బహు, అన నేమియు లేద నెడి యీసత్యమునందే మమ్ము స్థాపింపుము. మేము సర్వావస్థలందును సత్యాశ్రితులము, సత్యస్థితులము, అను నిమ్మహాజ్ఞానరూపముతో నీవు ప్రతి జీవుని హృదయ మందును గట్టిగా నెలకొనుము. అమ్మా! దృఢప్రతిష్ఠిత వగుము. అమ్మా! జగత్తునుండి దుఃఖభయము నెన్నటికిని దొలఁగి పోవును.

ఓం. ఏవం స్తుతా సురైః సర్వైః కుసుమై ర్నందనోద్భవైః।
అర్చితా జగతోధాత్రీ తథా గంధానులేపనైః॥ ఓం. 27

ఓం. భక్త్యా సమస్తై స్త్రిదశై ర్దివ్యై ర్ధూపైస్తు ధూపితా।
ప్రాహ ప్రసాదసుముఖీ సమస్తాన్ ప్రణతాన్ సురాన్॥ఓం.28

దేవత లీ విధముగా జగద్ధాత్రి నమ్మను గొండాడి, నందన వన దివ్యపుష్పములతోను, గంధానులేపనములతోను బూజించిరి. దేవతలెల్లరు భక్తిసహితులై దివ్యధూపములచే దేవిని సౌరభాకులితను జేసివేసిరి. పిదపఁ బ్రసన్నవదనయై దేవి, ప్రణతులైన దేవతల కిట్లనెను.

వ్యాఖ్య: — ఇంద్రాది దేవత లీవిధముగా స్తుతించి గంధ పుష్పాదులతో, జగద్విధాన మొనర్చు దేవిని బూజించిరి. ఆధ్యాత్మికదృష్టితో నైతము - ఇంద్రియాధిష్ఠిత చైతన్యవర్గము, ఆనందమయ సాత్త్వికభావముల నెడి నందనకుసుమములతోను, వివేకాగ్నిచే జ్ఞానకర్మేంద్రియములఁ గాల్పఁగాఁ బుట్టిన సురభి ధూపములతోను, శ్రద్ధా నిర్మమతా శుచితా వైరాగ్యాది

గంధానులేపములతోను జగద్ధాత్రి నమ్మను బూజించిరి. దేవియు నిట్టిపూజల కలరి వరము లీయఁగడగినది. ఇచటఁ బూజాసంబంధమున నొకటి రెండు మాటలు అప్రాసంగికములు కావు.

గీతలందు — "పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి" ఇది దేవీమాహాత్మ్యమందును బలుతావులఁ బుష్పాదులతోడి పూజ యుల్లేఖింపఁబడినది. ఇంతేగాక, స్మృతి సంహితా పురాణాదులందుఁ బూజావిధానము పలువిధములఁ జెప్పఁబడినది. గాని మఱికొన్నిచోట్ల "బాహ్య పూజాధమాధమా'' అని యున్నది. కొందఱీ యుపదేశము ననుసరించి కర్మకాండమును బూర్తిగా విడిచిపెట్టి కేవల ధ్యానసహాయముతోఁ బరమాత్మ సాక్షాత్కారమునకై ప్రయత్నింతురు. ఈ సంబంధమున మనమేమి తెలిసికొనవలయును?

మనము ఆహార నిద్ర లున్నంతవఱకు, అనుకూల ప్రతికూలబోధ మున్నంతవఱకు, పిన్న పెద్ద జ్ఞాన మున్నంతవఱకు బాహ్యపూజ యుండనే యుండును. కేవలము పూలు, కుంకుమము, మారేడుపత్రి విడుచుటతోనే బాహ్యపూజ వదలిపోదు. ఎట్లయినను బాహ్యపూజగానే పూజ ముగిసిపోకుండ లక్ష్యముంచవలయును. బాహ్యపూజ నిజముగా నధమముకంటె నధమమనుట సత్యము. శ్రుతియందును — ఉపాస్యుఁడొకఁడు, ఉపాసకుఁడొకఁడు అను నిట్టి భేదబుద్ధి నాశ్రయించి, దేవపూజ చేయువారు దేవతలకుఁ బశువులు — అని యున్నది. మఱి భగవంతుఁడును దానే "అన్యదేవతలఁ బూజించుటనునది, అవైధ (విధిరహిత-విరుద్ధ) పూజ యైపోవు" ననెను. ''పరిచాయ పురా దేవం దేవపూజాపరో భవ। తావత్పూజాం న మనుతే యావ

త్పరిచయో నహి’’ (వి॥ చం॥) భేదజ్ఞానముతోడి పూజయే బాహ్యపూజ. ‘బాహ్య’ అనఁగానే, యేదో యొక ఘనబోధ ముండునంతదాఁక, యథార్థపూజ కధికారమే యుండదు. “బాహ్యమనుచు నేమియు లేదు. సర్వము నంతరమందేయున్నది” అను జ్ఞానమునందుఁ బ్రతిష్ఠితుఁడగుటచే, మఱి బాహ్యపూజ యుండనే యుండదు. ఇది నోరితో నన్నంతనే సరిపోదు. ఈ జగత్తును అంతరముగా నెంచి యనుభవింపవలయును. ఇదిగో, ఆ యంతర బాహ్య భేదజ్ఞానము నంతరింపఁజేయుటకే సర్వారాధనములు పూజలు సాధనలు పుట్టినవి. స్థూలమూర్తి సహాయముతోఁ బూజచేయుటచే సులభముగా అంతర బాహ్య భేదజ్ఞానము తొలఁగిపోవును. జ్ఞాన భక్తి కర్మము లొకక్రమానుసారిగా ననుశీలించుట కింతకంటె సులభోపాయము మఱొండు తోఁపదు. ఉన్నచో ఋషిపుంగవులు ఈ దేశమందిట్టి మూర్తిపూజా ప్రచారము చేయనే చేయరు. అది యుండనిండు.

ఈ యంతర బాహ్య భేదజ్ఞానము తొలఁగనంతదాఁక, దేవత యెవ్వరో తెలియనే తెలియదు; గనుక నెవరి పూజ చేయుదువు? “దేవే పరిచయో నాస్తి యది పూజా కథం భవేత్” మఱియు, “జాతే పరిచయే దేవే పూజామపి న కాంక్షతి” దేవతతోఁ బరిచయమైనపుడు మఱి పూజచేయు నిచ్ఛయే చేయఁడు. కనుకనే “ఉభయోరపి పక్షయోః పూజాం పశ్యామి దుర్ఘటామ్’’ ఉభయపక్షములందును బూజ సంభవమే కాక పోవును. పూజ – పూజించువాఁడు, పూజ్యము అనెడి భేదజ్ఞానముతోఁ బూజచేయుటవల్లనే, అది యజ్ఞానముతోడి యధమ పూజ యగును. గాని మన ‘ప్రాణము’, మన ‘నేను’ అనుదాని

పూజనే చేయుచున్నామనెడి బోధముతోఁ బూజించునపుడు, ఆ పూజ వ్యర్థముకాదు. ఈ విధముగా నభేదమందు భేదజ్ఞానముతోఁ బూజచేయ మొదలిడుటచేతనే క్రమముగా భేదజ్ఞానము సడలిపోవును. పూజకు విఘ్నములును వచ్చును. విధిలంఘన మగును. శాస్త్రోక్తపూజాక్రమమును మఱపగును. ధూపమునకు బదులు పూలు వేయుటగును. అయినను అదియే పూజాఫలము. కనుకనే "దేవ ఏవేతి ధియా విస్మృతే పూజనక్రమే। పూజాయాం జాయతే విఘ్నః పూర్ణపూజాఫలం లభేత్॥"

ఇక్కాలమందును నీ దేశమున లక్షలకొలఁది స్త్రీపురుషులు పూజ చేయుచున్నారు. ఆ పూజ కేవలము నిష్ఫలము కాదుగాని, విశేషించి యున్నతి లభింపదని తోఁచును. సామాన్యదైనికకార్యమువలెనే పూజయు సాగిపోవుచున్నది. ఇఁకఁ గేవల ధనాద్యాశలతోఁ బూజాభినయము చేయువారి మాట చెప్పనేమున్నది? అది వేఱు. ఎందుల కిట్లగుచున్నది? పూజలు చేసియు జ్ఞానభక్తుల నేల పొందకున్నారు? అది పూజ్యదేవతతోఁ బరిచయము లేమినే. ఎవరిని బూజించుటో, వారి నెఱుఁగరు. వారెవ్వరో, ఎక్కడ నెట్టి భావముతో నున్నారో యది యెఱుఁగరు. ఎందుకో, ఏమిటో, పూజ యభ్యాసమైపోయినది. అందుకే పూజించుచున్నారు. ఇది కారణముగానే పూజలు, ఆశానురూపఫలముల నీయకున్నవి.

ఈ దేశమందు నిత్యక్రియయైన పూజ కర్మకాండమైనను నొక మృతకర్మమే యైపోయినది. మఱల నెప్పుడో యీ దేశకర్మకాండము, జ్ఞానపరాభక్తులందుఁ బ్రతిష్ఠింపఁబడి సజీవమైన యెడల, దేశమందలి హాహాకారములు, లేమి, పీడ మున్నగున

పన్నయుఁ దొలఁగునని తోఁచును. ఒక్కసారి ధర్మ నిర్మలరసాస్వాదము చేసెనేని, లోకము మఱి ధర్మహీనము కానేరదు. ధర్మహీనులు కాకున్నపుడే సర్వసుఖములును మనుజులకు సులభములు. ఈ యుత్తరదాయిత్వము ముఖ్యముగా బ్రాహ్మణులపై నిర్భరమైయున్నది. ఏలన - బ్రాహ్మణులపైనే ప్రత్యక్షముగానో పరోక్షముగానో కర్మకాండము నేఁటికిని నిల్చియుండుట కనుచున్నాము. వారే యీ ప్రాణహీనమైన కంకాళముతోనున్న కర్మకాండమునకుఁ బ్రాణప్రతిష్ఠ చేసి, మఱల సజీవమును సాఫల్యమయమును జేయఁగల్గిరేని, వారాదర్శభూమిపై నిల్చి సోదరజీవుల నాదరముతోఁ బిల్చి గౌరవింపఁబడుదురు. సర్వము ధర్మమయమగును. సర్వము ధర్మకర్మమయము కాఁగలదు. సర్వకర్మములును జ్ఞానమయములే యగును. జ్ఞాన పరాభక్తిధారచే సర్వము మధుమయము కాఁగలదు. ఈ విశ్వరాజ్యము ధర్మరాజ్యముగఁ బరిణమింపఁగలదు. అసత్యము తొలఁగిపోయి సత్యప్రతిష్ఠ కాఁగలదు. ఈ యాశతోనే సత్యప్రాణ ప్రతిష్ఠారూపమై, యమ్మ వరాభయహస్తములతో మన యెదుట నిల్చియున్నది. (నా 'దేవపూజారహస్య' గ్రంథము చూచునది.)

సాధకా! అదిగో; దేవతలపూజచే మన యమ్మ ప్రసన్నమై వరములీయ సిద్ధపడినది. "ప్రాహ ప్రసాదసుముఖీ సమస్తాన్ ప్రణతాన్ సురాన్" పూజించి ప్రణతులగుట చేతనే, అమ్మ ప్రసన్నయైనది. ఇదిగో, కేవల దేవతల పూజానమస్కారములతోనే తృప్తి నొందుననియు, భక్తిహీన శ్రద్ధాహీన విశ్వాసహీన దుర్బలసంతానము చేయు పూజాప్రణతుల నామె యాదరముతో నందుకొనదనియుఁ దలంపరాదు. ఈ విశ్వాసము

లేని యుగమందు సైతము వరాభయములిచ్చి యాదరించునా? యనరాదు. సాధకజీవులారా! రండు. మంత్రహీన క్రియా హీనులమైన మనమెల్లరముఁగూడి, అమ్మా! యనుచు నామె చరణములందు భక్తినమ్రులమై పోవుదము. అమ్మ ముమ్మాటికి నిశ్చయముగ మనకును ప్రసన్నయగును.

ఓం దేవ్యువాచ ఓం.

ఓం. ప్రియతాం త్రిదశాః సర్వే ।
యదస్మత్తోఽభివాంఛితం॥ ఓం. 29

ఓం దేవా ఊచుః ఓం.

ఓం.భగవత్యా కృతం సర్వం న కించి దవశిష్యతే ।
యదయం నిహతః శత్రు రస్మాకం మహిషాసురః॥ఓం.30

దేవతలారా! మీరు నావలన వలచిన వరము లందుకొనుఁడు ("దదామ్యహ మతిప్రీత్యా" యనెడి యర్ధశ్లోకము మూలసంహితయందు లేదు.)

దేవత లనిరి:- భగవతివలన సర్వకార్యములు పూర్ణమైనవి. మా శత్రువు మహిషాసురుఁడు చంపఁబడెను గాన, నింతయు మిగులు లేదు.

వ్యాఖ్య:- సరిగా సిటులేయగును. అమ్మ విశిష్టభావముతో నావిర్భవించి వరములీయఁబూనినపుడు సంతాన మిట్లనకుండదు. 'లేదమ్మా! మతేమియుఁ గొదువలేదు. మే మేమియుఁగోరము' పూర్ణస్వరూపపు నీవు మా యెదుర నిల్చితివి. ఇఁకఁ గోరఁదగిన

దేమున్నది ? ఈ విధముగానే నీవు మా యెదుట నుండుము. హృదయము పరిపూర్ణమై పోయినది. మఱి కోరికలేదు. సదా నీవే మాయెదుర నిల్వుము. లోలోపలి భాగ మెంత వెదకినను మఱి లేమి కానఁబడదు – 'న కించి దవశిష్యతే'.

సాధకుల కే యీ యవస్థ కల్గును. కామనావాసనలతో నెన్ని పూజావ్రతములు చేయనీ; అమ్మ దర్శన మొక్కసారి యైనచో మఱి మనసున రవ్వంతయుఁ గోర్కి యుండదు. 'సర్వము లభించె, నింకేమి కోరుకొందు'నని తోఁచును. బాలయోగి ధ్రువునకుఁగూడ నీ యవస్థయే యయ్యెను. రాజ్యకామనతోనే సాధన మారంభించెను, గాని కమలలోచనుఁడు సాక్షాత్కరింపఁగానే, "ప్రభువా ! పరమేశ్వరా ! గాజుముక్కకై వెదకుకొనుచున్న నా చేత నమృతపానము చేయించితివి. నా కెట్టి కోరికయు లే" దనెను.

సాధకా ! ఇట్టి సంఘటన మెన్నఁడేని, ఎట్టి భాగ్యవంతుఁడైనవానికేని కాఁగలదా ? అనుకొనకుమా. అటు లెన్నఁడును గాదు. ప్రతిమనుజుఁడును ప్రతిదినము నిటులు భగవత్సాన్నిధ్యము నొందఁగలఁడు. పూర్ణత్వము ననుభవింపఁగలఁడు. అసంభవము నసాధ్యము నిందేదియు లేదు. భగవంతుఁడు సర్వదా సర్వత్ర సుప్రకటుఁడు సుప్రసన్నుఁడునై యున్నాఁడు. కోరినంతనే కానఁబడును. "దీర్ఘకాల తపఃఫలముగానే, యొక్కడనో యొవనికో భగవద్దర్శనము కాఁగలదు" అనెడివారి తాత్పర్యము వేఱు. "యథార్థముగ భగవంతుఁడు నాకుఁ గావలయును" అనెడి యొకకోరికను రేఁగఁగొట్టుటకే దీర్ఘకాలము – దీర్ఘకాల మననేల ? అనేక జన్మములందు సాధన చేయుట

తప్పదు. ఏ మనుగడయందే నిట్టి కోరిక యాభాసించెనేని, వాఁ డచిరముగానే యభీష్టసిద్ధి నొందఁగలఁడు. అది యట్లుండనీ.

ఈ మంత్రమునకు మఱియొక గూఢార్థమున్నది. "భగవత్యా కృతం సర్వం న కించి దవశిష్యతే" ఇందలి నఙర్థకము పూర్వార్థముతో నన్వయించినచో, మఱియొకవిధముగా నర్థమగును. "భగవత్యా సర్వం న కృతం, కించి దవశిష్యతే" అమ్మా! నీవు మాకొఱకెంతో చేసితివి కాని, కార్యమంతయుఁ బూర్ణము కాలేదు. కొంత మిగులున్నది. మహిషాసుర వధముచే జీవత్వము పూర్ణముగాఁ దుదముట్టలేదు. శుంభవధ మావశ్యకము. (అస్మితానాశ మావశ్యకము.) కనుక దేవతలు 'కించి దవశిష్యతే' యనిరి.

ఓం. యది వాపి వరో దేయ
స్త్వయాస్మాకం మహేశ్వరి।
సం స్మృతా సం స్మృతా త్వం నో
హింసేథాః పరమాపదః॥ ఓం. 31

ఓం. యశ్చ మర్త్యః స్తవై రేభి
స్త్వాం స్తోష్యత్యమలాననే।
తస్య విత్తర్ధి విభవై
ర్ధనదారాది సంపదామ్॥ ఓం. 32

ఓం. వృద్ధయే స్మత్ ప్రసన్నా త్వం।
భవేథాః సర్వదాంబికే॥ ఓం. 33

ఓ మహేశ్వరీ ! నీవు తప్పక మాకు వరము లిత్తువేని, మేము నిరంతరము నీ స్మరణము చేయఁగల్గునటులును, దాని ఫలముగ మా మహాపదలెల్లఁ దొలఁగిపోవునట్లును జేయుము. ఓ యమలాననా ! అంబికా ! ఈ స్తవములతో నిన్నుఁ గొండాడు మనుష్యుని యెడ సదా ప్రసన్నవగుము. మఱియు, జ్ఞానము, ఐశ్వర్యము, సంపత్తి, ధన పుత్త్రాదిక మంగళముల నొసంగుము.

వ్యాఖ్య:— బిడ్డలు తల్లిని జూచునపుడు విస్మయానంద ములతో నోడలు మఱతురు. కోరికొనుట కేమియు దొరకదు. కాని, అమ్మయుఁ దన బిడ్డల లేములను, అభియోగములను సర్వము నెఱుంగఁగలదు. సర్వమును జూడఁగల యామె ముక్కన్నుల కింతయు నెక్కుడను మఱుఁగు కాఁజాలదు. కనుకనే అమ్మ తానే వరములిత్తు ననుచు, బిడ్డల హృదయమందు, మున్ను మఱపైన లేములను క్షణములోఁ దలఁపించినది. ఇటులే యగుచుండును. తొలుతటి దర్శనమువల్లనే సాధకుని కొదువ లెల్ల మఱపైపోవును. ఏలన – మన యమ్మ పూర్ణతమ; ఆ వెనుక మెల్ల మెల్లఁగా, ఆ భావము వచ్చిపోవుచుండును. ఒక వంక – అమ్మ అప్రకటయగునపుడు, ఆమె యభావమూర్తి వెలయుచుండును. ఈ యభావజ్ఞానము గల్గుటపేరే, వరప్రార్థనము. అమ్మ నెదుట నుంచికొన్నపుడు, అనఁగా – అమ్మ యెదుట నిల్చినపుడు, అభావబోధము రేఁగనేని (లేములు తోఁచనేని) శీఘ్రముగానే యా వెత్తి తొలఁగిపోవునని గ్రహింపుము. అమ్మ తన బిడ్డ నెయ్యముచే, నోరితో నేమియు నన కున్నను సంతానహృదయములో దాఁగియున్న యభావబోధ

మనుదొలఁగించునంతగా ముగ్ధయగును. వెనుకముందులుచూడక కోరిన వరములిచ్చి ధన్యుల నొనర్చును. గాని, మనమో – బ్రహ్మ విష్ణు మహేశ్వరులకును ధ్యానగమ్యకాని యామె సన్నిధిని నిల్చియు, అతితుచ్ఛములైన యభావాభియోగముల పట్టిక సిద్ధముచేసి యందిచ్చునంతటి కృతఘ్నులము, సంకీర్ణ హృదయులమునైన బిడ్డలము. అమ్మా! ఈ మా హృదయ సంకీర్ణత యింకేనాఁటికిఁ దొలగింతువో?

సాధకా! రమ్ము. సాధకులారా! రండు. మనమును దేవతలవలెనే "ఓ మహేశ్వరీ! నీవు మా పరమాపదల నెల్లఁ దొలఁగింపుము. దానిచే నిన్ను మేము సదా స్మరింపఁగలము." అని మొఱలిడుదము.

'పరమాపద' శబ్దముచే – పరమమునకైన యాపద – యనుకొందము. అనఁగా మనకుఁ బరమస్వరూపలబ్ధివిషయమున బాధకములైనవే పరమాపదలు. "మేము సదా పరమాత్మ రూపమందే నిల్తుము" అనెడి బ్రాహ్మీస్థితికిఁ బ్రతికూలములైన విఘ్నములే పరమాపదలు. ఒక్క మాటలో – అమ్మను మఱచుటే పరమాపద యని తెలిసికొనుఁడు. అమ్మా! నీవింత నికటమందుఁ బ్రత్యక్షవుగా నున్నను, నిన్ను మఱచి జాగతికధూళు లలముకొని శాంతుల మగుచున్నాము. మాకింతకంటె విపత్తి యేది కాఁగలదు? కనుకనే, అమ్మా! "సంస్మృతా సంస్మృతా త్వం నో హింసేథాః పరమాపదః" అని ప్రార్థించుచున్నాము. దీనివలన మేము నిన్ను మాటిమాటికి స్మరింపఁగలము. తత్ఫలముగా మాకుఁ బరమస్వరూప విషయమున నడ్డంకులు రావు.

మఱొక్కమాట — ఇట్టి నీ చిఱునగవుతోడి నిర్మల ముఖమును, ఇట్టి స్నేహమయమైన యంబికామూర్తిని జగత్తునం దెల్లరు దర్శించి ధన్యులగుదురు. లోకమున దురాచారు లనఁబడువారెల్లరును ఈ స్తుతిసహాయమున నీ నిత్యప్రసన్నత నొందగలరు. తత్ఫలముగా ధన దారాదులనెడి భోగమును జ్ఞానైశ్వర్యములనెడి యపవర్గమును బడసి ధన్యులగుదురు. ఈ జీవజగత్తు మరణశీలమైనను, నీ కృపచే నమరత్వము నాస్వాదించును. నీ వీ విధముగాఁ బ్రతి జీవహృదయమందును భోగమోక్షము లొసఁగూర్చు నిత్యప్రసన్నాంబికామూర్తితో నావిర్భవింపుము. జగత్తునుండి దుఃఖరోదనము లెన్నటికిని దొలఁగిపోవును. మమ్ముఁ జూడుమమ్మా !

విచారించి చూడుమమ్మా ! నీ జీవసంతానపు మోక్ష విషయము కడుదూరము. పోనీ; భోగించుటయు నెఱుఁగదు. కేవల భోగాశతో సంచయముచేయుచు ననుక్షణము వినాశ చింతతోను, అభావపీడతోను నలిగిపోవుచున్నది. ఆకుటీరంట వసించి ముతుకయన్నముఁ దిను భిక్షుకుఁడు మొదలు రాజ భవనములందు వసించి రాజభోగములతోఁ బెరుగు ధనవంతుల వఱకు నెల్లరును అభావగ్రస్తులే. లేమిచేఁ జిక్కినవారే. ఎవ్వఁడును విషయభోగముచేఁ దృప్తినొందఁడు. భోగోపభోగ సమీపమందే యుండును. ప్రాణములొడ్డియైన భోగ్యసామగ్రిని గూర్చుకొనుచునే జీవనము గడపివేయును. నిజముగా భోగించుటైన నెఱుఁగఁడు. కనుకనే నీ వొక్కసారి భోగమయీమూర్తితో దర్శనమిమ్ము. మనసార నొక్కసారి మాతృస్నేహమనెడి విషయమును భోగించి తృప్తులమగుదుము. ఈ విశ్వమునుగ్రమ్మిన

వెల్లాఁకలి యడఁగిపోవును. అపుడు నీవు అనాయాసముగా జ్ఞానైశ్వర్యముతోఁ గూడిన యపవర్గప్రదాయినీ మూర్తితో నిన్ను వెలయించుకొని జీవుల కమరత్వాస్వాదము భోగింపఁ జేయుము. అమ్మా! మా యీ క్షుద్రబుద్ధులకుఁ గోరఁదగిన దింతయు లేదు. నీ వేమియు మిగుల్ప లేదు. కేవలము నీ చరణము లందుఁబడి, అమ్మా! విశ్వమునకు మంగళమగుఁగాక యని చాల మొఱపెట్టుచున్నాము.

ఓం ఋషిరువాచ ఓం.

ఓం. ఇతి ప్రసాదితా దేవై ర్జగతోఽర్థే తథాత్మనః।
తథేత్యుక్త్వా భద్రకాళీ బభూవాంతర్హితా నృప॥ఓం. 34

ఋషి యనెను:— రాజా! సురథ! దేవతలచే నిట్లు స్తుతింపఁబడి ప్రసన్నయై జగద్ధాత్రి దేవి, 'తథాస్తు' అని యంత ర్హిత యయ్యెను.

వ్యాఖ్య:— జగన్మంగళార్థము అనాదికాలమునుండి దేవబృంద మీవిధముగా దేవిని ప్రసన్నఁ జేసికొను నుద్దేశ్య ముతోఁ బలువిధముల సాధనలను - స్తవస్తుతులను జేసిరి. జగములకు మంగళములగుటచేతనే వారికిని (వేల్పులకు) మంగ ళములగును. ఆత్మయే జగదాకారముతోఁ బ్రకాశించి యెల్ల ప్పుడు తాపత్రయదుఃఖము ననుభవించుట యనెడి కల్పితాభి నయము చేయుచుండును. ఈ దుఃఖమును దొలఁగించుటకై యాత్మనే ప్రసన్నముఁ జేసికొనుట తప్పదు. ఆత్మ మన యమ్మ నిత్యపూర్ణయు, నిత్యతృప్తయుఁ గదా. ఆమె నెట్టిదుఃఖము

నంటుము; అని యెన్నఁగల్గుటచేతనే ఆత్మకుఁ బ్రీతి కల్గును. తత్ఫలముగా నీ విశ్వము శుభము లందును. సరే, దేవతల ప్రయత్నమువలన మంగళమయి భద్రకాళి, అమ్మ ప్రసన్నయైన దని కన్గొంటిమి. దేవతలు విశ్వమంగళమును గోరికొనిరి. అమ్మయు 'తథాస్తు' అని యంతర్థానయైనది.

సాధకజీవుఁడా! ఇది కల్పనకాదు. ఉపాఖ్యానముకాదు. ఇది కేవల సత్యఘటనము. వ్యష్టియందు — ప్రతి జీవుని హృదయ మందు నిట్టిఘటన మగుచున్నటులే, సమష్టియందును దేవతా బృందము జగన్మంగళమునకై యమ్మను బ్రసన్నను జేయుట కీ విధముగాఁ బ్రయత్నించెను. ఇక్కాలమున నిట్టి సంఘటన మెవ్వరి హృదయమందును గాకున్నను, ఇట్టి సంఘటనమును గాంచుటకే కడు నుబలాటము కలిగెనేని సరళప్రాణముతో నన్వేషింపుము. అమ్మ యెదుర నిల్చి ప్రార్థింపుము. ఆ మహా సమ్మేళన క్షేత్రమును జేరఁగలవు. ఆ దేవలీలయందు సహచరుఁ డవై జీవనముఁ బవిత్రము చేసికొనఁ బ్రయత్నించినచో నేమి హాని యున్నది?

ఇది మార్కండేయ పురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
ద్వితీయ చరిత్రమున, మహిషాసుర వధానంతరము,
శక్రాది దేవతలు చేసిన దేవీస్తుతికి,
శ్రీకాకుళవాసి, శ్రీ శ్రీయానందనాథుఁడు
ఈశ్వర సత్యనారాయణశర్మ వ్రాసిన వ్యాఖ్య.
శ్రీ పరదేవతార్పణము.

శ్రీమాత్రే నమః

# సాధన సామగ్రి

## శుంభాసుర నిధనమునుగోరిన దేవతలు చేసిన దేవీస్తుతి.

మహిషాసుర వధానంతరము ఆ యపరాజితాదేవి ప్రసన్నయై "మీకెప్పుడే విపత్తి వచ్చినను నన్ను స్మరించినచో మీ యాపదల నన్నిటిని నేను దొలఁగింతు"నని వరమిచ్చినది. ఇపుడు శుంభ నిశుంభాసురుల యత్యాచారముచేఁ బీడితులై, పరాజితులై స్వర్గమునుండి నెట్టివేయఁబడిన దేవతలు, అమ్మ యభయవర వాణిని స్మరించుకొని యమ్మను స్తుతింపఁగడఁగిరి.

[దేవతలు, చైతన్యముయొక్క విశిష్టాభివ్యక్తిమాత్రములని, చైతన్య మనఁగా - చిచ్ఛక్తి (అమ్మ) యని, తాము మాత్రంక మందు (చైతన్యమందు) సర్వవిధములఁ బ్రతిష్ఠితులని - మున్నె వివరింపఁబడెను.]

చూడుము. నీ వెచట నెట్టి యవస్థయందైనను సరే, నీ విషయమున, నీ యింద్రియాధిష్ఠిత చైతన్యవర్గవిషయమున "నేను" అనెడి యహంకారమే శుంభాసురుఁడు. వీఁడున్నంత దాఁక "అమ్మ - నేను" అను రెండిటియందు నొక తెగని వ్యవధానము వెలయుచుండును. ధ్యాన ధారణాదులే కానీ, సమాహితావస్థయే కానీ, నీ సూక్ష్మాహంకారము నిర్మల మాతృవక్షమునుండి నిన్ను దవ్వు నెట్టివేయును. నీ హృదయసింహాసనమునందు, ఈ యస్మిత యనెడి శుంభాసురుఁడెక్కి కూర్చుండి,

నిన్ను హృదయరాజ్యమునుండి తొలఁగించు టే, శుంభుని(అస్మిత) యత్యాచారము. వాని తమ్ముఁడు నిశుంభుఁడు (మమత).

ఇంతవఱకు, మధుకైటభ మహిషాసురపీడ (బహుత్వ వాంఛ, బహుత్వానందము, రజోగుణము, తజ్జన్యసంస్కారములు, అనువానివలని పీడ) మాతృకృపచేతను, శ్రీగురుని యవ్యాజ కరుణచేతను స్థూలేంద్రియాత్యాచారము, స్థూలాహంకారము తొలఁగినవి. కాని, అస్మిత, మమత (శుంభ నిశుంభుల) వలని పీడ సైఁపలేక, నాఁటి వరదానమును స్మరించి, స్తుతించు చున్నారు. ఈ యహంత (అస్మిత) విజ్ఞానమయకోశము నంటిన యహంకారము.

సాధకులారా! రండు; దేవతలవలెనే మనమును, అమ్మా! అమ్మా! యని యేడ్తము. మన కాతరక్రందనముచే అమ్మ స్నేహవిహ్వలయై యీ దుర్జయాహంత చేతినుండి తప్పించి రక్షించును. మనకు రాఁబోవు విపత్తి అమ్మ యెఱుఁగును. కనుకనే పరిత్రాణమును సూచించినది. పరమాత్మస్వరూపము నుండి దూరమైపోఁగలరు బిడ్డలని యెఱిఁగియే తల్లి వరదానము చేసినది. రండు; తల్లిని స్మరింతము.

అని బుద్ధిని స్థిరపఱుచుకొన్న దేవతాగణము, కొండల రాయఁడైన హిమవంతుని కడఁజేరి, దేవిని విష్ణుమాయను (హైమవతిని) స్తుతింపఁ దొడఁగెను.

దేవతలు హిమాచలమునకుఁ బోవుట యను దాని రహస్యము—— దేహాత్మ బోధమునకు దిగుటే (హిమాలయము దేహాత్మబోధము). సూక్ష్మ విజ్ఞానమయకోశమందు అసురుల

యత్యాచారముల ననుభవించి దేవతలు స్థూలమందు (దేహాత్మబోధమందు) అవతరించిరి. దేహాత్మ బోధము లేక స్త్వాదులు కాఁజాలవు. స్థూలదేహముతోనే సర్వకర్మములు పూర్ణములగును. కనుకనే దానికి 'ధర్మక్షేత్రము, కురుక్షేత్రము' అని పేరయ్యెను. సూక్ష్మదేహమందెట్టి కర్మములును గాఁజాలవని యెఱుంగవలయును. ఈ స్థూలదేహముతోనే యగు కర్మసహాయముచేత, తీవ్ర వేగావలంబనముచేసి, సూక్ష్మక్షేత్ర పర్యంతము నతిక్రమించి, విశుద్ధ బోధస్వరూప పరమాత్మక్షేత్రమందుఁ జేరికొనఁగల్గును. కనుక, స్తుతిమంగళపాఠము సర్వశ్రేష్ఠ సాధనము.

ఓం. నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః ।
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాస్మతామ్॥ఓం. 1

దేవికిఁ బ్రణామము. మహాదేవికి శివకు నిరంతరము మా మ్రొక్కు. భద్రాప్రకృతికి మా జోత. మేమందఱము నా మనోవాగగమ్యకు మ్రొక్కుచున్నాము.

వ్యాఖ్య:— చూడుఁడు; అమ్మను దేవతలు స్తుతింప నారంభించి తొలుదొల్త నమః యనుచు, అహంతాపూర్వకముగా వినతియొనర్చిరి.

తొల్త మాతాపిత్రాది గురుజనమునకును, దరువాత దేవమందిరములకును, అందలి దేవతలకును మ్రొక్క నేర్చికొన్నాము. శిరమునం దంజలిఘటించియో, తల నేలమోపియో, కట్టెవలె మేను నేలవ్రాల్చి సాష్టాంగ దండప్రణామము చేయు

నపుడో, ప్రణమిల్లితి మనుకొనుచున్నాము. ఇది వాస్తవిక ప్రణామమా? ప్రణామ మెంత యున్నత విజ్ఞానమందు నెలకొల్పఁబడినదో, యా తత్త్వ మెన్నండే నాలోచించితిరా? అహంతయొక్క నిక్కిన తల (దేహాత్మబోధ గర్వితశిరస్సు) వంచుటకుఁ బ్రణామముతో సరివచ్చు సులభోపాయము మఱేదియు లేదు. కనుకనే మనము రేవగళ్లు సంసారమునకు దాసులమై, రోగశోకానుతాపములచేఁ బీడింపఁబడుచున్నాము. ప్రణామరహస్యము మఱచుటవల్లనే నేఁడీదేశజనులు, పడరాని వారి కాళ్లపైఁ బడుచున్నారు. ప్రణామము చేయ నెఱిఁగిన వార లెన్నఁడును, నెవ్వరి పాదములకును మ్రొక్కరు. 'భిక్షాం దేహి' యనుచు నొరుల గుమ్మములకడ నొరఁగరు.

ఒక ప్రకృష్టమైన విధమున నవనతులగుటపేరే ప్రణామము. "నేను" అనుచు నజ్ఞానభారమునే యెత్తుకొని జ్ఞాన గర్వముతోఁ దల నిక్కించుచున్నాము. ఆ యహంతాబోధమును (అజ్ఞాన భారమును) జ్ఞాన సమీపమునఁ బూర్తిగా నవనతము చేయుటే యథార్థ ప్రణామము. ఆ యజ్ఞానమును, దానితోనే చేరియుండు నసమర్థతా దీనతా దుర్బలతలను సర్వ నియంత చరణములందు వంచనివానిది ప్రణామమే కాదు. కావుననే "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" ప్రణిపాత పరిప్రశ్న సేవలనెడి మూడుపాయములచేఁ దత్త్వదర్శులైన మహాపురుషులవలనఁ దత్త్వజ్ఞానగ్రహణము చేయువలయునని చెప్పఁబడినది. మొట్టమొదటిది ప్రణిపాతము. అహంకర్తృత్వ జ్ఞానమును బూర్తిగాఁ బడఁగొట్టుటే యథార్థ ప్రణిపాతము.

"అనునయ ప్రణతౌ ప్రకర్షేణ భక్తిశ్రద్ధాతిశయేన నీచైః, పతనే దీర్ఘనమస్కారే దండవత్పతనే ప్రకృష్టో నిపాతః"

ఇది కానంతదాఁక మనకు ప్రణామముచేయుట తెలియదన్నమాటయే. కనుకనే బ్రహ్మవిద్యాలోచనము జగత్తత్త్వవిశ్లేషణ మనిరి. ఆత్మసాక్షాత్కారము, భగవత్ప్రాప్తి మున్నగు పెద్దపెద్దమాటలు విను నధికారము పొందు నధికారము కలుగకమున్ను గొన్నాళ్లు కేవల ప్రణామముచేయుట యభ్యసింపవలయును. జీవితపర్యంతమగు కఠోరసాధన ఫలముగా నొక్కసారియైనను ప్రణామముచేయుము. జీవితమం దొక్కసారి యొకముహూర్తమందైనను ప్రణామము చేయఁగల్గినచో జీవితము సఫలమగును. సాధకా! నీవు శిరస్సు వంచు; వంచకపో; అహంతాశిరస్సు దేనిచే వంగునో యది చూడవు. ప్రయత్నింపవు. ఈ విశ్వమందలి సూక్ష్మతమ కీటాణువు మొదలుగా నీశ్వరపర్యంత మన్నియు నీ గురువులే; అన్నియు అమ్మయే (ఆత్మయే) – అంతయు నీకుఁ బూజ్యమే, యనుచు సహస్రభావములతో, సహస్ర శిరస్సులతో నమ్మకుఁ బ్రణామములు చేయుచుండుము. భయపడకు. ప్రణామము చేయుటకు నీవు దీనుఁడవు, హీనుఁడవును గావు. చేయవలయును. అంతేగాక జగత్పిత కీవిధముగాఁ బ్రణామము చేయఁగల్గినచో, మఱెన్నఁడు నెవ్వరికడ, నీకుఁ దలవంచు పని పడదు. కేవల జగన్నాథునకుఁ బ్రణామముచేయ నప్పుడే, మనుజులయ్యు విషయముల యభావబోధము తొలఁగదు.

ప్రణామము చేయునంతమాత్రాన జీవున కెట్టి యున్నతి ప్రాపించునన్నది విచారింతము. నీ వెవరికైనను బ్రణామము

చేసినంతనే నీలో నొక గురుత్వభావ ముదయించును. ఎవనికి నేను బ్రణతుఁడనో, యతఁడు నాకంటె శ్రేష్ఠుఁడు, అనెడి శ్రేష్ఠత్వభావము మనసునం దొకవంక నుబుకును. తోడ్తోనే మఱియొకవంక, నే నతనికంటె నపకృష్టుఁడ ననెడి భావము వికసించును. తత్ఫలముగా నీకే లాభము. ఒకవైపు శ్రేష్ఠత్వభావమును, మఱొకవంక నహంబోధమింత యణఁగుటయు నగుటచే నీకే యధికలాభమగుట నిశ్చయము. ఏమన నిట్టి ప్రణామము చేయఁజేయఁ జిత్త మున్నతభావముతో నిండిపోయి, యహంకారమనెడి శత్రువు తల యెత్తకుండును.

ఈ సందర్భమున నొకమాట. ఇప్పటి పాశ్చాత్యశిక్షాభిమానులు, కొందఱొక మనుష్యమాత్రుని గురువని, యీశ్వరుఁడని ప్రణామముచేయుట మూర్ఖత్వమని తలంతురు. ఔరా! వార లిది యెఱుఁగరు. ఏమన – యథార్థముగా నీశ్వరు నొందఁ బ్రయత్నించువా రెవ్వరినో యొకరిని, గురువుగానో యీశ్వరరూపముగానో పరిగ్రహింపవలయును. వానిని బ్రత్యక్షేశ్వరునిఁగా నెంచి నమస్కరించి పూజించి, యహంతాజ్ఞానము నణఁచుకొనవలయును. ఆధ్యాత్మికరాజ్యమందు విచరించుట కిదియే ప్రవేశ ద్వారము. అక్షరములు నేర్చుకొన్నప్పుడు బాలుఁ డుపాధ్యాయుని యుపదేశమును దా విచారింపకే మన్నించునటులు, ఆత్మరాజ్యమందుఁ బ్రవేశింపఁగోరు సాధకులొక మనుజు నీశ్వరరూపముగా మన్నించుటయు, వాని పాదములయం దనాది జన్మసంచితమైన తమ యహంతాభావమును బూర్ణముగా నర్పించుటకై సదా ప్రయత్నింపవలయును. అది యొక్కటే భగవత్ప్రాప్తికైన యుపాయము. శ్రుతియు

"ఆచార్యవాన్ పురుషో వేద" యనుచున్నది. గురుప్రాప్తియైన వారే యాత్మ నెఱుంగఁగలరు.

మఱి యొకమాట— ఒక తత్త్వదర్శిపురుషునివలన నొక విశిష్టోపదేశమో, దీక్షయో పొందినంతనే గురుప్రాప్తి కాదు. గురువునం దీశ్వరజ్ఞానముంచి, యతఁడే యన్నిటికంటె నాకుఁ బ్రియమును వాంఛనీయవస్తువు ననెడి భావము సర్వదా వఱలుచుండువారే యథార్థసద్గురువు నొంది ధన్యులగుదురు. యథార్థముగా సద్గురులాభ మొందినవారి కేకట్టి భీతియు దుశ్చింతయుఁ గలుగదు. ఇట్టిగురుప్రాప్తికై యన్నిఁటికన్న మున్ను బూర్వోక్త ప్రణతిక్రియనే యాశ్రయింపవలయును. ఆ ప్రణామ మెంత సత్యమై, యెంత సరళమై, యెంత యకృత్రిమమై యుండునో, అంత వడిగా నభీష్టసిద్ధినొంది చరితార్థులగుదురు. ఇదే ప్రణామ రహస్యము. ఇదే ప్రణామమాహాత్మ్యము. కనుకనే సాధకుఁడు తత్త్వకథలను వినుటకు మున్ను, కేవల సరళబుద్ధితోఁ బ్రణామము చేయు టభ్యసించి, తన యహంతాభావమును గురు చరణములయం దర్పింపవలయును. అపుడు జీవితము నిజముగా నానందమయమగును.

అది యుండనీ – మనమును దేవతలవలెనే "నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః" అనుచు శ్రీ మాతృస్తుతి మంగళపాఠములతోఁగూడ ఆత్మాభిమానబోధమును మాతృ చరణముల కుపహారముగా నీయఁ బ్రయత్నింతము.

"నమో దేవ్యై" – దేవికి నమస్కారము. స్వయంప్రకాశ శీలయు, సృష్టి స్థితి ప్రలయ తిరోధానానుగ్రహములనెడి యైదు

క్రీడలను జలుపునదియు, జీవ జగదాకారముతో - విశ్వమూర్తితో నిరంతరము వెలయునదియు నైన తల్లియొక్క స్థూలమూర్తికి మా ప్రణామము.

"మహాదేవ్యై శివాయై సతతం నమః"— అనిర్దేశ్య సూక్ష్మ మహామూర్తితో జగత్తును ప్రకాశింపఁజేయునదియు మంగళమయియునైన మహాదేవికి సర్వదా మా ప్రణామము. స్థూలమూర్తికిఁ బ్రణమిల్లుటకుఁ గర శీర్షాది సంయోగ రూపమైన బాహ్యక్రియ తప్పదు గాన, సతత ప్రణామము జరుగదు. కాని, తల్లియొక్క సూక్ష్మ జగదాధార మహామూర్తికి, ఈ జీవులెల్లరు, తెలిసియో తెలియకో, యప్రయత్నముగా సర్వదా ప్రణామము చేయుచునే యున్నారు. జాగ్రత్ స్వప్న సుషుప్తులనెడి మూడవస్థలందును, నిటులేదో యొకటి చేయుచునే యున్నారు. దానివలన నా మహాశక్తికి నిరంతర పూజా ప్రణామములు జరుగుచునే యున్నవి. కనుక నామె సతత ప్రణామయోగ్య. ఆ నిత్యప్రణామయోగ్య మంగళమయి మహాదేవి చరణములకు జ్ఞానముతోఁ బ్రణతుల మగుచున్నాము. అమ్మా! మా ప్రణామము లందుకొమ్మ.

"నమః ప్రకృత్యై భద్రాయై"— మంగళమయ ప్రకృతికి మా మ్రొక్కు. పూర్వోక్త స్థూల సూక్ష్మములకుఁ గారణమైన యా మూలప్రకృతిరూపిణి తల్లియే భద్ర - సంతానమునకు శుభము లిచ్చునది. జీవుఁడామె కృపచేతనే (ప్రకృతికిఁ బరమై) స్థూల సూక్ష్మముల కతీతక్షేత్రమైన ముక్తి మహాప్రాంగణమందుఁ జేరును. ఇట్టి భద్రాప్రకృతికి మాప్రణామము. ఈమె యవ్యక్త. ఒకప్పు డొక భాగ్యవత్సాధకుఁ డీమె సంధా

నము నొంది, చరణములం దవనతుఁడు కాఁగలఁడు. పాలన కర్త్రియైన యామెకు సంయతులమై ప్రణమిల్లుచున్నాము. అనఁగా నింద్రియవృత్తులను జక్కఁగా నియమించి, వాఙ్మనసుల కగోచరమైన యామెకు మ్రొక్కుచున్నాము. ఆమె యెవరో మాటతో వ్యక్తపడదు. మనసుచే ధారణ చేయఁబడదు. స్థూలసూక్ష్మకారణాతీత; అజ్ఞేయ; జ్ఞ స్వరూప; నిత్యసత్యస్వరూప; ఆ జననికి నమస్కారము.

ఈ మంత్రమందు దేవతలు తొలుత "నమో దేవ్యై" యనుచు నమ్మ స్థూలమూర్తికిఁ బ్రణమిల్లిరి. "మహాదేవ్యై శివాయై సతతం నమః" యనుచుఁ దల్లి సూక్ష్మస్వరూపమునకు మ్రొక్కిరి. "నమః ప్రకృత్యై భద్రాయై" అనుచుఁ గారణరూపజనని కెరఁగిరి. "నియతాః ప్రణతాః స్మతామ్" అను మాటతో, స్థూల సూక్ష్మకారణాతీతయై తత్పదమాత్రగమ్యయైన నిర్గుణస్వరూపకుఁ బ్రణమిల్లిరి. ఇంద్రియవృత్తులు లెస్సగా నియమింపఁబడక, యా నిరంజన సత్తాభాస మించుకంతయు నొందఁబడదు, గాన నామెకు మ్రొక్కుటకు నియతేన్ద్రియులు కావలయును. ఈ యధ్యాయము ప్రణతిప్రధానము.

సాధకులారా! మనము నీ విధముగానే యమ్మకుఁ బ్రణమిల్ల నలవాటుపడినచో ధన్యుల మగుదుము.

ఓం. రౌద్రాయై నమో నిత్యాయై గౌర్యై ధాత్ర్యై నమో నమః।
జ్యోత్స్నాయై చేందురూపిణ్యై సుఖాయైసతతంనమః॥ ఓం. 2

రౌద్రాయై - భయానకమైన నీకు నమస్కారము; నిత్యాయై - ధ్వంసావిర్భావములు లేనట్టియు, గౌర్యై

ధాత్ర్యై - జగదాధారరూపయు, జ్యోత్స్నాయై - చంద్రికా రూపిణియు, ఇందురూపిణ్యై - చంద్రరూపిణియు, సుఖాయై - సుఖదాయినియు సుఖస్వరూపయు నైన నీకెల్లప్పుడు నమస్కారము.

వ్యాఖ్య:— రుద్రశక్తికి - సంహారరూపిణీ మహాశక్తికి; వెనుకటి మంత్రమందుఁ జెప్పఁబడిన త్రిగుణాతీత, భావాతీత, లెప్పనగమ్య నిరంజనయైన తల్లికి మనముచేయు నమస్కారము చాలసేపుండదు. వెంటనే జగద్భావమునకు దిగును; ఆ సమయ మందు, అమ్మయొక్క రౌద్ర (సంహారిణీ) తామసీమూర్తి మాటయే మొదట మనసునకుఁ దట్టును. కారణమేమన— ప్రకృతిత సత్తను జేయుట సంహారిణీమూర్తి నాశ్రయించియే యగును. కావున 'రౌద్రాయై నమః' అంచు ప్రళయకారిణీ మహాశక్తి ప్రణామమే యైనది. అనఁగా - ప్రళయ కుక్షిగత సర్వభావముల యంతరాళమం దుపలబ్ధమగు వస్తువే నిత్యము; దానికి క్షయోదయములు, హానివృద్ధులు లేవు. అచట శుద్ధ సత్త్వగుణమే వెలయును. ఆ స్వరూప మత్యంత రమణీయము. కనుకనే గౌరీనామము చేకొనఁబడినది. తర్వాత సర్వజగ త్స్వధారణభావము బయల్దేరెను. కనుకనే ధాత్రీనామ ప్రయో గము. ఇటులు ధాత్రీ పర్యంతము ప్రణామముచేసి, చంద్రికా చంద్ర రూపిణీ యగు తల్లికిఁ ప్రణామము చేయుటగును. 'ఇందు'— మనస్సు, 'జ్యోత్స్న'— వ్యాపకశక్తి, అనఁగా సర్వతో వ్యాసిత విషయ సమూహము - మనస్సు విషయ ములను అభిన్నములు. ఈవిధముగా సర్వత్ర సర్వభావములను బట్టియే, అమ్మను ప్రణమిల్లి దర్శించువారల చెంత సర్వావస్థ

లందును, అమ్మయొక్క సుఖమయమూర్తి వికాసమే యగును, గావుననే "సుఖాయై సతతం నమః" యనిరి.

"యోవై భూమా తత్సుఖం మహాన్" అన్నదే సుఖము. అమ్మ మనోరూపముగా, దిక్కాలరూపముగా, విషయ రూపముగాఁ దనను గల్పించుకొనునపుడు, అనఁగా సిందురూప ముతో జంద్రికారూపముతోఁ బ్రకాశించునపుడే యామె సుఖస్వరూపము విశేషించి వెలయును. మహత్త్వోపలబ్ధియే సుఖము. పక్షాంతరమున – అణువుగాక మహత్తుగాక యుండు నది పరమార్థముచే సుఖస్వరూపమైనను, సుఖవిశిష్టభావముతో భోగ్యము కాదు. ఏలన— భోక్తృ భోగ్య భావ మచట లేదు. కాన, విశిష్టసుఖభోగమునకై మహత్త్వోపలబ్ధియే కావల యును. తల్లి విరాణ్మనోరూపముతోఁ దన్నుఁ గల్పించు కొన్నపుడే (జీవుఁ డీశ్వరత్వమందుఁ జేరునపుడే) యీ మహ త్స్వరూప మాస్వాదింపఁబడును. ఇఁక సాధారణజీవులు విషయ భోగమువలన (ఇంద్రియ భోగ్యవస్తువుల వలన) అత్యల్పమాత్ర సుఖాభాసమునే పొందుదురు. కనుకనే, తెలిసియో తెలియకో యెల్లరును సుఖమునకే దేవులాడుదురు. సుఖమునే సేవింతురు. కనుకనే సర్వజీవులు నిరంతరమీమెకే ప్రణమిల్లుదురు. ఈ తత్త్వ మును లక్షించియే దేవతలు "సుఖాయై సతతం నమః" యనిరి.

సాధకజనులును నిష్ఠే యీ యమ్మ నడుగడుగున ననుభ వింతురు. తొలుత స్థూల విశ్వరూపమందును, పిదప సూక్ష్మ మహాశక్తిరూపమందును, దర్వాత నవ్యక్తకారణ (బీజ) రూపమందును, చిట్టతుదను గుణాతీత నిరంజన స్వరూప మందును, నీ విధముగా నే భావమం దవతరింతురో, యది

యిమ్మంత్రమందుఁ దేఁటపడుచున్నది. గుణాతీత స్వరూపము కంటె మున్ను సంహారిణీశక్తియం దవతరింతురు. తోడనే నిత్యత్వానుభవమును, సత్యగుణోద్బోధమును నగును. ఇదే గౌరీమూర్తి. క్రమముగా జగద్బీజములను ధరించు ధాత్రీమూర్తి; తరువాత మనోవిషయములందు (చంద్ర చంద్రికా మూర్తి) అనఁగా జగద్భావమందు దిగుదురు. అపుడు జగద్భావముతోనో, జగదతీత భావముతోనో, యఖండసత్తా సంధానమునొంది, బహిరంతరములందు — వ్యక్తావ్యక్తములందు, స్థూలసూక్ష్మములందు నంతట నానందమయసత్త ననుభవించి "సుఖాయై సతతం నమ" యనుచు ధన్యులగుదురు.

చూడుఁడు— దేవతలవలె స్వర్గభ్రష్టులైనను, బరాజితులై సర్వముం గోలుపోయినను, మీరును సకల బ్రహ్మాండము ధ్వంసమైనను, సకల బ్రహ్మాండ కర్తృత్వము లభించినను "సుఖాయై సతతం నమః" యనుచునేయుందురు. అందుచేత సుఖముతక్క మఱొక్క వస్తువు లేనేలేదు. మనము సుఖమనుకొన్నదియు, సుఖమాత్రమేయని తెలియలేనందుననే, యసుఖభయముతోఁ బరుగులెత్తి యెక్కడనో సుఖమున్నదనుకొనుచున్నాము.

ఓం. కల్యాణ్యై ప్రణతాం వృద్ధ్యై సిద్ధ్యై కుర్మో నమోనమః ।
నైఋత్యై భూభృతాం లక్ష్మ్యై శర్వాణ్యై తే నమోనమః॥ ఓంఠ

కల్యాణస్వరూపకు (మంగళమయికి) నీకుఁ బ్రణామము. వృద్ధిసిద్ధి స్వరూపిణికి నమస్కారము. అలక్ష్మీస్వరూపిణికి నీకు

నమస్కారము. రాజలక్ష్మికి - శ్వేతచ్ఛత్ర చామరరూపిణికి నీకు నమస్కారము. (లేదా) పర్వతలక్ష్మికి నీకు నమస్కారము. శర్వాణ్యై - మాహేశ్వరికి నీకు నమస్కారము. మానసప్రత్యక్షు యగుటవలన "తే" యని యుష్మచ్ఛబ్ద ప్రయోగము.

మంగళమయి - మంగళదాయినీ స్వరూపిణి, తల్లికొక్క నమస్కారము చేయఁగల్గినచో మఱి యమంగళము లుండవు. తల్లి యెవనిచెంతఁ గల్యాణమూర్తితోఁ బ్రకటిత యగునో వానికి బుద్ధి, సిద్ధి (అభ్యుదయము, సఫలత) లభించును. అనఁగా, ఆ రూపములతో, సంసారక్షేత్రమందును సాధనక్షేత్ర మందును అమ్మ వెలయుననుట, సాధకుఁడే కాని సాధారణుఁ డెఱుంగలేఁడు. అట్టివారికిని జ్ఞానప్రదానము చేయుటకే, అమ్మ ప్రతికూల శాసనమయమూర్తితో నావిర్భవించును. అపుడే యామెకు 'నైఋత్యై' (రాక్షసి) యని పేరు. అపుడట్టి వారల కార్యప్రణాళి, యాచార వ్యవహారములు రాక్షసమే యగును. రాక్షసీమూర్తిఁ దాల్చిన తల్లి యొడిలో నున్న సంతానము, కేవల స్థూల విషయభోగములనే యాశించి, యాహార నిద్రా భయాది పశుధర్మమునే యనుసరించుచుఁ దనియుచుండును. గీతలయందును —

"అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।
పరం భావ మజానన్తో మమ భూత మహేశ్వరమ్॥

క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు ।
తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్॥

ఆసురం యోని మాపన్నా మూఢా జన్మని జన్మని ।
మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాంగతిమ్॥"

మనుష్యశరీరము నాశ్రయించిన నన్నవమానించువారు (నేనుగా నేనును గుర్తింపనివారు) ఆసురప్రకృతి నొందుదురు. కనుక నొకవంక అమ్మ తన కల్యాణమూర్తిని ప్రకటించి మనుజులకు వృద్ధి సిద్ధ్యాది సాఫల్యము నిచ్చుననియు, అటులే మఱియొకవంక నైఋృతీమూర్తిని ప్రకటించి, రాక్షసీ రూపముగాఁ బరిణతి నొందుననియుఁ దెలియును. అమ్మా! నీవు అనిర్వచనీయవు. కేవలము నీయందే పరస్పర విరుద్ధములైన రెండు ధర్మములు, ఒక్కసారియే సంభవించుచున్నవి. నీకుఁ బునః పునః ప్రణామములు.

"భూభృతాం లక్ష్మీః" – రాజలక్ష్మిగానైతము నీవే వెలయుదువు; కాని భూభృల్లక్ష్మీపదమునకు నీ కృపచే మఱియొక యర్థము తోఁచుచున్నది. భూశబ్దమునకు క్షితితత్త్వమును, భృత్ – ధారణ కారిణః – క్షితితత్త్వమును ధరించినవారనఁగా – క్షితితత్త్వ పర్యంతము నహంతా బోధముతోఁ జేర్చినవారే భూభృత్తులు. కనుక భూభృచ్ఛబ్దార్థము – జడ దేహాభిమాని జీవుఁడు. వాని లక్ష్మి యనఁగా – చిద్వస్తువు. జీవ దేహమందుఁ జైతన్య సత్తాభివ్యక్తి యుండునంతదాఁక, ఆ శోభాయమాన రూపము తెలియఁబడుచుండును. మృత దేహమునకుఁ బలువిధముల వస్త్రాలంకారములఁ గూర్చినను శోభింపదు, కనుకనే బ్రతికియున్నవారి పేళ్లముందు శ్రీ శబ్దము వ్రాయు నియమము; కనుకనే అమ్మా! నీవు జడత్వాభిమాని

జీవులకుఁ జైతన్యరూపముతోను - ప్రాణరూపముతోడను లక్ష్మీరూపముతోను వెలయుదువు. ఇదే నీ భూభృల్లక్ష్మీ మూర్తి.

మఱియు శర్వాణి (ప్రలయదేవతయైన శర్వుని శక్తి) రూపముతో నీవే సమస్తమును ప్రలయకాలమందు గ్రసించుచున్నావు. ఈ విధముగ నీవు భూభృల్లక్ష్మివై అనఁగా జీవ చైతన్యరూపముతోఁ బ్రకాశించి యసంఖ్య జన్మధారణము చేసి, మఱల శర్వాణీరూపముతో సమస్తము మృత్యు భయంకర గ్రాసమునకుఁ బ్రేరణము చేయుచున్నావు. ఒకవైపు నీకల్యాణమూర్తి; వృద్ధి సిద్ధిరూపిణి; మఱియొకవైపు నీ నైఋతి మూర్తి; జన్మమృత్యు సంసారధర్మరూపిణి. కేవల పరస్పర విరుద్ధములైన నీ మూర్తులకు మా ప్రణామము. ఈ మంత్ర మందు, 'తే' అను మాటకు, నీకు అని యర్థము. సమ్ముఖమం దమ్మను జూడఁగల్గుటచే యుష్మచ్ఛబ్దప్రయోగము. సత్యప్రతిష్ఠ చేయలేనివార లీ తత్త్వమును సులభముగా నెఱుంగ లేరు.

ఓం. దుర్గాయై దుర్గపారాయై సారాయై సర్వకారిణ్యై ।
ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతంనమః॥ఓం. 4

దురధిగమ్యవును, త్రాణకారిణివియు, సర్వశ్రేష్ఠవు, సర్వజననివియు, ఖ్యాతిరూపవును, కృష్ణవర్ణవును, ధూమ్రవర్ణవు నైన నీకు నమస్కారము.

అమ్మా! నీవు దుర్జ్ఞేయ తత్త్వస్వరూపవు. ఏలన, జ్ఞాతృ జ్ఞేయ బోధ ముండునంతదాఁక, నీ యథార్థస్వరూపము

తెలియఁబడదు. నీవు దుర్గపారవు — సంసారము నావలిగట్టు నీవే చేర్తువు. సర్వభావాతీతమైన నీ సమ్యక్స్వరూపము నాశ్రయింపనంతసేఁపు, దుర్గమ సంసారమునుండి యేవిధమైన పరిత్రాణమును లేదు. మఱియు నీ సంసారక్షేత్రమందు సర్వభూతములలో వెలయు నీ స్వరూపము చంచలతామయము. పరివర్తనశీలము; కావున నసారమైనను నీవు సారవు, అనఁగా స్థిరాంశ స్వరూపిణివి. ఇంత గొప్ప వైచిత్ర్యముతోఁ గూడిన చంచలజగత్తు, ఏ సత్తపై నిల్చియున్నదో, అది నీవే. కాన నీవు సారవు, నిత్యవు, సచ్చిదానంద స్వరూపిణివి.

అమ్మా! నీవు సర్వకారిణివి. సృష్ట్యాదులైన సర్వభావములను నీవే వెలయించుచున్నావు, గాన సర్వకారిణివి, అన్నంతనే నీ పరమేశ్వరీమూర్తికథ తలఁపునకు వచ్చును. చితిశక్తి స్వరూపిణివైన నీవే స్వరూపముచే నిర్గుణవు, కనుక నీ వెన్నఁడును సర్వకారిణివి కాఁజాలవనియు, ప్రకృతియే సర్వకారిణి యనియుఁ బలుకువారు; మాయను (ప్రకృతిని) నీతోఁ బూర్తిగా నెడపెట్టుచున్నారు. కార్యముచే నద్వితీయత్వభంగ మగుచున్నది. మాయను సత్తాహీనయు, అనిర్వచనీయయు, అజ్ఞానస్వరూపయు నని భావించి యద్వితీయత్వమును రక్షించుటకుఁ బ్రయత్నించుచో సర్వ సందేహములు తొలఁగునా? వర్తమానజగత్తు యుక్తిని జూచును, యుక్తి తర్కముల సాయముతో స్వీకరింపలేనివారు, ఇట్టి విషయము వేదసమ్మతమైనను, ఆదరపూర్వకముగా గ్రహింపలేరు. కావున నీ పరిచ్ఛిన్నయుక్తి ప్రమాణముతోనే తెలియఁ బ్రయత్నింతురు. నిన్నెఱుంగుటయు నిన్నొందుటయు నీ కృపలేక జరుగదు.

ఇట్టియాలోచన మెందులకుఁ జేయుదురో? నీకృపనే యాశించి నపుడు జిహ్వాజడత్వము బుద్ధిమాలిన్యము తొలఁగును గదా.

అమ్మ యను వస్తువేదో యిప్పుడెఱుంగఁజాతము. కేవలానందమే యమ్మ స్వరూపము. శ్రుతి "ఆనందం బ్రహ్మణో విద్వాన్, నబిభేతి కుతశ్చన" అనుచున్నది. ఆనందమే బ్రహ్మము స్వరూపము. ఆనందవస్తువు ననుభవ మింతయో యంతయో జీవమాత్రునకుఁ గలదు. జగత్తున గమ్యవిషయము పొందఁబడెనేని క్షణకాల మొక యానందభావము హృదయమునం దుబుకును. ఒక్కసారి యీ భావమును స్మరింపఁ బ్రయత్నింపుము. క్షణికానందాభాసము జన్యానందము, అనఁగా విషయేంద్రియసంయోగమున నైన యొకవిధమైన చిత్త వికారముమాత్రమే. స్వరూపానందాభాసమే విషయానందము. ఎచట నెట్టి విషయసంస్పర్శమును లేదో, చింత లేదో, భావన లేదో, త్యాగము లేదో, గ్రహణము లేదో, చూచుట వినుట మున్నగు వ్యాపారములు లేవో, కేవల మానందమే కలదో, యట్టి వ్యవస్థయందు నీ వే స్వరూపమును జేరుదువో, యదే యమ్మ స్వరూపమని యెఱుంగుము. ఇంకను ముందునకు నడువుము. ఆనంద మొకవిధమైన యనుభవము (బోధము). మన బోధము ఆనందస్వరూపముగాఁ బ్రకాశించునపుడే అనంద వస్తువు ననుభవము చేయఁగల్గుదుము. అది కేవలానుభవానంద స్వరూపము. ఆ కేవలానందస్వరూపమునం దెట్టి భేదమును లేదు. తెలియఁబడదు. అనఁగా దానికి సజాతీయమైన మఱి యొక యానందదాయక వస్తువు లేదు. "ఆ యానందమునకు విజాతీయమైన దేదే నున్నదా? ఉండునా?" యనెడి యిట్టి

యుపలబ్ధియు లేదు. మఱి దానియందు స్వగతభేదమును లేదు. అనఁగా దానియం దెట్టి యంగాంగిభావముగాని, భోక్తృ భోగ్యాది భావముగాని లేదు. కేవల విశుద్ధానందమే. దీనినే శ్రుతి "ఏకమేవా ద్వితీయమ్" అన్నది. ఈ యానందము నకు మఱియొక పేరు ప్రేమరసము. వేదమునందు "రసోవై సః" యను మాటచే నిర్దేశింపఁబడినది. ఇచట – ప్రేమ ప్రేమిక ప్రేమాధారమునం దెట్టి భేదమును లేదు. రసిక రస రస్యరూప మైన విభిన్నత లేదు. కేవల ప్రేమము. కేవల రసము. ఏ భాషతో దీనిని దెలియఁజెప్పుట ? అది భాషకు వెలిది. అందుకే వేదము "అశబ్ద మస్పర్శ మరూప మవ్యయమ్" అన్నది. 'నేతి నేతి' యనుచు మాటలతోను బోధించుట కెంతో ప్రయత్నించినది. ఇదే మన తల్లి నిర్గుణస్వరూపమని యెఱుంగవలయును. ఇచటఁ గేవలానందము తక్క నెట్టి విశిష్టతయు, అనఁగా భావరంజనము లేదు. కనుకనే, అమ్మ నిత్యశుద్ధ నిరంజన మైనది.

ఈ నిర్గుణ నిరంజన స్వరూపము పైని గూడ, అమ్మగారి రెండు విధములైన మహత్త్వములు వెలయుచున్నవి. ఒకటి ఈశ్వరత్వము, రెండవది జీవత్వము. ఇందుఁ దొలుత నీశ్వరత్వ మనెడి మాతృమహత్త్వమును గూర్చి యోజింతము. ఉపని షత్తు, "ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే" యను చున్నది. ఆనందమువల్లనే భూతముల యుత్పత్తియు, వాని యునికియు నగుటెగాక, మఱి జీవుల ప్రలయస్థలమునై యున్నది. ఇచట, ఏ యానందము – కేవలానందము – అనఁగా సర్వభావవర్జిత నిర్గుణముగాఁ జెప్పఁబడినదో, జగత్తుయొక్క సృష్టి స్థితి ప్రలయ హేతువైన యానందమని చెప్పఁబడినదో,

యా రెండానందములు నొక్కటియా ? వేర్వేఱా ? యని సంశయము కలుగవచ్చును. దీని కుత్తరముగా — "నీవు నిర్గుణానంద మనుచున్నది, కథనమాత్రమే. ఆనంద మెన్నఁడును నిర్గుణము కాఁజాలదు. నిర్గుణమనఁగా నిర్విశేష గుణమని యర్థము. ఆనంద మొక గుణము (ధర్మవిశేషము). అది సూర్యకిరణములు సూర్యునికంటె భిన్నములును, అభిన్నములును నైనట్టులే, మఱియొక యానందము హ్లాదినీశక్తి. ఈ శక్తి యెవనిదో వాఁడే యీశ్వరుఁడు. అనఁగా హ్లాదినీశక్తిమంతుఁడు. కనుకఁ గేవలానందకర్మ మీశ్వరునిదే కాఁజాలదు." ఇత్యాది వాద ప్రతివాదము లెన్నో రేఁగుచున్నవి. ఈ విభిన్నమతముల మీమాంస మిగుల సుగమ్యము. ఎవఁడెట్టులనునో వానిదే సత్యముగా నంగీకరించినచో నెట్టి గొడవయు నుండదు. ఏలన — బ్రహ్మవస్తువు లేదని యెవ్వఁడు ననలేఁడు. బ్రహ్మము పూర్ణము. దానియెడ నెట్టి యభావకల్పనముం గాదు; కనుకనే దాని సంబంధమున నెవ్వరేమన్నను సత్యమే. బ్రహ్మ మెవరి యెడ నేభావముతోఁ బ్రకటమగునో, వారి నోర నట్టి భాషయే వెలువడును. ఎవ్వఁడేని బ్రహ్మమును లేదనునా? అదియు సత్యమే. ఏలన — వానియందా బ్రహ్మము 'నాస్తి' రూపముగానే ప్రతిభాసించినది. ఏదో యొకవిధముగా దానిని స్వీకరింపకుండ లేదు. ఇదే బ్రహ్మముయొక్క విశేషత. కేవల మీవిధముగానే యవశ్యము నసాధ్యమైనది కాదు. మఱియు— ప్రకాశము, అంధకారము, జ్ఞానము అజ్ఞానము, విద్య అవిద్య, సగుణము నిర్గుణము, సుఖము దుఃఖము, మున్నగు పరస్పర విరుద్ధ ధర్మములకును నదియే యాధారము. ఈ విరుద్ధ ధర్మ

సమూహము బ్రహ్మమందే యొకదానితో నొకటి నిల్చి యున్నది. ఇచట మఱియొక విశేషమేమన – ఆ యత్యన్త విరుద్ధ ధర్మములు బ్రహ్మమనెడి యాధారమందే సదా తోఁచుచున్నను, దాని నిరంతన స్వరూపమున కించుకయు హాని గలుగదు. కేవలానందస్వరూపబ్రహ్మము, తన నిరంజన స్వరూపము నఖండముగానే యుంచి, యొక్క-సారిగా నీశ్వర జీవరూపములతో వెలయఁగలదు. ఇదే బ్రహ్మముయొక్క బ్రహ్మత్వము.

ఈ నిర్గుణానందస్వరూపవస్తు వే రూపమున నీశ్వరుఁడై (సర్వగుణ సంపన్నుఁడై) యడరునో యనుటను, మనమెఱుంగఁ బ్రయత్నింతము. సరే, ఆ నిర్గుణానందమం దనుభవించుట కేమే నున్నదా లేదా ? చెప్పఁగలరా ? చెప్పఁగలము. కాని యనుభవశక్తి లేదు. ఎందుల కిట్లగును ? నిర్గుణవస్తువునందేదే నిట్టి శక్తిని స్వీకరించినచో, ఆనందమునకు స్వగతభేదమున్నటులేయై ద్వైతాపత్తి సంభవించును. కాదది కాదు. ఆనందము తన్నుఁదా నెపు డనుభవించునో, యపుడు భోగ్య భోక్తృ భోగాది రూపమైన భేదము దేనివల్లనుం దెలియఁబడదు. కనుకనే యీ విశుద్ధానందస్వరూప వస్తువునందు, ఆ భోగ్యాది భేదము లెవ్వియు లేవు. ఇది నిశ్చయము. ఇక్క-డ మఱియొకమాట – ఏమేని సంశయమున్నచో, నిర్గుణ నిర్మల విశుద్ధానందమైన వస్తువొకటి యున్నదనుఁడు. దానియం దెట్టి భేదమును లేదు. శంకరాచార్యులు సైతము ఈ నిర్గుణ సగుణ సామంజస్యము చేయుటకు "అనిర్వచనీయ" యని యొకపదము వ్యవహరింపవలసి వచ్చినది. దానినే గౌరాంగప్రభువు "అచింత్య భేదా భేద"

మనియెను. అపుడు దానిని మీరు గ్రహింపఁగలిగి, శాస్త్రములు గురువులు చూపిన యుపాయములచే దానిని బొందఁ గోరినచో, వారి కృపచే, నొకనాఁడవశ్యముగ నానందవస్తు నిర్గుణమని తెలియఁగల్గుదురు.

అఖండజ్ఞానము, అసీమశక్తి, యను రెండు నభిన్న వస్తువులని మును జెప్పఁబడినది. జ్ఞానమే శక్తి; శక్తియే జ్ఞానము; అను నిమ్మాటను సరిగాఁ దెలియలేనివారును, అనుశీలనముచేసి అనుభవింపఁజాలనివారును, ఈ యానందతత్త్వమును సరిగా గ్రహింపఁజాలరు.

సరే; మున్ను విశుద్ధజ్ఞాననామముచేఁ దోఁచిన దేదో యది, కేవల జ్ఞానమేకాదు. దాని యానంద స్వరూపమును సైతము దెలియఁబ్రయత్నింతము. చిద్వస్తువు కేవల చిత్ కాదు. ఆనందము సైతము దాని స్వరూపమే. ఆనంద మనఁగానే, యానందానుభవమును దాని సత్తయుఁ బ్రతీతిగోచరము లగుచుండును. ఈ యనుభవముపేరే చిత్. సత్తయే చిత్. కావున నానందశబ్దము నర్థమువలన, సచ్చిదానందముల నెడి మూఁడును దెలియఁబడును. ఈ మూఁడువస్తువులును వాస్తవముగా మూఁడు కావు. ఒక్కటే. సత్త, చైతన్యము, ఆనందము అనునవి యొక్క వస్తువున కైయెన మూఁడు పేళ్లు. ఈ యానందము విశుద్ధమైయున్నప్పుడును దానియందు 'చిత్' అనుభవశక్తి, 'సత్త' యనునవి కలవు. అనుభవశక్తి (చైతన్యము) యొక్క యభివ్యక్తి లేనప్పుడు, ఆనందప్రతీతియు నుండదు. ఆ యనుభవశక్తి విశేషభావముతో వెలయునపుడు దాని యిరువంకల 'కర్త, కర్మము' అనెడి రెండుభావములును విశేషించి తెలియఁబడును. అనఁగా –

అనుభవించువాఁడు, అనుభవింపఁబడునది, అనుభవము అను నిమ్మూఁడును దోడ్తోనె తెలియఁబడును. అనఁగా ఆనంద వస్తువునం దీమూఁడు భావములును వెలయుచున్నను స్వరూప ముచే నించుకంతయు భేదము లేదు. ఒక్క యానందవస్తువే తన్నుఁదా ననుభవించుచున్నది. అనఁగా ఆనందము నెచట విశేషించి యనుభవించునో, ఆ యద్వితీయ వస్తువునందు స్వగతభేదము కానవచ్చును. ఇవే సత్త్వ రజ స్తమోగుణము లనెడి పేళ్లతోఁ బ్రసిద్ధములు. సచ్చిదానందముల ప్రథమ స్పందనముచే 'సత్' సత్త్వగుణము, అనఁగా, ఆనందము యొక్క భోక్తృభావమును, రెండవ స్పందనముచే 'చిత్' (రజోగుణ) అనఁగా, నానందముయొక్క యనుభవశక్తియు, మూఁడవ స్పందనముచే ఆనందము (తమోగుణము) అనుభావ్య మైన యానందమనెడి భోగ్యభావమును బ్రకాశించును. ఇట్టి విశిష్టతలున్నను, విశుద్ధానంద స్వరూపము విశుద్ధముగానే యుండుననుట మఱువరాదు.

దానిపేరు "నేను" లేదా "ఆత్మ" యనుము. పంచదశీ కర్త "ఇయమాత్మా పరానందః పరమప్రేమాస్పదం యతః" ఈ జ్ఞానస్వరూపాత్మ పరమ ప్రేమస్థానము; కనుకనే యానంద స్వరూపము. ఎల్లరుం బరమప్రేమాస్పదమైనదానినే కోరుదురు. మివులఁ బ్రేమింతురు. దేనియందలి ప్రీతిసాధనకొఱకే యీ జీవత్వబంధన మనాదికాలమునుండియు సాగుచున్నదో, దేని రక్షకై సమగ్ర పృథివీత్యాగము చేయుదురో ("ఆత్మార్థం పృథివీం త్యజేత్") అట్టి యాత్మ యెంత ఘనానందస్వరూపము! అది మాటలతోఁ దెలియుటెట్లు ?

మును జెప్పినటులు, ఆత్మ విశిష్టభావముతోఁ దన్నుఁదా ననుభవించునప్పుడే, యది సగుణనామమునఁ బరఁగును. దీనికి దార్శనికులు – వికారమని, పరిణామమని, వివర్తమని, భ్రాన్తి యని, కల్పనమని, యధ్యాసమని, యేపేరేని బెట్టనీ; హానిలేదు.

ఇది వినుఁడు, సగుణ నిర్గుణములు రెండును సత్యములే, నిర్గుణవస్తు వొక్కటే యీ విధముగా సగుణ మగును. అసలు మాట యేమనఁగా – వేయిసారు లది సగుణత్వము నొందినను, దాని నిర్గుణత్వము బిందుమాత్రమైనను వికారము నొందదు, అది యఖండముగా యథాపూర్వముగానే యుండును. ప్రత్తి, సూత్రము, వస్త్రము అను పేళ్లతోను ఆకారముతోను బరిణామ మందినను, దాని స్వరూపమునం దించుకంతయు నంతర ముండదు. బంగారు కంకణ కుండలాది నామములతో, వివిధాకారములతో నాకారితమైనను, దాని సువర్ణత్వ మఖండము గానే యుండును. నీరు – సముద్రము, నది, సరస్సు, మంచుగడ్డ మున్నగు భిన్ననామములతో భిన్నరూపములతో నాకారిత మైనను, దాని జలత్వమున కన్యథాత్వము లేదు. సర్పము కుండలరూపియై యాపేరఁ బరఁగినను, సర్పము సర్పమేకాని కుండలముకాదు. ముత్తెపుఁజిప్ప రజతాకారమునఁ బ్రతీయ మానమైనను, అది ముత్తెపుఁ జిప్పయే, కాని వెండి కాదు. ఆకాశము ఘటమఠాది విశేషణములతోఁ గూడినను, అది యాకాశ నిర్విశేషముగానే యుండును.

ఇపుడు చూడుఁడు. ఆనందవస్తువు తన్నుఁ దా విశేష రూపముతో ననుభవించినపుడే యది సగుణము. వేదాన్తులు దీనిని మాయయొక్క యధ్యాసమందురు. సాంఖ్యులు ప్రకృతి

సంబంధ మందురు. కాని యుపనిషత్తు లీ సగుణస్వరూపమును 'ఆత్మ, బ్రహ్మ' శబ్దములతో నిర్దేశించినవి. మఱి యీ సగుణానందమందు బహుత్వానుభవము తెలియఁబడును. ఎందుచేత ? ఎటులు ? అని ప్రశ్నింపవలదు. అది యాత్మలీలగాను, ఇచ్ఛగాను దలంపవలసినదే. "నేను ఆనందస్వరూపుడను. ఒక్క రూపముతో ననుభవించి పొందు నానందమును, బహుధా విభజించి భోగింతును." అనెడి యిచ్ఛ నాకయినపుడు, నా పేరు ఈశ్వరుఁడు. "ఏకోఽహమ్ బహుస్యామ్" అను నీబోధము (అనుభవము) పేరే ఈశ్వరుఁడు. కేవలానందస్వరూపాత్మయందనేకభావముల యుత్పత్తి స్థితి లయము లగునపుడే, ఆ యాత్మ ఈశ్వరుఁడు. అపుడు బ్రహ్మ మానందరహిత మనఁగలరా? లేదు. బ్రహ్మవస్తువు స్వరూపముచేతనే యానందము. దాని యానందమునకు లేమి యన్నది, యేకాలమందును లేనేలేదు. అపుడు దాని యేకత్వము (అద్వితీయత్వము) సత్యత్వము స్వాభావికమైనట్టులే, దాని బహుత్వముకూడ (ఈశ్వరత్వము) జగద్దర్శనకాలమందును సత్యమును స్వాభావికమునై యున్నది. జగదతీతావస్థయందు బ్రహ్మము నిర్గుణమైనట్లే జగద్దర్శనకాలమందది సగుణము. అది గుణాతీతము, గుణమయము. ఈ రెండు భావములును నేకాధారమం దొక్కసారి తోఁచును. గాని యొకదానివలన నొకదానికి హాని పరివర్తనము లింతయుఁ గలుగవు. సరే, మును జెప్పినట్లు పరమప్రేమాస్పదమును, ఆనందమయమును నైన యాత్మ, తన్నుఁదా బహుధా విభజించుకొని భోగించునప్పుడే 'ఈశ్వరుఁడు'. ఇది మఱువకుండునపుడే ఆత్మ యొక్క ఈశ్వరత్వమనెడి మహత్త్వమేమో తెలియఁబడును.

ఆత్మయొక్క మఱియొక మహత్త్వము జీవత్వము. "తత్త్వమసి" మున్నగు మహావాక్యములు "సర్వం ఖల్విదం బ్రహ్మ" "ఆత్మైవేదం సర్వమ్" "స ఏవ సర్వమ్" "పురుష ఏవేదం సర్వమ్" "యదిదం కించ తత్సత్యమ్" మున్నగు శ్రుతి వాక్యములవలన జీవుఁడు బ్రహ్మముతోఁ గేవల మభిన్నమైన వస్తువే యని ప్రతిపాదింపఁబడినది. జీవుఁ డెవఁడు? ఈశ్వరానందము అనఁగా బహుధా ప్రకాశమానమగు సమష్ట్యానందము యొక్క వ్యష్టిరూపము. ఆ 'బహు' అనుదాని యందలి ప్రత్యేకమే జీవుఁడు. కావుననే జీవుఁడును స్వరూపముచే నానందమే. ఇచట మును జెప్పిన ప్రత్తి, నీరు, బంగారు, దృష్టాంతములను స్మరించుకొనునది. సముద్రమందలి జలతరంగములు జలము తక్క మఱేమియుం గావు. దారముచేనైన వస్త్రము ప్రత్తి తక్క మఱేమియుంగాదు. ఇటులే జీవుఁడు విభిన్ననాముఁడైనను, స్వరూపముచే నానందముతక్క మఱేమియుంగాదు. ఈవిధముగా జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజ్జములనెడి నాలుగు విధములైన భూతగ్రామము (ప్రాణిబృందము) ఈశ్వరానందమునందె పుట్టి, ఈశ్వరానందమందె యుండి, ఈశ్వరానందమందే యవసానము నొందుచున్నది. కావున జీవుని స్వరూప మానందమే. ఇపుడాలోచించి చూడు. ఆత్మ (అమ్మ) కేవలానందమయియు, సర్వకారిణియు, నీశ్వరానందమయియు నైనది.

సాధకుఁడా! ఈ రూపములందు లక్ష్యముంచి మెల్ల మెల్లఁగా నెచటఁ జేరితివో చూడు. ప్రథమఖండమందు దేనిని గేవల సద్రూపముగా నెఱింగితివో, ద్వితీయఖండమందు దేనిని

జిద్రూపము (ప్రాణరూపము) గా నెఱింగితివో, యదే యిపుడు పరమప్రేమాస్పద పరమానంద స్వరూపాత్మమైనది. ఆ యానందమునుండియే నీవును వచ్చితివి. నీ ప్రత్యేకసంకేత మానందమయము. చూడుము. నీ శరీరమందలి ప్రత్యేక పరమాణువును, ఆనందముతప్ప మఱియొకటి కాదు. ఆనందమే నీ కుపాదానము. ఆనందమే నీ స్వరూపము. ఆనందమందే నీ వున్నావు. నీ రోగశోకాదు లానందమయములు. నీ దుఃఖ దారిద్ర్యము లానందమయములు, నీలో నగు ప్రత్యేకచింతయు నానందమయము, నీ జన్మమృత్యువు లానందమయములు, నీయెదురనున్న చెట్టు సైత మానందమువల్లనే ఘటితమైనది. ఒక ఘనానందసత్తయే వృక్షాకారమున వెలయుచున్నది. జడమైన రాతిముక్కను జూడుము; ఈ యానందమయాత్మయే యా రూపమున వెలయుచున్నది. నీకంటె వేఱుగా నీకుఁ దోఁచు భార్యాపుత్త్రులు, స్వజనము సైతము, ఆ బహుత్వవిషయకానంద సత్తవే. నీ యానందోల్లాసమే మూర్తిమంతమై ప్రతిభాసించుచున్నది. ఏవైపున నీవు చూచినను, ఏ యింద్రియమువలన గ్రహించినను, అదియంతయు నానందమయమే. క్షిత్యాది పంచభూతములు, శబ్దాది పంచవిషయములు, చంద్ర సూర్యాది జ్యోతిర్మండలము నీ పరమప్రేమాస్పద పరమానందమయాత్మకంటె వేఱేమియుం గాదు. ఈ యానందమయాత్మస్వరూపము నాస్వాదింపనిచో, నీజీవనము వ్యర్థమే. నీ వానందసముద్రమందే మునిఁగియున్నావు, మునుఁగుచున్నావు. రేపగళ్లు లానందసేవయే చేయుచున్నావు. అయినను ఆనంద మెచటనున్నది? యనుచు గ్రుడ్డివానివలె వెదకుచున్నావు. ఒక్కసారి అమ్మవైపుచూడుము. నీ కానందా

భావ మెన్నఁడును లేదు; ఉండదు; అని తెలియును. ఏ క్షణ మందు నిన్ను నీ వానందమయునిఁగాఁ దలంతువో, యా క్షణ మందే నీ యెదుట, నీ సంసార మానందమయమై వెలయును. అది మొదలు విశిష్టభావములతో నగు జగద్భోగవాసనలు పూర్తిగా మఱఁగిపోవును.

చక్కఁగా విను – ఆనందమే నీ స్వరూపము. దాని యథార్థముగాఁ దెలియునపుడు, కామ్యవస్తు సంగ్రహము చేసియు, భోగించియు, నానందసంధానమును జేయఁగలవా? ఎన్నఁడును జేయలేవు. అపుడు సహజముగానే నీయందు వైరాగ్య ముదయించును. "నే నానందమయుఁడను" సర్వత్ర విషయాకారముగాఁ బ్రతిభాసించుచున్నాను అనెడి సత్యము నెఱుంగఁగల్గినచోఁ బట్టువిడుపులు, పలుకుసేఁతలును మఱి యుండవు. నిర్విచారవిషయానందమందు విచరించు శక్తి కలుగును. "రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియైశ్చరన్ । ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి". (గీత)

ఉండనిండు. పరమానంద తత్త్వము నాలోచనము చేయుచుఁ గడుదూరము వచ్చితిమి. మఱల మనము దేవికల స్వరముతో స్వరము చేర్చి "సారాయై సర్వకారిణ్యై నమః" అనుచు నానందమయి చరణములందు వ్రాలుదము. ఆత్మ – ఆనందమయి – అమ్మ, 'సార' – నిర్గుణచైతన్యమయి యయ్యు సర్వకారిణీరూపముతో, నీశ్వరమూర్తితోఁ బ్రకటిత మైనది; అగుచున్నది.

"ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతం నమః" ఖ్యాతి శబ్దమునకు యశఃప్రతిష్ఠాదులను మీఱిన యర్థము మఱి

యొకటి కలదు. అదే వివేకఖ్యాతి. ప్రకృతి పురుషుల పృథక్త్వము (వేఱుపాటును) గూర్చిన సుదృఢప్రతీతి. దానిని వివేకఖ్యాతి యని సాంఖ్యు లందురు. ఆపాతదృష్టిచే (పైపై చూపుతో) సాంఖ్యకారులు ప్రకృతిని జడనామముతో నుల్లేఖించిరి. వాస్తవముగాఁ బ్రకృతి జడముకాదు. చైతన్యము యొక్క జడత్వప్రతీతి మాత్రమే. జడత్వముసైత మొకవిధమైన బోధమే. బోధవస్తువు చేతనమేకాని జడము కాదు. కేవల చేతనమే కాదు. ఆనందమే దాని స్వరూపము. నిర్గుణానంద వస్తువే రూపమున సగుణభావము నొందినది. అనఁగా సత్త్వ రజస్తమో గుణమయమై ప్రకాశించినది. ఈ విషయమును జక్కఁగా ననుభవించుటపేరే ప్రకృతిపురుష తత్త్వవివేకము. లేదా వివేకఖ్యాతి.

అమ్మా! ఈ ఖ్యాతిరూపముతో నీవే నిన్ను వెలయించుకొనుచున్నావు. ఆనందమయపురుషుఁడవైన నీవే నిన్ను విశేష భావముతో ననుభవించునపుడు నీకు "ప్రకృతి" యను పేరయ్యెను. ఈ ప్రకృతి పురుష తత్త్వముల యథార్థానుభవ రూపముతోనే నీవున్నావు. ఈ యనుభవము (ఉపలబ్ధి) పేరే వివేకఖ్యాతి. తద్రూపిణివైన నీకుఁ బ్రణతి.

ఈ ఖ్యాతికి విపరీతమైన యజ్ఞానమయమూర్తితోఁ గూడ నీవే యున్నావు. ఏరూపముగాను బోధవికాసము లేక, లక్ష్యసాధనలు చేసినను, అనుభవవికాసము కాకయున్నపుడే "అజ్ఞానమయకృష్ణమూర్తితో విరాజిల్లుదు"వందురు. ఆ యజ్ఞానమయమైన నీ కృష్ణమూర్తికిని మా ప్రణామములు.

మఱి, యీ రెండిటికిని మధ్యవర్తియై (ఖ్యాతి కృష్ణల నడుమ) నీ మఱియొక మూర్తి యున్నది. దాని పేరు ధూమ్ర. ఈ ధూమ్రమమూర్తివలన జ్ఞానముయొక్క ఈషత్ప్రకాశముతోఁ గూడి యజ్ఞానురూపప్రకాశ మగును.

అమ్మా! నీ సంతానమందుఁ గొందఱు వేదాది ప్రతిపాద్యమైన నీస్వరూపమును వ్యాఖ్యానింప దక్షులు; సగుణ నిర్గుణాది తత్త్వవిశ్లేషణ సమర్థులు, మోక్షశాస్త్రమందును అధ్యయనాధ్యాపనములందును బటువులు నయ్యు, నీ యీ యానందమయ స్వరూపానుభవము లేకయే పోవుచున్నారు. అప్పుడే, అమ్మా! ఈ ధూమ్రమమూర్తితో (జ్ఞానవికాసము రవ్వంతగల మూర్తితో) వారి నోడి నుంచుకొన్నావని తలంతుము. అట్టి నీ యపూర్వధూమ్రమమూర్తికి మా మ్రొక్కులు.

మఱియొకవంక, అమ్మా! నీవు సదా ఖ్యాతి కృష్ణా ధూమ్రామూర్తులతో సర్వజీవుల నోడి నుంచుకొందువనియు మాకుఁ దెలిసినది. మేము విషయగ్రహణము చేయునప్పుడే నీ యీ మూర్తుల విశిష్టత ప్రకటమగునని మేము తెలిసికొను చున్నాము. "మేమిది తెలిసికొనుచున్నా" మనునదే విషయ గ్రహణ స్వరూపము. సర్వత్ర నే మీ మూడు మూర్తుల స్వరూపము స్థితిరూపముగాఁ బ్రకాశించుట కనుగొనుచున్నాము. దానికి మా ప్రణామము.

ఓం. అతిసౌమ్యాతి రౌద్రాయై నమ స్తస్యై నమో నమః।
నమోజగత్ప్రతిష్ఠాయై దేవ్యై కృత్యై నమోనమః॥ఓం.5

అతిసౌమ్యకు, అతిరౌద్రకు, నీకుఁ బ్రణామము. ఈ రెంటికి నతీతమై తత్పదలక్షితమై మనోవాక్కులకందని నీ స్వరూపమునకు మా ప్రణామము. జగత్ప్రతిష్ఠాస్వరూపిణికిఁ దల్లికి కృతిదేవికి మా ప్రణామములు.

వ్యాఖ్య:— అమ్మా! ఇంతకుమున్ను ఖ్యాతి కృష్ణారూపములతో రవ్వంత విరుద్ధములైన నీ రెండు మూర్తుల నెఱింగితిమి. అవియే మఱల నిచట, "అతిసౌమ్యా, అతిరౌద్రా" అనెడి పేళ్లతో దేవతలచే స్తుతింపఁబడుచున్నవి. అమ్మా! ఒక వంక నీవు, అతిసౌమ్యా - స్నేహమయివి, ఆనందమయివి, దయామయివి యైన మాతృమూర్తివై వెనఁటులే, అతిరౌద్రము - భయంకరమునైన కృష్ణామూర్తితో నిత్యము వెలయుదువు.

అమ్మా! ఇక్కడఁగనవచ్చు స్థూల జగత్తునందును నీ యీ రెండువిధములైన మూర్తుల లీల తెలుచుగాఁ గను చున్నాము. ఒకవంక నీవు, దుర్భిక్షము, మహామారి, విసూచి, మసూచి, వెల్లువలు, తుపానులు, భూకంపములు మున్నగు వాని రూపమున నతిరౌద్రమూర్తితో నీ సంతానమునకుఁ జెప్పరాని దుఃఖమును నష్టమును గలిగించుచున్నావు. మఱొక వంక దయారూపముతో వేలకొలఁది జీవుల హృదయమం దావిర్భవించి, అతిస్నేహమయమును · అతిసౌమ్యము నైన మాతృమూర్తితో సహాయసామగ్రి నందించి, వారి దుఃఖములను దొలఁగించుచున్నావు. ఎటఁజూచిన నట నే నీభయంకర మూర్తితోనే, కరుణామయ మాతృమూర్తియుఁ గానవచ్చు చున్నది. నీ సంతానము నంటిన యుచ్ఛృంఖలాచారము

నకును నాస్తికతకును నొచ్చుకొని, శాసనరూపముగాను, దండనరూపముగాను బ్రకాశించుచున్నటులే కష్టహారణ మూర్తితోఁ బ్రకాశించి, నీ సంతానము కన్నీరు తుడుచు చున్నావు. ఇదె నీ మాతృత్వ లీల.

జీవుఁడా! నీవు, అమ్మ నెచట వెదకఁబోవుచున్నావు? తల్లిని దర్శించుటకై సాధన భజన తపస్సులఁ జేయుచున్నావో? ఇంతకష్టపడియును మాతృనామమునకు మచ్చ పెట్టుదువు. నీ వెటఁ జూచిన నచటనే మాతృమూర్తి చక్కగా నుద్భాసించుచున్నది.

"యో హి పశ్యతి నాత్మానం దృష్టిసంపాతమాత్రతః ।
కదాపి నేక్షితుం శక్యో దృక్సహస్రధరోఽపి సః॥"

కను విచ్చునంతనే యమ్మను జూడ లేనివాఁడు వేఁగన్నుల వాఁడైనను, నెన్నఁటికి నమ్మను గానలేఁడు. యథార్థముగా, అమ్మ యంత సరళ. అంత సులభ. సత్యముగా నిట్లు దేవతల వలెనే, యమ్మను సర్వత్ర చూచి యథార్థభక్తితో మ్రొక్కఁ గల్గుదువేని, అమ్మ యథార్థస్వరూపము ననుభవింపఁగల్గుదువు. అపుడు దేవతలస్వరముతో స్వరమునుగల్పి "తస్యై నమోనమః" యనుచు, అవాఙ్మానసగోచర కేవలానందస్వరూపకుఁ బ్రణా మము, అనఁగలవు. ఔరా! అతి రౌద్రమూర్తియందును, ఆనందమెక్కడ? అనకుమా. ఇంచుక చక్షుష్మంతుఁడవైనచో, నానందమే సత్తయనియు ఆనందవస్తువే సుఖదుఃఖాద్యా కారముతో వెలయుచున్నదనియుఁ దెలియఁగలవు. సరే. జీవునివంకఁ జూడుము. జీవుఁ డేడ్చునపుడు, ఆ యేడ్పునందును గొంత యానందాభాసమున్నది. కనుకనే దుఃఖము ననుభ

వించుచున్నాఁడు. జీవుని నవ్వునందును నానందమయాత్మసత్త తేఁటపడుచున్నటులే, యేడ్పునందును దేఁటపడుచుండును. గాని యేడ్పునందును నానందమును దెలిసికొనుటకుఁ గొంత యోగ చక్షువు మాతృకృపయు నావశ్యకములు.

అమ్మయొక్క యీ సౌమ్య రౌద్ర భావాతీత స్వరూపములను దెలిసికొనుట కెట్టి భావముతో, నెట్టి స్థితియం దుండ వలయునో, యదియు మంత్రము నుత్తరార్థమునఁ జెప్పఁబడి యున్నది. "నమో జగత్ప్రతిష్ఠాయై దేవ్యై కృత్యై నమోనమః" ప్రతిష్ఠ యనఁగా ఆశ్రయము; జగత్ప్రతిష్ఠ యనఁగా, నిమిత్తోపాదానరూపముగా నున్న యానందమయ చైతన్యసత్తకు నమస్కారము. అటుపిమ్మటఁ గృతిదేవికి, అనఁగా, అఖండానందవస్తువు, నీ ఖండఖండ జగదాకారమునఁ బ్రకాశింపఁజేసిన క్రియాశక్తికిఁ బ్రణామము. అనఁగా జగన్నిమిత్తోపాదాన కారణభూతయు, సృష్టి స్థితి ప్రలయంకరియు నైన మహాక్రియాశక్తికి మా ప్రణామములు.

ఓం. యా దేవీ సర్వభూతేషు
  విష్ణుమాయేతి శబ్దితా ।
* ఓం నమస్తస్యై ఓం, ఓం నమస్తస్యై ఓం
 ఓం నమస్తస్యై నమోనమః॥ ఓం. 6

విష్ణుమాయ — జగద్వ్యాపినీ స్థితిశక్తి; దేవీ – స్వయం ప్రకాశరూప చిత్శక్తి; అశబ్దము, అస్పర్శము, అరూపము,

* ఈ 6వ మంత్రము మొదలు 26వ మంత్రమువరకు ఉత్తరార్థము యీ విధముగానే పఠించవలయును.

అన్వయము; ఆనందస్వరూపముగా మును మనము చెప్పి కొన్నదే. సర్వభూతాకారముగా నాకారితమై (సర్వభూత రూపముతోఁ దానే ప్రకాశించి) ఈక్షణము చేసి యనుభవించునపు డదే విష్ణుమాయ యనఁబడును. స్థూలమందు సర్వభూతరూపముతో (ఆధిభౌతిక రూపముతో) వెలసిన యమ్మకు విష్ణుమాయకుఁ బ్రణామము. సూక్ష్మమందు ఆధిదైవిక మూర్తితో; మహాతీశక్తిరూపముతో వెలసిన యమ్మకు విష్ణుమాయకు మా మ్రొక్కు. పిదప స్థూలసూక్ష్మముల కతీతమైన కారణరూపకు విష్ణుమాయామూర్తికి అమ్మకు నమస్కారము. ఇఁక మిగిలిన, స్థూల సూక్ష్మ కారణముల కతీతయై మనోవాక్కుల కందనిదై తత్పదలక్షితయైన తల్లిని లక్షించి, నమస్కరించి 'నమోనమ' యనుచుఁ బునః పునః ప్రణామములు చేయుచున్నారు.

ఇక్కడినుండి యీ స్తుతియందలి ప్రత్యేక మంత్రమందును ముమ్మారు 'నమస్తస్యై' ప్రయోగముండుటే కాక, 'నమోనమః' యను పదమునుం బ్రయోగింపఁబడినది. మొదటి 'నమస్తస్యై' పదమువలన, అమ్మ యాధిభౌతిక స్థూలరూపమునకు నమస్కారమే కాక, యిందుఁ గాయిక వాచనిక మానసిక నమస్కారమునుఁ దెలియఁబడును. రెండవ 'నమస్తస్యై' వలన సూక్ష్మస్వరూపము లక్షింపఁబడి, సూక్ష్మచైతన్యశక్తి స్థూలమును జేరి, విశిష్టనామాకారముతో నభివ్యక్తమైనది. దానిని లక్షించి ప్రణమిల్లుటయే ప్రణామముయొక్క సూక్ష్మావస్థ. దీనినే మానసిక ప్రణామమందురు. మూఁడవ 'నమస్తస్యై' అన్నది కారణస్వరూపమునకుఁ బ్రణామము. ఈ ప్రణామము

కారణశరీరమందే యభివ్యక్తమగును. కారణస్వరూపము బుద్ధితత్త్వమును మీఱియున్నదైనను, ఈ ప్రణామము విజ్ఞానాతీతకారణమును లక్షించి, బుద్ధితత్త్వమందే యభివ్యక్తమగును. గాన దీనిని బౌద్ధప్రణామమందురు.

ఇఁక 'నమోనమః' యనునది నాల్గవప్రణామము. ఇది స్థూల సూక్ష్మ కారణముల కతీతమైన విశుద్ధజ్ఞానమయక్షేత్రమందు (అనగాఁ బరమప్రియతమ పరమాత్మయందే) ప్రకటితమగును. ఇచటఁ బ్రణమ్యము, ప్రణామము, ప్రణామకర్త, యను మూఁడిటిస్ఫురణము లేకున్నను, మొదటినుండియు శరణాగతభావముగల సాధకు లీ యద్వైతక్షేత్రమందుఁ జేరినపుడే, 'నమోనమః' అనుచుఁ గేవల శరణాగతభావసహాయముతోనే, పరమ ప్రేమాస్పద పరమానందస్వరూప పరమాత్మయందు మునిఁగిపోవుదురు. ఈ తురీయావస్థయే నాలవప్రణామము.

ఇటులు స్థూల సూక్ష్మ కారణ కారణాతీతము లనెడి యీ నాలుగవస్థలును, విశిష్టభావముతో లక్షించి, ప్రణామము చేయఁగలవారలే యథార్థ దేవతలు. శుంభనిశుంభాసురుల యత్యాచారములచేఁ బీడింపఁబడిన దేవతాబృందము, ఈ భావముతోనే ప్రణమిల్లఁగల్గెను. కనుకనే తల్లి వడిగఁ దానే రణక్షేత్రమునకు దిగి యసురకులమును నశింపఁజేసినది. మన మును పైని జెప్పిన నాల్గు స్వరూపములందును లక్ష్యముంచి, యమ్మకుఁ బ్రణమిల్ల నలవాటు పడవలయును. అప్పుడే సర్వవిధముల యాసురాత్యాచారములవలన విముక్తుల మగుదుము.

పురాణములయందు ముక్తితరగతులు నాలుగు విధములుగాఁ జెప్పఁబడినవి. (1) జడత్వమును విడఁదీసి చైతన్య

లోకమందుఁ జేరుటే సాలోక్యముక్తి. (2) సమష్టి చైతన్యమం దవస్థితుఁడగుటే సామీప్యముక్తి. (3) సూక్ష్మకారణ కేంద్రమందుఁ గారణముగాఁ బ్రకాశించి యందుఁ జేరుటే సారూప్యముక్తి. ఇచటఁ జేరుటచేతనే సాధకుఁడు తత్స్వ రూపుఁడగును. గనుకనే యీ యవస్థకు సారూప్యమని పేరు. (4) దీనిపైది సాయుజ్యముక్తి. ఈ యవస్థయందెట్టి విశిష్టతయు నుండదు. జీవుఁడు నిర్విశేషచైతన్యమందుఁ జేరును - దీని మాఱుపేరే నిర్వాణము. మన దైనికసాధనమందును నీ నాలు గవస్థలయందును లక్ష్యముంచవలయును. నాలుగవస్థల యందును సంపూర్ణముగా లక్ష్యముంచలేనివాఁడు, రెండు మూఁడవస్థలయందైన లక్ష్యముంచినపుడే, యది యథార్థ సాధనమగును. ప్రతిదినము నల్పమో, యధికమో ముక్తి నాస్వాదించుచుఁ బోఁగాఁబోఁగా జీవన్ముక్తి నాస్వాదించు టగును.

ఓం. యా దేవీ సర్వభూతేషు చేతనే త్యభిధీయతే।
ఓం నమస్తస్యై ... ... ... ... 7

(చేతనా — సర్వేంద్రియ ప్రవృత్తిహేతు రంతఃకరణ శక్తివిశేషః। సా చ చిత్తవ్యాపారరూపా। చిత్తంతు జ్ఞాన శక్తిప్రధానం మహత్తత్త్వం। మహత్తత్త్వస్య ద్వే శక్తీ। జ్ఞానం క్రియా చ। తత్ర జ్ఞాన శక్త్యాత్మకం చిత్తం క్రియా శక్త్యాత్మకం సూత్రముచ్యతే। చేతనా - సుఖదుఃఖాను సంధాన శక్తిరితి కేచిత్.)

చేతన స్థూలమందు నామరూపాకారముతోఁ బరివ్యక్త మగుచున్నది. సూక్ష్మమందుఁ బ్రాణశక్తిరూపముగాను, కారణమం దవ్యక్తబీజరూపముగాను నున్నది. స్థూలాభిమాని చైతన్యము విశ్వుఁడనియు, సూక్ష్మాభిమానిచైతన్యము తైజసుఁడనియు, కారణాభిమానిచైతన్యము ప్రాజ్ఞుఁడనియు వ్యవహరింపఁబడును. చైతన్యరూపిణి అమ్మ విశ్వచైతన్యనామముతో, ఈ పరిదృశ్యమానవిశ్వరూపముతో నామరూపధారణపూర్వకముగా సదా వెలయుచున్నది. ఆ యాధిభౌతికచేతనామయమూర్తికిఁ గాయిక వాచనిక ప్రణామము చేయుచున్నాము. పిదప, తైజస చైతన్యనామముతో అనఁగా నీ ప్రకటవిశ్వముయొక్క సృష్టి స్థితి లయ తిరోధానానుగ్రహముల నెడి పంచకృత్యములందు నిరతయై, సూక్ష్మమైన ఈ యాధిదైవిక చేతనారూపిణియైన శక్తిమయ మూర్తికి మానసికప్రణామము చేయుచున్నాము. పిదప ప్రాజ్ఞచేతనా నామముతో, నీ స్థూల సూక్ష్మ రూపములకు బీజరూపమై కారణరూపముగా నున్న యాధ్యాత్మిక చేతనా రూపమైన యవ్యక్తకారణమూర్తికి బుద్ధిసహాయముతోఁ బ్రణమిల్లుచున్నాము. ఇఁక నీ స్థూల సూక్ష్మ కారణములను మీఱి, విశుద్ధచైతన్యస్వరూపమై యవాఙ్మానసగోచరమైన నీ నిత్య నిరంజనస్వరూపమును లక్షించి 'నమోనమ' యనుచుఁ బరమ ప్రేమాస్పద ప్రియతమ మధుమయాత్మస్వరూపమందుఁ జేరిపోవుచున్నాము. మనమును దేవతలవలె నాత్మచైతన్యమును విశేషభావముతో లక్షించి 'నమస్తస్యై' యనుచు సాష్టాంగ ప్రణామము చేయవలయును. ఆ హృదయానుభూతచైతన్యమే, స్థూలదేహరూపముగాను, దేహాత్మబోధరూపముగాను వెలయు

చున్నదని యెఱింగి, ప్రథమప్రణామమును; ఆ చేతనయే సర్వభూతముల కధిష్ఠాత్రియై యుండి సర్వవ్యాపినియైన చిన్మయమూతగా నెఱింగి, రెండవ మానసికప్రణామమును; తర్వాత నవ్యక్త కారణరూపచేతనను లక్షించి విచిత్రనామరూపములతో నింతయు వ్యాకృత కాకయున్న యతిసూక్ష్మావస్థను లక్షించి తృతీయ బౌద్ధప్రణామమును జేసి, ఆ తరువాత నమ్మ దయ చేఁ గారణాతీత స్వరూపసంధానము చేసి, యా యజ్ఞేయ నిరంజన సత్తను లక్షించి 'నమో నమః' యనుచు, మధుమయ పరమాత్మసత్తయందుఁ జేరిపోవలయును.

ఓం. యా దేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణ సంస్థితా।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 8

అమ్మ బుద్ధిరూపిణి. వ్యష్టి బుద్ధిరూపమునఁ బ్రతిజీవునందును, సమష్టి బుద్ధిరూపమున మహత్తత్త్వమందును, బుద్ధి బీజరూపమున అమ్మయే యున్నది. ఈ మూడురూపములకుఁ గాయిక వాచనిక మానసిక బౌద్ధప్రణామములు చేయుచున్నాము. అమ్మ నిరంజనసత్త వీనికిఁ బైఁగా నున్నది. బుద్ధిని బ్రకాశింపఁజేయునది, యమ్మ నిరంజనస్వరూపమే బుద్ధి యనుట కేమియు లేకున్నను, బుద్ధి యామెగానే యున్నది. అదె మన యథార్థ స్వరూపము. దానికి 'నమోనమ' యనుచు బునఃపునః ప్రణామములు చేయుచున్నాము. అమ్మ వాని నందుకొని మమ్ములను దన స్వరూపమునఁ జేర్చుఁగాక.

మనము తొలుదొల్త మన బుద్ధికే ప్రణమిల్లవలయును. తద్రూపగానే అమ్మ యున్నది. బ్రాహ్మణులు "ధియో

యోనః ప్రచోదయాత్" అనుచు బుద్ధి నొందుటకే త్రిసంధ్య లందును గాయత్రీ మంత్రముతోఁ బ్రార్థింతురు. బుద్ధిరూపమైన యమ్మకు సరిగాఁ బ్రణమిల్లఁగల్గినచో వ్యష్టి బుద్ధిస్థానమైన మహదాత్మసంధానము నొందుదుము. మఱియు వ్యష్టి సమష్టి బుద్ధుల కవ్యక్తబీజమైన మూలప్రకృతికిఁ బ్రణమిల్లఁగా నిరంజన స్వరూపమందుఁ జేరుదుము. భావాతీతమును త్రిగుణరహితమును, గురుస్వరూపము నైన యాత్మస్వరూపమందుఁ జేరుదుము. 'నమోనమ' యనుచునే మన యహంత విలయమై పోవును.

ఓం. యా దేవీ సర్వభూతేషు నిద్రారూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 9

అమ్మ నిద్రాస్వరూపిణి. నిద్ర యనఁగా నింద్రియ నిమీలనము. మన యింద్రియవ్యాపారములును బుద్ధి వృత్తులును నిరుద్ధములగునప్పుడు, జ్ఞానమయి యమ్మ 'నేనేమియు నెఱుఁగను' అనెడి యజ్ఞానవ్యాదయమం దుండును. అదే మన యమ్మ నిద్రామూర్తి స్వరూపము. అపుడు సర్వభావముల నిరోధవిషయకజ్ఞానరూపమున వెలయును గనుకనే, పాతంజల దర్శనము దీనిని 'అభావ ప్రత్యయాలంబనవృత్తి'గా నిర్దేశించెను. అమ్మ అట్టిరూపముతో వెలయునప్పుడే, మనము స్నేహమయి ప్రేమమయి మధుమయి యైన సుషుప్తిమూర్తి యంకమందే యుండి యింద్రియవ్యాపారములవల్ల నగు కర్మ శ్రమలవలనఁ దొలఁగి పరమతృప్తి నొందుదుము. మన మీ దుఃఖమయ త్రితాపమయ జగత్తున జనించి, యలసి సొలసి

పోయినపుడే, అమ్మ తన నిద్రామూర్తితో వచ్చి మనలను దన వక్షమందుఁ జేర్చుకొనును. అట్టి స్నేహమయాలింగనముఁను మనము మఱచిపోవుచున్నాము. ప్రతిదినము జగన్మాతను నిద్రారూపమున ననుభవించుచున్నాము. అమ్మ మన స్వమ్ము. ఈ స్వమ్ము నొందించునది కావుననే నిద్రకు 'స్వపితమ్' అని పేరు.

జగన్మాతా! సుషుప్తిరూపిణీ! నీకుఁ బ్రణామముఁ. మా కాయిక వాచనిక ప్రణామము నందుకొమ్మ. సుషుప్తిమయిన్నైన నీ యీశ్వరీమూర్తి సర్వబ్రహ్మాండములందు నిండియున్నది. ఆ మూర్తికిఁ బ్రణామములు. దాని దర్శించినంతనే శరీరేంద్రియములు స్తబ్ధములై పోవును. ఆ కృష్ణా సుషుప్తిమూర్తి యెంత ఘనము! అమ్మా! వ్యష్టి సమష్టి నిద్రకుఁ గారణమును, సుషుప్తిబీజరూపమునైన నీ యవ్యక్త మూర్తికిఁ బ్రణమిల్లి, నిద్రాతీతము, నిరంజనము, నిత్య జాగరణమయము, నిత్యబోధమయము నైన నీ స్వరూపమున కేము చేయు పునః పునః ప్రణామముల నందుకొమ్మ!

ఓం. యా దేవీ సర్వభూతేషు క్షుధారూపేణ సంస్థితా।
ఓం నమస్తస్యై... ... ... ... ... 10

అమ్మ భోజనేచ్ఛారూపముతో సర్వభూతములందు నున్నది. ఈ స్థూలశరీరమందలి రస రక్తాది సప్తధాతుపోషణము నకై యాహారగ్రహణావశ్యకత తోఁచును. అదే యమ్మ క్షుధామూర్తి. అన్నమయకోశమనఁబడు నీ స్థూలదేహమందే, యీ బుభుక్షామూర్తి ప్రకాశమందేని, కాదు. తక్క ప్రాణ

మయాది కోశములందును అమ్మ క్షుధామూర్తితో వెలయు టను గనుచున్నాము. ప్రాణమయకోశాహారము జీవనశక్తి; మనోమయకోశాహారము చింత; విజ్ఞానమయకోశాహారము జ్ఞానము. ఆనందమయకోశాహారము ప్రీతి, హర్షము. ఈ విధ మైన పంచకోశాహారములను గ్రహించు నిచ్ఛగాఁ బ్రకాశించు హేతు వేమనఁగా, మనము ప్రతిదినము ప్రతిజన్మమందు నీ క్షుధానివృత్తికై, తెలియకో తెలిసియో అమ్మవైపే నడుచు చుందుము. ఈ యపూర్వాకర్షణమయ క్షుధామూర్తియొక్క ప్రత్యక్షజ్ఞానము ధన్యము. మొదట నిత్యానుభూతమగు నన్న బుభుక్షుకు, అనఁగా స్థూల వ్యష్టి క్షుధామూర్తికి "నమస్తస్యై" యనుచుఁ బ్రణామము. తర్వాత సర్వబ్రహ్మాండరూపిణియైన మహాక్షుధామూర్తి సర్వజీవులందును, సమష్టిరూపముగా నున్నది. ఆ యఖండక్షుధామూర్తి తృప్తికయి, ఏ యనాది కాలమునుండియో, పైని జెప్పిన యైదువిధములైన యాహార మును గ్రహించియుఁ దృప్తినొందలేదు. ఈ విశ్వవ్యాపిని క్షుధా మూర్తికి యథార్థముగా నమస్కరించువారి కెన్నఁడును భవ క్షుధయే యుండదు. ఎన్ని జన్మజన్మాంతరములనుండియో గద్భోగము చేయుచు, అనేక శోక దుఃఖ ఘాత ప్రతిఘాతము ను సహించుచున్నను, మన యీ విషయక్షుధానివృత్తి లేదు. సంతానమునకగు నీ యాఁకటి నెఱింగి యాహారము చ్చుటయే మాతయొక్క మాతృత్వము. అమ్మా! నీవు న్నపూర్ణవు. నీ బిడ్డ లన్నమునకై యన్వేషించుటయా? బిడ్డల యాఁకటిమంట లడఁగింపక యూరకుందువా? మే యాఁకొన్న బిడ్డలము. నీ వన్నపూర్ణవు. ఇదిగో నీకుఁ బ్రణా

మము. ఇది యందుకొని మా విషయతృష్ణాగ్నిని బొత్తిగాఁ జల్లార్పుము. ఈ మా స్థూల సూక్ష్మకారణ ప్రణామము లంది కొమ్ము. మేము "నమోనమ" యనుచు నాఁకలిదప్పులు లేని, యాహారావశ్యకత లేని నీ నిరంజనస్వరూపమందుఁ జేరిపోదుము.

ఓం. యా దేవీ సర్వభూతేషు ఛాయారూపేణ సంస్థితా।
ఓం నమస్తస్యై... ... ... ... ... 11

ఛాయ యనఁగా జీవుఁడు. 'ఛాయాతపౌ బ్రహ్మవిదో వదన్తి' (ఉప). శంకరాచార్యులును దీనిని వ్యాఖ్యానించుచు నీ యర్థమునే చెప్పిరి. ఛాయకును స్థూల సూక్ష్మ కారణము లనెడి మూఁడవస్థలు కలవు. ఛాయా - (చిత్ ప్రతిబింబము) చిత్ ప్రతిబింబమే జీవుఁడు. స్థూలదేహమందయిన చిత్ ప్రతిబింబము ఛాయాస్థూలమూర్తి. దశేంద్రియములు, పంచ ప్రాణములు, మనోబుద్ధులు ననెడి పదునేడు తత్త్వముల రూపమైన సూక్ష్మదేహమందుఁ గల చిత్ప్రతిబింబమే ఛాయా సూక్ష్మమూర్తి. ఇటులే కారణదేహమందగు నవిద్యా చిత్ ప్రతిబింబమే ఛాయాకారణమూర్తి. ఈ మూర్తులకుఁ బ్రణమిల్లుటకే మంత్రమందు మూఁడు ప్రణామములు. నాలవది ఛాయాతీత స్వరూపమున లక్ష్యముంచి చేసిన ప్రణామము.

ఛాయాసంబంధమందు మఱియొకమాట — సాధారణ చ్ఛాయ ప్రకాశము నావరించునటులే, యీ జీవచ్ఛాయయుఁ బరమాత్మ స్వరూపమున కావరకముగా నుండును. ఈ యావరకములను దొలఁగించుటకే ఇన్ని ప్రణామములు. ఇంత శరణాగతభావము. ప్రణామములు చేయఁగాఁ జేయఁగా మిథ్యాభి

మానము - తొలఁగిపోయి జీవభావముయొక్క పృథక్సత్తానుభవము కాదు. ప్రతిబింబమునకు స్వతంత్రత లేదు. బింబసత్త చేతనే ప్రతిబింబసత్త నిల్చునని, యపుడే సరిగా ననుభవము చేయఁగలఁడు. ఆత్మ యొక్కటే యని యనుభవముచేయుటకు సర్వరూపములందును ఛాయాదర్శనము చేయుటే సులభోపాయము. బుద్ధితత్త్వము చక్కఁగా వికసించినవారలే జీవజగత్తును యథార్థఛాయారూపముగాఁ బ్రత్యక్షము చేసికొందురు. అద్దమందుఁ బ్రతిబింబించు మహానగరమువలెనే, యీ నామరూప విశిష్ట స్థూలవిశ్వము యథార్థముగా ఛాయవలెనే ప్రతీతమగును. ఆధునిక వేదాన్తవాదులు మిథ్యయని, భ్రాన్తి యని, యధ్యాసమని యీ చిచ్ఛాయ నెగురఁగొట్టుట కెంత ప్రయత్నించినను, వారి స్థూలదేహ ముండునంతదనుక, వేయిసారులు మిథ్యయన్నను, వేయిసారులు ప్రయత్నించినను నిది తొలఁగదు.

గీతయందు భగవంతుఁడు "ఈశ్వరుఁడు సర్వభూతముల హృదయమందుండి, జీవులను యంత్రారూఢులనువలెఁ ద్రిప్పుచున్నాఁడు" అనెను. అద్దము నెదుర నిల్చి యెవ్వఁడైన నే విధముగా నంగభంగిమలను జేసినను, అందుఁ బ్రతిబింబించిన మూర్తియు, నా విధముగానే యంగభంగిమలను జేయును. జీవుఁడనెడి చిత్ ప్రతిబింబము సైతము, ఈ విధముగానే హృదయమందున్న యీశ్వరుని చేతఁ బరిచాలితమై బహువిధములుగా నభినయించును.

'జీవుఁ డీశ్వరుని ప్రతిబింబమై తనచేసిన కర్మ మీశ్వరుని చేతనే చక్కఁగా నియమితమైనపుడు, ధర్మాధర్మములు, పాప

పుణ్యములు ననెడి యెట్టివిచారము నుండదే' యను నాశంక కలుగును. ఔ, నిజమే - ఇట్టి జ్ఞానమందుండి తమ్ముఁ బరమేశ్వరుని ఛాయామాత్రముగా ననుభవింపఁగలవారియెడ, నిజముగా ధర్మాధర్మ పాపపుణ్యానామకమైన దేదియు లేదు. గాని యిట్టి యనుభవము కాకమున్నే, అనఁగా - అహంకర్తృత్వాభిమానము నిల్చునంతవఱకు ధర్మాధర్మ పుణ్యాపుణ్య విచారముండనే యుండును. పలుసారులు వెలికి లేదన్నను, లోపల నుబుకుచునే యుండును. అది యుండనీ -

అమ్మయే మన బింబప్రతిబింబములని యెఱుఁగుదుము. అమ్మయే పరమాత్మరూప బింబమై, బుద్ధియందుఁ జిచ్ఛాయ పడుటవలనఁ దానే జీవుఁడై, ఛాయగా సిద్ధమగును. కనుక మనము నీ ఛాయారూపమునకుఁ బ్రణమిల్లఁదగును. అమ్మా! నీవు చిన్మయివి గనుక నీ ప్రతిచ్ఛాయ దేనియందు సంక్రమించునో, యదియును జైతన్యమయమే యగును. జడవస్తుచ్ఛాయ జడవస్తువుపైఁ బడుటవలన దానియందుఁ జైతన్యవ్యవహార ముండనే యుండదు. కాని చైతన్యరూపిణివైన నీ ఛాయచే జడదేహము జడేంద్రియములు జడబుద్ధి సమస్తము చైతన్యమయములై పోవును. అమ్మా! 'నేను' అనునది నీ రూపమే కనుక నీ ఛాయపడుటచేతనే జడదేహాదులును 'నేను' అనెడి యభిమానము నొందుచున్నవి.

తొలుత 'నమస్తస్యై' యనుచు మా వ్యష్టిబుద్ధియందుఁ బ్రతిబింబించిన చిచ్ఛాయామూర్తికిఁ బ్రణమిల్లుచున్నాము. క్రమముగ సమష్టిబుద్ధియందుఁ (మహత్తత్త్వమందు) గలట్టియు, శాస్త్రకారులు 'హిరణ్యగర్భుఁడు' అనునట్టియు అమ్మహా

చ్ఛాయామూర్తికిఁ బ్రణమిల్లి, కారణక్షేత్రమందైన నీ యవ్యక్త చ్ఛాయకును 'నమస్తస్యై' యనుచుఁ బ్రణమిల్లి, తుదను ఛాయ యనుటకును నెచ్చట నేమియు లేదో, దేని సత్తా, ఛాయకును సత్తయై యున్నదో, యేది ఛాయను బ్రకాశింపఁ జేయునో, యట్టి నిరంజనక్షేత్రము నుద్దేశించి ప్రణమిల్లు చున్నాము.

ఓం. యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... 12

శక్తియనఁగా సామర్థ్యము, ఉత్సాహము. శక్తియనఁ గానే తొలుదొల్త దేహముపైనే దృష్టి నిల్చును. ఇంచుకంత ధీరముగా యోజించినచో, నీ దేహము శక్తికంటె వేఱేమియుం గాదని తోఁచును. చూచు శక్తి విను శక్తి, మున్నగు నింద్రియ శక్తులను జూడఁగాఁ జూడఁగా రక్తమాంసాది పిండమైన యీ స్థూలాంశముమీఁదనే లక్ష్యము పడును. అపుడు కొన్ని యణు పరమాణువులు, ఇట్టిదనరాని యొక ధృతిశక్తివలన దేహా కారము నొందినవని తెలియవచ్చును. పిదప నయ్యణువులవంక లక్షింపఁగ నణువులు సైతము వాస్తవిక జీవాణువులే; శక్తి సమూహములే కాని మఱొండు కాదని తెలియును. ఇటులీ స్థూలదేహ మొకానొక శక్తిసమష్టిరూపముగాఁ బ్రతీతమగును. అమ్మ యొక్క యీ స్థూలశక్తిమూర్తికిఁ బ్రణామము. ఆధునిక జడవాదులు స్థూలాకారమునఁ బ్రకాశించు నీ శక్తిమూర్తిని జడరూపముగాఁ దలంతురు. సర్వభూతములందును, స్థూల దేహములందును, భౌతికపదార్థములందును, ప్రకాశమందును,

వేడిమియందును, మెఱుపునందును, చంద్ర సూర్యులందును సర్వత్ర కానఁబడుచున్న శక్తిరూపప్రకాశము నీవె. అది జడ మనఁబడు చిన్మయేచ్ఛాశక్తిమాత్రమే, యనెడి మాటను వారు విచారింపరు. శక్తి యనునది చేతనకంటె వేఱేమియుం గాదని వారు గ్రహింపరు. అమ్మా! వారి తెలివికన్ను విప్పుము. భూత భౌతిక పదార్థ మెట్టిదైనను చైతన్యమయశక్తిప్రవాహమని వారి మనస్సులకు మాటిమాటికి నచ్చఁజెప్పుము.

శక్తి యన్నది మఱేమియుం గాదు. చూచుశక్తి విను శక్తి మున్నగు శక్తులకు మఱియొకపేరు లేదు. సరిగదా, ఒక్క-మహాశక్తియే వేర్వేఱునామములతో వేర్వేఱురూపము లతో వెలసి, వేర్వేఱు కార్యముల నొనర్చును. ఇది కేవల దేహమందును, ఏదే నొక విశిష్టపదార్థమందును మాత్రమే కాదు, అనంత విశ్వ - మనఁగా మన యల్పబుద్ధి వ్యాపించు నంతదాఁకఁ దోఁచు నెట్టిదియు శక్తికంటె మఱియొకవస్తువుగా భావింపలేము.

అమ్మా! ఏకయు, నద్వితీయయు, మహతియు నైన యే శక్తియొక్క- విశాలమహత్త్వములకు మనోబుద్ధులు స్తబ్ధ ములై పోవునో, యేది సర్వభూతరూపముగా, ననంతరూప ముగాఁ బ్రకాశించు మహాశక్తియో, దేనియందు విశిష్టలక్షణ ముంచినచో సృష్టి స్థితి లయముల నెడి మూఁడువిధములు స్పంద నములు తోఁచునో, ఆ సమష్టిరూపిణీమహాశక్తివి నీవే. అమ్మా! యీ దురధిగమ్య మహాశక్తిసముద్రమందలి యొక్కొ-క్క- తరం గము, విభిన్న జీవజగదాకారమున నుబుకుచు, మఱల క్షణ ములో విలయమొందుచున్నది. ఈ నీ యీశ్వరీశక్తిమూర్తికి

మా ప్రణామము. మఱి వ్యష్టిసమష్టిశక్తికి బీజమై యీ మహతీ శక్తి వికసించు నవ్యక్తక్షేత్రమైన యీ మహాకారణరూపశక్తి మూర్తికిఁ బ్రణమిల్లి, నీ నిరంజనస్వరూపమునఁ జేరిపోవు దుము. అచట శక్తియనుట కేమియు లేదైనను, అది లేకున్న శక్తికి సత్తయే లేదు. అది శక్తిరూపముగాఁ బ్రకటమయ్యును దాని స్వరూప మించుకంతయు వ్యత్యయమొందదు. మనో వాక్కులకందరాని యీ స్వరూపమును లక్షించి, 'నమోనమ' యనుచు మాటిమాటికిఁ బ్రణమిల్లుచున్నాము. అమ్మా! జ్ఞానులైన నీ బిడ్డలు కొందఱు నీ పరమాత్మస్వరూపమును శక్తి హీనముగా వ్యాఖ్యానింతురు. మఱియు ననేకవిధముల యుక్తి తర్కములతో నందులకై యెంతో ప్రయాసపడుదురు. దయఁ జూచి వారియెడ నీ యాత్మస్వరూపము నున్మేషింపఁజేయుము. పరమాత్మ శక్తిహీనము, రసహీనము, ఆనందహీనము నైన యొక జడవస్తువు కాదని తెలియఁగలరు.

ఓం. యా దేవీ సర్వభూతేషు తృష్ణారూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 13

తృష్ణ - అప్రాప్తియందైన యభిలాషము. ధనాదులు విరివిగానున్నను, అధికలాభమందు విముఖత లేకపోవుట సర్వ భూతములందును దృష్ణారూపమున నున్న దేవికి మమ్మాఱు ప్రణామము. పునః పునః ప్రణామములు.

వ్యాఖ్య:— అమ్మా! సర్వభూతములందును దృష్ణా (దప్పి) రూపమున నీవే యున్నావు. ఈ సర్వభూతతృష్ణను స్మరించునపుడు, తొలుత నీ తృష్ణమీఁదనే దృష్టిపడును. అమ్మా!

నీవు కేవల జలపానేచ్ఛారూపతృష్ణవే కావు. తృప్తిలేని యొక కాంక్షారూపమున సైతము, లోన నీవె యెల్లపుడు రేఁగుచుందువు. పలు జన్మములనుండియు నీ యీ తృష్ణామూర్తిని దనుపుటకుఁ బ్రయత్నించుచున్నాము. కాని చాలలేకున్నాము. సకల బ్రహ్మాండాధిపత్యము లభించినను దృష్ణానివృత్తి కాదు. ఇంతదాఁక దృష్ణవుసైతము నీవే యని తెలియమైతిమి. కనుక నే, అమ్మా! యని యాదరింపలేదు. గాన మాయందు నీవే తృష్ణారూపముగాను, ఆకులాకాంక్షారూపముగాను, వెలయుచున్నావని నేఁడు తెలిసినది. నిత్య తరుణాశారూపిణివి నీవే మా మదులఁ జల్లఁబఱతువని నమ్మి నీకుఁ బ్రణమిల్లి తృష్ణను దాటిపోవుదుము.

అమ్మా! ఈ విధమైన నీ వ్యష్టితృష్ణామూర్తిని జూడఁగాఁ జూడఁగా, సర్వభూతములందు వెలయు నీ సమష్టి తృష్ణామూర్తిపైన జరుపడును. జగత్తునం దెటఁజూచినను, నీ యతృప్తలాలసామూర్తియే కానఁబడును. ఎంతకాలమునుండి యీ పుట్టుసావుల దంపు నోర్చికొనుచున్నామో తెలియదు. ఆ సమష్టితృష్ణామయమూర్తివి నీవు, తృష్ణారూపముతో వెలసి, యొక యద్వితీయానందమయస్వరూపముతో, నీ బహుత్వలీలయందు వినియోగించిన నీ మహాతృష్ణాస్వరూపము నెటులెఱుంగఁగలము? తెలిసియో తెలియకో "నమస్తస్యై" యనుచుఁ బ్రణమిల్లుచున్నాము. అమ్మా! విషయతృష్ణా మూర్తితో దర్శనమీయకుమా! రసస్వరూపమైన యమ్మను నిన్నొందు ప్రబలతృష్ణారూపముతో నేవచ్చి మమ్ములను ధన్యులను జేయుము.

ఈ మహాతృష్ణ పుట్టిన యవ్యక్తకారణమునకు నీకుఁ బ్రణామము. నీ తృష్ణాతీత భావాతీత బోధమాత్రస్వరూపమునకు 'నమోనమః' యనుచు నసంఖ్యప్రణామము లాచరింతుము. అచటఁ దృష్ణయనుట కేమియు లేదు. దాని సత్తపైనే తృష్ణ నిల్చియున్నది. తృష్ణారూపమున వెలసినను దానికి రవంతయు వికారములేదు. అదే నీ నిరంజనస్వరూపము. మమ్ముల నచటికే కొనిపొమ్ము.

ఓం. యా దేవీ సర్వభూతేషు క్షాన్తిరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 14

క్షాన్తి – అపకారియెడ్లనైన మనపకారేచ్ఛ – సర్వభూతములయందును క్షాన్తిరూపమున వెలయు దేవికి నమస్కారము. ముమ్మాఱు, పునఃపునః ప్రణామములు.

వ్యాఖ్య:— పరులవలనఁ బీడింపఁబడియు, దాని బదులు సేతకగు తగు బలిమియుండియు, నయ్యపకారము నూరక యోర్చు సామర్థ్యమనెడి క్షమారూపముతో నీవే యున్నావు. మా హితచింతకులు పీడించినను నోర్చుకొనుటకులే, మా యహితులపీడను సైతము సహించు శక్తిగల్గినపుడా క్షమామూర్తితో నీవే మమ్మేడిని బెట్టికొందువు. అట్టి పరాపకార సహిష్ణుతయే నీక్షమామూర్తి. నీ యీ వ్యష్టిక్షమామూర్తికి మా ప్రణామము. ఆ నీ మూర్తియే మాకు శాన్తిని గూర్చును.

ఆ క్షమామూర్తి సర్వభూతములందు సమష్టిస్వరూపబోధముగా వ్యాపించినపుడు, ఆహ్లాదోత్సాహరూపముతో

నూఱింతలుగా హృదయమందు విచరించును. అమ్మా! ఆ విశ్వవ్యాపి క్షమామూర్తియు నీవే. నీకుఁ గోటి ప్రణామములు. అమ్మవు నీవు. క్షమయే నీ మూర్తి. అపరాధమింతయు లేని, అపకారమింతయు లేని, యన్యాయము రవ్వంతయు లేని, స్వేచ్ఛాసంచారస్నేహ బహిర్వికాసముగల, క్షమామూర్తివి నీవే. నీవు తెప్పవేయక మావంక నే క్షమామూర్తివై చూచుచున్నావు. కనుకనే మేమున్నాము. కాకున్న నీ యకృతజ్ఞ జీవజగత్తున కస్తిత్వమే యుండదు. నీ సత్త నంగీకరింపని యకృతజ్ఞ జీవజగత్తును సైతము సాకుచే నీ క్షమామూర్తి కపూర్వోదాహరణము. నీ సమష్టిమహాక్షమామూర్తికి అసంఖ్యప్రణామములు. బీజరూపిణివియు నవ్యక్తకరుణామూర్తివియు నగు నీకుఁ దృతీయ ప్రణామము చేసి నిరంజనక్షేత్రమందుఁ జేరుదుము. అచట క్షమయు నక్షమయు లేవు. దాని సత్తపై నే క్షమ నిల్చియున్నది. క్షమారూపముగా వెలసినను దాని నిర్గుణసత్తకు వెల్తి లేశమును లేదు. ఆ గుణాతీతమూర్తి కనేక ప్రణామములు.

ఓం. యా దేవీ సర్వభూతేషు జాతిరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 15

సర్వభూతములందును జాతిరూపముతో నున్న దేవికిఁ బ్రణామము. పునః పునః ప్రణామములు.

వ్యాఖ్య:— జన్మముతోనే జాతి ప్రకటమగును. బ్రాహ్మణ క్షత్రియాది జాతిరూపముగాను, దేవమానవపశ్వాది జాతిరూపముగాను, నీవే సర్వజీవులను ధరించు

చున్నావు. "నేను దేవతను" అనునపుడు, నీవె జాతిమూర్తితో వాని నీయొడియందుంచుకొన్నావని తెలియును. అమ్మా! నీ యీ వ్యష్టిజాతిమూర్తికిఁ బ్రణామము.

ఈనాఁడు జాతిభేదమునే యెగురఁగొట్టఁజూచుచున్న నీ సంతానము, జాతిరూపముగానున్నది నీ వికారమే యని యెఱుఁగదు. నీవు నిత్యవు. నీ యీ జాతిమూర్తి నిత్యము. జీవ జగత్తు సృష్టియందుండునంతదాఁక జాతిభేదముండక తప్పదు. ఎంత కొట్టుకొన్న నది నశింపదు. అమ్మా! జాతిస్వరూపము సత్యము. కాలావస్థాదేశభేదముచే జాతిభేదము రూపాంతరము నొందునదే కాని, అది జగత్తుండునంతకాలము చెడదని వారికి నీవే తెలియఁజెప్పుము.

అమ్మా! నీ యీ వ్యష్టిజాతిమూర్తికి మ్రొక్కఁగా మ్రొక్కఁగా, సమష్టిమహాజాతిమూర్తివైపు చూపు సాగును. అపుడా యద్వితీయ జాతిసముద్రమందలి తరంగములే యీ వ్యష్టిజాతులని తెలియును. సర్వభూతమహేశ్వరరూపవైన నీ మహాజాతిమూర్తికిఁ బ్రణామము. మహాప్రలయమందు బ్రహ్మాండములు లయించినను, బీజరూపముతో నీ జాతిరూప కారణమూర్తి నిల్చియుండును. జాతిలేని, మూర్తిలేని, ప్రల యములేని దానియందే సర్వము నిల్చియున్నది. జాతిరూప ముగాఁ దాను వెలసినను, దనకు రవ్వంతయు వికారములేని, మనోవాక్కుల కందరాని యా స్వరూపమునుగుఱించి మాటి మాటికి మా చేయు నతులందుకొమ్మా.

ఓం. యా దేవీ సర్వభూతేషు లజ్జారూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 16

సర్వభూతములందును లజ్జారూపముతో నుండు దేవికి ముమ్మారు ప్రణామము. పునః పునః ప్రణామములు.

వ్యాఖ్య :— అమ్మా ! నింద్యకార్యములయెడనైన సంకోచమును విముఖతయు ననెడి లజ్జగా, సర్వభూతములందును నీ వభివ్యక్తవు కాకున్నచో, జగత్తు యథార్థముగాఁ బశురాజ్యముగానే మాఱియుండును. ఒకవంక సాటిలేని క్షమామూర్తితో జీవులందు వెలయుచున్నటులే, యొకవంక లజ్జామూర్తితో వెలయుచున్నావు. నీ యీ వ్యష్టిలజ్జామూర్తికిఁ బ్రణామము. పిదప నీ లజ్జ నీ యీశ్వరమూర్తితో విశ్వవ్యాపినిగాఁ జేసి, సర్వభూతములందును వెలయించి సమష్టిలజ్జారూపముతోఁ గానఁబడుచున్నావు. ఆ నీ లజ్జామూర్తివల్లనే నీ మాతృభావము పూర్ణముగా నభివ్యక్తమై స్నేహపరాకాష్ఠ చక్కఁగాఁ దేఁటపడుచున్నది. అమ్మా ! నీ యీ సమష్టిలజ్జామూర్తికిఁ బ్రణామము. ఈ వ్యష్టిసమష్టిలజ్జామూర్తికి బీజమైన యీ నిరంజనక్షేత్రమునకు మూడవ ప్రణామము.

ఎచట లజ్జలేదో, సంకోచములేదో, స్వేచ్ఛావర్తనము లేదో, సంశయములేదో, దేని సత్త యీ యన్నిటిసత్తయో యిన్నిరూపములతో వెలయుచున్నను, దేనికిరవ్వంతయు వ్యత్యయములేదో, యట్టి "ఏకమేవా ద్వితీయమ్" తత్త్వమునకు నీకుఁ బునఃపునః ప్రణామములు.

ఓం. యా దేవీ సర్వభూతేషు శాన్తిరూపేణ సంస్థితా।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 17

సర్వభూతములందును శాన్తిరూపముతో నున్న దేవికిఁ బ్రణామము. ముమ్మాఱు పునః పునః ప్రణామములు.

వ్యాఖ్య:— విషయ సంభోగమందు యథార్థశాన్తి లేదు. శాన్తియొక్క యాభాసమేయైనను జిత్తమందుఁ బూర్ణ ప్రశాన్తభావ మేర్పడక శాన్తి జాడయైనను దొరకకున్నను, విషయములను గ్రహించుటవలన, వాని ననుభవించుటవలనఁ గల్గిన, యస్వాభావిక చిత్తవిక్షేపమందు రవ్వంత శాన్తి క్షణ కాలము మాహృదయములను బవిత్రము చేసినచో నా శాన్తి మూర్తి నీవే. సర్వభూతములయందును నీమూర్తి యింతయో, యంతయో కానవచ్చును. అది నీ వ్యష్టిశాన్తిమూర్తి. నీవు నీ శాన్తిమయమూర్తితో మమ్ము నీ యొడియందుఁ జేర్చి కొన్నపుడే, శాన్తిస్వరూపము ననుభవింపఁగల్గుదుము. అది క్షణమాత్రమే యైనను, (అపురూపమే) అపూర్వమే. అమ్మా! శాన్తికై వెలినెక్కడనో వెదకు నీ బిడ్డలకు, "నాయనలారా! శాన్తి వెలిని లేదు. మీ లోపలనే కలదని" తెలియఁజెప్పుము. నీవు మా యమ్మవు. శాన్తిరూపిణివి. నీకుఁ బ్రణామము. ఒక్క యపారశాన్తి తక్క మఱేమియు లేనట్టియు త్రితాపసంతప్త మైన మా గుండెను జల్లఁబఱచునట్టియు, నీ మహాశాన్తిమూర్తి కడకు మమ్ములను గొనిపొమ్ము. అది మధుమయము; అనిర్వచ నీయము. ఆ నీ మహతీసమష్టిశాన్తిమూర్తికి మా యసంఖ్య ప్రణామములు. ఎన్నఁడును దానితో వేఱుసేయకుమా. విషయ

భోగాసక్తి తొలఁగనంతదాఁక, నీ యనిర్వచనీయశాన్తిమూర్తి జాడయే దొరకదు. దానికి క్రమెుక్కఁగా క్రమెుక్కఁగా, నవ్యక్తముగ శాన్తిబీజముండెడి వ్యష్టిసమష్టిశాన్తిమూర్తి యుబుకును. అట్టి కారణరూపశాన్తిమూర్తికి నమస్కారము. త్రిగుణాతీతమును మనోవాగగోచరమును నిరంజనమునైన దానిని గుఱించి పునః పునః ప్రణమిల్లుచున్నాము. మమ్మట్టి నిత్యశాన్తిమయ క్షేత్రమందుఁ జేర్పుము.

ఓం. యాదేవీ సర్వభూతేషు శ్రద్ధారూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 18

సర్వభూతములందును శ్రద్ధా = వేదార్థమందు దృఢప్రతీతి. శ్రత్ =సత్యమ్ ధీయతే ఇతి శ్రద్ధా. పరిపూర్ణ విశ్వాసరూపముగానున్న దేవికిఁ బ్రణామము. పునఃపునః ప్రణామములు.

వ్యాఖ్య :— అమ్మా! శ్రద్ధ యనఁగానే, తొల్త నీ వ్యష్టిశ్రద్ధామూర్తియే తోఁచును. గురువేదాన్త వాక్యములందు దృఢవిశ్వాసమే శ్రద్ధ, యైనను నిరుక్తకారుఁడు యాస్కముని చేసిన నిరుక్తినిగూడఁ దెలిసికొనుట ముఖ్యము. "శ్రత్ = సత్యం ధీయతే ఇతి శ్రద్ధా" సత్యమును ధరించు ప్రయత్నమే శ్రద్ధా శబ్దవాచ్యము. నీ వెవరిని గల్పితమాయాబంధమునుండి విడిపింతువో, విడిపింపఁజూతువో, వారి హృదయమందు మొదట నీ శ్రద్ధామూర్తియే యావిర్భవించి, గురువేదాన్త వాక్యములందు విశ్వాసమును గల్గించును. సత్యప్రతిష్ఠయే వారి జీవనలక్ష్యమగును. కొలఁదియో గొప్పయో సర్వజీవుల హృదయమందును వ్యష్టిశ్రద్ధారూపముతో వెలయుచున్నావు.

అట్టి సీకుఁ బ్రణామము. గీతయందు - "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః । జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తి మచిరేణాధి గచ్ఛతి" భక్తిపూర్వక కర్మానుష్ఠానము చేయువాఁడు, తత్పదమందు బుద్ధి నిల్చినవాఁడై, యింద్రియనియామకుఁడై జ్ఞానమునొంది వడిగాఁ బరమశాన్తి నొందును.

సాధకునకుఁ బ్రణిపాత పరిప్రశ్న సేవలవలన జ్ఞానము గల్గును. ఈ మూఁడిఁటి సంసిద్ధిచే, జ్ఞానియైన పిదప, అన్నమయ కోశము నతిక్రమించి సహస్రారక్రియవలన శిరారోహణ మబ్బినచో మూఁటికి ననురూపమైన మూఁడు మనోమయావస్థలు గల్గును.

1. శ్రద్ధావాన్, 2. తత్పరః, 3. సంయతేంద్రియః. శ్రద్ధా-శ్రత్-విశ్వాస (విగతశ్వాసము) ధా-ధరించుట, శ్వాస క్రియచే మనసును లేవఁగొట్టి లోపల ధరించుట పేరే శ్రద్ధ. (మనసునందే మనసునుంచుట.) విగతశ్వాసము కుంభకము. ఈ యవస్థకు వచ్చినపుడే సాధకుఁడు శ్రద్ధావంతుఁడగును. శ్రద్ధావంతుఁడు కాఁగానే సూక్ష్మాతిసూక్ష్మ దర్శన శ్రవణ మననాది క్రియ యగును. వాని నన్నిఁటి నేకాగ్రముచేసి, తత్ - బ్రహ్మమునందు, అనఁగా బిందునాదములందు, పరః - రతుఁడగును. ఇదే తత్పరావస్థ. ఇటులు చేయుటచే దర్శన శ్రవణ మననాది వృత్తి 'ఏకమందు' ఆకృష్టమగును. మఱి తమ తమ పనులను విడిచి యింద్రియములు సంయతములగును. అనఁగా నొండొంటిని జేరిపోయి యేకమగును. ఇదే సంయతేంద్రియావస్థ. దీని నొందిన సాధకునకు జ్ఞానసిద్ధి గలుగును. అనఁగాఁ జిత్తవృత్తి సమాప్తమై "అహం జ్ఞానమయుఁ" డగును. ఈ జ్ఞానము

గల్గిన క్షణమందే పరమశాన్తి (కైవల్యము - బ్రాహ్మీస్థితి) లభించును.

కనుక శ్రద్ధధానాద్యవస్థలు, ప్రణిపాత పరిప్రశ్న సేవాఫలములు. గాన సూక్ష్మప్రణిపాతమునకు మున్నె సైతము సాధకుఁడు శ్రద్ధావంతుఁడు, తత్పరుఁడు, సంయతేంద్రియుఁడు నగుచుండును. ఇవి కాకున్నం బ్రణిపాతాదులయం దధికారము లేదనుటే. స్థూలశ్రద్ధావంతుఁడు - గురువేదాన్తవాక్యములందు విశ్వాసియు, తత్పరుఁడునై, యా విశ్వాససహాయముతోడి క్రియానుష్ఠానముచే బ్రహ్మచర్య పరాయణుఁడగును.

"అజ్ఞశ్చా శ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః॥"

శ్రద్ధాహీనుఁడును సంశయగ్రస్తుఁడునైనవాఁడు చెడును. సంశయాత్మున కిహము లేదు. పరము లేదు. ఆనందము లేదు. క్రియావంతుఁడు కానివాఁడే అజ్ఞుఁడు. వాఁడు మనసునందే మనసును నిల్పు నంతర్నిష్ఠుఁడు కాఁజాలఁడు. గురువేదాన్త వాక్యములందు విశ్వాసములేని సంశయాత్మకుఁడు, ప్రణిపాతాది ప్రకరణముతోఁ గ్రియానుష్ఠానమందు ముందడుగు వేయలేఁడు. కనకనే శ్రద్ధావత్త్వాద్యవస్థలు తెలియని యజ్ఞుఁడు, వాఁడే సంశయాత్ముఁడు. ఇయ్యిరువురు నాత్మగతియందుఁ భ్రష్టులై సంసారగతియందే పొరలుచుందురు. ఇందు సంశయాత్మునకు నిహపరములందు శాన్తియే లేదు. ఆనందమును లేదు. అంతరాకాశ మంధకారమయమగుటచే, సంసారభ్రమణము తప్పదు.

శ్రద్ధ, ఆత్మస్వరూపజ్ఞానమునకుఁ బూర్వావస్థ. శ్రద్ధ కలుగనంతకాలము, ఆత్మరాజ్యమందుఁ జొచ్చు నాశయు లేదు. శ్రద్ధయన్నను నిశ్చయజ్ఞానమన్నను ఇంచుమించుగా నొక్కటే. సంశయముండునంతదాఁక నిశ్చయజ్ఞానముఁ కలుగదు. ఒక్క సారి శ్రద్ధ ఉదయించెనా – మఱి యది పోదు. శ్రద్ధ యనునది జ్ఞానముయొక్క యొక యపూర్వావస్థ. అదె సత్యబ్రహ్మము. (అమ్మ – పరమాత్మ) రూపముగా – నిస్సంశయరూపముగా వెలయును. శ్రద్ధాబలమునుబట్టి సాధన భజనాదులు సాగించు వారే ధన్యులు. అమ్మయొక్క వ్యష్టిశ్రద్ధామూర్తికి మ్రొక్కుఁగా మ్రొక్కుఁగా, సమష్టిశ్రద్ధామూర్తి మీఁదఁ జూపుపాఱి, సువిశాల శుభాకాశరూపమును నిస్తరంగమహోదధికల్పమునైన నీమహా శ్రద్ధారూపమం దీ విశ్వము నిల్చియున్నదని తెలియును. ఆ నీ మహేశ్వరశ్రద్ధామూర్తి యొడియందే సకలజీవజగత్తు శోభిల్లు చున్నది. అట్టి నీ శ్రద్ధామూర్తి చరణములకు నమస్కారము.

పిదప వ్యష్టి సమష్టి శ్రద్ధాబీజమైన యావ్యక్తకారణ రూపిణీ శ్రద్ధకు 'నమస్తస్యై' యనుచుఁ బ్రణమిల్లి, యొకసారి గుణాతీతస్వరూపమును జేరుదుము. అచట శ్రద్ధాశ్రద్ధ లుండవు. దాని సత్తపైనే శ్రద్ధ నిల్చియున్నది. శ్రద్ధారూపమున వెలయు చున్నను, దాని స్వరూపమునకు వ్యాఘాతము లేదు. దానిని లక్షించి పునః పునః ప్రణమిల్లుచున్నాము. అమ్మా! మా హృదయములయందు శ్రద్ధామూర్తితో వెలసి, జ్ఞానము నిచ్చి ధన్యులను జేయుము.

జ + ఞ + ఆ + న = జ్ఞాన. జ = జాయమాన (ఉత్పత్తి స్థితి నాశములు గలది – సర్వము) ఞ – శబ్ద స్పర్శ రూప రస

గంధాదులందు, ఆ = ఆసక్తి, న = లేదో అనఁగా, ఉత్పత్తి స్థితి నాశములు గల దృశ్యజగద్వస్తువులం దాసక్తి లేకుండుటే జ్ఞానము. మఱియు మూర్ఛా మృత్యు నిద్రలనెడి యజ్ఞానము నాశ్రయింపని స్థితియే జ్ఞానావస్థ.

ఓం. యా దేవీ సర్వభూతేషు కాన్తిరూపేణ సంస్థితా।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 19

సర్వభూతములందును శోభారూపముగా నున్న దేవికిఁ బ్రణామము. పునఃపునః ప్రణామములు.

వ్యాఖ్య:— కాన్తి (సౌందర్య) రూపముతో సర్వమందును దల్లియే వెలయును. జీవుఁ డెంత కురూపుఁడే కానిమ్ము; ప్రత్యేకమందును గాన్తి యనెడి దొకటి కలదు. మనుజుఁడా కాన్తి నింతయో యంతయో యనుభవింపఁగలఁడు. అంతే కాదు; పూలయందు, స్త్రీలయందు, శశియందు, శిశువులందు గాన్తి యేదే నొకవిధముగా నుండుటచేతనే, వానిని జూచు నపుడు మన చిత్తములు వికసించును. అది యమ్మకాన్తియే. జీవదేహమందుఁ గాన్తిమూర్తితో నమ్మ యున్నంతకాలము నామె కాన్తిమూర్తి ప్రత్యక్షమగుచుండును. ప్రాణిదేహమునందే కాదు, వృక్ష లతా గుల్మ పర్వత నదీ గ్రహ నక్షత్రాదులందంతటను నామె కాన్తిమూర్తి ప్రత్యక్షమగుచుండును. ఇదే మన యమ్మ వ్యష్టికాన్తిమూర్తి. ఈ వ్యష్టికాన్తిరూపిణికిఁ బ్రణామము.

క్రమముగా వ్యష్టివస్తువులను విడిచి, సర్వభూత మహేశ్వరియొక్క మహాకాన్తివంకఁ జూపు పాఱునపుడే, యీ సర్వ

జగత్తు కాంతిమయము, సౌందర్యమయము, మధుమయము నగును. ఈ మన క్షుద్రబుద్ధి సాగినంతవఱకు మాత్రకమనీయ కాన్తిం జూచియే మతిపోవు మనము, సర్వత్ర ప్రసరించియున్న రూపహీన కమనీయరూపమును జూచి, యనుభవించి యేమై పోవుదుమో! మన యహంతా కాన్తి సట్టేటిలోఁ గలిసిపోవును. ఆ యరూప రూపసాగరమందు మునిఁగిపోయి, మన మెట్టి యనిర్వచనీయభావమయత నొందుదుమో! అది యిట్టి దనఁ జాలము. ఏ రూపమును జూచి వ్రజాంగనలు మైమఱచిరో, ఏ రూపమును జూచి యాఁబసులు సైతము మేఁత మాని, నీయందే చూపునిల్పినవో, ఏ రూపమును జూచి జడ యము నయుఁ బ్రాణమయియై యుబికి పాఱినదో, యది అమ్మా! నీ రూపము కాదా? ఆ మనోహరకాన్తి నొకసారి కన్నారం గన్నవారికి జగమున నీడు లేదు. ఆ లోభనీయకాన్తి మా జీవత్వమునే మఱపింపఁగలదు. విశ్వవ్యాపినియైన నీ యనంతకాన్తి మూర్తికి మా ప్రణామము.

పిదప నీ వ్యష్టిసమష్టికాన్తి పుట్టిన యవ్యక్తబీజమయిన కారణరూపకాన్తిమూర్తికి మా ప్రణామములు. ఇఁక నీ నిరంజన స్వరూపమును గుఱించి మాటిమాటికిఁ బ్రణమిల్లుదుము. అచటఁ గాన్తియన నేదియు లేకున్నను, గాన్తి యన్నది దాని కాన్తియే. అది కాన్తిరూపమునఁ బ్రకాశించినను, దాని యవ్యయస్వరూపమునకు రవ్వంతయు వ్యయము కాదు. ఆ పరమకమనీయ పరమప్రేమాస్పద పరమాత్మస్వరూపమునకుఁ బునః పునః ప్రణామములు.

ఓం. యా దేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 20

సర్వభూతములందును సంపత్స్వరూపముతో నున్న దేవికి నమస్కారము. లక్ష్మి శబ్దమునకుఁ బ్రాణశక్తి యని యర్థము. జీవదేహమందుఁ బ్రాణమున్నంతవఱకే యది లక్ష్మి (శ్రీ) యుక్తము. లక్ష్మి – సంపద, శోభ, సౌందర్యము, మున్నగు నే యర్థమును జెప్పికొన్నను బ్రాణమనునది యొక్కటే వాని కాధారము.

అమ్మయే సర్వభూతములందును లక్ష్మీమూర్తితో వెలయుచున్నది. ఇంద్రియగ్రాహ్యము కాకున్నను, ఈ మూర్తి మన యనుభవమునకు వచ్చుచుండును. జీవించియున్నవాఁ డెవ్వఁడును బ్రాణాభావము ననుభవింపఁడు. జీవనమందు సదానుభవయోగ్యము ప్రాణస్వరూపమే. ఇదె యమ్మ వ్యష్టిలక్ష్మీమూర్తి. అట్టి ప్రాణరూపిణి తల్లికి వేనవేలు ప్రణామములు.

మన లోలోపల సదా ప్రాణరూపముతో ననుభూత యగుచున్నదే, యమ్మ వ్యష్టిలక్ష్మీమూర్తి. ఆ మూర్తికే తొల్త 'నమస్తస్యై' యనుచుఁ బ్రణమిల్లి, పిదప విశ్వవ్యాపి మహాప్రాణరూపముగా నున్న సమష్టిప్రాణమయమూర్తిని దర్శించి, ఒక్క ప్రాణసముద్రమందలి విభిన్నతరంగములే జీవరూపముగా నుబుకుచున్నవి. బహుకాలమునుండి వీని నవమానించుచున్నాము. నేఁటినుండి మఱి యవమానింపరాదు. ఇపుడు శ్రద్ధాపూర్వకముగా నమస్కరించి, మన క్షుద్రప్రాణమును, ఆ మహాప్రాణసముద్రమందు ముంచివేయుదుము.

దానివలన మన జీవత్వ మంతమొందును. పిదప నా వ్యష్టి సమష్టి ప్రాణమునకుఁ గేంద్రమైన యీ యవ్యక్తప్రాణసత్తకుఁ బ్రణమిల్లి నిరంజనక్షేత్రమం దుపనీతులమై 'నమోనమ!' యనుచు మైమఱచి యాత్మలాభము నొందుదుము.

ఓం. యా దేవీ సర్వభూతేషు వృత్తిరూపేణ సంస్థితా ।
ఓం నమ స్తస్యై ... ... ... ... ... 21

సర్వభూతములందును వృత్తిరూపముతో నున్న దేవికి మా ప్రణామములు.

వ్యాఖ్య:— వృత్తి = కృష్యాది క్రియారూప జీవిక. చిత్తవృత్తి. అవ్యక్తచైతన్య మెపుడేని దేని నాశ్రయించి యున్నటులు వెలయునో, అనఁగా వ్యక్తభావము నొందునో, యపుడు దానిని వృత్తి యందురు. జీవికారూపవృత్తియుఁ జైతన్యముయొక్క యీవిశిష్టాభివ్యక్తికంటె వేఱేమియుం గాదు.

అమ్మయొక్క యీ వృత్తిస్వరూపమును మనము సదా యనుభవించుచునే యున్నాము. అనింద్యవృత్తిగానో అంతః కరణవృత్తిగానో, అమ్మయే యడరుచున్నది. కాని మన మెన్నఁడు నా మూర్తి నాదరింపలేదు. అది తల్లిరూపమే యని తలంపనైనలేదు. ఇపుడమ్మయే వృత్తిరూపమున యడరుచున్న దని యనుభవించు యోగ్యత కలిగినది. ఆ యకృతజ్ఞతకుఁ బ్రాయశ్చిత్తముగా 'నమ స్తస్యై' యనుచుఁ బ్రణమిల్లుదుము. వ్యష్టివృత్తిరూపిణీ! తల్లీ! మా మ్రొక్కు లందుకొమ్మి.

ఇఁక సూక్ష్మమును లక్షించి (సమష్టి) చూడుఁడు. విశ్వ మయమైన యొక యఖండవృత్తి యనెడి వస్తువున్నది. సృష్టి

స్థితి ప్రలయ రూపముగాఁ దెలియు నా మహావృత్తిరూపిణి యీశ్వరీమూర్తియొక్క స్ఫురణము. ప్రతిజీవునిలోను భిన్న భిన్న వృత్తిరూపముగా వెలయుచున్నది. ఆ మహావృత్తి రూపిణికి సర్వేశ్వరికిఁ దల్లికి మా ప్రణామములు.

పిదప దృష్టి సమష్టివృత్తిప్రకాశమునకు, సూక్ష్మతమావ్యక్తకారణమును; దాని విలయమునకును గేంద్రమైన మాత్రవ్యక్తకారణమూర్తికి మా మ్రొక్కు లర్పించి, తుదకు నిరంజనతత్త్వమందుఁ జొత్తము. అచట వృత్తియనుట కేమియు లేదు. అది విశుద్ధ చిత్తే. అచటఁ జేరినచో నన్నివృత్తులును నంతరించును. గుణాతీతమగు నా స్వరూపమునకు 'నమోనమ' యనుచుఁ బ్రణమిల్లుదుము. అమ్మా! వృత్తిరూపిణివైన నీవు స్థూల సూక్ష్మ రూపములను విడిచి విశుద్ధబోధాకార (బ్రహ్మాకార) మున వెలయునపుడే మా ప్రణామములు సార్థకము లగును.

ఓం. యా దేవీ సర్వభూతేషు స్మృతిరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 22

అమ్మ వృత్తిమూర్తికంటెఁ బలమైనది స్మృతిమూర్తి. ఏలన, దొల్త వృత్తిరూపముగా బయల్పడిన భావమే తర్వాత భావసంస్కారరూపముగాఁ జిత్తమున నిల్చును. అదే మఱలఁ జిత్తక్షేత్రమున నుబుకునపుడు స్మృతి యనఁబడును. అమ్మ స్మృతిరూపముతో మన జన్మ జన్మాంతరములందు రవ్వ రవ్వంతగా నందిన జ్ఞానమును మొత్తముగా ధరింపఁజేయుచున్నది. ఒక్కొక్కమరణము తర్వాత, ఆ జన్మమందుఁ

బొందిన జ్ఞానము జాఱిపోయినచో మనము పూర్ణజ్ఞానము నొందు నాశయే యుండదు. మోక్షాస్వాద మెన్నటికిని దొరకదు. అనాదిగా నజ్ఞాననరకమందే మ్రగ్గుచున్నాము. మనల నజ్ఞానమునుండి విడిపించుటకే స్మృతిరూపముతో స్నేహమయి మాత ప్రతిజీవుని హృదయమందు నెల్లప్పుడును వెలయుచున్నది. కనుక స్మృతిరూపిణీమాతృస్నేహమయాంకమందుండి, జన్మము తరువాత జన్మము ధరించి జ్ఞానరాశిని గూర్చుకొనుచున్నాము. దాని ఫలముగానే యొకనాఁడు మనము "అహం బ్రహ్మాస్మి" యనెడి చరమస్మృతికడకుఁ బోవుదుము. జీవత్వభ్రమము పూర్తిగా నణఁగును. వ్యష్టిస్మృతిరూపిణి మన యమ్మకుఁ బ్రణమిల్లి, మఱి యామె కృపచే సర్వభూతమహేశ్వరీసమష్టిస్మృతిమూర్తిని జేరి, యొక మహాస్మృతిమూర్తి యీ బ్రహ్మాండమును ధరించుచున్నదని కనుగొందుము. ఆ సమష్టిస్మృతిమూర్తిసముద్రమందలి తరంగములే యీ సర్వభూతములందలి విభిన్నస్మృతులని తెలిసికొని, దానికి మ్రొక్కుదుము. పిదప సర్వస్మృతిబీజరూపిణి యవ్యక్తకారణమూర్తికి మ్రొక్కి నిరంజనస్వరూపమును జేరికొందుము. మా జీవత్వస్మృతి లోపించి "అహం బ్రహ్మాస్మీతి స్మృతి" విడువకుండునప్పుడే, మాకు నీ నిర్గుణస్వరూపసంధానము లభించును. అచట స్మృతి యనుట కేమియు లేదు. దాని సత్తపైనే స్మృతిసత్త యున్నది. స్మృతిరూపముగా వెలసినను, దాని నిర్గుణత్వమునకు రవ్వంతయు వ్యాఘాతము రాదు. అట్టి స్వరూపమునకు మా పునః పునః ప్రణామములు.

ఓం. యా దేవి సర్వభూతేషు దయారూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై .... ... ... ... ... 23

సర్వభూతములందును దయారూపముతో నున్న దేవికి మా ప్రణామములు.

వ్యాఖ్య:— జీవుల దుఃఖములను జూచి వానిని దొలఁగించు నిచ్ఛకే దయ యని పేరు. ప్రత్యేకజీవునియందు నింతో యంతో యా దయామూర్తి వెలయుచుండును. దానికి మా ప్రణామములు. అది వ్యష్టిదయామూర్తి. దయచూపునపుడు జరుగు పనివలన దయచూపినవానియందును, జూపఁబడినవాని యందును దద్రూపముతో నున్న నీ మూర్తికి నమస్కరించి, దయయనెడి సాత్త్వికవృత్తితో జీవసమష్టియందున్న నీకుఁ బ్రణమిల్లుచున్నాము. ఈ విశ్వమందంతటఁ గానవచ్చుచున్న ఘనీభూతదయామూర్తి యమ్మదే. ఆ దయాసముద్రమందే మేమున్నాము. ఆ పరమేశ్వరీమహాదయామూర్తికి మా ప్రణామములు. ఈ వ్యష్టి సమష్టి దయాస్ఫురణమునకుఁ గారణమైన దయామూర్తికిఁ బ్రణమిల్లి, యా నిరంజనక్షేత్రమందుఁ జేకుదుము. దాని సత్తవల్లనే దయ నిల్చినది. దయారూపముతో వెలయు దానికి మా పునఃపునః ప్రణామములు.

ఓం. యా దేవీ సర్వభూతేషు తుష్టిరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... ... 24

తుష్టిరూపముతో సర్వభూతములందు నున్న దేవికి మా ప్రణామములు.

ఇష్టప్రాప్తి, అనిష్టనివృత్తి యనువానివలన క్షణకాల మంతఃకరణమునం దుదయించు భావమే అమ్మ తుష్టిమూర్తి. వ్యష్టిరూపముతో నిది ప్రతిజీవునియందును దోఁచును. దానికి మా ప్రణామము. తరువాత నమ్మ సమష్టితుష్టిమూర్తి యెడఁ జూపువాఱఁగా, విశ్వమయమైన యొక తుష్టిసముద్రమున్నదని తోఁచును. జీవులు దానియంద విచరించుచున్నారు. శోకార్తుని మొఱ్ఱయందును, రోగార్తుని పీడయందును, ఆఁకొన్నవాని యూఁకటిచిచ్చునందును అమ్మ తుష్టిమూర్తియే వెలయుచున్నది. జీవుఁ డేడ్చినను అది తుష్టిసంధానమునకుఁ గాకున్నచో నేడు వఁడు. తెలిసియో తెలియకో సర్వజీవులు తుష్టినే సేవించు చున్నారు. తుష్టిసంధానమునకే యసంఖ్య జన్మమృత్యువుల యెడపెడ దెబ్బలను సహించుచున్నారు. అమ్మయొక్క యిమ్మహా పారమేశ్వరీ తుష్టిమూర్తికిఁ బ్రణామములు. గీత యం దమ్మయే చెప్పినది. (13-14)

"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖః క్షమీ॥

సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।
మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మద్భక్తః స మే ప్రియః॥"

సాధకుఁడు సాధనబలముచే 'నేను' నందుం జేరి సంకల్ప వికల్పాత్మక మనస్సును, నిశ్చయకరణాత్మకబుద్ధిని నొకచోట స్థిరపెట్టును. అపుడు వాని యంతఃకరణమందు భూతాది విష యక విరోధిభావమును లోపించి క్రమముగా సర్వమందును 'నేను' అనెడి జ్ఞానము గలుగును. నాకుఁ బ్రియతమవస్తువు

'నేనే' అనెడి భావవికాస మేర్పడును. తన కష్టమును దాను సహింపఁజాలనటులే, సర్వమందును గరుణారసపూర్ణుఁడై, నేనునందుఁ జేర్చివేయును. కనుక 'నాది' యనుట కేమియు మిగులదు. అప్పుడే యహంకారమునుం బొడమదు, గాన సుఖ దుఃఖములనెడి వృత్తియు నుండదు. సర్వము సమానమగును. కేవల క్షమయు సంతుష్టియు మిగిలిపోవును. తొలుత నుండిన ద్వైతభావము తొలఁగి, యిపుడు ద్వైతాద్వైత వర్జితమైన యవస్థ వచ్చును. ఇదే యోగి యవస్థ. ఇపుడే యపారమైన యాత్మవికాసము గలుగును. గురువాక్యములను విశ్వసించిచేయు సాధనఫలముగా, నీ యవస్థ నొందినవాఁడే నాకుఁ బ్రియుఁడు. ఏలన, నాతఁడు 'నేను' దక్క మఱేమియు లేనివాఁడు.

సర్వవ్యాపక మాతృతుష్టిమూర్తి సంధానము నొందని వాఁడు నిత్యసంతుష్టుఁడు కాఁజాలఁడు. అమ్మా! నీవు మహా తుష్టిస్వరూపవై వెలసి ప్రారబ్ధవశమున దురాశాజనితమైన యసంతుష్టిని దొలఁగించి మా యీ ప్రణామములను సార్థక మొనరింపుము. మేము నీ కారణతత్త్వమందుఁ బ్రవేశింపఁ గలము. ఈ తుష్టి యావిర్భవించిన నీ యవ్యక్తకారణమూర్తికి మా ప్రణామములుచేసి నిరంజనసత్తను జేరుదుము. అచటఁ దుష్టి, యసంతుష్టి, యనునవి లేవు. దాని సత్తపైనే తుష్టి సత్త యున్నది. తుష్టిరూపమున వెలయుచున్నను, దాని కెట్టి వెల్తియు రాదు. ఆ నీమూర్తికి మాటిమాటికిం బ్రణామములు.

ఓం. యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై... ... ... ... ... 25

సర్వభూతములందును మాతృరూపముతో నున్న దేవికి మా ప్రణామములు.

వ్యాఖ్య:— అమ్మయే సర్వజీవులను గర్భమందుఁ దాల్చి యుంచి, వానిని వ్యక్తావస్థకుఁ దెచ్చుటకుఁ దపఃక్లేశ మొందుచున్నది. (ఇచ్ఛాశక్తి ప్రయోగముచేయుననుట.)అపుడు జీవుఁడనెడి పేరితో నొక పృథక్సత్త ప్రతీతమగును. ఆ రీతిని ప్రసవించి స్తన్యదానముతోఁ (ఖండఖండ విషయజ్ఞానముతో) బరిపుష్టులను జేయుదువు. అమ్మా! జన్మమృత్యు పరంపర లందును నీ సంతానమును తెప్పవేయక చూచుచు జీవుల మిథ్యాహంతనుదొలఁగించి జ్ఞానస్తన్యము నిచ్చుచుఁ బోషించి, క్రమముగా మాతృసత్తయందు విశ్వాసులనుజేసి జీవకర్తృత్వ మును మఱపించి, నీలో జేర్చికొని, మాతాపుత్రసంబంధము లేని యొక యజ్ఞేయతత్త్వమునందుఁ జేర్చుదువు. ఇదే నీ సుప్రకట మాతృమూర్తి. ఇటులు నీ స్థూల సూక్ష్మకారణ నిరంజన స్వరూపమున నీ మాతృత్వమును వెలయింపఁజూచు నీకుఁ బునః పునః ప్రణామములు చేయుచున్నాము. స్థూలముగా (వ్యష్టిగా) మా కొక్కరికి మాతగా వెలయుదువు. సూక్ష్మముగా (సమష్టిగా) మా కందఱకు (విశ్వమునకు) నీవే మాతవు. కారణ ముగా మమ్మును విశ్వమును గర్భమందుఁ దాల్చిన మాతవు. తురీయముగా 'నేను' 'విశ్వము' అనెడి మాట లేని కేవలాత్మ స్వరూపమాతవు. ఇన్ని విధముల మాతృత్వ మొందిన నీకు మా ప్రణామములు.

ఓం. యా దేవీ సర్వభూతేషు భ్రాన్తిరూపేణ సంస్థితా ।
ఓం నమస్తస్యై ... ... ... ... 26

సర్వభూతములందును భ్రాన్తిరూపముననున్న దేవికి మా ప్రణామములు. పునః పునః ప్రణామములు.

వ్యాఖ్య:— సత్యప్రచారమును జేయుటకు దర్శనకారు లెవ్వరును ప్రచారముచేయ సాహసింపలేదని తోఁచును. దేవీమాహాత్మ్యమందలి సర్వాంశములను విడిచి, యీ రెండు మంత్రములు (మాతృరూప, భ్రాన్తిరూప), లోకమునకు వాస్తవముగాఁ దెల్పిన సత్యము సాటిలేనిది. భ్రాన్తియనుచుఁ గొందఱెగురఁగొట్టఁజూచు రూప మమ్మదే. మన యొకనోరు, ఒక కలము, ఒక మనసు, అను నీ క్షుద్రసాధనములతో నీ రెండు మంత్రముల వ్యాఖ్యానించు టెట్లు? భారతదేశమం దింటింట నీ దేవీమాహాత్మ్యము పఠింపఁబడుచున్నది; కాని యీ రెండు మంత్రముల తాత్పర్యము మనసున కెక్కినపుడే చక్కఁగా దానిని దెలియఁగలము. దుర్బలులకు బలమును, హతాశుల కాశ్రయము నైన యిట్టి యభయవాణి జీవుని మర్మమర్మములను గదల్చునది మఱియొకటి కానరాదు. వేదములందును వేదాన్తములందును భాషావరణమందు మఱుఁగుపడిన సత్యమును, దేవీమాహాత్మ్యమందలి (సప్తశతియందలి) యీ రెండు శ్లోకములే తెలియఁజూపినవి.

వినుఁడు — అమ్మరూపము భ్రాన్తియెట్లగును? రజ్జువునందు సర్పభ్రాన్తిని బోలి, నిర్గుణమును నిరుపాధికమునైన బ్రహ్మమందు జగద్భ్రాన్తి కలుగుచున్నది. సరే; నిజమే; రజ్జు

వేనాఁడును సర్పము కానట్లే (రజ్జువుగా నెన్నఁడును సర్పము లేనట్టులే) బ్రహ్మము జగత్తుకాదు. (బ్రహ్మముగా నేనాఁడును జగత్తులేదు.) ఈ విషయమందాలోచించినచో భ్రాన్తియెవరిది? అనునప్పుడు నీవుచేయు జిజ్ఞాసదే యందుము. బ్రహ్మమందు భ్రాన్తి లేదు. అది నిర్మలము, చిత్స్వరూపము. జీవుఁడే భ్రాన్తుఁడు. సరే; రజ్జువు జడపదార్థము. దానియందు సర్ప మనెడి యధ్యాసయగునపుడుకూడ రజ్జువునందు సర్పజ్ఞానము లేదు. ఇది కేవల సత్యము. కాని విచారించి చూడుఁడు, రజ్జువు చేతనము (బోధస్వరూపవస్తువు) అగుచో సర్పాధ్యాస మన్న దియు ఆ బోధమందుఁ బ్రతిభాసింపదా? అవశ్యము ప్రతిభా సించును. ఏలన - బోధముచే గ్రహింపఁబడునదే ప్రకాశిత మగును. ఇదే బోధస్వరూపము; కనుకనే రజ్జుస్థానీయభ్రమము చిద్రూపమగుటవలన దానియందు సర్పస్థానీయజగత్తుయొక్క యధ్యాసమగును. అదియు బ్రహ్మముయొక్క ప్రకాశమువల్లనే ప్రకాశితమగును. మఱియు వాస్తవముగా మనుష్యమాత్రుని యనుభవము నిట్టిదే.

ఆధునిక మాయావాదులు కొందఱిమాటను మన్నింపను. వారు బ్రహ్మముయొక్క కేవలాస్తిత్వాంశము, మాయయొక్క జీవత్వాంశము నను రెంటిదే యధ్యాస మందురు. సరే; వారి మాటను మన్నించియే జిజ్ఞాసను జేయుదము. చైతన్యశూన్యము, అస్తిత్వభాగ మగునా? ఏనాఁడునుంగాదు. అస్తిత్వము చైతన్యము భిన్నవస్తువులు కావు. కనుకనే జగ ద్రూపముగాఁ గానవచ్చుదానిని, వేయిసారులు భ్రాన్తి యన్నను ఆ భ్రాన్తి బ్రహ్మము (చైతన్యము) యొక్క ప్రకా

శముచేతనే ప్రకాశితమగుచున్నది. బ్రహ్మమం దేయవస్థయం దేది ప్రకాశితమగునో, యది బ్రహ్మముకంటె వేఱేమియుం గాదు. కనుకనే భ్రాన్తియును బ్రహ్మమే. ఇవి యన్నియు విచారవాక్యములు. ఇదంతయు మస్తిష్క ధర్మవిచారము. ఆచార్యులు, భాష్యకారులు, ఏ యవస్థను జేరినపుడు జగత్తును మిథ్యారూపముగా నెంచిరో దాని యాథార్థ్యము ననుభవింప నేరని కొందఱ మాయావాదులచేతఁ బడి, యాచార్యుల యనాక్షిప్త దిగ్విజయవాణియు నేఁ డాక్షేపయోగ్యమైపోయి నది. ఇదే యాక్షేపవిషయము. మనము భగవద్భాష్య కారులకు నమస్కరింతము. వారు నిజముగా జగద్గురురూపమున నవతరించిరి.

అమ్మా! ఈ జగత్తు ఈ దేహము నుండునంతదాఁక నీ యనిర్వచనీయ భ్రాన్తిమూర్తియు నుండఁగల దనుకొను చున్నాము. భ్రాన్తియే లేనపుడు ఈ జగన్నాటకమే లేదు. జ్ఞానమయివైన నీవు భ్రాన్తిమయివయియే, యీ యనిర్వచ నీయ జగల్లీలలను జరుపుచున్నావు. మేము భ్రాన్తిని భ్రాన్తియే యనుచు నెగురఁగొట్ట నెంచుచున్నాము. కనుకనే భ్రాన్తి చేతినుండి విడివడకున్నాము. అమ్మా! రేవగళ్లు నిన్ను మఱచి, మమ్ము మేము మఱచి వినశ్వరవిషయములందుఁ జిక్కువడు చున్నాము. ఈ మఱపు నీవే; భ్రాన్తియు నీవే. నీవు నిన్ను భ్రాన్తిరూపమున వెలయించుకొనునంతదాఁక నీ యథార్థ స్వరూపమును బయలుపెట్టు సామర్థ్య మెవ్వరికిం గలుగదు. నిన్ను నీ వాత్మరూపముగాఁ బ్రకటించికొన్ననాఁడు, నీ యీ భ్రాన్తిమూర్తియే మా జగద్జ్ఞాన భేదజ్ఞానములను మఱ

పించును. భ్రాన్తియే లేక జగత్తును మఱచు టెట్లు? ఈ కేలి ధూళిమాలిన్యము, మన నడుమ నగు నెడము మున్నగు నవన్నియు నీ వేదో యొకనాఁడు భ్రాన్తిరూపముతోఁ దొలఁ చెదవని యాశించుచున్నాము. అమ్మా! నీవు మాహృదయ మందెల్లప్పుడు భ్రాన్తిమూర్తితో నిల్చియున్నావు. కనుక నే యొకనాఁ డెప్పుడో నిశ్చయముగా, నన్నియు విడిచి నిన్నే చేరుకొందుము. ఆ దిన మింకెంత దూరమున్నదో?

అమ్మయే ప్రతిదినము మూఁడవస్థలుగా విశేషించి భ్రాన్తిమూర్తితోఁ వెలయుచున్నది. చూచుచునే యున్నాము గాని తెలియలేకున్నాము. జాగ్రదవస్థయందలి యహంతామమతలు స్వప్నరాజ్యమందుఁ బ్రవేశింపఁగానే మఱుఁగగుచున్నవి. అక్కడఁ జేరఁగానే క్రొత్త యహంతామమతలతో విచరించు చున్నాము. పిదప సుషుప్తిలోఁ జొచ్చునపుడు జాగ్రత్స్వప్న కథలన్నియు మఱచుచున్నాము. అపుడు దేని నంటని 'నేను' ఒక్కటే, ఏ యవ్యక్తక్షేత్రమందుఁ జేరునో తెలియదు. ఈ విధముగాఁ బ్రతిదినము భ్రాన్తిమూర్తితో నమ్మ దర్శన మగు చునే యున్నది. కనుక నేదో యొకనాఁడు సర్వము మఱచి యమ్మనే పొందుదమనెడి యాసతో నడుముగట్టుకొని కూరు చున్నాము. మే మేవిధముగా నన్నియు మఱచి యమ్మను జేరు కొందుమో తెలియదు. అమ్మయే మమ్ముఁ దనలోఁ జేర్చు కొనును.

ప్రియతమసాధకులారా! అమ్మను వెదకుచు మీ రేడఁ బరుగెత్తుచున్నారు? చూడుఁడిదియే యమ్మ మీలో భ్రాన్తి రూపముతో సజ్ఞానరూపముతో వెలయుచున్నది. జాగరణము

నుండి స్వప్నము; స్వప్నమునుండి సుషుప్తి; మఱల సుషుప్తి నుండి జాగరణమున నెడి మూడవస్థలవలననే, అమ్మను (ఆత్మను) ప్రత్యక్షముచేసికొని, యనుభవించుచున్నాము. దానిని భ్రాన్తి యని, తుచ్ఛమని యెగురఁగొట్టవలదు. అమ్మఁగా నెఱిఁగి సరళశిశువుగా నాదరించి, అమ్మా! యంచు నాత్మనివేదన మొనర్పుఁడు. భ్రాన్తిమూర్తియే యాత్మమూర్తితోఁ ప్రకటితయై మిమ్ము సర్వభ్రాన్తుల పారమునకుఁ గొనిపోవును.

వేదాన్తమతమందు భ్రమము రెండు విధములు — 1. సంవాది. 2. విసంవాది. అభిలషించిన వస్తువు నొందుటకు వ్యాఘాతముకానిది సంవాదిభ్రమము. ఎటులంటేని, మణికాన్తిని జూచి, తొలుత నెవ్వఁడేని భ్రమమొందినను, దానిని లక్షించి పరుగెత్తిపోయి తత్ఫలముగా మణినొందఁగల్గును. ఇది సంవాది భ్రమమునకు దృష్టాన్తము. ఇఁక, జపాకుసుమము (మంకెన పూవు) నో, తళుకుగల యేదే నెట్టినిదానినో చూచి పద్మరాగ మనెడి భ్రమమునొంది యన్వేషించినచోఁ బద్మరాగమణి లభింపదు. జపాపుష్పమే లభించును. ఇదె విసంవాదిభ్రమమునకు దృష్టాన్తము. ఈ జగత్తును బ్రహ్మరూపముగాఁగని భ్రమమొందినను, ఆ భ్రమమే జీవుని బ్రహ్మత్వమందుఁ జేర్చును. ఇది విసంవాదిభ్రమము. ఒక యజ్ఞేయకారణముచే జగత్తున బహుకాలమునుండియు విసంవాదిభ్రమమే సాగివచ్చుచున్నది. అమ్మ విసంవాదిభ్రమమూర్తితో నడరుచుఁ జాలకాలమువఱకు జీవులను, అభీష్టవస్తువునకు దవ్వులనే యుంచినది. కాని యీసారి యమ్మ హృదయ మఃప్పొంగినది. మన యభీష్టవస్తువును జిక్కించు నెడఁ గేవలానుకూల సంవాదిభ్రమమూర్తితో నావిర్భవించి

నదా? లేదు లేదు. కనుకనే యీ యోజనము. దీనివలన నేఁడు సత్యప్రతిష్ఠావిజయధ్వని విసంవాదిభ్రాన్తిని దవ్వు ద్రోలి నిద్రాణమైన దేశమును మేలుకొలిపి మెల్లమెల్లఁగా భ్రాన్తి పరపారమైన సత్యము సమీపమునఁ జేర్చుటకుఁ బ్రయాస పడుదము.

భ్రాన్తిరూపిణీ! తల్లీ! నీ చరణములకుఁ బ్రణమిల్లుట చేతనే మా భ్రాన్తి తొలఁగును. మఱియు మేము సర్వావస్థల యందును నిత్యశుద్ధబుద్ధాత్ములమని తెలియఁగల్గుదుము. గానఁ దొల్త నీ వ్యష్టిభ్రాన్తిరూపమునకుఁ బ్రణమిల్లుచున్నాము. మా ప్రత్యేకాంతరమందును గల నీ విశిష్టప్రభావ భ్రాన్తి మూర్తి చేతనే మేము నిన్ను మఱచుచున్నాము. నీ యీ మూర్తిచరణములకు మాటిమాటికిఁ బ్రణమిల్లి, యవ్యక్త క్షేత్రమందుఁ జేరుదుము. అచటి భ్రాన్తిబీజరూపమునకుఁ బ్రణమించి, యొక్కసారిగా నిరంజనక్షేత్రమందుఁ జేరుదుము. అచట భ్రాన్తియూసే లేదు. దాని నాశ్రయించియే భ్రాన్తియున్నది. అది భ్రాన్తిరూపమునఁ బ్రకాశించినను స్వయంభ్రాన్తము కాదు. ఆ నీ విశుద్ధబోధమయస్వరూపమును లక్షించి యసంఖ్య ప్రణామములు చేయుదుము. అమ్మా! మా భ్రాన్తిని బాపుము.

ఓం. ఇంద్రియాణా మధిష్ఠాత్రీ భూతానాం చాఖిలేషు యా ।
భూతేషు సతతం తస్యై వ్యాప్తి దేవ్యై నమోనమః॥ ఓం. 27

శ్రోత్రాదులైన పదునొకండింద్రియములకును, క్షిత్యాదులైన పంచభూతములకును, నధిష్ఠాత్రివి (అనుగ్రహించుదానవు), ప్రేరణము చేయుదానవు. అనఁగా, అధిభూతాధ్యాత్మాధి

దేవతల పరమార్థరూపవు నీవే. వస్త్రమునందు దారమువలెను, మణులందు సూత్రమువలెను, సర్వభూతములందు ననుస్యూతమై ప్రకాశించు వ్యాప్తి దేవికి నీకు నిరంతర ప్రణామములు.

వ్యాఖ్య:— చక్షురాదీంద్రియములకును, భూ జలాది భూతపాణికిని నధిష్ఠానరూపముతో నమ్మయే యడరుచున్నది. వేర్వేఱింద్రియములకు నధిష్ఠాతృదేవతలు వేర్వేఱుగాఁ జెప్పఁబడినను, వారు ఒక్క చైతన్యరూపముతో సాధకులకుఁ గానవత్తురు. ప్రసంగవశమున నింద్రియాధిష్ఠాన దేవతలఁ బేర్కొందుము.

[శ్రోత్రమునకు దిక్కులు; త్వక్కునకు వాయువు; చక్షువునకు సూర్యుఁడు; రసనకు వరుణుఁడు; ఘ్రాణమునకు అశ్వినులు; వాక్కున కగ్ని; పాణి కింద్రుఁడు; పాదమునకు విష్ణువు; పాయువునకు మైత్రేయుఁడు; ఉపస్థమునకుఁ బ్రజాపతి; మనసునకుఁ జంద్రుఁడు; బుద్ధి కచ్యుతుఁడు; అహంకారమునకుఁ జతుర్ముఖ బ్రహ్మ; చిత్తమునకు శంకరుఁడు.]

ఈ చైతన్యశక్తులు శ్రోత్రాదీంద్రియరూపములఁ బ్రకాశించును. ఆ శక్తులే మీఁదఁజెప్పిన దిగాదినామములతోఁ బ్రసిద్ధములు. ఇటులే క్షిత్యాదిరూపమున వెలయు చైతన్యశక్తులే భూతాధిష్ఠాన దేవతలు. ఈ భూతేంద్రియాధిష్ఠానచైతన్యము భిన్నోపాధులతో విశిష్టసంబంధమునొంది, విభిన్ననామములతోఁ బేర్కొనఁబడినను, వాస్తవముగా నొక్కయఖండచైతన్యసత్తకంటె వేఱేమియుంగాదు. ఇదే మనయమ్మ సర్వవ్యాపి చిన్మయమూర్తి.

అమ్మా! ఈ విశ్వమందెచటఁ జూచినను నీ మహేశ్వర వ్యాప్తిమూర్తి కానఁబడును. ఒక యఖండఘనచైతన్య

సత్త విశ్వమందంతటను నిండియున్నది. మేము దాని గర్భము నుండియే పుట్టి, యందే నిల్చి, యందే చేరిపోవుదుము. నీ యీ వ్యాప్తిమూర్తి నెల్లపుడును గను సాధకుల మనఃసంకోచమును, మతిసంకీర్ణతయుఁ దప్పక తొలఁగును. అట్టి నీచరణముల కసంఖ్య ప్రణామములు.

ఓం. చితిరూపేణ యా కృత్స్న
మేతద్వ్యాప్య స్థితా జగత్ ।
ఓం నమస్తస్యై ఓం, ఓం నమస్తస్యై ఓం
ఓం నమస్తస్యై నమోనమః॥ ఓం. 28

చితిరూపముతో (జీవరూపముతో) సమస్తజగత్తున వ్యాపించియున్న దేవికిఁ బ్రణామములు.

వ్యాఖ్య :— ప్రకాశికా టీకా – "చితి శ్చైతన్యం । తన్మయో జీవ ఇత్యర్థః । తదుక్తం వేదాన్తే – అవిద్యోపహితం చైతన్యం జీవ ఇత్యర్థః" । గీతాసు చ "అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మామికాం । జీవసంజ్ఞాం మహాబాహూ యయేదం ధార్యతే జగత్ ॥" ఏతేన చిజ్జడాత్మకం సమష్టిరూపం జగత్ త్వమేవేతి ప్రతిపాదితమ్ । నను "విష్ణోస్తు త్రీణిరూపాణి పురుషాఖ్యాన్యథో విదుః । ప్రథమం మహతః స్రష్టృ ద్వితీయం త్వణ్డసంస్థితం । తృతీయం సర్వభూతస్థం తాని జ్ఞాత్వా ప్రముచ్యతే" ఇతి సాత్వత గ్రంథోక్తత్వాత్ ॥

గీత:- ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ ।
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే॥

ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ।
యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః॥

యస్మాత్క్షర మతీతోఽహ మక్షరాదపి చోత్తమః ।
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః॥

యో మామేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమం ।
స సర్వవి ద్భజతి మాం సర్వభావేన భారత॥

ఇతి గుహ్యతమం శాస్త్ర మిద ముక్తం మయానఘ ।
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్ కృతకృత్యశ్చభారత॥

ఇతి గీతాసూక్తత్వాచ్చ । పురుషస్యైవ జీవత్వం కథం ప్రకృతేర్జీవత్వముచ్యతే ? ఇతి న వాచ్యమ్ । ప్రకృతిర్నామ బ్రహ్మణ ఏవ సగుణమూర్తిభేద ఇతి ప్రాగుక్త మేవ । పుం స్త్రీ భేదశ్చ జడమాత్రవిషయకత్వేనా స్పష్టమ్ । చిదంశత్వాభావ స్తవ ఏవ । అతఏవ జ్ఞానిజనానుభవోఽపి । తథా వ్యక్తముక్తమ్ ప్రథమే ।

"తద్వీక్ష్య పృచ్ఛతి మునౌ జగదుత్తరాస్తే ।
స్త్రీపుం భిదా న తు సుతస్య వివిక్తదృష్టేః ॥" ఇతి.

అతఏవ శ్రీ బలరామః ప్రకృతిశ్వేనోక్తో దశమే । ఏతౌ హి విశ్వస్యచ బీజయోనీ రామో ముకుందః పురుషః ప్రధానమ్। బీజం నిమిత్తం। ముకుందః పురుషః । యోనిః సమవాయకారణం। రామః ప్రధాన మిత్యర్థక్రమస్య బలవత్త్వాత్ । ప్రధానత్వేన ప్రకృతిం వదన్తి । ఇత్యాథర్వణశ్రుతౌచ । ప్రకృతిపదం పారిభా

షిక ముక్తం । న తు స్త్రీసంస్థానాత్ । పురి శయనాత్పురుష పదమపి తథా శ్రుతిసిద్ధమ్ ॥

నను భవతు:— తథాపి జడాయాః ప్రకృతేః కుత శ్చేతనమ్? అత్రోచ్యతే - చిత్ప్రకృతి పక్షేఽపి వాదిభేద మతే సత్త్వోద్రేకాత్ చేతనత్వమ్ । యదుక్తం గీతాసు । "సత్త్వం జ్ఞానం రజః కర్మ" ఇత్యాది । సత్త్వోద్రేకత్వాత్ । గుణసామ్యేఽపి పురుషేచ్ఛా వశాదేవేతి । సమం జన్మలమితి । ప్రపంచేన । ప్రాగంతఃకరణ విశేష శక్తితయోక్తమ్ ॥

## పంచోపచార చితి పూజనవిధిః

లం. చిత్యై నమః గంధం సమర్పయామి ।

హం. చిత్యై నమః పుష్పం సమర్పయామి ।

యం. చిత్యై నమః ధూపం సమర్పయామి ।

రం. చిత్యై నమః దీపం సమర్పయామి ।

వం. చిత్యై నమః అమృతాత్మకం నైవేద్యం సమర్పయామి ।

సం. సోమాత్మకం శ్రీ చిత్యై నమః
తాంబూలం సమర్పయామి ॥

ఇంతకు మున్ను చేతనారూపమైన యమ్మకుఁ బ్రణామము చేయఁబడినది. అది విశిష్టచేతనమే. అనఁగా, ఇంద్రియాది కారణవర్గమువలన ననుభూతమగుచున్న చైతన్యము. మఱి యీ మంత్రమందు నిర్గుణచైతన్యమును లక్షించి చితి శబ్దము ప్రయోగింపఁబడినది. చితి శబ్దముచే సాంఖ్యులకుఁ బురుషుఁడు, వేదాన్తులకు బ్రహ్మము, ఉపనిషత్తులకు ఆత్మ.

మఱి మనకు అన్మొ, తోఁచుఁబడును. ఇచటఁ జితి నిర్గుణయే యైనచో "ఏతద్వ్యాప్య స్థితా జగత్" అనుటెట్లు సంగత మగుననియు, జగద్వ్యాపిత్వ ధర్మముండుటచేఁ జితికి నిర్గుణత్వ మెట్లు సంభవమగుననియు శంక కలుగవచ్చును. దీనికి బదులు సెప్పుటకు మున్ను, చితివస్తువు శక్తిమాత్రమే. పతంజల దర్శనము సైతము, ఇది తెల్పుటకే చితిశక్తి శబ్దప్రయోగము చేసినది. ("పురుషార్థ శూన్యానాం గుణానాం ప్రతి ప్రసవ కైవల్యం స్వరూప ప్రతిష్ఠావా చితిశక్తి రితి" 4-34) అని చెప్పుట యుచితము. పక్షాంతరమున సాంఖ్యశాస్త్రము జడప్రకృతిపరిణామమునకు హేతువును జెప్పునపుడు పురుషుని సాన్నిధ్యమాత్రముచే నుపకారమని చెప్పియున్నను, కార్యము వలన నది నిర్గుణపురుషుని శక్తిస్వరూపమే చెప్పఁబడినది. బుద్ధిశాలురు పాఠకులు వివేచించి చూడుఁడు. ఏమన—దేని సాన్నిధ్యమున జడప్రకృతిచేఁ దనవలెఁ బనిచేయుఁగడఁగెనో యది వస్తుశక్తిగాక మఱేమైనఁ గాఁగలదా? సరే; ఇప్పుడు వేదాన్తశాస్త్రమును జూడుఁడు. అందు సైతము, "జన్మా ద్యస్య యతః" అనుచుఁ జిద్వస్తువుయొక్క శక్తిరూపత్వమే ప్రకాశించినది. జగన్మిథ్యయే కానీ, సృష్టికల్పనామాత్రమే కానీ, దాని యాశ్రయము మాత్రము బ్రహ్మమే. మఱి యొకదానికి ఆశ్రయ మీయఁగలది; అనఁగా మఱియొకదాని కాశ్రయ స్వరూపమైనది, శక్తికంటె వేఱేమియుం గాఁజాలదు. 'ఆత్మవస్తువు యథార్థముగా శక్తిస్వరూపమే యైనచో, దానికి నిర్గుణత్వముండదే' — అనఁగలరు. ఉత్తరమును వినుఁడు. చిద్వస్తువునందు ఎట్టి క్రియాశీలతయుఁ గనఁబడనపుడే, యది

నిర్గుణ మనఁబడును. ఎట్టి క్రియావికాసమును లేనిదానిని శక్తి యనుటెట్లు? క్రియాశీలతయే శక్తిస్వరూపము గదా; యంను రేని నిజమే. సత్యమే నిర్గుణస్వరూపమందు సైతము, అవ్యక్తముగా సూక్ష్మతమక్రియాశక్తియై యున్నది. బ్రహ్మము నిర్గుణావస్థయందు సైతము స్వప్రకాశము, అనఁగాఁ దన్నుఁ దాను ప్రకాశింపఁ జేసికొనుచున్నది; అనఁగాఁ దన యాత్మరసానుభవము చేయుచున్నది. ఇదియును శక్తితక్క మఱేమియుం గాదు; మఱియు నిది బాహుళ్యవిషయము. అనుభవ సంపన్నులైన సాధకులు, బుద్ధివల్లఁ బరమాత్మానుభవము చేయఁగడఁగునంతదాఁక, ఆత్మ బుద్ధిప్రకాశముగా శక్తినే పరిచయముచేయుచుండును. అగుఁగాక – ఆత్మ శక్తియని తెలిసికొంటిమి. జడజగత్తునందు, శక్తికంటె శక్తిమంతుఁడు భిన్నుఁడుగానే చూడఁబడుచున్నాఁడు. కాని, యాత్మక్షేత్రమునందు, శక్తి శక్తిమంతులు అభిన్నవస్తువులే. కేవల భావయందు మాత్రమే విభిన్నత. కనుకనే యీ చితిశక్తికి వేఱొక యాశ్రయ మక్కఱలేదు. ఈ సిద్ధాన్తము నాదరించుటచేతనే శ్రుతివాక్యదర్శన పురాణాదులకుఁ బరస్పరవిరోధము కలుగదు. నిర్గుణస్వరూపమువలన జగత్సృష్టి యెట్లగుననెడి యాశంకయు సుగమముగాఁ దొలఁగిపోవును.

మఱియు 'శక్తిహీనమైన యొక యవస్థయుఁ గలదు.' అను మాటను ప్రమాణింపఁదలఁచినచో దానికిని నిర్గుణము పైనే చోటీయవలయును. అది వాఙ్మనసుల కతీతము, కనుకనే దాని స్వరూపమును వివరించుటయందు వేదవేదాన్తములు మూగలైపోయినవి. అపుడు "ఏకమేవా ద్వితీయమ్" మున్నగు

మాటలతోను, లేక 'నేతి నేతి' యని నోరితోనో ప్రతిపన్నము చేయు ప్రయత్నము, ఆ నిర్గుణపర్యంతమే కనుక మనో వాగగోచరమైన యొక సత్త కలదనియు, అది నిర్గుణముకాదు, సగుణమునుం గాదనియు నాదరింపరు. ఆ యజ్ఞేయతత్త్వముయొక్క మహత్త్వము, నిర్గుణమనియు సగుణమనియు రెండువిధములం గానవచ్చును. సగుణస్వరూపముయొక్క మహత్త్వము, ఈశ్వరత్వము జీవత్వము అని రెండువిధములం గానవచ్చును.

స్వరూపముచే నిర్గుణమైన చిత్‌శక్తి సగుణభావము నెటులొందును? మఱి సగుణముగాం బరిపక్వమైనను, దాని నిర్గుణత్వమున కించుకంతయు వ్యాఘాతము లేదు; అను నీతత్త్వము మున్ను వ్యాఖ్యానింపంబడినది.

జగత్తొక శక్తిమాత్రమే యనుట సర్వవాదిసమ్మతము. నామరూపములును వ్యవహారగతమైన యనంతవైచిత్ర్యములు నున్నను, జక్షుష్మంతుండు, ఒక శక్తికంటె వేఱేమియు లేదని కనుగొనును. అతండు జలమును మంచుగడ్డను జలముకంటె భిన్నముగా భావింపండు. కుండలములను స్వర్ణముకంటె వేఱుగాం జూడండు. కుండను జూచి మట్టికంటె వేఱని తలంపండు. అట్లే, యీ నామరూపాత్మక జగత్ప్రపంచము చక్షుష్మంతున కొక యఖండ చిత్‌శక్తిగానే ప్రతిభాసించును. ఈ విశ్వము చిత్‌శక్తివల్లనే యైనది. మఱి చిత్‌శక్తియందే యున్నది. చిత్‌వస్తువు బోధముకంటె వేఱేమియుంగాదు. బోధము ఆనందము అభిన్నవస్తువులు, కనుకనే జగత్తానందమయమని పలుసారులు చెప్పితిమి. మఱి చెప్పుచున్నాము. జగత్తు ఆనందమందే పుట్టినది; ఆనందమందే దాని స్థితి; ఆనందమునందే దా

లయము. కేవలము చూపునందే తారతమ్యము. అమ్మ దయచే జ్ఞాననేత్రము విడినప్పుడెల్లరకు నీ జగత్తానందమయముగానే కనంబడును.

అమ్మా! స్థూలమందు వ్యష్టి-చితిశక్తిరూపముతో నామ రూపవిశిష్టవై ప్రకాశింతువు. ఆ నీ చిన్మయేశ్వరమూర్తికిఁ బ్రణామము. పిదప స్థూల సూక్ష్మముల కతీతమైన యవ్యక్త కారణరూప చిచ్ఛక్తికిఁ బ్రణామము. మఱి వాఙ్మనసుల కతీత మైన నిరంజనస్వరూపమును లక్షించి పునఃపునః ప్రణామములు.

సాధకా! ఒక్కసారి కనువిచ్చి చూడుము. మన యమ్మ చితిశక్తిరూపముగా సర్వజగత్తున వ్యాపించియున్నది. అమ్మను విడిచి యేడను నేమియు లేదు. నీ వేమి చూచినను, యేమి యోచించినను నంతయుఁ జితిరూపిణి యమ్మయే.

ఓం. స్తుతా సురైః పూర్వ మభీష్టసంశ్రయా
త్తథా సురేంద్రేణ దినేషు సేవితా ।
కరోతు సా నః శుభహేతు రీశ్వరీ
శుభాని భద్రాణ్యభిహంతు చాపదః॥ ఓం. 29

ఓం. యా సాంప్రతం చోద్ధతదైత్యతాపితై
రస్మాభి రీశా చ సురై ర్నమస్యతే ।
యా చ స్మృతా తత్క్షణమేవ హన్తి నః
సర్వాపదో భక్తివినమ్రమూర్తిభిః॥ ఓం. 30

వ్యాఖ్య:— మహిషవధ సందర్భమునఁ దాము చేసిన సేవలను, దా మొందిన యుపకారములను దలంచిన దేవతలు

విశ్వాస కృతజ్ఞతలను జూపుచున్నారు. అట్టి విశ్వాసమున్నచో జీవుఁ డెన్నఁడును విపత్తులకు వెఱవఁడు. కింకర్తవ్యవిమూఢుఁడు కాఁడు. అమ్మ సర్వశక్తిమయి యనెడి విశ్వాసమే జీవునిఁ బరమభక్తునిగా మార్చును. దాని ఫలముగా విపద్భయము తొలఁగును. అమ్మను యథార్థముగా భక్తివినమ్రమూర్తియై స్మరింపఁగల్గెనే నపుడే సర్వవిపత్తులుతొలఁగి భక్తిప్రభావము చే నమ్రమూర్తులగుదురు. అనఁగా, అహంబోధము చక్కఁగా సడలిపోవును. ఇది సత్యము. అమ్మ యీశ్వరీమూర్తిని సత్యముగా నెంచఁగల్గినపుడు జీవుని జీవభావీయ విపత్తి తొలఁగును.

ఇట్టి దృష్టాన్తము లిపుడుం గనుచున్నాము. గొడవలకుఁ జిక్కినవాఁడు కాతరబుద్ధితో భగవంతుని స్మరించి వానివలన విడివడుచున్నాఁడు. వ్యాధితుఁడు భగవంతుని చరణములందుఁ దన్నర్పించుకొని రోగవిముక్తుఁ డగుచున్నాఁడు. ఇదంతయు భక్తివినమ్రమూర్తివల్ల నగు ఫలము. అది యెట్టిదంగి క్రమముగా, జీవభావీయాహంత తగ్గిపోయి, యీశ్వరభావీయాహంత వికసించును. సర్వజ్ఞుఁడు, సర్వశక్తిమంతుఁడు నైన పరమేశ్వరుని స్మరించుటచే, నింతయో యంతయో యీశశక్తి జీవునందుఁ జేరును. దానిఫలముగా సర్వాపదలు తొలఁగును.

బహుత్వప్రతీతి యున్నంతవఱకు సాధకుఁ డాపదలకుఁ జిక్కక తప్పదు. బహుత్వవిలయమై యేకత్వప్రతీతి కానంత దాఁక జీవుఁ డాత్మస్వరూపమును గుర్తింపలేఁడు. గీతలందు — ఒక్క యఖండవస్తువునకు శరణాగతుఁడగుటకే సర్వధర్మములను విశేషించి యుపదేశింపఁబడెను. శరణాగతభావమువల్లనే –

భక్తివినమ్రమూర్తితోడి ప్రణామమువల్లనే యీ వస్తువు (భగవంతుఁడు) సులభుఁడు.

పూర్వచరిత్రములందు (మధుకైటభ మహిషాసురవధ కథలందు) బ్రహ్మాదికృత స్తవరూపమున, అమ్మ మాహాత్మ్యము, అమ్మ కరుణాళుత, అమ్మ సర్వశక్తిమత్త్వము మున్నగునవి వర్ణింపఁబడినవి. ఈ స్తోత్రము ప్రణతిప్రధానము. ఇందు శ్రీమాతను క్షుధా తృష్ణా నిద్రా ఛాయా భ్రాన్త్యాది భావరూపిణిగాఁ జూచి, పునఃపునః ప్రణామములు చేయుటచే జ్ఞానవికాసమగుచున్నకొలఁది, "నేను" అనునది యొక దురపనేయాజ్ఞానమాత్రమనియు, ఈ యజ్ఞానమునుండి విముక్తుఁడగుటకే సదసత్తు లుపస్థితములైనవనియు నెఱుంగఁగలఁడు. మఱి, దానిని మాతృబోధముగానే దర్శించి, యీ యహంతను మాతృచరణములందె యణఁపఁగడఁగును. ఈ విధముగా సాధకుని జ్ఞానమున్నతభూమిక కెక్కుచున్నకొలఁది, అజ్ఞాన మణఁగుచుండును. జ్ఞానప్రాప్తి యనగా—అజ్ఞానమింకను నెంతయధికమో యెఱుంగఁ గలుగుటే. అజ్ఞానస్వరూపము నెఱుంగుచున్నకొలంది జ్ఞాన చరణమునందవనతుఁడైపోయి సర్వసంశయములవలన విముక్తుఁడగును. అందుచేతనే దేవతలు పునఃపునః ప్రణామము లాచరించి యభీష్టమునొందు దారిని సుగమము చేసికొనిరి.

ఈ తరువాత శుంభవధాంతమున మనముచూచు నారాయణీస్తుతియు నిటులే ప్రణతిప్రధానము. ప్రణతియే సాధనా రహస్యము. భక్తిపూర్వకముగాఁ బ్రణతుఁడు కాఁజాలినంతనే యన్నియుఁ బ్రాపించును. దేవతాగణము మాతృవక్షమునందుండి, జ్ఞానస్తన్యముచేఁ బరిపుష్టమయిన సంతానము గనుక

సర్వభావములతోఁ బ్రణతమైనది. మఱి మనమో, దేహాత్మ బోధ విశిష్టజీవులము. క్షుద్రతర కీటాణువులము. మన తల లేవిధముగాను వంగనొల్లవు. మనము మన మిథ్యాహంతను గౌరవించుకొన్నకొలఁదియు దాని నవమానించుచునే యున్నా మన్నమాట. యెట్లును దెలియఁజాలకున్నాము. కనుకనే మన కీ దుర్దశ. ఇప్పుడును మనదేశమున స్వధర్మనిష్ఠులైనవారు బ్రాహ్మణులను జూచినంతనే తలవంచి ప్రణమిల్లుదురు. అదేల చేయుచున్నారు? ఒకప్పుడీ బ్రాహ్మణులు తమ యహంతను విశ్వేశ్వరీచరణములం దర్పించినవారు. దాని ఫలముగా వారి కులపాంసుల సంతానము సైతము నేఁటిదాఁక, హిందుజాతి ప్రణామముల నందుకొనుచున్నది. ఔరా! ఇమ్మాటఁ దలంచు కొనినంతఁ గన్నీరుట్టును. మాతృచరణప్రణతుఁడైన బ్రాహ్మణుఁ డొకప్పుడు వెన్నుని ఱొమ్ముఁ దన్నంగలంత వీర్యవంతుఁడును శక్తిమంతుఁడునై, యటులుచేసియు రవ్వంత చలింపలేదు. వారు విష్ణుత్వమును సైతము అతితుచ్ఛముగాఁ దలంచునంతగా మాతృసత్తయందు విశ్వాసవంతులై యుండిరి. ఇప్పుడు వారి వంశధరులమాట యేమిచెప్పను? విచారించిన ఫలమేమి?

ఈ స్తవమందు దేవతలు తొల్త, అమ్మయొక్క విష్ణు మాయామూర్తికిఁ బ్రణమిల్లుటతో నారంభించి క్రమముగా — చేతనా నిద్రా క్షుధా ఛాయా శక్తి తృష్ణా క్షాంతి జాతి లజ్జా శాంతి శ్రద్ధా కాంతి లక్ష్మీ వృత్తి దయా తుష్టి మాతృ బుద్ధి స్మృతి భ్రాన్తుల రూపముగాఁ దల్లిని బ్రత్యక్షముచేసికొని పునః పునః ప్రణమిల్లిరి. సత్యముగా నా రూపములన్నియు అమ్మవే యనెడి నమ్మకము మనకు లేదు. కావుననే యమ్మ (ఆత్మ)

చరణములకుఁ బ్రణతులము కాఁజాలకున్నాము. ఐనను సత్య ప్రణామము చేయలేకున్నాము. కనుక మాతృకృపకు దవ్వయి పోవుచున్నాము. ఆ చేతనా బుద్ధి నిద్రాది రూపములతో మన లోనే వెలయుచున్న యమ్మను లక్షించి ప్రణమిల్లవలయును.

ప్రథమఖండమందు సత్యప్రతిష్ఠావిషయము చెప్పఁబడి నది. ద్వితీయఖండమందు, ఉపదిష్టప్రాణప్రతిష్ఠాఫలముగాఁ బ్రత్యక్షానందస్వరూపముతో నుద్భాసించినది. ఒక్క యఖండా నందమయబోధమే, మునుజెప్పిన బుద్ధి నిద్రాది రూపములతో మనలను స్నేహాలింగనబద్ధులను జేసి యుంచినది, యని తెలియఁ గల్గినపుడే యజ్ఞానము తొలఁగును. రుద్రగ్రంథి (జ్ఞానమయ గ్రంథి) విడిపోవును.

పూర్వోక్తప్రణామము నట్టి ప్రణామము కాదు. అది యున్నతభూమికాసాధనము. స్థూల సూక్ష్మ కారణ కారణాతీత నిరంజనసత్తయెడ లక్ష్యముంచి, ప్రణమిల్లఁగల్గుటచేతనే జ్ఞాన సంకీర్ణత తొలఁగును. ఇదె తత్త్వజ్ఞానము. ద్వితీయఖండమందు క్షిత్యాది తత్త్వప్రణామరూపముగా ననుభవించు టుపదేశింపఁ బడినది. ఇచట సాధన మఱింత సూక్ష్మముగా ముందునకు నడిచినది. కనుక నొక్కొక్కవృత్తిని బట్టుకొని ప్రణతిసహాయ ముచే నఖండజ్ఞానసముద్రమున మున్గుటకైన యుపాయము వర్ణింపఁబడినది. ఆ యఖండానందమయానుభూతి విషయము "సారాయై సర్వకార్యై" యనెడి మంత్రవ్యాఖ్యయందుఁ జెప్పఁ బడినది. ఆ యనుభూతియే వ్యష్టి బుద్ధి నిద్రాదిరూపముగా నభి వ్యక్తమగుటఁ దెలిసి ప్రథమప్రణామము చేయఁబడినది. అనఁగా మొదటి 'నమస్తస్యై' మంత్రముయొక్క తాత్పర్యమే ఆ యా

వ్యష్టిప్రకృతియొక్క విభిన్నవృత్తుల నానందస్వరూపముగ ననుభవించుట. మఱి యా వ్యష్టివృత్తులను సూక్ష్మసమష్టితత్త్వమునకుఁ గొనిపోయి - అనఁగా నీశ్వరతత్త్వమునకుఁ జేర్చి ద్వితీయ ప్రణామము చేయఁబడినది. ఈశ్వరతత్త్వోపలబ్ధియే యీ రెండవ 'నమస్తస్యై' మంత్రముయొక్క రహస్యము. తరువాతఁ గారణ (అవ్యక్త) క్షేత్రసంధానము, అన్నిటికిం దుదిదైన సర్వభావాతీతమందయిన లక్ష్యము. ఇదే మూఁడవ నాల్గవ ప్రణామముల రహస్యము.

సరిగా నీవిధముగాఁ బ్రణామము చేయఁగల్గుటే యీ భూమికయొక్క సార్థకత. అనుభవములేని సాధకుఁడు దీనిం దెలియలేఁడు. కాని శ్రీగురు కృపచే ననుభూతి నొందినవారి విషయమున సంశయములేదు.

ఇది శ్రీమార్కండేయపురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
శుంభాసురనిధనమును గోరిన దేవతలు చేసిన స్తుతికి
శ్రీకాకుళవాసి, శ్రీ శ్రీయానందనాథుఁడు
ఈశ్వర సత్యనారాయణశర్మ వ్రాసిన వ్యాఖ్య.

శ్రీ ప దేవతార్పణము.

శ్రీమాత్రే నమః
ఓం నమశ్చండికాయై.

# సాధన సామగ్రి

## శుంభవధానంతరము దేవకృత దేవీస్తుతి.
## (నారాయణీ స్తుతి)

ఓం. ఋషిరువాచ ఓం.

ఓం. దేవ్యా హతే తత్ర మహాసురేంద్రే
సేంద్రాః సురా వహ్నిపురోగమాస్తామ్ ।
కాత్యాయనీం తుష్టువు రిష్టలాభా
ద్వికాసివక్త్రాబ్జవికాసితాశాః॥ ఓం. 1

ఋషి పలికెను:— ఆ యుద్ధమందు దేవిచే మహాసుర శ్రేష్ఠుఁడు శుంభుఁడు చంపఁబడఁగా, అగ్నిప్రముఖులైన యింద్రాది దేవతలు, తమ కోర్కె నెఱవేఱినందులకు వికసించిన తమ మోములచే దిక్కులను భాసింపఁజేయుచుఁ గాత్యాయనీ దేవిని బొగడిరి.

వ్యాఖ్య:— విశుద్ధబోధమందు నిల్చినపుడు ద్వైత ప్రతీతి లేమిచే, స్తవాదులు కేవల మసంభవములైనను, వ్యుత్థితావస్థయందు (బోధమునుండి లేచిన తర్వాత) బాధితాను వృత్తిన్యాయముగా, మఱల దేహాద్యనాత్మప్రతీతి తలసూపును. కనుక నట్టియపుడు స్తుతు లసంభవములు కావు. సరిగదా, సంభవమగుటయే స్వాభావికము.

శుంభుఁడు చంపఁబడెను. ఇంద్రియాధిష్ఠానచైతన్యవర్గ మనెడి దేవతల కోర్కె నెఱవేఱినది. అపహరింపఁబడిన వారి యజ్ఞభాగములు చేఁజిక్కినవి; గాన దేవతలకు మేరలేని యానందమయ్యెను. ఇపుడు విశిష్టచైతన్యములయ్యెను, ఆనంద చైతన్యముతోఁ గూడ నఖండానంద స్వరూపలాభము నొంద సమర్థులైరి.

ఇంద్రుఁడే దేవతాముఖ్యుఁడైనను, నిచట నగ్నిదేవునే ముందుంచుకొనిరి. అగ్ని వాగింద్రియాధిపతి. వాక్యసమష్టి మాత్రమే స్తుతి. కనుక వాగధిష్ఠితచైతన్యమును ముందు పెట్టినచో స్తుతి చక్కఁగా సంపన్నముకాఁగలదు అని నిశ్చయించి యింద్రాదిదేవతలు వహ్నిదేవునే స్తుతినేతగాఁ జేసిరి. వాగధిష్ఠానదేవత ప్రసన్నుఁడు గాకున్న స్తోత్రపాఠాదులు సత్యప్రాణమయములు కావు.

దేవతల పుష్కలస్తోత్రధ్వని దెసలను బవిత్రముచేసినది. విశుద్ధసత్త్వగుణ శుభ్రప్రభచే దిఙ్మండల ముద్భాసించినది. దేవతలు భక్తివినమ్రదేహులై కాత్యాయనిని స్తుతించిరి. కాత్యాయని జగదీశ్వరి. కత్యులనఁగా బ్రహ్మవిత్పురుషులు. వారికి ముఖ్యాశ్రయమగుటచే మన యమ్మ కాత్యాయని. ఈమెయే సగుణబ్రహ్మము. స్తవాదులు సగుణబ్రహ్మమునకే యగును.

ఓం. దేవి ప్రపన్నార్తిహరే ప్రసీద
ప్రసీద మాతర్జగతోఽఖిలస్య ।

ప్రసీద విశ్వేశ్వరి పాహి విశ్వం
త్వ మీశ్వరీ దేవి చరాచరస్య॥ ఓం. 2

ఓ దేవీ! శరణాగతజనదుఃఖహారిణీ! నీవు ప్రసన్న వగుము. సకలజగజ్జననీ! ప్రసన్నవగుము. ఓ విశ్వేశ్వరీ! ప్రసన్నవగుము. అమ్మా! నీవీ విశ్వమును రక్షింపుము. నీవే స్థావరజంగమముల కధీశ్వరివి.

వ్యాఖ్య:— ప్రపన్నులైనవారి దుఃఖములఁ దొలంతువు. నీవే ప్రాపని నీ యుభయచరణ శరణము నొందువారలు ఎట్టి దురాచారులే కానీ; ఎంతటి మూఢులే కానీ; నీవే స్వయముగా వారి సర్వవిధదుఃఖములను, భయదీనతలను దొలఁగింతువు. అమ్మా! నీవు మా యెడఁ బ్రసన్నవగుము. మేము నీ చరణములందే శరణుజొచ్చుటెందులకో నీ వెఱుఁగుదువు. నిన్నే ముఖ్యాశ్రయముగాఁ దెలిసికొని, నిర్విచారముగా నీ యొడి యందు, అమ్మా! యనుచు దూఁకి దాగియుండునంతటి మనో బలము విశ్వాసము మాకు లేవు. అయినను నీవు మమ్ము నీ యాశ్రితులనుగాఁ జేకొనుము. మఱి యే పార్థివవస్తువు నాశ్ర యించి మిథ్యాభిమానకల్పితమైన 'నేనుఁ' బోషించుకొందుము? దేనిచే సర్వమును వీడి నీకే శరణాగతులము కాఁగలమో యదే చేయుము. నీవు ప్రసన్నవగుము.

సర్వజగత్తులకు నీవే తల్లివి; కనుక మా యెడ నీవు ప్రసన్నవయియే యుందువు. మేము కేవల కుపుత్త్రులమే యగుదుముగాక. నీవు మాత్రము కుమాతవు కాఁజాలవు. మేము నిష్కపటముగా, అమ్మా! యని నిన్నుఁ దలంపము.

తలంపలేము. కనుక మమ్ము విడువలేవు. తొలఁగఁద్రోయలేవు. నీవు మా యమ్మవు. నీవు ప్రసన్నవైననే మా కోర్కులెల్లఁ దీఱును. అమ్మా! యెన్ని జన్మజన్మాంతరములనుండియో నీ ప్రసన్నతకొఱకే, యెన్నో యెడపెడదెబ్బలను, ఎన్నో నలుగుఁబాటులను సైఁచుచు వచ్చుచున్నాము. కాని నీవు నిత్యప్రసన్నవు, నిత్యతృప్తవు కదా; మా కిన్ని యనుభవము లేల పెట్టుచున్నావు? బహుభావములతో నీ యాత్మ ప్రకాశమును గాంచునంతసేఁపు, నీ ప్రసన్నత నెటు లెఱుంగఁగలము? అమ్మా! నీ నోర వెలువడు నొక్కమాట వినుటకే యెంతకాలమునుండియో మా నిరాశను మాలోనే దాచికొని నీ మొగవంకనే చూచుచున్నాము. ఎన్ని దెబ్బలకో యోర్చి, తెలిసియో, తెలియకో, కపటముతోనో, ఇచ్ఛతోనో, అనిచ్ఛతోనో, అమ్మా! యనుచు స్మరించుచున్నాము. ప్రసన్నవగుమమ్మా! ఏదీ, ఒక్కసారి 'నేను' అనేకనుగాను, 'ఏకనే' యనుమమ్మా! నీ శ్రీముఖమున వెడలు నమ్మాట యొక్కటి వినఁగల్గినచో మా బ్రతుకులు ధన్యములగును. అనాది జన్మములనుండి యున్న జీవత్వబంధనము విడిపోవును. నీ ప్రసన్నతను దెలియఁ జూపుము.

అమ్మా! నీవు విశ్వేశ్వరివి. నీవే యీ విశ్వమును రక్షింపుము. ఈ విశ్వము నిన్నుఁజూడదు; నీ సత్తనుభవింపఁజాలదు. బహిర్ముఖముగాఁ బరుగులెత్తుచున్నది. కనుకనే నీ ప్రసన్నతను దెలియఁజాలదు. దినదినమునకును ధ్వంసమువంకకే ముందడుగు వేయుచున్నది. అమ్మా! రక్షింపుము. ఏల రక్షింపవు? ఈ తీవ్రమైన బహిర్గతివలన నీ విశ్వమును రక్షింపుము. ధ్వంసము

వలన రక్షింపుము. ఈ విశ్వమున కధీశ్వరివి నీవేకదా, ఏల రక్షింపవు ? ఈ స్థావర జంగమాత్మకమైనదాని కంతటికి నీవే నియంత్రివి. నీ జగత్తును నీవు రక్షింపకున్న నింకెవరు రక్షింతు రమ్మా! ప్రతిజీవుని యందలి శుంభుని (అస్మితను) వధించి విశ్వమును ధ్వంసాభిముఖము కాకుండఁ గాపాడుము.

ఓం. ఆధారభూతా జగత స్త్వమేకా
మహీస్వరూపేణ యతః స్థితాసి ।
అపాం స్వరూపస్థితయా త్వయైత
దాప్యాయ్యతే కృత్స్న మలంఘ్యవీర్యే ॥ ఓం. 3

నీవే జగదాధారస్వరూపవు. ఏమన నీవే మహీస్వరూపముతో నున్నావు. మఱియు జలరూపముగానుండి విశ్వమును దృప్తిపఱచుచున్నావు. అమ్మా ! నీ వీర్య మలంఘనీయము.

వ్యాఖ్య:— అమ్మా ! ఆధారశక్తిరూపిణివి, నీవే జగద్ధాత్రివి. ఆ నీమహనీయమూర్తిని జూచియే కొంచెము తెలియఁగల్గుచున్నాము. మహీరూపముతో మృత్తికారూపముతో సర్వపదార్థములను దల్లివలె గుండె నిడుకొనియున్నావు. మార్పులేదు. వికల్పములేదు. ఏ యనాదికాలమునుండియో, నీ వీ మట్టిరూపముతో మన్నెకూర్చుకొని యీ జగత్తునుధరించి యుంచినావు. ఇంతేకాదు. జలమయమూర్తితో సర్వజీవులను దనుపుచున్నావు. సస్యాదిరూపవై యాఁకటిని, జలరూపవై దప్పిని నివారించి, మాకు మాతృత్వపరిచయముఁ గలిగించు చున్నావు. పాలుత్రాగు చంటిబిడ్డలను దల్లివలె గుండెను నిల్పుకొని, మా యాఁకలిదప్పులను దీర్చుచున్నావు. ఇటులు ప్రత్యేక

జీవునిం దన్పుచున్నావు; పెంచుచున్నావు. నీ సాటిలేని ప్రభావము నెల్లరెఱుఁగుదురు. నీ యా వీర్యప్రభావమును, ఈశ్వరాదులును గడవలేరు, గనుక నీ వలంఘ్యవీర్యవు.

నీ రూపము 'స్వ'. నీవే యాత్మవు, అయినను నీవు మహీస్వరూపవు, జలరూపవు; సర్వభేదాతీతాత్మవు నీవే యైనను, స్వగతభేదవిశిష్టవై క్షితిజలాది రూపములతో జగములను దాల్చుట సాకుట మున్నగు పనులను నెఱవేర్చుచున్నావు. అమ్మా! నీ వీర్యము నిజముగా నలంఘనీయమే.

ఓం. త్వం వైష్ణవీ శక్తిరనంతవీర్యా
విశ్వస్య బీజం పరమాసి మాయా।
సమ్మోహితం దేవి సమస్తమేతత్
త్వం వై ప్రసన్నా భువి ముక్తిహేతుః॥ ఓం. 4

నీవు వైష్ణవీశక్తివి; నీ వనంతవీర్యవు; నీవే యీ విశ్వబీజము, నీవే పరమమైన మాయవు. దేవీ! నీ వీ సర్వజీవజగత్తును మోహపెట్టుచున్నావు. మఱి నీవే ప్రసన్నవై యీ జగజ్జీవులకు ముక్తిహేతువవై యున్నావు.

వ్యాఖ్య:— అమ్మా! నీవు సర్వవ్యాపినివైన వైష్ణవీశక్తివి. జగత్పాలనకారిణివి. స్థితిమహాశక్తివి. ఈ విశ్వము నకుఁ జెందిన ప్రతిపరమాణువును నీ యందే నిల్చియున్నది. నీ వనంతవీర్యవు. నీ వీర్యవిభవమునకు హద్దులేదు. నీవు సర్వవ్యాపక వైష్ణవీశక్తిరూపమున నీ సంతానము నెదుటఁ బ్రకాశించునపుడు, నిజముగా ననంతవీర్యవుగానే వెలయుదువు

ఆ నీ వీర్యప్రభావము నతిక్రమించుటయు, నింత యనుటయు నసంభవముగానే తోఁచును. ఈ విశ్వరూపముతో నిన్ను నీవు వెలయించుకొని, యనంత వీర్యావైష్ణవీశక్తి పేరఁ బరఁగుటే కాదు; విశ్వబీజముగాను, సృష్టిప్రబంధమున కాదిమకారణము గాను, నవ్యాకృతరూపవుగాను, నీవే యున్నావు. బీజరూపముగా నీవు పరమవును, వైష్ణవీరూపగా నీవు మాయవును, ననఁబరగుదువు. అమ్మా! సృష్టి ప్రపంచరూపముగా – వ్యక్త విశ్వరూపముగా నీవు మాయవును, సృష్టియొక్క యవ్యక్త రూపముగా నీవు పరమా – మాయవు, ననఁబడుదువు. సాంఖ్య శాస్త్రము నీ యీ 'పరమా' స్వరూపమునే 'మూలప్రకృతి' యన్నది.

అమ్మా! నీ యీ ద్వివిధ స్వరూపమందు నీ రెండు విధములైన వీర్యమును గనుగొనుచున్నాము. నీవు మాయా మూర్తితో వెలసి, అనఁగా వ్యక్తప్రపంచరూపముతో నిన్ను నీవు బయల్పెట్టుకొన్నపుడు "సమ్మోహితం దేవి సమస్తమేతత్" మఱి నీవు పరమా – మూర్తితోఁ బ్రకటవైనపుడు "త్వం వై ప్రసన్నా భువి ముక్తిహేతుః" అమ్మా! ఒక మూర్తితో నీవు భోగదాయినివి, రెండవమూర్తితో నీవు మోక్షదాయినివి. మాయాస్వరూపమున నీ సమస్తమును మోహపెట్టుచున్నావు. స్వకీయస్వరూపానుభవమును గానీయవు. అప్పుడే జీవులు, నానా విధముల నీ మాయికమూర్తినిజూచి దీని నాయత్తపఱచుటకుఁ బరుగులెత్తుదురు. రూపరసాదులయెడను, గామకాంచనాదుల యెడను, ముగ్ధులగువారు ప్రత్యక్షముగానే నీచే సమ్మోహితు లగుదురు. మఱియు నీకు శరణాగతులుగాక యనేకవిధముల

సాధనానుష్ఠానములను జేయువారు సిద్ధిశక్తులు, యశస్సు, ప్రతిష్ఠ మున్నగువానిలో నేదే నపేక్షించి ముగ్ధులగుదురు. మాయావి మనుష్యుఁడు దుర్బలమనుష్యుని సమ్మోహనమంత్రముచే నావిష్టునిఁ జేసియుంచునటులే, యనాదికాలమునుండి నీవును జీవులను మోహావిష్టులనుజేసి యుంచుచున్నావు. వారెట్టులును నిన్నుఁ గోరఁజాలరు. నీవు ముస్తాబుచేసి యిచ్చిన యాటబొమ్మలను బట్టుకొనియే తమ బ్రతుకు ధన్యమైన దనుకొందురు. నిన్నుఁ గోరుటచే నగు ప్రయోజనమేమో, యదియుం దెలియఁజాలరు. ఇట్టిదే యజ్ఞేయమోహము. ఈ తీరున వెలయు నీవజేయువు. నీవుగాక మఱెవ్వరేని, ఈ మోహరూపమును ధరించి వచ్చినను, బెద్ద ప్రయత్నముతోఁ గఠోరతతో వారిని నిజముగాఁ బరుగెత్తింపఁగలము. కాని, యజేయము నలంఘ్యమునైన వీర్యము గల నీవే మోహరూపముతో నిల్చి, జీవుఁ డాత్మదర్శనము చేయఁగల చూపు నడ్డగించి యుంచుచున్నావు. అమ్మా! ఎంతకాలమిటులు గానుఁగుటెద్దులను జేసి త్రిప్పుదువు? త్రిప్పితివి, పో; ఒక్కసారి నీ సంతానము కంటిగంతలు సడలించి కనులు తెఱవనిమ్మ. అది నిన్నుఁజూచి జీవనము సార్థకము చేసికొనును.

అమ్మా! ఈ సమ్మోహినీమూర్తితోనున్న నీవే, ఈ విషయవేషముతోనున్న నీవే, కామ కాంచనాది వేషముతో వచ్చి మమ్ములను మోహపెట్టుచున్నావని తెలిసికొన్నంతనే నీవు ప్రసన్నవగుదువు. మాచేఁ జిక్కుదువు. చిక్కితివా – నీ మోహినీమూర్తి తొలఁగును. నీ నిత్యప్రసన్నమూర్తియే వెలయును. అపుడు మాకెట్టి యాపదయు నుండదు. అపుడు నీవే

'పరమా' ప్రకృతిరూపముతో, జననీరూపముతో నెయ్యమున జీవులను గుండె కత్తుకొని ముక్తిమందిరమునఁ జేర్తువు. కనుకనే దేవతలు నీ స్తవముఁ జేయునపుడు, ఒకవంక నీ విశ్వమోహినీ మూర్తిని జూచి "సమ్మోహితం దేవి సమస్త మేతత్" అనుచున్నారు. ముక్తి నిచ్చు నీ ప్రసన్నమూర్తిని జూచి "త్వం వై ప్రసన్నా భువి ముక్తిహేతు." అనుచు నీచరణములందే ప్రణతులగుచున్నారు. అమ్మా! ప్రసన్న వగుము. నీవు నిత్యప్రసన్న మూర్తితో మమ్మెల్లపుడును వక్షమందు ధరించియే యుంచుకొన్నావని మాకెఱిఁగింపుము. దేవతలవలెనే మేమును అమ్మా! అమ్మా! యనుచు ముక్తిమందిరమందుఁ జేరుకొందుము.

ఓం. విద్యాః సమస్తా స్తవ దేవి భేదాః
స్త్రియః సమస్తాః సకలా జగత్సు।
త్వయైకయా పూరిత మంబయై తత్
కా తే స్తుతిః స్తవ్యపరాపరోక్తిః॥ ఓం. 5

దేవీ! యీ జగత్తునందలి సర్వవిద్యలు నీ భేదములే. అనఁగా నీ విభిన్నమూర్తులే. ఈ జగత్తునందలి స్త్రీలెల్లరు నీ యంశములుగానే యున్నారు. నీ వొక్కతెవే మాతృస్వరూపముతో నీ విశ్వమంతట నిండియున్నావు. గాన మఱి నీ స్తుతి యన నెట్టిది? నీవు స్తవ్యమునకుఁ బరవై యున్నావు. వాక్కులకును బరవై యున్నావు. స్తవ్యవిషయకమైన పరాపరవాక్యరూప స్తుతియు నీయెడఁ గేవలాసంభవమే.

పూర్వ శ్లోకరూపమంత్రమున, అమ్మ ప్రసన్నతచేతనే సాధకుల ముక్తిమార్గముఁ దెఱపి యని చెప్పఁబడినది. అమ్మ

ప్రసన్నమైనపుడు సాధకుఁ డీ జగతి నేవిధముగాఁ గనునో యిందుఁ జెప్పుచున్నాఁడు.

వ్యాఖ్య :— ఓ దేవి ! ప్రకాశశీలా ! క్రీడనశీలా ! "జగత్సు సమస్తా విద్యాః" ఈ జగత్తునం దన్నియు విద్యలే. "యయా తదక్షర మధిగమ్యతే సా విద్యా" "దేనివలన నా యక్షరపురుషుఁడు తెలియఁబడునో యదే విద్య" యని యుప నిషత్తు. అనంత జగత్తులందు, అనంతకోటి బ్రహ్మాండములం దన్నియు విద్యలే. అమ్మా ! యథార్థ ముముక్షువులును, నీ ప్రసన్నమూర్తిని గాంచినవారును, దర్శనసౌభాగ్యము నొందిన వారును, సర్వత్ర నీ విద్యాస్వరూపమును జూతురు. అవిద్యా నామముతో లోకమునఁ బ్రసిద్ధమైనదియును విద్య తక్క మఱే మియును గాదు. విద్యయే స్వల్పభావములతో వెలయునపుడు, అవిద్య యనఁబడును. అమ్మా ! నీ తత్త్వమును దర్శించిన సంతానము మాత్రమే యీ విషయము ననుభవింపఁగలదు. కనుక వారలు 'విద్యాః సమస్తా' యని సమస్తరూపిణీ విద్యా మూర్తివైన నీ చరణములందే ప్రణతులై పడుచున్నారు.

ఇపుడొక ప్రశ్నము:— సమస్తము విద్యలే యైనచో, శాస్త్రము దేనిని అవిద్యాపదముతో నిర్దేశించినది ? అని — ఇదిగో, యీ ప్రశ్నమునకు నుత్తరముగానే దేవతలు "తవ దేవి భేదాః" అనిరి. 'అవిద్య' యనునదియు విద్యారూపిణివైన నీ భేదమే. విభిన్నమూర్తిమాత్రమే. అమ్మా! 'అవిద్య' యని మేమనుకొనుచున్నదియు నీ విభిన్న (వేఱొక) మూర్తియే. ఏకవు, అద్వితీయవు, సర్వభేద రహితవు నైన నీవే బహు మూర్తులతో సమస్త జగద్రూపముగా నిత్యము నున్నావు,

అమ్మా! ఈ జగత్తు నీ స్వగతభేదమే. కనుకనే దేవతలమెుదర నంతయు విద్యారూపముగానే యుద్భాసించినది. కనుకనే వారు, అవిద్యగా – విద్యావిరోధిగా దేనినిం గనలేదు.

"స్త్రియః సమస్తాః" సమస్తరూపముగాఁ దోఁచుచున్న దే స్త్రీ; అనఁగా శక్తియే. విశుద్ధచైతన్యస్వరూపవైన నీ వొక్క తెవే పురుషరూపముగాను, సమస్తరూపముగాను – జగద్రూపముగాను ప్రతీతిగోచర వగుచున్నావు. అదియంతయు స్త్రీ. అదియంతయు నీ ప్రకృతి. నీ శక్తి; నీ యిచ్ఛ; నీ వ్యవహారము. (సకారము బ్రహ్మవాచకము; తకారము జగద్వాచకము; రేఫము తేజోవాచకము. ఈకారము శక్తివాచకము – విశుద్ధజ్ఞానస్వరూప బ్రహ్మసమ్మితశక్తియే జగద్రూప.) శక్తి శక్తిమంతునితో సత్యముగా నభిన్నగా (వేఱుగాక) నున్నటులే, యీ ప్రకృతిరూపజగత్తు పరమపురుషుఁడవైన నీచే సర్వవిధముల నాలింగితమై యున్నది. వైష్ణవభాషలో నిదే రాధాకృష్ణుల నిత్యమిలనము.

అమ్మా! ఈసమస్తము సకల – నీ కళతోనే నీయంశముతోనే నిత్యము నున్నది. సత్తారూపముతో, చైతన్యరూపముతో, 'అస్తి, భాతి' రూపముతో, నీ కలయే యంతట నున్నది. కావుననే దేవతలు సమస్తరూపముగాఁ బ్రతీతిగోచర మగుచున్నదంతయు, నీ కలయే యనిరి. (స=బ్రహ్మము, కలా = శ్రేష్ఠశక్తి, కాఁగా బ్రహ్మశక్తి.) నీ కళతోఁ గూడి లేకున్నచో – నీ సత్తా చైతన్యములచే నుద్భాసితము కాకున్నచో, సమస్తమనుట కేమియు లేదు. నీవు నిత్యపూర్ణవు. అనంతవు. నీయం దంశాంశిభేదము లేదు. అయినను విశిష్ట

ప్రతీతి యున్నంతవఱకు దానిని, అంశమే యందురు. కనుకనే శ్రుతియు, నీ జగత్తును నీ యేకాంశముగా నున్నదనుచు వర్ణించినది.

అమ్మా! ఈ విధముగా జగత్తును మాతృరూపముగాఁ గాంచి, సత్యప్రతిష్ఠ చేసి, తల్లి యొడిగా సత్తావిషయమును దలంపుము. చూడు. జగత్తుగా నొక్కటే యఖండసత్త యున్నది. "చెట్టున్నది; పండ్లున్నవి; పూవులున్నవి; నేనున్నాను; నీవున్నావు; వాఁడున్నాఁడు;" అను నీ ఖండఖండములుగా నున్నవనియు, నొక యఖండమైన 'అస్తి' యొక్క పరిచయమునే కలిగించుచున్నవి. ఆ యఖండసత్తగా నున్నదే చిత్శక్తి. అదే అయ్య; (పురుషుఁడు). అదే యమ్మ; ఈ సత్త యజ్ఞేయ (తెలియఁబడనిది) యయ్యును 'జ్ఞ' స్వరూపమే. అగ్రాహ్య యయ్యును గృహీతృస్వరూపమే. మనము విశిష్టభావముతో దానిని దెలియఁగోరునపుడు, అఖండసత్తతోడనే యొక శక్తి, అనఁగా స్త్రీమూర్తి కానవచ్చును. 'వృక్షము' అనుచోట వృక్షశక్తి యున్నది. 'ఇతఁడు పురుషుఁడు' అనుచోటను నింతే. అంతట నిటులే, కాని యీ శక్తి పురుషునిదే, మఱే మియుంగాదు. సత్తా శక్తిమతి. లేదా, శక్తియే సత్తాముఖి.

సరే; ఇపుడు చూడు. అది చెట్టు, ఆ నామరూపాకారముతో నాకారితమైన శక్తి - అమ్మ, యీ జగత్తున నిండి యున్నది. జీవుఁడా! చూడుము. ఏ దిక్కునను దల్లిగాక, మఱెక్కడను నేమియు లేదు. ఇపుడు నీవును "త్వయైకయా పూరిత మంబయైత తత్" అనుము. ఈ విధముగాఁ జూడఁగల్గిన యెడల, నామె ప్రసన్నత ననుభవింపఁగలవు. మాతృప్రసన్న

తను దెలియఁగల్గినచో 'భువి ముక్తి హేతుః' ఆయమ్మ యొక్క తెఱఁగే, యీ జగత్తున ముక్తి హేతువని తెలియఁగల్గుదువు. ఆ యమ్మయే నిన్నాడిలో నిడుకొని ముక్తిమందిరమునఁ జేర్చి ధన్యునిఁ జేయును.

ఇటులు స్తుతించి దేవతలు విశ్వమయ మాతృమూర్తి వర్ణనము చేసిరి. అపుడు బాధ్యులై యామెతో 'కా తే స్తుతిః' నిన్ను స్తుతించు టెట్టిదమ్మా? ఏమన అంతయు నీవే. నీవు తక్క నెక్కడను నేమియు లేదు. కనుక నీవు 'స్తవ్యపరా' స్తుతింపఁదగినదానికిఁ బరపారమందున్నావు. అనఁగా స్తుతిచేత నీ స్వరూపము - ఆరోపితగుణవర్ణనము కాదు. ఏమన నీవు దానికిఁ బైదానవు. ఇంతేకాదు. స్తుతియోగ్య వాక్కు లేవీ? మఱియు "నీవు పరోక్తిః" వాక్యములకును బరపారమందున్నావు. అవాఙ్మనసగోచరవు. "న తత్ర వాగ్గచ్ఛతి". కనుక నెటు చూచినను మాకు నీ స్తుతి కేవల మసంభవమే. మఱి యటులుం గాదు. వాగ్విశుద్ధికొఱకు మేము నీ స్వరూపమహిమములను బాలకులవలె నెటులో కీర్తింపఁ బ్రయాసపడుచున్నాము క్షమింపుమమ్మా!

ఓం. సర్వభూతా యదా దేవీ స్వర్గముక్తిప్రదాయినీ।
త్వం స్తుతా స్తుతయే కావా భవన్తు పరమోక్తయః॥ఓం.6

అమ్మా! నీవే సర్వస్వరూపవు, ద్యోతనశీలవు, స్వర్గ మోక్షముల నిచ్చుదానవు, నిత్యస్తుతవు నైనపుడు నీ స్తవ మెట్లు సంభవము? ఆ స్తుతి పరమోక్తులు - యథార్థవాక్యములు, దేనివల్ల నగుచున్నవో, యదియు నీవే.

వ్యాఖ్య:— మనుష్యుల విషయమున నారోపితగుణవర్ణనము పేరే స్తుతి. నీయందెట్టి గుణాభావమును లేదే. అటులయినపుడుకదా గుణముల నారోపించి వర్ణించుటగును. దేవతాపక్షమున స్వరూపవర్ణనమే స్తుతి. నీ విషయమున నదియు నసంభవమే. ఏమన, నీ స్వరూపమును నీవుతక్క నెవరెఱుంగుదురు? ఎవ్వరుం దెలియలేరు. తెలిసికొనుటకు రెండవదేమియు లేదు. "వేత్తాసి వేద్యంచ" "స వేత్తి విశ్వం న హి తస్య వేత్తా" నీ స్వరూపము నెఱింగినవాఁడు మఱియొకఁడు లేఁడు; కనుక నన్నివిధములచేతను నీ స్తుతి యసంభవము. నీవు సర్వస్వరూపవు; ద్యోతనశీలవు. నీవు స్వభావముచేతనే స్వర్గముక్తిదాత్రివి. స్వభావముచే నీవు నిత్యస్తుతవు. గాన మఱి నీ స్తుతి యెట్లు కాఁగలదు? మాటలకును మనసునకు నందవు. కనుక నీ విషయమున మేమేమి పల్కినను పరాపరోక్తి కాఁజాలదు.

ఓం. సర్వస్య బుద్ధిరూపేణ జనస్య హృది సంస్థితే।
స్వర్గాపవర్గదే దేవి నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 7

దేవీ! నారాయణీ! నీవు సర్వజీవుల హృదయమందు బుద్ధిరూపముతో నున్నావు. స్వర్గమోక్షముల నిత్తువు. నీకు నమస్కారము.

వ్యాఖ్య:— అమ్మా! నిన్ను మేము స్తుతింపలేము కనుక (ప్రణామానుభవమును జేయలేము, గనుక) ప్రణామాభినయమును జేయుచున్నాము. యథార్థప్రణామము నెప్పుడు చేయఁగల్గుదుమో, యది నీవే యెఱుఁగుదువు. నీకు ప్రమొక్కఁగా ప్రమొక్కఁగా నీ పరమధామమందు (కైవల్యధామ

మందు) మాకుఁ జోడెన్నఁడు దొరుకునో, యది నీవే యెఱుఁగు దువు. ప్రణామము జేయఁగా జేయఁగా, మఱి మఱి యీ దేహేంద్రియమనస్సుల కెప్పుడు రామో, యది నీవే యెఱుఁగు దువు. అమ్మా! మేము యథార్థప్రణామము చేయలేకున్నను ప్రణామము నభినయింపఁ బ్రయత్నించుచున్నాము. పోనీ; నీకు నచ్చిననాఁడే మాచే యథార్థప్రణతి చేయించి యందుకొమ్ము.

అమ్మా! నీవు సర్వజీవులలోను బుద్ధిరూపముననున్నావు. అది నిశ్చయాత్మికవృత్తి. దానియం దొకవంక జగత్సంస్కార ములుగాను, రెండవవంక నిర్గుణాత్మయొక్క ప్రతిచ్ఛాయా పరిగ్రహపూర్వకముగాను, సర్వజీవులలో నీ వున్నావు. ఆ బుద్ధి రూపముగా నీవే యున్నావు. నిన్ను బుద్ధిరూపనుగా నెఱుంగు టకే బ్రాహ్మణులు (ద్విజులు) మూడుసంధెలందును, "ధియో యోనః ప్రచోదయాత్" అనుచు నీయెదుట ధీభిక్షమును గోరు చున్నారు. ఈ బుద్ధియు సత్త్వగుణప్రధానమై నిర్మలమైనపుడే, దాని యొకవైపు స్వర్గము (అనఁగా జ్ఞాన వైరాగ్యైశ్వర్య ములు), రెండవవైపు అపవర్గమును (ముక్తిస్వరూపమును) ఉద్భాసించును. జీవన్ముక్తసాధకుఁ డీ బుద్ధియందు స్థిరుఁడై, ఒక వంక స్వర్గభోగము యొక్కయు, రెండవవంక జగద్భోగసత్త యొక్కయు, అపవర్గముయొక్కయు నాభాసము ననుభవించును. కనుక నారాయణివైన నీవు ప్రతినరునందును, ప్రతిజీవునందును బుద్ధిరూపముగా నున్నావు. "నరాణాం సమూహః నారం, తదేవ అయినం యస్యాః సా నారాయణీ" నరసముదాయము నాశ్రయముగాఁ జేసికొని యున్నది నారాయణి. ఇచట 'నర' శబ్దము సర్వభూతోపలక్షకము – నీవు నారాయణివి, మేము

నరులము. అమ్మా! కాయ మనోవాక్కులతో నీ చరణములకు మేము చేయు ప్రణామము నందుకొనుము.

ఓం. కలాకాష్ఠాదిరూపేణ పరిణామప్రదాయినీ।
విశ్వస్యోపరతౌ శక్తే నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 8

నీవు కలాకాష్ఠాదిరూపముతో (కాలపరిచ్ఛేద రూపముతో) జగత్పరిణామసాధనమును జేయుదువు. నీవే జగత్సంహారకారిణీశక్తివి. నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య :— అమ్మా! కాలమూర్తితో నీవు సదా యీ విశ్వముయొక్క పరిణామమును (పరివర్తనమును) సంధానించుచున్నావు. కలాకాష్ఠాదులు నీ యీ యఖండకాలమూర్తి యందలి విభాగములు. పదునెన్మిది నిమేషము లొక కాష్ఠ; ముప్పదికాష్ఠ లొక కల. ఈ విధముగా ముహూర్తదివస సప్తాహ పక్ష మాస ర్తు వత్సర యుగ కల్పాదులన్నియు నీ కాలమూర్తి విభాగములే. నీ కాలమూర్తి యఖండము నపరిచ్ఛిన్నము నైనను, మేము దాని సత్త ననుభవించుటకై, పై విధముగా నెన్నో పరిచ్ఛేదములు చేసివైచితిమి. ఆ పరిచ్ఛిన్న కాలరూపముతో నీవీ జీవజగత్తుయొక్క పరివర్తనమును సంధానించుచున్నావు. ఇక్కాలరూపపరిణామమును లోపలనే చేసి, విశ్వము యొక్క యుపరతిని (ప్రలయమును) సంధానించుచున్నావు. బ్రహ్మవిష్ణు మహేశ్వరాదులైన యీశ్వరులనుగూడఁ బ్రలయ మొనర్చుదానవు నీవే. నీకీ విశ్వప్రలయ మొక చిన్నపని. అమ్మా! నీ వపార శక్తిసంపన్నవయ్యును బ్రతినరునందును నారాయణీమూర్తితో వ్యష్టిమాతృమూర్తితో నున్నావు. నీవు

సమగ్రజగత్తునకును దల్లివయ్యును బ్రతినరునకుం దల్లివి, కనుక నీవు నారాయణివి. నీకుఁ బ్రణామము.

ఓం. సర్వమంగళమాంగళ్యే శివే సర్వార్థసాధికే।
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోఽస్తుతే॥ఓం. 9

అమ్మా! నీవు సర్వమంగళములకును మంగళకారిణివి. నీవు శివవు – మంగళమయివి; సర్వాభీష్టసాధికవు. నీవు శరణ్యవు; (ఆశ్రయణీయవు). నీవు ముక్కంటివి. నీవు గౌరివి; నీవు నారాయణివి. నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య:— మంగళశబ్దమున కనేకార్థములు. తలఁచిన తలఁపు సిద్ధించుట పేరు మంగళము. ఎల్లర కేది మంగళమో యదే మాంగల్యము. (మంగళ్యము – స్వార్థమందు యప్రత్యయము.) లేదా ఈ జగమునం దెన్ని మంగళము లున్నవో, ఆ యన్నిఁటికిని మంగళవిధిని జేయునదే సర్వమంగళమంగళ్య. లోకమందు మంగళము లెనిమిది – బ్రాహ్మణుఁడు, గోవు, హుతాశనుఁడు, హిరణ్యము, ఘృతము, ఆదిత్యుఁడు, జలము, రాజు. మన యమ్మ ఈ యన్నిఁటికిని మంగళవిధానకారిణి. ఆమెయే సర్వమంగళమంగళ్య.

ఇదిగాక, సర్వమంగళమంగళ్య యనఁగా, మనకు మఱియొక యర్థము తోఁచును. సర్వమును మంగళమే. సర్వమునకును మంగళవిధాయిని. సర్వరూపములతోఁ గానఁబడునది, మిథ్యయగునా? భ్రాన్తి యగునా? జడమగునా? అది 'చిత్' కంటె మఱేమియుంగాదు. చైతన్యవికాసముండుటచేనే జీవుఁడు

జీవితావస్థయందు మంగళస్వరూపుఁడు. కనుకనే జీవించియున్న మనుష్యుని పేరి ముందే, మంగళసూచకమైన 'శ్రీ' శబ్దము ప్రయోగింపఁబడును. గతప్రాణుఁడైన మనుష్యుఁడు అమంగళుఁడని యెల్లరెఱుఁగుదురు. సర్వమును జిత్స్వరూపముగా వెలయునపుడు, సర్వమును మంగళమయమే యగును. అపుడు అమంగళ మనుట కేమియు లేదు. మంగళములకు మంగళవిధానము చేయు దానినే, మంగళమయప్రకాశముచే సర్వమును వెలయించుదానినే, 'సర్వమంగళమంగళ్య' యందుము. ఆ సచ్చిదానందమయియొక్క యనుప్రవేశముచేతనే (శ్రుతి - తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్.) సర్వమునకు మంగళమయత్వము గల్గును. అది సర్వమంగళవిధాయినియయ్యును, దాను మంగళమయియే. కావున దేవతలు 'శివే' యని సంబోధించిరి. అమ్మా! జీవుఁడు నిన్నిట్టి భావముతో నెల్లప్పుడును, మంగళమయ మంగళదాయకరూపనుగా నెఱుంగునప్డే వానియెడ సర్వాభీష్టసాధికారూపవై వెలయుదువు. వాని యభీష్టములు తప్పక సిద్ధించును. అపుడాతఁడు పూర్ణకాముఁడై నీలోఁ జేరిపోవును.

అమ్మా! నీవే శరణ్యవు. జీవునకు ముఖ్యాశ్రయణీయవు. త్ర్యంబకా! (త్రిణేత్ర - త్రినయన) చంద్ర సూర్యాగ్నులనెడి ముక్కనులతో, స్థూలసూక్ష్మకారణములనెడి త్రివిధ ప్రకాశములతో నిత్యము విరాజిల్లుచున్నావు. కాల సూచకములైన సూర్యచంద్రాగ్నులు నీ కవయవభూతములు (కన్నులైనవి), అనుటచే నీవు కాలాతీతవు; కాలస్వరూపిణివి. మఱియు, స్మృతికల్పన, ఆశ యనెడి భూతభవిష్యద్వర్తమానము లనెడి త్రయమును జూచు త్రినేత్రములతో విశిష్టవై (అనఁగా భూత

వర్తమాన భవిష్యద్ జ్ఞానస్వరూపిణివై) నీవే నిత్యమున్నావు. అమ్మా! నీవు గౌరివి. అతిమనోహరవు; అతి సుందరివి; అతి సౌమ్యవు. నీవు నారాయణివి. నీకుఁ బ్రణామము.

ఓం. సృష్టిస్థితి వినాశానాం శక్తిభూతే సనాతని।
గుణాశ్రయే గుణమయే నారాయణి నమోఽస్తుతే॥ఓం. 10

అమ్మా! నీవు సృష్టి స్థితి వినాశములు చేయు శక్తి స్వరూపిణివి. నీవు మూఁడుగుణములకు నాశ్రయస్వరూపిణి వయ్యును స్వయముగా గుణమయివి. నీవు నారాయణివి. నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య :— చైతన్యమయియైన మహాశక్తియే నీ స్వరూపము. అది యీ జగత్తునందలి ప్రత్యేకపదార్థమందును, ప్రతిక్షణమందును నీ సృష్టిస్థితిప్రలయమూర్తిని జూచుటచేతనే యనాయాసముగాఁ దెలియఁగలము. నిన్నుఁ బట్టుకొనుటకుఁ (నిన్నుఁదెలియుటకు) ఏదే నుపాయమున్నదా? యనుచో నది యీ త్రివిధప్రకాశమే. నీవు సనాతనివి; నీవు నిత్యవు; అవ్యక్త స్వరూపవయ్యును, సృష్టి స్థితి ప్రలయమూర్తులతో సర్వత్ర వెలయుచున్నావు. ఇది శాస్త్రపురాణతంత్రాదులందు వర్ణితము. మహాకాళినుండియే బ్రహ్మవిష్ణుశివుల జన్మమయ్యెను. అమ్మా! నిజముగా నీవల్లనే సృష్టిస్థితిప్రలయము లనెడి త్రివిధశక్తులు వెలయుచున్నవి. ఇమ్మూఁడు శక్తులు వాస్తవముగా భిన్న శక్తులుకావు. ఒక్క మహాచిచ్ఛక్తియొక్క త్రివిధస్పందనములే. ఆ శక్తికి స్వరూపమేమిటిది? అది కేవల మవ్యక్తమయ్యును, నీ త్రివిధస్పందనములచేతనే దాని సత్త తెలియఁదగియున్నది.

అమ్మా! నీ యీ యవ్యక్తశక్తిస్వరూపము, ఏ విధముగా వ్యక్తభావము నొందినదో, యీ వైపు లక్ష్యముంచియే దేవతలు నిన్ను గుణాశ్రయవు, గుణమయవు ననిరి. సత్త్వ రజస్తమస్సు లనెడి మూడుగుణముల (అవస్థల) నాశ్రయించియే, నీ యీ త్రివిధస్పందన మున్నది. లేదా - స్వేచ్ఛాకృతములైన యీ నీ త్రిశక్తులే త్రిగుణములనెడిపేరఁ బ్రసిద్ధములు. ఇమ్మూడు గుణములు నీ యాశ్రయముచేఁ బ్రకాశించునపుడు, నీవే గుణమయివయి నారాయణీమూర్తితో మమ్ముల నోడియందుంచుకొని యుందువు. అమ్మా! నీకుఁ బ్రణామము. ఈ గుణమయావస్థనుండి మమ్ములను దప్పించి, నీ యీ సనాతనస్వరూపమందు ఈ సృష్టి స్థితి ప్రలయము లనెడి మూడు సుడులు లేని చోటికిం దీసికొనిపొమ్ము. అమ్మా! అచ్చటికే కొనిపో.

ఓం. శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే।
సర్వస్యార్తిహరే దేవి నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 11

అమ్మా! నీవు శరణాగతులు, దీనులు, ఆర్తులు నైన జనులను రక్షించుచుందువు. నీవు సర్వముయొక్క యార్తిని హరించు దేవివి. నారాయణివి. నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య:—జీవుఁడేనాఁడు నీ చరణములందుఁబడి శరణమనునో, నీ యభావమందు దీనుఁడగునో, నీ యెడఁబాటుచే నార్తుఁడగునో, ఆనాఁడే మున్ను జెప్పిన, నీ త్రిగుణమయ త్రిశక్తిమయ స్వరూపము నెఱుంగఁగలవాఁడగును. అమ్మా! ఆనాఁడే నీవును నిజముగాఁ బరిత్రాణ పరాయణమూర్తితో వెలసి జీవుని భయార్తులను దవ్వు తొలఁగించి రక్షింతువు.

అపుడే వాని జన్మమృత్యువులనెడి సంసారార్తి పూర్తిగా నివర్తిల్లును.

అమ్మా! నీ చరణములందు శరణు చొచ్చుటచేతనే, జీవుఁడు నీమొదటిశక్తిని, అనఁగా సత్త్వగుణమయస్వరూపము నవధరింపఁ (స్థిరీకరింప) గలఁడు. నీ వొక్కతెవే యాశ్రయమనియు, నీ సత్తవల్లనే జగత్సత్తయనియుఁ దెలియఁగల్గునపుడే, సత్యముగా సర్వధర్మపరిత్యాగపూర్వకముగా, నీకు శరణాగతుఁ డగును. నీ సత్త్వమయస్వరూపానుభవము చేయఁగలఁడు.

మఱియు నపుడే జీవునందు దీనత తోఁచును. అనంతైశ్వర్యమయివియు, అనంతబ్రహ్మాండాధీశ్వరివియు నైన నీ లీలా విలాసదర్శనము చేయుటచేతనే జీవునకుఁ దన దీనత చక్కఁగాఁ దేటపడును. "నే నెంత దీనుఁడను; ఎంత లేమికిఁ జిక్కినాఁడను" అని దానిచే జీవుఁడు తెలియఁగలఁడు. మా యమ్మ యనంత బ్రహ్మాండముల కధీశ్వరి, యని తెలిసికొనుట పేరే, నీ రెండవ శక్తిని, అనఁగా నీ రజోగుణమయస్వరూపము నెఱుంగఁగల్గుట. జీవుఁడు తన దీనతను యథార్థముగా ననుభవింపఁగల్గునపుడే, అమ్మ యైశ్వర్యబోధము గలుగును. మాతైశ్వర్యానుభూతి తన దీనతాప్రతీతికి హేతువు - అనుట మేలు. అమ్మా! జీవ సంతానమునకు నీ చిత్ స్వరూపమును విశేషించి యనుభవము చేయించుటకే రజోగుణమయమైన నీ యీశ్వరీమూర్తి వికాసము.

దాని తరువాత ఆర్తి. అమ్మా! నీ నిరవచ్ఛిన్నమైన యానందమయస్వరూపము ననుభవించుటకే జీవున కార్తి గలుగును. ఈ జగత్తునందే వస్తువునందు నానందము లేదు.

ఆనందఘనివి నీ వొక్కతెవే యని తెలియఁగల్గుటకైన బాహ్య లక్షణమే జీవుని యార్తి. నీ ప్రభావమువలనఁ గలుగు విరహ వేదనయే యథార్థమైన యార్తి. ఈ యార్తభావము గలిగి నపుడే జీవుఁడు, నీ యానందస్వరూపముయొక్క – తమోమయ మూర్తియొక్క – సాక్షాత్కారము నొంది ధన్యుఁడగును. మఱి నిరానందము నావలిగట్టును జేరిపోవును.

అమ్మా! మే మెపుడు "నిరాశ్రయం మాం జగదీశ రక్ష" యనుచు నేకాంతనిరాశ్రయజ్ఞానముతో – అనఁగా "నీ యేకాశ్రితుఁడను (నిన్నే యాశ్రయించితిని)" అనెడి మాట చక్కఁగా నెఱుంగఁగల్గునపుడే, నీ సత్ స్వరూపము మాకుఁ దెలియును. (మా యెదుట నుద్భాసించును.) మేము సత్యమందుఁ బ్రతిష్ఠితుల మగుదుము. మఱియు బ్రహ్మాండమయమైన నీ యనంతైశ్వర్య భండారమును బ్రత్యక్షము చేసికొని మా దీనతను జక్కఁగా ననుభవింపఁగలుగుదుము. తరువాత మా కుత్తరాధికారము గలిగి, నీ యా యైశ్వర్యసత్త నొందుటకై (తెలియుటకై) లాలసుల మగుదుము. అపుడే నీ చిత్స్వరూప ముద్భాసించును. అపుడంతటను నిన్నుఁ బ్రాణరూపముతో (చైతన్య రూపనుగా) దర్శించి మేము ప్రాణమందుఁ బ్రతిష్ఠితుల మగుదుము. అది మొదలు తుట్టతుదకు, ఈ పుట్టుసావులు, దేహధారణము, చాంచల్యము యథార్థముగా మాలో నొక యార్తిని బుట్టించును. అపుడే నీ వానందఘనమూర్తితో నిత్యము వెలయుచున్నావని కనుగొందుము. నీయందును మా యందును, ఆనందాభావము చాంచల్యము నేనాఁడును లేదు. నీవును మేమును నిత్యస్థితులము నిత్యానందమయులము. మా

యమ్మా! నారాయణీ! ఆర్తిహారిణీ! ఆర్తత్రాణపరాయణా! నీకుఁ బ్రణామము.

అమ్మా! మమ్ముల నీ విధముగానే, తో౯ల్త శరణాగతులను, దీనులను, ఆర్తులను జేయుచునే మఱల సత్యమందును బ్రాణమందును ఆనందమందును బ్రతిష్ఠింపుము. మా ప్రణామము సార్థకమగును. అమ్మా! మాయందీ మూడులక్షణములును గానఁబడనంతదాఁక నీ పరిత్రాణ పరాయణమూర్తిని బ్రత్యక్షముచేసికొను నాశయే లేదు. గాన నీవీ యకృతి సంతానమును, ఆత్మప్రకాశయోగ్యముగాఁ జేసికొమ్మ, శరణాగత దీనార్తమునుగాఁ జేయుము.

ఓం. హంసయుక్త విమానస్థే బ్రహ్మాణీ రూపధారిణి।
కౌశాంభః క్షరికే దేవి నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 12

ఓం. త్రిశూల చంద్రాహి ధరే మహావృషభవాహిని।
మాహేశ్వరీస్వరూపేణ నారాయణి నమోఽస్తుతే॥ఓం. 13

ఓం. మయూర కుక్కుటవృతే మహాశక్తిధరేఽనఘే।
కౌమారీరూప సంస్థానే నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 14

అమ్మా! నీవు హంసలు పూన్చిన విమానమందుండి బ్రహ్మాణీస్వరూపమును దాల్చి, కమండలువునందున్న దర్భలచే బవిత్రమైన నీటితో మార్జనముచేసితివి. నారాయణీ! నీకుఁ బ్రణామము. నీవు త్రిశూలముఁ జంద్రుని సర్పములను ధరించి మహావృషభముపై నెక్కి మాహేశ్వరీరూపముతో నావిర్భవించితివి. నారాయణీ! నీకుఁ బ్రణామము. నీవు నెమిలి

వెన్నుననుండి, కోడిపుంజులచేఁ జుట్టఁబడి, మహాశక్తినిదాల్చి, కౌమారీరూపముతో వెలసితివి. నారాయణీ! నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య:— అమ్మా! నీవు బ్రహ్మాణివి. విరాణ్మనో రూపముతో వెలయుచు, ఈ విశ్వకల్పనముఁ జేయుదువు. జీవ భావీయ వ్యష్టిమనస్సే నీ హంసయుక్తవిమానము. కమండలువు నందలి కుశపూతజలము సురక్షితముచేసితివి. విరాట్కార్మాశ యమునుండి సంకల్పశక్తి నను ప్రేరణము చేయునటులే, జీవ కర్మాశయమునుండి కర్మస్ఫురణము చేయుదువు. నీవు జీవులను గర్మసమ్ముఖీనులను జేయునపుడు, జీవులు కర్మముల నభిమా నింతురు. నీ యీ కౌశాంభఃక్షరణము లేకున్న జీవునకుఁ గర్మ పిపాస తొలఁగదు. నీవు స్వయంప్రకాశవు, నారాయణివి. నీకుఁ బ్రణామము.

అమ్మా! నీవు మాహేశ్వరీమూర్తితోఁ ద్రిపుటీజ్ఞాన మనెడి త్రిశూలమును, మనోరూపచంద్రుని, కుండలిని యనెడి సర్పమును ధరించి, ధర్మమనెడి మహావృషభము నెక్కి యావిర్భవించితివి. నీవు ప్రతి నరునియందును నీవిధముగానే వెలయుదు. నారాయణీ! నీకుఁ బ్రణామములు.

అమ్మా! నీవు మయూర కుక్కుట వృతవు. దీనికి మఱి యొక యర్థమేమనఁగా – కుక్కుట శబ్దమునకు = పుచ్ఛము, శ్రేష్ఠము అని. కనుక మయూరపుచ్ఛమందు – శ్రేష్ఠ మయూ రముపైని శోభించుదానవు. జీవుఁడు మయూరధర్మము గలవాఁడైనపుడు, అనఁగా – కుటిల వృత్తులనెడి పాములను జంప నుద్యమించునపుడు, శ్రేష్ఠమయూర శోభితుఁడై,

కౌమారీరూపమున నావిర్భవించి, దేవసేనను నడుపు భారమును వహించి, యసురకుల వినాశమును జేయ నుద్యుక్తుఁడగును. అపుడు జీవసంతానము, అసుర భీతివలనఁ దొలఁగును.

మఱియొక భావము — ప్రలీనజగత్తు పరమాత్మయందు, మయూరాండ రసన్యాయముగా నుండి, (మయూరాండమందుఁ బరిత్యాజ్యభాగ ముండదు. శైవాగమము లిట్లే వర్ణించెను.) ఇచ్ఛాస్పందము కాఁగానే, చిత్ర విచిత్ర మయూరమును బోలి జగత్తు ప్రకాశించును. అట్టి విచిత్ర జగదధిష్ఠాత్రి అమ్మయే యనుట నీ కౌమారీతత్త్వము బోధించును.

మఱియు, అమ్మా! నీ వనఘువు, కనుక నీదర్శనముచే జీవుఁడును ననఘుఁడగును. భేదజ్ఞానమే యఘము. ద్వైత ప్రతీతియే యథార్థపాపము. అమ్మా! నీ దర్శనముచే జీవుని ద్వైతప్రతీతి విలయమొందును. జీవుఁడు బ్రహ్మానుభూతి చేయును. జీవత్వమనెడి పాపము పూర్తిగా నశించిపోవును. నీవు నారాయణివి. నీకుఁ బ్రణామము.

ఓం శంఖ చక్ర గదా శార్ఙ్గ గృహీత పరమాయుధే।
ప్రసీద వైష్ణవీరూపే నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 15

ఓం. గృహీతోగ్ర మహాచక్రే దంష్ట్రోద్ధృత వసుంధరే।
వరాహరూపిణి శివే నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 16

ఓం. నృసింహరూపేణోగ్రేణ హంతుం దైత్యాన్ కృతోద్యమే।
త్రైలోక్య త్రాణసహితే నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 17

అమ్మా! నీవు శంఖ చక్ర గదా శార్ఙ్గములనెడి యాయుధములను ధరించిన వైష్ణవివి. ప్రసన్నవగుము. నారాయణీ! నీకుఁ బ్రణామము.

నీవు వరాహరూపముతో భీషణమహాచక్రమునుదాల్చి, కోఱచే వసుంధర నుద్ధరించితివి. మంగళస్వరూపిణీ! నారాయణీ! నీకుఁ బ్రణామము.

నీవు మహోగ్ర నరసింహరూపముతో దైత్యకులముల నిహత మొనర్పఁగడఁగితివి. నీవు ముల్లోకములను రక్షించుదానవు, నారాయణివి; నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య:— వైష్ణవీ, వారాహీ, నారసింహీ, యనెడి యీ నీమూఁడు రూపములచేతనే, మేము విష్ణుశక్తిస్వరూపమైన నీ విశేషాభివ్యక్తిని గనఁగల్గుచున్నాము. మహాప్రాణరూపిణివి, మహాస్థితిశక్తివైన నీవు శంఖ చక్ర గదా శార్ఙ్గ ధనుస్సులను దాల్చి, అనఁగా – వ్యక్తము, అవ్యక్తము నాదమయమునైన యీసంసారచక్రమును, స్నేహమయ ప్రణవాకర్షణముచే దినదినమును మోక్షాభిముఖుని జేయుదువు. సూరిజనులు రేవగల్లును నీ యీ విశ్వవ్యాపి పరమపదమును ప్రకాశవ్యాపి దృక్ఛక్తినివలెఁ జూచుచుందురు. సాధకులును, ఆచమన క్రియాసహాయముతో దమ వ్యష్టిభావమును నీ పరమపదముతోనే సంబంధవిశిష్టమును జేయుటకై ప్రయాసపడుచుందురు. శ్రుతి॥ "తద్విష్ణోః పరమంపదం సదా పశ్యన్తి సూరయః। దివీవ చక్షురాతతం" అనెడి మంత్రముతో "పుండరీకాక్ష" (పుండరీకం – హృదయపుండరీకం, అక్ష్ణోతి – వ్యాప్నోతీతి పుండరీకాక్షః)

నామోచ్చారణముతోఁ ద్రిరాచమనము పూర్వర్షి వ్యవహారము. (ఆచరితము.) నీవు నారాయణివి; ప్రతినరుఁడును నీ కాశ్రితుఁడే; నీకుఁ బ్రణామము.

అమ్మా! నీవు వారాహీమూర్తితోఁ బ్రలయపయోధి జలమందు మునిఁగి యీ వసుంధరను నీ కొమ్ముతో నుద్ధరింప కున్నచో, నీ చరాచరము తన యజ్ఞానమనెడి చీఁకటిలో నెంత కాలము గాఢముగా నిద్రించియుండునో! దీని నెవరు నిర్ణయింపఁ గలరు? జీవసమూహము కామకర్మమయమైన యీ స్థూల భావము నవలంబించియే, తెలిసియో తెలియకో మంగళము వైపు – మోక్షమువైపు, ముందంజవేయును. ఇది నీ కృపయే; నీవు మంగళమయివి నారాయణివి; నీకుఁ బ్రణామము.

అమ్మా! యీ వారాహీమూర్తితో స్తవ్యవు. నీ నార సింహమూర్తిని మేము తలంప, అబ్బ! అది యెంత యుగ్ర రూపమమ్మా! దైత్యకులము నిహతమగుటచే హిరణ్యకశిపుని స్థూలదేహమునఁ జకును నీవు గోళ్లచే ముక్కముక్కలు చేసి వైచితివి. ముల్లోకములును, అసురాత్యాచారమునుండి తప్పు కొన్నవి.

అమ్మా! ఒకనాఁడు నీవు ప్రహ్లాదుని ప్రబల సత్య జ్ఞాన ప్రభావముచే జడస్ఫటిక స్తంభమును భేదించి నీ చైతన్యమయ స్వరూపము నుద్భాసింపఁజేసితివి. మఱి యీ యజ్ఞజడత్వ యుగమందు; అనుభూతిహీన ప్రాణహీన మృతకర్మానుష్ఠాన యుగమందు, నీవొక్కసారి సత్యమూర్తితో దర్శనమిమ్మా! జీవుని జడబుద్ధి యనెడి స్ఫటిక స్తంభమును భేదించి చైతన్య మయాత్మస్వరూపము భాసిల్లఁజేయుము. జీవుని సంశయములు

సమసిపోవును. జడత్వమోహములను విడిచి చైతన్యమందుఁ బ్రతిష్ఠితుఁడగును. మఱియు సత్యప్రాణానందప్రవాహము వచ్చి జగత్తును ముంచివేయును. జగత్తు మఱల యథార్థముగా దేవతలువలెనే నిన్ను సర్వత్ర సర్వదా నారాయణీమూర్తితోఁ గాంచి 'నమోఽస్తు తే' యని ప్రణతమగును. అమ్మా! ఈ యాశాపూర్తి నీ సంతానమున కెప్పుడగునో.

ఓం. కిరీటిని మహావజ్రే సహస్రనయనోజ్జ్వలే ।
వృత్రప్రాణ హరే చైంద్రి నారాయణి నమోఽస్తు తే॥ ఓం. 18

ఓం. శివదూతీ స్వరూపేణ హతదైత్య మహాబలే ।
ఘోరరూపే మహారావే నారాయణి నమోఽస్తు తే॥ ఓం. 19

ఓం. దంష్ట్రాకరాళవదనే శిరోమాలా విభూషణే ।
చాముండే ముండమథనే నారాయణి నమోఽస్తు తే॥ ఓం. 20

అమ్మా! నీవు కిరీటధారిణివియు, మహావజ్రధారిణివియు, సహస్రనయన శోభితవునై వృత్రప్రాణములను హరించిన యింద్రాణివి, నీవు నారాయణివి. నీకుఁ బ్రణామము.

నీవు శివదూతీరూపమున దైత్యసేనలను వధించితివి. నీవు భయంకరరూపవు; ఘోరనినాదినివి. నారాయణివి. నీకుఁ బ్రణామము.

ఓ చాముండా! నీవు దంష్ట్రాకరాళముఖవు; నీ భూషణము ముండమాల; నీవు చండముండాసురుల జంపితివి. నారాయణీ! నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య:— అమ్మా! నిర్మల జ్ఞానరత్న స్వరూపకిరీటము నీ శిరోభూషణము. కావున నీవు కిరీటినివి. మఱి నీవే మహా వజ్రధారిణివి. శ్రుతియు — "మహాద్భయం వజ్ర ముద్యతం" అన్నది. నీవు మహాద్భయమనెడి వజ్రము నెత్తి యుంతువు. నీవలని భయముచేతనే సూర్యుఁడుదయించును; వాయువు వీచును. అగ్ని మండును; మృత్యువు పరుగెత్తును. నీ చండ శాసనముచేతనే యింద్రాదులు దిక్పాలనము చేయుచున్నారు, ఈ విశ్వము నియంత్రిత మగుచున్నది. అమ్మా! నీ వజ్రధారిణీ రూప మిది.

నీవు వేయికన్నులతో వెలయుదువు. అనఁగా నీ కన్నులసంఖ్యములు. అమ్మా! నీవు విశ్వతశ్చక్షువవు. ప్రత్యేక జీవుఁడును, ప్రత్యేక పరమాణుపర్యంతమును నీ యా చక్షువులచేతనే, యా దృష్టిచేతనే యుద్భాసితమగుచున్నది. నీ కగోచరమైనది, యప్రత్యక్షమైనదియు నేదియు నెచటను లేదు. నీ నెయ్యపుబిడ్డఁడైన మనుజునకు, "అబ్బాయీ! సత్యమునుండి తొలఁగిపోయి, యసత్యము నాశ్రయించి, నాకుఁ జాటుపెట్టి యే పనియుఁ జేయకుమా." యని చెప్పివేయుము. అమ్మా! నీవు విశ్వతశ్చక్షూరూపముతో నున్నావు. లోలోపలిచోట నీ సర్వప్రకాశకదృష్టి ప్రసరించుచునే యుండునన్న మాట మఱువకుండునపుడే, యెట్టి యసత్యమార్గమును ద్రొక్కలేరు. ఎల్లరు సత్యనారాయణు లగుదురు. ఎల్లరహృదయముల చిక్కులును విడిపోవును.

అమ్మా! నీవు వృత్రప్రాణహారిణివైన యింద్రాణివి. అనాత్మజ్ఞాన మనెడి వృత్రాసురుఁడు నీ వజ్రపాతముచేతనే

చచ్చెను. బ్రాహ్మణుని యెముకచేఁ జేయఁబడినది. తనువు దాల్చిన బ్రహ్మమే బ్రాహ్మణుఁడు. జగత్తును ముఖ్యముగా ధరించువాఁడు. ఇట్టి బ్రాహ్మణుని యెముక (సారవద్భాగము) కాకున్నచో నీ వజ్రము నిర్మితముకాదు. బ్రాహ్మణుని స్థూల శరీరమందలి క్షుద్రతమభాగమువలనను, నిర్మలబ్రహ్మజ్ఞానాంశా లోకముతో వెలయును. అది విశుద్ధము గనుకఁ గేవలము బ్రహ్మజ్ఞానముచేతనే జగత్తును ధరించునట్టి బ్రాహ్మణుని భౌతిక దేహమునకుఁ జెందిన యెముక సైతము, ఆసురభావములను నశింపఁజేయఁగలది. జగన్మంగళసాధనమందు సమర్థము. ఇక్కథను బోధించుటకే నీవు బ్రాహ్మణాస్థితో వజ్రమును నిర్మించి యసురులను జంపుటయ్యెనా? నిజముగా, అమ్మ బ్రాహ్మణాస్థి లేక యసురఘాతకవస్తువును నిర్మింపదు. కనుకనే లోకములో నింతదాఁక బ్రాహ్మణుఁడొక్కఁడే యసురఘాతనమందు సమర్థుఁడుగా నున్నాఁడు. బ్రహ్మజ్ఞానమున కాచార్యుఁడుగాను, ఆసురికభావముల నణఁగద్రొక్కువాఁడుగాను, బ్రహ్మజగత్తునందొక్క బ్రాహ్మణుఁడే యున్నాఁడు. బ్రాహ్మణుఁడే నీ యీ సృష్టిప్రపంచమునకు గౌరవకేతనము. అమ్మవు నీవే, యనెడి మాట నీ యీ బ్రాహ్మణసంతానముచేతనే జగమునందు బ్రచారితమై ప్రతిష్ఠితమైనది. ఇంద్రాణీ! నీవు నారాయణివి; నీకుఁ బ్రణామము.

అమ్మా! నీవు చండముండులను గెడపిన చాముండాదేవివి. కోఱలచే భయంకరమైన నీ ముఖమండలమునందు ద్వైతప్రతీతులనెడి దైత్యకులముప్రవేశించి, సాధకునకు అద్వయజ్ఞాన ప్రకాశమనెడి సుయోగమును గల్గించినది. నీవు ఏఁబది

నరముండములను మాలఁగూర్చి తాల్చితివి. ఏఁబది మాతృకా వర్ణముల నెడి నరశిరోమాల నీ కంఠదేశమందుఁ బడి మిగుల శోభించినది. నారాయణీ! నీకుఁ బ్రణామము.

అమ్మా! నీ వీ విధముగా బ్రాహ్మీ మాహేశ్వరీ కౌమార్యాద్యష్టైన యెనిమిదిశక్తుల రూపమున వెలసి మా యెనిమిది పాశముల నెడి దైత్యులను విలయ మొనర్చితివి. మఱి, అణిమాద్యష్టైశ్వర్యముల యెడనైన కోరిక నణఁగించితివి. అతిదుర్లభమైన యీశ్వరత్వమునొందు దురాశనుసైతము తొలఁగించితివి. మమ్ములను అద్వయతత్త్వమందు, విశుద్ధజ్ఞానస్వరూపమందుఁ జేర్పుము. అమ్మా! నీ యీ యష్టవిధ శక్తిప్రకాశము జీవత్వ పాశముల నెన్మిదిటిని ఛేదించి, ఈశ్వరత్వముయొక్క అష్టైశ్వర్యములను తృణముగాఁ దోఁపించి, ముక్తిపేరి హిరణ్మయ మందిరమునకుఁ గొనిపొమ్ము. నీవు ప్రతినరునియందు నీ విధముగా స్నేహమయ జననీరూపముతో వెలయుము. వెలయుచున్నావు కావున నే నారాయణివి. నీకుఁ బ్రణామము.

ఓం. లక్ష్మి లజ్జే మహావిద్యే శ్రద్ధే పుష్టి స్వధే ధ్రువే।
మహారాత్రి మహాఽవిద్యే నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 21

ఓం. మేధే సరస్వతి వరే భూతి బాభ్రవి తామసి।
నియతే త్వం ప్రసీదేశే నారాయణి నమోఽస్తుతే॥ ఓం. 22

నీవు లక్ష్మివి; లజ్జవు; మహావిద్యవు; శ్రద్ధవు; పుష్టివి; స్వధవు; ధ్రువవు; మహారాత్రివి; మహాఽవిద్యవు; అమ్మా!

నీవు మేధవు; సరస్వతివి; వరవు; భూతివి; బాభ్రవివి; తామసివి; నియతవు; నీవు ప్రసన్నవగుము. నీకుఁ బ్రణామములు.

వ్యాఖ్య:— అమ్మా! నీవు లక్ష్మివి. శ్రీం బీజరూపిణివి. సర్వలక్షణసంపన్నవు. సర్వదా భక్తుల నొకకంటఁ జూచుదానవు. సౌందర్యరూపిణివి; సంపద్రూపవు. అమ్మా! నీవు లజ్జవు. హ్రీం బీజము శరీరముగాఁ గలదానవు; హ్రీం లజ్జా బీజము. అది నీ స్వరూపము. నీవు నిందితకార్య వైముఖ్య రూపవు. (లోకనిందితకార్యములయెడ నగు సంకోచమే లజ్జ.) అమ్మా! నీవు మహావిద్యవు – కాలీ తారా బగలా భువనేశ్వరీ త్రిపురసుందరీత్యాది దశమహావిద్యలు నీ స్వరూపములే. శ్రేష్ఠ బ్రహ్మవిద్యవు. అమ్మా! నీవు శ్రద్ధవు; సత్యనిష్ఠ, గురువేదాన్త వాక్యములందుఁ జెదరని విశ్వాసమునై యున్నావు. అమ్మా! నీవు పుష్టివి. పంచకోశ పరిపూర్ణతాస్వరూపవు. జగత్పోషణ శక్తిస్వరూపవు. అన్నమయాది పంచకోశములకు నన్నముఁ బెట్టి పోషించు అన్నపూర్ణేశ్వరివి. అమ్మా! నీవు స్వధవు; శ్రాద్ధాది పితృకృత్యరూపవు (శ్రాద్ధక్రియయంతయు బ్రహ్మవిద్యాబోధక మంత్రసమూహఘటితము). బ్రహ్మవిద్యాస్వరూపిణి అమ్మ రూప మది యనిరి. అమ్మా! నీవు ధ్రువవు. నిశ్చలవు. శాశ్వతివి. అంతట నిండియున్నదానవు గనుక ధ్రువవు. ధ్రువము = ఓంకారము. కావునఁ బ్రణవస్వరూపిణివి. ప్రణవవాచ్యవు.

పైని జెప్పిన హ్రీంకారము శాక్తప్రణవము, ఓంకారము బ్రహ్మప్రణవము, హ్రీంకార ముభయాత్మకము, కావు ననే లజ్జా ధ్రువముల నెడి హ్రీం ఓంకారములు రెండును బ్రహ్మ సమ్మితమైన యమ్మకుఁ జెల్లును. 'శక్తి శక్తిమతో రభేదః' శ్రుతి.

అమ్మా ! నీవు మహారాత్రివి. ప్రలయరూపవు. అజ్ఞానరూపవు. నీవు మహావిద్యవు, అనాత్మ ప్రత్యయరూపవు. కావుననే జగత్తు నవిద్యామోహితమును జేయుచున్నావు. అమ్మా ! నీవు మేధవు, ధారణావతీబుద్ధివి. ఇంద్రియాదులచే జీవుఁడు గ్రహించినది, విస్మృతముకాకుండు శక్తియే మేధ. బ్రహ్మ విద్యా ధారణారూపసామర్థ్యము. (అందులకే శ్రీ శంకరాచార్యులు "బ్రహ్మాహమస్మీతి స్మృతిరేవ మేధా" యనిరి.) అది నీ స్వరూపము. శ్రుతి॥ "మేధా దేవీ జుషమాణా న ఆగాత్ విశ్వాచీ భద్రా సుమనస్యమానా" అన్నది. జన్మజన్మాంతరముల నుండి విస్మరింపఁబడిన 'అహంబ్రహ్మాస్మి' యను మహావాక్యార్థము తలంపునకు వచ్చునట్లు చేసే మేధ. అది జరిగినప్పుడే మేధాజననమైన దనవలయును. అమ్మా ! నీవు సరస్వతివి, విశుద్ధజ్ఞానరూప బ్రహ్మవిద్యవు. మఱి, పరా పశ్యన్తీ మధ్యమా వైఖరీరూప వాఙ్మూర్తివి. సరస్వతి – సరస్సులు (చెరువులు) గలది = నది. మూలాధారమందుఁ బరావాగ్రూపముననుండి, సంకల్పము కలుఁగఁగానే, పశ్యన్తీ మధ్యమా వైఖరీ రూపములతో నుచ్చరించునది (మీఁదికి నడుచునది). అపుడు నది తాఁ బుట్టినచోటి నుండి పాఱుచు ననేకసరస్సులలోఁ గలిసి పాఱిపోవుచుండుటచే 'సరస్వతి' యనఁబడినటులే, పరావాగ్రూపిణి యమ్మయు వ్యష్టియందుచ్చరించునపుడు సరస్సులుగా భావింపఁబడిన స్వాధిష్ఠానాద్యనేక కేంద్రములందుఁ జేరిపోవుచుండును గాన వాగ్రూప బ్రహ్మశక్తియు (నాదబ్రహ్మస్వరూప) సరస్వతి యనఁబడెను. అమ్మా ! నీవు వరవు, శ్రేష్ఠవు, శ్రేష్ఠవరప్రదవు. వరము = మోక్షము; తత్స్వరూపవు. అమ్మా ! నీవు భూతివి. సత్వగుణ

స్వరూపవు. నీవు వా(బా)భ్రవివి - రజోగుణస్వరూపవు. నీవు తామసివి-తమోగుణస్వరూపవు. నీవు నియతవు-నిశ్చయాత్మక వృత్తిరూపవు. అమ్మా! నీవు ప్రసన్నవగుము. నీవు ఈశవు= ఈశ్వరివి. సర్వసమర్థవు, అమోఘ సంకల్పవు. సకలనియంత్రివి. సృష్ట్యాది పంచకృత్యపరాయణ వయ్యును, ప్రతి నరునందును విశిష్టభావముతో, నారాయణీమూర్తితో వెలయుదువు. అమ్మా! నీ చరణములకుఁ గోటి ప్రణామములు.

ఓం. సర్వస్వరూపే సర్వేశే సర్వశక్తిసమన్వితే ।
భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గే దేవి నమోఽస్తుతే॥ ౘం.23

ఓ దేవీ! నీవు సర్వస్వరూపవు, సర్వేశ్వరివి, సర్వశక్తులతోఁ గూడినదానవు. మమ్ములను భయమువలన రక్షింపుము. దుర్గాదేవీ! నీకుఁ బ్రణామము.

వ్యాఖ్య:— అమ్మా! దేవతలు నిన్ను స్తుతించునప్పుడు బ్రాహ్మి మున్నగు నీ యెనిమిది శక్తులను, లజ్జ మున్నగు నీ విశేషస్వరూపములను లక్షించి మఱి మఱి నీకుఁ బ్రణామములు చేసిరి. దీనప్రాణముతో నీ ప్రసన్నతను ప్రార్థించిరి. ఇపుడు "సర్వస్వరూపే, సర్వేశి" యనుచు నీ ప్రసన్నతాలక్షణముం గొనియాడుచున్నారు. నీవు ప్రసన్నవైతే, నీమూఁడు స్వరూపములను జీవునకు బోధపడును. ఇపుడు వారు స్మరించి ప్రణమిల్లుచున్నారు.

అమ్మా! నీవు సర్వస్వరూపవు. మాకుఁ గానవచ్చు దంతయు, అనఁగా మే మెల్లప్పుడు ననుభవించునదంతయు,

నీ బహుత్వము (సర్వత్వము) అంతయు నీ మొదటి స్వరూపము. ఇదే నీ స్థూలదేహము. నీ యీ సర్వస్వరూపమూర్తిని, యథార్థముగా, నీ స్థూలదేహముగాఁ గ్రహింపఁగల సంతానమునకే, నీ రెండవస్వరూపమైన సర్వేశ్వరీమూర్తి దర్శనమగును. ఈ బహుత్వ సృష్టి స్థితి ప్రలయములను జేయు నీ సర్వేశ్వరీ మూర్తితో, నీవు వారి కాత్మప్రకాశము చేయుదువు. ఇదే నీ సూక్ష్మశరీరము. ఈ మూర్తియందే నీ సంతానము నీ యీశ్వరీమూర్తిని సాక్షాత్కరించుకొని, జీవత్వ క్షుద్రత్వ మోహమునుండి రక్షింపఁబడును. (అవి తొలఁగుననుట.) అప్పుడు నీవు నీ మూడవమూర్తియైన సర్వశక్తిసమన్విత స్వరూపమును దెలియఁజూపుదువు. సర్వవిధములుగాను నే శక్తి ప్రకాశించుచున్నదో, సర్వముయొక్క సృష్టి స్థిత్యాదులు చేయుచు సర్వేశ్వరియై యే శక్తి వెలయుచున్నదో, అవన్నియు నెచ్చోట సమన్వయించునో, ఎచ్చోట శక్తి యనుచు నెట్టి వికాసమును లేకున్నను సర్వశక్తిసమన్వయ స్థాన మేదో, యదే నీ మూడవస్వరూపము. సర్వరూపములతో దేని ప్రతీతి యగుచున్నదో, యది శక్తి తక్క మఱేమియుఁ గాదు. అమ్మాట మే మింతకు మున్నే తెలియఁగల్గితిమి. ఈ సర్వశక్తిసమన్వితస్వరూపమునే నీ 'కారణ' మందురు. అదే బ్రహ్మము, పరమాత్మ, నిరంజనము మున్నగు పేళ్లతో వ్యవహరింపఁబడును. ఈ నీ మూడుస్వరూపములును సత్యములే. శ్రుతి శిరోవాక్యములు, ఈ నీ మూడు స్వరూపముల కథను సమముగానే కీర్తించినవి. భగవద్గీతయు క్షరాక్షర పురుషోత్తమ రూపములుగా నీమూడుస్వరూపముల నుల్లేఖించినది(15-26,27).

ఇట్లుండఁగా, ఆధునిక మాయావాదులు, నీ నిర్గుణస్వరూపమును మాత్రమే సత్యమనుచు స్వీకరించి, తక్క రెండుస్వరూపము లను మిథ్య యందురు. దానిచేతను హాని లేదు. అమ్మా! నీ సత్యమైన నిరంజనస్వరూపమునందు జగత్తనుట కేమియు లేదు, గాన జగదీశ్వరుఁడనుటకు నేమియు లేదు. ఉండఁజాలదు. ఆచార్య భాష్యకారులు, ఈ స్వరూపమును విశేషించి తెలుపుటకే, ప్రాణపణమునఁ దక్క రెండుస్వరూపముల యకించిత్కరత్వమును ప్రతిపాదించిరి. ఉండనీ.

అమ్మా! నీవు మాకుమాత్రము త్రివిధస్వరూపముల తోను సత్యవు. తుల్యరూపమున "భయేభ్యస్త్రాహి నో దేవి" నీవు మమ్మ భయములవలన రక్షింపుము. మా యెల్లర భయములను దొలఁగింపుము. జనన మరణ క్లిష్టులును, అల్పజ్ఞులును, నిరాశ్రయులునైన జీవుల భయము నెడలింప, నీ వొక్కతె వె సమర్థవు. అమ్మా! నీవు దుర్గవు. దుర్గ + ఆ = దుర్గా; దుర్గ పదమునకు – దైత్యుఁడు, మహావిఘ్నము, సంసారబంధము, కుచ్ఛితకర్మము, శోకము, దుఃఖము, నరకము, యమదండము, జన్మము, మహాభయము, రోగము అని యర్థములు. తుది – ఆకారము – హంతృవాచకము, పైని జెప్పిన యన్నిటిని బోఁగొట్టును. గాన "దుర్గా" యైనది. యామలతంత్రమందు, దుర్గా శబ్ద నిర్వచనము – "ద్ + ఉ + ర్ + గ్ + ఆ = దుర్గా" ద్ – దైత్యనాశకము; ఉ – విఘ్ననాశకము; ర్ – రోగనాశకము; గ్ – పాపనాశకము; ఆ – భయరిపునాశకము; ఆ – శక్తివాచకమునుం గాన, దేవీపర్యాయ దుర్గాపదమును స్మరించినను, ఉచ్చరించినను, వినినను, పైని జెప్పిన ఫలములు గలుగునని

పరమేశ్వరుఁడు తన శక్తినిగూర్చి యనిన మాట. మఱియు "దుఃఖేన గమ్యతే ఇతి దుర్గా" అతికష్టముచేఁ దెలియఁబడునది. అమ్మా! నీవు దుర్గవు. దుర్గతిహారిణివి. మా యీ జీవత్వమనెడి దుర్గతిని దొలఁగింపుము. నీకుఁ గోటి ప్రణామములు.

ఓం. ఏతత్తేవదనం సౌమ్యం
లోచనత్రయ భూషితమ్ ।
పాతు నః సర్వభూతేభ్యః (భీతిభ్యః)
కాత్యాయని నమోఽస్తుతే॥ ఓం. 24

అమ్మా! నీవు లోచనత్రయు విభూషితవు. ఈ నీ ముఖ మండలము, సర్వ (భీతుల) భూతములవలన రక్షించుఁగాక.

వ్యాఖ్య:— అమ్మా! త్రిలోక ప్రకాశకములును త్రికాలదర్శులునైన ముక్కనులతో నొప్పుదానవు. కేవలానంద స్వరూపమును, సర్వమనోహరమునైన ముఖమండలము, సర్వ భూతములవలన మమ్ము రక్షించుఁగాక. ఆనందస్వరూపవు నీవొక్కతెవే, యీ స్థూలమందు సర్వరూపములతోను, సూక్ష్మమునందు సర్వేశ్వరీరూపముతోను, కారణమందు సర్వ శక్తిసమన్విత నిరంజనస్వరూపముతోను నిత్యము ప్రకా శింతువు. ఈమాట సాధకుఁడు నీ కృపచేఁ జక్కఁగా ననుభ వింపఁగల్గునప్పుడే, వానికి సర్వభూతభ్రమము తొలఁగిపోవును. సర్వభూతములనెడి యజ్ఞానము తొలఁగిపోవును. సర్వభూతము లనుటకు మఱేమియులేదు. ఆనందరూపిణివి నీవే సర్వభూత రూపముతో నభివ్యక్తమైతివనెడి యనుభవము చేయఁగల్గుట

చేతనే భూతభయము పూర్తిగాఁ దొలఁగును. అమ్మా! యెల్లరను సర్వభూతములవలన రక్షింపుము. ఆనంద వస్తు వొక్కటే సర్వభూతరూపమునఁ బ్రకటితమైనదని, మామర్మ మర్మములందును నాటింపుము. అమ్మా! నీవు కాత్యాయనివి. కత్యులు (బ్రహ్మవేత్తల) కేకాన్తశ్రయణీయవు. కత్యాయన మహర్షికివలెనే మాకును బ్రసన్నవగుము. నీకుఁ బ్రణామము.

ఓం. జ్వాలాకరాళ మత్యుగ్ర మశేషాసురసూదనమ్ ।
త్రిశూలం పాతు నో భీతే ర్భద్రకాళి నమోఽస్తుతే॥ఓం.25

ఓం. హినస్తి దైత్యతేజాంసి స్వనేనాపూర్య యా జగత్ ।
సా ఘంటా పాతు నోదేవి పాపేభ్యోనః సుతానివ॥ఓం.26

ఓం. అసురాసృగ్వసాపంక చర్చిత స్తే కరోజ్జ్వలః ।
శుభాయ ఖడ్గోభవతు చండికే త్వాం నతావయమ్॥ఓం. 27

ఓ భద్రకాళీ! అగ్నిశిఖలచే భీకరమైన, అత్యుగ్రమైన, అసురనాశనకారియైన నీ త్రిశూలము మమ్ము భయములవలన రక్షించుఁగాక. తన ధ్వనిని జగత్తుననించి యసురకుల తేజస్సును నశింపఁజేయు 'అనః' మాతృసదృశమైన నీ ఘంట మమ్ములను బుత్త్రులవలె రక్షించుఁగాక. అసురుల నెత్తురు, వస (మాంస మందలి జిడ్డు – శుద్ధమాంసస్య యః స్నేహః సా వసా పరికీర్తితా) అనువాని పంకముతోఁ బూయఁబడి నీచేత వెలయు ఖడ్గము మంగళములను మాకిచ్చుఁగాక. ఓ చండికా! నీకుఁ బ్రణామము.

ఇమ్మూడు మంత్రములందును త్రిశూల ఘంటాధ్వని ఖడ్గములనెడి ముత్తెఱఁగుల యస్త్రములవలన భయత్రాణమును

మంగళమును ప్రార్థింపఁబడినవి. త్రిపుటీజ్ఞానము, అనాహత నాదము, అనాత్మబోధకనాశప్రజ్ఞ, యను నిమ్మూఁడును విశే షించి యసురభావ వినాశకములు. దీనితో దేవతాగణము మంగళప్రార్థనమును జేసినది.

వ్యాఖ్య:— అమ్మా ! నీవు స్వయముగా మా రక్ష చేయుచున్నావు. నీ యస్త్రశస్త్రసమూహము సైతము మమ్ము లను బిడ్డలనువలె రక్షించుఁగాక. అవియే యింతకు మున్ను అసురభావములను నశింపఁజేసి జీవత్వ మహాబంధనమువలన మమ్ములను విడిపించినవి. అవియే సమస్త ప్రారబ్ధక్షయ పర్యంతము నిట్టులే యసురాత్యాచారముల వలన మమ్ము రక్షించుఁగాక. అమ్మా ! నీవు చండికామూర్తితోఁ బ్రకటిత వగునపుడే యస్త్రశస్త్రములును నీ విభిన్నశక్తులును మమ్ము లను రక్షింపను, అసురకులమును నశింపఁజేయను, నుద్య మించును. కనుకనే నీ చండికామూర్తిని లక్షించి మఱిమఱి "చండికే త్వాం నతా వయమ్" అని ప్రణతుల మగుచున్నాము.

సాధకా ! ఈవిధముగా నస్త్రశస్త్రములను బ్రార్థించుట యస్వాభావికము కాదుసుమా. వైదికయుగమందలి సత్య దర్శులయు సరళప్రాణులైన ఋషులయు హృదయముల నిట్టి పవిత్రభావము తనంతనే పుట్టెడిది. దీనిచే వారు సంకీర్ణహృద యులు, బద్ధజీవులు, నని తలఁపరాదు. ఇక్కాలమున నిష్కామ శబ్దముయొక్క స్వరమొకటి లేచినది. అది తామసిక ప్రకృతి గల జీవుల సోమరితనమునే సూచించును. నిష్కామమన నేమియో యథార్థానుభవము చేసికొనఁగలవారలే, సరళ బుద్ధితోఁ బ్రార్థనము చేయఁగలరు. అజ్ఞుని సకామవ్యక్తిప్రార్థ

నము కాఁజాలదు. ప్రార్థనమువల్లనే యీ జగము సృష్టింపఁబడినది. ప్రార్థనమునందే యీ జగము నిల్చియున్నది. ప్రార్థనమువల్లనే యీ జగము మఱల నానందమయసత్తయందుఁ జేరిపోవుచున్నది. సృష్టిస్థితిప్రలయములు, జీవజగత్తులు, బంధనముక్తులు సమస్తమును ప్రార్థనామూలకములే. ప్రార్థనము భిక్షకాదు. ప్రకృష్టమైన యర్థనము=కోరిక, కల్గునపుడే కామనలన్నియు సిద్ధించును. ఈశ్వరసత్తయందుఁ గేవలశ్రద్ధగలిగి, ఈశ్వరుని శక్తిమత్తయందుఁ జెదరని నమ్మకము కలవారలే ప్రార్థనము చేయఁగలరు. సరిగాఁ బ్రార్థింపఁగల్గుటచే దాని సఫలత తప్పకగును. ప్రార్థనముచే సాధన కింతయు దెబ్బరాదు. ప్రార్థనమే యథార్థసాధనము.

ఓం. రోగా నశేషా నపహంసి తుష్టా
రుష్టాతు కామా నఖిలా నభీష్టాన్ ।
త్వా మాశ్రితానాం న విపన్నరాణాం
త్వా మాశ్రితా హ్యాశ్రయతాం ప్రయాన్తి॥ ఓం. 28

అమ్మా! నీవు సంతోషించి యశేషరోగములను వొలంతువు. నీవు రోషించితేని సర్వాభీష్టములు చెడును. నిన్నాశ్రయించినవారికెట్టి యాపదయు నుండదు. నిజముగా నిన్నాశ్రయించినవారల నితరు లాశ్రయింతురు.

వ్యాఖ్య:—అమ్మా! నీ తుష్టియు రుష్టియు రెండును మాకు శుభకరములే. నిత్యతుష్టవైన నీ సంతోషమును మే మనుభవింపఁగల్గునపుడు, అనఁగా అమ్మవు నిత్యప్రసన్నవు

నైన నీప్రసన్నత మాకుఁ బ్రతీతిగోచరమైనపుడే, మాసర్వరోగ విముక్తియగును. స్థూలదేహమునుబట్టి రోగములు మూఁడు విధములు.

1. ఆధ్యాత్మికములు — వాత పిత్త శ్లేష్మాదులవలన నగునవి.
2. ఆధిదైవికములు — శీతోష్ణ వాత వర్షాదులవల్ల నగునవి.
3. ఆధిభౌతికములు — వ్యాఘ్ర తస్కరాదులు, దంశ మశకాదులు కారణముగా నగునవి.

సూక్ష్మదేహమున కగు రోగములు మానసికములు. ఇష్టవియోగము, అనిష్టప్రాప్తివలన నగునవి.

కారణదేహ రోగములు - అజ్ఞానము, ఆత్మవిస్మృతి రూపమైనవి.

ఈ మూఁడువిధములైన రోగములను లక్షించియే దేవతలు "రోగానశేషాన్" అనిరి.

అమ్మా! నీ ప్రసన్నతానుభవముతోనే యీ రోగము లెల్ల నశించును. నీ తుష్టిమూర్తిని బ్రత్యక్షము చేసికొనుటచే నగు ఫలమిది. అమ్మా! ఇమ్మాటలయందు నమ్మకము లేనివారికి, నీ నోరితోనే "నాయనా! ఇవి యర్థవాదములు కావు. యథార్థముగానే సర్వరోగములు తొలఁగును" అని చెప్పివేయుము. నిక్కముగా మనుష్యుఁడు భగవత్సత్ప్రసన్నతలను లక్షింపఁగల్గునపుడే తనకు సర్వవిషయములందును శుభాభ్యుదయములగునని తెలిసికొనవలయును.

అమ్మా! నీవు రోషించితే సకలకామనలు సర్వాభీష్టములు చెడిపోవును. మంత్రమందు 'కామ-అభీష్ట' శబ్దములు

సమానార్థకములుగాఁ గానవచ్చునుగాని, ఇపుడు (వర్తమానమున) కామింపఁబడునది - కామమనియు, మున్ముందు (భవిష్యత్తున) ఇచ్ఛింపఁబడునది అభీష్టమనియు నెఱుంగునది.

అమ్మా! మనుష్యుఁడు నీ ప్రసన్నతను లక్షించునపుడే; నీ రోషరక్తనయనములను జూచి వెఱచునపుడే వాని సర్వకామ్యములు, అభీష్టములు చెడును. స్థూలదృష్టిచేత నీ యీ రోషలక్షణ మవశ్యభీకరమైనను, రవ్వంత ధీరముగాఁ జూచినచో, మాకుఁ జక్కఁగాఁ దోఁచినదేమన-నీవు రోషించి మా కామ్యాభీష్టములను నష్టపఱచునపుడే, మేము యథార్థమంగళమార్గమందు ముందంజవేయుదుమని. అనేక విధములయిన కామనలు, సంకటములు ననెడి రోగములవలన మమ్ము విడిపించుటకే నీకుఁ జండికామూర్తితో వెలయ పనిపడుచున్నది. అమ్మా! మా కామ్యాభీష్టములను జెఱపకున్నచో, మే మెన్నఁటికి నీ జీవత్వాంధకారమునఁ బడియే యుందుము. రుష్టమూర్తితో నీవు మా సంకీర్ణహృదయములయందలి కామనలను దొలఁగింపకున్నచో మాకు నీ హిరణ్మయమందిర సంధానము కాదు-కన్కనే అమ్మా! నీ తోషరోషములు రెండును మాయెడ నిత్యమంగళదాయకములే, యనుచున్నాము.

మఱియు "త్వామాశ్రితానాం న విపన్నరాణామ్" నిన్నాశ్రయింపఁగల్గినచో, నీకు శరణాగతుఁడైనచో, జీవుని కెట్టి విపత్తియురాదు. నీ తుష్టిచే నభీష్టలాభము, నీ రుష్టిచే నభీష్టనాశము, ననెడి రెండింటను శుభమే. అమ్మా! నీవీ రెండువిధములుగాను వెలసియే, యింత వైచిత్ర్యము నింత మాధుర్యమును జూపుదువు. నిన్నాశ్రయించినవారి కెట్టి యాప

యము నుండదు, సరిగదా, విశేషించి వా రితరుల కాశ్రయ మీయఁగలవార లగుదురు. అనేకజీవులు వారి నాశ్రయించి తమ యభీష్టములను నెఱవేర్చికొందురు. ఇదే నీ విశేషత. (ఈ మంత్రమందలి 'నరాణాం' అనుమాట నరనారీబోధకము, ఏకశేషద్వంద్వము.)

ఓం. ఏతత్కృతం యత్కదనం త్వయాద్య
ధర్మద్విషాం దేవి మహాసురాణామ్ ।
రూపై రనేకై ర్బహుధాత్మమూర్తిం
కృత్వాంబికే తత్ప్రకరోతి కాన్యా॥ ఓం. 29

ఓ దేవీ! నీవు నీ యనేకమూర్తులతో వెలసి ధర్మద్వేషులైన మహాసురులను యుద్ధమందు నశింపఁజేయుట నెడి యిప్పని, నీవుగాక యింకెవరు చేయఁగలరమ్మా!

వ్యాఖ్య:— అమ్మా! ఏకవు, అద్వితీయవు, విశుద్ధబోధస్వరూపవు నయ్యు, ననేకరూపములతో నిన్ను వెలయించుకొని - బ్రాహ్మీ మాహేశ్వరీ వైష్ణవీ కౌమారీత్యాద్యనేక శక్తిరూపములతో వెలసి, ధర్మవిరోధులైన యసురభావములతోఁ బోరితివి. ఇట్టి నీ మహిమము నొప్పుకొనక, కేవలము నీ నిరంజన స్వరూపమును మాత్రమే యంగీకరించి బహుధా ప్రకటితములైన నీ మూర్తులను మిథ్యలని యెగురఁగొట్టఁజూతురు. కాని, యెంతదాఁక జగత్ప్రతీతి యుండునో, యంతదాఁక నీ బహురూపముల నెగురఁగొట్టుట కుపాయములేదని వారెఱుఁగరు. "రూపం రూపం ప్రతిరూపో బభూవ" యనుచు నుపనిషత్తే నీ సర్వరూప బహురూపముల నొప్పుకొన్నది. తమ బుద్ధి

కొలఁతతో నీ మహిమ పరిమాణము నెఱుంగఁగోరినచో, నీ యేకత్వ బహుత్వ సమన్వయము నెన్నఁడును జేయఁజాలరు. నీవొక్కతెవేయయ్యు ననేకరూపములతో విరాజిల్లుదువు. "కాన్యా - అన్యాకా" నిన్నువిడిచిన మఱెవ్వరున్నారు? నీవు గాక మఱెవ్వరున్నారు? లేరు, ఉండఁజాలరు. "ఏకమేవా ద్వితీయమ్" ఇది సత్యమే; ఈ యద్వితీయ వస్తువుతక్క, ఆగంతుక నూతనవస్తువొకటి వచ్చి, ఆత్మమూర్తిని బహుధా ప్రకటించుకొనఁజాలదు. ఒక్కరూపముతోనే నీవుండి, బహు రూపములతో సైత మీవేయుందువు. విశేషమేమనఁగా బహు రూపములతో వెలయుచున్నను, నీ యేకత్వ మఖండముగానే యుండును. కుండ, కూజా, మూకుడు, మూస, మున్నగు వేర్వేఱు రూపములతో వేర్వేఱు నామములతోఁ బరిచిత మయ్యును మృత్తికాత్వము సర్వత్ర యఖండముగానే యుండును. మన బుద్ధి హీనమగుటచేత, నేకత్వబహుత్వముల సమన్వయము మీమాంసితము కాదు. కాఁజాలదు. కాని, ఏకవయ్యును నీ వనేకవు. మఱి బహు–అనేకవయ్యును నీ వేకవు. "ఏకో బహుధా ప్రకరోతి రూపమ్" ఒక సాధారణయోగిపురుషుఁడు, స్వేచ్ఛతోఁ దన్ను విభాగించుకొనియు – అనేక రూపములతో – ననేకావస్థలతో నేక కాలమందే కనఁబడుచుండియుఁ దన యేకత్వము నఖండముగానే యుంచికొనఁగల్గుచున్నాఁడు. (ఈనాఁడు నట్టి మహాత్ముల నెందఱినో చూచుచున్నాము.) మఱి జగదీశ్వరివి నీవు. సగుణరూపముతోఁ బ్రకటితవయ్యును, నీ నిర్గుణత్వము నఖండముగానే యుంచికొనఁగల్గుదువనిన, నందు వింతయేమున్నది? యోగేశ్వరేశ్వరివి. కనుకనే దేవతలు

"అనేకరూపై రాత్మమూర్తిం బహుధా కృత్వా" యనిరి. ఒకటయిన యాత్మమూర్తివి నీవే, యనేకముగాఁ బ్రకటిత వగుదువు. ఆత్మరూపమున నీ వేకవు, అద్వితీయవు. ఈశ్వరరూపమున స్వగతభేదమయివై బహురూపవు. నీవు ధర్మద్వేషులయిన మహాసురులతోఁ బోరి వారినిజంపి మమ్ముఁ గాచితివి. అమ్మా! నీ చరణములకుఁ గోటి ప్రణామములు.

> ఓం. విద్యాసు శాస్త్రేషు వివేకదీపే
> ష్వాద్యేషు వాక్యేషు చ కా త్వదన్యా ।
> మమత్వగర్తేఽతి మహాంధకారే
> విభ్రామయత్యేత దతీవ విశ్వమ్॥ ఓం. 30

అమ్మా! ఒకవైపు – విద్యలందు, శాస్త్రములందు, వివేకదీపములైన యాద్యవాక్యములందును; ఇఁక రెండవవైపు – అంధకారమయమైన మమత్వమనెడి సుడిగుండమునందును, ఈవిశ్వమును మఱల మఱల ద్రిప్పుచున్నవారు నీవుగాక మఱెవ్వరు? (అందులకు నీవొక్కతెవే సమర్థవు.)

వ్యాఖ్య:— ఈ విశ్వమును విద్యా – అవిద్యారూపములయిన, ఊర్ధ్వాధోభావములతో నీవే పరిభ్రమింపఁజేయుచున్నావు. ఒకవైపు విద్య=బ్రహ్మవిద్య, తత్సారభూతములైన వేదములు, ఉపనిషత్తులు. రెండవవైపు అవిద్య=మమత్వమనెడి మోహాంధకారగర్తము. అనఁగా – పూర్ణాజ్ఞానము; అను నీ రెండు పక్షములుగాను, "కా త్వదన్యా" నీవుగాక మఱెవ్వరున్నారు? అమ్మా! నీవే అనాత్మపదార్థములకు ద్రష్టవై, వానియందు మమత్వబుద్ధిని నెలకొల్పి, ఆత్మజ్ఞాన హీనమును,

అంధకారమయమునైన సుడియందు, అనేక జన్మాంతరముల నుండి భ్రమణము చేయుచున్నావు. మఱి నీవే ఆత్మ-స్వప్రకాశ రూపవై నిన్ను నీ వెఱుంగుటకుఁగా, ననేక శాస్త్రపాఠములు, వేదాధ్యయనము, మఱి వివేకఖ్యాతికై యనేకములైన యుపాయముల నిర్ధారణమును జేసి పరిభ్రమించుచున్నావు. అమ్మా! ఒకవంక - ఆత్మను విస్మరించిన యజ్ఞానశిశువవుగాను, మఱి యొకవంక - నిన్ను వెదకికొనుటకుఁగాను అనేకాధ్యవసాయములు చేయు పురుషుఁడవుగాను నీవే కనవచ్చుచున్నావు.

అమ్మా! నీవు సర్వప్రకాశరూపిణివైన చిన్మయివి. నీకు రవ్వంతయైన నావరణములేదు. నీవు విద్యావిద్యలకు రెండిఁటికి నీశ్వరివి. విద్యావిద్యలు రెండును వేఱుకావు. వాఙ్మనసుల కగోచరవయ్యును, విద్యావిద్యల రెండిఁటిచే వేర్వేఱుగా నీ విశ్వమును బరిభ్రమింపఁజేయుచున్నావు. ఒకవైపు ఈశ్వర రూపముతో సర్వభూతముల హృదయములందు నధిష్ఠించి యుండి, మాయావశములైన సర్వభూతములను బరిభ్రమింపఁ జేయుచున్నావు. రెండవవైపు జీవరూపమున, అజ్ఞానివలె ఆ భ్రమణయంత్రమునందు నీవే నలిగిపోయి, హాహాకారము లొనర్చుచున్నావు. ఒకవంక నుజ్జ్వలప్రకాశ వివేకదీపమవు. రెండవవంక మహాంధకార మమత్వగర్తమవు. రెండుదిక్కులును నీవు లేకున్నఁ బరిస్ఫుటములే - కాని నీవుగాక మఱి యొండు లేనేలేదు. "కా త్వదన్యా" ఎచ్చటను నీ లేమియేలేదు. తల్లి! నీ యీ యానందలీల చిత్రము! ధన్యము!

అమ్మా! 'విభ్రామయతీ' యను మాటవలన, మేము నీ యెడ నొక విచిత్ర రహస్యమును గనుగొందుము. నీవు

స్వయం విభ్రాన్తవు. నీ స్వరూపమును మఱచి యీ రూపముతో నిన్ను వెలయించుకొని, మఱల నారూపమునే విభ్రాన్తము చేయుచున్నావు. మఱపించుచున్నావు. నిన్ను నీవే మఱచి యజ్ఞానాంధకారమునందుఁ బడుచున్నావు. లేదా, వివేకదీపమును వెల్గించి నిన్ను నీవే వెదకికొని వెలిఁబెట్టఁ బ్రయత్నించుచున్నావు. నిత్యజ్ఞానమయివైన నీ యీ లీల బహు విచిత్రము.

ఓం. రక్షాంసి యత్రోగ్రవిషాశ్చ నాగా
యత్రారయో దస్యుబలాని యత్ర ।
దావానలో యత్ర తథాబ్ధిమధ్యే
తత్ర స్థితా త్వం పరిపాసి విశ్వమ్॥ ఓం. 31

అమ్మా! రాక్షసులుండుచోట, ఉగ్రవిషసర్పములుండుచోట, దొంగలగుంపు లుండుచోట, అడవియందుఁ గారుచిచ్చుండుచోట, బడబానలపూర్ణమైన సంద్రము నడుమను, నీవే యుండి విశ్వమును రక్షింతువు.

వ్యాఖ్య:—నీవీ విశ్వమును మునుజెప్పినట్లు విభ్రాన్తము చేయుచున్నావు. అంతేకాదు. అంతటను నీవే యడ్డులేక యథాయోగ్యముగా విశ్వరక్షణము చేయుచున్నావు.

అమ్మా! విషయప్రలోభనమును, ఉగ్రవిషసర్పముల నెడి ద్వేష హింసాదులును, అరిబలమ నెడి కామ క్రోధాదులును, దొంగల నెడి దర్పదంభాభిమానములును, దావాగ్ని యనెడి శోక దుఃఖాదులును, దుస్తరసముద్రమ నెడి సంసారమును, అను వీని

వలన విశ్వమును రక్షించువారు నీవుగాక మఱెవ్వరును లేరు. అజ్ఞానమువలని పూర్ణావరణ ముండుచోట, ఆత్మాస్తిత్వము పూర్ణముగా నష్టమగుననెడి బెదరుగలచోట, నెన్నఁడుం దప్పని మృత్యుకరాళకృష్ణచ్ఛాయ క్రమ్ముచోట, అమ్మా! నీవు పరిపాలినీమూర్తితో స్నేహమయమాతృమూర్తితో నీ నెయ్యపు బిడ్డలైన జీవులను రక్షింతువు. విశ్వరక్ష యొనర్తువు. మఱియు స్థూలజగత్తునను మునుజెప్పిన రాక్షస శత్రు సర్ప దస్యు దవానల బడబానల పూర్ణదుస్తర సముద్రాదులందు, ఘోరాపదలయందుఁబడిన నీ నెయ్యపుసంతును నీ వెంతటి దివ్యభావముతో, వింతగొల్పు నుపాయముతో రక్షించుచున్నావో, యది చూచియు మూఢులమైయున్న మేము నిన్నెఱుంగఁగోరకున్నాము; ఎఱింగినను నీ సత్త్వప్రకాశముఁ గోరము; గ్రహింపము. గ్రహించినను బూర్ణవిశ్వాసము నిల్పలేకున్నాము. "సత్యముగా నీవున్నావు. సత్యముగా జీవులను నీవు రక్షించుచున్నా"వని నిస్సంశయముగా నంగీకరింపకున్నాము. మే మంగీకరింపకున్నను మమ్మెల్ల నీవు రక్షించుచున్నావు. ఇందు సందియము లేదమ్మా!

పక్షాంతరమున — మునుజెప్పిన యాపదలందుఁబడియు మా దృష్టిచే రక్షితులము కాకుండలేదు. అవియు నీ స్నేహమయాంకమునఁ జిరమునుండియు రక్షితములే. దీనియందును నెట్టి విచారము సంశయము నక్కఱలేదు. ఏమన, "తత్ర స్థితా త్వమ్" నీ వచ్చట నున్నావు. ఈ విపత్సంకులస్థానమందు, అవినాశస్థానమందు, కాలమందును నీ వొక్కతెవే యున్నావు. కనుక నే జీవులనెడి స్నేహసంతానము విపత్తులయందుఁబడి సాధారణ

దృష్టితో వినష్టమైనదన్నను, హాని యింతయు లేదు. నీ శాన్తి మయాంకమందే చోటు దొరకును. అమ్మా! నీ వంతట నున్నావు. సర్వమును రక్షించు జననివి. కనుక రక్షా వినాశ ములు రెండు నున్న స్థలములందును, "విశ్వం పరిపాసి" ఇది ధ్రువసత్యము. నిన్ని విశ్వరక్షాకరమూర్తితో సర్వత్ర యున్న దానినిగాఁ జూడఁగల్గువారలే, మఱెట్టి వినాశమును విపత్తును బొందరు.

"తత్ర స్థితా త్వం పరిపాసి" యను మాటయందు గొంత సాధనరహస్యమున్నది. శ్రద్ధమై వినునది. హిరణ్యకశిపునియాన చే సలసల మరుగునీటిలో వేయఁబడిన ప్రహ్లాదుఁడు, "అనలవిహారీ, హృదయవిహారీ" యన్నగు నామములతో బిగ్గఁబిలువక, వైకుంఠ నాథాది నామములతో భగవంతు నుద్దేశించి యఱచెను. మఱియు, కురుసభయందు దుశ్శాసనునిచే వస్త్రహరణమగు వేళ ద్రౌపది, ప్రాణనాథాది శబ్దముల నుపయోగించి మొఱపెట్టక ద్వారకానాథాది నామములతో భగవంతుని బిల్చినది. ఉభ యత్ర భగవంతునిరాకకుఁ గొంత తడవైనది. ఏమన - ప్రహ్లాద ద్రౌపదులు "తత్ర స్థితా త్వం పరిపాసి" యను కథారహస్యము నా సమయమందు మఱచిరి. భగవంతుఁడు సర్వత్ర విరాజిల్లు చున్నాఁడు. అగ్నిరూపమున నాతఁడే, వస్త్రరూపమున నాతఁడే, సర్వజీవుల హృదయమందును ప్రాణపతిరూపమున నాతఁడే విరాజిల్లుచున్నాఁడు. కనుక జీవుఁ డెచ్చట నెట్టి గొడవలోనే పడనీ, అచ్చటనే యా విపద్రూపముగా సైతము అమ్మయే సిద్ధముగానుండుననెడి దృఢవిశ్వాసముంచి యమ్మను స్మరింపఁ గల్గినచో, జీవుఁడు వెంటనే గొడవవలనఁ బరిత్రాణము నొందఁ

గలఁడు. అమ్మ సర్వదా సర్వత్ర సన్నిహితయై యుండుననెడి దృఢవిశ్వాసము నెలకొన్నచో, మఱెట్టి యాపదవల్లను విచలితుఁడు కాఁ బనిలేదు.

ఓం. విశ్వేశ్వరీ త్వం పరిపాసి విశ్వం
విశ్వాత్మికా ధారయసీతి నిత్యమ్ ।
విశ్వేశవంద్యా భవతీ భవన్తి
విశ్వాశ్రయా యే త్వయి భక్తినమ్రాః॥ ఓం. 32

అమ్మా! నీవు విశ్వేశ్వరివి గాన విశ్వమును రక్షింతువు. విశ్వమే నీ శరీరము గాన, నీవు విశ్వమును ధరించుచున్నావు. నీవు విశ్వేశులకును వందనీయవు. నీకు భక్తితో నమ్రులగువారు సైతము విశ్వమున కాశ్రయస్వరూపు లగుదురు.

వ్యాఖ్య:—అమ్మా! నీవు మునుజెప్పిన రాక్షసాదులనెడి వృత్తులనుండియు జీవుల సలౌకికోపాయములచే రక్షింతువనుటయం దింతయు వింతలేదు. అమ్మా! నీవు విశ్వేశ్వరివి - ఈవిశ్వమున కధిపతివి. దేనికే నధిపతులైనవారు దానిని రక్షింత్రుకదా. అపుడు దేవతాగణము ''విశ్వేశ్వరీ త్వం పరిపాసి విశ్వమ్'' అని యేల యన్నది? విశ్వేశ్వరిగా నిన్ను నెఱుంగువారలే, యీ విశ్వమును నీ వొక్కతెవే రక్షింతువని తెలిసికొనఁగలరు. మఱియు నీ విశ్వము న్నీయందే ధరించియుంచితివి. ఇందును వింతలేదు. ఏమన - నీవు విశ్వాత్మికవు. 'ఏకోఽహం బహు స్యామ్' అని నీవే బహురూపములతోఁ బ్రకాశించుచున్నావు. ఈ విశ్వమే నీ శరీరము, కనుక దీనిని ధరించి యుంచుటయు నీ స్వభావమే.

ప్రసంగవశమున నీ విశిష్టాద్వైతవాద సంబన్ధమున రెండు మాటలు చెప్పుట కేవల మన్యాయముకాదు. ఆ మతము నను సరించువారు, ఈ విశ్వమే భగవంతుని శరీరము. మన యీ స్థూలశరీరము — ఈ మనసు, బుద్ధి, ఆత్మ యనువాని సమష్టి యైనట్లే యీ వ్యక్తవిశ్వము విరాణ్మనస్సు, సమష్టిబుద్ధి యను వానితోఁగూడిన పరమాత్మయొక్కటే, యుపాస్యము లభ్యము నందురు. సాధనజగత్తునం దీ మతము విశేషాదరణీయము, పరిగ్రాహ్యము నైనదే. ఇది యుపనిషద్విరుద్ధమునుగాదు. ఉపనిషత్తులును బలుచోట్ల నీ విశ్వమును బరమాత్మయొక్క స్థూల శరీరమన్నవి; గాని యీ మతమందలి యొకమాట విశేషించి విచారింపఁదగినది. విశిష్టాద్వైతవాదులు ఈ పరిదృశ్యమాన (కానవచ్చు) జడాంశమును, ఒక్కదెబ్బతో అచిత్తత్త్వమనిరి. అచిచ్ఛబ్దార్థము జడమేయన్నచో, నిది శ్రుతివిరుద్ధము. ఏమంటే శ్రుతి, యీ జడాంశమునుగూడ బ్రహ్మస్వరూపముగానే కీర్తించినది. అచిచ్ఛబ్దముచే చిత్ యొక్క స్వల్పప్రకాశమని యర్థ స్వీకారముచేసి, ఈషదర్థమందు నఞ్ సమాసము చేసినచో నెట్టి సంశయమునకును దావుండదు.

అది యుండనిండు — అమ్మా! నీవు విశ్వేశగణము, విశ్వాధిపతిగణము, ఈశ్వరగణము అనఁగా బ్రహ్మాదిదేవతా బృందము సదా నీకు వందనమాచరించును. దేవతలు సర్వతో భావముతో నీకు శరణాగతులే. అట్లగుటచేతనే వారు విశ్వాధిపత్యము నొందిరి. గాన "త్వయి భక్తినమ్రాః" నీకు భక్తితో నతులగువారే, నిక్కముగా విశ్వమున కాశ్రయస్వరూపు లగు

దురు. విశ్వమండలి జనులు వారి యాశ్రయమునొంది జ్ఞాన భక్తులను శాంతిని బొందఁ బ్రయత్నింతురు.

ఓం. దేవి ప్రసీద పరిపాలయ నోఽరి భీతే
ర్నిత్యం యథాసురవధా దధునైవ సద్యః।
పాపాని సర్వజగతాం చ శమం నయాశు
ఉత్పాతపాక జనితాంశ్చ మహోపసర్గాన్॥ఓం 33

ఓ దేవీ! నీవు ప్రసన్నవగుము. ఇప్పుడసురులను వధించి మమ్ములను శత్రుభయమువలన సద్యోవిముక్తులను జేసినటులే, నిత్యమును మా శత్రుభయమును బోఁగొట్టి కాపాడుము. మఱియు నీ సర్వజగత్తుల పాపములను, ఉత్పాత పరిణామరూపమైన యుపసర్గములను శాన్తింపఁజేయుము.

వ్యాఖ్య:— అమ్మా! నీవు ప్రసన్నవగుము. నీవు నిత్యమును మాయెడలఁ బ్రసన్నవే యని సర్వవిధముల మా కెఱిఁగింపుము. మఱియు "అధునైవ" ఇప్పుడే యసురులను జంపి మమ్ము భయవిముక్తులను జేసినట్లే నిత్యము పిలిచినప్పుడెల్ల నీవు, మా యొక్క బహు "నేను" లనెడి యజ్ఞానముచేతనైన మా శత్రుభయమును అనఁగాఁ గామాది రిపుల చేతనైన ముసుఁగును దొలఁగించి పాలింపుము.

అమ్మా! ఒక్కసారి చూడుము. నీ నెయ్యపు సంతు కామాది శత్రువుల యుత్పీడనముచే నలిగిపోవుచున్నది. అదె వినుమమ్మా! శత్రువుల యత్యాచారముచే నుత్పీడనమునొంది యుపద్రవము నొంది యెంత ఘోషపెట్టుచున్నదో!

IV - 20.

కొందఱు నిన్నుఁ గఠిన పాషాణముగా నెంచి తిరస్కరించు చున్నారు. కొందఱు శత్రుభయమువలనఁ బరిత్రాణ మొందుటకై కఠోరనియమములను, బలువిధములైన యోగకౌశలాది సాధనములను జేయుచున్నారు. శత్రుభయభీతమైన యీ నీ సంతానమును రక్షింపుము. నీవు వారితో "మామేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే" నాకు శరణాగతులగుట చేతనే మీ శత్రుభయము నశించునని చెప్పివేయుము. అంతే కాదు. "పాపాని సర్వజగతాం చ శమం నయాశు" సర్వ జగత్తుల పాపముల నెడి సంస్కారములనైతను వడిగా శాంతింపఁ జేయుము. జీవునకుఁ బాపబోధ మెందుకగును? "నేను కర్త" ననుకొనుచునే కర్మము లాచరించును గానఁ, గర్మఫలమనెడి పాపము నేనుతోఁ గూడియుండును. సాధారణభాషలో దేనిని బుణ్యమందురో, అదియుఁ బాపమం దిమిడియున్నదే.

అమ్మా! జీవుఁడు నీకు శరణుజొచ్చినచోఁ గొలఁది నాళ్ళలోనే వాని కర్తృత్వజ్ఞానము (నేనే కర్తనను తెల్వి) అంతరించిపోవును, గానఁ బాపము – కర్మఫలము మఱేమియు మిగులదు. కనుక, అమ్మా! యని నినుఁబిల్చు ముద్దుబిడ్డలకు, "నాయనలారా! 'అహం' అనునదే పాపముచుఁడీ! అహం బోధమును విడువుఁడు. మీరు 'నేను' అనుచున్నది 'నేను' మీ యమ్మను. నన్ను విడిచి మఱల మీరు 'నేను' కాఁబోకుఁడు. నాయెడ లక్ష్యముంచి నాకే శరణాగతుల రగుఁడు. అపుడు చూడుఁడు. కొలఁదినాళ్ళలోనే మీ సర్వపాపములును దొలఁగును" అని నీవే చెప్పివేయుమమ్మా!

"ఉత్పాతపాక జనితాంశ్చ మహోపసర్గాన్-" ఉత్పాతములు - ఉల్కాపాతము, ధూమకేతూదయము, సూర్య పరివేషము - (సూర్యుని చుట్టు నల్లనిమండలము) మున్నగు నీ యుత్పాతముల పాకము - ఫలపరిణామము - దానివలన నగు నుపసర్గములు - దుర్భిక్షము, మహామారి, అకాలమృత్యువు, నీటివెల్లువలు, పిడుగుపాట్లు, తుపానులు మున్నగునవి జీవుల పాపములకుఁ బ్రత్యక్షఫలములు. అహంబోధముతోఁ బనులు చేయునపుడు బహిర్ముఖమైన జీవబృందము వివిధములైన యిట్టి యుపసర్గములందుఁ బడును. అమ్మా! జగత్తునందీ పాపమును దొలఁగింపుము. ఉపసర్గములను శాంతింపఁజేయుము. ఆనందమయివైన నీ సంతానము మఱల నానందము నొంది, యమరత్వసంధానము నొంది, విషమోపసర్గముల బారినుండి తప్పి పరిత్రాణ మొందునుగాక.

ఓం. ప్రణతానాం ప్రసీద త్వం దేవి విశ్వార్తిహారిణి।
త్రైలోక్యవాసినా మీడ్యే లోకానాం వరదా భవ॥ఓం. 34

ఓ దేవీ! విశ్వార్తిహారిణి! నీకుఁ బ్రణతులైనవారి యెడఁ బ్రసన్నవగుము. ముల్లోకములం దెల్లరచేఁ గొనియాడఁ బడఁదగిన తల్లీ! ప్రసన్నవగుము.

వ్యాఖ్య:— అమ్మా! నీవు స్వయంప్రకాశరూపిణివి. నీవు విశ్వముయొక్క సకలదుఃఖములను హరించుదానవు. నీ పాలనమువల్లనే జీవుల సర్వదుఃఖములు తొలఁగును. ప్రణతుల యెడఁ బ్రసన్నవగుట నీ స్వభావము. యథార్థముగా నీకుఁ బ్రణతులైనవారే, నీ నిత్యప్రసన్నమూర్తిని దర్శింపఁగలరు.

అమ్మా ! నేఁడు మేము నీ చరణములకుఁ బ్రణతులమైతిమి. అహంత యనెడి మా నిక్కినతల నేఁడు నీ యడుగుల వ్రాలినది. నీవే వ్రాల్చితివి. కనుక నిపుడు "ప్రసీద" ప్రసన్నవు కాకతప్పదు. అగుదువు. అమ్మా! ముల్లోకములందలివారు సుర నర గంధర్వాదులు, ఎవరి కెంత సాధ్యమో, యంతగాఁ దమ వాణిని విశుద్ధ మొనర్చుటకుఁ, దాము విశుద్ధులగుటకు నీ గుణగానము చేయుదురు. కనుక నీవు ముల్లోకములకును స్తుత్యవు. నీ వెల్లరకును వరదానము చేయుము. నీవు లోకములకు వరదవు. గాన, నీ వరదాయినీమూర్తితో నిలువుము. ఇపుడు నీ సంతానము నిర్భయముగా, నిష్కపటముగా నీ యిచ్చు వరముల నందుకొని ధన్యము కాఁగలదు. లోకము మఱల నీ సత్యప్రకాశముచే నుద్భాసితమగును.

ఓం. దేవ్యువాచ ఓం.

ఓం.వరదాహం సురగణా వరం యం మనసేచ్ఛథ ।
తం వృణుధ్వం ప్రయచ్ఛామి జగతా ముపకారకమ్॥ ఓం౩౫

దేవి పలికెను:- ఓ దేవతలు ! నేను వరదాయినిని. జగదుపకారకమైన వరమేదియైననుఁ గోరుకొనుఁ డది యిచ్చెదను. వేలుపులు చేసిన స్తోత్రపాఠఫలముగా మన యమ్మ మిగులఁ బ్రసన్నయైనది. వరదాయినీమూర్తితో నావిర్భవించి జగన్మంగళవిధాయకమగు వరమిచ్చుటకుఁ బూనుకొన్నది.

వ్యాఖ్య:— సాధకా ! నిజముగా నటులే యైనది. అగుచుండును. ఇపుడు, విశ్వాసములేని యీ జగమందు సైతము, ఈ విధముగా సత్యముగా వచ్చి జగన్మంగళమును సాధించును.

ఏమన - సంతానము జగదాత్మీయం దేకీభూతమైనపుడు, జగన్మంగళసాధనమే మన యమ్మ ముఖ్యలక్షణమగును. వ్యక్తిగతమైన సంకీర్ణస్వార్థమందు లక్ష్యముండదు, గాన నిష్కామసాధక సాధన ఫలముగానే జగన్మంగళము సాధితమగును.

ఇట్టి నిష్కామకర్మల కర్మవిభాగసంబంధమున శాస్త్రకారులన్నది వ్రాయుట యప్రాసంగికముకాదు. "ఆత్మజ్ఞపురుషుల కాప్తసుహృత్తులయినవారికి, వారి సుకృతమందు వంతు గలదు. వారిని ద్వేషించువారు వారి దుష్కృతములను గొందురు" అని శ్రుతి. ఇది పుత్రాదులైన యుత్తమాధికారులకు ధనవిత్తాదులు సంక్రమించునటులే యగును. రుక్మాంగదుఁడు చేసిన నిష్కామైకాదశీవ్రతఫలముగాఁ దనవారలెల్లరు నరకమునుండి స్వర్గమునకుఁ జేర్పఁబడిరి. ఒక గృహస్థుఁడు చేయు నిష్కామకన్యాదానఫలముగా నతని వంశీయు లిటు పదితరములవారు, నటు పది తరములవారు నరకగతులైన నుద్ధరింపఁబడి శాశ్వతబ్రహ్మలోకావాప్తి నొందుదురు. అని కన్యాదానవేళ కాన్యాదాతృసంకల్పవాక్యములేకద. రావణుఁడు చేసిన దుష్కృతముల ఫలమును, వానివంశమువారేకాక, లంకారాజ్యమువారెల్లరుఁ బంచికొని యనుభవించిరి. ఉండకి: ఉపనిషత్తు, అభ్యుదయకాములైన యాత్మజ్ఞపురుషుల పూజ నుపదేశించినది. ఈ విధముగా విశ్వమంగళసాధనముచేయుటకై యాత్మజ్ఞపురుషులు పుట్టుదురు.

ఓం. దేవా ఊచుః ఓం.

ఓం. సర్వబాధాప్రశమనం త్రైలోక్యస్యాఖిలేశ్వరి ।
ఏవ మేత త్త్వయాకార్య మస్మద్వైరి వినాశనమ్॥ ఓం. 36

దేవతలనిరి— అమ్మా! అఖిలేశ్వరీ! నీ విప్పుడు మా యరికులమును నశింపఁజేసినట్లే, ముల్లోకముల బాధలను నశింపఁ జేయుము. ఇంతే మా కోరిక.

వ్యాఖ్య:— అఖిలేశ్వరీ! కొన్నాళ్లయి విశ్వమం దన్నియు బాధలే, యనుచు నొక యార్తధ్వని లేచినది. అన్ని విధముల బాధలను బాపకున్నచో నిన్నొందుట (నిన్నుఁ దెలి యుట) కాదు. ఆహా! యెట్టి మర్మపీడాకరవాణి వినఁబడు చున్నది! కాని కొలఁదిమంది మాత్రమే సర్వమును విడుచుట కనుచున్నాము. అటులు చేయఁగలవార లన్నియు బాధలే యను చున్నారు. ఇఁకఁ గృతకార్యులు కానివారును, సర్వమును మాతృలాభమున కంతరాయమే యని ఘోషించుచున్నారు. వాస్తవముగా సర్వమును (వారనుకొన్నవన్నియు) బాధలు కావు. సర్వవిధముల నీవే విరాజిల్లుచున్నావనెడి సత్యమందుఁ బ్రతిష్ఠితుఁడగుటచేతనే జీవుఁడు నీ సర్వాతీతస్వరూపము ననుభ వింపఁగలఁడు. అమ్మయే సర్వమునై యున్నదని, తెలియనంత దాఁక, జీవునకు మాతృలాభవిషయమున సర్వము నంతరాయ ముగానే నిల్చును. కనుకనే "అమ్మా! జగత్తునందు సత్య ప్రతిష్ఠ చేయుము. నీ వొక్కతెవే సర్వరూపములతో సత్యరూప ముతో నిన్ను వెలయించుకొనుచున్నావని, ప్రత్యేక జీవుఁడును హృదయమందు స్వర్ణాక్షరములతో నంకిత మొనర్చుకొనునట్లు చేయుము. ఏ బాధలు నుండవు. అమ్మగుండెయే సర్వవిధముల, దన సంతానమును ధరించుటకై సిద్ధమని, నీ సంతానమునకు మర్మమర్మముల నాటఁదెలుపుము. సర్వము సత్యప్రతిష్ఠిత

మగును. లోకమున సర్వదుఃఖరోదనములు తొలఁగిపోవును. జగత్తు యథార్థకల్యాణము నొందును."

ఓం. దేవ్యువాచ ఓం.

ఓం. వైవస్వతేఽన్తరే ప్రాప్తే అష్టావింశతిమే యుగే।
శుంభోనిశుంభశ్చైవాన్యా వుత్పత్స్యేతే మహాసురౌ॥ ఓం37

ఓం. నందగోపగృహే జాతా యశోదాగర్భ సంభవా।
తతస్తౌ నాశయిష్యామి వింధ్యాచల నివాసినీ॥ ఓం. 38

అమ్మయన్నది— వైవస్వతమన్వంతరమందు, ఇరువది యెన్మిదవ యుగమున మఱల శుంభ నిశుంభులనెడి పేళ్లతో నిరువురు మహాసురులు పుట్టుదురు. అపుడు నేను నందగోపునింట యశోదాగర్భమునందుఁ బుట్టి వింధ్యాచలమునందుండి యా యసురులను నశింపఁజేయుదును.

వ్యాఖ్య:—దేవతలచేఁ బ్రార్థింపఁబడి త్రైలోక్యమునకు సర్వబాధాప్రశమన వరము నిచ్చుటకుఁ బూని, యమ్మ యిచట ననేకరహస్యములను వెల్లడించినది. దేవీమాహాత్మ్యమందు వర్ణింపఁబడిన మూఁడురహస్యముల నమ్మ తానే వ్యక్తపఱచి నది. దేవీవాక్యములుగా నీ యధ్యాయమందుఁ బదునాలుగు మంత్రము లున్నవి. అమ్మ కృపాపూర్వకముగా సాధకుని మోహావరణముఁ దొలఁగించినపుడే యా మంత్రముల రహస్య నిర్ణయము కాఁగలదు.

ప్రియసాధకా! రమ్ము; మనమిపుడు "అమ్మా! ఈ రహస్యమంత్రముల యథార్థతాత్పర్యము మాకు హృదయంగ

మము చేయుమా” యని యమ్మ యడుగులంబడి యడిగికొందము. “అంధేనైవ నీయమానా యథాంధాః” అను న్యాయమున భ్రాంతమార్గమునఁ బడకుందుము గాక. ‘ జయ మాతా ’ నీ వుద్భాసింపుము.

వైవస్వతమనువు – ఏడవ మనువు. ఒక మనువు నధికారము చెల్లు కాలము మన్వంతరము. డెబ్బదియు నొక్క మహాయుగము లొక్క మన్వంతరము. సత్య త్రేతా ద్వాపర కలియుగములు నాలుగుం జేరి యొక మహాయుగమగును. పదునాలుగు మన్వంతరము లొక కల్పము – ఒక్కసారిగాఁ బ్రలయమగును. వర్తమాన కల్పముపేరు శ్వేతవరాహము. ఇక్కల్పమందగు డెబ్బదియొక్క మహాయుగములలో నిరువదియేడు కడచిపోయినవి. ఇరువదియెనిమిదవ మహాయుగమందు, సత్య త్రేతా ద్వాపరయుగములు కడచినవి. ఇపుడు కలియుగము నడుచుచున్నది. దీని యాయుఃపరిమాణము నాల్గులక్షల ముప్పదిరెండువేల వర్షములు. దానిలో 5065 వత్సరములు మాత్రమే జరిగినవి. ఇచట మనము ప్రసంగవశమున భారతీయ కాల గణనము నెడ సాధారణుల దృష్టి నాకర్షించుచున్నాము. సత్యతాకాలనిర్ణయము చేయుటకై నాల్గైదు వేలో, పది యిరువది వేలో సంవత్సరములు మాత్రమే సిద్ధాన్తము చేయువారు దయచేసి మున్ను వ్రాసిన కాలగణనాప్రణాళిక నొక్కసారి లక్షింపవలయును. “భారతవర్షము అధఃపతితమై పోయినది. భారతము చిరకాలము పరాధీనమై చిరదాస్యము చేసినది” యనువారు, ఒక్కసారి లెక్కవేసి చూచినచో భారతవర్షమునకు నిర్దిష్టమైన యాయుఃపరిమాణమునుబట్టి

యొకటి రెండు వేల యేండ్లెంత యల్పమో, ఎంత క్షుద్రమో – బిందుసదృశము కాదా? కనుక భారతమర్దశను జూచి శంకించి కలఁతనొంద హేతువు లేదు. కొంతకాలమైన తర్వాత నిట్టి యవస్థనగు శోచనీయకథలు నాయనమ్మ కతల క్రిందనే లెక్కింపఁబడును. ఇమ్మాట లిచట నప్రాసంగికము లైనను వీని యాలోచనమువలన మేలే కలదు. దుర్బలచిత్తుల హృదయమందు నూతనోత్సాహము, నూతనబలము, ఆశ, సంచరింపఁజొచ్చును. మఱియొక గొప్ప యుపకారము. జీవుని యహంకారము నశించును. ఔరా! అనంతకాలసముద్రమందు మేమెంత క్షుద్రులము! మా యునికి యెంత యల్పము! అను నిట్టి విచారమువలన జీవుని యహంకారము విడిపోవును.

మంత్రమందుఁ జెప్పఁబడినది — అమ్మ యన్నది – "వైవస్వతమన్వంతరమందు, ఇర్వదియెన్మిదవయుగమున మఱల శుంభనిశుంభుల పేరి యసురు లిర్వురు పుట్టుదురు. నేను నంద గోపు నింట యశోదకడుపునఁ బుట్టి వింధ్యాచలమునందుండి, ఆ శుంభనిశుంభులను నాశ మొనర్తును."

ఇచట – అమ్మ చెప్పిన కాలము లెక్కనుబట్టి యీ వర్తమానయుగమే విశేషించి లక్షింపఁబడును. ఇది దేవీ మాహాత్మ్యమునందలి, స్వారోచిష – అనఁగా రెండవమన్వంతరమునకుఁ జెందిన యుపాఖ్యానము. ఆ కాలమునుబట్టి చూడ వర్తమానకాలము బహుదూరభవిష్యత్తు, గాన, ఈ మంత్రమందు "ఉత్పత్స్యేతే" అనునది భవిష్యద్బోధక క్రియాపదముగా నున్నది. వర్తమానమునఁ బెక్కండ్రు మనుష్యులు శుంభనిశుంభులచేత, అనఁగా – అస్మితా మమతలచేత జయింపఁ

బడినవారలే. మన యమ్మ యశోదాగర్భసంభూతయై నంద గోపు నింట వెలసి యీ యిర్వురిని నశింపఁజేయును.

నందగోప — ఆనందమయబ్రహ్మాభిముఖమైన మనస్సు. "గాః పాతీతి గోపః" గోశబ్దార్థము ఇంద్రియములు. ఇంద్రియములను బాలించునది మనస్సు. కావున 'గోప' యనఁబడెను. మనస్సనెడి గోపుఁడు నందుఁడు. అనఁగా, ఆనందస్వరూపాత్మకు అభిముఖుఁడగునపుడే వాని పేరు నందగోపుఁడు. సర్వవిధముల నాత్మాభిముఖమనస్సు నాశ్రయించియే శక్తివికాస మగును. అనఁగాఁ బ్రజ్ఞాప్రభావము వెలయును. దానిచేతనే అస్మితా మమతలు నశించును. అదే నందగోపగృహమందుఁ బుట్టుటగాఁ జెప్పఁబడినది. అదే 'యశోదాగర్భసంభవ'. 'యశః + దా' యశోదా; యశస్సు నిచ్చునది. మాతృలాభముకొఱకుఁ, దీవ్రాధ్యవసాయశీలుఁడగుటచేతనే, మన యమ్మ తొలుదొల్త యశోదామూర్తితో జీవునిఁ దన యంకమందుఁ జేర్చుకొనును. అపుడు వానికిఁ దెలియకయే వాని యశస్సు నలుదిక్కులఁ బ్రాకును. సంతానము "రూపం దేహి, యశో దేహి" యని కోరినది, గాన జగన్మాత యశోదారూపమున వెలసి నందా శక్తిని బరిపోషించినది. యశోదయొడియందుఁ బెరిగిన యానంద మయశక్తియే శుంభనిశుంభుల వినాశమును జేయునది. ఈమె పేరే నందాశక్తి. ఈమె వింధ్యాచలవాసిని. వింధ్యాచలమే హృదయదేశము. హృదయమందలి యానందమయశక్తి చేతనే యస్మితా మమతలు నశించుటగును. తంత్రశాస్త్రమునందు సుమేరుపర్వతము మస్తకముగాను, వింధ్యాచలము హృదయము గాను, కులపర్వతము మూలాధారముగాను నిర్దేశింపఁబడినది.

మొత్తపుమాట యేమనగా—అమ్మ చెప్పినది "ఈ యుగమందు సైతము జీవుఁడు విశేషించి సత్యచ్యుతుఁడై పోవును. నా సంధానము నొందక యహంకారవిమూఢుఁడై పోవును. అప్పుడే నేను జీవహృదయమందు యశోదాగర్భ సంభవనై నందాశక్తిగా వెలసి, వాని యహంకారము నడంచి వానిని సత్యలోకమందుఁ జేర్చెదను." ద్వాపరయుగమందును మన యమ్మ శ్రీకృష్ణుఁడుగా నందగోప గృహమందు యశోదా గర్భసంభవమై నందాశక్తిరూపమునఁ దన్ను వెలయించుకొని, శిశుపాలాద్యులైన యసురుల నశింపఁజేసి, ధర్మరాజ్యమును ప్రతిష్ఠింపఁజేసినది.

మూర్తిరహస్యమందు, ఈ నందాదేవియే విష్ణుశక్తి (లక్ష్మి) గా వర్ణింపఁబడినది. "కమలాంకుశ పాశాబ్జై రలంకృత చతుర్భుజా । ఇందిరా కమలా లక్ష్మీః సా శ్రీరుక్మాంబుజాసనా॥" యని. ఈ విష్ణుశక్తి యన్నదే మధుకైటభ వధమందునుం జెప్పఁబడినది. ఆ ప్రథమచరిత్రమందు నందాశక్తియు, రక్తదంతికయు బీజములుగా నుల్లేఖింపఁబడినవి. రక్తదంతికావిషయము రాఁబోవు మంత్రమునఁ దెలియఁగలదు. విష్ణురూపమున వెలసి యా మధుకైటభులఁ జంపిన యా శక్తియే, యీ యుగమున నందాశక్తిరూపమునఁ బ్రతిజీవుని హృదయమందును నావిర్భవించి శుంభ నిశుంభులను (అస్మితా మమతలను) జంపును.

సాధకా! వినుము — శక్తివస్తువు, అదృశ్యము, అగమ్యము కారణస్వరూపము. ఇది కార్యరూపమున – దృశ్యరూపమునఁ దనను బ్రకటించుకొనునపుడు, సాధారణముగా నా

కార్యమే శక్తిమంతుఁడుగా వ్యవహరింపఁబడును. చూడుము - ఒక చెట్టున్నది. అది స్వయముగా (తానే) నొక శక్తిమాత్ర మైనను, దానిని 'వృక్షము' అని వ్యవహరించుచున్నాము. అనుభవించుచున్నాము. వాస్తవముగా నీ శక్తి శక్తిమంతులకు భేదమే లేదు. అటులే యొక యఖండమహాశక్తి - చితిశక్తి (బ్రహ్మము) ఒక భావముతోఁ దన్నుఁదా వెలయించుకొన్నపుడు, అట్టి భావముతోనే విభిన్నరూపములతోఁ బరిచితమగుచుండును. దీనిచే దాని యేకత్వమునకు నింతయు హానిలేదు. కనుకనే యీ దేశజనులు ముప్పదిమూఁడుకోటుల దేవతల దర్శనము చేసినను, అద్వైతవాదులే. ఈ ధన్యదేశజనులు, తామే స్థలమందైనను, ఏరూపమందైనను, ఎట్టి శక్తివికాసమునైనను గాంచినపుడు, దాని నొక జడశక్తిమాత్రముగా నెన్నక, దేవతగానే భావించి, ఈశ్వరుఁడుగానే గౌరవించి, పూజించునట్టి శక్తివాదులును, చైతన్యదర్శులునై యున్నారు. ఇతర దేశజనులు తామీ వైజ్ఞానికతను, ఆధ్యాత్మికతను దెలియఁజాలకుండుటచేఁ దఱుచుగాఁ 'ప్రతిమాపూజకులు, విగ్రహారాధకులు' నని పరిహాసము చేయుదురు. అంతమాత్రాన మనకు రవ్వంతయైన క్షోభములేదు. ఈ ప్రతిమాపూజకులే, ఈ విగ్రహారాధకులే, లోకమున మొట్టమొదట, 'తత్త్వమసి' మున్నగు మహావాక్యములతో, అద్వయజ్ఞాన విజయదుందుభిని మ్రోగించినవారు. మఱియు నవిశ్వాసపూర్ణమైన, యీ యుగమందు సైతము, ఈ దేశమువారు పలుదేవతల పూజలు చేయుచునే, యభీష్టఫలముల నొందుచు నద్వయజ్ఞానాధికారులై యున్నారు. అది యట్లుండె.

మఱల నిపుడు దేవీమాహాత్మ్య పాఠకులఁ దలపించు చున్నాము — ఈ గ్రంథమందు సర్వదేవ దేవతల యాధ్యాత్మిక రహస్యమే వివరింపఁబడినను, వారి విశిష్టమూర్తుల ననాదరింప లేదు. ఈ నందాశక్తి మున్న గువానికి విశిష్టమూర్తులుండనే చాలవు. ఇపు డీ దినములలో నట్టి మూర్తులు కానరావని, యెవ్వరును విచారింపఁ గారణములేదు. "సాధకానాం హితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా" యనెడి సత్యవాక్యమందు లక్ష్యముంచుటచేతనే, మూర్తామూర్తవిషయకమైన సంశయము తొలఁగిపోవును.

ఓం. పునరప్యతి రౌద్రేణ రూపేణ పృథివీతలే ।
అవతీర్య హనిష్యామి వైప్రచిత్తాంస్తు దానవాన్॥ఓం. 39

ఓం. భక్షయంత్యాశ్చ తానుగ్రాన్ వైప్రచిత్తా న్మహాసురాన్।
రక్తాదన్తా భవిష్యన్తి దాడిమీ కుసుమోపమాః॥ ఓం. 40

ఓం. తతో మాం దేవతాః స్వర్గే మర్త్యలోకే చ మానవాః ।
స్తువన్తో వ్యాహరిష్యన్తి సతతం రక్తదన్తికామ్॥ ఓం. 41

మఱల నే నతిభీషణాకారముతో భూమిపై నవతరించి వైప్రచిత్తులనెడి దానవులను జంపుదును. ఆ దానవులమ నములుటచే నా దన్తములు దానిమ్మపూలవలె నెఱ్ఱఁబడును. అపుడు స్వర్గమందలి దేవతలును, మర్త్యమందలి మానవులును విడువక స్తుతించుచు నన్ను రక్తదన్తికా నామముతోఁ గీర్తింతురు.

వ్యాఖ్య:— వేదవిద్బ్రాహ్మణులు విప్రులు. "వేద పాఠాద్భవే ద్విప్రః" చిత్తమందు వేదమును=అమ్మ సంవేదన ప్రకాశము నొందువారలే విప్రులు. వారిచిత్తమే విప్రచిత్తము. ఈ విప్రచిత్తములందు వెలయు వృత్తులకే వైప్రచిత్తములని పేరు. అవె దానవగణముగాఁ జెప్పఁబడినది. దీని నణఁచుటకు, అమ్మ యుగ్రరూపమున వెలయు పనిపడును. ఏమన — ఆత్మ సంవేదనసంపన్నులైనవారి చిత్తము బహువీర్యశాలి యగును. ఆ వృత్తుల విలయ మొనర్చుటకై యమ్మ యుగ్రరూపమున వెలయు పనిపడును.

ఇంతకుమున్ను యోగుల నిర్మాణచిత్త విషయము చెప్పఁబడినది. యోగశాస్త్రమందొక సూత్రమున్నది. "నిర్మాణ చిత్తాన్యస్మితా మాత్రతః" అనఁగా నిర్మాణచిత్తము, అస్మిత యందే ఘటింపఁబడును. అనఁగా జిత్తవిలయమైన తర్వాత మఱల నభినవచిత్త నిర్మాణమగును. ఉద్దేశ్యము విశ్వహితము= లోకైషణ, విశ్వమంగళమునకై యోగిపురుషులు, అభినవ కర్మాశయమును ఘటించుకొందురు. అవియు విప్రచిత్తాసురు లనఁబడును. మా యమ్మ సమయమునుబట్టి యావిర్భవించి వానినిగూడ విలయ మొనర్చును. ఏమన అవియును కైవల్య విరోధులే.

ఈ విప్రచిత్తాసురులను వినాశ మొనర్చుటకై పరా ప్రకృతియొక్క రజోగుణాత్మకమైన చిత్ప్రవాహరూపముతో, అమ్మ విశేషించి యాత్మప్రకాశము చేయవలసివచ్చును. ఇంతకుమున్ను నందాశక్తి నామముతో జెప్పఁబడినదే మఱల వైప్రచిత్తులనెడి భీషణాసురులను నశింపఁజేసి రక్తదంతికా

నామముతోఁ బ్రసిద్ధమగును. దంతములే భావరాశిని విలయ మొనర్చు శ్రేష్ఠసాధనము. ఆ యతిసూక్ష్మములును, ఉచ్ఛ్రితములునైన వృత్తులు సంహరింపఁబడవలసి వచ్చునపుడు, నిజముగాఁ బ్రలయము పేరి రక్తవర్ణ కరాళదంతపంక్తితోడి నోరు తెఱచి భావములను గ్రసించుచున్నదని మనసునఁ దట్టును. గీతయందలి విశ్వరూపసందర్శనమున, అర్జునుఁడును సరిగా నిట్టులే దంష్ట్రాకరాళ ముఖమందు సర్వభావ విలయమును గాంచెను. "యథా ప్రదీప్తం జ్వలనం పతంగాః" యందు నగ్ని యందు మిడుతలంబోలి రాజన్యవర్గ విలయమందును, ఇచట దానిమ్మపూలవంటి యెఱ్ఱనిదంతముల సమూహముచే వైప్ర చిత్తాసురకుల భక్షణమును, నొక్క-భావమునే వెల్లడించును. అనఁగాఁ దాత్పర్య మొక్క-టే.

ఇది మొదలు దేవతలును మానవులును నందాశక్తిని రక్తదంతికయని స్తుతింపఁగడఁగిరి. అమ్మ యెప్పు డెట్టి భావముతో నెట్టికార్యమును సంపన్నము చేయునో, అపుడు దేవతలు మనుష్యులు, అమ్మ నట్టిభావముతో నట్టిపేరితో స్తుతించుచుందురు. ఇంతకుమున్ను మధుకైటభవధమునకు, నందారక్త దంతికా బీజశక్తులే శక్తిబీజములుగా వర్ణింపఁబడినవి. అచట విప్రచిత్త విలయరూపముగా నేమియుం జెప్పఁబడకున్నను బహుత్వస్పృహానాశమే సర్వచిత్తవిలయమునకు బీజస్వరూప మైనదని యెఱుంగవలయును. బహుభావముల కోరిక నివృత్తి యగుటచేతనే తక్కి-న యాసురికభావముల విలయమగును. ఈ రక్తదన్తికాదేవి యావిర్భవించుటచే విప్రచిత్తులనెడి యసురులును యోగుల నిర్మాణచిత్తపర్యన్తము నష్టమైపోదురు.

నిర్మాణచిత్తమూలమందే యీ బహుత్వస్పృహ సూక్ష్మ భావముతో నుండుననెడి మాట నంగీకరింపకుండుటకు వీలు లేదు. అవి బంధనజనకములు కాకున్నను భేదజ్ఞానము తప్పక యున్నదే. అగుఁగాక. ఈ బహుత్వస్పృహను బూర్తిగా విలయ మొనర్చియే సాధకునిఁ గైవల్యపదమందుఁ బ్రతిష్ఠించుటకై నందాశక్తి, అమ్మయొక్క రక్తదంతికామూర్తితో నావిర్భ వించును.

ఓం. భూయశ్చ శతవార్షిక్యా మనావృష్ట్యా మనంభసి ।
మునిభిః సంస్తుతా భూమౌ సంభవిష్యామ్యయోనిజా॥ఓం.42

ఓం. తతః శతేన నేత్రాణాం నిరీక్షిష్యామి యన్మునీన్ ।
కీర్తయిష్యన్తి మనుజాః శతాక్షీ మితి మాం తతః॥ఓం.43

నూరేండ్లు వ్యాపించు వఱపుచేఁ బృథివి జలశూన్య మగునపుడు, నేను మునులచే స్తుతింపఁబడి, అయోనిజనై బువిఁ బుట్టుదును. అప్పుడు నేను నూఱు కనులతో మునులను జూతును, గాన నన్నపుడు జనులు శతాక్షీనామముతోఁ గీర్తింతురు.

వ్యాఖ్య:— ఇంతకుమున్ను నందారక్తదన్తికలు బీజ ములుగాఁ బ్రథమచరిత్ర రహస్యము వ్యాఖ్యానింపఁబడినది. ఇపుడు మధ్యమచరిత్ర రహస్యవర్ణన ముపక్రమింపఁబడును.

దేవి యనుచున్నది:— నేను మఱల నావిర్భవింతును. నూరేండ్లు విడువకుండు వఱపుచే జగము జలశూన్యమగును. ఆనందమయపరమాత్మరసము, అభావమగుటచే జీవజగత్తు

శుష్కమును ప్రాణహీనమ్మునైన సాధనాకంకాళమును (ప్రేమునుకూడను) బట్టుకొని సాగుచుండును. మునులును బ్రాహ్మణులును అట్టి ధర్మగ్లానిమయావస్థయందు మర్మపీడితులై నన్ను స్తుతింతురు. అప్పు డాకస్మికముగా "భూమహా సంభవిష్యామి" భూమినుండియే నేను ప్రకటిత నగుదును. భూమియొక్క, అనఁగా భౌతికపదార్థములయొక్క (వానియెడ నంటిన) జడత్వజ్ఞానమును తిరోహిత మొనర్చి, చిత్సత్తను సత్యమును ప్రతిష్ఠింతును. అప్పుడు నేను మునిగణములను – మననశీల సాధకులను శతనేత్రములతోఁ జూతును. అనఁగా మననశీల సాధకులు నన్ను విశ్వతశ్చక్షువనుఁగా విశ్వవ్యాపి దృక్ (దృష్టి) శక్తిరూపనుగా దర్శింతురు. అపుడు మానుషు లానందముతో నిండి, నన్ను శతాక్షీనామముతోఁ గీర్తింతురు. అప్పుడు వారెటు చూచిన నటు, నా దివ్యదృష్టిని స్నేహమయవిలోకమును గాంతురు. గాన శతాక్షీనామకీర్తనము చేయకుండఁజాలరు. అపుడు నేను భూమినుండి – అనఁగా జడపదార్థములందు, విశేషించి సత్యరూపమునఁ జైతన్యరూపమునఁ బ్రకాశించి యంతటను నా సత్తనుద్భాసింపఁజేయుదును. దానిచే మనుజులు (మనుసంతానము) నావిశిష్టప్రకాశము నెల్లెడను గాంచి మహాహర్షము నొందుదురు.

ఓం.తతోఽహ మఖిలం లోక మాత్మ దేహ సముద్భవైః ।
భరిష్యామి సురాః శాకై రావృష్టేః ప్రాణధారకైః ।
శాకంభరీతి విఖ్యాతిం తదా యాస్యామ్యహం భువి॥ ఓం.44

ఓ దేవతలు! అపుడు నా దేహమునుండి పుట్టినట్టియుఁ బ్రాణధారకములైనట్టియు శాకములచే, ననావృష్టి యుండు

నంతకాలము సమస్తలోకములను నేను భరింతును (ప్రతిపాదింతును). అప్పుడు శాకంభరి యనుపేర నేనే పరగుదును.

వ్యాఖ్య:— దేవి యన్నది:— వేలుపులార! ఆ శతాక్షిని నేనే మఱల శాకంభరీ నామముతోఁ బ్రసిద్ధ నగుదును. ఏమన — అనావృష్టి వేళ, నా దేహమునుండి పుట్టి ప్రాణములను నిల్పు శాకములచే సర్వలోకములను గాపాడుదును. (నాగోజీ భట్టు శాకంభరీమూర్తి యావిర్భవించు కాలమును నల్వదవ మహాయుగమని నిరూపించెను. అనఁగా వర్తమానయుగమును బట్టి, పదునొకండు మహాయుగములు కడచిన తర్వాత నా సమయము వచ్చును. ఇపుడు 28 వది + 11 = 39 మహాయుగములు చన్న పిదప, నలువదవమహాయుగమందిక్కాలము వచ్చ ననెను.) అపుడు బహుకాలము వఱపు వ్యాపించును, గాన అన్నాభావమగును. అప్పుడు బిడ్డనెయ్యముచేఁ గలఁగిన మన యమ్మ, తన శరీరమునఁ బుట్టిన శాకములచే వఱపున్నంత కాలము జీవసంతానమును బోషించును. అట్టి దుఃఖసమయము రాకయుఁ జాల గడువు కలదు.

ఇఁక మనము దీని యాధ్యాత్మికార్థమును దెలియఁ బ్రయత్నింతము. "ఆత్మదేహ సముద్భూత" శాకశబ్దముచే, క్షితితత్త్వముయొక్క రసము — జీవనశక్తిగాఁ దెలియునది. ఆత్మకు క్షితియే దేహము. దానినుండి పుట్టిన ప్రాణధారక శాకములే యనావృష్టివేళ జీవుని రక్షించును. తాత్పర్య మేమనఁగా — వాన కురియకుండునంతదాఁక అనఁగా, ఆనంద మయబ్రహ్మజ్ఞానధారచే సమగ్రవిశ్వము ముంచివేయఁబడ నంతదాఁక — జీవుఁ డానందమయబ్రహ్మసత్తయందుఁ బూర్ణ

ప్రతిష్ఠితుఁడు కానంతదాఁక, అమ్మ శాకంభరీమూర్తి దేహమందుఁ బుట్టిన ప్రాణధారక శాకములచే జగత్తును బోషించును. అనఁగాఁ బ్రాణప్రతిష్ఠ చేయించి త్రితాప సంతప్త జీవుల హృదయమందు శాంతి స్రోతోమార్గముఁ దెఱచి వేయఁ బ్రయత్నించును.

సారాంశము వినుఁడు – అమ్మ యనుచున్నది. జగత్తునం దిట్టి సమయ మొకటి వచ్చును. అనావృష్టిచే – బ్రహ్మరసధార లేమిచే, జీవులు కడుదుఃఖితులు సంతప్తులు నగుదురు. మఱల స్థూలజగత్తునం దాత్మరస సంధానము కానపుడు – ఆత్మను జగదతీతము, అజ్ఞేయము, అప్రాప్యమునైన వస్తువుగా నెంచి, పరిత్యజించి జీవులు కేవల బహిర్ముఖులై పోవునపుడు, నేను శాకంభరీమూర్తితో నావిర్భవింతును. ఈ విశ్వమే నా దేహమను మాట జీవులకుఁ దెలియఁజెప్పుదును. అపుడు వారే యీ నా విశ్వదేహమందుఁ బ్రాణధారక శాకసంధానము నొందుదురు (శాకములు పుట్టుటఁ గన్గొందురు). విశ్వమందలి ప్రత్యేక పదార్థము ప్రాణమయము. చైతన్యవస్తు వొక్కటే యీ విశ్వమున కుపాదానము, అనుట జీవుల కప్పుడే యనాయాసముగాఁ దెలియఁగలదు. అపుడు వారే కడఁ జూచిన నాకడనే ప్రాణధారక శాకములు కానఁబడును. అనఁగాఁ జైతన్యసంధానము నొంది వారే సరిపుష్టులగుదురు.

ఒక్కమాటలోఁ జెప్పివేయుదము — ప్రాణహీనులై జడత్వముగ్ధులై సంసార సంతప్తులైన మనుష్యులకు మఱలఁ బ్రాణప్రతిష్ఠ చేయుటయే, అమ్మ శాకంభరీమూర్తి కార్యము. జడపదార్థములందును జైతన్యదర్శనమే. శాకములచే జీవనము

నిల్పుకొను రహస్యము, అగుఁగాక; అమ్మ శాకంభరీమూర్తితో మనకుఁ బ్రాణప్రతిష్ఠ చేయును. ఈ శాకంభరియే మధ్యమ చరిత్రకు శక్తిగా వర్ణింపఁబడినది. శాకములచే జీవులను భరించుట - యనఁగాఁ బోషణము చేయుటచేతనే, అమ్మ యిచ్చట నీ నామముతోఁ జెప్పఁబడినది. ఈ శాకంభరీ శబ్దమునకు మఱొకయర్థము చెప్పఁగలము. కఠోపనిషత్తు— "యస్య బ్రహ్మ చ క్షత్రంచ ఉభే భవతి ఓదనమ్" ఇత్యాది మంత్రమందు జీవుల యన్నమును, మృత్యువుయొక్క యుపసేచనమును పప్పు పచ్చడి కూరలుగాను, అనఁగా శాకముగాఁ గీర్తింపఁబడినది.

ఓం. తత్రైవ చ వధిష్యామి దుర్గమాఖ్యం మహాసురం।
దుర్గాదేవీతి విఖ్యాతం తన్మేనామ భవిష్యతి॥ ఓం. 46

అప్పుడచటనే నేను దుర్గముఁడనెడిమహాసురుని జంపుదు; నప్పటినుండియు నాకు దుర్గాదేవీనామము ప్రసిద్ధమగును.

వ్యాఖ్య:— అమ్మ యనుచున్నది. ఆ శాకంభరీమూర్తితోనే దుర్గముఁడనెడి యసురునిఁజంపి దుర్గాదేవీ నామము నొందుదును. బహుదుర్గమమైనదియు, దురూహ్యమైన యుపలబ్ధి గలదియు, శ్రుతిచేఁ గత్తి దారుపై నడుచుటవంటిదని నిర్దేశింపఁబడినట్టియు, దుర్విజ్ఞేయమునైన యాత్మత్త్వమును, సులభలభ్యముగాఁ జేసివేయుటకే, నేను శాకంభరీశక్తిరూపమున నావిర్భవింతును. ప్రాణప్రతిష్ఠచేసి యాత్మసంధానమైనపుడు, జీవుల దుర్గము - అనఁగా జీవత్వమనెడి దురవస్థ యనాయాసముగాఁ దొలఁగిపోవును. ఇందువలన నపుడు, శాకంభరినైన నేనే దుర్గాదేవీనామముతో విఖ్యాత నగుదును. దుర్గశబ్దము

పైని హాననార్థకమైన 'ఆ' ధాతువు చేరుటచే దుర్గాశబ్దనిష్పత్తి యైనది. కాఁగా దుర్గతిహారిణి జనని యని యర్థము. ఈదుర్గయే మధ్యమచరిత్రమునకు బీజము. దుర్గతిహరణమే దేవి యుద్దేశ్యము, కనుకనే మధ్యమచరిత్ర యుపోద్ఘాతమునందు శాకంభరీ శక్తి దుర్గాబీజముల విషయము వ్రాయఁబడినది.

ప్రాచీన గ్రంథములందు "దుర్గాదేవీతి విఖ్యాతం తన్మే నామ భవిష్యతి" అను నంశము లేదు. ప్రాచీన టీకాకారులు సైతము దీనిని వ్రాయలేదు. పుస్తకమందు వ్రాయఁబడకున్నను, అమ్మ దుర్గారూపముతోఁ ప్రతి జీవునందును నావిర్భవించుట కనుచున్నాము. జీవుఁడు దుర్గతుఁడై దుర్గమాసురుని యత్యాచారము పీడింపఁగా, ఆత్మజ్ఞానమువైపు ముందడుగు వేయనోపనపుడే, మన యమ్మ దుర్గాదేవీరూపముతో నావిర్భవించి, దుర్గమాసురునిఁ బడఁగొట్టి తన నెయ్యపుబిడ్డల దుర్గతిని హరించును. మఱి యాత్మజ్ఞానమార్గమును జూపును. కావుననే భారతదేశమునందును, విశేషించి వంగదేశమందు బహుపూర్వకాలమునుండియు దుర్గాపూజ విరివిగా నడుచుచున్నదని, మనకుఁ దెలియును. ఇపుడే యవిశ్వాసయుగమందు, ఈ శ్రద్ధాహీన యుగమందు సైతము, మనుజులు దుర్గాపూజచేసి "భూతాని దుర్గా భువనాని దుర్గా స్త్రియో నరాశ్చాపి పశుశ్చ దుర్గా। యద్యద్ధి దృశ్యం ఖలు సైవ దుర్గా దుర్గాస్వరూపా దపరం నవిద్యతే॥" యనుచు, సర్వత్ర దుర్గాస్వరూపమునే చూచుచు ధన్యులగుచున్నారు.

ఓం. పునశ్చాహం యదా భీమా రూపం కృత్వా హిమాచలే।
రక్షాంసి క్షయయిష్యామి మునీనాం త్రాణకారణాత్॥ ఓం. 47

ఓం. తదా మాం మునయస్సర్వే స్తోష్యన్త్యా నమ్రమూర్తయః।
భీమాదేవీతి విఖ్యాతం తన్మేనామ భవిష్యతి॥ ఓం. 48

మఱల నే నతిభయంకరమూర్తితో హిమాచలమందు అవతరించి మునులను రక్షించుటకై రాక్షసులను జంపుదును. అపుడు వినమ్రములై మునులు నన్నుఁ గీర్తింతురు. అపుడు నా పేరు భీమాదేవి యని ప్రసిద్ధమగును.

వ్యాఖ్య:– లక్ష్మీతంత్ర ప్రమాణానుసారముగా నీ భీమాదేవ్యవతారకాలము, వైవస్వతమన్వంతరమందు ఏఁబదవ మహాయుగము. ఇక్కాలమురాకకుఁ గడుం గడువున్నది. ఇపుడు సాగుచున్నది యిర్వదియెన్మిదవ మహాయుగము. ఇఁక నిరువదియునొక మహాయుగములు కడచిన తర్వాత భీమావిర్భావకాలము వచ్చును. కాని, అమ్మవారి యీ భీమామూర్తి, ఈ యుగమందే యపుడపుడు మనకుఁ బ్రత్యక్షమగుచున్నది. కొన్నాళ్ళక్రిందటనే భూపశ్చిమభాగమందు మన యమ్మ భీమామూర్తితోఁ బుట్టి రాక్షసప్రకృతిజీవులను బహుసంఖ్యముగా వినాశమొనర్చినది. జడత్వముగ్ధులైన జీవులు, ఒకరి నోటిముద్దను మఱియొకరు లాగికొనఁబోవునపుడే, మన యమ్మ రాక్షసీప్రకృతితో నట్టివారిని దన యొడిలోనికి లాగికొనుట కనుచున్నాము. అట్టి జీవుల వినాశమునకయియే, యమ్మకు అప్పుడప్పుడు భీమామూర్తితో-భయంకరీమూర్తితో నావిర్భవించు పనిపడుచుండును.

సరే; ఆధ్యాత్మికదృష్టితోఁ జూతము. మునుల పరిత్రాణము కొఱకే యీ భీమావతారమని తెలియుచున్నది. మననశీల సాధకులు (మునిగణము) రాక్షసప్రకృతిచేఁ బీడింపఁ

బడునపుడే, అమ్మ యిట్టి భయంకరమూర్తితోఁ బుట్టును. హిమాచలమం దమ్మ యావిర్భవించును. జడత్వవిమూఢమైన జీవగణమే హిమాచల మనఁబడును. జీవులు కేవల జడత్వమందే ముగ్ధులగునపుడు - జడత్వమునం దున్నతినొందు సాధనమే జీవిత ముఖ్యలక్ష్యముగా నెంచునపుడే, అమ్మ భీమామూర్తితో వెలసి, దుర్భిక్ష మహామారీ రాష్ట్రవిప్లవ జలప్లావన ప్రబల వాయు భూకంపాదిరూపమున వెలసి, రాక్షసప్రకృతి జీవుల వినాశమొనర్చి, మననశీల సాధకులను రక్షించి, లోకమున మఱల సత్యధర్మప్రతిష్ఠ చేయును. ఇట్టి భీమామూర్తితో నావిర్భవించునపుడు విశ్వహితమునకై ధృతియుతమైన మునిగణము నమ్రమూర్తులతో నమ్మను స్తుతించును. అమ్మయు వారి స్తవమునకు సంతోషించి యా భయంకరమూర్తిని విడుచును. మఱలఁ బ్రశాంతమూర్తితో నాత్మప్రకాశముచేసి, జగత్తునందలి యశాంతిని దొలఁగించును.

ఓం.యదారుణాఖ్య స్త్రైలోక్యే మహాబాధాం కరిష్యతి ।
తదాహంభ్రామరంరూపం కృత్వా సంఖ్యేయషట్పదం॥ఓం.49

ఓం. త్రైలోక్యస్య హితార్థాయ వధిష్యామి మహాసురం।
భ్రామరీతి చ మాం లోకా స్తదా స్తోష్యన్తి సర్వతః॥ఓం.50

అరుణుఁడను పేరి యసురుఁడు ముల్లోకముల కత్యంత పీడ గల్గించునపుడు, నేను లోకహితమునకై లెక్కలేని తుమ్మెదల గుంపుతోఁ గూడినదాననై భ్రామరీరూపమును దాల్చి యా యరుణాసురుని వధింతును. అపుడు లోకులు నన్ను భ్రామరి యని స్తుతింతురు.

వ్యాఖ్య:— లక్ష్మీతంత్ర వాక్యానుసారముగా, అమ్మ భ్రామరియై యవతరించు కాలము, వర్తమానమన్వంతరమున, అరువదవయుగము. ఈ యుగమున మఱి ముప్పదియునొక్క యుగములు కడవఁగా నక్కాలము వచ్చును. అది బహుదూర భవిష్యత్తుమాట. అక్కాలకల్పన మిప్పుడు చేయనులేము. ఈ మూర్తిస్వరూపము "తేజోమండల దుర్ధర్షా భ్రామరీ చిత్రకాన్తి భృత్ । చిత్రభ్రమర పాణిః సా మహామారీతి కథ్యతే" అని చెప్పఁబడినది. లెక్కలేని తుమ్మెదలచేఁ జుట్టఁబడి విచిత్రమైన తుమ్మెదలు చేతఁగల యీమూర్తి యరుణుఁడనెడి యసురుని జంపును.

ఇపుడు మనము దీని యాధ్యాత్మిక రహస్యము నెఱుంగఁ బ్రయత్నింతము. ఆత్మజ్ఞానోదయమునకుఁ బూర్వావస్థయే యరుణుఁడనెడి యసురుఁడు. సూర్యోదయమునకు ముందుగ అరుణోదయమగునటులే జ్ఞానసూర్యుఁ డుదయించుటకు మున్నే చిదాభాసుఁడనెడి యరుణుఁడుదయించును. వానిని జూచి, యదే చరమజ్ఞానముగాఁదలంచు సాధకులు, ఈ యరుణాసురునిచేఁ బీడింపఁబడుట కన్గొందురు. ఉత్తమ చరిత్రమందు శుంభాసురుఁడనఁబడినవాని మఱియొక పేరే, అరుణాసురుఁడు. ఈ యరుణాసురుఁడు యథార్థముగానే త్రైలోక్యమునకు మహాబాధకుఁడు, ఉత్పీడకుఁడు. 'అహం' ను ఆత్మగానే ముస్తాబుచేసి అనేక కర్తృత్వ భోక్తృత్వాది వ్యాపారముల కారణభూతుఁడై యుండును, గావున మన యమ్మ భ్రామరీరూపమునతో - భ్రమ వినాశినీ రూపముతో - ఆవిర్భవించి చిదాభాసుని యాత్మత్వ భ్రమమును నశింపఁజేయును. అన్నమయాది పాఞ్చభౌతిక దేహము పేరే (ఆఱుకోశములతోఁ గూడినది) షట్పదము.

ఇచటఁ బదమనఁగా స్థానము. అనాత్మవస్తువులయం దాత్మ భ్రమ మీ యాఱుస్థానములందే తలసూపుచుండును, గానఁ జిన్మయి యమ్మ షట్పద పరివృతారూపముతో భ్రామరీనామముతోఁ బేర్కొనఁదగినది. పరమాత్మ అమ్మస్వరూపముతో వెలసి, తొలఁగింపరాని యీ భ్రమమును దొలఁగించు సాధనము చేయును. అనఁగా జ్ఞానాభాసమనెడి త్రిలోకపీడకుఁడగు నరుణాసురుని నశింపఁజేయును. అపుడు సర్వలోకములును విశుద్ధ చైతన్యసంధానము నొంది, నిరవచ్ఛిన్నానందసత్తయందుఁ బ్రతిష్ఠితము లగును. భ్రమవినాశినియైన యమ్మను గొని యాడును. కనుకనే మంత్రమందు "భ్రామరీతి చ మాం లోకా స్తదా స్తోష్యన్తి సర్వతః" అని దేవీవాక్యము కానవచ్చును. ఋషిచ్ఛందస్సులం దీ భ్రామరీదేవియే, యుత్తమచరిత్రమునకు బీజముగాను వ్రాయఁబడినది. భీమాదేవీరూపముతో రాక్షసీ ప్రకృతిని విలయ మొనర్చిన యామెయే, చిదాభాసుఁడనెడి యరుణాసురుని గూర్చి భ్రామరీనామమునఁ బరఁగినది. ఆనంద ప్రతిష్ఠయే యుత్తమ చరిత్రమందుఁ బ్రతిపాద్యవిషయము.

ఇపుడు మనము సంక్షేపముగాఁ బూర్వోక్తమంత్రముల సారమర్మము నెఱుంగఁజూతము. మొదటి నందాశక్తి, రక్తదంతికా బీజము; ఇవి మధుకైటభవధము సత్యప్రతిష్ఠా - బ్రహ్మగ్రంథిభేదము, అనుదాని సూత్రము. రెండవ శాకంభరీ శక్తి, దుర్గాబీజము; ఇవి మహిషాసురవధము-ప్రాణప్రతిష్ఠా-విష్ణుగ్రంథిభేదమునొక్క సూత్రము. అటులే మూడవ భీమా శక్తి, భ్రామరీబీజము; ఇవి శుంభనిశుంభవధము-ఆనందప్రతిష్ఠా-రుద్రగ్రంథిభేదము నొక్క సూత్రము.

1. మధుకైటభవధము:— సత్యప్రతిష్ఠా – బ్రహ్మగ్రంథిభేదము.
   వీని సూత్రము:— నందాశక్తి – రక్తదంతికాబీజము.
2. మహిషాసురవధము:— ప్రాణప్రతిష్ఠా – విష్ణుగ్రంథిభేదము.
   వీని సూత్రము:— శాకంభరీశక్తి – దుర్గాబీజము.
3. శుంభనిశుంభవధము:— ఆనందప్రతిష్ఠా – రుద్రగ్రంథిభేదము.
   వీని సూత్రము:— భీమాశక్తి – భ్రామరీబీజము.

దేవీమాహాత్మ్యమున వర్ణింపఁబడిన మూఁడురహస్యములకు నిమ్మూఁడును సంక్షేప వివరణములు.

కడచిపోయిన యుగములందే యివి (ఈ శక్తులు) తమ స్వరూపములను వెలయించిన వనుటే కాదు. వర్తమానమందును ప్రత్యేకసాధకుని హృదయమందు నిట్టులే, యిట్టి భావములతోనే, అమ్మ యావిర్భవించుచున్నది. మఱి భవిష్యత్తునందును మన యమ్మ తన నిట్టులే వెలయించుకొనును. ఇదే యమ్మ చేసిన ప్రతిశ్రుతి (వాగ్దానము).

వర్తమాన సాధనయుద్ధమందు, అమ్మ యే మూర్తులతో, నే యే యసురులఁ జంపినదో, భవిష్యత్తునందు నటులే చేయును. అప్పుడు మూర్తుల నామరూపములయందును, అసురుల నామములందును, గార్యప్రణాళియందును, భిన్నత కానఁబడును. మును జెప్పిన మంత్రములవలన నిట్టి తాత్పర్యము గుర్తింపఁబడును. బహుదూర భవిష్యత్కాలమందు సత్య సత్యముగానే జీవసమూహము, నేఁటి జీవులనుబట్టిచూడ నధిక మూఢులును బహువిభిన్నప్రకృతిసంపన్నులు నగుదురు. అపు డాసురికవృత్తులు యథార్థముగానే వర్తమానకాలమునుబట్టి

చూడ మఱింత భీషణాతరములుగా నుండును. అప్పు డజ్ఞానము జీవగజత్తును మఱింతగాఁ గప్పివేయును. ఈ విధముగా నజ్ఞానాంధకారము మిగుల దట్టమైపోవునపుడు, జ్ఞానమును యమ్మయు నధికసులభ యగును. కనుకనే భవిష్యద్యుగముల, నన్నిటికంటె ముందు, నందామూర్తితో శుంభనిశుంభవధమును, మఱల శాకంభరీమూర్తితో స్వదేహజాతములైన శాకములచే జేన రక్షయు, దుర్గారూపముతో దుర్గమాసురవధమును జేసి, భీమామూర్తితో రాక్షసులను జంపి, మునులఁ గాచుటయు, భ్రామరీరూపముతో నరుణాసురవధమును, మంత్రములం దుఁ గను చున్నారము. ఇదే మనయమ్మగారి భవిష్యత్కర్మ సూచీపత్రము.

ఓం. ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి ।
తదా తదావతీర్యాహం కరిష్యా మ్యరిసంక్షయమ్॥ఓం. 55

ఇతి శ్రీ మార్కండేయ పురాణే
సావర్ణికమన్వంతరే దేవీమాహాత్మ్యే దేవ్యాః స్తుతిః
ఏకాదశోఽధ్యాయః.

ఈవిధముగా దైత్యులవలని యుత్పీడన మగునపుడెల్ల నే నవతరించి శత్రుసంక్షయ మొనర్తును.

వ్యాఖ్య:—— ఇదే దేవి యుపసంహారవాక్యము. దేవతాబృందము త్రైలోక్యమునకును సర్వబాధాప్రశమన మనెడి వరమును బ్రార్థించెను. అమ్మయు సర్వ మీయఁగడఁగి, యనిన మాటవల్ల సుదూర భవిష్యత్కాలమందు సైతము, ఎన్నివిధముల యుత్పీడనములగునో యవి యన్నియు వెల్లడించినది. కట్టకడను అసురపీడ కలుగునపుడెల్ల నీ విధముగానే నవతరించి యరిసంక్షయమును జేసివేయుదునన్నది. ఆత్మజ్ఞానము నొందు

దారిని, ఎన్నివిధముల యుత్పీడనములేని వచ్చిపడనీ, మాతృ చరణములం దేకాన్తశరణాగతులైన బిడ్డల కగు బాధావిఘ్నములను దొలఁగించు పనిని, అమ్మ తనపైనే పెట్టుకొన్నది. ఇదే మనయెడ ముఖ్యమైన యాశావాణి. మనకు ధీరతఁగొల్పు పూటమాట. గీతయందు భగవానుఁడు (శ్రీకృష్ణరూపిణి అమ్మ) నైత మిమ్మాటనే మాటిమాటి కనెను. ఆత్మసమర్పణము చేయు యోగియొక్క సర్వభారములు నొక్క యమ్మ యొడి యందే యుంచఁబడినవి. కనుకనే వారు నిశ్చింతులై పూర్ణానందమయులై, యమ్మ యొడియందే నగ్నశిశువులై కూరుచుందురు. వారి కెన్నివిధముల బాధ లేరానీ, యమ్మ యవి తానే తొలఁగించును.

వర్తమాన భవిష్యత్కాలములందును భూతకాలము నందును, దీని కన్యథా కాఁజాలదు, కాలేదు.

సాధకా! రమ్మ. మనమును "శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే! సర్వస్యార్తి హరే దేవి నారాయణి నమోఽస్తుతే" అనుచు మాతృచరణములకు శరణాగతుల మగుదము. అమ్మ మనకగు నత్యాచారములవలనఁ గాపాడి, మనల నానందమయ బ్రహ్మస్వరూపమందుఁ బ్రతిష్ఠితులను జేసివేయును. అమ్మ యిచట "అవతీర్యాహం" అనుచు, జేసిన యవతార తత్త్వాభాసము ముందటి యధ్యాయమందు "ఏవం భగవతీ" మున్నగు మంత్రముల వ్యాఖ్యయందు బాగుగా వ్యక్తపడును.

ఇతి నారాయణీస్తుతిః ఏకాదశోఽధ్యాయః

పరదేవతార్పణమస్తు.

# దేవీమాహాత్మ్యము - రుద్రగ్రంథిభేదము.

## ఫలశ్రుతి

### ద్వాదశాధ్యాయము

ఓం. దేవ్యువాచ ఓం.

ఓం. ఏభిః స్తవైశ్చ మాం నిత్యం
స్తోష్యతే యః సమాహితః ।
తస్యాహం సకలాం బాధాం
శమయిష్యా మ్యసంశయః॥ ఓం. 1

దేవియనెను— ఎవ్వఁడు సమాహితుఁడై యీ స్తవములతో నన్ను నిత్యమును స్తుతించునో, వాని సర్వబాధలను నేను నిస్సంశయముగా శమింపఁజేయుదును.

వ్యాఖ్య:— దేవతలు కోరిన వరము లిచ్చి, యమ్మ సాధారణముగాఁ గొన్ని యుపదేశించినది. ఆ యుపదేశములనే ఫలశ్రుతి యందుము. అమ్మ మొదటిమాట, "ఏభిః స్తవైః" మధుకైటభవధమందు బ్రహ్మదేవుఁడు చేసిన స్తవము "త్వం స్వాహా" ఇత్యాదికము, మహిషాసురవధమందు ఇంద్రాదులు చేసిన స్తవము, దేవీదూత సంవాదమందు "నమస్తస్యై" స్తుతి, శుంభవధానంతమందు నారాయణీస్తుతి; ఈ సర్వస్తవములను గుర్తించియే మంత్రమందు "ఏభిః స్తవైః" అన్నది.

"సమాహితః" చిత్తము సమాహితమైనప్పుడే తప్పక స్తవాది పాఠఫలము లభించును. ఆ యవస్థయందు జ్ఞాతృ

జ్ఞేయాది త్రిపుటీజ్ఞానము సైతము లయించును. ఇచ్చట నట్టి సమాహిత దశమాట చెప్పఁబడలేదు. ఇచటి సమాహిత పదముచే, అమ్మపై పే చిత్తము స్థిరపఱచుట యని యెఱుఁగ వలయును. అమ్మయెడ దృష్టి నిలిపి చిత్తవృత్తిని మాతృ ముఖిగాఁ జేసి, స్తుతివాక్యములను సరియైన యర్థబోధముతో— "అర్థానుయాయి భావముతో" రసికుఁడై యథాసాధ్యముగా మాతృమహత్వకీర్తనము చేయఁగల్గినచో, సమాహితావస్థతో స్తుతిపాఠ మగును. మహత్వకీర్తన మన్నను, నామకీర్తన మన్నను నొక్కటే. అమ్మ మహత్వము కీర్తింపఁబడని పేరే లేదు. హరి, కృష్ణ, రామ, దుర్గా, శ్యామా, శివా, శంకర, మున్నగు నే నామస్మరణోచ్చారణము చేయఁబడనీ, ఆ నామముయొక్క యథార్థాభావమందు అభినివేశము చేయుటచేతనే చక్కఁగాఁ ప్రత్యేకనామమును మహత్వ మును దెలుపునదే, యని తెలిసిపోవును. బీజాక్షరములును దమలో గంపెడర్థమును, విత్తు తనలో వృక్షమును వలె, నిమిడ్చికొనియున్న నామములే. నామముతోనే సత్యార్థ జ్ఞానమనెడి సద్గురుని యావిర్భావమైనచో నిజముగా నా నామ ములు ప్రాణమయములును మహత్వమయములునై యభీష్ట దేవతను దగ్గరకుఁ దెచ్చిపెట్టును. కనుకనే సాధకులు చేయు నామకీర్తనముతోనే నామము ననుసరించియుండు భావము రసమయమగును. కావున నన్నిటికంటె ముందు మంత్రచైతన్య విషయమున నభిజ్ఞత నొందియుండుట — పూర్ణమైన యర్థ జ్ఞానము నొందుట — సాధకున కింతయుం దప్పనిది. మంత్ర చైతన్యము కలుగనంతదాఁక జపస్తుతి పూజోపాసనములన్నియు

ప్రాణహీనములే యనుకొమ్ము. అప్పుడవి అనుష్ఠానమాత్ర ముతోఁ బర్యవసించును. (ఈ "సాధన సామగ్రి" తొలుమాట యందును, నా "దేవపూజారహస్య"మందును మంత్రచైతన్య వ్యాఖ్యను జదువునది.)

సమాహితచిత్తముతో స్తోత్రపాఠము చేయఁగలవారినే అమ్మ సత్యముగా స్వయముగా సర్వబాధలను దొలఁగించి కాపాడును. ఏమి చేయును? ఎటులు చేయును? సమాహిత చిత్తముతో, సత్యార్థజ్ఞానముతో, సరళప్రాణముతో నీ వను చుందువే – "ధ్వాంతారిం సర్వపాపఘ్నం" అని యిట్లనుచునే చేయుచుండఁగా, అజ్ఞానాంధకారము తొలఁగుటయు, పాప క్షయ మగుటయు నీ చిత్తమందే పొడకట్టును. క్రమముగా నదే సంధారితమగును. ఏమనఁగాఁ జిత్తమందుఁ జక్కఁగా నాటుకొన్న భావము ఫలరూపమున వెలయును. చిత్త మెట్టి భావముతో ఘటితమగునో, అట్టిఫలమునే సరిగా నది తెచ్చును. ఈ విషయము యుక్తిచేఁ దెలియఁజెప్పుట కాదు. దీని ఫలము ప్రత్యక్షము. అది ప్రత్యక్షమగునప్పుడే దాని సత్యత ననుభ వింపఁగలరు. ఊరక నోరితోఁ జెప్పినఁ బనికాదు. పనిచేసినచోఁ దప్పక ఫలము కలుగును.

ఓం. మధుకైటభ నాశం చ మహిషాసుర ఘాతనమ్ ।
కీర్తయిష్యన్తి యే తద్వ ద్వధం శుంభనిశుంభయోః॥ ఓం.2

ఓం. అష్టమ్యాం చ చతుర్దశ్యాం
నవమ్యాం చైకచేతసః ।

శ్రోష్యన్తి చైవ యే భక్త్యా
మమ మాహాత్మ్య ముత్తమమ్॥ ఓం. 3

ఓం. న తేషాం దుష్కృతం కించి ద్దుష్కృతోత్థా న చాపదః।
భవిష్యతి న దారిద్ర్యం న చై వేష్ట వియోజనమ్॥ ఓం. 4

ఏకాగ్రచిత్తముతో, అష్టమీ నవమీ చతుర్దసులందు మధుకైటభనాశమును, మహిషాసురనిధనమును, శుంభనిశుంభ వధము ననెడి నా యుత్తమమాహాత్మ్యమును గీర్తించువారికిని, భక్తియుతులై వినువారికిని నెట్టి దుష్కృత్యములుగాని, దుష్కృతములవల్ల నగు నాపదలుగాని యుండవు. లేమి యుండదు. ఇష్టవియోగము జరుగదు.

వ్యాఖ్య :— పూర్వమంత్రమందుఁ గేవల స్తవపాఠ ఫలము తెలుపఁబడినది. ఈ మంత్రములందు సమగ్ర దేవీ మాహాత్మ్య పాఠఫలమును శ్రవణఫలమును గీర్తింపఁబడినవి. అష్టమీ చతుర్దశ్యాదుల యాధ్యాత్మికార్థము కీలకస్తోత్రమందుఁ జెప్పఁబడినవి. ఈ మంత్రములందు వ్రాయఁబడిన ఫలశ్రుతి యర్థవాదము కాదు. చెప్పినంతఫలము యథార్థముగా నబ్బును. సాధకుఁడు దేవి చెప్పిన రెండుమాటలయందు లక్ష్య ముంచవలయును.

దేవి "ఏక చేతసః, భక్త్యా" అన్నది. మొదటిది – దేని యం దెట్టిభేదములును లేవో అది "ఏకము" – ఏకవస్తువు. చిత్తమును దాని కభిముఖముగా నుంచవలయును. ఇఁక రెండవది – భక్తిపూర్వకముగా స్తోత్రాదిపాఠములను జేయవల

యును. దేవీవాక్యములందుఁ జెదరని విశ్వాసమును చిత్తమును దేవి కభిముఖముగాఁ జేయుటయు, అను రెండు నున్నప్పుడే దేవీమాహాత్మ్య కీర్తనమువల్లను శ్రవణమువల్లను యథార్థఫల మబ్బును; దుష్కృతాదులును దొలఁగును.

విశేష మేమనఁగా—మనమింతవఱకు దేవీ చరిత్రత్రయము నేభావముతో నాలోచనము చేసితిమో, యా తత్త్వమును స్థిరపఱచి యెవ్వరేని జండీపాఠమును జేసినను వినినను, వారిలో యథార్థమాతృస్వరూప ముద్భాసించును. వారికే దుష్కృతము లుండవు. కనుకనే వానివలని యాపదలును సంభవింపవు. ఇఁక దారిద్ర్యము మాట - అభావజ్ఞానము పేరే దారిద్ర్యము (లేదని తోఁచుట). "పూర్ణమదః పూర్ణమిదం" సత్తయందు నిల్చినవారలకు, అభావబోధముండనే చాలదు. కనుక మంత్ర మందు, ''భవిష్యతి న దారిద్ర్యం'' అని చెప్పఁబడినది.

''న చైవేష్ట వియోజనమ్'' ఇష్టవస్తువుతో నెడబాటు కాదు. పరమాత్మవస్తు వొక్కటే యిష్టము. దానితోడి వియోగ మేనాఁడునుం గాదు. ఇపుడొక సందేహము - పరమాత్మతో నెన్నఁడే నెవ్వనికేని వియోగమగునా? దేవీమాహాత్మ్య పాఠ శ్రవణఫలముగా నిట్టి యిష్టవియోగము కలుగదనుటవల్ల లాభ మేమి ? యని యాశంక. సరే, దానికి బదులేమనఁగా - పరమాత్మతో నెన్నఁడు నెవ్వరికిని, ఎడబాటు కాఁజాలదను వారలే సమాహితచిత్తముతో భక్తితో దేవీమాహాత్మ్యపాఠ శ్రవణము లొకప్పుడు చేసినవారలనియుఁ జేయువారలనియుఁ దెలియఁగల్గుదుము.

జ్ఞానికి, అజ్ఞానికి, ధార్మికునకు, అధార్మికునకు, నిష్ట వస్తువొక్కటే. అది యాత్మ. కామినీకాంచనములే తమ కిష్టమని తలంచువారలు సైతము, కొంచెము ధీరముగా విచారించినచో, ఆత్మకుఁ బ్రీతిని గూర్చుటకొఱకే కామినీ కాంచనములందాసక్తుల మగుచున్నామని తెలియఁగల్గుదురు. లోకమందెవ్వఁడును జాగతికవస్తువ్రకొఱకై యాత్మను గోరఁడు. ఆత్మకొఱకే పార్థివవిషయాన్వేషణమును జేయును. కనుకనే, ఆత్మ యొక్కటే యిష్టదేవుఁడు. దానితో దేవీమాహాత్మ్య తత్త్వాధిగాములైన సాధకుల కెక్కాలమందును వియోగము కలుగ లేదు. కలుగఁజాల దందురు.

మఱి సాధారణముగా—— ఇష్టవియోగ మనఁగానే పార్థివములైన యేవస్తువులో, ప్రియజనమో, ఇదివఱకుండి యిప్పుడు లేకుండుటే యని తలంచినను, హానిలేదు. ఏమనఁగా, దేవీమాహాత్మ్యతత్త్వము నెఱిఁగిన సాధకగణము, చచ్చిన ప్రియజనమునో, నష్టమైన ప్రియవస్తువునో, ఇచ్ఛామాత్రముగానే తమ హృదయమందుఁ జూతురు. ఛాందోగ్యమునందు నిమ్మాటయే చెప్పఁబడినది. కనుకఁ గార్యముచేఁ దత్త్వదర్శులైన సాధకుల కెట్టి యవస్థయందును నిష్టవియోగము కాదు.

మఱియు, "న చైవేష్ట వియోజనమ్" అను వాక్యమున కర్థము, "ఇష్టవియోగజన్యదుఃఖము కాదు." అది చెప్పుట చమత్కారమైన యర్థము. శ్రుతియు ''తరతి శోక మాత్మవిత్'' ఆత్మజ్ఞపురుషుఁడు శోకమును దాటును. అనఁగా శోకము వానినంటదని యర్థము.

ఓం. శత్రుతో న భయం తస్య దస్యుతో వా న రాజతః ।
న శస్త్రానలతోయౌఘా త్కదాచి త్సంభవిష్యతి॥ఓం. 5

శత్రువులు, దస్యువులు, రాజు, శస్త్రము, అగ్ని, జల ప్రవాహము అనువానివలన, దేవీమాహాత్మ్యపాఠకులకు నే నాఁడును నెట్టి భయమును గలుగదు.

వ్యాఖ్య:— సాధారణముగా దీని జాగతికార్థ మెల్ల రెఱింగినదే. రెండవ యర్థము చూడుఁడు – దేవీమాహాత్మ్యమును భక్తితో సమాహితచిత్తముతోఁ బఠించినను విన్నను శత్రుదమన మగును; దస్యుదళన మగును; శస్త్రాగ్ని జలప్లావ నాదులైన విపత్తులు తొలఁగును. ఇఁక రెండవవైపు చూడుఁడు– పాఠకులకు ఆత్మజ్ఞానప్రాప్తియు నగును. దానిఫలముగాఁ గామ క్రోధాది శత్రువు లెట్టి యనిష్టముఁ గలిగింపఁజాలరు. వివేక ధనమును హరించు మోహమనెడి దొంగబాధ యుండదు.

ఆత్మసాక్షాత్కారము కానంతదాఁకఁ బ్రబలప్రారబ్ధ సంస్కారవశమున సాధననుండి భ్రష్టుఁడగునెడి శంకయుండును అనియే సాధకులనేకులు శంకింతురు. గుప్తసంస్కారము లనెడి దస్యులు దురాక్రమణముచేసి, వారి యతికఠోర సాధనాలభ్య జ్ఞానమును, జ్ఞానమును, భక్తిని, సిద్ధిని పెనఁగి లాగికొందురను నదే దస్యుభీతి. అది పరమాత్మసాక్షాత్కారపక్షమున నగు బాటు మాత్రమే. ఏమన. అమ్మ తక్క మఱెచ్చట నేమియు లేదని వారెఱుఁగుదురు కదా. సత్యదర్శిసాధకుల కింత భయ మేమి ? పతన మేమి ?

ఆ వెనుక రాజభయము మాట — ఇంద్రియవర్గమునకు రాజు మనస్సు. దానివలనను భయ మింతయు లేదు. ఉండదు. మనశ్చాంచల్యము, విషయాభిముఖత్వము, ఆత్మవిత్పురుషుల యెడ నర్థహీనకార్యస్వరూపములే యైపోవును. లేదా, మనస్సు చంచలముగానే యుండనీ, స్థిరముగానే యుండనీ, ఆత్మాభిముఖయే కానీ, విషయాభిముఖయే కానీ, దానివలన ఆత్మకు వచ్చినదేమి ? 'నేను' ఆత్మ, అమ్మను. మఱి నాకు రాజభయమున (మనశ్చాంచల్యమున) నగునదేమి ? 'నన్నుఁ' దెలియలేని వారు నన్ను (నేనును) బట్టుకొనలేనివారుమాత్రమే, మనశ్చాంచల్య కారణమున సాధన భజనములు సాగకున్నవందురు. ఆ చాంచల్యముతోనే విడువక కొంతసేపు అమ్మను (ఆత్మను) జూచుచున్నచో అరగడియలోఁ జాంచల్యమడఁగి ధన్యులగుదురు.

"న శస్త్రానలతోయౌఘాత్" ఈ వాక్యము గీత (2-23) యందలి "నైనం ఛిందన్తి శస్త్రాణి నైనం దహతి పావకః । న చైనం క్లేదయంత్యాపః" యను దానితో సమానార్థము గల వాక్యమే. శస్త్రాగ్ని జలౌఘములవలన దాని కించుకంతయు బాధలేదు. గీతయందలి, యుపదేశ శిక్షాశ్రవణముల ప్రత్యక్షత, అనుభవము, ఆనందము నీ దేవీమాహాత్మ్యమందుఁగలవు.

ఓం. యస్మాన్మమైత న్మాహాత్మ్యం పఠితవ్యం సమాహితైః ।
శ్రోతవ్యంచ సదాభక్త్యా పరం స్వస్త్యయనం హి తత్ ॥ఓం6

సమాహిత చిత్తముతో భక్తితో నా యీ మాహాత్మ్యమును సర్వదా చదువుటయు వినుటయు సర్వమంగళజనకము. నిశ్చయము.

వ్యాఖ్య:— ఐహికసుఖములను గోరువారును, పారలౌకిక స్వర్గభోగాదులను గోరువారును, ముముక్షువులు నెల్లరును భక్తిపూర్వకముగా నేకాగ్రచిత్తముతో నీ దేవీమాహాత్మ్యమును జదువుటయు, వినుటయు శ్రేయస్కరము. ఒకసారి చదివి యెత్తిపెట్టినంతమాత్రాన సాఫల్యము లేదు.

అమ్మ యేమన్నది? "సదా పఠితవ్యం శ్రోతవ్యం చ" సర్వదా చదువవలయు, వినవలయు నన్నది. పలుసారులు చదువఁగాఁ జదువఁగా, వినఁగా వినఁగా, నీ చండీతత్త్వము నీ జీవనమందుఁ బ్రత్యేక కార్యముతోను సమన్వయించును. అవును; నీ జీవనగతి యాత్రాభిముఖమై దేవీమాహాత్మ్యమందుఁ జెప్పఁబడిన సాధనలు నీ జీవితయాత్రయందే యనుష్ఠింపఁబడుచుండుట నీవే తెలిసికొనఁగలవు. నానాఁటికి నసురులతో యుద్ధము సాగుచునే యుండును. అపుడే నీవు 'సదా' శబ్దమును బ్రయోగించి, దేవి సాధకుల నెక్కడికిఁ బొమ్మనెనో తెలిసికొందువు. అదే పరమ స్వస్త్యయనము. అనఁగా శ్రేష్ఠకల్యాణము. జాగతికములైన సర్వవిధకల్యాణములును దేవీమాహాత్మ్య పాఠ శ్రవణములవలనఁ జేకూరును. కనుకనే యమ్మ స్వస్తి లాభమున కిదొక్కటే యుపాయమన్నది. దీనిచేఁ బాఠకు లెవ్వరును, వేదవేదాంతాదులను విడిచిపెట్టి, కేవల దేవీమాహాత్మ్యపాఠ శ్రవణములనే చేయవలయును; కాకున్న శ్రేయ మబ్బదు, అనుకొనవలదు అట్టి యర్థము లేదు. ఎవరేని యథార్థకల్యాణకారియైన శాస్త్రగ్రంథము నాశ్రయించినపుడు వేదవేదాంతమే కానిమ్ము; దర్శనపురాణాదికమే కానిమ్ము; దానివలన హాని లేదు. సర్వశాస్త్రములందును జెప్పఁబడిన

దొకటే మాట. ఒకశాస్త్రమునకు మఱియొకశాస్త్రముతో విరోధములేదని తెలియఁగల్గినపుడే, శాస్త్రపాఠము సార్థకమగును. వేదశాస్త్రములును బ్రహ్మమును భిన్నములు కావు. కనుకనే వేదమునకును బ్రహ్మమని యొకపేరు. "వేదస్తత్త్వం తపోబ్రహ్మ" (కోశము) వేదాదిశాస్త్రములకును వ్యక్తిత్వమున్నది. అవి చైతన్యమయములైన జనములే. శాస్త్రరూపిణి యమ్మ కరుణించి, శ్రద్ధాళుపాఠకుని హృదయమందుఁ దాత్పర్యమును వెలయించును. అపుడే పాఠకుడు శాస్త్రరహస్యము నవధరింపఁగలఁడు. కనుకనే యా శాస్త్రముయొక్క విశిష్టకృప నొందుటకై కడుశ్రద్ధతో శాస్త్రగ్రంథమును బూజించి శాస్త్రపాఠము చేయుమని యుపదేశింతురు.

[నా వ్రాసిన "శాస్త్రసాధనము" చదువునది.]

శాస్త్ర మనఁగానే వేదోపనిషత్తులనియే తెలియనలయును. తక్కినశాస్త్రముల తాత్పర్య మెంతగా వేదము ననుసరించి యుండునో యంతగా వాని గౌరవము సురక్షితమగును. శ్రుతివిరుద్ధవాక్య మెన్నఁడును గైకొనఁదగియుండదు. చూడఁగానే శ్రుతివిరుద్ధముగాఁదోఁచు వాక్యమునకు శ్రుతి ననుసరించు నొక యర్థము చెప్పఁగలవేమో ప్రయత్నింపుము. ఆ ప్రయత్నము సఫలమగుటపేరే పరమస్వస్త్యయనము. పరమ కల్యాణము. శాస్త్రవాక్యములకు ఏకార్థవాచకత హృదయంగమమగుటచేతనే సంశయచ్ఛేదమనెడి పరమకల్యాణము ప్రాప్తించును. ఈ దేవీమాహాత్మ్యమందు, ఇట్టి సర్వశాస్త్ర సమన్వయము పరివ్యక్తమగుటే గొప్పవిశేషము. కావున దీని పాఠ శ్రవణములు యథార్థముగా స్వస్త్యయనములే. వ్యావహారిక

జగత్తునందు సైతము, గురుపురోహితులు, శిష్యులైన యజమానుల శాంతి పుష్టి కార్యములకై దేవీమాహాత్మ్యపాఠ (చండీస్తోత్రపాఠ) మనెడి స్వస్త్యయనమును జేయుదురు.

ఓం. ఉపసర్గా నశేషాంస్తు మహామారీ సముద్భవాన్ ।
తథా త్రివిధముత్పాతం మాహాత్మ్యం శమయేన్మమ॥ఓం 7

ఓం. యత్రైతత్పఠ్యతే సమ్య గ్నిత్యమాయతనే మమ ।
సదా న తద్విమోక్ష్యామి సాన్నిధ్యం తత్ర మే స్థితమ్॥ఓం 8

నా యీ మాహాత్మ్యము మహామారీ జనితములగు సర్వోపసర్గములను, త్రివిధోత్పాతములను తొలంచును. ఏ యింట నా యీ మాహాత్మ్యము నిత్యము పఠింపఁబడునో, ఆ యింటిని నేను విడువను.

వ్యాఖ్య:— దేవీమాహాత్మ్యపాఠమువలన మహామారియు, దానిచే నగు నుపసర్గములును శమించును. మహామారీ శబ్ద సాధారణార్థము జనపదధ్వంసక వ్యాధి (ప్లేగ్). ఉత్పాతోపసర్గముల విషయము నారాయణీస్తుతియందు జెప్పఁబడినది. మొత్తపుమాట యేమనఁగా – సమాహితచిత్తముతో భక్తితో దేవీమాహాత్మ్యమును జపవుటచే మూఁడువిధములైన యుత్పాతములు, మూఁడువిధములైన యుపసర్గములు, మహామారియు నణఁగిపోవును. ఆధ్యాత్మికార్థమున మహామారీపదముచేఁ బునః పునర్మృత్యువని తెలియవలయును. జననమరణ భయముచేతనే నానావిధములైన యుపద్రవములు వచ్చును.

మఱియు మరణము గల్గుటచేత నే మఱల జన్మగ్రహణ మనెడి భౌమనరకభోగము - ఆధ్యాత్మికాది త్రివిధతాపములు తప్పకగును. దేవీమాహాత్మ్యపఠశ్రవణములు (ఆత్మసాక్షాత్కార ముచే) ఉత్పాతోపసర్గ ప్రశమహేతుస్వరూపము లగును.

నిత్యము చండీపాఠమగునింట మన యమ్మ నిత్యసన్నిహి తయై యుండును. ఇది సాధారణార్థము. ఆధ్యాత్మికభావముచే, ఆయతనశబ్దార్థము భోగాయతనక్షేత్రమైన దేహము. అమ్మ, భోగాయతనక్షేత్రమందు నా మాహాత్మ్యము లెస్సగాఁ బఠింపఁ బడునో, యన్నది; అనఁగా దేవీమాహాత్మ్యపాఠకుని లోను వెలిని సదా, అమ్మ వెలయునని యర్థము. గీతా రాజగుహ్య యోగమందును, సరిగా నిట్టిమాటలే చెప్పఁబడినవి. 'యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్'.

[నా "రాజవిద్యాగీత" వ్యాఖ్య చూచునది.]

అగునమ్మా! చండీపాఠమగుచుండుచోట నీవు నిత్యము సన్నిహిత నగుదు నంటివి. మఱి, చండీపాఠము కానిచోట నీవు సన్నిహితవుకావా? వినుము - 'నేను' అన్నది లేని యాయతన మొకటి యున్నదా? వాస్తవముగా లేనే లేదు. గనుక, ఆయతన మేదియు నాకు అసన్నిహితము కాఁజాలదు. చెప్పెడి దేమనఁగా - నేను సదా సన్నిహితనై సర్వత్ర యుందునను మాట, భక్తితో నా భజనముచేయు- అనఁగా లెస్సగా దేవీ మాహాత్మ్య పాఠశ్రవణములను జేయువారే యెఱుంగఁగలరు. సాధకా! నీ వీ మంత్రార్థమును బక్కఁగాఁ దెలిసికొంటివా?

ఓం. బలిప్రదానే పూజాయా మగ్నికార్యే మహోత్సవే ।
సర్వం మమైతచ్చరిత ముచ్చార్యం శ్రావ్యమేవ చ॥ఓం. 9

ఓం. జానతా జానతా వాపి బలిపూజాం తథా కృతాం ।
ప్రతీచ్ఛిష్యామ్యహం ప్రీత్యా వహ్నిహోమం
తథా కృతమ్॥ ఓం. 10

బలిపూజా యాగయజ్ఞాదులైన యగ్ని కార్యములందును, మహోత్సవములందును నా యీ సర్వచరిత్ర కథాపాఠ శ్రవణాదులను జేయవలయును. తెలిసియో తెలియకో బలిపూజా హోమాదులు చేయఁబడునపుడు నే నా సర్వకార్యములను ప్రీతితో నందుకొందును.

వ్యాఖ్య :— పూజా హోమాది విధ్యుక్తకార్యములందును మహోత్సవాదిలౌకిక కార్యములందును, దేవీమాహాత్మ్య పాఠశ్రవణములను దప్పక చేయవలయును. దానిచే వైధ లౌకిక కర్మములు నిర్విఘ్నములుగా సుసంపన్నములగును. ఇది యీ మంత్రమునకు సాధారణార్థము. నేఁటికిని భారతభూమియందు సర్వత్ర యీ వ్యవహారము సాగుచునేయున్నది.

ఆధ్యాత్మికభావముతోఁ జూతము. బలిప్రదాన పూజా హోమాది వైధకార్యములును, మహోత్సవాది లౌకికకార్యములును, నావైపు (అమ్మవైపు - ఆత్మవైపు) లక్ష్యముంచి చేయఁబడునే, నవి సుసంపన్నములును శుభఫలప్రదములు నగును. ఏమనఁగా "అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభు రేవచ" (గీత. 9-24) ఒక్క నేనే సర్వయజ్ఞకర్మముల భోక్తను,

ప్రభువను. నా వైపే లక్ష్యముంచి కార్యములు చేయుటచే నవి శివమయములుగానే పరిణమించును. నేనే శివుఁడను. కర్మముగాను, అనుష్ఠానముగాను, కర్తృరూపముగాను, కర్మఫలరూపముగాను నేనే నిత్యము వెలయుదుననుట స్థిరపఱుచుకొని కర్మానుష్ఠానము చేయుటచే, సర్వకార్యములవలన నా చరిత్ర కథల యనుశీలనమగును. తత్ఫలముగాఁ గర్మములు సుసంపన్నము లగును.

సర్వకర్మములవలన, నొక్క నా పూజయే యగునని తెలిసినవారే జ్ఞానులు, విధిజ్ఞులు. వారినిగుర్తించియే "జానతా" యని ప్రయోగింపఁబడినది. ఈ విషయమందొక యాత్మ సంవేదనమునుం గలదు. "యోగ ధ్యాన జపార్చాది నామసంకీర్తనాని చ। అహం దేవ వియుక్తాని వితలాన్యాహ బ్రహ్మవిత్" యోగము, ధ్యానము, జపము, పూజ, నామసంకీర్తనము ననువానిలో నహం దేవయుక్తుఁడు కానంతదాఁక, నవియన్నియు వికలములే. అనఁగా – అతిసామాన్య ఫలదాయకములే. మఱియు వైధకర్మాదులను జేయునపుడు, ఇట్టి లక్ష్యముతో నెడసినవారిని గుఱించియే 'అజానతా' యనెడి పదము ప్రయోగింపఁబడినది.

దేవి, "తెలిసినవాఁడు, తెలియనివాఁడు నను నిర్వు రధికారులు చేసిన కర్మములను నేను ప్రీతితో నందుకొందు" నన్నది. ఏమనఁగా 'నేను' గాక మఱెక్కడను నేదియును లేదు. ఆ 'నేను'నకుఁ దక్క యజ్ఞభాగముల నందుకొను నధికారము మఱెవ్వరికిని లేదు. నేనే యందఱి కర్మములను ప్రీతితో నందుకొందును, గాని కొంచెము విశేషతయున్నది. జ్ఞానులైనవారే,

అనఁగా నా యెడ లక్ష్యముంచి కర్మానుష్ఠానము చేయువారు మాత్రమే, నేను ప్రీతితో గ్రహింతునని తెలిసినవారు. ఇఁక నజ్ఞానులు, అనఁగా నా యెడ లక్ష్యముంచక కర్మములను జేయువారు, నేను ప్రీతిపూర్వకముగా యజ్ఞభాగములను గ్రహింతునని తెలిసికొనఁజాలరు. జ్ఞానులు పత్ర పుష్ప ఫల జల హవిరాదులు సన్నుద్దేశించి యర్పించునపుడు, ఆ యర్పణకాలమందే వానిని ప్రీతితో గ్రహించుటను బ్రత్యక్షము చేసికొనఁగల్గుదురు. కనుకఁ గర్మానుష్ఠానకాలమందే వారికిని దృప్తి యగును. ఇఁక నజ్ఞానిజనులు, ఆ సౌభాగ్యము లేకుందురు. అగుఁగాక, రెండుస్థలములందును నేను మాత్రము ప్రీతిసహిత పరిగ్రహణము చేయుటయందు సందియము నవ్వంతయు లేదు. "ప్రతీచ్ఛిష్యామ్యహం ప్రీత్యా".

బలిసంబంధమందును నొకటి రెండుమాటలు – అప్రాసంగికములు కావు. మాంసప్రియులైనవారు మేఁకలు మొ॥ బలులిత్తురు – వారిపక్షమం దదే విహితము. ఉచ్ఛృంఖలముగా (కట్టుబాటులు లేక) వృథా మాంసభోజనము చేయించుటకే శాస్త్రము బలిదానములను జెప్పలేదు. రాజసికపూజయందీ బలిదానము నిషిద్ధముకాదు; గాని సాత్త్వికప్రకృతిగలవారలై, మత్స్యమాంస పరిత్యాగులై, సర్వజీవులను నొక్కప్రాణముగానే చూచువారి పక్షమున, ఛాగాది పశుబలిదానము కేవల మసంభవము. (నా "దేవపూజారహస్య" గ్రంథమున బలిదాన రహస్యమును జదువునది.)

మఱియొకశ్రేణికిఁ జెందిన సాధకులు నిర్విచారముగాఁ బశుబలిదానము చేయుదురు. వారు తమ బిడ్డలను సైతము.

చెదరని హృదయముతో దేవి నుద్దేశించి బలిదానము చేయ నోపుదురు. వారి జోలి మన కేల? మంత్రమందు బలి శబ్దమునకుఁ బూజోపహారములని యర్థము చెప్పుటయే సర్వసమంజసము.

ఓం. శరత్కాలే మహాపూజా క్రియతే యా చ వార్షికీ ।
తస్యాం మమైత న్మాహాత్మ్యం శ్రుత్వా భక్తిసమన్వితః॥ఓం11

ఓం. సర్వబాధా వినిర్ముక్తో ధనధాన్య సుతాన్వితః ।
మనుష్యో మత్ప్రసాదేన భవిష్యతి న సంశయః॥ ఓం. 12

శరత్కాలమునఁ జేయఁబడు నా మహాపూజయందు భక్తితో నీ నా మాహాత్మ్యపారాయణ శ్రవణములను జేయు మనుజుఁడు, నా ప్రసాదముచే సర్వబాధలు తొలఁగి ధనధాన్య సంతానవంతుఁడగును.

వ్యాఖ్య:— ఈ దినములందును భారతదేశమునం దనేక స్థలముల శరత్కాలీనమహాపూజ జరుగుచున్నది. గాని, మంత్రమందుఁ జెప్పఁబడిన ఫలము నొందువారు కడుం గొలఁది మందియే. దీని కొక్కటే కారణము - వారు సమాహితచిత్తముతో భక్తితో యథావిధిగా మహాపూజ చేయకుండుటయే. ముఖ్యమైనమాట - మనుష్యులు ధనధాన్యయుక్తులగుదురనెడి దేవీవాక్యమందు విశ్వాసము నిల్పలేదు. సంశయము నవిశ్వాసము నుండుటచేతనే, యీ యుగమందు వైధకర్మము లేవియు నాశానురూపఫలముల నీయకున్నవి.

శరత్కాలము:— ఇది క్షీతితత్త్వమును ప్రకటించు ఋతువు. ఈ దేశమున ఋతువులు సైతము తత్త్వవిశేషము

లను సూచించును. ప్రసంగవశమున నిది వినుఁడు. శరదృతువు క్షితితత్త్వము. వర్షర్తువు (అప్తత్త్వము). గ్రీష్మర్తువు తేజస్తత్త్వము. వసంతర్తువు వాయుతత్త్వము. హేమంతర్తువు వ్యోమతత్త్వము. కార్తికమాసము, శరదృతువునందలి ఆగ్రహాయణ (మార్గశిర) మాసము, శరదృతువునం దంతర్గతము. (ఇది సౌరమానమునుబట్టి వ్రాసినది.) ఎప్పు డే తత్త్వముయొక్క విశేష మభివ్యక్తమగునో, అప్పు డీ విశ్వప్రకృతియందలి ఆ తత్త్వక్రియ విశేషించి వెలయును. సరే. ఇపుడు మనము శరత్కాల కథను గైకొందము. ఈ శరత్తున క్షితితత్త్వముయొక్క – ఘనీభూత జడత్వముయొక్క విశేషాభివ్యక్తి యగును. ఈ శరత్కాలీయ పూజను జేయువారు, అనఁగా జడత్వాధిపత్యముగల యిక్కాలమందుఁ జైతన్యమయియైన, యమ్మయొక్క విశేష ప్రతిష్ఠను జేయువారు, అనుష్ఠానప్రయత్నములను జేయువారు – పూజయందు – పఠన శ్రవణ బలిదాన హోమముల నెడి నాలుగంగములను నడుపువారు మాత్రమే మహాపూజానుష్ఠాతలు. మహాపూజాంగములుగా దేవీమాహాత్మ్య పారశ్రవణములు చేయుదురు. వారు సర్వబాధలవలన – ఆసురికవృత్తులవలని యుత్పీడనమువలన విముక్తులగుదురు. ధనధాన్య సుతాన్వితులగుదురు. ప్రేమ (భక్తి) యనెడి ధనము, విశ్వాసమనెడి ధాన్యము, నిర్మలజ్ఞానమనెడి పుత్త్రిలను బడసి సుఖింతురు. అమ్మను బూజించి సమాహితులై చండీపారశ్రవణములను జేయువారికిఁ బ్రేమ ధన (భక్తి) దారిద్ర్య ముండదు. విశ్వాసమనెడి ధాన్యముతో (ఖాద్యసంభారముతో) వారి హృదయాంగణ మెల్లపుడును నిండియుండును. మఱియు, జ్ఞానమయ

పుత్త్రజన్మ సౌభాగ్యమునొంది పునః పునర్జనన మృత్యువులనెడి నరకమునుండి తొలఁగుదురు.

ఓం. శ్రుత్వా మమైత న్మాహాత్మ్యం తథా చోత్పత్తయః శుభాః ।
పరాక్రమం చ యుద్ధేషు జాయతే నిర్భయః పుమాన్ ॥ఓం13

ఓం. రిపవః సంక్షయం యాన్తి కల్యాణః చోపపద్యతే ।
నందతేచకులంపుంసాంమాహాత్మ్యంమమశ్రృణ్వతామ్॥ఓం14

దేవీ మాహాత్మ్యమందు దేవియొక్క వివిధములైన శుభోత్పత్తుల – అనఁగా మంగళకరములైన యావిర్భావముల వర్ణనము చేయఁబడినది. మహారాజు సురథుఁడు "కథముత్పన్నా" యని తొల్తఁ బ్రశ్నించినదానికిఁ బదులీయఁబడుచున్నది.

వ్యాఖ్య:— మహర్షి మేధసుఁడు పలువిధములైన దేవి యావిర్భావములను వర్ణించెను. ఈ దేవి యుత్పత్తివివరణమును సమాహితచిత్తముతోఁ జదువుటచేతను వినుటచేతను, యుద్ధపరాక్రమము లభించును. అనఁగా, ఆసురీవృత్తులను మట్టుపెట్టఁగల సామర్థ్యము గలుగును. నిర్భయత్వమనెడి లాభమొకటి కల్గును. ఆత్మయొక్కటే యభయము. శ్రుతియు మాటిమాటికి నభయస్వరూపమైన యా యాత్మలాభమునే యుపదేశించినది. "అభయం వై ప్రతిపద్యస్వ" "వత్స! నీవు అభయమును, అమృతస్వరూపము నైన యాత్మ నొందుము" అని యుపనిషత్తులందుఁ జెప్పఁబడిన యభయవాణియే, దేవీ మాహాత్మ్యమందును, బలుతావులఁ గనఁబడును; వినఁబడును. అది తెలియఁజూపుటకే, యింత యధ్యవసాయము.

సరే; మంత్రమందు దేవీమాహాత్మ్యశ్రవణము చేయు వారికి రిపుక్షయమగునని యున్నది. రిపుక్షయమనఁగా - కామ క్రోధాది శత్రుదమనమని యెఱుంగునది. పక్షాంతరమున - ఆ శత్రువులయెడ సాధకులకుఁగల విద్వేషము తొలఁగి సర్వత్రాత్మ దర్శన ఫలముగా రాగద్వేష విముక్తులై విషయములను, నిర్వికారముగా భోగించు సామర్థ్యము గలుగును. "కల్యాణం చోపపద్యతే" - మంగళము నొందుదురు. ఆత్మజ్ఞానమే యథార్థమైన కల్యాణము. ఆత్మజ్ఞానము కలుగుటచే జనన మరణరూపమైన యమంగళము పూర్తిగాఁ దొలఁగిపోవును. "నందతే చ కులం" కుల మానందించును. ఆత్మజ్ఞపురుషుఁడు (వంశమందు) కులమందుఁబుట్టినచో, ఆ కులమందలి యూర్ధ్వతన పురుషులు, ఆనందముతో నృత్యము చేయుదురు. ఏమన, వారి ముక్తిమార్గము సుగమమగును. మఱియు, ఆ కులమందలి యధస్తనపురుషులు ఆత్మజ్ఞపురుషుల కృపచే శుభాశీర్వాద ముచేఁ బరమకల్యాణము నొందుదురు. సాధారణుల పక్షమున - కేవల దుర్లభములైనవి వారి కులమందు, అప్రయత్నలభ్యము లగును. కావున నాత్మజ్ఞాని యొకవంశమందు వెలసినచో నందలి యూర్ధ్వతనులు, నధస్తనులు నైనవార లానందితు లగుదురు. "కులం పవిత్రం జననీ కృతార్థా వసుంధరా పుణ్యవతీ చ యేన."

ఓం. శాంతికర్మణి సర్వత్ర తథా దుఃస్వప్నదర్శనే ।<br>
గ్రహపీడాసు చోగ్రాసు మాహాత్మ్యం శృణుయాన్మమ॥ఓం15

ఓం. ఉపసర్గాః శమం యాన్తి గ్రహపీడాశ్చ దారుణాః ।<br>
దుఃస్వప్నంచ నృభిర్దృష్టం సుస్వప్న ముపజాయతే॥ఓం16

శాంతికార్యములందును దుఃస్వప్నదర్శనమందును ఉగ్ర గ్రహ పీడలయందును, నాయీమాహాత్మ్యమును వినవలయును. దానిచే నుపసర్గములెల్ల నుపశమించును. దారుణ గ్రహపీడలు తొలఁగును. నా మాహాత్మ్యము వినువారు కాంచిన దుఃస్వప్నములు సుస్వప్నములుగాఁ బర్యవసించును. (ఇచట నొక గ్రహ శబ్దమునకు సూర్యాదిగ్రహములని గ్రహింపవలయును.)

వ్యాఖ్య:— దేవీమాహాత్మ్యశ్రవణమున నివియే ఫలములు. ఇంతకు ముందటి రెండుమంత్రములందును 'శ్రుత్వా-శృణ్వతాం' శబ్దములచేఁ గేవల శ్రవణకథయే చెప్పఁబడినది. సాధకా! శ్రవణమే మొట్టమొదటి ప్రధానసాధనము. ఎవని శ్రవణ మెంత విశుద్ధమును సత్యావగాహియు నగునో, వానికా ఫల మంతగా శీఘ్రఘులభ్యము ను సునిశ్చితము నగును. శ్రవణమే మనన నిదిధ్యాసములకు శ్రేష్ఠసాధనమని శ్రుతియే చెప్పినది. శ్రవణము విశుద్ధము కాక, మననము విశుద్ధము కాఁజాలదు. మననము సరిగాఁ గాకున్నచో నిదిధ్యాసనఫలము వ్యర్థమగును; గనుక నెవని శ్రవణ మెం తెంత విశుద్ధముగానుండునో, వాని కా ఫలమును నంత సునిశ్చితముగా నుండును. ఈ శ్రవణము సరిగా, నే యుపాయముచే నగును? — అన్నిఁటికిని ముందుగా శ్రోత (వినువాఁడు) వినయవంతుఁడును, శ్రద్ధావంతుఁడును దప్పక కావలయును. తరువాత వక్త (చెప్పెడివాఁడు) ఆత్మతత్త్వము నుపదేశించువాఁడు, భ్రమ ప్రమాదములు లేనివాఁడును, సంశయచ్ఛేదిపాండిత్యము కలవాఁడునై యుండవలయును. సౌభాగ్యవశమున, ననేకజన్మ పుణ్యఫలముగా నట్టి వక్తయు, శ్రోతయుఁ గూడినపు డచ్చట నిస్సంశయ

ఫలావాప్తి సిద్ధముగా నుండును. ఈ యిరువురియందును పైని జెప్పిన యోగ్యతలు లేనియెడల శ్రవణసాధనము ఫలింపదు. చెప్పెడివాఁడు మూఁగవాఁడు, వినెడివాఁడు చెవిటివాఁడు నైనచో నెంత యందమో, యంతే యందము. ఉభయులును శ్లేశితులే యగుదురు.

సరే; మంత్రమందు వ్రాయఁబడినది — శాన్తికర్మ మందు, దుఃస్వప్నదర్శనమందు, ఉగ్రగ్రహపీడలయందు, నీ దేవీ మాహాత్మ్య శ్రవణము చేయుదురు. సాధకా! చూడుము; నీ కెప్పుడును శాన్తి లేమియే, ప్రతినియతదుఃస్వప్నమును గాంచుచున్నావు. విషయములనెడి గ్రహములు నిన్ను రేవగల్లు పీడించుచున్నవి. యథార్థశాన్తిని గోరుదువేని, దుఃస్వప్నపీడ తొలఁగఁ గోరుదువేని, దారుణగ్రహపీడ కాకుండఁ గోరుదువేని నా మాహాత్మ్యమును వినుము. వినుటచేతనే మనన నిదిధ్యాసము బలియును. అపుడు నీకాత్మజ్ఞానముగల్గి ధన్యుఁడవగుదువు. నీకపు డెడతెగని శాన్తి గలుగును. ఇంద్రియోత్పీడనమును, సంసార దుఃస్వప్నమును దొలఁగిపోవును. నా మాహాత్మ్య శ్రవణఫల మిదే.

ఓం. బాలగ్రహాభిభూతానాం బాలానాం శాన్తికారకం।
సంఘాతభేదే చ నృణాం మైత్రీకారకముత్తమమ్॥ఓం17

ఓం. దుర్వృత్తానా మశేషాణాం బలహానికరం పరం।
రక్షోభూత పిశాచానాం పఠనాదేవ నాశనమ్॥ ఓం. 18

ఓం.సర్వం మమైత న్మాహాత్మ్యం మమ సన్నిధికారకమ్॥ఓం19

నా యీ సమస్త మాహాత్మ్యపాఠము నా సాన్నిధ్యమును సంపాదించునది, గాన నిది బాలకుల బాలగ్రహపీడను

శాన్తింపఁజేయును. మనుజులయందగు నన్యోన్య వివాదములను దొలఁచి మైత్రిని గలిగించును. దుర్వృత్తుల బలము నణంచును. రాక్షస భూతపిశాచముల నశింపఁజేయును.

వ్యాఖ్య:— ఇమ్మూఁడు మంత్రములందును మూఁడవది హేతువుగాఁ జెప్పఁబడినది. దాని కారణము ముందుగా నెఱుంగవలయును. నా మాహాత్మ్యము నా సాన్నిధ్యమును గల్గించునని చెప్పఁబడినది. దేవీమాహాత్మ్యపాఠ మగుచోట, నమ్మ సన్నిహితయగునని - అమ్మ సాన్నిధ్యము గల్గుటచే, అనఁగా విశుద్ధచైతన్యాత్మ ప్రకాశించుటచేతనే సర్వ విపత్తులును, విఘ్నములును దొలఁగును. బాల శబ్దార్థము శిశువు - అనఁగా నజ్ఞానము. వానిపై నగు గ్రహాక్రమణము. అనఁగా, అజ్ఞానమువల్ల నగు దుఃఖాదులన్నియుఁ దొలఁగును.

"సంఘాతభేదే చ నృణాం మైత్రీకారక ముత్తమమ్" జీవుల పరస్పర భేదజ్ఞానములు తొలఁగును. మైత్రి కలుగును. అమ్మ (ఆత్మ) యొక్కటెయే సర్వమందును సమభావముతో వెలయునని, మనుష్యుఁ డపు డెఱుంగును. ఆత్మయే మనుష్యమాత్రునకుఁ బ్రియతమము. అది సర్వత్ర విరాజిల్లును; గనుక భేదజ్ఞాన ముఁడఁజాలదు. పరస్పర మైత్రీభావము తనంతనే పుట్టును.

"దుర్వృత్తానాం బలహానికరం"— అసచ్చారిత్రులు బలహీనులగుదురు; అనఁగా, అసద్భావము నొందిన జీవుల ప్రకృతి బలహీనమైపోవును ఒక్కసారిగా నశింపదు. దేహముండునంతదాఁక జీవప్రకృతి యుండనే యుండును, గాని బలహీనమైపోవును. రాక్షస పైశాచికవృత్తు లడఁగును. భూత

ప్రకృతి యనఁగా భూతములయందైన యాసక్తి. అనఁగా భూత భౌతిక పదార్థములయందైన నిత్యత్వబోధము కూడ లయించును. "రక్షోభూత పిశాచానాం నాశనం" అనఁగా నిదే తాత్పర్యము. గ్రహగణవిషయము - సూర్యుఁడు ఆత్మరూపమునఁ, జంద్రుఁడు మనోరూపమున, కుజుఁడు (మంగళుఁడు) బలశక్తి క్రోధరూపమున, బుధుఁడు వాక్య స్మృతిరూపమున, బృహస్పతి విద్యా బుద్ధి జ్ఞాన ధర్మ సుఖరూపమున, శుక్రుఁడు కామ కామనారూపమున, శని మందగతిరూపమున, రాహువు అతృప్తభోగహరణరూపమున, కేతువు అనుభూతిహీన గగన కుసుమములఁబోలు ననంతకల్పనలరూపమున నభివ్యక్తులగుచుందురు. విశేషయోగాయోగము లగునపుడు, జైమిని మతముచేఁ గేతువు కైవల్యకారకుఁడే, కాని పూర్ణముక్తినిచ్చువాఁడు బృహస్పతియే.

ఓం. పత్ర పుష్పౌఘ ధూపైశ్చ గంధదీపై స్తథోత్తమైః।
విప్రాణాం భోజనై ర్హోమైః ప్రోక్షణీయై రహర్నిశమ్॥ఓం20

ఓం. అన్యైశ్చ వివిధై ర్భోగైః ప్రదానై ర్వత్సరేణ యా।
ప్రీతిర్మే క్రియతే సాస్మిన్ సకృత్సు చరితే శ్రుతే॥ ఓం. 21

పత్ర పుష్ప ధూప గంధ ద్రవ్య దీపాములతోఁ బూజయు, బ్రాహ్మణభోజన హోమాభిషేకాదులును, నానావిధ భోగ్య వస్తుప్రదానములు అను వీనితో నొక సంవత్సరకాలము ప్రతి దినము నన్ను సేవించినచో నేనెంతగాఁ బ్రసన్న నగుదునో, యంతగా నా చరిత్ర నొక్కసారి సుష్ఠుగా వినుటచేతనే ప్రసన్న నగుదును.

వ్యాఖ్య:— అమ్మ యనుచున్నది - బాహ్యకర్మానుష్ఠానమునుబట్టి చూడఁగా శ్రవణమున నగు ఫలమే యధికమని, యనేకవిధముల యుత్కృష్టోపచారములతోడి పూజయు బ్రాహ్మణ భోజనాభిషేక భూరిదానాదులగు వైధకర్మ నియమములతో దీర్ఘకాలము చేయు ఫలముగా మనుష్యుఁడు చిత్తశుద్ధిని స్వస్వరూపజ్ఞానమును, నా సమీపస్థితియు నెంతగాఁ బొందగల్గునో, యంత చిత్తశుద్ధిని, అంత జ్ఞానమును, అంత సమీపస్థితిని - సమాహితుఁడై శ్రద్ధాళుఁడై నా చరిత్ర మాహాత్మ్యముల నొక్కసారి వినినంతనే పొందఁగల్గును. సద్గురుముఖమున సద్వైతజ్ఞానరహస్యముల వినుటచే, సజ్ఞానాంధజీవునకును క్షణకాలము కొంత ప్రబుద్ధభావము వచ్చును - "నేనెవరు? జగత్తనఁగా నేమి? ఈశ్వరుఁ డనఁబడువాఁ డెవ్వఁడు? అతనితో నాకెట్టి సంబంధమున్నది? అతని నెఱుంగుటచే నాకేమి లాభము ?" ఈ మున్నగు తత్త్వవిషయకపరీక్షాజ్ఞానము కేవల శ్రవణఫలముగానే లభించును. ఈ తత్త్వవిషయక పరీక్షాజ్ఞానమే మాతృప్రీతితోఁ బరిచయము గలిగించును. ఆత్మ, తాను ప్రకాశించుచోట నిట్టిభావముతోనే, తన ప్రీతిని వెలయించును.

పూజాహోమాదులు, భూరిదానాదులు, దీర్ఘకాలము చేయు ఫలముగా నగు చిత్తశుద్ధి, దీని నెఱుంగఁజాలినంతనే కలుగును. శ్రీ శంకరాచార్యులు కర్మకాండమును బట్టి చూడఁగా, శ్రవణ మననాదులకే యధిక ప్రాముఖ్యమును బలమును సూచించిరి. అగును. తత్త్వజ్ఞానరహస్యహీనమై ప్రాణహీనమైన కర్మకాండ దీర్ఘకాలానుష్ఠానమునుబట్టి చూడ, నొక్కసారి తత్త్వజ్ఞానోపదేశశ్రవణము చేయుటచేత ఫల మధికమే. ఇందు

సందియము లేదు. మఱియు నీ కర్మకాండానుష్ఠానమును బట్టి చూడఁగా, శ్రద్ధా భక్తి తత్త్వజ్ఞాన ధారణముల కుపయోగించు ధీవికాశ మగుననుటయుఁ గడుసత్యము. సరే, కర్మకాండమును విడిచి కేవల శ్రవణ మననములే చేసినచో నదికాదా? యనెడి జిజ్ఞాస కలుగవచ్చును – కాదు; కర్మకాండమే శ్రవణ మనన సామర్థ్యమును బుట్టించునది. ఎవ్వనికైనను గర్మకాండమును విడుచు యథాయోగ్యత వచ్చినపుడైనను, లోకశిక్షణమున కై వానికి విధివిహితమైన కర్మముల ననుష్ఠించుట నిందనీయము కాదు. సరిగదా, మిగులఁ బ్రయోజనకారియే. ఏమనఁ గర్మ కాండమే, ఈ హిందుజాతియొక్క ముఖ్యవిశిష్టత. అది లోపించినను, అది నిష్ప్రయోజనమని విడిచినను, ఆ ఫలము జనసమాజమందు వ్యాపించి, కొలఁదిదినములలోనే యీ దేశముకూడ మ్లేచ్ఛదేశముగాఁ బరిణమింపఁగలదు. కావున నట్టి యాశంకలు చేయుట యన్యాయము. సాధకా! నీవు యథార్థముగాఁ గర్మకాండముతోఁ బైకెక్కుటయినను, ఆ తత్త్వజ్ఞానమనెడి గోడపై నిల్చియుండి ప్రాణమయ కర్మానుష్ఠానమును జేయుము. గీతయందు శ్రీగురుఁ డన్నాఁడు: "కర్తవ్య మనుచు నేమియు లేకున్నను, గేవల లోకస్థితిరక్షకై శాస్త్ర విహిత కర్మానుష్ఠానము చేయుటే యుచితము" అని.

"కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః।
లోకసంగ్రహ మేవాపి సంపశ్య న్కర్తుమర్హసి॥"

జనకాది కర్మిజనులు కర్మముచేతనే పూర్ణసిద్ధి నొందిరి. ముఖ్యముగా లోకసంగ్రహము నెడ, నిగా యుంచి, నీవుఁ గర్మ మాచరించుటే యుచితము. జన్మము నిచ్చువాఁడు జనకుఁడు,

ప్రాణాయామాదికమనెడి నాఁగేటిని సాగించి కర్మక్షేత్ర (శరీర) మనెడి పొలమును దున్ని, సీతయనెడి శుద్ధబుద్ధి నొందినవాఁడే జనకుఁడు. అతఁడే యుంజానయోగి - అనఁగాఁ బరమాత్మతో నైక్యమొందుటకై యోగాభ్యాసము చేయువాఁడు. "జనకాదయః" అనుటచే శుద్ధబుద్ధి లభించిన పూర్వసాధకు లెల్లరును గర్మముచేతనే సంసిద్ధిని, అనఁగా బ్రాహ్మీస్థితి నొందిరి." అని యర్థము చేసికొనునది, యని శ్రీగురుఁడనెను.

లోకసంగ్రహము - అనఁగా భూలోకము మొదలు సత్యలోక పర్యంతమైన లోకము లేఁడును దేనియందు సంగ్రహింపఁబడునో - అనఁగా దేనియందు, మూలాధారమందలి భూలోకము లయమై స్వాధిష్ఠానమందు భువర్లోకముతోఁ జేరి, తర్వాత భువర్లోకమును జేర్చికొని మణిపురచక్రమున స్వర్లోకమందును, స్వర్లోకము అనాహత మహర్లోకమందును, మహర్లోకము విశుద్ధ జనోలోకమందును, జనోలోకము ఆజ్ఞామందలి తపోలోకమందును, తపోలోకము సహస్రార సత్యలోకమందును, నీ విధముగా లయయోగముచేసి, చేరఁగాఁజేరఁగా, నొక్కటే యైన సత్యబ్రహ్మమందు శేషించిపోవును. దానియందు దృష్టి యుంచి యతిసావధానయై కర్మములు చేయవలయును.

గమనింపు — ప్రాణాయామముచేత మాత్రమే యీ లోకసంగ్రహము చేయఁగల దృష్టి స్థిరపడును. (ముందు 25 వ శ్లోకము చూచునది.) ఏవిధముగా దృష్టి నిల్పి క్రియచేయుటో యనుదాని ప్రథమప్రకరణము శ్రీ గురుదేవునిఁ జేరి నిర్ణయించుకొనవలయును. తరువాత, క్రియాయోగమునందు నిజబోధముచేఁ గ్రమముగా నన్నియుం దెలియును.

"సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథాసక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్॥"
(గీత. 3-25)

ఓయి! భారతా! "భాయాం రతః భారతః" (ఆత్మ ప్రకాశమం దాసక్తికలవాఁడు భారతుఁడు.) అవిద్వాంసులు కర్మమునం దాసక్తిగలవారలై చేయునటులే, విద్వాంసులును లోకసంగ్రహమును జేయఁగోరి అనాసక్తులై కర్మము (యోగము) చేయవలయును.

బుద్ధిచేఁ జలింపఁజేయఁబడినవారై, జీవులు తమ యింద్రియసుఖములనే వెదకుదురుగాని, విచారబుద్ధి నాశ్రయింపకుండుటచే, ఆ సుఖస్వరూపము నెఱుఁగఁజాలరు. వారే యవిద్వాంసులు. ఇఁక విచారబుద్ధినవలంబించి, వైరాగ్యముతో విషయానందమును విడిచి పరమానందమునొందఁ బ్రయత్నించు వారే విద్వాంసులు. అవిద్వాంసులు "ధనందేహి యశోదేహి పుత్త్రాన్దేహి రిపూన్జహి" మున్నగు వాసనలయం దాసక్తులై, కఠోరమైన యుద్యమముతోఁ గర్మమాచరించునట్లే విద్వాంసులును సరిగా, నట్టి యుద్యమముతోనే తగులము (ఆసక్తి) పూర్తిగా విడిచి కర్మములు చేయునపుడు, లోకసంగ్రహము చేయఁగలరు. అనఁగా మూలాధారాది స్థానములనుండి వృత్తుల నాకర్షించుకొని లయయోగముచే సత్యబ్రహ్మమందు నిల్వఁగలరు.

గమనింపు— విచారబుద్ధి లేకుంటచే సుఖస్వరూపము తెలియఁబడనందున, అవిద్వాంసు లాసక్తితోఁ జేయు కర్మ విధానమందు, వారు విషయములనే యీశ్వరునిపేర నాథా

ధింతురు. అట్టివారు కర్మఫలముగా భోగదేవిచేతనే యాకర్షింపఁబడి భోగమందే యాసక్తులై, యస్థిరులై యుండి, యథార్థసుఖచ్ఛాయయు ననుభవింపఁజాలరు.

దేశపక్షమున వారే యథార్థ మంగళజనకులు. ఉన్నదేదో యది పాడుచేయకు. రక్షించుటకుఁ బ్రయత్నింపుము. మృతకర్మములను బ్రాణమయములుగాఁ జేయుము. అవశ్యము కల్యాణప్రాప్తి యగును.

ఈ మంత్రమందుఁ గానవచ్చునది — అమ్మ యనుచున్నది. "ప్రీతిర్మే క్రియతే" నాకుఁ బ్రీతిగల్గించుట యగును. అమ్మ కింతయు నప్రీతి లేదు. ఆమె నిత్యప్రీత; నిత్యతృప్త; అపుడామెకుఁ బ్రీతి గల్గించుటనేమి? వాస్తవముగా నామెకప్రీతి యింతయు లేదనుట సత్యమేయైనను, ఆమె ప్రీతయగు తత్త్వమును శ్రద్ధాభక్తులతో దేవీమాహాత్మ్యమునుజదువువారు, వినువారు, మాత్రమే హృదయంగమ మొనర్చుకొందురు.

ఓం. శ్రుతం హరతి పాపాని తథారోగ్యం ప్రయచ్ఛతి ।
రక్షాం కరోతి భూతేభ్యో జన్మనాం కీర్తనం మమ॥ఓం. 22

ఓం. యుద్ధేషు చరితం యన్మే దుష్టదైత్య నిబర్హణం ।
తస్మిన్ శ్రుతే వైరికృతం భయంపుంసాం నజాయతే॥ ఓం23

ఓం. యుష్మాభిః స్తుతయో యాశ్చ యాశ్చ బ్రహ్మర్షిభిః కృతాః ।
బ్రహ్మణాచ కృతాస్తాస్తు ప్రయచ్ఛన్తి శుభాంమతిమ్॥ ఓం.24

నా యావిర్భావ వివరణములను వినుటచేతను, గీర్తించుటచేతను మనుజుల పాపములు తొలఁగును. ఆరోగ్యము

గలుగును. భూతరక్ష యగును. యుద్ధములయందు దుష్టదైత్యులను గూల్చిన నా చరిత్రములను మహాత్త్వమును వినుటచే మనుజులకు శత్రుభయ ముండదు. దేవతలారా! మీరు నన్ను స్తుతించితిరి. బ్రహ్మర్షులు స్తుతించిరి. బ్రహ్మయు స్తుతించెను. ఆ స్తవములను బఠించినవారికి శుభమతి లభించును.

వ్యాఖ్య:— ఫలశ్రుతి వాక్యములందు ఒక విధమైన కథయే పలుసారులు వ్రాయఁబడినది. ఈ పునరుక్తినిఁ గన్న యల్పబుద్ధులు తప్పక సంశయింతురు. మన మిప్పుడు మంత్ర మందలి కొన్ని మాటల యర్థమును జూతము.

"పాపాని హరతి" పాపములను హరించును. అనాత్మబోధము పేరే పాపము. ఆత్మకంటె నతిరిక్తముగా నెన్నఁడేని దేనియేని ప్రతీతియున్నంతవఱకుఁ బాపమే. ఈ మాతృమహత్త్వ మాతృస్వరూప శ్రవణ మననములను బలుసారులు చేయుటచే "ఆత్మైవేదం సర్వమ్" అనెడి జ్ఞానము గల్గును గాన, వారి సర్వపాపములును దొలఁగిపోవును.

"ఆరోగ్యం ప్రయచ్ఛతి" పునః పునర్భవవ్యాధి తొలఁగి యారోగ్యము గలుగును. "భయం న జాయతే" అభయామృత స్వరూపాత్మజ్ఞానప్రాప్తి కాఁగా మృత్యుభయము పూర్తిగా నెడసిపోవును. "రక్షాం కరోతి భూతేభ్యః" దీని తాత్పర్యము మున్నే చెప్పఁబడినది. ఇదిగాక, అమ్మ మఱొక్కటి యన్నది. ఎవ్వఁడేని సమగ్ర దేవీమాహాత్మ్యపాఠశ్రవణములం దసమర్థుఁడయ్యేనేని, వాఁడు కేవల స్తోత్రపాఠశ్రవణములను జేసినచో, వానికి శుభమతి అనఁగా, ఆత్మజ్ఞానధారణోపయోగియైన బుద్ధి యబ్బును. (ధీ = ప్రజ్ఞ; "జ్ఞానస్య తిస్రో భార్యాశ్చ బుద్ధిర్మేధా

స్మృతి స్తథా" సర్వవ్యవహారహేతువు జ్ఞానము. బుద్ధి రెండు విధములు - అనుభూతి, స్మృతి. అనుభూతి నాలుగువిధములు - ప్రత్యక్షాదులు. మేధా ధారణావతీ బుద్ధిః. అతీతానుస్మృతి మేధ. తత్కాలగ్రాహిణీ మతి.)

ఓం. అరణ్యే ప్రాన్తరేవాపి దావాగ్ని పరివారితః ।
దస్యుభిర్వా వృతః శూన్యే గృహీతోవాపి శత్రుతః॥ ఓం. 25

ఓం. సింహవ్యాఘ్రానుయాతో వా వనే వా వనహస్తిభిః ।
రాజ్ఞా క్రుద్ధేన చాజ్ఞప్తో వధ్యో బంధనతోఽపి వా॥ ఓం. 26

ఓం. ఆఘూర్ణితో వా వాతేన స్థితః పోతే మహార్ణవే ।
పతత్సు వాపి శస్త్రేషు సంగ్రామే భృశదారుణే॥ ఓం. 27

ఓం. సర్వబాధాసు ఘోరాసు వేదనాభ్యర్దితోఽపి వా ।
స్మరన్మమైతచ్చరితం నరో ముచ్యేతసంకటాత్॥ ఓం. 28

ఓం. మమ ప్రభావాత్సింహాద్యా దస్యవో వైరిణస్తథా ।
దూరాదేవ పలాయన్తే స్మరత శ్చరితం మమ॥ ఓం. 29

అరణ్యమందును ప్రాంతరమందును బడినపుడును, దావాగ్నిచే జుట్టుకొనఁబడినపుడును, నిస్సహాయస్థితిలోనున్నప్పుడును, దస్యులచేతను శత్రువులచేతను ముట్టడింపఁబడినపుడును, అడవిలో సింహ వ్యాఘ్ర వనగజాదులు వెంటాడినపుడును, కోపించిన రాజుచే వధమో చెఱయో సిద్ధమైనపుడును, మహాసముద్రముపై నావయాత్ర చేయునపుడు, సుడిగాలి రుమ్మునపుడును, భయానకయుద్ధమందు శస్త్రములు

వచ్చిపడునపుడును, సర్వవిపత్తులందును, పీడలు గల్గునపుడును, నా యీ చరిత్రమును స్మరించినంతనే సంకటములవలన విడువఁబడును. నా ప్రభావముచే సింహాదులు దస్యులు శత్రువులును దూరమునుండియే పాఱిపోవుదురు.

వ్యాఖ్య:— అమ్మ చరిత్ర కథలను జదువుటచేతను, వినుటచేతను, నగు ఫలములు మున్ను వర్ణింపఁబడినవి. ఇపుడు శ్రవణ కీర్తనములందోపిక లేక యథార్థ కాతరభావముతో, మాతృ పవిత్రచరిత్రములను స్మరింపఁగల్గినను మనుజుఁడు మున్ను జెప్పిన విపత్తులవలనఁ బరిత్రాణము నొందఁగలఁడు. సంసారమందు మనుజులకే యే కారణములచే నధీరత వాటిల్లునో తెలుపుచు, నిచట అడవిప్రాంతరము, దోపిడీకాండ్రు, కాఱుచిచ్చు మున్నగు ననేక కథలను జెప్పినది. గీతలందు భగవానుఁడు సైతము, "అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మామ్"(9-13.) ఈమనుష్యలోకము అనిత్యము అసుఖమయము. సంసారముయొక్క యనిత్యతయు, నసుఖము మనుష్యుని సదా యధీరునిఁ జేయుచుండును. అట్టి కాతరావస్థయందును జీవుఁడు భగవంతుని స్మరించునేని, గాతరతకు హేతుభూతములైన విపత్తులు తప్పక తొలఁగి రక్షణము నొందును. విశేషించి జీవుఁడు భగవత్సత్తయందు విశ్వాసము గలవాఁడగును. జీవుఁడు కాతర రోదనము చేయుచోట, మన యమ్మ సుప్రకటముగా నావిర్భవించును.

జీవుఁడా! చూడుము. నీకేమి సుఖమున్నది? నీయవస్థలను గుర్తించియే మన యమ్మ యిచట "అరణ్యే ప్రాంతరే వాపి" మున్నగు మాటలన్నది. చూడుము. నీ సంసార మొక

యరణ్యము, ప్రాంతరము కాదా? బంధుబాంధవు లనేకులు నిన్ను జుట్టియున్నను నీవొక్కఁడవే సుమా. సంసారప్రాంతర మందుఁబడి, సుగమమునుగోరి యాశామరీచికలయెడ ముగ్ధుఁడవై సదా మోసపడుచున్నావు. మఱియుఁ జూడుము. నీ నాల్గు వైపుల నశాన్తి యనెడి దావాగ్ని మండుచున్నదో లేదో; నీ శాంతి యని భ్రమించి సంతసించుచున్నది. కొంచెముగా లక్షించినపుడు, శాంతిగా నశాంతియేయున్నదని కనుగొందువు. నీ సాధువృత్తులు, బహిర్ముఖ విషయలోలుపవృత్తులు నసెడి దొంగలగుంపు నిన్ను దోచుకొనుచున్నదో లేదో చూడు. నీవు నీ మిత్రులుగా నెంచుచున్న కామక్రోధాది మిత్రరూప శత్రువులు, నీ శాంతి నేటిగట్టునఁ బెట్టి పాఱిపోవుచున్నారో లేదో చూడు. సింహ వ్యాఘ్రాది హింసక జంతువులనెడి దుర్దమనీయ ప్రవృత్తులచే నీవు సదా వెంబడింపఁబడుచున్నావో లేదో, చూచుకో. నీవు, ఏకాకివి, అసహాయుఁడవు నగుదువో కాదో చూచుకో. ఆ పైని జూడుము, రాజక్రోధము – ఈశ్వరుఁడై విశ్వమునకు రాజైనవాని యానచే నీవు ,వధ్యుఁడవు = మరణ మార్గమందు ముందడుగు వేయుచు (బద్ధుఁడవై) సంసార శృంఖలములచే బద్ధుఁడవైతివో, లేదో చూచుకో. మఱియుఁ జూడుము. ఈ సంసార మహార్ణవమందుఁబడి, నీ జీవననౌక అదృష్టవాయువుచే నెల్లపుడు సుడివెట్టఁబడుచున్నదో లేదో, చూడుము. ప్రవృత్తి నివృత్తులతో నీకు నిత్యము నగుచున్న యుద్ధమందు గాయపడుచున్నావో లేదో, చూచుకో. మఱియు శారీరక మానసిక వ్యాధులవలని యాతన నీవెంతగా ననుభవించుచున్నావో, చూడు. ఈ విధముగా నీవు ఘోరసంకటమందుఁ

బడియున్నావు. నీ యిప్పటి బ్రతుకును బాగుగాఁ బర్యాలోచించి చూచుకో. నీ పడు సంకటమును జూచి యూర్పుఁడవగుము. అధీరతతో నొక్కసారి నన్ను స్మరింపుము. నీవు స్మరించు ముహూర్తమందే, సంకటములవలనఁ బరిత్రాణము నొందుదువు. సంకటపరిత్రాణాస్వాదము మాటిమాటికి దొరకునా ? ఇదిగో, ఎవని జీవితమందు మునుజెప్పిన సంకటము లింతవఱకుఁ గలుగలేదో, వానికి నన్ను స్మరించు సుయోగము పట్టలేదన్నమాటే. బిడ్డా ! జీవుఁడా ! నిన్నుఁ గడుంబ్రేమించు నేనే, నిన్నిట్లు సంకటాపన్నుంజేసి, నన్ను స్మరించు సుయోగమును గృపతోఁ గూర్తును. నేఁడో రేపో మఱికొన్నాళ్లకో నిశ్చయముగా నీ కిట్టి సుయోగముపట్టును. అట్టి శుభయోగము పట్టినపుడు, నన్ను స్మరించుట మఱువకుమా. స్మరింపఁగలవాఁడే సంకటపరిత్రాణమును గ్రమముగా నా దర్శనమును బొందఁగలవు. ఇదే నా శేషవాణి. (తుదిమాట.)

ఓం. ఋషి రువాచ ఓం.

ఓం. ఇత్యుక్త్వా సా భగవతీ చండికా చండవిక్రమా ।
పశ్యతామేవ దేవానాం తత్రైవాంతర ధీయత॥ ఓం. 30

ఋషి పలికెను:—చండవిక్రమశాలిని భగవతి యాచండిక, దేవతలు చూచుచుండఁగానే వారి సమ్ముఖమందే యంతర్హిత యయ్యెను.

వ్యాఖ్య:— నిజముగా మన యమ్మ, చూచుచుండఁగానే యంతర్హితయైనది. అవును. అమ్మ నిరవచ్ఛిన్న, గాన నామె నడ్డగించుటకుఁగాని, పట్టుకొనుటకుఁగాని, యధికార మెవ్వరికిని

లేదు. స్వేచ్ఛతో వెలయును. స్వేచ్ఛతో మఱుఁగును. ఆమె యావిర్భావ తిరోధానములయెడ వ్రేలెత్తి చూపుటకు నెవ్వరికిని సామర్థ్యము లేదు. హక్కులేదు. కాని, అమ్మ చండవిక్రమ చండికామూర్తితో నావిర్భవించునపుడే జీవుఁడు యథార్థముగా ధన్యుఁడగుననుట మఱువకు. అపుడే వాని జీవత్వము తుదముట్టును. పెద్దయాచకుని మూడిండ్లును గూలిపోవును. అపుడు జీవుఁడు స్వరూపసంధానము నొంది, జీవత్వమోహము పూర్తిగా నశించి, పరిత్రాణము నొందును. పరమాత్మానుభవమువల్లనైన విశిష్టానందమును భోగించు సుయోగము పట్టును. అమ్మ కృపచే, అస్మితా మమతలు (శుంభ నిశుంభులు) విలయమగుటచే, తదనుసారులు ఆసురీభావములు తమంతనే యదృశ్యములగును.

సాధకా! ఇట్లే యగును; విశుద్ధజ్ఞానస్వరూపము ఆత్మప్రకాశము కాఁగానే, అజ్ఞానమును, అజ్ఞానజన్యములైన సర్వద్వైతభావములును మఱి కానరావు. తరువాత వ్యుత్థితావస్థయందు మున్ను బాధింపఁబడిన (తొలఁగిన) యజ్ఞానముయొక్కయు, దాని కార్యములయొక్కయు, ననువర్తనము కొంచెముండును. అనఁగా దాని ఛాయలు కొంచెముండును. కాని జీవన్ముక్తతకు రవ్వంతయుఁ దఱుఁగురాదు. హానిలేదు. జ్ఞానోదయమునకు మున్ను, జ్ఞానాభాసమునుబట్టి జీవుఁడు జగద్భోగమును జేయునటులే, ఆత్మజ్ఞానము నొందిన పిమ్మట నైతము, అజ్ఞానాభాసముఁబట్టి, పూర్వబాధిత జగత్తునందు (అనాత్మ వస్తువులయందు) యథేచ్ఛముగా విచరించును. తర్వాతఁ బ్రారబ్ధకర్మక్షయము కాఁగా, అనఁగా దేహావసాన

మందు జీవుఁడు కైవల్యముక్తి నొందును. బ్రహ్మమందు విలీనుఁడై పోవును. "న స పునరావర్తతే, న స పునరావర్తతే" యన్నది, శ్రుతి.

అవతారవిషయమున నొకటి రెండు మాటలు:— అవతారమే, అవతరణము. విశుద్ధచిత్స్వరూపాత్మ, శుద్ధబుద్ధియందవతరించును. జీవుఁడు విశుద్ధబుద్ధిస్వరూపమున నిల్వఁగల్గు నపుడు, దానియందే యాత్మస్వరూప ముద్భాసించును. ఆత్మ బుద్ధియం దుద్భాసించుటయే యథార్థమైన యవతారము. దీనిచే దాని నిర్గుణత్వమున కింతయు హానిలేదు. అది స్వరూపముచే నిర్గుణముగా నుండియు, స్వచ్ఛదర్పణమందుఁ బ్రతిబింబించిన సూర్యుఁడువలెనే నిర్మలబుద్ధియం దుద్భాసించును.

సమష్టిబుద్ధియం దుద్భాసించు నాత్మ - హిరణ్యగర్భుఁడు, ఈశ్వరుఁడు; సత్యసంకల్పుఁడు, సర్వకాముఁడు, ప్రేమమయుఁడు, స్నేహమయుఁడు, దయామయుఁడు, ప్రభువు, విభువు, నియంత యైన యతఁడు (ఆత్మ) ఏదే నొక్క- వ్యష్టిబుద్ధియం దుద్భాసించి, విశ్వకల్యాణసాధనము చేయునపుడే, అవతారమనఁబడును. ఏదే నొక దేశమందనేకులు ఆసురికవృత్తులచే నుత్పీడితులయి, శాంతి నాశించి జ్ఞానపిపాసచేఁ గలఁగి, యధీర ప్రాణముతోఁ బ్రార్థించునపుడు, తత్ఫలముగా దయాధారమైన పరమేశ్వరుఁడు, ఏదే నొక జీవుని బుద్ధియందుఁ దనను వెలయించుకొనును. యథార్థపిపాసు జనసంఘము ఆ సత్యదర్శి సంస్పర్శములోనికి వచ్చి ధన్యమును, కృతార్థము నగును.

ఈ యవతారతత్త్వసంబంధమున గీతా చండీపాఠములు రెండే యైకమత్యమును వెల్లడించినవి.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥" (గీత)

యన్నది. ఇఁకఁ జండీపాఠము (సప్తశతి)

"ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి।
తదా తదావతీర్యాహం కరిష్యా మ్యరిసంక్షయమ్॥"

అన్నది. (11-55)

దుష్కృతి వినాశము, ధర్మసంస్థాపనము నను రెండు గీతయందుఁ జెప్పఁబడిన యవతారకార్యములు. మఱి, ఆత్మ స్వరూపప్రకాశమును, అరిసంక్షయమును దేవీమాహాత్మ్య మందుఁ (చండీ సప్తశతీపాఠము) జెప్పఁబడిన యవతార కార్య ములు. మొదటఁ జెప్పఁబడిన యవతారముచే ధర్మప్రతిష్ఠ యగును. మఱి దేవీకథితావతారముచే నాత్మప్రతిష్ఠ యగును. ఆత్మప్రతిష్ఠచేతనే యథార్థ ధర్మరక్షయు, జగత్పరిపాలనము నగును. ఎచ్చట నెన్ని యవతారము లావిర్భవించునో, వానిచేత నేదోవిధముగా నీ సత్యము కానఁబడును. అవతారములన్నియుఁ జిన్మయి మన యమ్మయే. అమ్మగాక మఱియొక యవతారము యొక్క సంభావనయే లేదు. చైతన్యమయి యమ్మయే మానవ శరీరమున నవతారరూపముతో నభివ్యక్త యగును. యథార్థ మైన "అహమ్" (నేనే) అవతరించును. కనుక నింతకుమున్న మన యమ్మ తన శ్రీముఖముతో నన్నది : "అవతీర్యాహమ్" "నే నవతరించి యజ్ఞాన మనెడి యరికులమును క్షయింపఁ జేయుదు" నని.

ఇచటఁ బ్రసంగవశమున నొక్కమాట — యథార్థ పిపాసువు, యథార్థముముక్షువు నైనవాని హృదయమందు, అమ్మ చెదరని విశ్వాసరూపముతోనే యవతరించును. (ఇది యనుభూతము.)

ఎవ్వని హృదయమందేని దృఢవిశ్వాసమును, అవ్యాజ భక్తియు నుండునేని వానికి శ్రేయోలాభము సునిశ్చితము. శ్రీ శంకరాచార్యులకును అవతారమందు విశ్వాసముండెను. వారి శ్రీభాష్య భూమికయందు, అవతారకథ చెప్పినపుడు, "దేహవానివ జాతవానివ లోకానుగ్రహం కుర్వన్నివ" యని యుల్లేఖించిరి. దేహాదిసంఘాతరహితుఁడైనవానియందు శుద్ధ బోధస్వరూప పరమేశ్వరుని మాయా (శక్తి) ప్రభావముచేత, దేహవిశిష్టుఁడైనవానివలెనే ప్రతీతుఁడగును. మాయిక జీవ బృందము అతని సమీపింపనైనఁజాలదు.

పరమాత్మయే జీవుల కల్యాణమునకై యవతారరూపమునఁ దన్నుఁదా వెలయించుకొనుననెడి మాట నంగీకరించి విశ్వసించుటచేతనే జీవునకు శ్రేయోలాభ మగును.

ఇది

శ్రీ మార్కండేయపురాణాంతర్గత దేవీమాహాత్మ్యమున
శుంభవధానంతరము, దేవతలు చేసిన స్తుతికి
శ్రీకాకుళవాసి, శ్రీ శ్రేయానందనాథుఁడు
ఈశ్వర సత్యనారాయణశర్మ వ్రాసిన వ్యాఖ్య.
శ్రీ పరదేవతార్పణము.

ప్రథమ ఖండమందు బ్రహ్మకృత

## దేవీ స్తుతి

ఓం. బ్రహ్మోవాచ ఓం.

* ఓం. త్వం స్వాహా త్వం స్వధా త్వం హి
వషట్కారః స్వరాత్మికా,
సుధా త్వమక్షరే నిత్యే
త్రిధా మాత్రాత్మికా స్థితా॥ ఓం. 1

అర్థమాత్రా స్థితా నిత్యా యానుచ్చార్యా విశేషతః,
త్వమేవ సా త్వం సావిత్రీ త్వం దేవి జననీ పరా॥ 2

త్వయైవ ధార్యతే విశ్వం త్వయైతత్ సృజ్యతే జగత్.
త్వయై తత్పాల్యతే దేవి త్వమత్స్యంతే చ సర్వదా॥ 3

విసృష్టౌ సృష్టిరూపా త్వం స్థితిరూపా చ పాలనే,
తథా సంహృతిరూపాంతే జగతోఽస్య జగన్మయే॥ 4

మహావిద్యా మహామాయా మహామేధా మహాస్మృతిః,
మహామోహా చ భవతీ మహాదేవీ మహాసురీ॥ 5

ప్రకృతిస్త్వం చ సర్వస్య గుణత్రయ విభావినీ,
కాలరాత్రి ర్మహారాత్రి ర్మోహరాత్రిశ్చ దారుణా॥ 6

త్వం శ్రీస్త్వమీశ్వరీ త్వం హ్రీస్త్వం బుద్ధిర్బోధలక్షణా,
లజ్జా పుష్టి స్తథా తుష్టి స్త్వం శాన్తిః క్షాన్తి రేవ చ॥ 7

---

* ఇందుఁ గల నాలుగు స్తుతులకు, ఫలశ్రుతికి ప్రతిశ్లోకమునకు ఆద్యంత్యము లందు "ప్రణవము" (ఓం) చేర్చి పఠింపవలయును.

ఖడ్గినీ శూలినీ ఘోరా గదినీ చక్రిణీ తథా,
శంఖినీ చాపినీ బాణ భుశుండీ పరిఘాయుధా॥ 8

సౌమ్యా సౌమ్యతరాశేష సౌమ్యేభ్యస్త్వతి సుందరీ,
పరా పరాణాం పరమా త్వమేవ పరమేశ్వరీ॥ 9

యచ్చ కించి త్క్వచిద్వస్తు సదసద్వాఖిలాత్మికే,
తస్య సర్వస్య యా శక్తిః సా త్వం కిం స్తూయసే తదా॥ 10

యయా త్వయా జగత్స్రష్టా జగత్పాతాత్తియో జగత్,
సోఽపి నిద్రావశం నీతః కస్త్వాం స్తోతు మిహేశ్వరః॥ 11

విష్ణుః శరీర గ్రహణ మహ మీశాన ఏవ చ,
కారితాస్తే యతోఽతస్త్వాం కఃస్తోతుం శక్తిమాన్భవేత్॥12

సా త్వమిత్థం ప్రభావైః స్వై రుదారైర్దేవి సంస్తుతా,
మోహయైతౌ దురాధర్షా వసురౌ మధుకైటభౌ॥ 13

ప్రబోధంచ జగత్స్వామీ నీయతా మచ్యుతో లఘు,
బోధశ్చ క్రియతామస్య హంతుమేతౌ మహాసురౌ॥ 14

ఇది శ్రీ మార్కండేయపురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
ప్రథమచరిత్రమున, మధుకైటభవధమును జేయింప
విష్ణుని మేల్కొల్ప యోగనిద్రారూపిణిని
దేవి నుద్దేశించి బ్రహ్మ చేసిన స్తుతి.

## మహిషాసుర వధానంతరము

# శక్రాదికృతస్తుతి

ఓం. ఋషి రువాచ ఓం.

ఓం. శక్రాదయః సురగణా నిహతేఽతివీర్యే
తస్మిన్ దురాత్మని సురాదిబలే చ దేవ్యా,
తాం తుష్టువుః ప్రణతినమ్రశిరోధరాం సా
వాగ్భిః ప్రహర్షపులకోద్గమ చారుదేహాః॥ ఓం. 1

దేవ్యా యయా తత మిదం జగదాత్మ శక్త్యా
నిః శేష దేవగణ శక్తిసమూహ మూర్త్యా,
తా మంబికా మఖిల దేవమహర్షి పూజ్యాం
భక్త్యా నతాఃస్మ విదధాతు శుభాని సా నః॥ 2

యస్యాః ప్రభావ మతులం భగవా ననంతో
బ్రహ్మాహరశ్చ నహి వక్తు మలం బలం చ,
సా చండికాఖిల జగత్పరిపాలనాయ
నాశాయ చాశుభయస్య మతిం కరోతు॥ 3

యా శ్రీః స్వయం సుకృతినాం భవనే ష్వలక్ష్మీః
పాపాత్మనాం కృతధియాం హృదయేషు బుద్ధిః,
శ్రద్ధా సతాం కులజనప్రభవస్య లజ్జా
తాం త్వాం నతాఃస్మ పరిపాలయ దేవి విశ్వమ్॥ 4

కిం వర్ణయామ తవ రూప మచింత్య మేతత్
కించాతి వీర్య మసురక్షయకారి భూరి,

కిం చాహవేషు చరితాని తవాద్భుతాని
సర్వేషు దేవ్యసుర దేవగణాదికేషు॥ 5

హేతుః సమస్తజగతాం త్రిగుణాపి దోషై
ర్న జ్ఞాయసే హరిహరాదిభి రప్యపారా,
సర్వాశ్రయాఖిల మిదం జగదంశభూత
మవ్యాకృతా హి పరమా ప్రకృతి స్త్వమాద్యా॥ 6

యస్యాః సమస్తసురతా సముదీరణేన
తృప్తిం ప్రయాతి సకలేషు మఖేషు దేవి,
స్వాహాఽసి వై పితృగణస్య చ తృప్తిహేతు
రుచ్చార్యసే త్వమత ఏవ జనైః స్వధా చ॥ 7

యా ముక్తిహేతు రవిచింత్య మహావ్రతాచ
అభ్యస్యసే సునియతేంద్రియ తత్త్వసారైః,
మోక్షార్థిభి ర్మునిభి రస్త సమస్తదోషై
ర్విద్యాసి సా భగవతీ పరమా హి దేవీ॥ 8

శబ్దాత్మికా సువిమల ర్గ్యజుషాం నిధాన
ముద్గీథ రమ్యపదపాఠవతాం చ సామ్నామ్,
దేవీ త్రయీ భగవతీ భవభావనాయ
వార్తా చ సర్వజగతాం పరమా ర్తిహంత్రీ॥ 9

మేధాసి దేవి విదితాఖిల శాస్త్రసారా
దుర్గాసి దుర్గ భవసాగర నౌరసంగా,
శ్రీః కైటభారి హృదయైకకృతాధివాసా
గౌరీ త్వమేవ శశిమౌళి కృతప్రతిష్ఠా॥ 10

ఈషత్సహాస మమలం పరిపూర్ణచంద్ర
బింబానుకారి కనకోత్తమ కాంతికాంతమ్,
అత్యద్భుతం ప్రహృతమా త్తరుషా తథాపి
వక్త్రం విలోక్య సహసా మహిషాసురేణ॥ 11

దృష్ట్వా తు దేవి కుపితం భ్రుకుటీకరాళ
ముద్యచ్ఛశాంక సదృశచ్ఛవి యన్న సద్యః,
ప్రాణాన్ముమోచ మహిష స్తదతీవ చిత్రం
కైర్జీవ్యతే హి కుపితాంతకదర్శనేన॥ 12

దేవి ప్రసీద పరమా భవతీ భవాయ
సద్యో వినాశయసి కోపవతీ కులాని,
విజ్ఞాత మేతదధునైవ యదస్త మేత
న్నీతం బలం సువిపులం మహిషాసురస్య॥ 13

తే సమ్మతా జనపదేషు ధనాని తేషాం
తేషాం యశాంసి న చ సీదతి ధర్మవర్గః,
ధన్యా స్తఏవ నిభృతాత్మజ భృత్యదారా
యేషాం సదాభ్యుదయదా భవతీ ప్రసన్నా॥ 14

ధర్మ్యాణి దేవి సకలాని సదైవ కర్మా
ణ్యత్యాదృతః ప్రతిదినం సుకృతీ కరోతి,
స్వర్గం ప్రయాతి చ తతో భవతీప్రసాదా
ల్లోకత్రయేఽపి ఫలదా నను దేవి తేన॥ 15

దుర్గే స్మృతా హరసి భీతి మశేషజన్తోః
స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి,

దారిద్ర్యదుఃఖ భయహారిణి కా త్వదన్యా
సర్వోపకారకరణాయ సదార్ద్రచిత్తా॥ 16

ఏభిర్హతై ర్జగదుపైతి సుఖం తథైతే
కుర్వంతు నామ నరకాయ చిరాయ పాపమ్,
సంగ్రామ మృత్యు మధిగమ్య దివం ప్రయాంతు
మత్వేతి నూనమహితాన్ వినిహంసి దేవి॥ 17

దృష్ట్వైవ కిన్న భవతీ ప్రకరోతి భస్మ
సర్వాసురా నరిషు ప్రహిణోషి శస్త్రమ్,
లోకాన్ ప్రయాన్తు రిపవోఽపి హి శస్త్రపూతా
ఇత్థం మతి ర్భవతి తేష్వపి తేఽతి సాధ్వీ॥ 18

ఖడ్గప్రభానికరవిస్ఫురణై స్తథోగ్రైః
శూలాగ్రకాంతి నివహేన దృశోఽసురాణామ్,
యన్నాగతా విలయ మంశుమదిందుఖండ
యోగ్యాననం తవ విలోకయతాం తదేతత్॥ 19

దుర్వృత్త వృత్తశమనం తవ దేవి శీలం
రూపం తథైత దవిచింత్య మతుల్య మన్యైః,
వీర్యంచ హంతృహృత దేవ పరాక్రమాణాం
వైరిష్వపి ప్రకటితైవ దయా త్వయేత్థమ్॥ 20

కేనోపమా భవతు తేఽస్యపరాక్రమస్య
రూపం చ శత్రుభయకార్యతిహారి కుత్ర,
చిత్తే కృపా సమరనిష్ఠురతా చ దృష్టా
త్వయ్యేవ దేవి వరదే భువనత్రయేఽపి॥ 21

త్రైలోక్య మేత దఖిలం రిపునాశనేన
త్రాతం త్వయా సమరమూర్ధని తేఽపి హత్వా,
నీతా దివం రిపుగణా భయమప్యపాస్త
మస్మాక మున్మద సురారిభవం నమస్తే॥ 22

శూలేన పాహి నో దేవి పాహి ఖడ్గేన చాంబికే,
ఘంటాస్వనేన నః పాహి చాపజ్యా నిఃస్వనేన చ॥ 23

ప్రాచ్యాం రక్ష ప్రతీచ్యాం చ చండికే రక్ష దక్షిణే,
భ్రామణే నాత్మ శూలస్య ఉత్తరస్యాం తథేశ్వరి॥ 24

సౌమ్యాని యాని రూపాణి త్రైలోక్యేవిచరంతి తే,
యాని చాత్యర్థఘోరాణి తైరక్షాస్మాం స్తథా భువమ్॥ 25

ఏవం స్తుతా సురైః సర్వైః కుసుమై ర్నందనోద్భవైః,
అర్చితా జగతో ధాత్రీ తథా గంధానులేపనైః॥ 26

భక్త్యా సమస్తై స్త్రిదశై ర్దివ్యై ర్ధూపైస్తు ధూపితా,
ప్రాహ ప్రసాదసుముఖీ సమస్తాన్ ప్రణతాన్ సురాన్॥ 27

ఓం. దేవ్యువాచ ఓం.

వ్రియతాం త్రిదశాః సర్వే యదస్మత్తోఽభివాంఛితమ్॥ 28

ఓం. దేవా ఊచుః ఓం.

భగవత్యా కృతం సర్వం న కించి దవశిష్యతే,
యదయం నిహతః శత్రు రస్మాకం మహిషాసురః॥ 29

యది వాపి వరో దేయ స్త్వయాస్మాకం మహేశ్వరి,
సంస్మృతా సంస్మృతా త్వం నో హింసేథాః పరమాపదః॥ 30

యశ్చ మర్త్యః స్తవై రేభి స్త్వాం స్తోష్యత్యమలాననే,
తస్య విత్తర్ధి విభవై ర్ధనదారాది సంపదామ్॥ 31

వృద్ధయే స్మత్ ప్రసన్నా త్వం భవేథాః సర్వదాంబికే॥ 32

ఓం. ఋషిరువాచ ఓం.

ఇతి ప్రసాదితా దేవై ర్జగతోఽర్థే తథాత్మనః,
తథే త్యుక్త్వా భద్రకాళీ బభూవాంతర్హితా నృప॥ 33

ఇది శ్రీ మార్కండేయపురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
ద్వితీయచరిత్రమున, మహిషాసురవధానంతరము
శక్రాదిదేవతలు చేసిన దేవీస్తుతి.

---

శుంభాసురనిధనమునుగోరిన దేవతలు చేసిన

## దేవీస్తుతి

ఓం. నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః,
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాస్మ తామ్॥ ఓం.1

రౌద్రాయై నమో నిత్యాయై గౌర్యై ధాత్ర్యై నమోనమః.
జ్యోత్స్నాయై చేందురూపిణ్యై సుఖాయై సతతం నమః॥ 2

కల్యాణ్యై ప్రణతాం వృద్ధ్యై సిద్ధ్యై కుర్మో నమోనమః,
నైరృత్యై భూభృతాం లక్ష్మ్యై శర్వాణ్యై తే నమోనమః

దుర్గాయై దుర్గపారాయై సారాయై సర్వకారిణ్యై,
ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతం నమః॥ 4

అతిసౌమ్యాతి రౌద్రాయై నమస్తస్యై నమోనమః,
నమో జగత్ప్రతిష్ఠాయై దేవ్యై కృత్యై నమోనమః॥ 5

♦ఓం. యా దేవీ సర్వభూతేషు **విష్ణుమాయేతి** శబ్దితా,
ఓం నమస్తస్యై ఓం, ఓం నమస్తస్యై ఓం,
ఓం నమస్తస్యై నమోనమః॥ ఓం. 6

యా దేవీ సర్వభూతేషు చేతనే త్యభిధీయతే,
నమస్తస్యై ... ... ... 7

యా దేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 8

యా దేవీ సర్వభూతేషు నిద్రారూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 9

యా దేవీ సర్వభూతేషు క్షుధారూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 10

యా దేవీ సర్వభూతేషు ఛాయారూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 11

యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 12

యా దేవీ సర్వభూతేషు తృష్ణారూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 13

♦ 6-వ శ్లోకమునుండి 26-వ శ్లోకము వరకు ఉత్తరార్థము పైవిధముగా పఠించవలెను.

యా దేవీ సర్వభూతేషు క్షాన్తిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 14

యా దేవీ సర్వభూతేషు జాతిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 15

యా దేవీ సర్వభూతేషు లజ్జారూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 16

యా దేవీ సర్వభూతేషు శాన్తిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 17

యా దేవీ సర్వభూతేషు శ్రద్ధారూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 18

యా దేవీ సర్వభూతేషు కాన్తిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 19

యా దేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 20

యా దేవీ సర్వభూతేషు వృత్తిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 21

యా దేవీ సర్వభూతేషు స్మృతిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 22

యా దేవీ సర్వభూతేషు దయారూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 23

యా దేవీ సర్వభూతేషు తుష్టిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 24

యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 25

యా దేవీ సర్వభూతేషు భ్రాన్తిరూపేణ సంస్థితా,
నమస్తస్యై ... ... ... 26

ఇంద్రియాణా మధిష్ఠాత్రీ భూతానాం చాఖిలేషు యా,
భూతేషు సతతం తస్యై వ్యాప్త్యై దేవ్యై నమోనమః॥ 27

ఓం. చితిరూపేణ యా కృత్స్న మేత ద్వ్యాప్య స్థితా జగత్,
ఓం నమస్తస్యై ఓం, ఓం నమస్తస్యై ఓం,
ఓం నమస్తస్యై నమో నమః॥ ఓం. 28

స్తుతా సురైః పూర్వ మభీష్టసంశ్రయా
త్తథా సురేంద్రేణ దినేషు సేవితా,
కరోతు సా నః శుభహేతు రీశ్వరీ
శుభాని భద్రాణ్యభిహంతు చాపదః॥ 29

యా సాంప్రతం చోద్ధ తదైత్యతాపితై
రస్మాభి రీశా చ సురై ర్నమస్యతే,
యా చ స్మృతా తత్‌క్షణమేవ హన్తి నః
సర్వాపదో భక్తివినమ్రమూర్తిభిః॥ 30

ఇది శ్రీ మార్కండేయపురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
శుంభాసురనిధనమును గోరిన దేవతలు చేసిన స్తుతి.

## శుంభవధానంతరము దేవకృత దేవీస్తుతి.
## (నారాయణీ స్తుతి)

ఓం. ఋషిరువాచ ఓం.

ఓం. దేవ్యా హతే తత్ర మహాసురేంద్రే
సేంద్రాః సురా వహ్నిపురోగమా స్తామ్,
కాత్యాయనీం తుష్టువు రిష్టలాభా
ద్వికాసివక్త్రాబ్జవికాసితాశాః॥ ఓం. 1

దేవి ప్రపన్నార్తి హరే ప్రసీద
ప్రసీద మాత ర్జగతోఽఖిలస్య,
ప్రసీద విశ్వేశ్వరి పాహి విశ్వం
త్వ మీశ్వరీ దేవి చరాచరస్య॥ 2

ఆధారభూతా జగత స్త్వ మేకా
మహీస్వరూపేణ యతః స్థితాసి,
అపాం స్వరూపస్థితయా త్వయైత
దాప్యాయ్యతే కృత్స్న మలంఘ్యవీర్యే॥ 3

త్వం వైష్ణవీ శక్తి రనంతవీర్యా
విశ్వస్య బీజం పరమాసి మాయా,
సమ్మోహితం దేవి సమస్తమేతత్
త్వం వై ప్రసన్నా భువి ముక్తిహేతుః॥ 4

విద్యాః సమస్తా స్తవ దేవి భేదాః
స్త్రియః సమస్తాః సకలా జగత్సు,

త్వయైకయా పూరిత మంబయైత తత్
కా తే స్తుతిః స్తవ్యపరాపరోక్తిః॥ 5

సర్వభూతా యదా దేవీ స్వర్గముక్తిప్రదాయినీ,
త్వం స్తుతా స్తుతయే కావా భవంతు పరమోక్తయః॥ 6

సర్వస్య బుద్ధిరూపేణ జనస్య హృది సంస్థితే,
స్వర్గాపవర్గదే దేవి నారాయణి నమోఽస్తుతే॥ 7

కలాకాష్ఠాదిరూపేణ పరిణామ ప్రదాయినీ,
విశ్వస్యోపరతౌ శక్తే నారాయణి నమోఽస్తుతే॥ 8

సర్వమంగళమాంగళ్యే శివే సర్వార్థసాధికే,
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోఽస్తుతే॥ 9

సృష్టిస్థితివినాశానాం శక్తిభూతే సనాతని,
గుణాశ్రయే గుణమయే నారాయణి నమోఽస్తుతే॥ 10

శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే,
సర్వస్యార్తి హరే దేవి నారాయణి నమోఽస్తుతే॥ 11

హంసయుక్త విమానస్థే బ్రహ్మాణీ రూపధారిణి,
కౌశాంభః క్షరికే దేవి నారాయణి నమోఽస్తుతే॥ 12

త్రిశూల చంద్రాహి ధరే మహావృషభవాహిని,
మాహేశ్వరీ స్వరూపేణ నారాయణి నమోఽస్తుతే॥ 13

మయూర కుక్కుట వృతే మహాశక్తిధరేఽనఘే;
కౌమారీరూప సంస్థానే నారాయణి నమోఽస్తుతే॥ 14

శంఖ చక్ర గదా శార్ఙ్గ గృహీత పరమాయుధే,
ప్రసీద వైష్ణవీరూపే నారాయణి నమోఽస్తు తే॥ 15

గృహీతోగ్ర మహాచక్రే దంష్ట్రోద్ధృత వసుంధరే,
వరాహరూపిణి శివే నారాయణి నమోఽస్తు తే॥ 16

నృసింహరూపేణోగ్రేణ హంతుం దైత్యాన్ కృతోద్యమే,
త్రైలోక్యత్రాణ సహితే నారాయణి నమోఽస్తు తే॥ 17

కిరీటిని మహావజ్రే సహస్ర నయనోజ్జ్వలే,
వృత్రప్రాణ హరే చైంద్రి నారాయణి నమోఽస్తు తే॥ 18

శివదూతీ స్వరూపేణ హతదైత్య మహాబలే,
ఘోరరూపే మహారావే నారాయణి నమోఽస్తు తే॥ 19

దంష్ట్రాకరాళవదనే శిరోమాలా విభూషణే,
చాముండే ముండమథనే నారాయణి నమోఽస్తు తే॥ 20

లక్ష్మి లజ్జే మహావిద్యే శ్రద్ధే పుష్టి స్వధే ధ్రువే,
మహారాత్రి మహాఽవిద్యే నారాయణి నమోఽస్తు తే॥ 21

మేధే సరస్వతి వరే భూతి బాభ్రవి తామసి,
నియతే త్వం ప్రసీదేశే నారాయణి నమోఽస్తు తే॥ 22

సర్వస్వరూపే సర్వేశి సర్వశక్తి సమన్వితే,
భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గే దేవి నమోఽస్తు తే॥ 23

ఏతత్తే వదనం సౌమ్యం లోచనత్రయ భూషితమ్,
పాతు నః సర్వభూతేభ్యః (భీతిభ్యః) కాత్యాయని
నమోఽస్తు తే॥ 24

జ్వాలాకరాళ మత్యుగ్ర మశేషాసురసూదనమ్,
త్రిశూలం పాతు నో భీతే ర్భద్రకాళి నమోఽస్తు తే॥ 25

హినస్తి దైత్యతేజాంసి స్వనేనాపూర్య యా జగత్,
సా ఘంటా పాతు నో దేవి పాపేభ్యో నః సుతా నివ॥ 26

అసురాసృగ్వసాపంక చర్చిత స్తే కరోజ్జ్వలః,
శుభాయ ఖడ్గో భవతు చండికే త్వాం నతా వయమ్। 27

రోగా నశేషా నపహంసి తుష్టా
రుష్టా తు కామా నఖిలా నభీష్టాన్,
త్వా మాశ్రితానాం న విపన్నరాణాం
త్వా మాశ్రితా హ్యాశ్రయతాం ప్రయాన్తి॥ 28

ఏతత్కృతం యత్కదనం త్వయాద్య
ధర్మద్విషాం దేవి మహాసురాణామ్,
రూపై రనేకై ర్బహుధాత్మమూర్తిం
కృత్వాంబికే తత్ప్రకరోతి కాన్యా॥ 29

విద్యాసు శాస్త్రేషు వివేకదీపే
ష్వాద్యేషు వాక్యేషు చ కా త్వదన్యా,
మమత్వగర్తేఽతి మహాంధకారే
విభ్రామయత్యేత దతీవ విశ్వమ్॥ 30

రక్షాంసి యత్రోగ్ర విషాశ్చ నాగా
యత్రారయో దస్యుబలాని యత్ర,
దావానలో యత్ర తథాబ్ధిమధ్యే
తత్ర స్థితా త్వం పరిపాసి విశ్వమ్॥ 31

విశ్వేశ్వరి త్వం పరిపాసి విశ్వం
విశ్వాత్మికా ధారయసీతి నిత్యమ్,
విశ్వేశ వంద్యా భవతీ భవన్తి
విశ్వాశ్రయా యే త్వయి భక్తినమ్రాః॥ 32

దేవి ప్రసీద పరిపాలయ నోఽరి భీతే
ర్నిత్యం యథాసురవధా దధునైవ సద్యః,
పాపాని సర్వజగతాం చ శమం నయాశు
ఉత్పాతపాక జనితాంశ్చ మహోపసర్గాన్॥ 33

ప్రణతానాం ప్రసీద త్వం దేవి విశ్వార్తి హారిణి,
త్రైలోక్యవాసినా మీడ్యే లోకానాం వరదా భవ॥ 34

వరదాహం సురగణా వరం యం మనసేచ్ఛథ,
తం వృణుధ్వం ప్రయచ్ఛామి జగతా ముపకారకమ్॥ 35

సర్వబాధాప్రశమనం త్రైలోక్యస్యాఖిలేశ్వరి,
ఏవ మేతత్త్వయాకార్య మస్మద్వైరి వినాశనమ్॥ 36

ఓం. దేవ్యువాచ ఓం.

వైవస్వతేఽన్తరే ప్రాప్తే అష్టావింశతిమే యుగే,
శుంభోనిశుంభశ్చైవాన్యా వుత్పత్స్యేతే మహాసురా॥ 37

నందగోపగృహే జాతా యశోదాగర్భ సంభవా,
తతస్తా నాశయిష్యామి వింధ్యాచల నివాసినీ॥ 38

పునరప్యతి రౌద్రేణ రూపేణ పృథివీతలే,
అవతీర్య హనిష్యామి వైప్రచిత్తాంస్తు దానవాన్॥ 39

భక్షయంత్యాశ్చ తానుగ్రాన్ వైప్రచిత్తాన్మహాసురాన్,
రక్తాదన్తా భవిష్యన్తి దాడిమీ కుసుమోపమాః॥ 40

తతో మాం దేవతాః స్వర్గే మర్త్యలోకే చ మానవాః,
స్తువన్తో వ్యాహరిష్యన్తి సతతం రక్తదన్తికామ్॥ 41

భూయశ్చ శతవార్షిక్యా మనావృష్ట్యా మనంభసి,
మునిభిః సంస్తుతా భూమౌ సంభవిష్యామ్యయోనిజా॥ 42

తతః శతేన నేత్రాణాం నిరీక్షిష్యామి యన్మునీన్,
కీర్తయిష్యన్తి మనుజాః శతాక్షీ మితి మాం తతః॥ 43

తతోఽహ మఖిలం లోక మాత్మదేహ సముద్భవైః,
భరిష్యామి సురాః శాకై రావృష్టేః ప్రాణధారకైః,
శాకంభరీతి విఖ్యాతిం తదా యాస్యామ్యహం భువి॥ 44

తత్రైవ చ వధిష్యామి దుర్గమాఖ్యం మహాసురం,
దుర్గాదేవీతి విఖ్యాతం తన్మేనామ భవిష్యతి॥ 45

పునశ్చాహం యదా భీమం రూపం కృత్వా హిమాచలే,
రక్షాంసి క్షయయిష్యామి మునీనాం త్రాణకారణాత్॥ 46

తదా మాం మునయస్సర్వే స్తోష్యన్త్యానమ్రమూర్తయః,
భీమాదేవీతి విఖ్యాతం తన్మేనామ భవిష్యతి॥ 47

యదారుణాఖ్య స్త్రైలోక్యే మహాబాధాం కరిష్యతి,
తదాహం భ్రామరం రూపం కృత్వా సంఖ్యేయషట్పదమ్॥ 48

త్రైలోక్యస్య హితార్థాయ వధిష్యామి మహాసురం,
భ్రామరీతి చ మాం లోకా స్తదా స్తోష్యన్తి సర్వతః॥ 49

ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి,
తదా తదావతీర్యాహం కరిష్యా మ్యరిసంక్షయమ్॥ 50

ఇది శ్రీ మార్కండేయపురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
దేవతలు చేసిన స్తుతి. (నారాయణీస్తుతి.)

---

## దేవీ మాహాత్మ్యము - రుద్రగ్రంథి భేదము.

### ఫ ల శ్రు తి.

ఓం. దేవ్యువాచ ఓం.

ఓం. ఏభిః స్తవైశ్చ మాం నిత్యం స్తోష్యతే యః సమాహితః,
తస్యాహం సకలాం బాధాం శమయిష్యామ్యసంశయం॥ఓం. 1

మధుకైటభ నాశం చ మహిషాసుర ఘాతనం,
కీర్తయిష్యన్తి యే తద్వ ద్వధం శుంభనిశుంభయోః॥ 2

అష్టమ్యాం చ చతుర్దశ్యాం నవమ్యాం చైక చేతసః,
శ్రోష్యన్తి చైవ యే భక్త్యా మమ మాహాత్మ్య ముత్తమమ్॥ 3

న తేషాం దుష్కృతం కించి ద్దుష్కృతోత్థా న చాపదః,
భవిష్యతి న దారిద్ర్యం న చైవేష్ట వియోజనమ్॥ 4

శత్రుతో న భయం తస్య దస్యుతో వా న రాజతః,
న శస్త్రానలతోయౌఘా త్కదాచి త్సంభవిష్యతి॥ 5

యస్మాన్మమైత న్మాహాత్మ్యం పఠితవ్యం సమాహితైః,
శ్రోతవ్యం చ సదా భక్త్యా పరం స్వస్త్యయనం హి తత్॥ 6

ఉపసర్గా నశేషాంస్తు మహామారీ సముద్భవాన్,
తథా త్రివిధముత్పాతం మాహాత్మ్యం శమయే న్మమ॥ 7

యత్రైత త్పఠ్యతే సమ్య ఙ్నిత్యమాయతనే మమ,
సదా న తద్విమోక్ష్యామి సాన్నిధ్యం తత్ర మే స్థితమ్॥ 8

బలిప్రదానే పూజాయా మగ్నికార్యే మహోత్సవే,
సర్వం మమైతచ్చరిత ముచ్చార్యం శ్రావ్య మేవచ॥ 9

జానతా జానతా వాపి బలిపూజాం తథా కృతాం,
ప్రతీచ్ఛిష్యామ్యహం ప్రీత్యా వహ్నిహోమం తథాకృతమ్॥ 10

శరత్కాలే మహాపూజా క్రియతే యా చ వార్షికీ,
తస్యాం మమైత న్మాహాత్మ్యం శ్రుత్వా భక్తిసమన్వితః॥ 11

సర్వబాధా వినిర్ముక్తో ధనధాన్య సుతాన్వితః,
మనుష్యో మత్ప్రసాదేన భవిష్యతి న సంశయః॥ 12

శ్రుత్వా మమైత న్మాహాత్మ్యం తథా చోత్పత్తయః శుభాః,
పరాక్రమం చ యుద్ధేషు జాయతే నిర్భయః పుమాన్॥ 13

రిపవః సంక్షయం యాన్తి కల్యాణః చోపపద్యతే,
నందతే చ కులం పుంసాం మాహాత్మ్యం మమ శ్రుణ్వతామ్॥

శాంతికర్మణి సర్వత్ర తథా దుఃస్వప్నదర్శనే,
గ్రహపీడాసు చోగ్రాసు మాహాత్మ్యం శ్రుణుయా న్మమ॥ 15

ఉపసర్గాః శమం యాన్తి గ్రహపీడాశ్చ దారుణాః,
దుఃస్వప్నం చ నృభిర్దృష్టం సుస్వప్న ముపజాయతే। 16

బాలగ్రహాభిభూతానాం బాలానాం శాన్తికారకం,
సంఘాతభేదే చ నృణాం మైత్రీకారక ముత్తమమ్। 17

దుర్వృత్తానా మశేషాణాం బలహానికరం పరం,
రక్షో భూతపిశాచానాం పఠనాదేవ నాశనమ్। 18

సర్వం మమైత న్మాహాత్మ్యం మమ సన్నిధికారకమ్। 19

పశు పుష్పార్ఘ్య ధూపైశ్చ గంధ దీపై స్తథోత్తమైః,
విప్రాణాం భోజనై ర్హోమైః ప్రోక్షణీయై రహర్నిశమ్. 20

అన్యైశ్చ వివిధై ర్భోగైః ప్రదానై ర్వత్సరేణ యా,
ప్రీతి ర్మే క్రియతే సాస్మిన్ సకృత్సుచరితే శ్రుతే। 21

శ్రుతం హరతి పాపాని తథారోగ్యం ప్రయచ్ఛతి,
రక్షాం కరోతి భూతేభ్యో జన్మనాం కీర్తనం మమ। 22

యుద్ధేషు చరితం యన్మే దుష్టదైత్య నిబర్హణం,
తస్మిన్ శ్రుతే వైరికృతం భయం పుంసాం నజాయతే. 23

యుష్మాభిః స్తుతయో యాశ్చ యాశ్చ బ్రహ్మర్షిభిః కృతాః,
బ్రహ్మణాచ కృతా స్తాస్తు ప్రయచ్ఛన్తి శుభాం మతిమ్। 24

అరణ్యే ప్రాన్తరే వాపి దావాగ్ని పరివారితః,
దస్యుభిర్వా వృతం శూన్యే గృహీతో వాపి శత్రుభిః। 25

సింహవ్యాఘ్రానుయాతో వా వనే వా వనహస్తిభిః,
రాజ్ఞా క్రుద్ధేన చాజ్ఞప్తో వధ్యో బంధనతోఽపి వా॥ 26

ఆఘూర్ణితో వా వాతేన స్థితః పోతే మహార్ణవే,
పతత్సు వాపి శస్త్రేషు సంగ్రామే భృశదారుణే॥ 27

సర్వబాధాసు ఘోరాసు వేదనాభ్యర్దితోఽపి వా,
స్మరన్మమైతచ్చరితం నరో ముచ్యేత సంకటాత్॥ 28

మమ ప్రభావాత్సింహాద్యా దస్యవో వైరిణస్తథా,
దూరాదేవ పలాయన్తే స్మరతశ్చరితం మమ॥ 29

ఓం. ఋషిరువాచ ఓం.

ఇత్యుక్త్వా సా భగవతీ చండికా చండవిక్రమా,
పశ్యతామేవ దేవానాం తత్రైవాంతరధీయత॥ 30

ఇది శ్రీ మార్కండేయపురాణాంతర్గత దేవీమాహాత్మ్యమందు
శుంభవధానంతరము, దేవతలు చేసిన స్తుతి.

# శ్రీ ఈశ్వర సత్యనారాయణశర్మగారి రచనలు

1. సాధన సామగ్రి
(సప్తశతీ ఆధ్యాత్మికవివృతిసారము)
(తొలిమూటు) 2-50
,, (మలిమూటు) 2-50
2 శ్రీదేవీసూక్త పరమార్థము 0-75
3 భీమేశ్వరనుతి 0-50
4 దేవపూజా రహస్యము 1-75
5 శాస్త్రసాధనము 0-50
6 శ్రీ రాజవిద్యాగీత 2-00
(భగవద్గీత నవమాధ్యాయము)
7 శ్రీ సిద్ధాంతశిఖామణి 3-00
(శైవ గ్రంథరాజము)
8 అమ్మతో ముచ్చటలు 1,2భా. 1-50
9 మహాసౌరమంత్రపాఠము 0-75
(సస్వరము, ఆంధ్ర పద్య, ఆంగ్ల గద్యానువాదము)

## మా మండలి ప్రచురణలు

1 అష్టాదశశ్లోకగీత 0-15
2 గోవిందదామోదరస్తోత్రం 0-60
3 శివతాండవము(సచిత్రము) 1-00
4 భగవన్నామసంకీర్తన 0-50
5 హరినామ మహిమ 0-30
6 భక్తిరసాయనము 2-00
7 భారతీయదర్శనము 1-50
8 పద్మపురాణంభూమిఖండం 2-00
9 ,, ఆదిమఖండం 1-50
10 తులసీ మహిమామృతము 1-50
11 నేపాలయాత్ర 1-25
12 కల్యాణకుంజము 1-25
13 గీతాకదంబం 1,2భా.భా1కి 1-25
15 సిద్ధాంతకల్పవల్లి 1-00
16 పరమసాధన 0-75
17 గీతాప్రతిభ 0-75
19 కాళహస్తీశ్వర శతకము 0-60
20 హరినామమహిమశతకము 0-25
21 ఉపన్యాసరామాయణము 0-25
22 తులసీ – గోపూజ 0-25
23 శ్రీరామ పూజావిధానము 0-25
24 భగవత్ప్రాప్తి-ఉపాయాలు 0-25
25 భాగవతకథ2,3,4,5భా.భా1కి2-50
26 ,, 1,6,7,8భా. భా1కి 2-50
27 నవవిధ భక్తులు 2-50
28 శ్రీతత్త్వము 2-00
29 నేనెవరు? 0-70
30 హనుమాన్ చాలీసా 0-06

జగద్గురుబోధలు 1భా. 2-50
,, 2,3భా. భా1కి 2-50
(ప్రతిఆదివారం 'ఆంధ్రప్రభ'లో ప్రచురించు శ్రీ కంచి కామకోటి పీఠాధిపతుల ఉపన్యాసములు)

☞ 20% కమీషను ఇవ్వబడును. రు. 20/-లకు లోపు కమీషనులేదు.
ముందుగా సగముడబ్బు అడ్వాన్సు పంపవలెను.

## సాధన గ్రంథ మండలి, తెనాలి.

# శంకర గ్రంథ రత్నావళి

శ్రీ భగవత్పూజ్యపాదులు శ్రీ శంకరాచార్యులవారి వాఙ్మయము అద్వైత జ్ఞానరత్న శకలములు. మేము మా మండలిలో శ్రీవారి రచనలు మూలము, భాష్యము - ఆంధ్రానువాదముతో 26 సంపుటములుగా ప్రకటించుచుంటిమి.

| | | |
|---|---|---|
| మహారాజపోషకులు | (శాశ్వతము) | రు. 250 |
| రాజపోషకులు | ,, | రు. 125 |
| పోషకులు | (ప్రతి సంవత్సరము) | రు. 25 |

పై మూడు తరగతులవారికి శంకరగ్రంథరత్నావళి సంపుటము లన్నియు నుచితముగా నీయబడును. మహారాజపోషకులకు గ్రంథమండలి ప్రచురణ లన్నియుకూడ నుచితముగా నీయబడును. మా యీ కృషికి సంపన్న గృహస్థులు, అద్వైతాభిమానులు సహకరించి శంకర వాఙ్మయ ప్రచారమునకు సహకరింప గోరుచున్నాము.

## ప్రథమ సంపుటము రు 4-00

(ఉపదేశప్రకరణ గ్రంథములు - నలుబది)

అనువాదకులు: శ్రీ నిర్వికల్పానందస్వామి.

## ద్వితీయ సంపుటము రు 4-00

అనువాదకులు: 'శతావధాని' శ్రీ వేలూరి శివరామశాస్త్రి.

ఇందు: ౧ ఆత్మజ్ఞానోపదేశవిధి, ౨ మాయావివరణము, 3 ఉపదేశ సహస్రి, (గద్యప్రబంధము), ౪ పఞ్చీకరణము, పంచీకరణవార్తికము(సురేశ్వరులు)

తృతీయ సంపుటము త్వరలో వెలువడును.

## ఈశావాస్యోపనిషత్ రు 3-75

మంత్రము, ఆచార్యులవారి భాష్యము - ఆంధ్రానువాదము.

అనువాదకులు: శ్రీ నృసింహానందభారతీస్వామి.

## కనకదుర్గానందలహరి (మూలము) రు 0-25

శ్రీ శంకరులు కనకదుర్గను గూర్చి స్తుతించిన 100 శ్లోకము లిందు గలవు.